

# బలిజేపల్లి లక్ష్మీకాంత కవి

## ధార్మిక కృతులు - సమగ్ర పరిశీలన

సర్వహక్కులు : **రచయితవి**

ప్రథమ ముద్రణ : 12-4-2000 విక్రమనామసంవత్సరము-
చైత్ర శుద్ధ నవమి- శ్రీరామనవమి సందర్భము.

ప్రతులు : 1000

★ ధర : రూ 171-91 పై

ప్రతులకు : డా॥ మల్లెల గురవయ్య ,M.A.,Ph.D.,
ఫ్లాట్ నెం: 24, ఇంటినెంబర్ 1/101,
టీచర్స్ కాలని, సక్కుబాయి నిలయం,
శ్రీరామచంద్రగురుప్రసాదము
శ్రీరామచంద్రజీ వీధి, పప్పిరెడ్డిపల్లె,
మదనపల్లె - 517 325.చిత్తూరుజిల్లా.

శ్రీమతి ఏ. రజని, బి.ఎ., బి. యిడి.,
W/o డా॥ మల్లెల శ్రీహరి,M.A., M.Phil., Ph.D.,B.Ed.,
19-661, నెలమపాళెం,
వెంకటగిరి, నెల్లూరు జిల్లా - 524132

రచయిత : డా॥మల్లెల శ్రీహరి M.A., M.Phil., Ph.D.,B.Ed.,
కో ఆర్డినేటర్, ధర్మ ప్రచార పరిషత్,
తిరుమల తిరుపతి దేవస్థానములు, కడప-516 001

★ ఇదె నడుమ నొకటి విడివడ-నదియె వదినెదివికిచనిన యట్టిదినము, మా
యెదలు,పొగిలిరగిలిసెగల-సొదపేర్చెను; కాలధర్మసూచియగు ధరన్

**తిరుమల తిరుపతి దేవస్థానములవారి ద్రవ్య సహాయముతో
ఈ గ్రంథము ముద్రింపబడినది.**

ముద్రణ : *S.R.Graphics,*
CTM.Road,
Madanapalle - 517 325
✆ : 08571 - 65116

# అంకితము



అన్న : డా॥ మల్లేల గురవయ్య వదినె : కీ.శే. శ్రీమతి మల్లేల సక్కుబాయి

నన్ను గన్నవారు గున్నయ్య వెంకమ్మ
పెద్దజేసి విద్దె బుద్ధి నేర్పి
ప్రగతి పథముఁజూపు ప్రత్యక్షదైవము
లన్న వదినె, వారి కంకితమ్ము ॥

సదా పాదాభి వందనములతో

మల్లేల శ్రీహరి



# కృతజ్ఞతలు

బలిజేపల్లి లక్ష్మీకాంతకవి ధార్మికకృతులు-సమగ్రపరిశీలన అను ఈ గ్రంధమును ముద్రించుటకు ఆర్థిక సహకారమందించిన తిరుమల తిరుపతి దేవస్థానముల యాజమాన్యమునకు ప్రప్రథమముగా నా ప్రణామములు. ప్రస్తుత గ్రంథమును సాకల్యము పరిశీలించి, ముద్రణ భాధ్యత వహించిన మా అన్న డాక్టర్ మల్లేల గురవయ్యగారికి నా హృదయపూర్వక నమస్సుమాంజలులు. ఏతద్గ్రంథరచనకు నన్ను ఎంతో ప్రేరేపించి ఎన్నో సూచనలిచ్చుటయేగాక ముద్రణ సందర్భమున తమ అమూల్యమైన అభిప్రాయమును దివ్యానురక్తి దేశభక్తి అను పేర ప్రసాదించిన శ్రీ ఏలూరి ప్రసాదరావు ( రిటైర్డ్ డి.ఐ.జి గుంటూరు) గారికి భక్తిపూర్వక దివ్యానురక్తితో సమన్సహస్రసుమములు సమర్పించుచున్నాను. అడిగినదే తడవుగ నాయెడగల ప్రేముడితో ముందు మాటను అందజేసిన డాక్టర్ తంగిరాల వేంకటసుబ్బారావు ( ప్రాచార్యులు, బెంగుళూరు విశ్వవిద్యాలయం మాజీ తెలుగు శాఖాధ్యక్షులు) గారికి కృతజ్ఞతా పూర్వక ప్రణామాంజలులు. నన్ను పి.హెచ్.డి చేయవలసినదని అందుకు ఉద్యోగం ఆటంకము కాదని హెచ్చరించి ఎంతో తోడ్పడిన మాజీ తిరుమల తిరుపతి దేవస్థానముల కార్యదర్శి శ్రీ సముద్రాల లక్ష్మణయ్య నాయుడుగారికి హృదయపూర్వక నమస్సుమాంజలులు. ఇక ఈ గ్రంథ రచనలో ఎందరో పరోక్షముగా సహకరించిన సహృదయుల కందరికు నా ప్రణామములు మరియు సకాలములో ముద్రించి అందజేసిన శ్రీ బి. రవీంద్రబాబు రెడ్డి, ఎస్.ఆర్. గ్రాఫిక్స్ అధినేతకు నా కృతజ్ఞతాంజలులు.

డా॥మల్లేల శ్రీహరి



## దివ్యామరశక్తి - దేశభక్తి

## ఏలూరి ప్రసాదరావు.

ఉపాధ్యక్షులు

**ఆంధ్రప్రదేశ్ హేతువాద సంఘము.**

శ్రీ బలిజేపల్లి ధార్మిక కృతులు-సమగ్ర పరిశీలన వ్యాసకర్త శ్రీ మల్లేల శ్రీహరి, ఎమ్.ఏ., ఎమ్‌ఫిల్., బి.యిడి., పి.హెచ్‌డి., వ్యాసకర్త నా శిష్యుడు,. విద్యార్థి దశనుండి అతి సన్నిహితముగా నాతో మెలిగినవాడు. ఇతను ఎంతో ఎదిగినా ఎన్ని విద్యార్హతలు పొందినా, నాకు ఇంకను కుర్రవాడుగా కనిపిస్తాడు. అందుకే కేవల వస్తు విష్ణముగా ఈ కావ్యమును కావ్యవస్తువును నా కొంత దృక్కోణము నుంచి పరిశీలించి ఈ సిద్ధాంత వ్యాస కృషిని సమీక్షించితిని. చిన్న వాడు కవితలు, కావ్య విమర్శలు, గోష్ఠులు, ఉపన్యాసములు, శ్రద్ధాసక్తులతో విని ఉద్విగ్న స్థితిని పొంది తన్నుతాను మరచిపోయెడివాడు. ఇతడు చిన్ననాట ఉద్రేకపరుడు. కట్టలు త్రెంచుకొని వచ్చిన ఆవేశము ఆలోచన తోడి విద్యార్థులకు నూరిపోసేవాడు. విద్యార్థులకు విద్యా సంస్థకు పెద్దలు చేయుచున్న కీడును విమర్శించడం దివ్యజ్ఞానకళాశాల సమావేశములలో నేను విన్నాను. ఇతని డైరీలు, నోట్సులు వరిశీలించాను. చ్యాంకషేక్, హోచ్‌మన్, ముత్సు హిటో వంటి మహానాయకుల గురించి ఇతను వ్రాసుకున్న నోట్సు చదివాను. కళలు, కవితలు, భావ విప్లవము, రాజకీయ విప్లవము అన్ని కలగలిసిన ఇతని ప్రవృత్తి పెరిగి రాణింపవలయునని నేను ఆశించితిని. ఒక లెక్చరరుగా పైకి రావలయునని కోరితిని. కొంత యత్నం కూడా చేసితిని. శ్రీ నంజుండప్ప, రఘునాథరెడ్డి, కోదండపాణి మహోదయులు సహాయపడగలరని నమ్మితిని. కాని మధ్యలో ఉద్యోగ నియామక వ్యవస్థ హీనదశకు చేరినది. వేరు దారిలేక టి.టి.డి. ధర్మప్రచార కార్యదర్శి, శ్రీ సముద్రాల లక్ష్మయ్యగారు శ్రీహరి ప్రతిభ గుర్తించి జీవిత నిర్దేశ్యము చేసినారు. ధర్మ ప్రచారమును తాను ఏమియు చేయలేనను శంకతో ఒక గుమాస్తా ఉద్యోగము కొరకు ఇతడు యత్నించుచుండగా నేను వద్దని వారించితిని. అభ్యుదయము, ప్రగతి భావవిప్లవము భవిష్య భారతమును గురించి ధర్మ ప్రచారకులు చేయవలసినది చాలా ఉన్నదని చెప్పి ఒప్పించితిని. ధర్మ ప్రచార పరిషత్తు ఇందుకు అనువైనదని నిర్దేశించితిని. వేదము-ప్రకృతి వాదము, వేదము-విశ్వ ధర్మము, వేదకాలము హేతువాదము, పురాణయుగము-లౌకిక దర్శనములు, ఆలయ నిర్మాణ నిర్వహణ వ్యవస్థ వీటిలో రావలసిన బహుజన శ్రేయమును గురించిన ధ్యాస శ్రీహరికి ఎరుకచేసితిని. రక్తి, భక్తి, ముక్తి మాత్రమేకాదు, తాళ్లపాక కవులు చేసిన తిరుపతి సేవతో భావి భారత ప్రగతికి మార్గదర్శకమగు 300 కృతులు కలవు అని చెప్పితిని. ప్రజా బాణిని సమకాలీనస్థితికి ధర్మమునకు అన్వయించి అన్నమయ్యపాడిన అభ్యుదయ కవితలు ఆంధ్ర సరస్వతికి బీజప్రాయములు అని తెలిపితిని. ధర్మ ప్రచారమునందు అభ్యుదయము పాడి వినిపించగల శక్తిని అలవర్చుకొమ్మని బోధించితిని. నాకు అంతయు అర్థమైనది స్మృతికి వచ్చినది, పెద్దల నిర్దేశ్యమునకు అనుగుణముగా ఉద్యోగధర్మమును నిర్వర్తించగలనని ప్రమాణము చేసినాడు. ధర్మ విజయమునకు చెందిన కవితా వస్తువును చూపుమని కోరినాడు. ధర్మ నిరతి,

దేశభక్తి నాడును నేడును కవితకు ఆదర్శములని బోధచేసితిని. జ్ఞానమే జీవితమునకు ఆదర్శము. విజ్ఞానము దేశకాలాదులకు భాషా భేదములకు అతీతమైనది. అందుకే ఇతడు నిత్య సత్యాన్వేషిగా మారినాడు. ఇందుకు నేను నిమిత్త మాత్రుడను. జీవితం తనకు ప్రసాదించిన అనేక కష్టములను అదృష్టముగా భావించి పురోగమించినాడు. లెక్కకు మిక్కిలిగా కష్టములు వెన్నంటినను లెక్కచేయక ధర్మ రక్షణకు ప్రతిష్ఠకు రాజ్యమును భార్యాబిడ్డలను త్యాగం చేసిన సత్యహరిశ్చంద్రుని స్ఫూర్తిని పొందినాడు. హరిశ్చంద్ర నాటక వృత్తాంత విశేషములను చెప్పుమని కోరినాడు. హోరున వర్షం పడుచుండ ఒక సాయంకాలము మదనపల్లి హెడ్‌పోస్టాఫీసు వరండాలో కూర్చొని నేను చెప్పినంత వేగముగా శ్రీహరి, హరిశ్చంద్ర వృత్తాంతముల్లేఖించినాడు. బలిజేపల్లి కాలము విశిష్టమైనది. అప్పుడు జాతీయోద్యమము అనేక సాహిత్య వారములు ద్రావిడ వారము, కులాచార నిరసనము, స్త్రీ విద్య గాంధేయవాదము భావకవిత్వోద్యమము నడుచుచుండినవి. ప్రజారంగ స్థలము (**People's Theatre**) నెలకొని ఉన్నది. కవితలలో భావ కవిత్వము జనులను ఆకట్టుకొన్నది. స్వేచ్ఛా ప్రేమ కవులకు గొప్ప ఆదర్శముగా మారినది. క్షీణత ప్రవేశించినది. బలిజేపల్లి సర్వకళాకోవిదుడు. ప్రబంధస్ఫూర్తి సమతా ధర్మము, సత్యనిష్ఠ, వేదాంత దృష్టి, దయానందుని హేతుదృష్టిఅలవర్చుకొన్నవారు. ద్విజాతి సిద్ధాంతము నిరసించినవాడు. బ్రిటీష్ ప్రభుత్వము విధించిన వందల సంఖ్యలో ఉన్న పన్నులు, నిత్య దరిద్రుడు కూడ చెల్లించవలయు సుంకములు, ఫీజులు కూడ నిరసించినాడు. స్వధర్మమును మరచి పర ధర్మమును అలవర్చుకొని పూర్తి బానిస బుద్ధితో విజాతీయ సంస్కృతిని చట్టములను స్వీకరించి ప్రవర్తిల్లుచున్న భారతీయులను విమర్శించినారు. తన ఖండ కృతులలో దేశభక్తి, కవితలలో హరిశ్చంద్ర నాటకములో సెటైర్ రూపములో వ్యంగ్యముగా విమర్శించినాడు. నేర నిర్ణయము పొరపాటు పడి నిరపరాధులను శిక్షించు న్యాయస్థానములను కటువుగా విమర్శించినాడు. చెట్టుక్రింద ప్లీడర్లను సివిల్, క్రిమినల్ పిటీషన్లు, దస్తావేజులు వ్రాయు లేఖరులను గేలిచేసినాడు. వీటి అన్నింటికి హరిశ్చంద్ర నాటకము చక్కగా ఉపయుక్తపడినది. ఈ దురాచారములను ఎలిగోరిగా ధ్వనింపచేసినాడు. వరదాన్యమున దారికానని మేధావులను అధిక్షేపించి మార్గనిర్దేశము చేసినాడు. పురాణములను త్రిమూర్తులను కాదని ప్రకృతివాదమును వేదమును ఊతగాకొని హేతుబుద్ధితో విచారించి నిజపరిశీలనతో సత్యము తెలిసికొని ప్రాచీన తంత్ర శాస్త్రములను యోగ శాస్త్రములను సహితము చించి గంగలో ముంచిన దయానందుని ధార్మిక వాదము ఆదర్శముగా చేసుకొన్నాడు.

బలిజేపల్లి కాలమున భావకవితలు వెర్రితలలు వేసినవి. శృంగారమును కామాతురమును నవకవులు గొప్పగా కీర్తించిరి. కాశీదాడు నుండి కృష్ణశాస్త్రి వరకు ప్రణయ కవితలు భూమిని స్వర్గము చేసినవి. కాని ఆధునికుడు ప్రేమ కవితలను భ్రష్టు పట్టించినారు. స్త్రీ దేహరేఖలే స్వర్ణ సౌందర్యముగా భోగినీ విలాసములే దివ్య ప్రబంధములుగా ప్రణయకవులు, నవ కవులు కీర్తించి పొరపడ్డారు. సానిని చంకనెత్తుకొని ఇదియే నా కవితకు ఆదర్శమని ఒకరు చాటుకొన్నారు. ప్రేమకు, కామమునకు భేదమే నశించిపోయినది. ప్రేయసి సమాగమము, వియోగము, విరహదుఃఖము ఇవియే కావ్య వస్తువులుగా మారినవి. ఈ దుస్థితి నుండి సాహిత్యమునకు ఒక మంచి దారి చూపిన సాహసవరులలో బలిజేపల్లి లక్ష్మీకాంతకవి కృతార్థులైనారు. వియోగవృత్తమున కంటె విరక్తి దివ్యానురక్తి గొప్ప ఆదర్శములని నిరూపించినారు. వ్యభిచార స్థాయికి దిగజారిన ప్రేమను ప్రేమికులను కీర్తించుటకంటె, సీత, మహాశ్వేత, దమయంతి, చంద్రమంతి వంటి సాధ్వీమణులను గుర్తుచేసి కవులకు గొప్ప ఆదర్శము నేర్పినారు. మాతంగ కన్యను కాదంబరిని ఆదర్శ స్త్రీలుగా చూపినారు. ఈ ఆదర్శములు రసదృష్టిలో కరుణ త్యాగము సత్యనిష్ఠను భాసింపచేసినవి. ధర్మవిజయమునకు సోపానములైనవి. సంసారోద్యమమునకు ఊతగా శ్రీ వీరేశలింగము పంతులుగారు

ప్రబంధసాహిత్యమును చక్కగా సులుచుకున్నారు. వీరుచేసిన యిట్టి మహాకృతులలో హరిశ్చంద్ర నాటకము ఒకటి. కానీ ఇది ప్రజాదరణ పొందలేదు. ధర్మవిజయమునకు సత్యప్రతిష్ఠకు బలిజేపల్లి లక్ష్మీకాంతకవి హరిశ్చంద్ర నాటకమును సర్వాంగ సుందరముగా వించినాడు. తన కాలమున చిత్రశిల్పకళలయందు శృంగారమునే ప్రధాన వస్తువుగా రవివర్మ, దామెర్ల రామారావుగైకొనినారు. వరూధిని ఊర్వశి మత్స్యగంధి కాముక స్త్రీల చిత్రములను దేశమునలుమూలల చిత్రశాలలయందు రాశీభూత,మొనర్చినారు. కాని బలిజేపల్లి చంద్రమతి పాత్రను విశిష్ట చిత్రకాంతగా మార్చినారు. చిత్రకళకు, నాటకమునకు, సినిమాకుకూడా వినూత్నమగు పాత్రలను తన కావ్యములందు సృజించినారు. రాజ్యత్యాగముచేసి కిరీటమును సింహాసనమును, విశ్వామిత్రునకు అర్పించుచున్న హరిశ్చంద్రుని స్మృతిని చిత్రకళలో ప్రవేశపెట్టినారు. సినిమాలలో చొప్పించినారు. బుద్ధుని మహాకవి నిర్వాణము వంటి గొప్ప శిల్ప వస్తువగు చంద్రమతి నియోగమును శిల్పించినారు. దమయంతి నలచక్రవర్తి పడిన కష్టములు కూడ హరిశ్చంద్రుడు పడిన ఇడుములకు వేదనకు తక్కువ స్థాయివే. అందుకే ఈ కావ్యము లోకోపకారముతోపాటు కవులకు విమర్శకులకు గొప్ప ఆదర్శ వస్తువుగా మారినది. బుద్ధిమతి విలాస కావ్యము, నీతి ధర్మము తర్కము, వివేకములకు పట్టాభిషేకము చేయును. జ్ఞానము భక్తి వలన బుద్ధి వివేకమువలన రాణింపగలవని వీరి సందేశము నిరస్త నీరదంబై క్షీణదశనొందిన ఆంధ్ర సరస్వతి ప్రాంగణమున తన నూతన కృతులతో ఒక నందనవనమునే బలిజేపల్లి నిర్మించినారు. దివ్యానురక్తి, దేశభక్తి వీటిని కవితకు వస్తువుగా మార్గదర్శకముగా చేసినారు. త్యాగము, ధర్మము, సత్య ప్రతిష్ఠ ఉత్తమ కవితా వస్తువులుగా నిర్దేశించినారు. క్షీణించిన తెలుగుతనమునుద్ధరించి ఇదియే మార్గమని భావకవులకు నవకవులకు హితసూచన చేసినారు. సత్య ప్రతిష్ఠ వొనర్చు నీచ కృత్యములు సహితము సగౌరవములే అగునని కావ్యనాయికి చంద్రమతిచే పలికించినాడు. ఇది ఈ కావ్యమునకు కేంద్ర సందేశము. ధర్మ విజయమునకై ఒనర్చు బీభత్సము సైతము యోగ్యమైనదే అని ఉత్తర రామాయాణమున కవి ఉద్ఘోషించినాడు. భార్య బిడ్డలను అమ్ముకొనుట నీచ కృత్యమని సంస్కార వాదులు ఘోషించగా 1930 ప్రాంతమున బ్రిటీష్ ప్రభుత్వము ఇట్టి విక్రయములను నిషేధించినది. నరబలిని స్త్రీ శిరచ్ఛేదమును కూడ అమానుష కృత్యములని నాటి ఉద్యమ నాయకులు గొంతెత్తి చాటిరి. ధర్మదండనగా కూడ శిరచ్ఛేదము అన్యాయమని, అమానుషమని హేతువాదులు సత్యాన్వేషులు ఘోషించిరి. బ్రిటీష్ ప్రభుత్వము వీటిని కూడ నిషేధించి శాసనము చేసినది. సరిగ్గా ఈమూడు శంకలకు మూలము హరిశ్చంద్రగాధ. అందుకే బలిజేపల్లి వీనిని కవితావస్తువుగా చేసుకొని కరుణ రసము చేసి ధర్మవిజయము సత్యప్రతిష్ఠలకు తెలుగు నాటక రంగమును ఒకవేదికగా తీర్చినాడు. రంగస్థలము భవ్యతనొందినది. మెట్టులనుకూడ పూజించు సదాచారము నెలకొన్నది. నటుడు, కళాకారుడు, చిత్రశిల్పి, కవి, నాటక సినీ రచయిత, ఇన్ని ఉన్నను నిత్య దరిద్రుడు, అష్టకష్టములు తరుముచున్నను తొట్రుపడక ధర్మమార్గము వీడక తన గురువైన దయానందుని సత్యార్థ ప్రకాశము ఊపిరిగా చేసుకున్నాడు. చంద్రమతి శిరచ్ఛేద ఘట్టమున హరిశ్చంద్రుని వారించుటకు ఇంద్రుడు, యమధర్మరాజు, పార్వతీ పరమేశ్వరులు ప్రత్యక్షమైనారు. చూడుమని ఆకాశవాణి వినిపింపగా వారెవరో నాకు తెలియదు మహాత్మ, సత్యప్రతిష్ఠకై సత్యహరిశ్చంద్రు వంశము అంతరించుగాక అని చెప్పిన వాక్యము బలిజేపల్లి దివ్యానురక్తికి నిదర్శనము. అదిదైవ సంబంధికాదు, సత్య సంబంధి అని సూచించినది.

కార్యక్షేత్రము కాలము కథాగమనము ఈ మూడింటియందును హరిశ్చంద్రుని గాథ ఎన్నో మార్పులు పొందినది. ఇందుకు కారణము కొంత పరిశీలించెదము. మ్యాక్సుముల్లర్ మ్యూయర్ అను పండితులు సంస్కృతము నుండి అనువాదము చేసిన మార్కండేయ పురాణమును, హరివంశము భాగవత పురాణములను ఆధారముగా చేసుకొని బి. ఆర్. అంబేద్కర్ హరిశ్చంద్రగాథకు మూలమును

తెలిపినాడు. సత్యవ్రతుడు త్రిశంకుడు, హరిశ్చంద్రుడు ఈముప్పురు వరుసగా తాత, తండ్రి, కుమారుడు, ఈ ముప్పురకు చెందిన గాథలన్నిటిని కలగా పులగము చేసి హరిశ్చంద్రోపాఖ్యానము రచింపబడినది. విశ్వామిత్రునికి హరిశ్చంద్రునికి వైరుధ్య కారణము మాలకన్యల వివాహము కానేకాదు. ఇది నాటకీయతకొరకు తీసుకొన్న విషయము, అసలు కారణము అంబేడ్కర్ వివరణ విశ్వామిత్రుడు వర్ణాశ్రమ ధర్మమును నిరసించి శూద్రులకు స్త్రీలకు యజ్ఞోపవీతములిచ్చి, విద్యార్హత కలిగించి, వారిచే వేద శాస్త్రములు అధ్యయనము చేయించెను. మాతృగణ స్త్రీలకు, మాతంగులకు చతుష్షష్టి కళలు నేర్పించి వారిని దేవకాంతలుగా మార్చెను. దీనిని హరిశ్చంద్రుడు తప్పు పట్టినాడు, రాజుగా వర్ణసాంకర్యమును అరికట్టి వర్ణాశ్రమ ధర్మమను రక్షించుట రాజధర్మముకనుక తాను ఎదిరించినాడు. ఈ ప్రతిజ్ఞ వదులుకొమ్మని విశ్వామిత్రుడు ఋషిగా శాసించినాడు. ఆడిన మాట తప్పనని హరిశ్చంద్రుడు శపథము చేసినాడు. ఈ కథనము ఉపాఖ్యానములందు నాటకములందు మరుగునపడిపోయినది. మాలకన్యల ప్రసక్తి వివాదాస్పదముగా మారినది. సాహిత్య సంస్కరణవాది అగు బి. ఆర్. అంబేడ్కర్ కాదంబరి కావ్యమును హరిశ్చంద్రుని గాథను వివరించినాడు. వైదికకార్య సమాజము దాని పరిణామము తెలుపు పరిశోధన గ్రంథములలో శూద్రుడు ఎవరు? అస్పృశ్యులు ఎవరు అను చిక్కుముడులను విడదీసి ఈ గాథలను వివరించినాడు. ఆపైన శుద్ధ హేతువాది నార్ల వెంకటేశ్వర్లుగారు నరకములో హరిశ్చంద్రుడు అను నాటకమునకు ఉపోద్ఘాతమును వ్రాయుచు, మాతంగ కన్యలను దూషించినందుకు హరిశ్చంద్రుడు తప్పును తెలుసుకొని పశ్చాత్తాప పడినట్లు అవసాన దశలో వారికొరకై తాను పరితపించినట్లు వ్రాసినారు. జయమాతంగ తనయే- లీలా శుకప్రియే కదంబ వనవాసినే అని కాళిదాసు అర్చించిన దేవత కూడ మాతంగకన్య వశిష్ఠుని అర్ధాంగి అరుంధతి కూడ మాతంగ కన్య కృష్ణుని ప్రియురాలు జాంబవతి కూడ మాతంగకన్యే. హరిశ్చంద్ర నాటకమున మాతంగ స్త్రీల ప్రసక్తి దూషితముకాదని నాటక రమ్యతకేకాదు రసరమ్యతకు కూడ ఎంతో అవసరమని నిరూపించగలము. చండాల దాస్యము, వీరబాహుడి కీర్తనము, కాటికాపరి ఉద్యోగము ఈ మూడును ఈ నాటకమునకు అత్యంతమౌలికమైన రసప్రేరకములు. వీరకరుణరసములకు పూరకములు. ధర్మవిజయమునకు, సత్యప్రతిష్ఠకు, రసనిష్పత్తికి అత్యంత ఆవశ్యకములు. దానశీలనమే మానవత్వానికి గీటురాయి. కరుణరసమే రసములన్నింటికిరాజు. ప్రజాశ్రేయమునకై చేయు స్వార్థత్యాగము సత్యప్రతిష్ఠకై చేయు రాజ్యత్యాగము అపూర్వము. గౌతమబుద్ధుడు అశోకుడు, చంద్రగుప్తుడు, ధర్మ రాజ్యస్థాపనకై తమ సర్వస్వము ధారపోసి త్యాగముచేసిరి. శ్రీహర్షుడు ప్రజల కష్టములు బాపుటకై రాజ్యసంపదలెల్లను దానమొనర్చినాడు. పేదరాలైన ప్రియురాలికొరకై విండ్సర్ చక్రవర్తి రాజ పదవినే తృణప్రాయముగా త్యజించినాడు. ఆడినమాటతప్పకుండుటకై సత్యవాక్పాలనకై హరిశ్చంద్రుడు రాజ్య సర్వస్వము త్యాగము చేయుటయేగాక భార్యబిడ్డలను బానిసలుగా అమ్మి మాటనిలబెట్టుకున్నాడు. ఇందు ఒక్కరికంటె ఒక్కరు గొప్పవారు. ఇల్లు జప్తుచేయటకువచ్చిన కోర్టు అమీనా దారి ఖర్చులకు దినవేతనమునకు ఋణగ్రస్తులను పీడించుట తన కాలమందు బలిజేపల్లి న్యాయస్థానములందు చూచినాడు. టి.ఎ.డి.ఎల కొరకు ఎంత నీచమునకైనను సిద్ధమగు ఆఫీసర్లను ఉద్యోగులను కటువుగా నిందించినాడు. నక్షత్రకుని పాత్రద్వారా ఈదురాచారములను ఖండించినాడు. తన్ను తాను అమ్ముకొని ఋషికి మొత్తము అప్పును తీర్చినను తృప్తిపడక తనదారిఖర్చులకై నక్షత్రకుడు హరిశ్చంద్రుని భార్యబిడ్డలను కాశీపురి నడివీధులలో అమ్మించినాడు. పని మనిషిగా బ్రతుకు సాగించుకొన్న చంద్రమతి శిశుహంతకిగా తప్పుడు తీర్పును ఇచ్చిన కాశీరాజును నేరస్థాపనలో చేసిన తప్పులు ఆక్షేపించినాడు. తన కాలమున కోర్టులు, కచేరీలలో జరుగుచున్న మకిలి వ్యవస్థను ఎండకట్టినాడు. మంగళసూత్రం అమ్ముకొని పన్ను కట్టవలసిన దుస్స్థితి స్త్రీకి ఎందుకు కలిగినది. బ్రిటీష్‌వారు చట్టమును సరళముచేసినను మన తహాశీలుదార్లు పట్టిన పట్టువీడరు.

కుమారుడైన లోహిదాసు (లోహితాస్యుడు) శవదహనమునకై కాటిసుంకము చెల్లించుటకు మంగళసూత్రము అమ్ముమని కాటికాపరిచేసిన సూచనలుజనుల గుండెలను పిండివేయును. కాటి చట్టములు మరణసుంకములు మొదలగు విచిత్రమగు పన్నులు పరిహాస భాజనమైనవి. వీటిని అధిక్షేపించుటకు బలిజేపల్లి సాహిత్యసాధనముగ మలచుకొన్నారు. ఒక ధార్మిక కావ్యమేకాదు, ఒకసెటైర్‌అని కూడా శ్రీహరికి నేను గుర్తుచేసితిని. ఈయన రచనలో ఈవిషయము సందర్భశుద్ధిని సంతరించుకొన్నది. బలిజేపల్లి రిజిష్ట్రారు ఆఫీసులో కర్నూల్‌నందు మొదట ఒక లేఖకుడుగా తదుపరి హెడ్‌గుమాస్తాగా పనిచేసిరి. సరిగా అదేకాలమున భార్యబిడ్డలను అమ్ముకొనువారిని ప్రాసిక్యూట్‌చేయమని రిజిష్ట్రారులను ప్రభుత్వము ఆదేశించినది. అట్టి విక్రయ దస్తావేజులు నిరాకరించుడని ఉత్తర్వు ఇవ్వబడినది. సరిగా ఈ నాటకము వ్రాసి ప్రదర్శించుట శాసన ధిక్కారమే కాని సత్య ప్రతిష్ఠకని కవి సమర్థించిరి. సరిగా ఇదే సందర్భమున వారణాసిలో భార్యను అమ్ముచున్నానని ఘోషించుసందర్భమున క్రయధనమునకు ఆస్తిని అమ్ముట అను దస్తావేజుల, భాషను వాడినాడు. దస్తావేజు లేఖవంటి ఇరువురు పాత్రలను కూడ ప్రవేశపెట్టినారు. కాలకౌశికుని పాత్రలో బానిసల విక్రయమును గురించి ధర చెప్పుమని బాసిన ఎవరో? ఆమె హరిశ్చంద్రునికి ఎట్లు కలిగినదో? తెలియచెప్పుమని సిగ్గుమాలిన మాటలు పచించును. తనను నమ్మినవాడెవడు చెడిపోలేదని ఆడితప్పుట పొరపాటుకాదని అప్పు ఎగవేయుట సామాన్యధర్మమని కౌశికుడు హరిశ్చంద్రునికి బోధచేయును. కాశి పట్టణములో లేనిఅప్పులు తలకు చుట్టుటలోను ఉన్న అప్పును లేదని బల్లగుద్ది వాదించుటలోను తనకు మించినవాడు మరియొక్కడు లేడని రియల్ ఎస్టేటు బ్రోకర్లవలె కాలకౌశికుడు సంభాషించినాడు. సామాన్యభాషలో మిగుల రసవత్తకముగా హాస్యజనకముగా బలిజేపల్లి అపూర్వరకముగా ఈ రచన చేసినాడు. నాటిలేఖకుల వాక్‌చాతుర్యము దుబాషీల వ్యవహార దక్షత వారణాశి సీనులో ప్రత్యక్షము చేయబడినది. లేఖకుల భాష ఉన్నది ఉన్నట్లు వ్రాయుట అతి వాస్తవికతగా కనబడును. కానీ ఇది లేకుండా ఈ సీను రాణింపదు.

ఉత్తమ స్త్రీవర్ణనము మహాకవుల కావ్యములన్నింటను కనబడును. బానిస విక్రయమున చంద్రమతి హరిశ్చంద్ర చక్రవర్తి భార్య అని తెల్పుటకు సంకోచించక హరిశ్చంద్రుడు పాడిన ఒక పద్యము ఈ నాటకమునకు మచ్చుతునక. వారణాసి సీను పద్యమును మరల మరల పాడించుకొని ప్రేక్షకులు తరించిపోవుదురు. ఇందుకు బలిజేపల్లి భాషా చాతుర్యము చంద్రమతిని దాసిగాచేయు సందర్భము బలమైన కారణాలు. దేవీ భాగవతము పద్మపురాణములందు చేసిన స్త్రీ వర్ణనములు కూడా దీనికి సాటిరావు. సకల సౌభాగ్యవతి చంద్రమతి వర్ణన ప్రబంధ స్త్రీ వర్ణనము మించినది. నేటి స్త్రీ వాదులు సహితము ఇంతగొప్పగా స్త్రీ లక్షణములను వివరించలేదు.

మరొక సత్యమునిట వివరింపుటయుక్తమనిపించుచున్నది. మూడు శంకలకు చెందిన త్రిశంకు అను నామము భూమికి స్వర్గమునకు మధ్యలో వ్రేలాడు త్రిశంకు స్వర్గము అను భావనకు మూలము. విశ్వామిత్రుడు చేసిన నూతన సమాజవ్యవస్థ వర్ణాశ్రమ ధర్మ వ్యతిరేకముగా సమతాదర్శ ప్రేరకము. దీనిని మన్వాదులు కులాచార ఛాందసులు వ్యతిరేకించిరి. వశిష్ఠాది ఋషులు అధిక్షేపణకొరకు త్రిశంకు స్వర్గము మూడు పాపములకు నిలయముగ ఎద్దేవ చేసిరి. సత్యసిద్ధికై హరిశ్చంద్రుడు ఒనర్చిన మహాత్యాగమును గుర్తించి హరిశ్చంద్రునికి సత్యలోకము నుండి ఆహ్వానము వచ్చినది. కాని తనతోపాటు తన కోసలరాజ్యప్రజలు ఎల్లరును స్వర్లోకమునకు కొనిపోయినకాని తానును పోనని హరిశ్చంద్రుడు భీష్మించినాడు. ఇంద్రుడు కోపగించుకొని భూమికి స్వర్గమునకు మధ్యలో కోసలప్రజలను వ్రేలాడదీసినాడని ఉపాఖ్యానము చెప్పుచున్నది. పురాణయుగమునందు 12 సంవత్సరములు వరుసగా ఒక మహాకాటకము మనదేశమును పీడించినది. ధర్మ వ్యవస్థ నశించినది. ఆహారము కొరకు ప్రజలు అలమటించినారు. రాజులు, ఋషులు సహితము గాడిద

మాంసము, కుక్కమాంసము తినినట్లు పురాణములు పేర్కొనుచున్నవి. వశిష్ఠుని భార్య బిడ్డలు కూడ ఇట్టి మద్య మాంసాదులకు పాల్పడిరి. అందుకు కోపించి తన కోపమెల్లను విశ్వామిత్రునిపై వశిష్ఠమహర్షి చూపించినాడు. మద్యము, మాంసము, మగువ అను మూడు పాపములకు అయోధ్యా రాజ్యమును శపించునట్లు పద్మ పురాణమునందు ఉన్నది. రాజును శపించి త్రిశంకు అని పిలిచినట్లు రాజ్యము భ్రష్టమైనందుకు హరిశ్చంద్రుని నిందించినట్లు పలువిదములుగా ఈగాథ పురాణములందు లిఖింపబడినది. రఘువంశరాజుల కథలను కీర్తించుటకు, హరిశ్చంద్రగాథకు అయోధ్యా నగరము కార్యస్థానమైనది. ఇది సాకేతపురమా, అయోద్యా నగరమా పరిశీలింపవలసియున్నది. ఏది ఏమైనను, వారణాసి, అయోద్య, సాకతపురము ఇవి మనము అనుకున్నంత పవిత్ర నగరములుగా కనిపించవు. బానిస వ్యాపారము స్త్రీ విక్రయము, జూదము, తమ భార్య బిడ్డలు విక్రయము నీచమగు దాసి వృత్తి పనివారలగు స్త్రీలని హింసించుట అమ్ముకొనుట నీచమగు వేశ్యావృత్తి డబ్బుకక్కుర్తి ఋషులయందు సహితము రాజ్యదాహము కాముక వృత్తి మెండుగా ఉన్నట్లు, ఋషులు, విప్రులు క్షుద్ర జీవనము సాగించినట్లు హరిశ్చంద్ర కథ చాటుచున్నది. అందుకే బలిజేపల్లి ఇందలి పాత్రలగు ఋషులను విప్రులను నీచపాత్రులుగా చిత్రించినారు. ఈ పాత్రలద్వారా అమూల్యమగు ధర్మసందేశమును సత్యప్రతిష్ఠను చేయించినాడు. ఋషులను గెలిచేయుట మానవమాత్రులకు సాధ్యము కాదు. కానీవారి నిజ ప్రవృత్తి వారి నోటనే కక్కించి వారిని పరిహాసపాత్రులను చేసినారు. పాత్రౌచిత్యము నాటకమునకు ప్రధానము. బలిజేపల్లి కరుణకథనము పాత్రచిత్రణము రెండునూ నాటకమునకేకాక సినిమాకుకూడా ఆదర్శప్రాయము. శృంగారము హాస్యము, వ్యంగ్యము తన కృతులయందు అన్నిటను రసధునితో నింపినారు. సరసమనోహరమగు భాషలో సర్వస్వతంత్రరీతిలో అటు గ్రాంథికమునకు, ఇటు గ్రామీణ భాషకు లొంగిపోకుండా శిష్టవ్యావహారికము సరళగ్రాంథికము అగు ఉద్ధతమగు భాషలో తన కృతులన్నియు రూపుదిద్దినాడు. సర్వ కావ్య సిద్ధాంతములను తన కృతులలో సమన్వయపరచి రస నిష్పత్తి చేకూర్చినాడు. గద్యమునకు మించి పద్యము, పద్యమును మించి గద్యమును నాటకము చివరవరకు చక్కగా నడిపినారు. హరిశ్చంద్రుడు, నక్షత్రకుడు చేసిన సంభాషణము ఒక్కొక్కమాట ముత్యాలమూట. కరుణరసదీప్తి కొరకు ప్రతి వాక్యము గద్యముతో సహకరించును. ప్రతి పద్యము గద్యముతో సహకరించును. ఒకవైపు ప్రబంధశైలి, ఒకవైపు ప్రజాశైలి రెండింటిని సమన్వయపరచి అన్నింటను తనకుతానే సాటిఅని చాటుకొన్నాడు. సంప్రదాయ గౌరవము ఈ కావ్యమునకు, కవికి మాన్యతను కూర్చినవి. పురవర్ణనము, కవి సమయము వీటియందుకూడా బలిజేపల్లి ప్రజావాణిని కావ్యములందు ప్రదర్శించినారు. వారణాశి పురవర్ణనము, గంగానది తీరవర్ణనము కాశీవిశ్వేశ్వరాలయ వర్ణనము, చారిత్రక కావ్యలక్షణములను సంతరించినవి. కాటి సీనులలో ప్రారంభములో చేసిన చీకటి వర్ణనము విశిష్టరచన, రాబోవు భయంకర సన్నివేశములకు సూచన, శిరచ్ఛేదనమును, స్మశానమును, శవమును రంగస్థలముపై చూపించరాదని లాక్షణికుల సిద్ధాంతము. కాని బలిజేపల్లి ఈమూడింటిని కావలెననియే రంగస్థలమునకు ఎక్కించిరి. రచనలో సాంప్రదాయమును గౌరవించుచు ప్రాచీన లక్షణమును మాత్రము తిరస్కరించిరి. **ఆహో అందకారము అప్పుడే బ్రహ్మాండమంతయు ఆవరించి కన్నులున్నవారిని సహితము గ్రుడ్డివాండ్లచేయుచు** ఈమాటలు మనకాలపు గద్యమునకు మచ్చుతునకలు. రానున్న భయంకర సన్నివేశములకు ముందుసూచనలు. పద్యమునకంటెగద్యమే మహాకావ్యరచనకు దీటైనదని దండి మహాకవి చెప్పినమాట అక్షర సత్యమని బలిజేపల్లి నిరూపించినారు. వేగముగా తరుముకొని వచ్చిన కష్టములను దిగమింగుటకై ఆడినమాట **మందభాగ్యుడైన ఈ హరిశ్చంద్రుడు గతించిన పిమ్మట ఇక కష్టములకు తావెక్కడిది**. ఈ వాక్యముహృదయ విదారకము. ఈ సందర్భము గుండెలను పిండిచేయునది, ఈ సన్నివేశము కావ్యమునకు రససిద్ధిని గూర్చినది. ఒక దానిని మించి మరొకటి గద్యము పద్యము ఈయన

రచనలందు ముత్యాలవర్షము కురిసినట్లు కురిసినవి. హంసతూలికాతల్పములందు ఊయలలూగిన తన భార్యాబిడ్డలకు పట్టెడన్నము పెట్టలేని తన దీన స్థితిని తలంచుకొని దుఃఖించుసెడ హరిశ్చంద్రుడనిన పలుకులు ఎంత కఠిన హృదయమునైనను కరిగించివేయును. వక్రించిన విధిని దుర దృష్టమును నిందింపక వీటిని తన కావ్యమునకు రసదీప్తికి కేంద్ర బిందువులుగామార్చి రాజే కింకరు డౌను కింకరుడే రాజగును అని చెప్పిన పద్యపాదము లక్షలమంది నాలుకలపై జీవించియున్నది. ఈ వాక్యము ఈ కావ్యమునకు సెంట్రల్ ఫిలాసఫీగా భాసించుచున్నది. దురదృష్టమును వేదాంత వాక్యముగా మలుచుకొని బలిజేపల్లి చేసిన ఈరచన భాగవతమున కారేరాజులు అను పోతన పద్య మును అధఃకరించుచున్నది. గద్య రచనలో శ్రీహరికూడా తక్కువవాడు కాడు. తన అగ్రజుడైన మల్లేల గురవయ్యకు ధీటైన అనుంగుసోదరుడు. శిష్టవ్యవహారశైలిలో దివ్య ప్రబంధములను సునా యాసముగా గంగాస్రవంతివలెజాలువారింపగలరు. ఇతని బాలకృష్ణలీలలు ఇందుకు ఉదాహరణము. సంధి రాయబారం చేసిన మహాభారత కృష్ణుడు గోపికలతో విహరించిన భాగవత కృష్ణుడు వేరు వేరు వ్యక్తులని ఈ రెండునూ ఒక్కరికే చెందిన గాథలుకాదని నేను చేసిన సూచనలును గుర్తు నందుంచుకొని చరిత్రకు సాహితికి న్యాయంచేసినారు. కవులు కల్పించిన బాలకృష్ణనిలీలలను మిగులు చతురముగా వర్ణించి శ్రీకృష్ణుడు అస్ఖలితబ్రహ్మచారి అని నిరూపించినారు. ధార్మిక కతుల పై సిద్ధాంత రచన చేయుట మిక్కిలి కష్టతరము. కష్టసాధ్యమగు వస్తువులను ఎన్నుకొని సులభసాధ్య మొనర్చుట శ్రీహరి విశేషము. తత్త్వ వేదాంత విషయములను శుభదాయకముచేయుచు సరళ గ్రాంథిక భాషలలో బహు ప్రశంసనీయముగా శ్రీహరి ఈసిద్ధాంతమును రచించి తన అన్నగారైన మల్లేల గురవయ్యగారికి సరియైన వారసునిగా నిరూపించుకొన్నాడు. పండితులు పరిశోధకులగు ఈ అన్నదమ్ములపై బలిజేపల్లి సాహితీముద్రను బలముగా ముద్రింపగోరి, ఒంగోలు శ్రీరామ నాట్య మండలి వారిచే సత్యహరిశ్చంద్ర పూర్తి నాటకము చేయించితిని. లబ్ధప్రతిష్ఠులైన మేటి నటులు శ్రీ చీమకుర్తి నాగేశ్వరరావు, బందారు విజయకుమార్ వారణాశి కాటి సీనులో నటించినారు. నాటకరంగ నాయకులగు బెంజిమన్ సెక్రటరీ రాజరత్నం గార్లను విశేష కృషిచేసి ఈపండితుల యెదుట ఈ ప్రదర్శన ఇప్పించిరి. కలియుగ హరిశ్చంద్ర బిరుదాంకితులు బందారు రామారావు డి.వి.సుబ్బారావుగార్లు బాణిని నవరస రాగమాలిక అను ప్రత్యేక రాగము పాడి వినిపింపచేసిరి. 5000లమంది ప్రేక్షకులు ఉర్రూతలూగించినట్లు వారణాసి కాటి సీను పద్యములు శ్రీ జాషువా కవి శ్మశాన వాటిక పద్యములు మరలా మరలా పాడి వినిపించారు. వేలమంది ప్రేక్షకుల కళాకారుల యెదుట ఈ అన్నదమ్ములకు శ్రీరామ నాట్యమండలివారు కవి సన్మానం జరిపినారు. ఈ నాటక పరిశోధనను గురించి సన్మానమునకు సమాధానము ఇచ్చిన శ్రీహరి గద్గద స్వరముతో నాడు చెప్పిన మాట రసస్ఫూర్తి, సాహితీముద్ర ధర్మస్పృహ మూడింటిని ఒకేసారి పొందితిని. అశేష ప్రజల ఆశీస్సులు తన గ్రంథమునకు దీప్తినొసంగగలవని తాను స్ఫూర్తిమంతుడనని ప్రకటించిరి. వెయ్యేండ్ల పాటు ఆడిపాడి తరించిపోవుటకు సమర్థమైన ఈ నాటకము తెలుగువారికి ప్రసాదించి నాటక రంగమునుండి నిష్క్రమించి శ్రీబలిజేపల్లి సినిమారంగమునకు తరలిపోయినారు. భారవి మహాకవి చెప్పినట్లు వెయ్యేండ్లకు సరిపోవు ఈ కావ్యరాజము ఆంధ్రులకు మహైశ్వర్యము. రసము రాజసము ఓజస్సు, తేజస్సు ఉట్టిపడురీతిలో మహాకావ్యములను మనకర్పించిన బలిజేపల్లికి ధన్యవాదములు. వీరి కృతులపై ప్రశంసనీయముగా ఈవ్యాసము వ్రాసిన శ్రీహరి ధన్యుడు.

**The body and spirit of Balijepalli were brilliantly brought forth in this beautiful brochure of his poetic works.**

సత్యమేవజయతే



**ఆచార్య తంగిరాల వెంకటసుబ్బారావు**, ఎం.ఏ., పి.హెచ్.డి.,
తెలుగు ఎమిరిటస్ ప్రొఫెసర్ ( యు. జి. సి)
బెంగుళూరు విశ్వవిద్యాలయము
జ్ఞానభారతి, బెంగుళూరు - 560056.

## బలిజేపల్లిసాహిత్యరంగవల్లి

తెలుగునాటకరంగ చరిత్రలో వేలాది ప్రదర్శనలు పొంది, మిక్కిలి జనప్రియములై, ప్రజల నాలుకలపై నాట్యంచేసిన నాలుగు ప్రసిద్ధ నాటకాలలో కవితాకళానిధి, పుంభావసరస్వతి బిరుదాంకితులైన బలిజేపల్లి లక్ష్మీకాంతంగారి సత్యహరిశ్చంద్రీయమొకటి. చిలకమర్తివారి వయోపాఖ్యానము, తాళ్ళూరివారి చింతామణి, తిరుపతి వెంకటకవుల పాండవోద్యోగ విజయములు తక్కిన మూడు నాటకములు. బలిజేపల్లివారు కేవలం నాటక రచయితమాత్రమేకాదు గొప్పనటుడు, కవి, నవలా కారుడు, చలనచిత్రరచయిత, స్వాతంత్రసమరయోధుడుకూడ. ఈ మహాకవి శివానందలహరి శతకము ( శంకరుని కృతికి ఆంధ్రీకరణము) స్వరాజ్య సమస్య ( పద్యకృతి) బ్రహ్మరథము- మణిమంజూష అను నవలలు, బుద్ధిమతీవిలాసము- సత్యహరిశ్చంద్రీయము, ఉత్తరరాఘవము ( భవభూతి ఉత్తరరామ చరిత్ర నాటకమునకు అనువాదము) సాత్రాజితీయము- అను నాటకమును రచించెను. జీవిత చరమదశలో శ్రీకాళహస్తిలో నివసిస్తు రామాయణము- సుందరకాండను రచించెను. అయితే ఇది అసంపూర్ణము. బలిజేపల్లివారు గుంటూరు జిల్లా బాపట్ల తాలుకా ఇటికంపాడులో 23-12-1881న జన్మించినారు. చిత్తూరుజిల్లా శ్రీకాళహస్తిలో 30-6-1953న మరణించినారు. ఈ బలిజేపల్లివారి ధార్మికకృతులపై నా ప్రియమిత్రుడు డా॥మల్లేల గురవరయ్య తమ్ముడైన డా॥శ్రీహరి గొప్ప పరిశోధన చేసి శ్రీ వేంకటేశ్వర విశ్వ విద్యాలయము నుండి డ్కాక్టరేటు పట్టాను పొందాడు. ఆ సిద్ధాంత వ్యాసమిప్పుడు ముద్రణ భాగ్యాన్ని పొందడం సాహిత్య రసికులకు మిక్కిలి సంతోషదాయకం.

బలిజేపల్లివారి ధార్మికకృతులు అనే ఈఉత్తమ పరిశోధనలో విషయసేకరణము ( కలెక్షన్ ఆఫ్ మెటీరియల్), విషయ వర్గీకరణము ( క్లాసిఫికేషన్ ఆఫ్ మెటీరియల్), సమన్వయము ( ఇంటర్‌ప్రిటేషన్), సిద్ధాంతీకరణము ( థియరీ) - అనే నాలుగు అంశాలు చక్కగా పాటింపబడ్డాయి. మొదటి అధ్యాయం బలిజేపల్లి లక్ష్మీకాంతం గారి జీవిత చరిత్రకు సంబంధించినది. ఇందులో గుంటూరు జిల్లాలో పుట్టి చిత్తూరుజిల్లాలో పరమపదించేవరకూగల వారిజీవితమంతా సమీక్షించబడినది. ఈకవి తల్లితండ్రులు ఆదిలక్ష్మమ్మ, నరసింహశాస్త్రి ఈయన విద్యాభ్యాసం మొట్టమొదట మేనమామ భాగవతుల చెన్నకృష్ణయ్య దగ్గర ప్రారంభమయ్యింది. ఈయన మేనత్త సరస్వతమ్మ ఈయన చేత భారత, భాగవత, రామాయణాలు చక్కగా చదివించింది. చిన్నతనంలోనే సంస్కృతాంధ్రాలలో గొప్ప పాండిత్యాన్ని కవితాశక్తిని సంపాదించారు బలిజేపల్లివారు. కర్నూలులో మెట్రికులేషన్ పరీక్షలో ఉత్తీర్ణులయ్యారు. మొదట కర్నూలులో సబ్‌రిజిష్ట్రార్ ఆఫీసులో హెడ్ గుమాస్తాగాను, తరువాత గుంటూరు హిందూకళాశాలలో ప్రధానాంధ్రోపాధ్యాయుడుగా ఉద్యోగం చేశారు. అవధానాలు చేస్తూ తెలుగుదేశంలోని సంస్థానాలను దర్శించారు. చెల్లపల్లి రాజావారి సహాయంతో 1922 లో గుంటూరులో చంద్రికా ముద్రణాలయాన్ని స్థాపించారు. గాంధీమహాత్ముని ఉప్పుసత్యాగ్రహంలో పాల్గొని రెండేళ్ళు కారాగార వాసంచేశారు. అప్పుడే సత్యహరిశ్చంద్రీయము నాటకాన్ని వ్రాశారు. జెయిలునుండి విడుదలైన పిదప మిత్రుల సహాయంతో 1926లో గుంటూరు లో ఫస్టుకంపెనీ అనే నాటక సమాజాన్ని

స్థాపించి సత్యహరిశ్చంద్రీయం, ఉత్తరరాఘవనాటకాల్ని అనేక పర్యాయాలు ప్రదర్శించారు. అందులో ఈకవి వేషాలు వేసి పేరు ప్రఖ్యాతులు గడించారు. 1930లో రంగూన్‌వెళ్ళి అక్కడ కూడ హరిశ్చంద్ర నాటకాన్ని ప్రదర్శించారు. కవి పండితులు ఈయనకుకవితా కళానిధి అనే బిరుదునిచ్చి సత్కరించారు. తరువాత కొంతకాలానికి చిత్తజెల్లు పుల్లయ్యగారి ఆహ్వానంపై మద్రాసు లోని చలనచిత్రరంగములో ప్రవేశించి, అనేక చిత్రాలకు కథలు, సంభాషణలు, పాటలు రచించి, వాటిలో పాత్రలు ధరించి కీర్తి గడించారు. 1942లో చలనచిత్రరంగంవారు బలిజేపల్లివారిని ఘనంగా సన్మానించి పుంభావ సరస్వతి అనే బిరుదునిచ్చారు. శేషజీవితాన్ని శ్రీకాళహస్తిలో గడిపారు.

డా॥మల్లేల శ్రీహరి సిద్ధాంత వ్యాసములో రెండవ అధ్యాయం బలిజేపల్లి రచనల వర్గీకరణకు సంబంధించినది. అనువాదాలు-నవలలు-నాటకాలు-లఘుకృతులు-వివిధ పీఠికలు-స్వాతంత్ర్యోద్యమ రచనలు-స్మృతి నీరాజనములు-చలనచిత్రగేయాలు ఇత్యాదిగా బలిజేపల్లివారి వివిధ రచనలను డా॥శ్రీహరి వర్గీకరించడం చాలా సమంజసంగా ఉంది. సిద్ధాంత వ్యాసరచనలోని బిగువు అంతా ఈ వర్గీకరణంపైనే ఆధారపడి ఉంటుంది. ఈపనిని శ్రీహరి సమర్థవంతంగా నిర్వహించాడు.

ఈ గ్రంథములోని మూడవ అధ్యాయం బలిజేపల్లివారి అనూదిత రచనలకు సంబంధించినది. శ్రీశంకర భగవత్పాదుల శివానందలహరిని బలిజేపల్లివారు ఒక శతకంగా అనువదించారు. ఏకోరసఃకరుణఏవ అని సిద్ధాంతీకరించిన భవభూతి ఉత్తమ నాటకమైన ఉత్తరరామచరిత్రను బలిజేపల్లివారు తెలుగులోకి అనువదించారు. చరమదశలో శ్రీకాళహస్తిలో ఉన్నపుడు వాల్మీకి రామాయణములోని సుందరకాండను అనువదించడం మొదలుపెట్టారు. కాని అది అసంపూర్ణంగానే మిగిలిపోయింది. ఈ మూడు కృతులను గురించి ఈ అధ్యాయములో శ్రీహరి మూలముతో పోల్చి చక్కగా విశ్లేషణ జరిపాడు.

నాలుగవ అధ్యాయములో బలిజేపల్లివారి స్వతంత్ర నాటకాలను విమర్శించారు శ్రీహరి. బుద్ధిమతీవిలాసము(చిరుకొండనని కథ),సాత్రాజితీయము, సత్యహరిశ్చంద్రీయము ఈఅధ్యాయములో అనుశీలింపబడ్డాయి. అయిదవ అధ్యాయంలో బలిజేపల్లివారి లఘుకృతులు-వివిధ పీఠికలు - స్వరాజ్యసమస్య-పాంచాలపరాభవము మొదలైన చిన్నచిన్న రచనలుసమీక్షింపబడ్డాయి. ఆరవ అధ్యాయం బలిజేపల్లివారి చలనచిత్రగేయాలకు,ఆంధ్రరత్న వంటి స్మృతిగీతాలకు ప్రత్యేకింప బడినది.

520 పుటల ఈ సిద్ధాంత వ్యాసములో బలిజేపల్లివారి జీవిత విశేషాలు 30 పుటలలో చెప్పాడు శ్రీహరి. ఇంతకన్నా ఎక్కువ సమాచారం లభించడానికి అవకాశాలు లేవు. అనువాద రచనలలో శివానందలహరిని గురించి చాలా సమగ్ర పరిశోధన చేశాడు శ్రీహరి. 120 పుటలలో మూలముతో తులనాత్మక పరిశీలనం చేశాడు. భక్తుడు వేదాంతానురక్తుడు అయిన వ్యక్తికాని ఇటువంటి పరిశోధన చేయలేడు. శ్రీహరికి తన అన్నలాగే ఈ రెండు గుణాలు పుష్కలంగా ఉన్నాయి. బలిజేపల్లివారి పీఠికలలో ఉత్తరరాఘవ నాటక పీఠిక చాలా పెద్దది. చేబ్రోలు సరస్వతీదేవి రామాయణానికి ఒకే ఒక పద్యములో తన అభిప్రాయాన్ని వ్రాశారు బలిజేపల్లివారు. ఆంధ్రరత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్యగారిపై బలిజేపల్లివారు వ్రాసిన స్మృతి పద్యం హృదయాన్ని ఉద్రూతలూగించేలా ఉంది. బలిజేపల్లివారు ఎన్నో అవధానాలు చేశారు. అవధానాలు ఆశుకవితామూలకాలు. తటిల్లతల్లాక్షణమాత్ర సంతోషజనకాలు ఇవి గాలిలో కలసిపోతాయికాని గ్రంథస్థంకావు. అందువల్ల ఈ పరిశోధకుడు అవధానాలను గురించి ఏమీ చెప్పలేకపోవడంలో ఆశ్చర్యంలేదు. అలాగే చలనచిత్రగీతాలు కూడా క్షణభంగురాలు. వీటిని గురించి కూడ శ్రీహరికి ఎక్కువ సమాచారం లభించలేదు. నవలలు ఈ పరిశోధన పరిధిలోకి రావు. ఉన్నంతలో తనకు లభించినంతలో, డా॥మల్లేల శ్రీహరి ఈ పరిశోధనను సమర్థవంతంగా నిర్వహించాడు. అతనికి నా అభినందనలు తెలియజేస్తున్నాను.

సౌరభ

బెంగుళూరు

12-2-2000 (రథసప్తమి) — తంగిరాల వెంకటసుబ్బారావు



# సౌదర్యము - సౌందర్యము

డా॥మల్లేల గురవయ్య

డా॥ మల్లేల శ్రీహరి మాముయ్యురు అన్నదమ్ములలో చిట్టచివరివాడు చిన్నతనమునుండి నారక్షణలో, శిక్షణలో పెరిగిపెద్దవాడై విద్యాబుద్ధులు నేర్చినవాడు. బాల్యము నుండి విశ్వవిద్యాలయ విద్యాభ్యాసము పూర్తియగు పర్యంతము రంగస్థలనటుడుగా ఎన్నో సాంఘిక నాటికలు ప్రదర్శించి పలువురు ప్రశంసలందుకొన్నవారు. నిర్భయముగా నిష్కర్షగా స్తవముకాని, వాస్తవమును కుండ బ్రద్దలు గొట్టినట్లు మాట్లాడు స్వభాము గలవాడు. యథార్థవాది, లోకవిరోధి అన్నట్లు ఉన్నది ఉన్నట్లు గట్టిగా నొక్కివక్కాణించి కష్టములుకొన్నికొనితెచ్చుకొన్న సందర్భములు లేకపోలేదు. వంచన కౌటిల్యము విచ్చలవిడిగా స్వైరవిహారముచేయు నేటి ప్రాపంచిక వ్యవహారములలో కల్లకపటము లేకుండ వర్తించు నెవ్వరైనను తప్పక ఇక్కట్టులకు గురికాక తప్పదు. ముఖ్యముగా నేటి సమాజములో మంచికి కాలములేదు. ఏది యేమైనను మంచికి సత్యదయాధర్మములకు తలవంచి, విధి ఆడించిన విధముగా జీవితాంతము కష్టముల కాపురము కొనసాగించుట కొందఱప్రారబ్ధము. అది వారు నమ్మిన సత్యమునకు భగవంతుడు ప్రసాదించు దుష్పరిణామ పూర్వక వైయాత్యము. ఇడుముల నడి సంద్రములో సుడిగుండముల నడుమ చుట్టుకుని దరిగానని కొందరు తమ మనుగడలో ధైర్యస్థైర్యములనే నావగా చుక్కానిగా గ్రహించి తప్పక ఎప్పుడోఒకప్పుడు ఒడ్డుచేరగలమను ప్రగాఢ విశ్వాసముతో ముందుకు చొచ్చుకొనిపోవు కష్టసహిష్ణువులున్నారు. అట్టివారి కోవకు చెందినవాడే శ్రీహరి.

విద్యావిషయకముగా ఎంతో పట్టుదలతో ఎన్నో పట్టములు తెచ్చుకున్న శ్రీహరి తన విద్యకు తగిన ఉద్యోగమును పొందలేకపోవుట కాలలీల. దుర్విధిగూర్చు ఆవిధికి అవధులులేవని పెద్దలందురు. ఇది ముమ్మాటికీ శ్రీహరి విషయమున ప్రత్యక్షర ప్రత్యక్షనిత్యసత్యము. వైవాహిక జీవన స్రవంతిలో మల్లెల సౌరభ శ్రీలహరులద్వితీయామోద కారకమనోరంజనములై అలరారగలవని ఆశించిన శ్రీహరికి రజనీవిలసనములు పైకొన్నవి. వెలుగున కుమారుచీకటులలముకున్నవి. పగలు పగలైనవి. రాత్రి జాతర చేసినది. రాతిరి యందును పర్యాయ క్రమముననుసరించి చీకటి కొన్నాళ్ళు వెన్నెల కొన్నాళ్ళు కదా! కాని కొందఱజీవితములో అమావాస్యకే ఆధిక్యము. రేలతాంగికి నల్లనిమేలిముసుగైన ఈచీకటి రజనీ శ్రీహరిగా పరిణమించి మత్సౌదర్యమునందలి సాంసారిక సౌందర్యమును గ్రసించినది. ప్రస్తుత సిద్ధాంత వ్యాసమునందు కవితాకళానిధి బలిజేపల్లి రచనా సౌందర్యమును సమీక్షించుటలో సాహిత్యమును ప్రదర్శించినది.

శ్రీహరి ఉద్యోగమొకచోట సంసారమొకచోట ఒకవైపు ధర్మరక్షణ మరియొకవైపు దారసుతరక్షణ. స్వస్థతలేని సతి. సుస్థితికి నోచుకొనని సంతతి. ఒకటి ప్రచారము మరియొకటి విచారము. వృత్తిని బట్టి దేశసంచారము. గృహ పరిస్థితులనుబట్టి

దారసుతోపచారము. ఇట్టి స్థితిలో అన్నియు భగవంతుని ఆదేశానుసారమని విధులు నిర్వహించు టయే మానవ కర్తవ్యముగా శ్రీహరి భావించుట గమనార్హము. సర్వజగత్స్థితికి కారకుడైన లక్ష్మీకాంతుడే పర్యవేక్షకుడు పరిరక్షకుడు. మనము నిమిత్తమాత్రులమని మననము చేసికొని మౌనముతో ధార్మిక కార్యక్రమములందు నిమగ్నమగుటయే నిజమైన కర్తవ్యనిష్ఠ. అట్టి సత్యాశ్రితవ్రత పరిపూతులను, బుద్ధిమద్విలాసపరులను, సత్యశివసుందరాద్వైతసంసిద్ధులను, స్వరాజ్యస్వారాజ్య నిర్మాణ సమర్థులైన భక్తముముక్షు సత్యసాధక సమూహమును, విశ్వశ్రేయమే ధ్యేయముగా నేతృత్వము వహించి రథసారథులై సత్యపథమున సాగు మహాత్ములను నిత్యము భావించి తత్పరి శోధనాతత్పరులై యాథార్థ్యమును గనుటకు పూనుకొన వలసియున్నది. అట్టి ప్రయత్నమునకు శ్రీకారమును చుట్టిన శ్రీహరి బలిజేపల్లి లక్ష్మీకాంత కవి ధార్మిక కృతులను గ్రహించి, తన సిద్ధాంత వ్యాసములో ఆయా రచనలసౌందర్య సారమును సమీక్షించిన సరణిర సహృదయసహృదయైకవేద్యము. ఈ సందర్భమున కవి హృదయమునుకూడ శ్రీహరి రసౌచిత్య స్ఫూర్తితో ఆవిష్కరించి రమ్యతర పరిపూర్ణ సౌమ్య కళాపారమ్యమును కవితా కళానిధి బిరుదమునకు అన్వయించి, కవితా సౌందర్యసాగరములో నోలలాడచేసినాడు. శ్రీహరి శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయమునకు సమర్పించిన పి.హెచ్‌డి., సిద్ధాంత వ్యాసరచనకు ఒక విధముగా నేనే ప్రేరకుడను, కారకుడను అని చెప్పుట కెంతోసంతోషించుచున్నాను. ఇక ప్రత్యక్షముగా పర్యవేక్షకుని అవసరములేని కొరతను పరోక్షముగా నేను తీర్చి, అనుక్షణము తగు సూచనలిచ్చి నిర్ణీత కాలములో సిద్ధాంతవ్యాస సమర్పణకుసంసిద్ధముగావించినందుకు మరియొకవిధముగా మహానందభరితుడను. పింగళి లక్ష్మీకాంతము గారిపై సిద్ధాంత వ్యాస సమర్పణ నాపర్యవేక్షణలోనే జరిగినది. ఆసందర్భమున బలిజేపల్లి లక్ష్మీకాంతకవి గారిపై నెవ్వరైన చేయగలరా అని నిరీక్షించుచుంటిని. అంతటి మహాకవిని ఆయన శతజయంతి సందర్భమున కూడఎవ్వరు స్మరించినట్లు కానరాదు. అట్లే ప్రపంచ తెలుగు మహాసభలలో కూడ బలిజేపల్లి ప్రసక్తినెవ్వరు తలపెట్టలేదు. ఇట్టి దుస్స్థితికి నాలోనేనే నొచ్చుకొని మాతమ్ముడు శ్రీహరిని సిద్ధాంత వ్యాసరచనకు పురికొల్పితిని.

మొదటినుండి బలిజేపల్లి రచనలపైనాకెంతో అభిమానము. అట్టి అభిరుచిని దర్భా వేంకటకృష్ణమూర్తిగారు తమ అద్భుతోపన్యాసములతో దృఢతరమొనర్చిరి. వారు పాఠ్యాంశములు వివరించునప్పుడు సందర్భానుసారముగా బలిజేపల్లి లక్ష్మీకాంతకవి పద్యములను ప్రసక్తికి తెచ్చి పరమానందరసమాధురిని కలిగించెడివారు.

1. భావౌజ్జ్వల్యముతో దర్భావేంకట కృష్ణమూర్తి ప్రాస్తావికప
   ద్యావళి బలిజేపల్లిన్. భావమ్మునలిపెతనయుసహ్యాసగతిన్ ॥
2. మదిని నేటికి మెదలు తన్మధురకవిత- లల్ల జాబిల్లి వెన్నెల వెల్లువలయి
   పారలగా, తానమాడిన పొలుపు తెలుపు- ననుభవమ్ముల నెమరువేసినదినాలు॥
3. తలచి పలుమారు పులకరింతలకు తనువు- మఱచియెపుడు లక్ష్మీకాంతమాన్యసుకవి
   రచనలెల్లను చదివి తద్రామణీయ- కము సమీక్షింతునోయన్న కాంక్షమించె॥

బలిజేపల్లి లక్ష్మీకాంతకవిపై ఆయన శతజయంతి సంస్మరణ సూచకముగా నెవరిచేతనైన పరిశోధన చేయించవలెనని ఎంతో కాలముగా వేచియుంటిని. చివరకు శ్రీహరికి నాయభిప్రాయమును తెలిపి సిద్ధాంతవ్యాస సమర్పణమునకు నొప్పించితిని. ఇది ఒప్పించుటయే గాని నొప్పించుటగాదు. ఈ సందర్భమున శ్రీఏలూరు ప్రసాదరావుగారు నాఅభిప్రాయముతో ఏకీభవించి శ్రీహరిని ప్రోత్సహించిరి.

సహజముగా శ్రీహరి మంచి నటుడు. బలిజేపల్లి వారును సహజనటనాచతురుడు. ఆయన జీవితము కేవలము నటనకే పరిమితముకాలేదు. నటనకు తోడు హృదయము ద్రవింపచేయు కరుణరసమయ కవితాప్రకటనలో ఆయనకాయనయే సాటి. ఆకవితా కళానిధి లేఖిని నుండి జాలువారినప్రతిరచనలో అపారముగా అమృతసారము ప్రసారమై, సహృదయ రసాస్వాధము దివ్యామోదమై పారము ముట్టినది. శివానందలహరి, సుందరకాండము, ఉత్తర రాఘవములలో బలిజేపల్లి అనువాద కళానైపుణ్యమగణ్యమై సర్వస్వతంత్ర రచనవలె సాగి, రసహృదయులైన సహృదయుల హృదయములలో రసానంద వార్ధిధులునింపి, పరిపూర్ణభావ చంద్రో దయమును దర్శింపచేసినది. ఆయన కవితాకళానిధి. అభిరుచులకు తగినట్లుఅప్రతి మానమైన ఆయన ప్రతి కవితలోను రసానందలహరులు నిండుజాబిల్లి పండువెన్నెలలవాగులై పొంగిపొరలి ప్రవహించినవి. **తెనుగున గల మాధుర్యము-తెనిగింపు ననమర తెలుపుటయేకాదని తరముగ నితరకృతుల- దనెపె రసజ్ఞులను సత్యధర్మ హృదయులన్:**

సాత్రాజితీయమున సాగిన ధర్మము వేరు. బుద్ధిమతీవిలాసమున ప్రతిపాదితమైన ధర్మమువేఱు. ఒకటి శృంగారము మరియొకటి వీరశైవాచార ధర్మవిలసిత భక్తిపూరము. ఇక సత్యహరిశ్చంద్రీయమున ఈరెండింటిని మించిన కరుణరసపూర్ణ సత్యవ్రతనిష్ఠపారము ముట్టినది. స్వరాజ్య సమస్య, పాలయిలుక పాంచాల పరాభవము వంటి కృతులలో కవి దేశభక్తి ఉద్విగ్న హృదయమావిష్కృతమైనది. సత్యనారాయణస్వామి స్తవములో వాస్తవముల ప్రస్తావన రసోద్వేలమై కఠిన పాషాణములును కరిగిపోవునట్లు స్వీయానుభవములు వెల్లడింపబడినవి. స్మృతి నీరాజనములో ఆంధ్రరత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్య మృతికి పరితపించుచు వ్రాసిన ఒక్కపద్యము చాలును. గుండెను చీల్చుకొని వచ్చిన ఆపద్యములో కరుణరసము కట్టలు తెగి ప్రవహించినది. ఒక్కొక్కపదబంధములో ఆపులేక ఉబికివచ్చు సముద్రపుటలలహోరు, బోరుమని తిలకించుటలో ఎన్నటికి ఆగని ఆఅబ్ధిఘోష, అప్రయత్నముగా, భావమహోజ్వలముగా రసోజ్జృంభణముగా ముడివేసుకొని సుడులుతిరిగి వర్ధిల్లినవి. ఇట్లే అనేక లఘుకృతులలో లక్ష్మీకాంతకవి కవితా సౌందర్యము అక్షరాక్షరమున ప్రతిఫలించి, రసికులను రసానందజలధులనోలలాడించినది.

ముఖ్యముగా వీరి సత్యహరిశ్చంద్రీయములోని ప్రతిసంఘటన ఎంతటి ఱాతిగుండెనైనను కరిగింప సమర్థమైనది. అందలి సంఘటనలు ఒకదాని తర్వాత మఱియొకటి మహో తీవ్రత కలవి. గోఱుచుట్టుపై రోకటిపోటువంటి ఆఘట్టములు హరిశ్చంద్రుని సత్యనిష్ఠను పరీక్షించుటకై కల్పింపబడినవి. సత్యహరిశ్చంద్రీయమును చదువుటయేగాని పూర్తిగా నాటకమును దర్శించు నవకాశమునాకుగాని శ్రీహరికిగాని కలుగలేదు. ఈలోటును తీర్చుటకై శ్రీ ఏలూరి ప్రసాదరావుగారు ఒంగోలులో బండారు రామారావు 11వ వర్ధంతి సందర్భమున శ్రీరామనాట్యమండలివారిచే సత్యహరిశ్చంద్ర నాటక ప్రదర్శన ఏర్పాటుచేసిరి. నాటక ప్రదర్శనకు మునుపు రావూరి రత్నకవి వ్రాసిన విముక్తి నాటక ద్వితీయముద్రణావిష్కృతి. అటుపై శ్రీహరికి నాకు సన్మానము జరిగినది. అప్పటికప్పుడు వేదికమీదికిపోయి కృతజ్ఞతలు వెల్లడించుటయెట్లో తోచని సందర్భములో అనుకొనకుండ రెండు పద్యములు గేయము రచించి వివరించితిని. శ్రీ ఏలూరిప్రసాదరావు తన పీఠికలో ఆనాటి సంఘటన పేర్కొనుటచే నేనుకూడ నాటి కార్యక్రమమును స్మరణకు తెచ్చుకుని అప్పటికప్పుడానాడు వ్రాసిన రచననిచ్చుటపొందుపఱచుచున్నాను.

శ్రీరామనాట్యమండలి- వారికి నాహూతులైన ప్రముఖులకున్‌సం
స్కారియగు డాలుబంజిమేన్- గారికి రావూరి రత్నకవికి నమస్సుల్||
ఇది ఏలూరి ప్రసాదరావు సలహో యేర్పడ్డ కార్యక్రమం
బిది బండారు కులాబ్ధిచంద్రుడయి యెంతో పేరునార్జించి కీ
ర్తిది గంతమ్ముల నిల్పినట్టి నటనా ధిష్ణ్యుండు శ్రీరామరా
వెద శ్రద్ధాంజలిఁగూర్చునట్టి సమయంబి సత్యసాహిత్యమే ||
సత్యంవద ధర్మంచర- ఇదే భరతవిశ్వంభర
హృదయాంతర రసనిర్భర- పావన జీవన హేలా
డోలాయిత సౌఖ్యంకర- శివశంకర సుందరతర
సచ్చిన్మయ తన్మయబంధురలీలా ప్రణవస్వరమాలపించుశాంతిశ్రీ.

భరతదాస్యబంధముక్తి కొరకు మహాత్మాగాంధీ
హృదయములో శాశ్వతమగు ముద్రవేసినది ఈకృతి
జాతి విముక్తికి ఇయ్యది దోహద మొనరించి ప్రగతి
చాటిన ఒక రసవత్కృతి- సాత్కృత సాత్త్విక సుస్థితి.
ఇది యిచ్చిన సందేశము సత్యమేవ జయతే శ్రుతి.

ఇది బలిజేపల్లి ఆర్ద్రహృదయాంబుధినుదయించిన
కరుణామృతరసధారాప్లావితభావిత సత్కృతి

జీవితగమ్యఫలశ్రుతి- సత్యోదయ సాక్షాత్కృతి
సత్యం జ్ఞాన మనంతం బ్రహ్మతత్వ పరమావధి
ఇదే సత్యహరిశ్చంద్ర సందేశము సాహిత్యము
మధిత హృదయ గ్రంథిచిట్లి- కరుణరసము పొంగిపొరలి
తుదకు శాంతి చంద్రోదయమై కూర్చును సాహిత్యము.

బలిజేపల్లి సాహిత్య సౌహిత్యమును సమగ్రముగా సమీక్షించుట కెన్ని సిద్ధాంతములైనను చాలవుకాని కవితా కళానిధియైన బలిజేపల్లి వారి కృతులలోని సౌందర్యమును స్థాలీపులాకన్యాయముతో సంగ్రహముగానైన సవిమర్శక పరిశీలన చేయవలసియున్నది. అట్టి కార్యమును డా|| మల్లేల శ్రీహరి నిర్వర్తించినందుకు నేనెంతో అభినందించుచున్నాను.

సాదర్యము- సౌందర్యము సాదరమతి సంగ్రహముగ సాహిత్యముతో
సోదరత వ్రాసినాడర- సోదయమగుపూర్ణకళలనొకయంశమనన్ ||

# విషయ సూచిక


| | | | |
|---|---|---|---|
| దివ్యానురక్తి - దేశభక్తి | : | శ్రీ ఏలూరి ప్రసాద రావు | i - vii |
| బలిజేపల్లి సాహిత్య రంగవల్లి | : | డా॥ తంగిరాల సుబ్బారావు | viii - ix |
| సౌదర్యము - సౌందర్యము | : | డా॥ మల్లేల గురవయ్య | x - xiii |

| | | | |
|---|---|---|---|
| ఉపక్రమణిక | | | 1 - 2 |
| ప్రథమ పరిచ్ఛేదము - లక్ష్మీకాంతకవి జీవిత విశేషములు. | | | 3 - 15 |
| ద్వితీయ పరిచ్ఛేదము - లక్ష్మీకాంతకవి కృతులు - వర్గీకరణ | | | 17 - 19 |
| తృతీయ పరిచ్ఛేదము - ధార్మికకృతులు - అనూదిత రచనలు | | | |
| | 1. | శివానందలహరి- సమగ్రపరిశీలన | 20 - 68 |
| | 2. | సుందరకాండము | 69 - 100 |
| | 3. | ఉత్తరరాఘవము- తులనాత్మక సమీక్ష | 101 - 120 |
| స్వతంత్రనాటకములు | 1. | బుద్ధిమతీ విలాసము సవిమర్శక పరిశీలన | 121 - 134 |
| | 2. | సాత్రాజితీయము- సవిమర్శక సమీక్ష | 135 - 152 |
| | 3. | సత్యహరిశ్చంద్రీయము సవిమర్శక సమీక్ష | 153 - 164 |
| చతుర్థపరిచ్ఛేదము | | దేశభక్తి రచనలు - పరిచయము | 165 - 168 |
| | 1. | స్వరాజ్యనమస్య | 169 - 180 |
| | 2. | భారతజనని, రక్తాభిషేకము, ఆత్మబలి | 180 - 182 |
| | | బలిజేపల్లి పీఠికలు | 182 - 186 |

| | | | |
|---|---|---|---|
| పంచమపరిచ్ఛేదము : | 1. | అవధానభారతి | 186 - 193 |
| | 2. | తిరుపతి వేంకటేశ్వర కవిత్వ ప్రశంస | |
| | 3. | పంచరత్నములు (కొండా వెంకటప్పయ్య) | |
| | 4. | దుగ్గిరాల గోపాలకృష్ణయ్య స్మృతి పద్యము | |
| | 5. | పాలయలుక | |
| | 6. | సత్యనారాయణస్వామి | |
| | 7. | గద్వాలరాణి పద్మహార సమర్పణ | |
| షష్ఠపరిచ్ఛేదము | 1. | కరుణరసభరిత రచనాపరిపక్వత | |
| | 2. | బలిజేపల్లిధార్మికదృక్పథము | |
| | 3. | బలిజేపల్లి శేముషీ వైభవము | |
| | 4. | బలిజేపల్లి రచనలో ప్రాచీనప్రభావము | |
| | 5. | తదనంతరాంధ్రకవులపై బలిజేపల్లివారి ప్రభావము | |
| సప్తమపరిచ్ఛేదము | 1. | చలనచిత్ర రచయితగా బలిజేపల్లి | 200 - 208 |
| | 2. | నటుడుగా లక్ష్మీకాంతకవి | |
| ఉపసంహారము | | | 209 |
| అనుబంధము- ఉపయుక్త గ్రంథసూచి | | | 210 - 212 |

# ఉపక్రమణిక

బలిజేపల్లి లక్ష్మీకాంతకవిగారిని పెక్కురు సత్యహరిశ్చంద్రీయనాటకకర్తగా, ప్రసిద్ధనటుడుగా మాత్రమే గుర్తించియున్నారు. వారి సత్యహరిశ్చంద్రీయము నాటినుండి నేటికిని యావదాంధ్ర దేశమున ప్రదర్శింపబడుచునే ఉన్నది. ఇట్టి అద్వితీయ నాటకరాజమును రచించిన బలిజేపల్లి వారి యితర గ్రంథములను గూర్చిగాని, వారి జీవిత విశేషములను గూర్చి గాని యెవ్వరును భావించినట్లుతోపదు. ప్రపంచతెలుగు మహాసభల సందర్భమున గాని లేక బలిజేపల్లి వారిశతజయంతి సందర్భమునగాని యెవ్వరును వారిని గూర్చి స్మరించిన వారు లేరు. ఆంధ్రులు అంధులనుట కిదియొక నిదర్శనము. ఆ మహానటుని మహాకవిని గుర్తింపని తెలుగుదేశముయొక్కదుస్థితి యిట్లున్నది. కాని తెలుగుజాతి యున్నంతవరకు వీరి సత్యహరిశ్చంద్రీయమునకు సాటి రాగల కృతి మరియొకటి లేదనుట నిక్కము. **"తన దేహము తన గేహము తన మాన ప్రాణములను తత్పరమతియై"** నాటకకళకే అంకితము గావించిన బలిజేపల్లివారి వ్యక్తిత్వ సాహిత్యములను గూర్చి యింతవరకెవ్వరును పరిశోధన చేయక పోవుట నాయదృష్టము. స్వతస్సిద్ధముగా నటనాసక్తిగల నేను అప్పుడప్పుడు సత్యహరిశ్చంద్రీయమును చదువుచుండుట మా అన్న డా॥ మల్లెల గురవయ్యగారు గాంచి బలిజేపల్లి లక్ష్మీకాంతము గారి కృతులపై పరిశోధన గావించిన మంచిది కదా! అని ప్రోత్సహించిరి. ఒక్కసత్యహరిశ్చంద్రీ యమేకాక వారి యితర కృతులేవియో వారి జీవితవిశేషము లేమిటో సిద్ధాంతవ్యాసము మూలమున లోకమునకువెల్లడించుట సముచితమనినాకును అనిపించినది. నా అభిప్రాయమును ఆచార్య జి. యన్. రెడ్డి, డా॥ మద్దూరి సుబ్బారెడ్డిమొదలగు వారికి తెలిపితిని. వారు సరే అని సమ్మతించిరి. నేను ఎం. ఫిల్ చేసి యున్నందు వలన పర్యవేక్షకుని అవసరములేకుండ పరిశోధన చేయుటకు వారు ఆమోదించిరి. శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయము నా అభ్యర్థనను మన్నించి తనసమ్మతి తెలిపినది. అటుపై పరిశోధన కుపక్రమించితిని. విషయసేకరణలో మా అన్నగారెంతో సహకరించిరి. వారి సహాయసహకారములే ఈ నా పరిశోధనకు కొండంతబలము నిచ్చినవి.

"బలిజేపల్లిలక్ష్మీకాంతకవిధార్మికకృతులు-సమగ్రపరిశీలనము" అను ప్రస్తుత పరిశోధనాంశ మేడు పరిచ్ఛేదములుగా విభజింపబడినది. ఇందు ప్రథమపరిచ్ఛేదమున బలిజేపల్లి లక్ష్మీకాంతకవి జీవితవిశేషములు వివరింపబడినవి. వారిజీవితవిశేషములను తెలియుటకైగుంటూరు, విజయవాడ,వేటపాలెం, శ్రీకాళహస్తి మొదలగు ప్రాంతములను మా అన్నగారితో కూడ కలిసి తిరిగితిని. కాని ఆశించినంతగా విషయమెచ్చటను లభింపలేదు. బలిజేపల్లివారి పౌత్రులు, కోడలు నేడు నెల్లూరులో నున్నప్పటికి వారి నుండి కూడ వలసిన విషయము లభింపక పోవుట శోచనీయము. కాని పలువుర అభిప్రాయములను క్రోడీకరించి వారి వ్యక్తిత్వ సాహిత్యములను ఈ ప్రథమపరిచ్ఛేదమున వివరింపదలచితిని.

ఇక ద్వితీయపరిచ్ఛేదమున వారికృతులు - వర్గీకరణమును గూర్చి స్థూలముగా ప్రకటింప నెంచితిని. ఈ పరిశోధనలో తృతీయపరిచ్ఛేదమునగల విషయమునకు

ప్రాముఖ్యమీయబడినది. లక్ష్మీకాంతకవి ధార్మికగ్రంథావళిలో 'అ' విభాగమున అనూదితరచనలు తులనాత్మకముగా విమర్శింపబడినవి. అందు శివానందలహరి ప్రముఖ స్థాన మాక్రమించినది. భక్తిరసభరితమై సర్వోన్నత సాహిత్యసంపదలు సంతరించుకొని ఆదిశంకరులగ్రంథములలో మకుటాయమానమైన శివానందలహరిని **"కవితాకళానిధి"** యైన బలిజేపల్లి రసవత్తరముగా ఎట్లనువదించి కావ్యకళా సౌందర్యమును ద్విగుణీకృతమొనర్చెనో, భక్తి ప్రపూర్ణమగురసాచితిని పాటించి మూలమున కంటె మేల్తరముగా నటనటనెట్టి మార్పులు చేర్పులు కూర్పులు నేర్పుగా గావించెనో వివరింపబడినవి. అట్లే నిత్యపారాయణగ్రంథమైన వాల్మీకిసుందరకాండమును మూలవిధేయముగా బలిజేపల్లి వారెట్లనువదించిరో, అచ్చటచ్చటవారిసహజమైన సర్వస్వతంత్రరచనాసరణి యెట్లువెల్లడియైనదో వివరింపబడినది.

ఇక **"ఉత్తరేరామ చరితే భవభూతిర్విశిష్యతే"** అని ప్రసిద్ధికెక్కిన ఉత్తరరామ చరిత్రమును అనువదించుటలో చూపినమెలకువలు - ప్రత్యేకించి కొన్నిసంఘటనలు తనకుతానైకల్పించి ప్రదర్శనానుకూలతను పాటించిన సందర్భములు - ఔచిత్యముకొఱవడకుండ రసస్ఫూర్తిని ప్రతిష్ఠించిన అనువాదవిధానము చర్చింపబడినది. అటుపై "ఆ" అనువిభాగములో ధార్మిక స్వతంత్రనాటకములైన బుద్ధిమతీవిలాస, సాత్రాజితీయ, సత్యహరిశ్చంద్రీయములను గూర్చి సవిమర్శకముగా వివరింపబడినది. ఈ తృతీయపరిచ్ఛేదము * నాయకమణివలె పరిశోధనలో హృదయస్థానమున జేర్పబడి, ప్రాణప్రతిష్ఠాకరకేంద్రముగా భాసిల్లినది. సత్యహరిశ్చంద్రీయము యొక్కప్రాశస్త్యమును వివరించిన అనంతరము చతుర్థపరిచ్ఛేదమున దేశ భక్తిరచనలు, పీఠికలు వివరింపబడినవి. చతుర్థ పరిచ్ఛేదమున సత్యమే జీవితధ్యేయమై సత్యహరిశ్చంద్రుని ఆదర్శముగాగొన్న, జాతిపితమహాత్మగాంధీ గారినిగూర్చి దేశభక్తిరచనలలో సవిస్తరముగా వివరింపబడినది. పిమ్మట కవి తనగ్రంథములకు వ్రాసికొన్నపీఠికలు, ఇతరులగ్రంథములకు వ్రాసినఅభిప్రాయములు ( పీఠికలు) సవిమర్శకముగా చర్చింపబడినవి.

పంచమ పరిచ్ఛేదములో పాలయలుక, చంపకమాలిక(వేలూరిశివరామ శాస్త్రిగారి కవిత్వ ప్రశంస), సత్యనారాయణస్వామి, గోపాల కృష్ణసంస్మృతి మొదలగువిషయములు **"లఘుకృతులు-సమీక్ష"** అను శీర్షిక క్రింద విశదీకరింపబడినవి. షష్ఠ పరిచ్ఛేదమున చలన చిత్ర రచయితగా, నటుడుగా బలిజేపల్లివారికిఁగల కీర్తిప్రతిష్ఠలు, కొన్నికొన్ని పాటలలో వారు ప్రదర్శించిన ప్రజ్ఞాపాటవములు స్థూలముగా పరిశీలింపబడినవి. సప్తమ పరిచ్ఛేదమున బలిజేపల్లి వారి కరుణరసభరిత రచనా పరిపక్వత-వారిధార్మికదృక్పథము, శేముషీవిభవము, సూత్ర ప్రాయముగా నిర్దేశింపబడినవి. పరిశోధనాంతమున బలిజేపల్లి వారిపై ప్రాచీన కవుల ప్రభావము తదనంతరాంధ్ర కవులపై బలిజేపల్లివారి ప్రభావము సూచనా మాత్రముగా పరామర్శింపబడినది.

ఇట్లే పరిశోధనాంశమున బలిజేపల్లివారికృతులు-వారిరచనావిశిష్టత మొదలగు విషయములెన్నియో సమగ్రముగా పరిశీలింపబడినవి. ప్రస్తుతము వారి జీవిత విశేషములను గూర్చి పరిశీలింతము.

# ప్రథమ పరిచ్ఛేదము

## శ్రీబలిజేపల్లి లక్ష్మీకాంత కవి జీవిత విశేషములు

శ్రీ బలిజేపల్లి లక్ష్మీకాంతకవిపేరువినని తెనుగువారుండరు. హరిశ్చంద్రనాటకము పేరెత్తగనే అందఱహృదయఫలకములో ముద్రింపఁ బడు వ్యక్తి బలిజేపల్లి లక్ష్మీకాంతకవిగారే. లోకము ముఖ్యముగా వీరిని సత్యహరిశ్చంద్రీయ నాటకకర్తగా నటుడుగా మాత్రమే గుర్తించినది.

[1]"1929 వరకు (ఆంధ్ర వాఙ్మయ సూచిక - వివరణ ప్రకారం) తెలుగులో వచ్చిన హరిశ్చంద్ర నాటకాల సంఖ్య 26. తర్వాత మరెన్ని వచ్చినవో....... ఈ నాటకాలన్నింటిలో ఎక్కువ ప్రసిద్ధి పొందినట్టిది బలిజేపల్లి లక్ష్మీకాంతం రచన" అని నార్లవారుపేర్కొనిరి. దీనిని బట్టి హరిశ్చంద్ర నాటకమునకు బలిజేపల్లి లక్ష్మీకాంత కవి జీవితమునకు విడదీయరాని ముడిపెన వేసుకొని యున్నదనుట సత్యము. కాని అదియే వారి జీవిత సర్వస్వమనుట తగదు. జీవితము నందలి విభిన్నాంశములలో అదియొకవిశిష్టతను ప్రత్యేకతను ప్రతిష్ఠించినదనుట సముచితము. సాధారణముగా జీవితవిశేషముల నావిష్కరించు సందర్భమున బాల్యమునుండి వారుమెలగిన తీరు- వారవలంబించిన వృత్తిధర్మము- స్వీయప్రవృత్తికనుగుణముగా వారు చేపట్టిన కార్యకలాపములు, ఎడనెడ తారసిల్లిన ఒడిదుడుకులు, కష్టనష్టములు, సుఖదుఃఖములు, వివిధరంగములలో ప్రవేశించివారుగావించిన మంచిచెడ్డలు; ప్రతిభాపాటవముతో సాధించిన విజయ పరంపరలు, శాశ్వతకీర్తిప్రతిష్ఠలు కలుగునట్లు నిర్వహించిన సత్కృతులు - నటనకు - జీవితము నకు మధ్య నేర్పడిన సామరస్య వైమనస్యములు. ప్రసిద్ధ పురుషులతో నటులతో సాహితీవేత్తలతోసాగిన పరిచయములు- అవి జీవితమున కలిగించిన అనుభవ విశేషములు ఇట్లెన్నెన్నో విషయములను క్రోడీకరించి సమగ్రపరిశీలన గావింపవలసి యున్నది. ఇట్టి క్రోడీకర ణమునకు ఆధారములు లభింపకున్నచో సరిగా జీవిత విశేషములను చర్చించుటకు వీలుకాదు.

ప్రస్తుతము బలిజేపల్లిలక్ష్మీకాంతకవిగారి జీవితవిశేషములను విభిన్నకోణములలో ఆధారములందినంతమేరకు పరిశీలింతము. బలిజేపల్లి లక్ష్మీ కాంతము గారి జన్మ స్థలము గుంటూరు జిల్లా బాపట్ల తాలూకాలోని ఇటికంపాడు గ్రామము. తండ్రి నరసింహ శాస్త్రి, తల్లి ఆదిలక్ష్మమ్మ. మేనమామ భాగవతుల చెన్నకృష్ణయ్యగారి యొద్దవీరువిద్యాభ్యాసముగావించిరి. ఇక వీరి మేనత్త సరస్వతమ్మ గారు పేరునకు దగినట్లు సాక్షాత్తు సరస్వతియే. ఆమె భారతభాగవత రామాయణముల లోని అర్థమును విప్పిచెప్పి, ఆగాథలలోని పరమార్థమును కర్ణామృతప్రాయము గావించినది. చిన్నతనమునుండియే శ్రద్ధాసక్తులతో వీరుసంస్కృతాంధ్రముల నభ్యసించిరి. "శైశవేభ్యస్త విద్యానాం" అను కాళిదాసోక్తి వీరియెడ అన్వర్థమైనది.

అనంతరము వీరు కర్నూలులో మెట్రిక్యులేషన్ పరీక్షలోనుత్తీర్ణులైరి. బాల్యమునుండియే కవిత్వము చెప్పగల శక్తి వీరి కలవడినది. సంగీత సాహిత్యములందు వీరికి మక్కువయెక్కువ. వీరు ఆపాతమధురము ఆలోచనామృతమునైన రెండు కళల సారమునుగ్గుపాలవలె నాస్వాదించి, సరస్వతీకటాక్షమునకు పాత్రులైరి.[2]"పయః పారావారం- ద్రవిడశిశు రాస్వాద్యయత్కవీనాం ప్రౌఢానాం అజనికమనీయంకవయితా" అను శంకరుల శ్లోకభావమున కనుగుణముగా వీరు అనంతరమచిర కాలముననే మహా కవియై చిరస్థిరకీర్తి నార్జించిరి. బాల్యమునుండి గాఢముగా పాదుకొన్న ఈ సత్కళలే భవిష్యత్తులో వీరిని గొప్ప సాహిత్యవేత్తగా, సంగీతకళారహస్యనిధియైన గాంధర్వవేత్తగా మహోన్నతస్థానముననిలుప గలిగినవి. ఈ రెండింటి సమన్వయము వీరిని

నాట్యకళకు ప్రేరేచినది. నటన జీవితలక్ష్యమైనది. గుంటూరు "హిందూ థియేటర్" లో ఎన్నోబాలవేషములువేసి ప్రేక్షకులను ముగ్ధులనుగావించిరి. లక్ష్మీకాంతము గారి తమ్ముడైన బలిజేపల్లి సీతారామయ్య గారు కూడ మంచి గాయకులుగా ప్రసిద్ధికెక్కిరి. అనుజుడు అగ్రజునను సరించుట సహజమేకదా! బాలవేషములు వేసి మెప్పుపొందిన లక్ష్మీకాంతముగారు నటనయే తమ ధ్యేయముగా భావిజీవితములో నెన్నోపాత్రలువేసిరి. బాహుకుడు, హరిశ్చంద్రుడు, రాజ నరేంద్రుడు, కృష్ణుడు, నక్షత్రకుడు మొదలగు భూమికలను దాల్చి ప్రశంసలు పొందిరి. వీరు[3] "చూడదగిన సుందర విగ్రహులు. వినదగినచక్కనిగాత్రము. వీరి పద్యపాఠ్యము ప్రశంసార్హముగనుండును".

పసుమర్తియజ్ఞనారాయణశాస్త్రిగారు బలిజేపల్లి అనేకవిషయములలో సాధించిన పరిణతిని బాల్యమునాటి స్థితితో పోల్చివివరించినవిధానము నిటవారి మాటలలోనే పొందుపఱతును. "హిందూథియేటరు" లో వీరు బాలవేషాలు వేసేటప్పుడు ఉండే స్థితికిని ఇప్పటి వీరి కవితాస్థితికిని హస్తిమశకాంతరం కనిపిస్తుంది. భేదమెంతైనాను. కవిత్వంలోనేకాదు సంగీతంలో కూడా మంచిఅనుభవాన్ని కలిగి శాస్త్ర సన్నిహితంగా పాడే ప్రౌఢిని సంపాదించారు. సంగీత సాహిత్యాల్లో ఉండే సమాన స్వాతంత్ర్యాన్నీ సమ్మేళన సౌష్ఠవాన్నీ ప్రకటించే ధారా సారళ్యమే వీని కవిత్వానికి కలిగిన పెద్ద పరపతికి కారణంగా ఉంటుంది. లక్ష్మీకాంతకవిగారు స్వయంగానూ అన్యంగానూ ఎన్నో విధాలకష్టించి భాషా సౌందర్యాన్ని లక్షించగలిగారు. సంస్కృత కావ్యాల్ని కూడా చాలావరకు అనుభవించేశక్తి సంపాదించారు. కొంచెం తెలుగువ్యాకరణం అలాగేకొంచెంఛందస్సు అలంకారం సమాసం మొదలైన శాస్త్రాంశాల్ని సంపాదించి క్రమక్రమంగా ఘనీభవించుకున్నాడు. వీరిచే సంస్కృతంలోనుంచి తెలుగులోకి పరివర్తింపబడిన శివానందలహరి, ఉత్తరరామచరిత్రం అనేకావ్యాలు ఆసత్యాన్ని తెలుపుతూ ఉంటాయి. వీరు ప్రకటించిన బుద్ధిమతీవిలాసం ఒకప్పుడు చాలాసమాజాలచే ఆడబడుతూఉండేది. సాత్రాజితీయం అనేది కూడ అందులో సగంప్రచారాన్ని కలిగిఉండేది. అన్నిటికంటె వీరి హరిశ్చంద్రీయం ఇప్పటికే ఎడతెగని ప్రచారాన్ని కలిగి ఉంటూ ఉంది. అని యజ్ఞనారాయణశాస్త్రిగారు పేర్కొన్నట్లు బాల్యమున పాదుకొన్న సంగీత సాహిత్య నాట్యకళాభిరుచి క్రమ క్రమముగాసాధనచేపరిణతినిపొందిబలిజేపల్లివారినొక మహాకవిగా, నటుడుగా, సంగీతకళానిధిగా, దేశికుడుగా నాటకసమాజసంస్థాపకుడుగా, బహుముఖప్రజ్ఞాశాలిగా, సినిమారచయితగా మహోన్నతశిఖరముల నిలిపినది.

మెట్రిక్యులేషన్ పరీక్షలో ఉత్తీర్ణులైనయనంతరము వీరు కొంతకాలము కర్నూలు రిజిస్ట్రారుకార్యాలయములో హెడ్‌గుమాస్తాగా పనిచేసిరి. పిదప వీరు గుంటూరు హిందూ కళాశాలలో తెలుగు పండితుడుగా ఉద్యోగము నిర్వహించిరి. కాని యెందుకో ఆఉద్యోగమును వదలివేసిరి. అటుపై తెలుగుసంస్థానములను సందర్శించి అవధానములుగావించిరి. అప్పటికప్పుడుచెప్పిన ఆశువులెన్నో. కాని ప్రస్తుతమా పద్యములు లభించుటలేదు. వీరు 1922వ సంవత్సరమున చల్లపల్లి రాజావారి సహాయ్యముతో గుంటూరులో చంద్రికాముద్రణాలయమును స్థాపించిరి. ఉయ్యూరు సంస్థాన కవీశ్వరులుగా నియమింపబడిరి. చంద్రికాముద్రణాలయమున వీరు శతావధానసారము, గుంటూరుసీమ, స్వరాజ్యసమస్యవంటి గ్రంథములను ప్రచురించిరి. ముద్రణాలయాధినేతగా వీరు నిర్వహించిన పాత్ర ప్రశంసార్హము. అప్పుడే ఆంధ్రదేశమున స్వాతంత్ర్యోద్యమ వాయువులు ముమ్మరముగా వీచినవి. దేశభక్త కొండావెంకటప్పయ్య, ఆంధ్ర రత్న దుగ్గిరాలగోపాలకృష్ణయ్య, ఆంధ్రకేసరిటంగుటూరుప్రకాశంపంతులు, పట్టాభి సీతారామయ్య, ఉన్నవలక్ష్మీనారాయణ, అయ్యదేవర కాళేశ్వరరావు వంటి యోధాను యోధులు

సత్యాగ్రహములో పాల్గొనిరి. ఉప్పుసత్యాగ్రహ సమరమున గాంధీ గారి అడుగుజాడలలో అందరు ముందు కురికిరి. ఆ సందర్భమున బలిజేపల్లిలక్ష్మీకాంతకవిగారును పాల్గొని రెండు సంవత్సరములు కారాగారవాస శిక్షననుభవించిరి. అప్పుడే వీరుసత్యహరిశ్చంద్రీయమును రచించిరి.

అటు పిమ్మట 1926 లో గుంటూరు ఫస్టు కంపెనీని తిరిగి స్థాపించిరి. ఈనాటకసమాజము 1882 నుండి 1912 వరకు ప్రసిద్ధనటులప్రదర్శనలతో బహుళప్రచారము గాంచినది. 'హరిప్రసాదరావు, కోపల్లెహనుమంతరావు, బలిజేపల్లిలక్ష్మీకాంతం, బలిజేపల్లి సీతారామయ్య, బాబూ పి. యన్. నౌషర్ వాంజి పార్వతీశ్వర శాస్త్రిమున్నగువారిందు ప్రముఖ నటులు. చిత్రనళీయము, అభిజ్ఞాన శాకుంతలము, సునందినీపరిణయము, వేణీ సంహారము, జనకజానందం, బుద్ధిమతీవిలాసము, సత్యహరిశ్చంద్రీయము, సాత్రాజితీయము, ఉత్తర రాఘవము మొదలైనవి వీరాంధ్ర దేశమంతట ప్రదర్శించిన రంగస్థలప్రౌఢ నాటకాలు. ఈ కంపెనీలో నాయక పాత్రలను ధరించిన హరిప్రసాదరావు ఆంధ్రనటపితామహుడని వందితుడై రండపెండేరాది మహోత్సవములలో, మన్ననలతో మహోజ్జ్వలకీర్తినార్జించిన నటసార్వభౌముడు. ఇక నాయికాపాత్రలను కోపల్లె హనుమంతరావు ఆయాపాత్రల మనస్తత్వములకు తగినట్లు రసానుగుణముగా ప్రదర్శించి మిగులప్రశంసలనందిరి. విలన్ పాత్రలను శ్రీపత్రి గోపాలరావు నిర్వహించెడి వారు. ఈకంపెనీపై తమకుగలఅభిమానంకొద్దీ బుద్ధిమతీవిలాసము, సత్య హరిశ్చంద్రీయము, సాత్రాజితీయము, ఉత్తర రాఘవము మున్నగు నాటకాలను రచియించియిచ్చారు". మద్రాసుమొదలైన నగరాలలో కూడ ప్రదర్శనలిచ్చి ఈ కంపెనీకీర్తిప్రతిష్ఠలు గడించినది. అట్టి ఈసంస్థను బలిజేపల్లి వారు తిరిగినెలకొల్పి ఊరూరప్రదర్శనలిచ్చిరి. 1926లో సత్యహరిశ్చంద్రీ యము, ఉత్తర రాఘవము వివిధప్రదేశములలో ప్రదర్శింపబడినవి. 1930వ సంవత్సరంలో రంగూన్ ఆంధ్రుల ఆహ్వానమును పురస్కరించుకొని అక్కడకుపోయి సత్యహరిశ్చంద్రీయ నాటకమును ప్రదర్శించిరి. వీరిప్రదర్శనకు వారుముగ్ధులై "కవితాకళానిధి" అనుబిరుదమునిచ్చి ఘనముగా సన్మానించిరి.

తరువాత కొంతకాలమునకు వీరు చిత్తజల్లుపుల్లయ్యగారి ప్రోత్సాహమువలన చలనచిత్రరంగమున ప్రవేశించి ఎన్నో చిత్రములకు మాటలుపాటలు కథలు రచించిరి. ప్రతిభా, జెమినీ మొదలగు సంస్థలు వీరిరచనావిశిష్టతను గుర్తించినవి. బాలనాగమ్మ, అపూర్వ సహోదరులు, శ్రీలక్ష్మమ్మకథ, రక్షరేఖ, వరవిక్రయము, తాసీల్దారు, ముగ్గురుమరాఠీలు, మంజరి మొదలగు పౌరాణిక, జానపద, సాంఘిక చిత్రములకు రచనాబాధ్యతను నిర్వహించుటయేగాక అనేకచిత్రములలో విభిన్నపాత్రలను సమర్థులైఅభినయించిరి. 1942లో చలనచిత్ర సంఘమువారు "పుంభావ సరస్వతి" అను బిరుదునిచ్చి సత్కరించిరి. వీరు కేవలము నాటకము లనేకాక శివానందలహరి, స్వరాజ్య సమస్యవంటి గ్రంథములనురచించి, దైవభక్తిని, దేశభక్తిని రసోజ్జ్వలముగా ప్రకటించిరి. బ్రహ్మరథము, మణిమంజూష అనునవలలుకూడ రచించి నట్లుతెలియుచున్నది. కాని ప్రస్తుతమవి అలభ్యములు. అట్లేవీరి "విజ్ఞిక" అను గ్రంథమును నేడు లభించుటలేదు. వీరు 1953వ సంవత్సరము జూన్ 30వతేదీన కాళహస్తిలో తమడెబ్బది రెండవ యేట తనువునుచాలించిరి. కీ. శే. బలిజేపల్లి చిరస్థిరయశఃకాయులు. వారికిమృతిలేదు. వారి కృతులు సర్వజనస్మృతిపథములో మెలగుచున్నంతవరకు బలిజేపల్లివారు చిరంజీవులే.

బలిజేపల్లి మరణానంతరమచ్చటచ్చట కొన్ని సంతాపసభలు నిర్వహింప బడినవి. 1953, జూలై5వేదీ గుంటూరులో అఖిలసాహిత్యకళాభివర్ధక ఆంధ్ర సంసత్తువారు సభ

ఏర్పాటుచేసిరి. అందు[6] "మొక్కపాటి నరసింహశాస్త్రి పిల్లలమఱ్ఱివేంకటహనుమంతరావు గారు బలిజేపల్లివారిసాహితీసేవను ప్రశంసిస్తూ మాట్లాడారు. బొగ్గరపు రామకృష్ణారావుగారు వారి జీవితవిశేషాలను తెలియజేశారు. యండపాటి రామలింగేశ్వరరావు గారు బలిజేపల్లివారు రచించిన హరిశ్చంద్ర నాటకంలోని విశ్వామిత్రపాత్రను అభినయించారు".

[7]"రాజమండ్రి జూలై ౭ చెన్నపురి శ్రీనాట్యకళాసాహిత్యపరిషత్తు వారి యాజమాన్యమున శ్రీఆచారిబ్రదర్స్‌వారి స్టూడియో ఆవరణలో శ్రీమాన్ నండూరి సత్యనారాయణ గారి అధ్యక్షతన కవితాకళానిధి" బలిజేపల్లివారి స్మారకసభ జరిగింది. పరిషత్తు ప్రధానకార్యదర్శి శ్రీరామ బాబ్జీ కీ॥శే॥ లక్ష్మీకాంతకవిజీవితాన్ని సంగ్రహంగా సభ్యులకు తెలియజెప్పారు. వారి మాటల పాటల నేర్పు నాటకరచన, అభినయన సమర్థతలూ చలనచిత్రరంగానికీ నాటకరంగానికీ చేసినసేవ చక్కగా వివరించారు. శ్రీమహబూబ్, డా॥సి. వి. రావుగార్లు లక్ష్మీకాంతంగారి రచన - అభినయన సామర్థ్యలను ప్రశంసిస్తూ ఆంధ్రరంగస్థలములోని ఒక అలంకారజ్యోతి రాలిపోయిందన్నారు. శ్రీమాన్ నండూరి నరసింహాచార్యులు వందనసమర్పణతో సభ ముగిసింది. అదే దినము ఆంధ్రపత్రికలో [8]"రంగారాంజూలై-6-శ్రీ బలిజేపల్లిలక్ష్మీకాంతకవి మరణంతో ఆంధ్ర నాటక రంగానికి తీరని లోటు యేర్పడిందని కవితాప్రపంచంలో ఒక ధ్రువ తారరాలిపోయిందని తమ విచారం ప్రకటిస్తూ చిత్తూరు జిల్లా కళా పరిషత్తు అధ్యక్ష, కార్యదర్శులు శ్రీ. పి. రాజగోపాలనాయుడు, కె. సభాగార్లు ప్రకటన చేశారు".

ఆయాసంతాపసభలలో ప్రసంగించిన జీవితవిశేషములేవియో గ్రంథస్థములై లభించి యున్నచో మఱికొంతవివరించి యుండుటకు వీలుండెడిది. ప్రస్తుతము బలిజేపల్లినిగూర్చి లభించు విషయములలోవారిఅభినయ కవిత్వ ప్రశంసలు తప్ప జీవిత విశేషములు లేక పోవుట శోచనీయము. కాని ఒక్కటి మాత్రము సత్యము. శరీరములు వాని నాశ్రయించిన భౌతికానుభవములు కాల గర్భమున కలిసి పోయినను అంతర్ముఖానుభవముతో ఆధ్యాత్మికదృక్పథముతో ఆచరించినసత్కృతులు అనుష్ఠించిన సత్కృత్యములు నిత్య సంస్తుత్యములు. [9]"ఖిలము గాకుండునది ధాత్రి కృతియె" అనుటప్రత్యక్షర ప్రత్యక్షసత్యము. బలిజేపల్లివారి అఖిలరచనలు నిజముగా ఖిలముగాకుండునవియే. [10]"వారి రచనా స్రవంతి బహుముఖాల పయనించినది. వారు సాంప్రదాయిక పద్ధతిలోనెంతకవిత్వము వ్రాయగల్గిరో అధునాతనవిధానములో కూడ అంతటి ప్రవేశమును అభినివేశమును పొందగలిగిరి. వీరిరచనలలో తెలుగుతనము, నాటకీయ శైలి, రసపరిపోషణ, ప్రధానముగా కానవచ్చును. పద్యశిల్పము వీరిసొమ్ము. వీరి సత్యహరిశ్చంద్రీయ నాటకము తెలుగు సాహిత్యమున్నంతవరకు ఉండును".

ఇట్టి మహోన్నత నాటకరాజమును తెలుగు వారికందించిన బలిజేపల్లి వారిని గూర్చి వారానాటకమునే వ్రాయలేదని కొందఱొక ప్రవాదమును లేవదీసిరి. [11]"భాగవతుల సుబ్బయ్య రచింపగా బలిజేపల్లి లక్ష్మీకాంతకవిగారు తమ పేరు పెట్టుకొనిరట" కాని ఏలూరులో నేటికిని సుఖులై యున్న సుబ్బయ్య గారిని కలిసి శ్రీపాణంగి శ్రీరామఅప్పారావుగారు ఈ విషయమై ప్రశ్నింపగా వారు నవ్వుచు [12]"మా లక్ష్మీకాంతకవి ఒకరి సొత్తును దొంగలింపవలసిన ప్రతిభా దరిద్రుడుగాడనియు సత్య హరిశ్చంద్రీయము పూర్ణముగా బలిజేపల్లివారిరచనయే అనియు స్పష్టము చేసిరటూ".

బలిజేపల్లి వారి కళాభిమానము కేవల నాటక ప్రదర్శనలకే పరిమితము కాలేదు. వీరు ప్రదర్శనలిచ్చిన ప్రతిప్రదేశమునందును సాహిత్య సంబంధములైన ఉపన్యాసములిచ్చి, అందు స్వీయకవితాగానమునకును కొంతఅవకాశమును కల్పించుకొని సభాసదులను రసానంద జలధిలో నోలలాడించుచుండిరనుటకు నెన్నో నిదర్శనములున్నవి. **కవితాకళానిధి** బిరుదును పొందిన

సందర్భమున గంగూన్‌లో వీరువిద్యను గూర్చి అద్వితీయముగాప్రసంగించిరట. అట్లే 1935-36 ప్రాంతమున సికిందరాబాదు లో సత్య హరిశ్చంద్రీయ నాటకమును ప్రదర్శించిన సందర్భములో రెండుసాహిత్యసభలలో ప్రసంగించిరని దేవులపల్లి రామానుజరావుపేర్కొనిరి. ప్రస్తుతమువారి మాటలనే యిటపొందు పరతును.

[13]"బలిజేపల్లి లక్ష్మీకాంతంగారు సికిందరాబాదు వచ్చి సత్య హరిశ్చంద్ర నాటకంవేసినప్పుడు నేనుస్వయంగా చూచినాను. లక్ష్మీకాంతంగారి పద్యపఠనమనోరంజకంగా ఉండేది. ఆయన ఒకటిరెండుసాహిత్యసభలలో ప్రసంగించినట్లు నాకు జ్ఞాపకం" కరుణారసభరితముగా హృదయమును కదిలించివేయు కవితను గూర్చి ముచ్చటించుచు అందుముఖ్యముగా ఉత్తర రాఘవమునందు వారనువదించినపద్యములనుమూలసహితముగావిన్పించినవారి సాహిత్యాభిమానమును కూడ దేవులపల్లి రామానుజరావీ క్రిందివిధముగా పేర్కొనిరి. [14]"మేము కొంతమంది విద్యార్థులము బలిజేపల్లి లక్ష్మీకాంతంగారిని సికిందరాబాదులో కలుసుకున్నప్పుడు వారు తమ ఉత్తరరామచరిత్రములోని కొన్ని భాగాలు మాకు వినిపించి తాము అందులో అనువదించిన పద్యాలు మూలంతో పాటుమనోజ్ఞంగా చదివినప్పుడు నాహృదయంకదిలిపోయింది. తరువాత బలిజేపల్లిలక్ష్మీకాంతంగారి ఉత్తరరామచరిత్ర నాటకాన్నికొనిచదివి ఆనందించినాను. నాకు ఈ నాటికి భవ భూతి ఉత్తర రామ చరిత్రమూలం చాలా యిష్టమైన రచన. ఇందుకు కారణం ఒక విధంగా బలిజేపల్లి లక్ష్మీకాంతం గారే అనిచెప్పవచ్చును". తానువిద్యార్థిదశలో ఉన్నప్పుడు వీరిప్రదర్శనను చూచి ఉపన్యాసము వినిఆకర్షితుడైనవిషయమునుకూడ దేవులపల్లిరామానుజరావు మరొక సందర్భమున తన జ్ఞాపకాలలో నిట్లు పేర్కొనిరి. [15]"హైద్రాబాదు నేనుతొలిసారి 1934వసంవత్సరంలో వచ్చాను. నిజాంకళాశాలలో నాల్గు సంవత్సరాలు విద్యాభ్యాసము. ఈ దశలో ఆంధ్ర ప్రాంతం నుండి వచ్చిన కొందరు కవి పండితులను సందర్శించే భాగ్యం కలిగినది. ఆరోజులలో సికిందరాబాదులో తెలుగునాటకాలు అప్పుడప్పుడు ఆడుతూండేవారు. సత్యహరిశ్చంద్రీయనాటక ప్రదర్శనం. 1935-36 లోకాబోలుజరిగినది. నాటకాన్ని వ్రాసిన బలిజేపల్లి లక్ష్మీకాంతంగారే స్వయంగా అందులో ఒకపాత్రధారి. హాస్టల్‌లోని విద్యార్థులం కొందరం ఆ నాటకాన్ని సికిందరాబాదు వెళ్ళి చూచినాము. మరునాడు ఆయనను కళాశాలకు ఆహ్వానించాము. ఆయనచక్కనిఉపన్యాసము చేసినారు. ఆయనకంఠం, ముఖ్యంగా పఠించే పద్ధతి నావంటి వారిని ఎందరినో ఆకర్షించినది".

1942లో చలనచిత్రరంగము వారు పుంభావ సరస్వతి బిరుదు నిచ్చి సత్కరించిన యనంతరము వీరు కొంతకాలము మదనపల్లెలోనుండి సత్యహరిశ్చంద్రీయనాటకమును ప్రదర్శించిరి. ఆ సందర్భమున బిసెంటు దివ్యజ్ఞాన కళాశాలలో ప్రధానాంధ్రోపన్యాసకులుగా నుండిన దర్భావేంకటకృష్ణమూర్తిగారు వీరిని కళాశాలకు ఆహ్వానించిరి. అపుడు మనోజ్ఞముగా సాహిత్యమును గూర్చివీరు ప్రసంగించిరి. కళాశాల తెలుగుశాఖవారు వీరిని ఘనముగా సన్మానించినారు. అప్పటి పద్యరత్నములిప్పుడు లభించుటలేదు. కాని అందు [16]"పుంభావ సరస్వతీబిరుదపాత్రుడవో కవితాకళానిధీ అనుపాదమున వీరి బిరుదములు రెండు నుదాహరింపబడినవి. శ్రీమేడవరంరామబ్రహ్మశాస్త్రి పరిచయముకూడ అప్పుడేకలిగినది. తాను మిగిల్చిన సుందరకాండ శేషము పూరించుటకు వారిమైత్రి ఎంతో దోహదకారియైనది. గద్వాల సంస్థానము నందును అప్పుడప్పుడు జరుగుతిరునాళ్ళలో పాల్గొనివీరు పలువురుకవి పండితులతో సాగించిన సాహిత్యగోష్ఠులెన్నోయున్నవి. శ్రీమేడవరంరామబ్రహ్మశాస్త్రిగారి పరిచయము ప్రగాఢ మగుటకు గద్వాల సంస్థానము నందలి కావ్య కళాప్రసంగములే ముఖ్య కారణమని గ్రహింపవచ్చును.

వీరు తమ ప్రదర్శనలు పండితపామరులనిరువురును రంజింపజేయగా సాహిత్యోపన్యాసములు రసజ్ఞులైనసాహిత్యవేత్తలను అలరించివారిలో సాహిత్యతృష్ణను పెంపొందింపజేయునని తలంచిరి. గుంటూరుకేంద్రముగా వీరు నిర్వహించిన ప్రదర్శనలు సాహిత్యప్రచారముప్రశంసార్హము, చంద్రికాముద్రణాలయమును స్థాపించి అనేక పుస్తకములను ప్రచురించిరి. చల్లని వెన్నెలవలెఎంతో ప్రశాంతముగా ఆహ్లాదకరముగా సాగి పోవలసిన వీరి జీవితములో ఋణసంబంధములైన ఒత్తిడులు ఉక్కిరిబిక్కిరిచేసినవి. నిరంతరము నాటక ప్రదర్శనలకై వీరు మించిన అప్పులొనర్చి 1 5 లక్షలు బాకీ పడిరి. ప్రభుత్వము తనయావదాస్తిని వేలము వేయుట కుపక్రమించినది. ఈ సందర్భమున వీరుఆస్తిని దక్కించుకొనుటకై ప్రాణమిత్రుడని భావించిన గోవిందరాజు సత్యనారాయణ అనున్యాయవాదిపేర మొత్తము ఆస్తినివ్రాసి యిచ్చిరి. అంతే ప్రాణ మిత్రుడు ప్రాణాపహారిగా పరిణమించినాడు. వ్రాసియిచ్చిన ఆస్తియెల్ల తనదే అనినాడు. [16-A]"కవికివర్థి మొండి చేతులు చూపినాడు. ఈ సంఘటనతో లోకమే తలక్రిందులైనట్లైనది. శోకముముమ్మరించి జీవితమే అంధకారావృతమైనది. హృదయము కకావికలైనది. దిక్కు తెలియని దైన్య హైన్య శూన్య స్థితి అలముకొన్నది. మహోన్నతసౌధవీధులలో సుప్రశాంతచంద్రికా ప్రసారముతో చిన్ముద్రీభూతమగుదివ్యానందము ననుభవింపదలచిన లక్ష్మీకాంతంకవికి లక్ష్మిపోయినది. కాంతిమాసినది. ఎక్కడనో అట్టడుగున చిమ్మచీకటిలో కూలారినట్లైనది. ముఖ్యముగా గర్తపురి(గుంటూరు) సార్థక్యము దుర్భరదుఃఖమయమగు తనయొక్కని జీవితమునకే సమన్వయింపబడెనేమో అనిపించినది. వెన్నెలలు మాసినవి. దురంతవిషాదవేదనాగ్నిశిఖలు విజృంభించి దహించివేసినవి. ధనములేని జీవనమెంత కష్టభూయిష్ఠమో అనుభవమునకు వచ్చినది. సుఖింపవలసిన యౌవనము కటిక చీకటి గ్రమ్ముకొన్న కంటకావృత మహావనముగా కన్పట్టినది". న్యాయవాది గోవిందరాజు సత్యనారాయణన్యాయ ధర్మములు దయాదాక్షిణ్యములు వీడి తనకు గావించిన పచ్చి మోసమునకు క్రుంగి కూలారిపోగా, జీవిత భీమాకు సంబంధించిన అభియోగమొకటి తనపై మోపబడినది. గోపాలకృష్ణయ్య యను మిత్రుని సాహచర్యమువలన ఈ ద్రోహ చర్య తనపైబడినది. గోరుచుట్టుపై రోకటి పోటువలె కష్టములపై కష్టములు ఒక్కుమ్మడిగా క్రమ్ముకొన్నవి, విధిలీలలు విచిత్రములు. ఒకదానిపై ఒకటిగాకష్టములో లేక సుఖములో కలుగుచుండును. జాషువా గారన్నట్లు [17]"భావింప దైవంబు సంపదపై సంపద-లేమి లేమి పయి నాపాదించు చిత్రమ్ముగన్" అను మాట నిత్య జీవితములో ప్రతి వ్యక్తి యొక్కఅను భవములో ప్రత్యక్షమగుచునే ఉండును. మిత్రునిమూలమున మాయాజాలమునఁబడి అపవాదుపాలైన విషయమును [18]"పరార్థహరణవ్యాపార మాయాధురంధరు బారింబడి లేనిపోని యపరాధంబంది యాపత్పరంపరలోఁ జిక్కితి నెట్లు తేల్చెదో మహాత్మా! సత్యనారాయణా" అనియు.

[19]"ఏనేపాపమెఱుంగనంచఖిల సాక్షీనీకు బోధింపనే
లా! నీ చూడని లోక సంగ్రహణ లీలా లేశమెందుండున
య్యా! నిర్మాయికులిట్లు దుర్మతనిమిత్తాపాయముల్సెందనీ
దీనత్రాణ పరాయణత్వ మిపుడేది" అనియు - [20]"ఔగాములన్ దెలియన్

నీతరమౌను గాక యపరాధిన్ సాపరాధింబొనర్చు లఘుజ్ఞానులు చర్మచక్షువుల ధీరుల్ తథ్యమిథ్యా పరీక్షలకుం జాలుదురయ్యా - తలమే నీకనుమూయ" అనియు సత్యనారాయణస్వామికి విపన్నుడైన లక్ష్మీకాంతకవి ప్రపన్నుడై విన్నవించు కొన్న విన్నపములో తనదోసమువీసము కూడలేదని, యది ప్రాణమిత్రులనినమ్మి కొన్న కృతఘ్నులు చేసిన దోసమని విస్పష్టమొనరించినాడు.

సత్యాసత్యములను న్యాయాన్యాయములను నిరూపించుటకు సత్య స్వరూపుడైన ఆభగవంతుడే సర్వసమర్థుడని అర్థించినాడు.

ఇట్లు కష్టసముద్రములోఁ జిక్కుకొని, యొకదైవమే తనసర్వస్వమని భావమున మ్రొక్కుకొని, సుడిగుండముల వంటి కడగండ్లనుండి మెల్లమెల్లగా నెట్లోవిధివశమున తప్పించుకొని, తుట్టతుదకు కాళహస్తిచేరి పానగల్లు రాజావారి సాదర సత్కారములతో ఊరట పొందగలిగినాడు. అటుపై చలనచిత్ర రంగప్రవేశము - ఊరూరనాటక ప్రదర్శనలు - ఉపన్యాసములు సాగినవి. కాళహస్తిలో దాదాపు వీరిరువదియైదేండ్లు తన భార్యా పుత్రులతో కాపురము సాగించిరి. "*30-A"వారికాపురము నవజీవన సారమైనది. పానగల్లు రాజావారి ఆదర సత్కారములు, జ్ఞానప్రసూనాంబా సమేత శ్రీకాళహస్తీశ్వర నిత్యాశీష్పూర్వకృపాప్రసారములు. తాను గన్నబంగారుకలలు పండి, పరిపూర్ణచంద్రికాప్రసారముతో వెల్లివిరియు స్వర్ణముఖరీతీరములు. బలిజేపల్లి తానంతకుముందు పొందిన కష్టపరంపరలనన్నిటిని మరపించిమురిపించినవి. తిరొపె మెత్త తిరువెట్లు పరమైశ్వర్య సంపన్నుడగునో, జ్ఞాన ప్రసూనసౌరభములెట్లు సర్వలోక సుపర్వములైవాయు ప్రభావమున నెల్లెడల పర్వివిరజిమ్మునో కవితాకళానిధి బిరుదువహించిన లక్ష్మీకాంతకవిరాజశేఖరునికి అవగతమైనది". చిన్ననాటినుండి జీర్ణించుకున్న తనసహజ ప్రవృత్తికి దగినట్లు ఊరూర ప్రదర్శనలు, సాహిత్యోపన్యాసములిచ్చి ప్రజలలో నాట్యకళాభిమానమును సాహిత్యాభిరుచిని పెంపొందించిరి.

లక్ష్మీకాంతంకవిగారు ఆయుర్వేదవైద్యమునెఱిగి, తనకుతానై వివిధములగు మూలికలను గ్రహించి లేహ్యములు మొదలగునవి తయారు చేసెడి వారట. దీనిని వీరువృత్తిగా స్వీకరించినట్లు కానరాదు. స్వయముగా తయారుచేసిన వివిధములైన భస్మములు లేహ్యములు తనకొఱకే అని తెలియుచున్నది. ఈతడు రసికుడనిప్రతీతి. సహజముగా రసహృదయుడగుటచే రాసిక్యము తదంతర్భూతము. నాటక సంస్థలతో, అందలి నటీనటులతోగలప్రగాఢ పరిచ యము, రాత్రింబవళ్ళు నాటక ప్రదర్శనలకై తర్ఫీదు నిచ్చునపుడు ఎంతో సన్నిహితముగా నటీ వర్గము తో మెలగుట, వారికి విసుపు కలుగకుండ నెఱపు సరస సంభాషణములు మొదలగునవి రసికతా లక్షణ ములుగనే లోకము భావించును. ఇక వీరి వేషభాషలు కూడ అందుకు కొంత కారణము కావచ్చును. వీరికి పట్టు వస్త్రములపై ప్రీతి. ముఖ్యముగా జిగేలుమను సిల్కు చొక్కా ధరించి, తళ తళ లాడుకాంతులు మొగమున చిందులాడగా నెప్పుడు మిలమిల మెఱయు చుండవ లెనను తత్త్వముగలవాడు. పైపైపటాటోపములే ప్రధానమని, అవియే తమ విధానమని లేనిపోని అహంభావమును ప్రదర్శించు తత్త్వమునకు వీరి తత్త్వము పూర్తిగా భిన్నము. దర్జాగా జీవింప వలెననివీరి అభిమతము. దీనికొక చిన్న నిదర్శనము. వీరు ఫోర్డు కారును ఆకాలములో ఇంగ్లండు నుండి రెండు వందలకు తెప్పించిరట. వీరికి నాటకమెంత యిష్టమో కంది పచ్చడి అన్న అంత అభిమానమట. వీరు చుట్టలెక్కువగా త్రాగెడివారు. ఇన్నివిభిన్నలక్షణములుగల వీరిజీవితవిశేషములను సమగ్రముగా చర్చించుట కష్టసాధ్యము. నిరంతరము వారితో సన్నిహితముగా నుండి, వారి గుణవిశేషములను సావధానముగా పరిశీలించిన గాని పరిపూర్ణ జీవిత విశేషములను నిరూపించు టకు వీలులేదు.

ముఖ్యముగా వీరి కళాభిమానము అప్రతిమానము. అందుకే వీరి జీవిత మంకితమైనదనుట అందరెఱిగిన పరమసత్యము. ఇట్టి వీరు చివరకు దుర్భరమైన మరణము పొందిరని కొందరు తలచుచున్నారు. ఈవిషయమును గూర్చి కాళహస్తిలో పానగల్లు నివాసి (16-299 ఇంటినెంబరు) శ్రీ. ఎం.ఎ. రామలింగంగారితో 15-12-1987 నాడు చర్చించితిని. లక్ష్మీకాంతం కవిగారు తమ చివరి రోజులలో దారిద్ర్యమనుభవించినట్లు కనిపింపదని,

రెండుదినములు జబ్బుచేసి కాళహస్తిలోనే వారు మరణించినారని, ఆయన పెద్దకుమారుడు నెల్లూరు నుండి వచ్చి కాళహస్తిలోనే శాంతి క్రియలు నిర్వహించిరని, ఆయనకు ఆడపిల్లలులేరని, ఉన్న చిన్న అబ్బాయికి మతి భ్రమణమని తెలిపిరి. ఇక పొనగల్లులో వారి యింటిని గూర్చితెలిసిన విషయములివి. పొనగల్లు రాజాగారికి, ఆయనకు బాగుగా పరిచయముండెడిదని, వారిచ్చిన యింటిని లక్ష్మీకాంతం గారే అమ్మివేసిరని, మొదట విద్యాప్రకాశానంద స్వామి దానిని కొని, ఒక గొల్లవానికి అమ్మివేయగా అతడు ప్రస్తుతము మరియొకరికి అమ్మివేసెనని తెలిపిరి. అరువది యేండ్లవయస్సుగల రామలింగముగారు తెలిపిన విషయమిది. "పండిత పుత్రః కుంఠః" అనుమాట వీరి యిరువురి కుమారులకు వర్తించును. పెద్ద అబ్బాయి పేరు సత్యనారాయణ, రెండవ వానికి వివాహమయినట్లు లేదు. ప్రస్తుతము నెల్లూరులో లక్ష్మీకాంతం కవిగారి కోడలు - పౌత్రులిరువురు మాత్రమున్నారు. వారినుండి మనకెట్టి జీవిత విశేషములు తెలియకున్నవి. ఇక వీరికి వివిధ సంస్థలతో - ప్రసిద్ధ వ్యక్తులతో గల పరిచయమును కొంత వివరించుటకు ప్రయత్నింతును.

బలిజేపల్లి వారు కేవలము గుంటూరు ఫస్టు కంపెనీ నాటక సమాజమునకు మాత్రమే పరిమితముకాక వివిధ సంస్థలలో గౌరవ సభ్యులుగా, సాధారణ సభ్యులుగా నుండిరి అవిబాపట్లలోని శ్రీకృష్ణ హిందూ థియేటర్ - అబ్బూరివారి నటాలి సమాఖ్య మొదలగునవి వీరి నటనావైదగ్ధ్యమునకు సెంతో సంతోషించి వీరిని జగన్మిత్రసమాజమువారు గౌరవసభ్యులుగా ఎన్నుకొనిరి. [21]"విశాఖపట్నంలో ఓం ప్రథమంగా వెలసిన నాటక సమాజం జగన్మిత్ర సమాజం. దీని స్థాపనకు కారకులు శ్రీరఘునాథవర్మగారు. వీరు శ్రీవిక్రమదేవ వర్మగారి అన్నగారు. సర్వశ్రీ విక్రమదేవవర్మ కాదంబరి జగన్నాథరావు, వసంతరావు. లక్ష్మీనారాయణరావు, మొసలికంటి సూర్యనారాయణ రావు.......... సెట్టి లక్ష్మీనరసింహం మొదలైనవారు సభ్యులు. శ్రీ కొప్పరపు సుబ్బారావు శ్రీనివాసపురపు గోపాలరావు, శ్రీ బలిజేపల్లి లక్ష్మీకాంతం ఈ ముగ్గురూ గౌరవ సభ్యులు". ఇట్లెన్నో నాటక సమాజములలో గౌరవ సభ్యులుగానుండి నటనకు సంబంధించిన అనుభవరహస్యముల వెల్లడించుచు అవసరమనిపించినచో ఆయా ప్రదేశములలో నాటక ప్రదర్శనలొసగుచు నటనయే జీవిత పరమావధిగా వ్యవహరించిరి.

వీరి జీవితములో ముప్పాతిక మువ్వీసము నటనకే అంకితమైనది. తక్కిన భాగములో వీరి [22]"వృత్తి కొంత కాలం కర్నూలు సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో హెడ్ గుమాస్తా పదవి. ఆతర్వాత హిందూ కళాశాలలో తెలుగు పండితులు పదవి. ఆ రోజుల్లో వీరు అవధానాలు కూడా చేసేవారు. ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని జైలుకు వెళ్ళారు. జైల్లో రెండు సంవత్సరములుండి ఆసమయంలో సత్య హరిశ్చంద్రీయం వ్రాశారు". అటుపై ఎన్నో చోట్ల ప్రదర్శనలిచ్చి గొప్ప నటుడుగా, కవిగా గాంధర్వ వేత్తగా కీర్తి గడించిరి. 1926 లో గుంటూరులో దిగ్విజయముగా వీరి సత్యహరిశ్చంద్రీయము ప్రదర్శింపబడినది. తర్వాత ప్రదర్శించిన మరియొక నాటకము వీరి ఉత్తరరాఘవము. 1930లో రంగూన్‌లోకూడా వీరు సత్యహరిశ్చంద్రీయమును ప్రదర్శించిరి. అనంతరము చాలకాలము చలనచిత్రరంగములో రచయితగా నటుడుగా పనిచేసిరి. 1942 లో చలన చిత్ర రంగము వారు వీరిని పుంభావసరస్వతి బిరుదమొసగి సత్కరించిరి. వీరి యితర నాటకములు సాత్రాజితీయము, బుద్ధిమతీవిలాసము అనునవి. సత్యహరిశ్చంద్రీయము లో నక్షత్రకుడు వీరి అభిమాన పాత్ర.

## ప్రముఖులతో పరిచయము

అల్లూరి నాటక సమాజములో కబీరు పాత్రనత్యద్భుతముగా నటంచు పర్వతరెడ్డి రామచంద్రారెడ్డికి లక్ష్మీకాంతకవికి గల పరిచయము నీ సందర్భమున తలచుట సముచితమని నా అభిప్రాయము. వీరిరువురిలో కొన్ని సామ్యములున్నందు వలననే రత్నం రత్నేన సంగచ్ఛతే అన్నట్లు సఖ్యము నెలకొన్నది. [24]**"రెడ్డి నాట్య ప్రపంచమున ఆర్జించిన కీర్తి ప్రతిష్ఠలకు రామదాసు నాటకము పట్టుగొమ్మ. రామచంద్రారెడ్డి హిందూస్థానీ పాటలను చక్కగా పాడగలడు. నాటకము ప్రారంభమునుండి తుదివరకు పాడుచున్నను కొంచెము కూడ ఆయన గొంతు రాపుపుట్టదు. ఆయన పాడు చున్నప్పుడు మరి కొంతసేపు పాడిన బాగుగ నుండుననితోచును".** వీరు శివానందలహరి ద్వితీయముద్రణకు ద్రవ్య సహాయమొనర్చిన దాతలు కూడ. వీరి వలెనే లక్ష్మీకాంతకవి గారును నక్షత్రక పాత్ర నిర్వహణలో కీర్తి ప్రతిష్ఠలు గడించిరి. సంగీత నిధులైన లక్ష్మీకాంత కవిగారు కూడ [24]**"ఒకే రాగమును రాత్రి తెల్లవారు వరకును అలుపు లేకుండ ఆలపింపగల సమర్థులు. రంగ స్థలమున కన్నడ, శహన బేగడ, ఆనందభైరవి మొదలగు రాగములను వ్యాప్తికి తెచ్చిన వారు వీరే".**

బలిజేపల్లి వారికి పలువురితో సుస్నిగ్ధ పరిచయముండెడిది. ఇక ఎందరో వీరిపరిచయమును మహాభాగ్యముగా భావించెడివారు. దానికి కారణము వీరు నటుడు, కవి. [25]**"కవులు నటులుగా వచ్చును కాని కేవల నటులు కవులగుట దుర్లభము ఏలన దానికి విశేష విద్యాపాటవముకూడ కావలయును".** కవి నటుడై నాటకమును రచింప గలిగినచో నికనంతకంటె వలసినదేమి! ఇట్టి ప్రతిభాపాటవము గలదిట్టలు నూటికి కోటికి నేయొకరిద్దరోయుందురు. ఆంగ్లమున షేక్స్పియరు మాత్రమే నటుడుగా కవిగా ప్రసిద్ధి గడించిరి. మన తెలుగున బలిజేపల్లి లక్ష్మీకాంతకవి, ధర్మవరం రామకృష్ణమాచార్యులాకోవకు చెందినవారు.

ఉయ్యూరు సంస్థాన కవీశ్వరులుగా నియమితులైనవీరు వివిధ సంస్థానాధీశ్వరులతో - అందలి కవిపుంగవులతో నెఱపినమైత్రి, అట వీరుప్రదర్శించిన శ్రావ్యకావ్యగానలహరి ఒక పండుగవలెనలరించెడిదట. మీర్జాపుర సంస్థానవిద్యాధికారిణి చేబ్రోలు సరస్వతీదేవి లక్ష్మీకాంతకవి గారి ప్రతిభను గుర్తించినదగుటచే తన సరస్వతీ రామాయణమునకు అభిప్రాయమునర్థించినది. అందుకు వీరొకే పద్యములో తత్కవితా విభవమును కవయిత్రీ ప్రశంసయందు చక్కగా అనుసంధించి అభివర్ణించిరి. ఇక గద్వాలసంస్థానముతో వీరి కెంతో సాన్నిహిత్యమున్నదనుకొంటిమి. అప్పుడప్పుడు వీరిని ఆసంస్థానము వారు ఆహ్వానించి సన్మాన సత్కారములు గావించుచుండిరి. ఇందుకు 1932లో జరిగిన ఒకసంఘటన ప్రత్యక్ష ప్రమాణము. విద్వాన్‌విశ్వంగారు రచించిన నాకథలో బలిజేపల్లివారి వ్యక్తిత్వసాహిత్య వికాసములు, వారికి జరిగిన సన్మానముట్టంకింపబడినవి. గద్వాలులో ప్రతిమాఘమాసము జరుగు తిరునాళ్ళకు కవులు, కళాకారులు, కళావంతులు విచ్చేసి వారివారిప్రతిభను ప్రదర్శించి ఏవోసంభావనలు సంపాదించు కొనుట పరిపాటి. ఆసందర్భములో ఎక్కడెక్కడి నుండియో వచ్చిన భోగామేళాలు - వారి కొరకై వచ్చురసికాగ్రగణ్యులు - ఇక చెప్పవలసినదేమి! ఆరోజులలో నాటక ప్రదర్శనలు - కావ్యకళా ప్రసంగములుండుటచే విరివిగా కవులు కూడ విచ్చేసెడివారు. ఈ సందర్భమున బలిజేపల్లిగారిని గూర్చి విద్వాన్ విశ్వంగారేమి తెలిపిరో యథాతథముగా నిట పేర్కొనుచున్నాను. [26]**"ఆసారి బలిజేపల్లి లక్ష్మీకాంతం గారూ వచ్చారు. ఆయన నాటక కర్తగానేగాక కవిగా గూడ సన్మానితులయ్యారు. అది కూడా ఆయన రాకలో లక్ష్యం. బలిజేపల్లి వారిని అప్పుడే చూశాను. కొందరు కవులూ చేరారక్కడ. ఆయన రాజ దర్శనార్థం ప్రత్యేకంగా కొన్ని పద్యాలు వ్రాశారు. వాటిని బహుశ్రావ్యంగా చదివి అక్కడ చేరిన మాకు వినిపించారు. ఎంత బాగున్నాయో చెప్పలేను. ఎంతో పొంగిపోయాను. నేనింతలేను**

కవిత్వం వ్రాస్తున్నాను. సంస్థానానికి వచ్చాను అంతే అయనకు ఎంతో ముచ్చటవేసింది. అవూ శి అన్నాడు. నాకోసం వాటిని విడమరచి చెప్తున్నారు. అవసరంలేదని పక్కనున్న తోటి వారన్నారు. అందులో నీవు పండితుడవు గాబోతున్నవాడివా అని ఇంకా ముచ్చటపడి వినిపించారు. నాపద్యాలూ చదివించుకొని విని అభినందించారు. అంత అకారణ ప్రేమా అంత కవిత్వ ప్రీతీ అతరం వారికే చెల్లును. అనుకుంటున్నాను. ఇప్పుడు అసూయ ద్వేషము సమఉజ్జీలమీదేకాని చిన్నవారిమీద అంతా వాత్సల్యమే. కాస్తగుణం కానవస్తే ఎంతైనా ప్రోత్సహించేవారు". "కవిరేవవిజానాతి కవేః కావ్య పరిశ్రమమ్ అన్నట్లు గుణగ్రహణ పారీణత, రసాస్వాదనాపరత్వము, అకారణ ప్రేమ, కవిత్వ ప్రీతి అనునవి అందఱకు అలవడవు. సాధారణముగా పండితులమనస్సు అసూయాద్వేషమాత్సర్యములతో ముప్పిరిగొని యుండును. విజ్ఞత, రసజ్ఞత, సహృదయత్వము గలవారు అరుదు. బలిజేపల్లి వారిలో ఇతరుల మంచిని గ్రహించు గుణము పుష్కలముగా ఉన్నది. సమ ఉజ్జీల యెడ కూడ వారి ప్రవృత్తి యిట్టిదే. అదే వారి వ్యక్తిత్వమునకెంతో విశిష్టత నాపాదించినది".

బలిజేపల్లి వారెచ్చటసహృదయులైనకవులుందురో అచ్చట కవితాప్రసంగములు చేయుచుండెడివారు. వీరు శ్రీమతి పి. భానుమతి, బాబాయి బొమ్మరాజు జానకిరామయ్య గారి కడకు అప్పుడప్పుడు విచ్చేసి తనకవిత్వమును వారికి విన్పించి వారికవిత్వమును తాను విని మహానందమును పొందెడివారు. భానుమతి తండ్రిగారు కూడ బలిజేపల్లి, కవిరాజుగారు, విశ్వనాథగారు తమయింటికి వచ్చినప్పుడు ఆముగ్గురితో మాఅమ్మాయికి ఛందస్సునేర్పి కవయిత్రిని చేయరాదా! అని అడిగెడివారట. పద్మశ్రీ భానుమతి గారి మొదటి చిత్రము (వరవిక్రయం1939) షూటింగ్‌కు కలకత్తా వెళ్ళినప్పుడు [27]"మహామహులు విశ్వనాథ సత్యనారాయణ గారు, విశ్వనాథ కవిరాజు గారు, బలిజేపల్లి లక్ష్మీకాంతం గారూ లాంటి హేమాహేమీల మధ్య మెసిలాను. వారి పరిచయ భాగ్యమువలననె తనలో రచనాసక్తి యేర్పడి"నదని ఆమె తెలిపిరి. చలనచిత్ర రంగములో బలిజేపల్లి వారికి ఆనాటి పలువురు ప్రసిద్ధ నటీనటులతో, నిర్మాతలతో, దర్శకులతో, గాయకులతో ఎంతో గాఢ పరిచయముండినది. విభిన్నులతో పరిచయములు - నాటి కవి జీవిత విధానము సమగ్రముగా వివరింపదలచినచో నిదియే ఒక బృహద్గ్రంథమగును. ప్రస్తుతము బలిజేపల్లివారికి అక్కినేని నాగేశ్వరరావు గారికి ఏర్పడిన పరిచయమును మృత్యుంజయుడు అను శీర్షికలో ముళ్ళపూడి వెంకట రమణగారిట్లు పేర్కొనిరి.

[28] "1944 మే 7 వతేదీన మధుసూదనరావుగారి వెంట బయలుదేరి 8వతేదీన మద్రాసు చేరుకున్నాడు నాగేశ్వరరావు. [29]కొత్తహీరో వచ్చాడంటూ మేడదిగి వచ్చాడు పేకేటి శివరాం. ప్రతిభా ఆఫీసులో పనిచేస్తున్న వాళ్ళు నలుగురైదుగురు పోర్టికో దగ్గరకు వచ్చారు చూడడానికి. ఆవెనకే బలిజేపల్లి లక్ష్మీకాంతం కవిగారు, ఘంటసాల వెంకటేశ్వరరావుగారు వచ్చారు. [30]ప్రతిభా సంస్థకు వచ్చావు ప్రతిభాశాలివికా నాయనా అన్నారు కవిగారు. ప్రతిభా లాడ్జిలో బలిజేపల్లి, శివరాం, ఘంటసాల, నాగేశ్వరరావు ఉండేవారు". [31] "సీతారామ జననంలో రాముడు పాత్ర నాగేశ్వరరావుకు లభించింది. కవిగారి దగ్గర పాత్రల వివరణ తెలుసుకొని డైలాగులు తీసుకున్నాడు. మాటలు బాగా చూచుకో అన్నాడు మర్నాడు". ఇట్లు నాగేశ్వరరావు గారికి కవి పరిచయము లభించినది. సందర్భ శుద్ధిగల చమత్కారములను మాటాడుటలో, పాత్రల మనస్తత్వమును వివరించుటలో, సంభాషణలలోగల మెలకువలను గ్రహించుటలో తీసుకొను జాగ్రత్తలను ఎంతో ఆప్యాయముగా ఆత్మీయముగా, ఆర్ద్రతగల మనస్సుతో అభిభాషించుట బలిజేపల్లివారి ప్రత్యేకత. ఇట్టి మహోన్నత గుణ విశేషమే బలిజేపల్లి వారి జీవితమునకు వన్నెను, వాసిని గలిగించినది.

దేశ భక్తులైన ఎందరో మహనీయులతో వీరికిగల అన్యోన్యత ప్రశంసార్హము. దేశభక్తకొండా వెంకటప్పయ్య ఆంధ్రరత్నదుగ్గిరాలగోపాల కృష్ణయ్య, టంగుటూరి ప్రకాశం

పంతులు జాతీయ మహాచక్రవర్తి దామరాజు పుండరీకాక్షుడు. కవి చక్రవర్తి జాషువా మొదలగు వారితో వీరికిగల పరిచయము జాతీయ భావమును రేకెత్తించి, ఉప్పు సత్యాగ్రహ సమరములో పాల్గొనునట్లు చేసినది. ఆసందర్భముననే వీరిని ప్రభుత్వము రెండు సంవత్సరములు కారాగారమున బంధించినది. ఎందరో మహానుభావులు కారాగారమున మహోన్నత గ్రంథములు రచించి పేరుగాంచినట్లే బలిజేపల్లి లక్ష్మీకాంత కవిగారును జైలులోనుండియే సత్యహరిశ్చంద్రీయ నాటకమును రచించిరి. లోకమాన్య బాలగంగాధరతిలక్ గారి శ్రీమద్భగవద్గీతారహస్యమున కెంత వ్యాప్తి గల్గినదో దానిని మించినప్రఖ్యాతి కలకత్తా రంగూన్ వంటి నగరములలో, ఆంధ్రదేశములో ఊరూర సత్యహరిశ్చంద్రీయమునకు లభించినది. జాతీయోద్యమములో నొకభాగమైన ఉప్పు సత్యాగ్రహసమర కారణముగా కారాగార వాసము ననుభవించుచు పరదాస్య శృంఖలా విచ్ఛేదముతో స్వాతంత్ర్యమును సముపార్జించి శాశ్వత సౌఖ్యమును చూరగొనవలె నన్నధ్యేయమును ఆనాటకమున అంతర్నిహితముగా పొందుపరచిరి. స్వరాజ్యసమస్య, ఆత్మబలి, పాంచాల పరాభవము వంటి దేశభక్తి రచనలలో వీరు గాంధీగారిపై తనకు గల భక్తి ప్రపత్తులను వెల్లడించిరి. జాతిపితగాంధీ మహాత్ముని సారధ్యములో సాగుచున్న ఉప్పుసత్యాగ్రహ సమర శంఖారావమును విని ముందుకురికి - సత్య హరిశ్చంద్రుని ఆదర్శముగాగొన్న ఆమహాత్ముని మనస్సునకు దర్పణప్రాయమగు సత్యహరిశ్చంద్రీయ నాటకమును బలిజేపల్లివారు రచించిరేమో!

గాంధీగారిపై బలిజేపల్లివారికి గల భక్తిప్రపత్తులు ఎనలేనివి. స్వరాజ్యసమస్యలో మహాత్మునిపై తనకున్నయభిమానమును వీరుచక్కగా ప్రకటించిరి. అంతేకాదు గుంటూరుకు జాతిపిత మహాత్ముడు విచ్చేసినపుడు బలిజేపల్లి గాంధీగారిని గూర్చి కొన్ని పద్యములు వ్రాసివేదిక పైచదువుటకు సన్నద్ధుడు కాగా ప్రభుత్వ సైనికులతనిని బంధించి నానాహింసలు పెట్టిరి. అపుడేకవియిక లిఖింపనని వలవలయేడ్చెనట. ఈ సన్నివేశమును జాషువాగారు "నాకథ" ద్వితీయ భాగములో స్వాతంత్ర్యోద్యమమును గూర్చి వివరించుసందర్భమున చాల చక్కగా గుండెలు నీరగునట్లు వక్కాణించిరి. ఇందు బలిజేపల్లి కవీంద్రునిపై గల జాతీయోద్యమప్రభావము, స్వాతంత్ర్య సమర దీక్షా సంరంభము వెల్లడియైనవి. కాని అప్పటి నరక్రవ్యాదచర్యావళికి వలవల విలపించుట తప్ప ఎదిరించి యెవ్వరేమియు చేయలేని తీవ్ర పరిస్థితి నెలకొన్నది. అప్పుడే జాషువా గారు కూడ కొందరు హితులు భయము గొలుపగా తాను వ్రాసిన పద్యములను జేబులో భద్రపరచుకొనిరట. కవులు భీరువులుగదా. అనిఅప్పటి సందర్భమును జాషువా గారు సమర్థించిరి.

అది గర్తపురమున జాతిపితకు సత్యాగ్రహులు స్వాగతోత్సవము చేయు సన్నివేశము. కాని ఆ యుత్సవమును ప్రభుత్వసైనికులడ్డగించిరి. వారు దౌష్ట్యముతో నరరూపరాక్షసులై వర్తించిన విధము చూచువారి గుండెలు వ్రీలిపోగా టొటటొట కన్నీరు గార్పించినది. కొండా, ఉన్నవ, దేశభక్తులగు త్యాగులు వీరసత్యాగ్రహోద్దండుడైన తెలుగుకేసరి, సీతారామశాస్త్రి మొదలగు వేదండములన్నియు చెఱసాల బద్ధులయి, స్వాతంత్ర్యార్థమైసాగునప్పుడు దిక్కులు గ్రుక్కిళ్లు మ్రింగుచు గుండెలు నీరయి దుఃఖించినవట. అప్పటి సన్నివేశమునే

[32] బలిజేపల్లి కవీంద్రుని బలిమింబందించిరతడు వ్రాసిన కృతికిన్

వలవల యేడ్చునటండిక విలిఖింపననుచు. కవులు భీరువులుగదా

అది గనిసే వ్రాసిన కృతిపదిలంబుగ జేబులోన భద్రపరచితిన్

పదుగురిలోఁ జదివిన నాపదవచ్చునటంచు హితులు భయము గొలుపగన్ అనురెండు కంద పద్యములలో జాషువాగారు విలిఖించిరి. ఈవిషయమునే మానాన్నగారు అను గ్రంథములో హేమలతా లవణంగారు కూడ[33] "స్వాతంత్ర్యోద్యమ సమయంలో గాంధీజీ ఆంధ్ర దేశం పర్యటించారు.

అప్పుడు గుంటూరులో గాంధీజీ సభ జరిగి బలిజేపల్లి లక్ష్మీకాంతంగారు తాము గాంధీజీ మీద వ్రాసిన పద్యాలు చదివారు. ఆయనను పోలీసులు అరెస్టు చేశారు. నాన్నగారు కూడ తాను వ్రాసిన పద్యాలు చదవాలనే ఉత్సుకత, ఉద్రేకంతో వచ్చి బలిజేపల్లి అరెస్టు అయిన విషయంవిని స్నేహితుల సలహాపై పద్యాలు చదవకయే తప్పుకున్నారట. కవులు ఖైదుగా అంటారు నాన్నగారు". అని స్వాతంత్ర్యోద్యమములో పాల్గొన్న మహాకవుల మహోత్సాహమును చక్కగా వక్కాణించిరి. బలిజేపల్లి తన పద్యములను చదివి అటుపై అరెస్ట్ అయినట్లు తెలిపిరి. నేడా పద్యములు కానవచ్చుటలేదు. మహాత్ముని ఆశయములను జీవితమున సాధింపవలెనన్న ధ్యేయమున వీరు రసవత్ కవితా రూపమున సత్య ధర్మ ప్రతిపాదక నాటక ప్రదర్శనల మూలమున నిరూపించిరి. గాంధీగారిని మహాత్మునిగా మలచినదికూడ సత్యహరిశ్చంద్ర కథయేయని బలిజేపల్లి వారి యభిప్రాయమై యుండవచ్చును. వారికా అభిప్రాయమున్నదో లేదో కాని అట్టి ప్రభావమా రచనలో ఎల్లెడల ప్రతిఫలించినదనుటకు బులుసు సాంబమూర్తిగారికి సంబంధించిన ఒక సంఘటననిట గ్రహింతము.

[34]గాంధీజీ కాకినాడకు విచ్చేసినపుడు స్త్రీలంతా తమ ఆభరణాలను మహాత్మునికి సమర్పించారు. శ్రీ సాంబమూర్తిగారి సతీమణికి రెండు చేతులకు రెండు బంగారు గాజులుతప్ప మరేమీ లేనందున ఆమహాయిల్లాలు సిగ్గుపడి అలాగే నిలబడివుంది. ఓసి! పిచ్చిదానా ఆచేతులనున్న రెండు గాజులు ఇచ్చివెయ్యక అలా నిలుచుంటావెందుకు? అని సాంబమూర్తిగారన్న మాటలు కొడుకు శవదహనానికి కాటి సుంకం చెల్లించేందుకు కాసు చేత లేదని చంద్రమతి అన్నప్పుడు ఈ క్రింది పద్యములోని సత్య హరిశ్చంద్రుని మాటలు స్ఫురణకు రాక మానవు. "దళమా పయ్యెదలో నడంగియు సముద్యత్కాంతులీ రెండలన్............. వెచ్చించినన్ చెల్లదే".

ఈ సందర్భమున ఈసంఘటన ముచ్చటించుటకు కారణములేకపోలేదు. గాంధీ మహాత్మునికి హరిశ్చంద్రకథకు అట్లే గాంధీగారి ఆశయావళిననుసరించు లక్ష్మీకాంతకవిగారికి వారి సత్య హరిశ్చంద్రీయమునకు గల అన్యోన్యానుబంధము వారివారి జీవితములలో విడదీయరానంతగా ముడివడియున్నది. హరిశ్చంద్రుని సత్య సంధతకు సంబంధించిన భావన వారిలో పరిపూర్ణముగా జీర్ణింపబడినది. హరిశ్చంద్ర అని పేరు వినగనే జాతి పిత మహాత్మా గాంధీగారు సత్య హరిశ్చంద్రీయ నాటక కర్తయగు బలిజేపల్లి లక్ష్మీకాంత కవిగారు మనఅందర మనస్సులలో మెదలెదరు. తదుపరి హరిశ్చంద్రలోని ముఖ్య ఘట్టములు మన హృదయ ఫలకములలో ముద్రితములగుచుండును. ఇదే బులుసు సాంబమూర్తిగారి జీవితమునందును గాంధీగారు కాకినాడకు వచ్చినప్పుడు స్ఫురించిన సంఘటన

[35]బలిజేపల్లివారి సత్య ధర్మ ప్రతిపాదకమైన రచనలో అంతటి స్ఫూర్తి యున్నది. అది వారి ఆర్ద్రమయ జీవిత సాగరమునుండి ఆవిర్భవించి రసజ్ఞులైన సహృదయులకందరకు పరిపూర్ణ కళలతో అమృతమును అందించినది. కావుననే వారు "కవితా కళానిధి" సార్థకత గడించిరి. "పుంభావసరస్వతి"గా పూజింపబడిరి". ఇంతగా సన్మానములు బిరుదులు పొందిన వీరి ఆర్థిక పరిస్థితులెట్టివో అవి వారి జీవితమున నెట్టి ప్రభావము నెఱపినవో పరిశీలింతము. ఆదాయము ననుసరించి వ్యయముచేయవలెనను సిద్ధాంతము వీరియెడ వర్తింపదు. అప్పుజేసి పప్పుకూడు పద్ధతినే వీరు పాటించినట్లున్నది. "అర్థమనర్థం భావయ నిత్యం నాస్తి తతస్సుఖలేశస్సత్యమ్" అను శంకర వాక్యముకంటె "ధనమూలమిదం జగత్" అను లక్ష్యమునకే వీరి జీవితము ప్రబల సాక్ష్యము. ఇచ్చిన మాటను తప్పలేక హరిశ్చంద్రుడార్థిక దుస్థితితో ఎన్నో కష్టములు పడెను. కాని తెచ్చిన యప్పులుతీర్చలేక లక్ష్మీకాంతకవి అనేకములైన అనర్థములకు గురి అయ్యెను. ప్రస్తుతము కోట్ల విలువచేయు గుంటూరులోని వీరి ఆస్తిని నిలబెట్టుకొనుటకై

కవి ఆనాడు గావించిన దూరాలోచనమును మిత్రుడు దురాలోచనముతో స్వాధీనము గావించుకొనెను. ఉన్న ఆస్తి వూడిపోగా మరికొన్ని అప్పులు చేయవలసి వచ్చినది. కొన్ని నాటక సంస్థలలో వీరు చేసిన అప్పులు తీర్పలేక అవి తీరునంతవరకు వారిచ్చిన పాత్రలను ధరించుచుండిరనుట ఎంత హైన్యము. మద్ది శ్రీనివాసరావుగారి కడ బలిజేపల్లి అప్పుచేసి, అది తీర్పలేక వారి కంపెనీలో ఉండి వారు ధరింపుడన్న పాత్రలను ధరించెడివారట.

ఇక సత్యహరిశ్చంద్రీయము లక్ష్మీకాంతకవిగారు వ్రాయలేదను వాదమునకుకూడ ఆర్థికదుస్స్థితియే కారణమని మల్లాది చంద్రశేఖర గారి అభిప్రాయము. భాగవతార్ సుబ్బయ్య గారు మల్లాది చంద్రశేఖర శాస్త్రి గారికి మిత్రులు. ఒక సందర్భమున చంద్రశేఖర శాస్త్రిగారు సుబ్బయ్యతో సత్యహరిశ్చంద్రీయ నాటక కర్త యెవరని ప్రశ్నించిరి. అపుడు సుబ్బయ్య పుస్తక ముద్రణకగు ఖర్చులు తానీయగా ప్రతిఫలముగా బలిజేపల్లి ఆపుస్తకముపై సర్వహక్కులు తనపేరిట వ్రాసిరని ప్రకటించిరి. దీని పర్యవసానముగా సుబ్బయ్యగారే ఆగ్రంథమును వ్రాసినట్లు ప్రజలు తలచిరి. కాని బలిజేపల్లి వారే ఆనాటకమును వ్రాసినట్లు సుబ్బయ్యగారు మల్లాదివారితో ధ్రువ పరచిరి. ఇట సర్వహక్కులు అన్నది అన్యార్థమును గల్గించినది. ప్రజలు సుబ్బయ్యగారే నాటక కర్త అని భావించిరి. ఇట్టి అన్యార్థమునకు అనర్థమునకు ప్రధానకారణము కవి ఆర్థికదుస్స్థితియే అనిపించును. శ్రీమైకె.వి. యన్. ఆచార్యగారి తండ్రి కడకు అప్పుడప్పుడు ( తిరుపతికి) లక్ష్మీకాంత కవి గారు కాళహస్తినుండి పోయి సత్యహరిశ్చంద్రీయములోని పద్యములను భావానుగుణముగా చదివి విన్పించెడివారట. కొన్ని మారులు కాళహస్తికిపోవు చార్జీలుసైతము అడిగి తీసికొనెడివారట. ఇట్లెన్నో సంఘటనలు వీరి ఆర్థిక దుస్థితిని తెలుపుచున్నవి.

వీరు తమ పుస్తకములను స్వయముగా తాను చంద్రికా ముద్రణాలయాధినేతగా నుండియు ప్రచురించినట్లు కాన రాదు. సరస్వతీ బుక్ డిపో కొండపల్లి వీరవెంకయ్య మొదలగువారు వీరి రచనలను ప్రచురించిరి. ఇతరులు తన గ్రంథములకు సర్వహక్కులు కలిగిఉండుటచే వీరు స్వయముగా ముద్రించుటకు విరమించుకొనిరో లేక మరే కారణములు కలవో సరిగాతెలియవు. ఇట్టి స్థితికి కూడ వీరి ఆర్థికములైన ఇబ్బందులే కారణములై యుండవచ్చు. ఇక వీరి రచనలేవియో వానినెట్లు వర్గీకరింపవచ్చునో పరిశీలింతము. ముఖ్యముగా నిట వీరినాటకముల నెవ్వరెవ్వరేయే సంవత్సరములలో ప్రకటించిరో తెలిసికొందము.

[36]**1.** బుద్ధిమతీ విలాసము - సరస్వతీ బుక్ డిపో, విజయవాడ- ప్రథమముద్రణ - 1905.

, **2.** సత్యహరిశ్చంద్రీయము- కొండపల్లి వీరవెంకయ్య అండ్ సన్స్ - రాజమండ్రి - 1912

**3.** సాత్రాజితీయము - సరస్వతీ బుక్ డిపో, విజయవాడ- ప్రథమముద్రణ - 1914.

( కుప్పా శివరామ బైరాగి శాస్త్రి అనంతవరము గుంటూరుజిల్లా ప్రచురణ)

**4.** ఉత్తరరాఘవము - సరస్వతీ బుక్ డిపో, విజయవాడ- ప్రథమముద్రణ - 1923.

[37]**5.** శివానందలహరి అనువాదము - ముద్రణ -1916

## ఉపయుక్త గ్రంథ - వ్యాస సూచిక


* లక్ష్మీకాంత కవి ప్రశంస - డా॥ మల్లేల గురవయ్య

1. నరకంలో హరిశ్చంద్రుడు - పీఠిక - నార్ల

2. సౌందర్య లహరి ఆదిశంకరాచార్యులు

* రఘువంశము - ప్రథమసర్గ - కాళిదాసు

3. ఆంధ్రనాటక సంస్కరణము - పావనీ ముద్రాక్షరశాల, బందరు - 1985 పుట 108

4. ఆంధ్ర నట ప్రకాశిక. బందరు రామా ఆర్ట్ ప్రెస్, 1930 పుట 408

5. గుంటూరు మండల సర్వస్వము 1964 సంపాదకుడు దరువూరి వీరయ్య, పుటలు 433,434.

6. ఆంధ్ర పత్రిక బుధవారము జూలై 8, 1953

7. ఆంధ్ర పత్రిక శనివారము జూలై 11, 1953

8. ఆంధ్ర పత్రిక శనివారము జూలై 11, 1953

9. మనుచరిత్ర పీఠిక అల్లసాని పెద్దన

10. గుంటూరు మండల సర్వస్వము, పుట 471.

11.12. తెలుగు నాటక వికాసము డా॥ పోణంగి శ్రీరామ అప్పారావు, పుట 336.

13. 14. యాభై సంవత్సరాల జ్ఞాపకాలు ( 1929 - 1979) పుట 43.

15. యాభై సంవత్సరాల జ్ఞాపకాలు ( 1929 - 1979) పుట 69 దేవులపల్లి రామానుజరావు.

16. దర్భా వేంకట కృష్ణమూర్తి గారు తెలుగు శాఖాధ్యక్షుడు, బిసెంట్ దివ్య జ్ఞాన కళాశాల,

16. కవితాకళానిధి - బలిజేపల్లి, డా॥ మల్లేల గురవయ్య

17. ముంతాజ్ మహల్ - గుఱ్ఱం జాషువా

18. 19. 20. భారతి - ఆగస్టు 1925 సత్యనారాయణ స్వామి బలిజేపల్లి లక్ష్మీకాంత కవి.

20. కవితాకళానిధి - బలిజేపల్లి, డా॥ మల్లేల గురవయ్య

21. విశాఖ పట్టణంలో నాటక రంగం - పురిపండా అప్పలస్వామి పుటలు 243, 244.

22. తెలుగు నాటక రంగం కళావని హైదరాబాదు ప్రచురణ పుట 138 బలిజేపల్లి లక్ష్మీకాంతం

23. నాటక కళాసంస్కరణము. కవి కోకిల గ్రంథావళి - 4 దువ్వూరి రామి రెడ్డి.

24. తెలుగు నాటక వికాసము పుట 310

25. ఆంధ్ర నాటక కళ - శిష్ట్లా రామకృష్ణ శాస్త్రి పుట 428.

26. ఆదివారము అనుబంధం - ఆంధ్రజ్యోతి 1-11-1981- విద్వాన్ విశ్వం

26. కవితాకళానిధి - బలిజేపల్లి, డా॥ మల్లేల గురవయ్య

27. వనిత ఏప్రిల్ 1988 వినోదవాణి

28. 29. 30. 31. కథానాయకుడు పుటలు - 68, 69, 70, 71, ముళ్ళపూడి వెంకటరమణ.

32. నాకథ ద్వితీయ భాగము. గుఱ్ఱం జాషువా పుట 153

33. మానాన్న గారు. హేమలతా లవణం పుట 62.

34. నవ్యాంధ్ర నిర్మాతలు. నవోదయ పబ్లికేషన్స్ మద్రాసు - 10. పుటలు 144, 145.

35. కవితాకళానిధి - బలిజేపల్లి, డా॥ మల్లేల గురవయ్య

36. ఆంధ్ర నాటక దర్శిని 1860 - 1962 శ్రీనివాస చక్రవర్తి - జయంతి పబ్లికేషన్స్.

37. ఆంధ్ర శతక సాహిత్య వికాసము, డా॥ కె. గోపాల కృష్ణ రావు.

# ద్వితీయ పరిచ్ఛేదము

## లక్ష్మీకాంత కవి కృతులు - వర్గీకరణము.

రస హృదయుడు, సహృదయుడు, సాహిత్య తత్త్వ మర్మజ్ఞుడు హృద్యాన వద్య పద్య శిల్ప పారీణుడు, కవితా కళానిధి అయిన బలిజేపల్లి లక్ష్మీకాంత కవిగారు కొన్ని శ్రవ్య కావ్యములను మఱికొన్ని అపురూప రూపములను రచించిరి. ఇందు కొన్ని అనూదితరచనలు మఱికొన్ని స్వతంత్ర రచనలునున్నవి. అనూదిత శ్రవ్య కావ్యములలో శ్రీ మచ్ఛంకర భగవత్పాదుల శివానంద లహరి ప్రసిద్ధమైనది. ఇక వీరి అసంపూర్ణమైన అనూదితరచనలలో వాల్మీకి సుందర కాండ మొకటి కలదు. అట్లే దృశ్యములలో ఉత్తర రామ చరితమునకు అనుసరణ ప్రాయమైన ఉత్తర రాఘవ మెన్నదగినది. ఇది మూలమును కొంత అనుసరించి అందందు కొంత స్వతంత్రతను ప్రదర్శించి ప్రతిభావంతముగా తెనిగింప బడిన నాటక రాజము. ఇవి గాక ప్రసిద్ధకథలనుగ్రహించి సర్వ స్వతంత్రముగా రచించిన నాటములు కూడ మూడున్నవి. అవియే బుద్ధి మతీ విలాసము, సాత్రాజితీయము, సత్యహరిశ్చంద్రీయము అనునవి. వీరిరచనలను వర్గీకరించుటలో నాటకముల నన్నింటి నొకటిగా, శ్రవ్య కావ్యముల నొకటిగా విభజింవ వచ్చును. కాని యిట్టి వర్గీకరణముకంటె అనువాద రచనల నొక విభాగముగా, సర్వ స్వ తంత్ర రచనల మఱి యొక వర్గముగా, అప్పు డప్పుడు వివిధ సందర్భములలో రచించిన ఖండకృతుల నొక విభాగముగా, పీఠికలు, స్తుతిపద్యములు, ప్రశంసలు, స్వాగతపద్యములు మొదలగు చిన్నచిన్న ఖండికల నన్నింటినొక వర్గముగా విభజించుట సమంజసమనిపించుచున్నది. ఇక వీరు బ్రహ్మ కవిరథము, మణిమంజూష అనురెండు నవలలు కూడ రచించినట్లు తెలియు చున్నది. కాని ప్రస్తుతమవి అలభ్యములు. వీరి రచనలలో విజ్ఞిక అనుమఱియొక గ్రంథమున్నట్లు వదంతి. కాని అదియును నేడు లభించుట లేదు.

ఇక వీరు దేశభక్తి ప్రబోధకములైన ఖండికలు ఖండ కావ్యములు రచించి యున్నారు. అందు స్వరాజ్య సమస్య అను ఖండ కావ్యము మాత్రమే లభించుచున్నది. స్వరాజ్య రథోత్సవము అను పేర గల గ్రంథమును గూర్చి పలువురు విమర్శకులు ఉట్టంకించి యున్నారు. కాని యది యెందులభ్యమగునో జాడతెలియకున్నది. చిన్నచిన్న ఖండికలలో పాంచాలపరాభవము, ఆత్మ బలి మొదలగు ప్రసిద్ధ దేశభక్తి పూరిత రచనలును కలవు. దేశభక్తి రచనలు అను శీర్షికక్రింద ఈ రచనలనన్నింటి నొకటిగా వర్గీకరింప వలసి యున్నది.

పాలయలుక, అభినవ భారతి, సత్యనారాయణస్వామి, గద్వాల రాణి ప్రశంస, దేశభక్త కొండా వెంకటప్పయ్యగారి పౌర సభా సన్మాన పత్రము, ఆంధ్ర రత్న దుగ్గిరాల గోపాల కృష్ణయ్య గారి స్మృత్యంజలి మొదలగు కృతుల నన్నింటిని ఇతర లఘుకృతులు అను శీర్షిక క్రింద విభజింపవలసియున్నది. ఇక నిందొండు రెండు దేశ భక్తులను గూర్చి ప్రకటించిన ప్రశంసలు, స్తుతిపద్యములను కూడ లఘుకృతులందే చేర్చుట సముచితము. గాంధీ మహాత్ముడు గుంటూరు నకు విచ్చేసినపుడు వీరు కొన్ని పద్యములు చదివి వినిపించిరట. అవి నేడు అలభ్యములు. వీరు కొన్ని అవధానములు చేసి ఆశువులు చెప్పినట్లు జనవదంతి. కాని అవియును అలభ్యములు. ఇట్లు దుర్లభములైన రచనలెన్నో ఉన్నవి. అవి అన్నియు లభ్యములైనచో వాని నన్నింటిని లఘు కృతుల క్రింద వర్గీకరింప వచ్చును.

వీరు గుంటూరులో సొంతముగా చంద్రికా ముద్రణాలయమును స్థాపించి అందెన్నో రచనలను ముద్రించి యున్నారు. అప్పుడే వీరు గుంటూరు ఫస్టు కంపెనీ అను నాటక సమాజమును పునరుద్ధరించి ఎన్నో నాటక ప్రదర్శనలిచ్చిరి. కంపెనీ వారి అభ్యర్థనమునను సరించి వీరు బుద్ధిమతీవిలాసము, సాత్రాజితీయము ఉత్తర రాఘవము, సత్య హరిశ్చంద్రీయ నాటకములను రచించిరి. వీరు గుంటూరు నుండి శ్రీకాళహస్తికి తరలి వచ్చిన యనంతరము కొంతకాలమునకు ప్రతిభా సంస్థ అధినేత ఘంటసాల బలరామయ్య మొదలగు వారి ప్రోత్సాహముతో చలన చిత్ర రంగమున ప్రవేశించి యందు నటుడుగానే గాక రచయితగా ఎన్నో చలనచిత్రములకు మాటలు పాటలు రచించిరి. వీరి రచనలు విని ముగ్ధుడై స్వయముగా కవి, కళాపోషకుడైన పానగల్లురాజా వారు వీరి నెంతో చనువుగా చేరదీసి ఘనముగా ఆదరించి కొన్ని యెకరముల పొలమును, ఇంటిని ఒసగిరి. వీరనేక సందర్భములలో సన్మాన పద్యములు, ప్రశంసాపద్యములు వ్రాసి యుందురు. అవి మనకు లభింపక కాలగర్భమున కలిసి పోవుట నిజముగా మన దురదృష్టము.

వీరి చలన చిత్ర రచనను పురస్కరించుకొని స్థూలముగా నైన పరామర్శింప వలసి యున్నది. పైం బేర్కొనిన ధార్మిక కృతులకు, దేశ భక్తి రచనలకు గల విలువ అంతగా ఈ చలన చిత్ర రచనకు లేక పోవచ్చును. కాని ఆయా చలన చిత్రములలో వీరు పాటించిన రచనావిధానమును సంగ్రహముగానైన చర్చించుట సమంజసము. కావున ఆ పాటలను ఒక ప్రత్యేకప్రకరణముగా సిద్ధాంత వ్యాసము చివర పరామర్శింతము. ఇక వీరి యితర రచనలలో స్వీయకృతులకు, మఱి కొందఱకృతులకు వ్రాసిన పీఠికలను గూడ చేర్పవలసి యున్నది. బలిజేపల్లి వారు తన కావ్యములకు గూడ పీఠికలు వ్రాసియున్నారు. అందు శివానందలహరి ద్వితీయ ముద్రణపీఠిక చాల సంగ్రహము. ఇక ఉత్తర రాఘవము నందలి ఉపోద్ఘాతములో ఎన్నో విషయములు క్రోడీకరింపబడినవి. మూల కర్త భవభూతి ప్రాశస్త్యము, ఉత్తర రామ చరిత నాటక విశిష్టత, అనువాదములో స్వతంత్రించి చేసిన కల్పన లిందు వివరింపబడినవి. కురంగీ కిరాతమునకు సంగ్రహవచనములో సరస్వతీ రామాయణమునకు ఒకే ఒక పద్యములో అభిప్రాయములు పొందుపరుపబడినవి. శ్రీ కృష్ణస్తవము అను గ్రంథమునకు కూడ ఎంతో సంగ్రహముగాచక్కగా నాలుగు వాక్యములలో అభిప్రాయమును ప్రకటించిరి. ఇట్లు వీరి రచనలలో పద్యములు, పాటలు, మాటలు, అభిప్రాయములు, ప్రశంసలు–మొదలగు వివిధాంశములు చోటు చేసి కొని వీరి అసమాన శేముషీ విభవమును చాటుచున్నవి.

కృతుల వర్గీకరణలో లక్ష్మీకాంత కవి ధార్మిక కృతులకే ప్రస్తుత సిద్ధాంత వ్యాసమున ప్రముఖ స్థాన మీయ బడినది. బలిజేపల్లి వారి ధార్మిక దృక్పథము వీరి అనూదిత రచనలలో స్వతంత్ర రూపకములలో ఎంతో రస నిర్భరముగా ప్రకటితము. .వివిధ కృతులలో విభిన్న రీతులలో ధర్మ స్వరూప నిరూపణము మహోన్నతముగా ప్రతి పాదింపబడినది. వట్టి ధర్మములు వల్లించుట గాక తానెన్నుకొన్న యితి వృత్తములలో ఉత్తమ సాహిత్య తత్త్వము రసోద్వేలముగా ప్రవహించినది. ధర్మానుష్ఠాన మెంత కష్టనిష్ఠురమో అది యెన్ని పరీక్షలకు నెదురొడ్డి నెగ్గవలసి యున్నదో బలిజేపల్లి వారు ఉత్తర రాఘవ బుద్ధి మతీవిలాస సత్యహరిశ్చంద్రీయ సాత్రాజితీయాది నాటకములలో సన్నివేశాత్మకముగా మన కన్నుల యెదుట సాక్షాత్కరింపజేసిరి. ధర్మ స్వరూపుడు

ఆదర్శ ప్రభువుడైన రాముడు ఎవరో తెలిసి తెలియక పలికిన యొకమొఱకు మాటను పాటించి ప్రాణ సమానమైన యిల్లాలిని విడిచి నిష్కళంక దాంపత్య ధర్మమున కేర్పడిన విఘాతమునకు వలవల విలపించిన మనః ప్రవృత్తి ఉత్తర రాఘవమున కరుణ రస భరితముగా వివరింపబడినది. నిరతాన్నదాన వ్రతుడైన సిరియాలుడు అతిథి దేవ సంతర్పణకై అభ్యాగతుడు కోరినట్లు తన బిడ్డనే చంపి, ఆమాంసమును వడ్డించిన ధర్మ దీక్షలో నెంత మానసిక సంక్షోభము నెలకొని యుండునో బుద్ధి మతీ విలాసమున అభివర్ణించెను. ఇట్లే ఇచ్చిన మాటను తప్పించుకొనలేక ఆలు బిడ్డలనమ్ముకొని తాను కాటికాపరియై తుదకు నిరపరాధియైన యిల్లాలినే కఱకుకటారితో కుత్తుక తెగనఱకుటకుద్యమించిన హరిశ్చంద్రుని సత్యవ్రత పాలనలో నెంత హృదయ విదారక ధర్మ రహస్యమిమిడి యున్నదో! ఇట్లే ఎన్ని కథలో - వ్యధలో "[1] ధర్మము హృదయము లేని యంత్రముగా కన్పట్టును. మానవుడు హృదయము గల యంత్రము." [2]"కావున ధర్మము నందు దాగిన పరమ రహస్యమును గుర్తించి వర్తింపవలెను. పైకి ధర్మముగా నున్నదియే పరమ దారుణ క్రూరచర్యకు ప్రేరేపించును. ఉదాహరణమునకు [3]యజ్ఞము సేయుట అధర్మము కాదు. బలి పీఠము కడకు దీసికొని పోబడు గొఱ్ఱె పిల్లను బుద్ధ భగవానుడు చూచినపుడు ఆమహాపురుషుని హృదయము కరుణారస తరంగితమై దానిని కాపాడుటకుద్యుక్తుడాయెను." ఇట్లే రాముడు వాలిని సంహరించు వృత్తాంతము లో ధర్మాధర్మ వివక్ష యున్నది. [4]"ఇచట రాముని ధర్మైక పరత్వమునకు హానికలుగునని శంకించి తాను వత్తాసి వచ్చి రాముడు దేవుడు గావున ఆయన చేసినదంతయు ధర్మమని చెప్పి పైపెచ్చు వాలి చేత గూడ చెప్పించెను." ఇట్లు ధర్మ స్వరూపము సమయ సందర్భములను బట్టి మారుచుండును. ఇదమిత్థమని ధర్మమును నిర్ణయించుటకు వీలు పడదు. ధర్మమనేకరూపములలో అభివ్యక్తము. దైవ భక్తి దేశభక్తి, మానవసేవ మొదలగునవి కూడ ధర్మ సంబంధములే.

ఇట అనూదిత ధార్మిక రచనలలో శివానందలహరికి ప్రథమ స్థానము. భక్తి రేవ గరీయసీ అన్నట్లు ప్రస్తుత సిద్ధాంత వ్యాసమునకిది హృదయ పీఠి. ఈ శివానందలహరి 1916 లో ప్రకటితమైనది. [5]"బలిజేపల్లి శివానందలహరిలోని కొన్ని శ్లోకముల నాంధ్రీ కరించి కార్యవశమున నోరుగల్లు వెళ్ళిన సందర్భమున ముదిగొండ శంకరాచార్యులకు వినిపించి యుండిరి. వారి ప్రోత్సాహమున శివానందలహరిని సంపూర్ణముగ తెనిగించిరి. శంకరాచార్యుని ప్రౌఢకల్పనలను రూపకములను శ్లేషచమత్కృతులను లక్ష్మీకాంత కవి సరసముగ ననువదించెను. కొన్ని చోట్ల మూలమునందలి సమాసములను యథా తథముగనే గ్రహించి అనువదించిరి. [6]"మూలము నందలి భావగాంభీర్యమునే గాక రచనా పాటవమును ధారా శుద్ధిని శైలీ విలాసమును అనువాదమునందు దర్శింప జేసిన వారిలో లక్ష్మీకాంతకవి యొకరు. భక్తి పారవశ్యమును గలిగించు హృద్యమైన శైలిలో పద్యరచన గావించుటలో లక్ష్మీకాంత కవి సిద్ధ హస్తుడు".

ప్రస్తుత ము ప్రతి పద్యములో తెనిగింపున వీరు చూపిన మెలకువ లెట్టివో సవిస్తరముగా తృతీయాధ్యాయమున పరిశీలింతము.

# తృతీయ పరిచ్ఛేదము

## లక్ష్మీకాంత కవి ధార్మిక కృతులు - అనూదిత రచనలు

### శివానందలహరి - సమగ్ర పరిశీలన

శ్రీమత్ శంకర భగవత్పాదులను ఎఱుగని వారు లేరు. అద్వైత మతా చార్యుడుగా ఆయన ఆర్జించిన యశస్సు అద్వితీయము. అనుపమానము. అద్వైత మత ప్రచారము ఆసేతు హిమాచలము కావించిన ఆయన ఆయా కాల దేశాదులకనుగుణముగా విభిన్న దేవతా మూర్తులను విశుద్ధ భక్తి భావముతో కీర్తించి యున్నాడు. ఇట్టి ఇతని దేవతాస్తుతులను బట్టి కొందఱు అతనిది అద్వైత మెట్లగునని వాదించు వారును లేక పోలేదు. ఇది కొంత వరకు వాస్తవము కావచ్చునేమో కాని పరిపూర్ణ సత్యము మాత్రముకాదు. అందు సమస్త దేవతలొక్కటేనన్న నిదర్శనము మనము గ్రహింప వలసిన పరమ సత్యము. ఆయన జీవితములో ఏర్పడిన అనేక సంఘటనలను పురస్కరించుకొని ఆయా సందర్భములలో అనేక దేవతలను ప్రస్తుతించుట జరిగినది. శివానందలహరి, సౌందర్యలహరి, కనకధారాస్తవము, వివేకాచూడామణి, అన్న పూర్ణాష్టకము, లక్ష్మీనృసింహస్తోత్రము మొదలగునవి యన్నియు అనేకత్వములో ఏకత్వమును ప్రతిపాదించునవియే. ఈతని శివస్తవ శ్లోకములలో శివానందలహరి మకుటాయమానమైనది. సర్వసాధారణముగా ఈయన స్తుతులందన్నిటను సాహిత్య సౌందర్యసమ్మిళితమైన తాత్త్విక సాత్త్విక స్ఫూర్తి ఎంతో సమరసభావముతో సంధిల్లినది. అందువలననే ఈతని రచనలలోని అక్షరాక్షరము మంత్రపూరితమైన మహనీయ శక్తితో ఆకర్షించి పాఠకుల అంతరాంతరములలో అద్వితీయ చైతన్యమును, అనిర్వచనీయానుభూతిని ప్రతిష్ఠింప గలుగుచున్నది. మంత్రద్రష్టలైనమహనీయుల మాటలలోని ప్రత్యక్షరము నందును మాధురీధురీణమైన ఆకర్షణ శక్తి ప్రత్యక్షమగుట పరిపాటి.

శ్రీమత్ శంకర భగవత్పాదాచార్యకృత శివానందలహరి ఆయన రచనలలో ఒక ప్రత్యేకతను, విశిష్టతను సంతరించుకొన్న స్తుతిరాజము. **కవీనాం ప్రౌఢానాం అజని** అని సౌందర్య లహరిలో తన్ను గూర్చి పేర్కొన్న సత్యము ప్రస్తుత స్తుతిలో ప్రత్యక్షరమున ప్రతిఫలించి, అతనిని ఒక మహా ప్రౌఢ కవిగా మన ఎదుట సాక్షాత్కరింపజేయుచున్నది. ఈస్తుతి కింతటి ప్రశస్తి ఉన్నందు వలననే పలువురందలి మాధుర్యమును చవిచూచి పరమానంద భరితులు కాగలిగిరి. కొందరు కేవల పఠన మాత్రమున తృప్తి పొంది అందలి భావములను తమతమ భాషలలో అనువదించుటకు ప్రయత్నించిరి. అట్లు ప్రయత్నించిన వారిలో బలిజేపల్లిలక్ష్మీకాంత కవిగారొకరు. ఆధునిక కవులలో రస స్ఫూర్తి గల మృదుమధుర పద్యరచనకు వీరు పెట్టిన పేరు. వీరు హృద్యతర పద్య విద్యలోని సాగర సదృశ సమగ్ర సౌందర్య సారమును ఆపోశించిన అగస్త్యులు. భక్తి రసము, సాహిత్య సౌందర్య రసము ఎంతో సమరస భావములో సమ పాళ్ళలో సంగమించిన మూల గ్రంథమగు శివానందలహరి అన్య భాషలలో అనువదించుటకు అంతగా వీలు కానిది. కాని దాని మాధుర్యమునకు పరవశుడైనబలిజేపల్లి లక్ష్మీకాంతకవి గారు మూలమున గల భావము లేశ మైన కొరవడకుండ తాను ఎన్నుకొన్న ఛందస్సులో రస భరితముగా అనువదించిరి. మూలమునందలి అక్షరాక్షరమునకు యథాతథానువాదము, కొన్ని సందర్భములలో వెగటుగ పరిణమించును. మూలమునందలి ఛందస్సునకు, అనువాదకుడు ఎన్నుకొన్న ఛందస్సునకు పొత్తు కుదరనప్పుడు మఱి ప్రత్యక్షరానువాదమునకు వీలే లేదు. మాతృకానుసారమైన యథాతథభాషాంతరీకరణములకన్న ప్రతి పదార్థ తాత్పర్యములేమిన్న. అసలు యథాతథానువాదము మిగుల కష్టతర కార్యము. మూలమునందలి పదములకు తగిన పర్యాయ పద

ములు, ఆయా భాషలలో అందుబాటులో నున్నప్పుడే యిది కొంతకు కొంత ఫలవంతమగును. కాని యిందులో అప్రయత్నలబ్ధమైన సౌందర్య స్ఫూర్తి రస రామణీయకమైన స్వతంత్రతా దీప్తి నెల కొనుటకు వీలులేదు. కావుననే మన పూర్వ కవులందరును ఔచిత్యమునకు ప్రతిబంధకము కలుగకుండ రసస్ఫూర్తితో స్వతంత్ర రచన అన్నట్లుగా మూలమునందలి భావములను తమ అనువాదములలో పొందు పరచిరి. అట్టి స్వతంత్ర రచనా కౌశలమే ప్రస్తుత భాషాంతరీకరణ పద్ధతియందును పాటింపబడినది. అర్థ వంతములైన మూలము నందలి పదములే అందందు అనుసరింపబడుచు అనువాదము సాగినది. శబ్దాలంకార ప్రాధాన్యము గల మూలము నందలి కొన్ని పదములు అనువాదకుడు తానునుకొన్న ఛందస్సున కనుగుణముగా మలచుకొనెను. భక్తి భావబంధురమైన రచనలో ఎంతో సహజముగా ప్రయత్నములేకుండ శబ్దాలంకారములు కూర్చుట మహాకవుల విషయము నపరిపాటి. ఇందుకు ఆంధ్ర వాఙ్మయ చరిత్రలో సహజ పాండిత్య బిరుదాంకితుడైన పోతన మరువరాని నిదర్శనము.

ప్రతి పదాంధ్ర వ్యాఖ్యాన పద్య సహితముగా శివానందలహరి అనువదించిన బలిజేపల్లి వారు రెండవ కూర్పు పీఠికలో మొదటి కూర్పును గూర్చి ఉట్టంకింపకయే "ఈ గ్రంథము రెండవ కూర్పు ముద్రింపవలసిన అవసరము కలిగి చిర కాలమైన నెప్పటిప్పుడేదో యడ్డంకి కలుగుటచే నింతకాలముపేక్ష జరిగినది. ముముక్షువు లెందరో గ్రంథములకై జాబులు వ్రాసివిసివిరి. ఇట్లుండ అల్లూరు వాస్తవ్యులు శ్రీయుత పర్వతరెడ్డి రామచంద్రారెడ్డి గారు శంకర శ్లోకములు వానికి మదీయాంధ్ర పద్యములు విని యుత్సాహభరితులై వెంటనే దీనికగు ముద్రణ మూల్యము నొసంగిరి. గ్రంథము రెండవకూర్పుతో ప్రజాముఖము చూడగలిగినది". అని రెండవ కూర్పుయొక్క ప్రచురణకుగల కారణములను ల్లేఖించిరి. ఈపీఠికలో పేర్కొన్న అంశములనుబట్టి మొదటి కూర్పు తనకు సన్నిహితులైన కొందరు ప్రముఖులకు మాత్రమే అందగలిగినదనియు, రెండవ కూర్పు వలస ప్రజలందరకు నిది పెల్లడి కాగలిగినదనియు ముముక్షువులందరు జాబులను వ్రాయుటను బట్టి ప్రథమ ముద్రణ పలువురను ఆకర్షించినదనియు పెల్లడియగుచున్నది. ద్వితీయ ముద్రణ 5-7-1930 కవి గుంటూరులో నున్నప్పుడు ముద్రింపబడినది. పద్య రచనలో మిగుల ప్రసిద్ధికెక్కి పలువురి ఆదరాభిమానములకు పాత్రుడు కాగలిగిన బలిజేపల్లి లక్ష్మీకాంతకవి గారి శివానందలహరి, ఆంధ్రీకరణ విధానమును గూర్చి ప్రస్తుతము పరిశీలింతము.

శివానందలహరి లోని నూరు శ్లోకములలో మొదటి ఇరువది యేడు శిఖరిణీ వృత్తములు. కాని బలిజేపల్లి వీనిని విభిన్న వృత్తములలో అనువదించెను. ఇందు అధిక భాగము మత్తేభములే. పార్వతీ పరమేశ్వర నమస్కార రూపమైన మొదటి మత్తేభ వృత్త ప్రథమ పాదము నందే కలాభ్యాం అనుమూలమునకు లలితా మ్నాయ కలాకలాపులు అని వివరణ ప్రాయముగా అనువాదము. మూలమునందు కలాభ్యాం చూడాలంకృత శశికలాభ్యాం అను పద్ధతిలో నాలుగు పాదములందును శబ్దాలంకారము పాటింపబడినది. బలిజేపల్లి గారును శబ్దాలంకారములను స్వీయ తపః ఫలుల్, సకల భక్త వ్యక్త ధర్మ క్రియాఫలుల్, హృద్ధ్యానపునర్భవుల్, శివుల అని ప్రయోగించిరి. కలాకలాపులు, భక్త వ్యక్త శశ్వద్విశ్వ మొదలగు ప్రయోగములలో మూలమందులేని శబ్దాలంకార సౌందర్యము సంఘటింపబడినది. చూడా శబ్దమునకు శిఖ, శశి శబ్దమునకు తారేట్, నిజ శబ్దమునకు స్వీయ అను పర్యాయపదములు గ్రహింపబడినవి. అస్తోక త్రిభువన శివాభ్యాం అనుదానిని "శశ్వద్విశ్వ కల్యాణ కల్పులు" అని అనువదించిరి.

"గళంతీశంభో" - అను రెండవ శ్లోకము తుదిలో "మచ్చేతో హ్రదభువి

శివానందలహరీ" అని గ్రంథ నామధేయము పేర్కొనబడినది. త్వచ్చరిత సరితః అను మొదటి విశేషణము అనువాదమున కుశలత్వచ్చరితాపగన్ అనివద్య ప్రారంభమున వెలసినది. ఇందలి కుశల అనుపదమునకు మూలములేదు. "కిల్బిషరజోదళంతీ" అనునది అనువాదమున "ఘోరాఘపాంశుచ్ఛటా, ప్రశమప్రౌఢి వహించి" అని సుదీర్ఘ సమాసములో కొంత ప్రౌఢిని వహించినది. "ధీకుల్యా సరణిషుపతన్తి" అను వాక్యము "బుద్ధులను కాల్వల్వారి" అని అనువదింపబడినది. "సంసారభ్రమణ పరితాపోపశమనందిశంతీ" అను ప్రయోగమునకు "సంసార దుర్వాశ సంతాపమడంచి" అని అనువాదము. ఇట్లే మచ్చేతో హ్రద భువి అనుదానికి "మామక మనః పద్మాకరుబంధు" అని ఆంధ్రీకరణము. మూలమున హ్రద మనగా మడుగు కానిఅది అనువాదమున పద్మాకరమైనది. శివానందలహరీ అను ప్రయోగమును కవి "శివానంద సుధా ప్రవాహము" అని అనువదించెను. "విజయతాం" అను క్రియా పదమును "రహించున్ శ్రీజయోత్కర్షతన్" అని పద్యాంతముగాపేర్కొనెను. మూలమున చిన్నచిన్న సమాసములుగ నున్న ప్రయోగములు అనువాదమున కొన్ని చోట్ల మత్తేభ వృత్తమున కనుగుణముగా సుదీర్ఘములైనవి. గజ చర్మాంబరధారి అయిన పరమశివుని ప్రవృత్తిని మత్తేభమునందు అనువాదకుడు గంభీరతరముగా ప్రకటించెను. మూలము నందలి గళంతి, పతన్తి, దిశన్తి, వసన్తి అను క్రియా పదములకు పెడలుచున్, ప్రౌఢివహించె, పారి, అడంచి, నిల్చు అని ఆయాసమాసాదుల కనుగుణముగా ప్రయోగింప బడినవి. శివానందలహరీ అను గ్రంథనామధేయము అనువాదమున ప్రకటితము కాలేదు. లహరీ అనుపదమునకు సుధా ప్రవాహము అనిఅనువాదము. ఇందలి సుధా శబ్దము వివరణ ప్రాయము. విజయతాం అను క్రియా పదము శ్రీ జయోత్కర్షతన్అనునామ వాచకముగా ప్రయుక్తము. మూలమునందలి భావము ఎందునుకొరవడక సమానభూయస్త్వమగు రచనలో మత్తేభగమనమును దాల్చినది. కాని యిందలి క్రియా పదములలో వహించి, రహించు అన్నవి తప్ప తక్కిన వన్నియు అచ్చ తెనుగు పదములయిమాధుర్యము ను పుణికి పుచ్చుకొన్నవి.

'త్రయీ వేద్య హృద్యం' అను శ్లోకమున అన్నియు పరమ శివునికి విశేషణములే. దీనిని బలిజేపల్లి సీసము నందనువదించి మూలమున లేని కొన్ని విశేషణములను జతపరచిరి. అందు 'తనివి తీరగ జూడదగిన వాని', 'ఆనందమయమైన ఆకృతి గల వాని' 'వేల్పులకు నెల్ల వేల్పుగా వెలయువాని' అనువానికి మూలము లేదు. మూల మునందు పేర్కొనబడిన తక్కిన విశేషణములును అనువాదమున ముందు వెనుకలు, వెనుకముందులుగా కూర్పబడినవి. 'సాంబం' అనుదానికి 'తనదు సామేన సత్తితో దనరు వాని' అని తెనిగింపు. 'చిదాలంబం అతివిడంబం' అను ప్రయోగ ములను యథా తథముగనే అతివిడంబు జిదాలంబు అని గీత పద్యమున కవి నిబందించెను. త్రయీవేద్యఅనుదానికి 'ప్రాబల్యాల నెఱుంగ బడువాని' అని తెనుగు సేత. మూలమున చిన్నచిన్న పదములతో శబ్దాలంకార మనోజ్ఞముగా కూర్పబడిన శిఖరిణీవృత్తము అనువాదమున అధికముగా అచ్చతెలుగు పలుకుబడితో సీసముగా వెలసినది.

'సహస్రం వర్తంతే' అను నాల్గవ శ్లోకమునకు 'తలపన్ వేల్పులకేమి' అను మత్తేభము అనువాదము. క్షుద్రకఫలదా సహస్రం వర్తన్తే అనుదానికి 'క్షుద్ర ఫలదాతల్ పెక్కురున్నారు' అనియు 'నమన్యే స్వప్నేన తదనుసరణం తత్కృత ఫలం' అను వాక్యమునకు కలనేన్ తత్పుల మున్ తదీయభజనన్ కాంక్షింప' అనియు,'హరి బ్రహ్మాదీనాం అపినికట భాజాం అసులభం' అనుప్రయోగమునకు 'చెంతల సేవించు విరించికైన, హరికైన దుర్లభంబౌ' అనియు తవపదాంభోజ భజనం, 'భవల్లలితం పుంజ రణాబ్జ దాస్యము' అని అనువదింపబడినది. యాచే క్రియాపదము అలంబించెదన్ అనియైనది. మూలమువలెనే అనువాదమును

విడివిడిపదము లతో హృద్యముగా లాలిత్యమును సంతరించుకొన్నది. ఈ లాలిత్యగుణ ము నకును గుణము గానే లలితంపుంజరణాబ్జ మని అనువదింపబడినది. 'స్మృతౌ శాస్త్ర వైద్యేశకున కవితాగాన ఫణితౌ పురాణే మంత్రే వాస్తుతి నటన హాస్యేషు' అని మూలమున నుండగా బలిజేపల్లి ఏకైక సమాసమున స్మృతి శాస్త్ర స్తుతి గాన కవితా నృత్యాది తంత్రంబులన్ అని మత్తేభవృత్తమున అనువదించెను. 'అచతురః' అనుదానికి 'చతురత్వము నెఱుంగ' అని అనువాదము 'కథంరాజ్ఞాం ప్రీతిః భవతిమయి' అనువాక్యమునకు 'నన్ను నృపులే చందాన ప్రేమిం తురో' అనిఅనువాదము. ప్రథితకృపయా పాలయ అనునది 'కృపావైభవోన్నతి పాలింప గదయ్యా' అని వివరింప బడినది. 'పశుపతే సర్వజ్ఞ, విభో, ప్రథిత' అని మూలమున నాలుగు సంబోధనలు గలవు. కాని తెనుగున పతి సర్వజ్ఞ, శ్రుతి ప్రదా శ్రీ పశుపతీ, జ్ఞాన ప్రసన్నాకృతీ! అని మూలమునలేని సంబోధనలు కొన్ని చేర్చబడినవి. జ్ఞాన ప్రసన్నాకృతీ అను తురీయవిశేషణ మున జ్ఞాన ప్రసూనాంబ సూచితము. ఇట్టి సూచనను పురస్కరించుకొని ఈకవి కాళహస్తి యందు కొంత కాలము వసించి జ్ఞాన ప్రసూనాంబాసహిత పరమేశ్వరుని దర్శించి ఉండుననుట స్పష్టము.

'ఘటోవామృత్పిండోవా' - అను శ్లోకమును 'ఘటమో మృణ్మయ పిండమో' అను మత్తేభ వృత్తమున అనువదించెను. మూలమునందలి అణు రపి, ధూమోర్మి అచలః, పటోవా, తంతుర్వా అనునవి 'అణువులో గ్రావంబొ ధూమాగ్నులో పటమో దారమొ' అని అను వదింవబడినవి. ఇందు 'అచలః' అనుదానికి 'గ్రావంబొ' అని అనువాదము. 'ఘోర శమనః పరిహారతికిం' అను వాక్యము ఘోర కాలునిహరిం పంజాలునే అని అనువదింప బడినది. 'తర్కవచసా' అన్న ప్రయోగము అనువాదమున 'కటువక్రోద్ధృట తర్క వాద ములచే' అని సమాస భూయిష్ఠముగా కొంత విస్తరింప బడినది. తర్కవాదములకు ముందు పేర్కొన బడిన విశేషణములు తర్కదృష్టితోమిగుల అర్థవంతములు. కాని ఇవి శివ పరముగా వ్యర్థములు. అందుకే మూలకర్త 'వృథాకంఠ క్షోభం వహసి' అనుచున్నాడు. దీనినే అనువాద కర్త 'ఏటికి కంఠ శ్రమం బొందు?' అని ప్రశ్నించు చున్నాడు. అంతటితో ఆగక 'ఇంతట నైనన్ సుఖియింపుమా' అను స్వతంత్ర ప్రయోగము ప్రస్తుత పద్యమునకు ఎంతో మాధుర్యమును, సొకు మార్య మును, దీప్తిని, ప్రసన్నతను కలిగించు చున్నది. పరమసౌఖ్యంవ్రజ అన్నది శ్లోకాంతము. ఇది 'సన్మతీ' అన్న పద్యాంతముగా ప్రతిపాదితమైనది. 'తరసా పరమ సౌఖ్యం వ్రజ' లోని తరసాఅను దానికి అనువాదకుడు 'ఇంతటనైనన్' అని ఎంతో స్వతంత్రతా స్ఫూర్తిగా ఔచిత్య వంతమగు ప్రయోగము గావించి ప్రస్తుత పద్యమునకు వినూత్నతను ప్రసాదించినాడు.

'మనస్తే పాదాబ్జే నివసతు' - అను శ్లోకమునకు 'నీపాదాబ్జములన్ మనంబు' అను శార్దూల విక్రీడితముఅనువాదము. మూలము నందలి 'నివసతు' అనుక్రియాపదము అనేక వాక్యములకు అనుబంధప్రాయము. అనువాదము నందు 'నివసింప' అను ఈ క్రియ అన్వ య ప్రాయ ములైన అన్ని వాక్యములయనంతరము ప్రయుక్తము. వచః స్తోత్ర ఫణితౌ అనుదానికి 'నిన్నాడగ వాక్కులున్', 'అభ్యర్చాయాం కరశ్చ' అనుదానికి నీపూజావిధి యందు హస్త మనియు, 'శ్రుతిరపి కథా కర్ణన విధౌ' అనుదానికి 'చెవుల్ నీ సత్కథా కర్ణనా వ్యాపారంబున' అనియు, 'తవధ్యానే బుద్ధిః' అనుదానికి 'బుద్ధి సంతత భవ ద్ధ్యానంబునన్' అనియు, 'నయన యుగళం మూర్తి విభవే' అనుదానికి 'దృష్టి నీరూపశ్రీ' అనియు 'త్వైర్వాపర గ్రంథాన్ జానే' అనుదానికి 'ఎట్లెరుగ నేర్తున్ త్వత్పర గ్రంథములో' అనియు అనువాదము. మూలమున 'పరమశివ, పరంహాతః' అను ప్రయోగములున్నవి. వీనికి అనువాదములేదు. వ్యర్థ పద మొక్క టియు లేక ప్రస్తుత పద్యము చక్కగా అనూదితమైనది. తవధ్యానే అనుచోట 'సంతత భవద్ధ్యా

నము' అని సంతత శబ్దము అధికముగా చేర్చబడినది. నయనయుగళం అను ప్రయోగమునకు దృష్టి అని మాత్రమే అనువాదము. ఇందు రెండు కన్నులు చేయు వ్యాపారమును గ్రహింపవలెను. మూర్తివిభవే అను ప్రయోగమునకు 'రూపశ్రీ' అన్నది చక్కని పర్యాయపద రూపకానువాదము.

'గభీరే కాసారే' అనుశ్లోక భావమును బలిజేపల్లి **ఊరక సంచరించు విజనో** గ్రపుగానలఁ గోనలన్ అను ఉత్పలమాలావృత్తమమున నిబంధించిరి. శంకరుడు పేర్కొన్న చేతస్సరసిజమునకు అనుగుణముగా ఛందస్సును సాభిప్రాయగర్భితమగునట్లు ఉత్పలమాల గ్రహింపబడినది. లక్ష్మీకాంతకవి ఛందశ్శిల్ప మర్మజ్ఞత కిది యొక చక్కని నిదర్శనము. గభీర కాసారము, విజన ఘోర విపినము, విశాల శైలము లందు జడమతి కుసుమార్థమై భ్రమించు చున్నాడు. అని మూలము నందలి రెండు పాదముల భావము. దీనిని లక్ష్మీకాంత కవి **ఊరక** సంచరించు విజనోగ్రపుఁ గానలఁ గోనలన్ సరో వారములందు నీకు ప్రసవంబుల దేరజడుండు' అని అనువదించెను. విజనే ఘోర విపినే అనుదానికి విజనోగ్రపు కానల అనియు విశాల శైలేచ అనుదానిని కోనలన్ అని ప్రయోగించెను. గభీరేకాసారే అనునది సరోవరములందనియు భ్రమతి అను క్రియాపదమును '**ఊరక సంచరించు**' అనియు పేర్కొనెను. ఈ క్రియా పద సహిత ప్రయోగమునే పద్యపుటెత్తుగడగా గ్రహించుట యిందలి విశిష్టత. ఉమా నాథ! అను సంబోధనమునకు '**భవానీ రమణీ మనోహరా!**' అని ఆంధ్రీకరణము. '**అవస్థాతుం**' అనుదానిని '**వినిశ్చలుడై**' అనియు '**ఇహ**' అనుదానిని '**ఇటనుండియే**' అని బలిజేపల్లి ప్రయోగించెను. ఏకం చేత స్సరసిజం సమర్ప్య అనుమూలమునకు 'మన స్సారసమొండు నీకొసగు' అని తెనుగు సేత. '**సుఖేన అవస్థాతుః నజానాతి**' అనుదానికి '**సౌఖ్యపు దారి ఎఱుంగడే కదా**' అని అనువాదము. కాని యిందు దారి అనుదానికి మూలము లేదు. సుఖముతో నిశ్చలుడై ఉండుట ఎరుగడు అని మూలశ్లోక భావము. ఇందలి వినిశ్చలుడై అనుదానిని అనువాద కర్త పూర్వ పాదమునందే ప్రయోగించుటచే పద్యాంతమును '**సౌఖ్యపు** దారి ఎరుంగడే' అని కొంత స్వతంత్ర పద్ధతితో విస్తరించెను.

'**యథా బుద్ధి శ్శుక్తౌ రజతమితి**' అను శ్లోకమునకు '**నిను నీశున్ మదిదా** నెఱుంగక' అను మత్తేభము తెనుగు సేత. శ్లోకము నందలి తుది పాదమగు '**మహా దేవేశ! త్వాం మనసిచ నమత్వా పశుపతే!**' అనునది అనువాదమున ప్రథమ పాదమున ఉన్నది. మూలమున మూడవ పాదము '**తథాదేవ భ్రాంత్యా భజతి భవదనయం జడజనః**' అని ఉన్నది. దీనిని బలిజేపల్లి ఎవ్వనినో అన్యు భజించు మూఢమతి దేవ భ్రాంతి లోకేశ్వరా! అని అనువదించెను. కాని అనువాదమున నీరంబని ఎండమావులను భ్రాంత్యా ధీనుడౌరీతి దేవ భ్రాంతి అని రెండుమార్లు ఆంధ్రీకర్త భ్రాంతి శబ్దమును పేర్కొని భ్రాంతికి కల బలమును నొక్కివక్కాణించెను. మూలమున గల దేవ భ్రాంతి శబ్దము యథాతథముగా గ్రహింపబడినది.

'నరత్వం, దేవత్వం నగవన మృగత్వం **మశకతా**' అనుశిఖరిణీ వృత్తము నరసుర శైలకీటక వనద్విజ గో మృగతాదిజన్మముల్ అను చంపకమాలా వృత్తమున అనూదితమైనది. '**త్వాత్పాదాబ్జ స్మరణ పరమానంద లహరీ విహారాసక్తం**' అనుమూలమున గల సమాసము భవత్పద పంకజసేవనా సుఖోత్తర లహరీ విహార విహితంబు అని అనువదింపబడినది. **కీర్తి చేసివపుషా** అను ప్రయోగము శరీరములతో పని యేమి? అని చక్కగా అనువదింపబడినది. ఒకటికి రెండు పాదములలో పేర్కొన బడిన విభిన్న జన్మలు అనువాదమున ఒకే పాదమునందు ప్రయుక్తము. కాని మూలమున గల మశకతా శబ్దమునకు అనువాదములేదు. పశుత్వం అనుదానికి అనువాదకర్త 'గో' అని పేర్కొనెను. విహగత్వమునకు ద్విజ అను పర్యాయ పదమును వాడెను.

అనువాదమున భవాబ్ధి పోతమా! అను సంబోధనము అర్థవంతము. దీనికి మూలము లేదు. నిరూఢ వృత్తియే దొరకినన్ అను ప్రయోగము మూలమునకు భిన్నము.

'**వటు ర్వాగేహీవా యతిరపి జటీవా తదితరో**' అను శ్లోకమునకు వడుగో గేహియొ జోగియో జటియొ యెవ్వండో యొకండు అను మత్తేభమాంధ్రీకరణము. మూలము నందువలె అనువాదమునందును క్రమము పాటింపబడినది. '**యఃకశ్చిద్భవతు కింతేన భవతి**' అనుదీనికి '**ఏటికా గొడవ**' అని చక్కని తెనుగుసేతమూలప్రయోగమునకు '**ఎవడో ఒకడు అవుగాక దాని వలన ఏమి**' అనిఅర్థము యదీయం హృత్పద్మం యది భవదధీనం తదీయస్త్వం అను భావమును ఎవ్వాని మనస్సరోరుహము నీకుం బ్రాప్తమై వాని నెయ్యుడవై యుండుటె అని బలిజేపల్లి అను వదించెను ఎవని హృత్పద్మము నీ ఆధీన మగునో అతనికి సంబంధించిన వాడవు నీవు అని మూలము భావము. ఈ భావమునే అనువాదకర్త మరికొంత అర్థవంతముగా మార్చెను. '**భవ భారంచవహసి**' అను శ్లోకము యొక్క తుదిపాదమును ఆంధ్రీకర్త మరికొంత విస్తరించి ఇంకను తదీయోదగ్రసంసారవుంభెడదన్ నీవె భరింతువయ్య అని వివరించెను. మూలమునకే వలము భవభారమని మాత్రమే కలదు. ఇక రెండు, మూడు, నాలుగు పాదములలో '**భవ! పశుపతే! శంభో!**' అను సంబోధనములున్నవి. అనువాదకర్త వానికి మారుగా కరుణాబ్ధీ! సర్వభూతేశ్వరా! అని పద్యాంతమున అర్థవంతముగ రెండు సముచిత సంబోధనలను ప్రయోగించెను.

'**గుహాయాంగేహేవా బహిరపి వనే వాద్రి శిఖరో**' అను శ్లోకమునకు గిరికూటంబున చిచ్చునన్ అను పద్యము అనువాదము. మూలమున గుహ గేహము, బాహ్య ప్రదేశము, వనము అదిశిఖరము, జలము, వహ్ని పేర్కొన బడినవి. అనువాదమున గిరికూటము చిచ్చు, వన, గుహో గేహము నీళ్ళు మాత్రమే గ్రహింపబడినవి. బహిః ప్రదేశము మొదలగు వానికి ఎందేని వసించుగాక! అని సూచన కించఫలం అను దానికి '**ఫలమౌనా అంత మాత్రంనన్**' అని అనువాదము. '**సదా యస్యైవాంతః కరణం, తవ పదేస్థితంచేత్ యోగః**' అని మూలము '**నిరతంబెవ్వని అంతరింద్రియముగానీ తత్పద న్యస్తమై తిరమై యుండుటె యోగము**' అనితెనిగింపు '**సచపరమ యోగీచ ససుఖీ**' అనుదానికి ఆతండే యోగియున్ భోగియున్ అని ఆంధ్రీకరణము. మూలమునమూడవ పాదమున శంభో! అని సంబోధనము కలదు. కాని అనువాదమున కపర్దీ అని చతుర్థ పాదాంతమున యతి స్థానమునందు ప్రయుక్తమైనది.

'**అసారే సంసారే నిజభజన దూరే**' అను శ్లోకము సారంలేమియులేక త్వదర్థజన వాంఛాదూరమౌ అను శార్దూలమున అనూదితమైనది. జడధియు అనుటకుఅనువాదములేదు. భ్రమంతం మామంధం పరమకృపయాపాతుముచితం అనుశ్లోక ద్వితీయ పాదము '**భ్రమించు నంధుని ననున్ మన్నింప జెల్లున్ కృపన్**' అనిభాషాంతరీ కరణము మదన్యః కోదీనః తవ కృపణరక్షాతి నిపుణ నాకంటె నీకు అన్యుడైన దీను డెవ్వడు అని ఈ వాక్యమునకు అర్థము. కాని దీనికి పేరేనీకికనన్నువంటి కృపణుల్ నీకంటె దీవావన ప్రారంభుల్ అని అనువాదము. త్వదన్యః కోవామే త్రిజగతి శరణ్యః అను ప్రయోగమునకు త్రిజగంబులన్మను పువారల్ నాకు లేరు అని తెనుగుసేత. శ్లోకాంతమున గల పశువతీ అను సంబోధన ఈశ్వరా! అని పద్యాంతమైనది. మూలము నందలి భావమునకు లేశమైనను లోపము లేకుండ తెనుగు దనముట్టి పడునట్లు స్వతంత్రరచనవలె అనువాదము సాగినది.

'**ప్రభుస్త్వం దీనానాం ఖలు పరమ బంధుః పశువతే**' అనుశ్లోకమునకు '**అపద్బందుండవౌ ప్రభుండవుగదా**' అను పద్యము ఆంధ్రీకరణము. '**ప్రాముఖ్యోహంతేషామ కిమత బంధుత్వ మనయోః**' అనువాక్యమునకు ఆలాటి

ఆపన్నులందే ప్రాముఖ్యుడనౌటచే మనకు దండ్రీ! బంధు భావంబు పేఱే పల్కంబన లేదు అని ఎంతో హృదయ స్పర్శిగ అనువాదము సాగినది. తేషాం అను మూలశబ్దమునకు ఆలాంటి ఆపన్నులందు అని వివరణ. తండ్రీ అని విశ్రామస్థానమున పేర్కొనుటచే మూలమునలేని దీప్తిభావ ప్రకటనలో ఎంతో స్ఫూర్తితో వ్యక్తమైనది. త్వమైవ శంతవ్యాః శివమవరాధాశ్చ సకలాః ప్రయత్నాత్ కర్తవ్యం మదవనం అని రెండు పాదములలో పేర్కొనబడిన భావము తెనుగున అలతి అలతి పదములలో అర్థ గాంభీర్యముతో శివ నీవేసైచి నానేరముల్ కాపాండందగు సెట్లులైన అని తెనిగింపు. ఇయంబంధు సరణిః అను దానికి ఇదియేగా బంధు మార్గంబనన్ అని అనువాదము. అలతి అలతి పదములతో ఎంతటి మహోర్థమునైనను తెనుగున సులువుగ వివరించుటకు వీలగునన్న పరమ సత్యము ప్రస్తుతాంధ్రీకరణమున చక్కగా ప్రదర్శితమైనది.

విరించి ర్దీర్ఘాయుర్భవతు భవతాం అను శ్లోకమునకు భువి దైన్యంబు లిఖించు నాతని శిరంబుల్ అను పద్యమనువాదము. సఖలు భువి దైన్యం లిఖితవాన్ అని రెండవ పాదాంతమున గల ప్రయోగము, ప్రస్తుత పద్యమున పాదారంభమైనది. భవతా! తత్పరశిరశ్చతుష్కం సంరక్ష్యం అను ప్రథమ పాదాంత ద్వితీయ పాదారంభము లందలి ప్రయోగము శిరంబుల్నాలుగే నిలిపి శ్రీశివ అన ఎంతో అర్థవంతముగా చిన్న ప్రయోగములో శివ సంబోధన పరముగఅనువాద కర్త నిబంధించెను. విచారః కోవామాం అను ప్రయోగము నాకు కానంత దాన విచారంబ యేల అని అనువదింపబడెను. కృపయా పాతితే కటాక్ష వ్యాపారః స్వయమపిచ దీనావన పరః అను మూలమున గల భావము దీన త్రాణ పారీణమా భవదీయోరు కటాక్ష పుం బ్రకృతియే పాలింప తానైనను అని ఆంధ్రీకరింపబడినది. స్వయమపి అను దానికి తానై అని చక్కని తెనిగింపువద్యాంత మున నిష్కర్షను నివేదించుచు ప్రయోగింపబడినది. కటాక్షపుం బ్రకృతియే లోని ప్రకృతియే కవిచే స్వయము గా కల్పింపబడినది. ఇందలి ఏవార్థకము వలన పద్యమునందెంతో అర్థగాంభీర్య మేర్పడినది. మూలమున శివ అని మాత్రమే కలదు. ఇందలి శ్రీకారము కవి కల్పితము.

'ఉపేక్షా నోచేత్కిన్న హరసి అను శిఖరిణీ వృత్తమునకు' నను రక్షింపనుపేక్షయే కలుగకున్నన్ అను మత్తేభ వృత్తము తెనుగు సేత. భవద్ధ్యాన విముఖాం దురాశా భూయిష్ఠాం విధి లిపిం అను ప్రయోగమునకు 'అత్యాశలన్ నినుధ్యానింపగ నీని బ్రహ్మలిపిసేనిన్' అని అనువాదము. కింనహరసి అను క్రియాపదము 'మార్పవే' అని మారినది. 'అశక్తో యది' అనుదానికి చేతగాదనిన అని తెనుగుసేత. వైధాత్రం, సువృత్తం శిరః అను ప్రయోగమును 'ధృ డతరంబౌ నల్వమోము' అని బలిజేపల్లి ఆంధ్రీకరించెను. కేవలము శిరమని యనక మోము అని పేర్కొనుట ఎంతో అర్థవంతము. 'కరనఖ ముఖే నైవ లులితం' అను శ్లోకాంతమందలి వాక్యమును స్వనఖాగ్రంబున గిల్లినాడవు అని ప్రయోగించెను. మూలమున నిర్యత్నం అను పదమును యథా తథముగా నిర్యత్నతన్ అని ప్రయోగించెను. పశువతే అను సంబోధన మహేశా అని నాల్గవ పాదమున యతి స్థానమున కూర్చబడినది.

'ఫలాద్వాపుణ్యానాం' అను శ్లోకమునకు 'మామకపూర్వపుణ్య మహిమంబున' అను పద్యము అనువాదము. ప్రస్తుత శ్లోకమున విభోపుణ్యానాం ఫలాద్వా స్వామిన్ కరుణ యావామయిత్వయి ప్రసన్నేపి అను భావమును మామకపూర్వ పుణ్య మహిమంబునసో భవదీయ సైజపు బ్రేమునినో ప్రసన్నతను నేవహియించితి అని బలిజేపల్లి అనువదించిరి. భవదమల పాదాబ్జయుగళం కథం పశ్యేయం అను వాక్యము ఎట్టులో స్వామి త్వదీయ పాదవనజంబుల గాంతును అని అనువదింపబడినది. ఇచ్చట కవి పద్య భావమున కనుగుణముగా ఉత్పలమాల ప్రయోగించుట ఔచిత్యవంతముగా ఉన్నది. నమస్సం భ్రమజుషా నీలింపానాంశ్రేణిర్నిజ

కనక మాణిక్యమకు టై: మాం స్థగయతి అను వాక్యమునకు వందమాన నానామర హేమ రత్న మకుటావళి నాకను గప్పుచుండగన్ అని ఏకైక సమాసము నందు చక్కగా సంఘటించెను. మాంస్థగయతిని నాకనుగప్పుచుండగన్ అని తెనిగించెను నమసస్సంభ్రమజుషాం అను సమాసమునందలి అర్థమంతటిని వందమాన అను ప్రయోగమున నిక్షిప్తమొనరించి దానిని మరియొక సమాసముతో అను సంధించెను స్వామిన్ అను సంబోదనము అనువాదము నందును మూడవ పాద ప్రారంభమున ప్రయుక్తమైనది. విభో అను సంబోధన అనూదితము కాలేదు.

'త్వమేకో లోకానాం పరమ ఫలదో' అను శ్లోకమునకు 'అరయన్ నీవొకరుండవె' అను మత్తేభము అనువాదము. లోకానాం పరమ ఫలదః త్వం ఏకః అనుదానికి 'అరయన్ నీ వొకరుండవె జనుల కామార్థ్యంబులన్ దీర్ప' అనియు 'హరి ముఖాఃత్వన్మూలాం దివ్య పదవీం వహంతః' అనుదానికి ఆ హరి ధాత్రాదులు నీవె మూలమగు దివ్య స్థానముల్ పొందియున్ అనియు 'కియద్వాదాక్షిణ్యం తవ' అను వాక్యమును 'నీ కరుణ యే మాత్రంబో' అనియు 'మదాశాచకియతీ కదావామద్రక్షాం వహసి' అను ప్రయోగములకు నాయానకే పరిమాణంబొ యెఱుంగ బ్రోతు అనియు 'కరుణాపూరితదృశా' అను ప్రయోగమునకు 'సత్కృపా దృష్టులన్' అనియు అనువాదము సాగినది. 'అరయన్' అని ఆరంభమైన ఏతదను వాదమున ఎచ్చటను వ్యర్థపదములు లేవు ఎత్తు గడ 'అరయిన్' ఒక విశిష్టార్థమున కల్పింప బడినది. 'పరమ పలదః' అని పరమేశ్వర పరముగా నున్న ప్రయోగము కామ్యార్థంబులన్ దీర్ప అని బహువచన పరముగా ప్రయుక్తమైనది. 'త్వన్మూలాం, దివ్య పదవీం' అని ఏక వచనాంతముగా నున్న మూల ప్రయోగములకు 'నీవె మూలమగు దివ్య స్థానముల్' అని బహువచనము. ప్రయుక్తమైనది. దాక్షిణ్యము కరుణగా పేర్కొనబడినది. కిమితీ పదమునకు పరిమాణమును కవి కల్పించెను. శ్లోకాంత మందలి పాదమునకు 'నాయొక్క సంరక్షణమును ఎన్నడు వహింతువో' అని అర్థము. కాని దీనిలోని భావము నంతటిని 'బ్రోతునను' అను రెండు అచ్చతెనుగు పదములలో చక్కగా వక్కాణించినాడు. భావము యథాతథముగా పరివర్తింపబడినను బలిజేపల్లి తాను ఎన్నుకొన్న మత్తేభవృత్తమునకు తగిన పదజాలము కొంత వినూత్నతను సంతరింపజేసినది.

'దురాశా భూయిష్టే' అను శ్లోకమునకు 'దురితాలంబము దుఃఖమూలము' అను పద్యము అనువాదము మూలమున ఒకటికి రెండు పాదములలో సంసారమునకు సంబంధించిన విశేషణములు ప్రయోగింపబడినవి. అనువాదకర్తయు మొదటి రెండు పాదములలో విశేషణములను పేర్కొని మూడవ పాదారంభమున 'ఉరు సంసారములోని' అని ప్రయోగించినాడు. మూలమునందలి విశేషణముల క్రమము అనువాదమున ముందు వెనుకలైనవి. మూలమున 'దురితనిలయే' అను విశేషణము ఉపాంతమున ఉన్నది. కాని అనువాదకర్తలై ఆ విశేషణమునే 'దురితాలంబ' మని పేర్కొని పద్యమును ప్రారంభించెన. అట్లుపై నున్న 'దుఃఖజనకే' అన్న విశేషణము మూలమున కడపటిది. అది అను వాదమున రెండవ విశేషణమైనది. దురుద్యోగంబు అన్న పద్యమునందలి మూడవ విశేషణమునకు 'దురాశే భూయిష్టే' అన్నది మూలము. 'దురంతే' అన్న మూలమునకు 'అనంతంబు' అనునది అనువాదము. దురధిప గృహ ద్వారమటకే అన్న ప్రయోగమునకు 'దురధిపద్వారాను సలధానమౌ' అని ఆంధ్రీకరణము. మూలమున గల గృహ శబ్దము అనువాదమున లేకున్నను అది ద్వారమను శబ్దమును బట్టియే గ్రాహ్యము. 'ఘటకే' అను పదమునకు అను సంధానమన్నది అర్థవంతమైన అను సరణ మదాయాసంకింనవ్యపనయసి కస్యోపకృతయే అను మూడవ పాదమునందలి భావమునంతటిని నాపెతల బ్రహ్మకె మాన్పవేన్ అని అలతి అలతి పదములతో

ఎంతో అర్థ స్ఫూర్తి కలుగునట్లు అనువదించెను. [2]"మూలమున గల కస్య అను శబ్దమునకు ఎవని యొక్క అను అర్థము స్ఫురించును. 'కః' అను ఏకాక్షర శబ్దమునకు బ్రహ్మ అను అర్థము కలదన్న భావము వెంటనే స్ఫురింపదు. కాని అనువాదమున బ్రహ్మకై అని కవి విస్పష్టమొనర్చెను. '**ఇయం ప్రీతి శ్చేత్తవఖలు కృకృతార్థావయమపి**' అను పాదమునకు ఈ ప్రీతి నీకు కలిగినచో మేము కృతార్థులమే గదా అని భావము,. దీనినే అనువాదకర్త నాల్గవపాదము నందు స్థిర తద్భక్త పరత్వమే మము కృతార్థీ భూతులం జేయదే అని అనువదించెను. మూలమునందలి ప్రీతి అన్న పదమును బలిజేపల్లి స్థిర తద్భక్త పరత్వమే అని సమాన గతముగా వివరించెను".

'సదా మోహాటవ్యాంచరతి' అను శ్లోకమునకు '**వలపుంగానల సంచరించు**' అను పద్యము అనువాదము. '**మోహాటవ్యాం చరతి**' అనుదానికి వలపుంగానల సంచరించు అనియు యువతీనాం కుచగిరౌనటతి అనునది యువతీ వక్షోజ దుర్గంబులన్ సలుపున్నాట్యము. అనియు '**ఆశా శాఖా స్వటతి**' ని '**దుముకు నాశా శాఖలందు**' అనియు '**ఝుడితి స్వైరం అభితః**' (అటతి) అను మూలమును, ఏల్లచో జెలగున్ స్వేచ్ఛ గ అనియు '**అత్యంత చపలం మేహదయ కపిం**' అనునది చంచలం బయిన మచ్చిత్తంపు బెంగ్రోతి అని అనూదితము ఇట మోహము వలపుగా కవి తెనిగించెను. కుచగిరౌ అన్నది పర్వతము లందలి దుర్గములకు అన్వయము సదా అనుదానికి నిచ్చలున్ అని తెనిగింపు, స్వైరం, ఝుడితి, అభితః లోని ఝుడితికి అనువాదములేదు. స్వేచ్ఛగఎల్లచో జెలగు  అనుటలో ఝుడితిం సూచితము మూలమున చివర దృఢం భక్త్యా బద్ధ్వాశివ! భవదదీనం కురువిభో అనుదానిని నిస్తుల భక్తిచ్ఛల సూత్ర బంధమునభిక్షూ! దాని బంధింపుమీ అను వాక్యమున రస బంధురము గా శబ్దాలంకార భరిత  సమాసపదగత సుందరముగాబలిజేపల్లి నిబంధించెను మూలమున కపాలిన్, భిక్షూ, శివ, విభో అని తుది రెండు పాదములలో నాలుగు సంబోధనములున్నవి, కాని అనువాదమున భిక్షూ! అన్న ఒకేఒక సంబోధన నాల్గవ పాదము యతి స్థానమున అర్థవంతముగా కూర్చబడినది. మూలమునందలి నాల్గవ పాదమునకు దృఢముగా భక్తితో బంధించి నీ ఆధీనము కావించుకొనుమని అర్థము కాని దీనినిఅనువాదకర్త దృఢమునకు మారు నిస్తుల అనియు కేవలము భక్తి అనక భక్తిచ్ఛల సూత్ర బంధమనియు పేర్కొని భిక్షువై దీనిని బంధించితన్ను రక్షింపుమని అర్థించు చున్నాడు. కోతుల నాడించు కొందరు భిక్షువులు దానిని తమ ఆధీనము చేసికొని తాము చెప్పునట్లుగా అది ఆడునట్లు చేయుదురు. ఇక్కడ పరమేశ్వరుడును భిక్షువుగ సంబోదింపబడుటచే నిది ఎంతో అర్థవంతము వ్యర్థపదమొక్కటియు లేక రసస్ఫూర్తి కల అర్థవ్రచన గావించుటలో బలిజేపల్లి సిద్ధహస్తుడు.

'**ధృతిస్తంభాధారాం**' శ్లోకమునకు '**ధృతియన్గంబమె**' అనునది అనువాదము. ఇందలి మచ్చేత స్ఫుట పట కుటీం అనుదానికి విశేషణములెన్నో కలవు. ఈ విశేషణము లన్నియుచాల వరకు మూలమునే అను సరించినవి ధృడగుణ నిబద్ధాం అన్నది ధృఢగుణాప్తిం బొల్చి అనియు '**ప్రతి దివసన్మార్గ ఘటితాం**' అనునది సత్పథ గామియై అనియు అనూదితము "**శక్త్యా సహశివ గణై స్సేవిత**" అనుదానికి గౌరితో గూడ గణ శ్రేణితోన్ అని భాషాంతరీ కరణము. పటకుటీం అనునది. '**పట మందిర మని**' ప్రయుక్తము. స్మరారే! స్వామిన్! విభో! అనువానిలో స్వామిన్ తప్పతక్కినవి '**స్మరారీ జగన్నాథా**' అని అనువదింపబడినవి. సంతత మానందమునన్ వసింపవె అను ప్రయోగము మూలాతిరిక్తము. జయ అను నది మూలమున క్రియా పదము. దీనిని కవి వసింపవె అని ఆంధ్రీకరించెను. శ్లేషార్థ సమన్విత విశేషణములు అనువాదమున చక్కగా నిబంధింపబడినవి. మనస్సునకు స్ఫుటపటకుటికి అన్వయించు శ్లేషార్థములు గల విశేషణములు మూలమందువలెనే అనువాదమునందును అను సరింపబడినవి.

'ప్రలోభాద్ద్యై' అను శ్లోకమునకు **'అకటా యేగతి నే సహించెద'** అనుపద్య మనువాదము. ప్రస్తుత పద్యారంభము మూలమున మూడవ పాద మధ్యమున గల **'కథమిహసహే'** అను వాక్యమునందలి భావమును అనుసరించినది. అకటా! అను ఆశ్చర్యార్థమునకు అనుగుణముగా వెంటనే **'ఏగతినే సహించెద'** అనుట ఎంతో అర్థవంతము, రసస్ఫోరకము, ఔచిత్యదాయకము. పద్యపు టెత్తుగడయె పద్య భావము నంతటిని ఏకోన్ముఖముగ ఆకర్షించు ఆయువు పట్టు. ఇక తక్కిన భావమంతయు అది ఎట్లో అన్నదానికి వివరణ ప్రలోభాద్ద్యైః అనుటకు అను వాదము లేదు. **'అర్థాహరణ పరతంత్రో ధనిగృహే ప్రవేశోద్యుక్తస్సన్ బహుదా భ్రమతి'** అను వాక్యమునందలి భావము ద్రవ్యాహరణ ప్రవృత్తి ధనియింటన్ గన్నపెట్టంగ నూరక **తారాడుచు నున్నవాడు** అని వివరింపబడినది. మూలము ప్రవేశించుటకు ఉద్యుక్తడగుచు అనేక విధముల తిరుగుచున్నాడు అని మాత్రమే అర్థము. కాని దీనిని అనువాదకర్తకన్నము చేయుటకై అనగా అపహరించుటకై **తారాడు** చున్నట్లుగ పేర్కొనెను 'భ్రమతి' అను సంస్కృత పదము నకు **తారాడుచు నున్నవాడు** అను తెనుగు సేత ఎంతో ఒద్దికగానున్నది. కేవలము ఎంతో వాడుకలో నున్న అచ్చ తెనుగు పదములతో అర్థగాంభీర్యముట్టి పడునట్లు రచన చేయగల స్ఫూర్తి కవికి వెన్నతో పెట్టిన విద్య. **'ఇమం చేతశ్చోరం తవాధీ నం కృత్వా'** అన్నది అతనిచేరం దీసి బంధించి అని యైనది. ఇట అతని అను సర్వ నామమునకు ముందు **'నామనశ్చోరుడు'** అని ప్రథమ పాదాంతమున ప్రయుక్తము. అధీనుని చేసి అని మాత్రమే మూలము. కాని బలిజేపల్లి **'చేరందీసి బంధించి'** అను చున్నాడు. వాడు చోరుడు. ద్రవ్యమును అపహరించుకై ఊరక తారాడుచున్నాడు దొంగిలించిన పిదపగదా బంధించుట అని అతని యెడ ఉపేక్ష వహించుట తగదు వాని ప్రవృత్తియే ద్రవ్యాపహరణ పరతంత్రము నీవు తస్కర నాథుడవు కావున దొంగను బంధించుట నీకు సులువు అని సూచన! మయి నిరపరాధేకురు కృపాం అన్న దానికి నన్ని రపరాధింజేసి రక్షించుమా అని ఆంధ్రీకరణ. అకటా అని ఎత్తుగడతో ప్రారంభించిన బలిజేపల్లి ఓడక, ఊరక, ఒద్దికయై అని తెలుగు పలుకు బడి పదములు కూర్చి అర్థవంతమొనర్చెను.

'కరోమి త్వత్పూజాం' శ్లోకమునకు **'ధ్యానింతున్ నిను తత్ఫలంబుగను'** అను శార్దూలము అనువాదము. మూలమున పూజ అని ఉండగా ధ్యానింతున్ అని కియా పదముతో పద్యమును ఆరంభించుట మూలము కంటె మరి కొంత అర్థవంతము. మూలమున సాధారణ భక్తి సూచింపబడగా నిందు ధ్యాన యోగము ప్రకటితమైనది. మూలమున ఒండవ పాదాంతమున గల **'తస్యాః ఫలం'** అనుదానిని బలిజేపల్లి **'తత్ఫలంబుగను'** అని ప్రథమ పాదారంభముననే పేర్కొనెను. విధిత్వం విష్ణుత్వం దిశ సిఖలు అను రెండవ పాదారంభ విషయము. **'బ్రహ్మత్వంబో విష్ణుత్వమో'** అని ప్రథమ పాదాంతముననే ప్రయుక్తము. **'సపది సుఖదో మేభవ'** అనుదానికి అనువాదము లేదు. **'పునశ్చత్వాం ద్రష్టుం దివి భువి వహన్ పక్షి మృగతామ్'** అను తృతీయ పాదము **'దివిన్ భువిన్ఖగ మృగా కారంబులన్ దాల్చి'** అని అనువదింపబడినది. ఇందలి **'పునశ్చ'** కు అనువాదము లేదు. ఖగమృగాకారములనుదాల్చిన బ్రహ్మ విష్ణులు పరమ శివుని తుది మొదలు చూడ లేక పోయిరి. ఇక తాను పరమ శివుని పూజా ఫలముగ బ్రహ్మత్వ విష్ణుత్వములను పొందినను పరమేశ్వరుని తుది మొదలు చూడలేని కారణమున ఖేదమే మిగులును. కావున పక్షి మృగ రూపములను మరల పొంది పరమేశ్వరుని చూడ లేక ఆదుఃఖమును ఎట్లు సహింపగలనో అను అర్థము వచ్చు విధమున బలిజేపల్లి మూలము నందలి ప్రధానోద్దేశమునకు భంగము కలుగ కుండ మరియొక పద్ధతిలో తుది రెండు పాదములను అనువదించెను. 'నిను గానం జాలని జాలిలో మునిగి

వేగం - జాలవేయేల నిత్యానందాను భవంబు నాకొసగుమయ్యా యయ్యభద్రప్రదా!' అను ఈరెండు పాదములు స్వతంత్రముగా సాగినవి. మూలమున చూడ లేక ఆఖేదమును ఎట్లు సహింపగలనో అనిమాత్రమే ఉన్నది. కాని మూలమున లేని దీప్తి అర్థ గౌరవము, వైరాగ్య పూర్ణమైన ఆత్మనివేదనము అచ్చ తెలుగు పలుకు బడుల హృదయమునకు ప్రగాఢముగ హత్తు కొనునట్లు చెప్పబడినది. ఖేదమునకు జాలిలో మునుగుటయు 'సహే' అనుదానికి వేగం జాలననియు చెప్పబడినవి. నిత్యానందాను భవము నాకొసగుమను అభ్యర్థన పూర్తిగా స్వతంత్రము. మూలమున విభో అను సంబోధన ప్రథమ, చతుర్థ పాదముల కడపట ప్రయుక్తము. మూలమున లేని భద్ర ప్రదా! అనుసంబోధనాంతము ఎంతో అర్థవంతము. ఔచిత్యవంతము. శంకర అన్న మూల సంబోధనలోని అర్థము నిత్యా నందాను భవమున నిరూపితము. అయ్యా యయ్య అని ఒకటికి రెండు మార్లు పేర్కొనుట ఆదరాతిశయమునకు సూచన.

'కదావా కైలాసే' శ్లోకమునకు **'అల కైలాస నగంబులో'** అనునది అనువాదము. కైలాసమునందు కనక మణి సౌధము పై ప్రమథ గణములతో కూడ శివుని ముందు వసించుచు తలవంచి అంజలి ఘటించి సాంబ, స్వామి, పరమ శివ రక్షింపుమని పలుకుచు ఎంతో సుఖముగా అనేక బ్రహ్మ కల్పములను క్షణము వలె ఎప్పుడు గడుపుదునో గదా అని శ్లోక తాత్పర్యము. ఇందలి భావమును మత్తేభము నందు పేర్కొనుచు **'అల వైకుంఠపురమ్ములో'** అన్న పోతన పద్యపు ఎత్తుగడను అనుసంధించుట ఎంతో హృద్యముగ ఉన్నది. మూలమున గల **'సహగణైః'** సద్భక్త గణంబుతో అనియు **'శంభో రగ్రే' 'శివపురో భాగంబునన్'** అనియు ప్రయోగించెను. స్ఫుట ఘటిత మూర్ధాంజలి పుటః అనుసమాసము శబ్దాలంకార భూయిష్టము. కాని దీనిని మోడ్పుగేలు అన్న చిన్న అచ్చ తెనుగు ప్రయోగములో బలిజేపల్లి పేర్కొనిరి. మూలమున మూడవ పాదమున గల ఐదు సంబోధనములలో సాంబ, శివ అనురెండింటిని మాత్రమేగ్రహించి పరాత్పర! మహేశా! అను మరి రెండు స్వతంత్ర సంబోధనములను కవి అనుసంధించెను. విధాతౄణాకల్పాన్ అన్నది **'బ్రహ్మ కల్పంబులన్'** అనియు **'క్షణమివ'** అన్నది **'క్షణంబిటు'** అనియు వినేష్యామి అనునది వెళ్లించెదను అనియు అనూదితము. [3]**"శ్లోకాంతమున 'సుఖతః'** కు 'ఇమ్ముల' అను అచ్చ తెలుగు ప్రయుక్తము. ఈ పదము పైకి పాద పూరణార్థముగకన్పట్టు నేమో గాని ఇది ఎంతో విరివి అయిన విస్పష్టమైన సమృద్ధమైన, ఆనుకూల్యమైన, యింపైన పదము. ఇమ్ముల లోని ములతో నాల్గవ పాదము ఆరంభమైనది. దీనికి అనుగుణముగా యతి స్థానమున **'సతంబు'** న అనివచ్చునట్లు మూలమున లేని పదమును ప్రయోగించెను".

**"స్తవైర్బ్రహ్మాదీనాం జయ జయ వచో భిర్నియమినాం"** శ్లోకమునకు **'పరమేష్ఠి ప్రముఖామరుల్'** అను మత్తేభము భాషాంతరీకరణము. బ్రహ్మాదీనాం స్తవైః నియమినాం జయజయ వచోభిః గణానాం కేళీభిః అను మూడు ప్రయోగములకు వరుసగాపరమేష్ఠి ప్రముఖామరుల్ నిలిచి కైవారంబు సేయంగ నీశ్వర సంఘంబులు జేయునన్ ప్రమథులిచ్చాకేళిఁదేలంగ అని అనువాదము. మదకల మహోక్షస్య కకుది అను వాక్యమునకు వర నందీశ్వరుపై అని ఆంధ్రీకరణము, మూలమునకల మద, కల, కకుది అనువానికి అనువాదము లేదు. కకుది అనుటకు మారుగపైన్ అని ప్రయోగించెను. నందీశ్వరునికి **వీవర** అనుశబ్దము విశేషణముగా ప్రయుక్తము. మూలమున పరమేశ్వరునుద్దేశించి నీల గ్రీవం, త్రిణయనం, ఉమాశ్లిష్టవపుషం, కరధృతమృగం, ఖండపరశుం అని విశేషణములున్నవి. వీనిలో త్రిణయనం, ఖండపరశుం అను విశేషణములకు అనువాదములేదు. ఉమాశ్లిష్ట వపుషం అన్నది ఉమా రమణితో భాసిల్లు అనియు 'నీల గ్రీవం **అన్నది నీల కంధరు'** అనియు, కరధృతమృగం అన్నది సారంగధరున్

అనియు పర్యాయపదములతో ప్రయుక్తమైనవి. కదాత్వాంపశ్యేయం అను వాక్యమునకు 'నినున్ గనుల సేనాడింపుమై గాంతునో' అను ప్రయోగము చక్కని చిక్కని అచ్చ తెనుగు పదముల అనుసరణ. మూల భావమునకు ఎచ్చట ప్రతి బంధకము కలుగ కుండ చెప్పిన పద్ధతిలో స్వతంత్రతా స్ఫూర్తి గల వైలక్షణ్యము ఎంతో వైచక్షణ్యముతో అభివర్ణితము.

'కదావాత్వాం దృష్ట్వా' అను శ్లోకము 'కనుగొంచున్ భవ దీయ భవ్య పదయుగ్మంబంటి' అను మత్తేభ వృత్తమున అనూదితము. 'తవ భవ్యాంఘ్రి యుగళం హస్తాభ్యాం గృహీత్వా' అనువాక్యమునకు 'భవదీయ భవ్య పద యుగ్మంబంటి చేదోయితో' అని అనువాదము. ఇట మూల ప్రయోగమే కొన్ని పర్యాయ పదముల మార్పు తో కూర్పబడినది. 'త్వాందృష్ట్వా' అనునది కనుగొంచున్ అని పద్యపు టెత్తుగడ. 'శిరసినయనే వక్షసివహన్' అనునది 'కనులందున్ దలయందు నక్కునను బక్కందాల్చి' అని అచ్చ తెలుగు పదములలో చక్కగా వక్కాణింపబడినది. 'సమాశ్లిష్య' అనుటకు వేకౌఁగిలించి అని తెనిగింపు. ఇట 'వే' కవి కల్పితము 'స్ఫుట జలజ గంధాన్ పరిమళాన్' ఒకే సమాసమున విస్ఫుట పద్మ గంధరు చిరశ్రీ సౌరభంబుగ అని కూర్పబడినది. స్ఫుటమునకు వి అను ఉపసర్గను జలజ శబ్దమునకు పద్మ అను పర్యాయపదమును, పరిమళ శబ్దమునకు సౌరభము దీనికి పూర్వము రుచిర అను విశేషణమును కూర్చిఅర్థవంతమైన చక్కని సమాసమును ప్రయోగించెను. 'ఆఘ్రాయ' అనుటకు ఆనుచున్ అని తెనిగింపు: బ్రహ్మాద్యైః అలభ్యాం ముదం అనుటకు నలువకైనన్ దుర్లభంబౌ సిరిన్ అనని అనువాదము, మూలమున ముదము అని ఉండగా బలిజేపల్లి సిరి అని మార్చిరి. ముదము అను పదము కన్న సిరి అను తెనుగు పదము విరివి గల అర్థమును తెలుపును. హృదయే కదావా అను భవిష్యామి అనుటకు మనమందెన్నడు గాంతునో అని అనువాదము. అనుభవింతును అన్న మూలము నందలి అర్థమును కాంతునో అన్న క్రియా పదము నందు ఆంధ్రీకర్త చక్కగా అనుసంధించెను. మూలమున 'గిరిశ' అను సంబోధన తప్ప తక్కిన ప్రయోగములందలి ప్రతిపదమును అనువాదకర్త అనుసరించి అందందు తెనుగునుడి కారమునకు తగిన పదము లను కూర్చి మూలమునందలి భావమునే ఎంతో మనోహరముగా రస స్ఫూర్తిగల శైలిలో అనువదించెను.

'కరస్థే హేమా ద్రౌగిరిశ' శ్లోకమునకు 'తలపన్ జేత బసిండికొండ' అను పద్యమనువాదము. ఇట తలపన్ అన్న పద్యపుటెత్తుగడ వ్యర్థ పదముగ కన్పింప వచ్చునేమో కాని ఇది పద్యమున కంతటికి ఒక వినూత్నమైన స్థానము ఎంతో సులువుగ అప్రయత్న స్ఫూర్తిగలపదములను ప్రయోగించుట కిది సాధనమైనది. హేమాద్రౌకరస్థే అనుదానికి చేత పసిండికొండ అని తెనుగు సేత. 'నికటస్థే దనపతౌ' అనుటకు 'సరసన్ ద్రవ్యాధ్యక్షుడున్' అని 'గృహస్థే స్వర్భూజామర భిచితామణి గణే' అనుటకు 'గీము ముందల మందార తరూల్లసత్సురభి చింతా రత్న సంతానముల్' శని అనువాదము. ఇందు గృహస్థే అనుదానికి గీము ముందల అని అచ్చ తెనుగు పదము ఎంతో అందముగ కూర్పబడినది. మూలనందువలెనే అను వాదమునందును సమాసగత సౌందర్యమును సంఘటింప సంకల్పించిన సత్కవీంద్రుడగు బలిజేపల్లి స్వర్భూజ అనుదానిని మందార తరు అనియు అమర సురభి అనుదానిని 'ఉల్ల సత్సురభి' అనియు 'చింతామణిగణే' అనుదానిని 'చింతారత్న సంతానముల్' అనియు చక్కగా సమాసీకరించెను. మూలమున మూడవ పాదమున గల 'శిరస్థే శీతాంశౌ' అను దానిని అనువాదమునందును మూడవ పాదమున 'తలపై బాల సుధాకరుండు' అని ప్రయోగించెను. మూలమున కేవలము శీతాంశుడు అనిమాత్రమే ఉన్నది. అనువాదమున

అట్లుకాక విశేషణమగు బాల శబ్దము సౌందర్య స్ఫోరకముగ పురాణ సమ్మతమైన వాస్తవికతకు అనుగుణముగ ప్రయోగింపబడెను. చరణ యుగళస్థే అఖిల శుభే అనునది 'చరణ ద్వంద్వంబునందెల్ల మంగళముల్' అని ఆంధ్రీకృతము. మూలమమున శివునికిగల విశేషణములన్నియు సతి సప్తమి లో నున్నవి. అనువాదకర్త ప్రథమావిభక్తి లో వానిని పేర్కొని తదను బంధముగ 'కల్గిన నీకు' అని ప్రయోగించిరి. మూలమున తుది పాదము 'కిమర్థం దాస్యేఽహం భవతు భవదర్థం మమ మనః' అని ఉన్నది. దీనికి ఏ యిష్టార్థమును నేను మీ కిత్తును. నామనస్సు నీకొఱకు అగుగాక అని అర్థము. ఈ రెండు వాక్యముల లోని భావమును బలిజేపల్లి 'నామనస్సు దక్కన్ లాతి ఏమిచ్చెదన్' అని ఏక వాక్యమునందే ఎంతో అర్థవంతముగ కుదించి సూక్ష్మములో మోక్షమువలె అల్ప శబ్దములలో అనల్పార్థతను అచ్చ తెనుగు కూర్పులో ప్రకటించెను.

'సారూప్యం తవ పూజనే శివ!' అను శార్దూలము 'సరవిన్ నీ పద పూజ చే స్తవముచే సారూప్య సామీప్యముల్' అను మత్తేభమునందు అనువదింపబడినది. ఈ 28 వ శ్లోకము నుండి 43 వరకు మూలమున శార్దూల విక్రీడితములున్నవి. బలిజేపల్లి ఇట మొదటి పాదము న క్రమాలంకారమును ప్రయోగించెను. దీనికి సారూప్యం తవ పూజనే మహాదేవేతి సంకీర్తనే సామీప్యం అని మూలము. శివ భక్తి ధుర్యజనతా సాంగత్య సంభాషణే సాలోక్యం అనుటకు 'సరసాత్మజ్ఞుల' సాహచర్య కలనన్ సాలోక్యసౌభాగ్యమున అని అనువాదము. మూలమున గల ఒకే సమాసమునకు 'సరసాత్మజ్ఞుల' అనియు 'సాంగత్య సంభాషణే' అనుటకు సాహచర్య కలనన్ అనియు అనువదించెను. కేవలము సాలోక్యమని పేర్కొనక దానికి సౌభాగ్యమును జత పరచుట ఎంతో ఔచిత్యము. చరాచరాత్మకతను ధ్యానము నందు సాయుజ్యము అన్న మూలమును యథాతథముగనే అనువదించెను. ఇంట సాయుజ్యమునకు మునుపు అక్షరవిశేషణముచే ఒక విశేషమును కవి సాధించెను. కృతార్థోఽస్మ్యహం అనుతుది వాక్యమును ధన్యతం జెందితిన్ అని తెనిగించెను. సరవిన్ అను ఎర్తుగడకు అనుగుణముగా మొదటి పాదమున క్రమాలంకారము పాటింపబడినది. ఇందు పేర్కొనఁబడిన సారూప్య, సామీప్య, సాలోక్య, సాయుజ్యములు అనువాదమున అక్షరరమ్యములై సరసాత్మజ్ఞులైన భక్తి భావ విదులను ధన్యుల గావింపగలిగినవి.

'త్వత్పాదాంబుజ మర్చయామి' అన్నది 'నీపాదాబ్జములన భజింతు' అని అనూదితమైనది. ప్రస్తుత శ్లోకము నందలి క్రమ పద్ధతియే అనువాదమునందును అనుసరింపబడినది. త్వత్పాదాంబుజ మర్చయామి అన్నదానికి నీపాదాబ్జంబులన భజింతు అనియు 'పరమం త్వాం చింతయామి అన్వహం' అనుదానికి 'పరమున్ నిన్నే చిరంబెంచెదన్' అనియు 'త్వాం ఈశం శరణం వ్రజామి' అను ప్రయోగమునకు 'నీ ప్రాపే గణింతు' ననియు 'వచసాత్వామేవ యాచేవిభో' అనువాక్యమునకు 'వాక్కునను నిన్నే చేరి యాచించెదన్' అనియు, 'వీక్షాం మేదిశ చాక్షుషీం సకరుణాం' అనుదానికి 'నాపై జూపి కృపా కటాక్షము' అనియు, దివ్యైశ్చిరం ప్రార్థితాం అనిదానికి 'అమృతాంధః ప్రార్థితం' బనియు, 'మదీయ మనసః సాక్ష్యోపదేశం కురు లోక గురో' అనుదానికి ఇంత సాక్ష్యోపాధ్యాయుడవై భరింపునను శంభూ! లోక రక్షాగురూ, అనియు ప్రత్యక్షరము పొల్లువోకుండ స్వతంత్ర రచనయే అనిపించునట్లు ఎంతో రసబంధురముగా అనూదితము. 'ఉపదేశమును చేయుము' అని మూలమ సాక్ష్యోపాధ్యాయుడవై భరింపుమని అనువాదము. 'వస్త్రోద్ధూత విధౌ సహస్ర కరతా' అనుశ్లోకమునకు 'అంబర మచ్చునపుడు సహస్ర

కరత్మము' అను ఉత్పలమాలావృత్తము అనువాదము. మూలము నందలి క్రమ పద్ధతిని అనుసరించియే తెనిగింప బడినది. వస్త్రద్యూత విధౌ సహస్ర కరతా అనుమొదటి ప్రయోగము **'అంబరమిచ్చునప్పుడు సహస్ర కరత్వము'** అను పద్యపు టెత్తుగడతో ప్రారంభ మైనది. మూలమున రెండవ ప్రయోగము **'పుష్పార్చనే విష్ణుతా'** దీనికి **'విష్ణుతాప్తి పుష్పంబిడ'** అని అనువాదము. మూడవది గంధే గంధ మహాత్మతా అనునది. దీనికి గంధ కల్పనకుఁ బావన గంధ వహత్వమున్ అని అనువాదము. నాల్గవ ప్రయోగము **'అన్నపచనే బర్హిర్ముభాధ్యక్షతా'** అనునది. దీనికి **'సుపాకంబిడ హవ్య భుక్పతిత'** అని ఆంధ్రీకరణము. **'పాత్రేకాంచ న గర్భతా'** అనునైదవ ప్రయోగమునకు **'కాంచన గర్భత పాత్ర దానమందున్'** అని భాషాంతరీకరణము. **'శుశ్రూషాంకర వాణితే'** అనుదానికి **'సలువుదున్ నీకు దాస్యమున్'** అని తెనుగుసేత. బాలేందు చూడామణే స్వామిన్ త్రిలోకీగురో అను సంభోధనములలో బాలేందు చూడామణే **'శశిలాంఛన'** అని ఆంధ్రీకరణము తక్కిన మూడు సంభోధవములకు అనువాదవము లేదు. పరమేశ్వరుని శుశ్రూష చేయుటకు తనకు సామర్ధ్యమున్నదో లేదో అను విషయమిందు నిరూపితము. మూలమునందలి భావము యథాతథముగా పరివర్తింపబడినది. ప్రస్తుత శ్లోకమున పుష్పోపచారము గంధోపచారముమొదలగు వాని యందు పుష్ప ప్రసక్తి కలదు. అందు కనుగుణముగ ఉత్పలమాలావృత్తము ఎన్ను కొన బడినద. ఎట్టి పద్యమును ఎన్ను కొన్న మూలమునందలి భావమును ఎంతో అదికినట్లుగ అర్ధవంతముగా అప్రయత్న స్ఫూర్తితో రసబంధురముగా నిబంధించుట ఈ కవి ప్రత్యేకత.

నాలంవా పరమోపకారక మిదంతు అన్న శ్లోకమునకు 'నిలువం జాలక మర్త్యులెల్లరు.' అన్న మత్తేభ విక్రీడితము అనువాదము. కుక్షి గతచరాచర గణమును బాహ్యమైన వానిని రక్షించుటకు ఆలోచించునీచేత అతి జ్వాలా కరము, భీకరమునను గరళము సర్వామర్త్యపలాయనౌ షదము అగునట్లుగ గళమునందు ఉంచబడినదియై మ్రింగక, ఉమియబడక అట్లే ఉండినది. మహోపకారమైన నీ మహిమ ఎరుగుటకు ఇవియొకటి చాలదాతని మూలశ్లోపభావము. ఇట్లు గరళమునకు చరాచరమునకు కొన్ని కొన్ని విశేషణములు మూలమున పేర్కొన బడినవి. బలిజేపల్లి యిందలి భావము చెడకుండ వినూత్నపద్ధతిలో అనువదించెను. సర్వామర్త్య పలాయనౌషధం' అను ప్రయోగమును 'నిలువం జాలక మర్త్యు లెల్లరు భయోన్నిద్రాకులైపార' అనియు. **'అతిజ్వాలాకరం భీకరం గరళం'** అనుదానికి 'ప్రోజ్జ్వలనాభీల హలా హలంబు' అనియు. కుక్షిగతాన్ చరా చర గణాన్ బాహ్యా అనుటను స్వీయోదర స్థల బాహ్యస్థ చరాచరాళి నిబంధించెను. గళేనిక్షిప్తం అనుటకు గళమందు ఉంచితివి అని అనువాదము నగళితంనోద్గీరణం అను క్రియా పదములు మ్రింగకే క్రాచకే అని అచ్చ తెనుగు పదములలో తెనిగింపబడినవి. పరోపకారమిదం ఏకం నాలంవా అను ప్రథమ పాదమందలి భావము అనువాదమున అంత్యపాదమునందు ఈ మహోపకృతి లోక శ్రేణికిన్ చాలదే అని అనువదింపబడినది. మూలమునందలి పదములు అచ్చటచ్చట గ్రహింపబడినను చెప్పిన పద్ధతిలో బలిజేపల్లి కొంత వైలక్షణ్యమును స్వతంత్రతను ప్రదర్శించెను.

**'జ్వాలోగ్రస్సక లామరాతి భయదక్ష్వే ళః'** అను శ్లోకమునకు **'జ్వాలాభీల హలాహలంబు దివిషజ్జాలాతి సంత్రాసముల్'** అను శార్దూలము అనువాదము. కథంవాత్వయా దృష్టః అనుదానికి అనువాదము లేదు కించకరే ధృతః కరతలేకిం పక్వ జంబూఫలం అనుదానికి కేల ధరించినప్పుడది నీకున్ పక్వ జంబూఫలంబై అని తెనిగింపు మాతృక యందలి పక్వ జంబూఫలం యథాతథముగ స్వీకృతము. జిహ్వా యాంనిహితశ్చ సిద్ధ ఘుటికావా

అనువాక్యమునకు 'నాల్కపైనిడ మహాత్మ! సిద్ధ గోళంబునై' అని అనువాదము ఇట్లే కంఠ దేశే భృతః కింతే సీల మణిర్విభూషణ మయం అను తుది వాక్యమునకు 'నీలంపున్నగయయ్యెనే' గళమునన్ నిల్పన్ అని ఆంధ్రీకరణము. శంభో మహాత్మన్ పద అని శ్లోకాంతము. ఇట 'వద' అనుదానికి అనువాదము లేదు. మహాత్మన్ అను సంబోధనము అనువాదమున మూడవపాదమునందే యతి స్థానమున వచ్చునట్లు ప్రయుక్తమైనది. ప్రస్తుత పద్యము భవానీ పతీ అని సంబోధనతో ముగిసినది. మూలము నందలి కదం వా త్వయా దృష్టః అను వాక్యము తప్ప తక్కిన భావమంతయు క్రమ పద్ధతి ననుసరించి అనూదితమైనది.

'నాలంవాసకృదేవదేవ' అను శ్లోకమునకు 'దేవాయస్థిరదేవతాను సరణాతిక్లే శమేలా!' అను పద్యమనువాదము. ఈ పద్యపు టెత్తుగడమూలమున మూడవ పాదమునకు యథాతథానువాదము. మూలమనగల స్వామిన్ ఇచ్చట దేవా అని అనుసరింపబడినది. ఇందులో 'వ' కారము ప్రాసము తక్కిన మూడు పాదములు సౌలభ్యము నుద్దేశించి ప్రయుక్తము. భవత్సేవా అనునది. భవత్సేవాలంబనమో అని నతిర్వానుతిః పూజా వాస్మరణం కథా శ్రవణం అపి ఆలోకనం మాదృశాం అనునది నమస్కృతియో భక్తి స్తోత్రమో పూజయో భావ ధ్యానము నీ కథాశ్రవణమో భవ్యాత్మ నీదర్శనం బని అనువదింపబడినది. ఇందు భావ ధ్యానమనునది మూలమున లేని ప్రయోగము కాని దీనిని స్మరణమునకు పర్యాయపదముగ గ్రహింపవలెను. అట్లు గ్రహించిన చో మూలము నందలి క్రమత పాటించినట్లగును. మూలవిధేయముగ వరుసక్రమము తప్పకుండ పర్యాయపదములతో రచన సాగించుట కష్టతరము అందును స్వతంత్రరచన అని పించునట్లు రసబంధురముగా రచనా రామణీయకమును నిర్వహించుట అసాధారణ ప్రతిభా విశేషముగల మహా కవులకే సాధ్యము. ప్రస్తుతము బలిజేపల్లి ఎంతో సులువుగా ఎట్టి కష్టము లేకుండ మూలమునందలి భావ సౌందర్యము ఇనుమడించునట్లు అనువాదము గావించెను. ప్రస్తుత శ్లోకమున కావా ముక్తి రితః కుతో భవతి చేత్కిం ప్రార్థనీయం తదా అనునది అంత్య పాదము దీనికి వేరేటికి జాలు ముక్తియన మా కొందేది ప్రార్థింపగన్ అని అనువాదము. మూలమునందలి భావము నంతటిని బలిజేపల్లి ఎంతో సూక్ష్మముగా అర్థగాంభీర్యము ఉట్టి పడునట్లు పద్య పాదాంత మున హృద్యముగా విస్పష్ట పరచెను.

కిం బ్రూమస్తవ సాహసం పశుపతే అను శ్లోకమునకు పద వీభ్రష్ట సుపర్వకంబు అను పద్యమను వాదము. ప్రస్తుత శ్లోక ప్రథమ పాదమందలి భావము 'అదిరా సాహసమీ నిజస్థితి మహాత్మా!' అని పద్య పాదాంతమున ప్రకటితము. ప్రస్తుత శ్లోకము నందలి మూడవ పాదముతో పద్యపుటెత్తు గడ ప్రారంభమైనది. భ్రశ్యద్దేవగణం త్రసన్మునిగణం నశ్యత్ప్రపంచం లయం పశ్యన్ అను మూలమునందవి భావము,. పదవీ భ్రష్టసుపర్వకంబు భయతప్యన్మౌని సంఘంబు నశ్యద జాండంబు లయంబు గాంచుచును అని క్రమము తప్పక అనువదింపబడినది. నిర్భయ ఏక ఏవ విహరత్యానంద సాంద్రో భవాన్ అను వాక్యమును బలిజేపల్లి సాంద్రానందరూఢుండవై ఎదనేమే నిభయంబులే కొకడవీ నీవేలీల గ్రీడింతు అని ఎంతో ప్రసన్న ధోరణిలో అను వదించెను. 'భవద్ధైర్యంచ ఈ దృశం ఈఆత్మనస్థ్సితిరియం చాస్తైం కథం లభ్యతే' అను వాక్య భావము నంతటిని అనువాదకర్త ఈ నిజస్థితి మహాత్మా శక్యన్బారిని స్పష్టీకరించెను. ఈ దృశ్యం ఆత్మన స్ట్సితిరియం అనుదానికి ఈ నిజస్థితిఅని అనువాదము. అన్యైః కథం లభ్యేతే అనుటకు శక్యమెవ్వారికిన్ అని ఆంధ్రీకరణము,. మూలమునగల పరమశివుని సాహసము ఆశ్చర్యార్థక మగుటచే ఆంధ్రీకర్త చతుర్థ పాదారంభమున అదిరా అని ఆశ్చర్యా ర్థక మును ప్రకటించెను. అనువాదము నందలి ఆరంభ విశేషణములు పర్యాయ పదముల గ్రహించుటచే

మూలమున కంటె కొంత విస్తరించినట్లు కూర్చ బడినది. '**విహరతే**' అన్న క్రియాపదమును '**క్రీడింతు**' వని పేర్కొనుట ఎంతో అర్థవంతముగ నున్నది. భవద్ధైర్యం కస్య అస్తి అను వాక్యమునకు అనువాదము లేక పోయినను శక్యమెవ్వారికిన్ అను వాక్యము నందే ఈ అర్థము అంతర్భూతమయినది. ప్రాణ ప్రతిష్ఠ గల పద బంధము లేవియు విడువక అనువాదమును ఎంతో రమణీయముగా అర్థ మహితముగా వ్యర్థ పద రహితముగ అనువదించెను.

'**యోగక్షేమ ధురంధరస్య సకల శ్రేయః ప్రదోద్యోగినో**' అ శ్లోకమునకు '**యోగక్షేమ భరంబుదాల్చి**' అని ఎత్తుగడ. దురంధర స్య అనునది అనువాదమున భరంబు దాల్చి అనియైనది సకల శ్రేయః ప్రదోద్యోగినో అనుటకు '**శుభదోద్యోగంబు నందుండి**' అని ఆంధ్రీకరణము. '**దృష్టా దృష్ట మతోపదేశ కృతినః**' అను వాక్యమునకు '**సత్తా గమ్యంబు మతంబు దెల్పుటకు పాధ్యాయుండవై**' అని అనువాదము. ఇట దృష్టా దృష్టము సత్తా గమ్యముగా పరివర్తితము '**బాహ్యాంతర వ్యాపినః**' అను విశేషణమును అంతటన్ వెలుగుచున్ అని మూల మున లేని వెలుగును అచ్చ తెనుగు నందు తెల్లమొనర్చెను. సర్వజ్ఞస్య, దయాకరస్య, అను రెండు విశేషణములు '**సర్వవిత్ప్రాగల్భ్యం బున దాక్షిణ్యముంజూవు**' అని అనూదితము '**భవతః కింవేదితవ్యం మయా**' అను '**ప్రయోగమును నిన్నే గోరందగునేది**' అని అనువదించెను వేదితవ్యమనగా తెలియదగినది. ఇది కోరందగునని పరివర్తింపబడినది. '**పరమాంతరంగ ఇతి మేచిత్తే స్మరామ్య న్వహం**' అను వాక్యమును '**ఆప్తునిగ ధ్యానింతున్ సదా**' అని అనువ దించెను. పరమాంతరంగుడు అనగా అత్యంత ఆప్తుడు అని అర్థము. ఈ వాక్యమున '**మేచిత్తే**' అను దానికి అనువాదము లేదు, స్మరామి అన్వహం అను వాక్యమును '**ధ్యానింతున్ సదా**' అని పేర్కొనుటచే నిందే '**మేచిత్తే**' అను వాక్యము యొక్క భావమును అంతర్భూతమయినది. '**స్మరామి**' అనుటకుబదులుగా '**ధ్యానింతున్**' అనుట మిగుల అర్థవంతము ఆప్తునిగా ధ్యానిం తును గాక ఆనందమును కలుగ జేయవలసినదని అభ్యర్థన. "ఈ అభ్యర్థనకు అనుగుణముగా పద్యాంతమున బలిజేపల్లి శంకరా! అను సంబోధనమును ఎంతో ఔచిత్యవంతముగా ప్రయో గించెను. మూలమున శంభో! అను సంబోధనమున్నది. దయాకరస్య అను విశేషణమునకు మారు దాక్షిణ్యము అనుపదము సర్వ సమత్వమును ప్రకటించుచున్నది. శివుడొక్కడే సర్వజ్ఞుడు అట్టి సర్వజ్ఞత్వము ఆతనిలో ప్రత్యేకించి పాదుకొన్నప్రాగల్భ్యము కావునసే బలిజేపల్లి సర్వవిత్ప్రాగల్భ్యంబు అని అనువదించెను. మూలమునందలి రెండవ విశేషణమునకు గల '**శ్రేయః**' పదమునకు మారు శుభ అని ప్రయోగము. శ్రేయః పదమునకు ముందున్న సకల శబ్దము ను తెనిగింపలేదు. '**యోగక్షేమ**' అను ప్రయోగమున కు గీతా భాష్యమున శంకరుడొసగిన అర్థమునే ప్రస్తుతటీకా కర్తయగు బలిజేపల్లి గారును తన అర్థవివరణము నందు పేర్కొని ఆ ప్రయోగముతోనే పద్యమును ఆరంభించుట ఎంతో ఔచిత్యవంతముగా నున్నది."

'**భక్తో భక్తి గుణావృతే ముదమృతా పూర్ణే**' అను శ్లోకమునకు '**అమితానంద సుధా ప్రపూర్ణము**' అను మత్తేభమనువాదము. ప్రస్తుత పద్యము ముదమృతాపూర్ణే అను విశేషణమునకు అనువాద ప్రాయమైన '**అమితానందసుధా ప్రపూర్ణము**' తో ఆరంభమైనది. ఆటుపై శ్లోక ప్రారంభము నగల '**భక్తి గుణావృతే**' అనునది '**సముద్యద్భక్తి పాశావృతంబు**' అని ఆంధ్రీకృతము ఇందు సముద్యత్ అనునది కవి కల్పితము. '**గుణ**' శబ్దమునకు పాశ అను పర్యాయపదము ప్రయుక్తము మనఃకుంభే అనునది. మనఃకుంభము అయినది. '**తవాంఘ్రి పల్లవయుగం సంస్థాప్య**' అను నది '**భవత్పదయుగం పుంగెంజి గుర్చుంచి**' అని తెనిగింపు '**సంవిత్ఫలం**' అనుమూలము. '**దివ్య మనీషా ఫలము**' గ ఆంధ్రీకృతము. '**సత్వం మంత్రము**

దీరయన్ నిజ శరీరాగార శుద్ధింపహన్' అను ప్రయోగమునకు ప్రహా గేహము సంశుద్ధి కి సత్స్వమంత్రమున అని అనువాదము. ఇందు 'ఉదీరయన్, సహాన్' అను క్రియా పదములకు తెనుగుసేత లేదు. 'రుచిరం కల్యాణమాపాదయన్' అను ప్రయోగము 'హితకల్యాణాప్తి' అని ప్రయుక్తము 'పుణ్యాహం ప్రకటీకరోమి' అను వాక్యమునకు 'పుణ్యాహంబు గావించెదన్' అని ఆంధ్రీకరణము.

'ఆమ్నాయాంబుధిమాదరేణ' అను శ్లోకమునకు 'తలపుం గవ్వము భక్తి రజ్జువుల చేతన్ గట్టి' అనుపద్యమనువాదము సముద్యన్ మనో మంధానం దృఢభక్తి రజ్జుసహితం కృత్వా అను రెండవ పాదములోని ప్రయోగము ప్రస్తుత పద్యపు టెత్తు గడయైనది. అనంతరము శ్లోక ప్రారంభమున గల విషయము 'ఈఆమ్నాయపుంజలధిన్ ప్రేమమెయిన్ మధించి సుమనస్సంఘంబు' అని అనువదింపబడినది. ఈ వాక్య మధ్యమున వచ్చిన మధించి అనుదానికి శ్లోకమున గల రెండవ పాదాంతముతో సంబంధమున్నది. మూలమున మూడవ పాదమునందు 'సోమం కల్పతరుం సుపర్వ సురభించింతా మణిం ధీమతాం నిత్యానంద సుధాం' అను ప్రయోగములోని 'సోమం' తెనుగున చింతారత్నమున్ అనుదాని పిదప ప్రయుక్తము కల్పతరుం అనునది అచ్చ తెలుగులో 'తలపుం జెట్టు' గ తెనిగింపబడినది. సోమం శబ్దము శ్లేష గర్భితము స+ ఉమం- సోమం అనియు అర్థాంతరము. కావుననే సోమ శబ్దమును బలిజేపల్లి 'సోమునస్ఖలితానందసుధన్' అని అనువదించెను. మూలమున గల 'నిరంతర రమాసౌభాగ్యము' యథాతథముగా గ్రహింపబడినది. కాని దీనికి సాయుజ్యమున్ అను పదము సమానగతమై పద్యాంతమున సంధిల్లినది. 'ఆతన్వతి' అను క్రియాపదము 'సాధించెడి' అని ప్రయుక్తమైనది. ఈ క్రియాపదము పద్యమున కంతటికి అన్వయప్రాయము.

'ప్రాక్పుణ్యాచల మార్గదర్శిత సుధా మూర్తిః' అను శ్లోకమునకు 'పరిపూర్ణుండు' సుధామయుండు అని అనువాదము. ప్రస్తుత శ్లోకమున సోమునకు ఉమా సహితుడైన పరమేశ్వరునకు అభేదసూచికముగా అనేకవిశేషణములు పేర్కొనబడినవి. పరిపూర్ణుండు అను ఎత్తుగడకు మూలము ద్వితీయపాదాంతము యొక్క ఉపాంతమున ఉన్నది. 'సుధా మూర్తి' సుధామయుండు అని ప్రయుక్తము. మూలమున మొదటి పాదాంతమున శివః అని ఉన్నది. ఇది అనువాదమున మూడవ విశేషణముగ శివుడున్ అని ప్రయుక్తము. 'ప్రాక్పుణ్యాచలమార్గదర్శి' అనుశ్లోకపు టెత్తుగడ అనువాదమున ప్రథమపాదమునందు యతిస్థానమున 'ప్రాక్పుణ్యాశైలాధ్వని స్ఫురణుండు' అని ప్రయోగింపబడినది. అటుపై మృగధరః అనునది 'ఏణధరుండు' అనియు 'సోమః' 'సోముడు' అని అనూదితము. మూలమున రెండవ పాదాంత మునగల తమోమోచకః అనుదానికి 'తమంపుంబోక' అని ఆంధ్రీకరణము. మూడవ పాదమందలి 'చేతః పుష్కరలక్షి' 'మానస పుష్కరంబునకు' అని ఆనంద పాథోధిః ఆనందపాథోధిఅని 'సుమనసాంవృత్తి' 'సుమనఃప్రవృత్తి' అని అనువదింపబడినది 'జాయతే' అనునది 'పుట్టున్' అని తెనిగింపబడినది. 'ప్రాగల్భ్యేన విజృంభితే' అను వాక్యమునకు 'బిట్టు రహించున్' అని అనువాదము. బలిజేపల్లి ప్రస్తుత పద్యమును అనువదించునపుడు మూలమున గల విశేషణములను అటు నిటు కొంత మార్చి అందలి ప్రత్యక్షర ప్రాధాన్యమును గుర్తించి ఎన్నుకొన్న పద్యములో ఇముడునట్లు రసభరితముగా అను వదించెను.

'ధర్మోమే చతు రంఘ్రికస్సుచరితః' అనుశ్లోకమునకు 'శ్రీమన్మానసపుండరీక నగరీ' అనుపద్యమనువాదము. ఇందు తుదిపాదము సతి సప్తమి కర్తృవాక్యము. ఈ కర్త అనేక విశేషణములతో కూడి ఉన్నది. రాజా వతంసే మాన్యే మే మానస పుండరీక నగరే కైవల్య నాథే

స్థితే అనునది కర్తృవాక్యము. ఇట కొన్ని విశేషణములు శివునికి, రాజునకు అభేదముగా చెప్ప బడినవి. రాజావతంసుడు. మాన్యుడు అనునవి ముఖ్య విశేషణములు. కావున వీనిని అను వాద కర్తయు మాన్యుండగు రాజమౌళి అనిఅనువదించెను. '**మానసపుండరీకనగరి**' అన్న సమాసము యథాతథముగా పరిగ్రహింపబడినది. కానిదీనికిముందు '**శ్రీమత్**' అనునదితుదిలో '**సింహాస నంబులో**' అనువదబంధమున అనుసంధింపబడినది. ఈ అనుసంధింపబడిన వానికి మూలము లేదు,. '**రాజమౌళి**' అన్న సమాసమునకు రాజ శ్రేష్ఠుడనియే కాక రాజును (చంద్రుని) మౌళి యందు గల శివుడను అర్థము కలదు. '**కైవల్యా నాథే స్థితే**' కైవల్యముతో గూడియుండిన ప్రభువని అర్థము. కాని దీనిని అనువాదకర్త సింహాసనపరముగా అన్వయించి '**త్రిలోకీ మాన్యుండ గు రాజమౌళి ఎపుడెక్కెన్**' అని అనువదించెను. అతడు సింహాసనమును ఎక్కిన అనంతరము కలిగిన సర్వ సమృద్ధి ఐదు వాక్యములలో చెప్పబడినది. అందు మొదటిది మూలమున '**ధర్మో చతు రంఘ్రిక స్సుచరితః**' అన్నది. అనగా నాలుగుపాదములు కలిగిన ధర్మముసుఖముగా ఆచరింపబడినదని అర్థము. పిమ్మట '**పాపం వినాశంగతం**' అన్నది రెండవ వాక్యము. మూడవది '**క్రామ క్రోధమదా దయోః విగళితాః**' అనునది. అనువాదమున ఈ క్రమము తప్పినది. ఇందు '**పాపమప్పుడే చనినన్**' అని మొదటి వాక్యము '**కామాదుల్ నశియించె**' రెండవ వాక్యము. ధర్మమును నల్గాళ్ళన్ ప్రవర్తించెఅన్న ప్రయోగము అచ్చతెలుగు పలుగు బడికి చక్కని ఉదాహరణము. మూలమున మూడవ పాదము '**జ్ఞానానంద మహౌషధీ సుఫలితా**' అని ఉన్నది. దీనిని బలిజేపల్లి విద్యామూల్యంబుల గ్రంథముల్ ప్రబలె అని అనువ దించెను. ఇందు మహౌషధీప్రసక్తి లేద. మూలమున లేని గ్రంథములు అనువాదమునచోటు చేసి కొన్నది. ఇందు విద్య అనగా జ్ఞానము. దానికి సంబంధించిన అ మూల్య గ్రంథములు ప్రబలిన వనుటచే జ్ఞాన సాధనమైన గ్రంథము సడలి ఆనందరస ప్రవాహము విస్తారముగా ప్రవ హించినదని గ్రహింపవలెను. ఈ కవి తన టీకలో జ్ఞానానంద మహౌషధి అనుదానిని అనువాదమున కనుగుణముగా జ్ఞానసాధనగ్రంథ బాహుళ్యమనియెడు సిద్ధ సాధనమయినయోషధి అని వివరించెను. కాలా సుఖా విస్మృతా అను ద్వితీయ పాదాంతమునందలి నాల్గవవాక్యము ప్రస్తుత పద్యమున '**సౌఖ్యం బిచ్చె కాల స్థితుల్**' అని పద్యాంతమున ప్రకటితము. మూలమునందలి విషయము నెచ్చటను విడువకుండ ముందువెను కలుగ కొన్ని వాక్యములు ఆయన ఎన్నుకొన్నపద్యమునకు అనుగుణ ముగా అర్థ గాంభీర్యము అట్టివైశిష్ట్యమే ప్రస్తుత పద్యము న కొట్ట వచ్చి నట్లు కన్పట్టు చున్నది.

'**ధీయంత్రేణ వచో ఘటేన**' అను శ్లోకమునకు '**పలుకుంబాన ఘటించి**' అను పద్యమను వాదము. వచో ఘటేన అనునదిపలుకుంబాన అని అచ్చ తెలుగు సమాసముగా కూర్చబడినది. పద్యపాదపుటెత్తు గడ దీనితోనే ఆరంభమైనది. అటుపైన మూలమున '**కవితా కుల్యోపకుల్యాక్రమైః**' అని ఉన్నది. దీనికి రెండవ పాద మధ్యమున '**కవితోద్యత్సారణీ ధోరణిన్**' అని అనువాదము. మూలమున గల కుల్యోపకుల్య అను లయబద్ధమైన సరణికి అనువుగా అనువాదకుడు సారణీ ధోరణిన్ అను శబ్దాలంకారమును ఎంతో అర్థవంతముగా ప్రయోగించెను. మూల పదములకు కాలువలు, పిల్ల కాలువ లు అని అర్థము సారణి అనగా కాలువ అని అర్థము దీనికి ముందు '**ఉద్యత్**' అను విశేషణము ప్రయుక్తము '**ఉద్యత్సారణీ**' అను ప్రయోగము న ప్రవహించు చిన్న పెద్ద అన్ని కాలువలు గ్రాహ్యములు. మూలమున రెండవపాదము '**ఆనీతైశ్చ సదా శివ స్య చరితాంభోరాశి దివ్యా మృతైః**' అనునది దీనిని అనువాదకర్త '**ఈశ్వర కథాపాథోధిదివ్యామృతంబు**' అని ఆంధ్రీకరించెను. '**యంత్రేణ**' అను శ్లోకప్రారంభ ప్రయోగము అనువాదమున రెండవ పాదారంభమున వెలసినది. '**అల**

విజ్ఞానపు జేతమెత్తి' అని దీనికి అనువాదము. 'ధీ' అను శబ్దమునకు విజ్ఞానమును గ్రహించుట దానికి ముందు పాదారంభమున ప్రసిద్ధిని మనస్సున నిర్దేశింపబడిన దానిని తెలుపు 'అల' అను తెలుగు పదమును సంధించుట ఎంతో అర్థవంతముగ నున్నది. 'యంత్రేణ' అను దానికేతమెత్తిన అను తెలుగు నుడికారపు సొంపు నింపబడినది. మూలమున మూడవ పాదారంభము 'హృత్కేదారయుతాళ్ళ' అనునది. దీనికి 'తలపుం జేనికిదోలి' అని తెనిగింపు అటుపై భక్తి 'కల మాః సాఫల్యాం' అని మూలము. దీనికి 'బత్తి వరిపంటన్' అని తెలుగుసేత. 'ఆతన్వతే' అను క్రియాపదము 'చాలపండింప' అని తెనిగింపబడినది. దుర్భిక్షాన్మమ సేవకస్య భగవన్విశ్వేశ! భీతిఃకుతః అను వాక్యమునకు 'అవ్వల నా దాసున కేటి కాటక పుటుత్పాదంబు విశ్వేశ్వరా!' అని అనువాదము. ఇందు సేవకస్య అనుదానికి దాసున కు అనియు 'దుర్భిక్ష' అను దానికి 'కాటక పుటుత్పాద' మనియు విశ్వేశ అనుదానికి 'విశ్వేశ్వరా' అనియు 'కుతః' అను దానికి 'ఏటి' అను ప్రశ్నార్థకము అను సరణములు. మూలము నగల భీతి భగవన్ అనువానికి అనువాదము లేదు. ఈ దాసునికి కాటకపు పుట్టుక ఎట్టిది అనుటలో దుర్భిక్ష వలన భీతిఎక్కడిది అను భావము అంతర్నిహితము. ప్రస్తుత పద్యమున బలిజేపల్లి అనేక పదములకుఅచ్చ తెనుగు పదము లనే స్వీకరించి అర్థ గౌరవము గల రచనకు అచ్చ తెనుగు ఏ మాత్రము తీసిపోదని నిరూ పించెను. చిన్న చిన్న వాక్యములకు చివర 'ఘటించి' 'ఎత్తి' 'తోలి' అను క్రియాపదములను కూర్చి అనువాదమున అనన్య సాధ్యము వినూత్నమునగు అందమును విస్పష్టతను ఈకవి సాధించెను.

'పాపోత్పాత విమోచనాయ' అను శ్లోకమునకు "ధ్యాన స్తోత్రనతి ప్రదక్షిణ" అను శార్దూలము అనువాదము. మూలమున రెండవ పాదము. 'స్తోత్ర ధ్యాన నతి ప్రదక్షిణ సపర్యాలోక నా కర్ణ' అని ఉన్నది. దీనికి యథా సంఖ్యముగ 'జిహ్వా చిత్తశిరోంఘ్రి హస్తనయన శ్రోత్రైః' అని మూడవ పాదము కూర్చబడినది. మూలమునకు వలెనే అనువాదకుడు శార్దూలమునే ఎన్నుకొనెను. అప్పుడు యథాతథముగ సమాసమును గ్రహించుటకువీలున్నది. కాని అనువాదకుడు స్తోత్ర ధ్యాన అనుదానిని 'ధ్యానస్తోత్ర' అని మార్చి తక్కిన పాదము నంతటిని యథాతథముగ స్వీకరించెను. రెండవ పాద ప్రారంభము 'శ్రీ నొందన్' అనునది. ఈ ప్రయోగము తరువాత క్రమాలంకారము మది నాల్కయున్ దలయు నంఘ్రి ద్వంద్వమున్ గేల్గనుల్ వీనుల్ అని కూర్చ బడినది. 'అహంప్రార్థితః' అనుదానికి నంద్వర పెట్టుచున్నవి అని తెనిగింపు. అటుపై శ్లోక ప్రథమ పాదమగు 'పాపోత్పాత విమోచనాయది రుచిరైశ్వర్యాయ' అనునది 'అఘాళిన్ బాపియైశ్వర్య సంధా న ప్రాప్తికి' అని అనువదింపబడినది. మామా జ్ఞాపయతన్ని రూపయ ముహుర్మామేవ మామే వచః అను మూలమునందలి మొత్తము భావమును 'మూక భావమిడకాజ్ఞాపింపు నీదాస్యమున్' అని ఎంతో సూక్ష్మముగపై వాక్యము ల భావమెల్ల అనువాదమున వచ్చునట్లు బలిజేపల్లి తెనిగించెను. ఇందు 'నీ దాస్యమున్' అను తుది ప్రయోగము కవి కల్పితము. మూలమున మామేవ మామే వచః అను యమకము ప్రయుక్తము. దీనిని యథాతథముగా తెనిగించుటకు వీలులేదు. కావుననే కవి సూక్ష్మములో మోక్షము వలెమూలమునందలి మొత్తము భావమునొక చిన్న వాక్యములో ప్రతి పాదించి మహోర్థస్ఫూర్తిగల రచనావైలక్షణ్యమునువైచక్షణ్యముతో ప్రకటించెను.

'గాంభీర్యం పరిఖాపదం ఘనధృతిః ప్రాకార' అను శ్లోకమునకు 'ఘనగాంభీర్యమగడ్తమేటిధృతి ప్రాకారంబు' అను పద్యమనువాదము. ఈశ్వరుడుదుర్గాతి ప్రియుడు గాన తన మనోదుర్గమున నివసింపుమని ప్రస్తుత పద్య తాత్పర్యము. ప్రకృతపద్యమున

మూలమునందలి క్రమమే పాటింపబడినది. 'గాంభీర్యం పరిఖాపదం' అనుదానికి 'మేటి ధృతి ప్రాకారం' బనియు 'ఉద్యద్గుణస్తోమ శ్చాప్తబలం' అను ప్రయోగమునకు 'సాధూద్గుణంబనుకూలంబు బలం' బనియు 'ఘనేంద్రియచయో ద్వారాణి దేహస్థితి' అను వాక్యమునకు 'ఇంద్రియములే ద్వారాళి' అనియు 'విద్యావస్తుసమృద్ధి రిత్యఖిల సామగ్రీసమేతే' అనువాక్యమునకు 'విద్యాది వస్తు నికాయంబుధనం' బనియు, 'మామకమనోదుర్గే' అనుదానికి 'మామక మనో దుర్గానకున్' అనియు 'నివాసంకురు' అనుదానికి 'నిత్య నివాసంబొనరింపవచ్చుగద' అనియు అనువాదము. మూలమున చివరి పాదమున దుర్గాతి ప్రియా! దేవా అను సంబోధనములున్నవి. ఇందలి దుర్గాతిప్రియశబ్దము శ్లేషార్థ కలితము దుర్గ అన్నది దుర్గమును శివుని దేవేరి దుర్గనుతెలుపును,. కావుననే అనువాద కర్తయు దుర్గశబ్దమునట్లే యుంచి అతిప్రియ ను ఆసక్తిగా మార్చి దుర్గాసక్త అని అనువదించెను. సక్తకు అనుగుణమగు శబ్దాలంకారమును 'భక్త ప్రియా' అని పద్యాంతమున ప్రయోగించెను. మూలమునందలి భావము పొల్లువోకుండ అనువదించిన బలిజేపల్లి అచ్చటచ్చట తానెన్ను కొన్నపద్యమునకు అదుకని అనవసరములనుకొన్న దేహస్థితి వంటి ప్రయోగములను పరిత్యజించెను. 'ఇత్యఖిలసామగ్రీ సమేతే' అనుదానిని సూత్ర ప్రాయముగ 'ధనంబు' అని మాత్రమే ప్రయోగించెను.

'మాగచ్ఛ స్త్వమితస్తతో గిరిశ' అనుశ్లోకమునకు 'ఇదిగో ఆది కిరాత యేమిటికి నీవీడాదదారాద' అను మత్తేభము అనువాదము. ఇట ఆదికిరాత అను సంబోధనమునభిప్రాయము అతడు అది కిరాత మూర్తి అగుటచే తనయందును కిరాత వాంఛితములున్నవి గాన మరి ఎచ్చటకు పోవలదని ప్రస్తుత శ్లోకమునందలి అభ్యర్థనము. మాగచ్ఛఃత్వం ఇతఃతతః అనుదానికి 'ఏమిటికి నీవీడాదదారాద' అని తెనిగింపు. దీనికిమూలమునీవు అటునిటు పోకుముఅని భావము. 'మయ్యేవ వాసంకురు' అను వాక్యమునకు తెనిగింపు లేదు. 'మామక మనః కాంతార సీమాంతరే' అను వాక్యమునకు 'నాహృదయారణ్యమునన్' అని ఆంధ్రీకరణము. మూలమునగల శబ్దాలంకారము తెనుగున లేదు. 'వర్తంతే బహుళోమృగా మద జుషోమాత్సర మోహాదయః' అను మూడవ పాదమునకు క్రూర సత్త్వంబులు న్మదజుష్టంబులు హద్దు లేక తిరుగున్ మాత్సర్య మోహాదులు అని భాషాంతరీకరణము. క్రూర సత్వంబులు అన్నది వివరణ ప్రాయము. 'మదజుషః' అనుదానికి 'మద జుష్టంబులు' అని ఆంధ్రీకరణము. 'వర్తంతే' అను క్రియాపదము 'హద్దు లేక తిరుగున్' అని తెనిగింపబడినది. 'తాన్ హత్వా' అనుటకు 'ఆకదుపుంగూల్చి' అని తెనిగింపు. 'మృగయా వినోద రుచితా లాభం చ సంప్రాప్స్యసి' అనువాక్యము 'తేలుమయ్యా మృగయాకౌతూహల క్రీడలన్' అని అనువదింపబడినది. మూలమున గల వినోద రుచితా లాభము కౌతూహల క్రీడలుగను 'సంప్రాప్స్యసి' అను క్రియా పదము తేలుమయ్య అని తెలుపబడినది. ఇది మూలముకన్న కొంత భిన్నముగ అర్థవైశిష్ట్యముతో ప్రయుక్తము. మత్తేభాదిక్రూర సత్వములను మాత్సర్య మోహాదులయందు ఆరోపించి ఆదికిరాతుడు గజ చర్మాంబరధారి అయిన పరమశివుని మృగయాకౌతూహల క్రీడలందు తేలుమని అర్థించుచు మత్తేభ విక్రీడిత వృత్తమును ప్రయోగించుట ఎంతో ఔచిత్యవంతముగా నున్నది. మూలమునగల శార్దూలమును, పరమ శివుని వ్యాఘ్రాంబర ధారణత్వమును ప్రకటించుచున్నది. 'కరలగ్న మృగఃకరీంద్ర భంగో' అను శ్లోకము 'హస్త విన్యస్త మృగము గజాసుభంగము' అను తేటగీతి యందు అనువదింపబడినది. ఇందు విన్యస్తమృగము అనునది 'హస్తవిన్యస్త మృగమనియు కరీంద్రభంగః' అనునది గజాసుభంగ మనియు 'హస్త జంతుః' అను పదబంధము 'హస్త

**ఙంతు (వజ** ' బనియు '**విశదాకృతిః**' అను సమాసము '**ధవళమూర్తి**' అనియు '**చేతః కుహరే**' అను ప్రయోగమును '**హృదయ గుహన్**' అనియు మేకుతో భీః అను వాక్యము 'నాకు ఇంక **టి భయము**' అనియు '**అస్తి**' అను క్రియ ఉండన్ అనియు అనువదింపబడినది. గిరిశః అనునది. '**తతగిరీశ**' అని ఆంధ్రీకృతము. అట్లే పంచముఖః అనునది. 'పంచముఖంబు' అనియు ఆంధ్రీకరణము. ఇట్లు మూలమునందలి ప్రతి పదమునకును అను వాదము గావింపబడినది. పర్యాయ పదమనోహరముగా సాగిన ఈ అనువాదము మహాదేవునికి సింహమునకు చెప్పబడిన విశేషణములన్నియు అర్థగాంభీర్యమును పుణికి పుచ్చుకొన్నవి.

**ఛందశ్శాఖి శిఖాన్వితైర్ద్విజవరైస్సంసేవితే శాశ్వతే** అను శ్లోకమునకు **ఛందశ్శాఖి శిఖాయుత ద్విజవర స్ఫారంబు నిత్యంబు** అను శార్దూలము అనువాదము. మూలము అనువాదము రెండును శార్దూలములే. ఛందశ్శాఖి శిఖాన్వితైః ద్విజవరైః సంసేవితే అనురెండు ప్రయోగములకు పద్య ప్రథమపాదము ఒకేఒక సమాసము కూర్చబడినది, శాశ్వతే అనుటకు **నిత్యంబు** అను పర్యాయ పదము సౌఖ్యాపాదిని అనుటకు **స్వచ్ఛందానందనము** అను పర్యాయ పదవిలసిత పదబంధము కూర్చబడినవి. ఖేద భేధిని అనునది **ఖేదభేది** అనియు సుధా సారైః ఫలైః దీపతే అనునది **సుధా సారోరు సమ్యక్ఫలాస్పదంబు** అనియు కూర్చబడినవి. శంకర **పాదపద్మయుగళీనీడే** అను ప్రయోగమునకు ఇందు శంకర అనుపదమునకు మారు ఇందు **కళావతంసుని** అని లక్ష్మీకాంతకవి అనువదించెను, **చేతః పక్షిశిఖామణే** అను సంబోధనమునకు **డెందంపుంద్విజరాజ** అని అనువాదము. **అన్యైః అలంవృధా సంచారం త్యజనిత్యం విహారం** కురు అను వాక్యముల భావమునంతటికిని **నిల్వుము ఇతరోడ్డీనంబులింకేటికిన్** అని చిన్న వాక్యములో పొందుపరచెను. మూలమున గూటియందు విహారము చేయు అను అర్థముగల ప్రయోగమున్నది. విహారము చేయుట కంటె గూటియందు నిల్వుమనుట ఎంతో అర్థవంతము ఔచిత్యవంతము. వృధా సంచారమును త్యజింపుము అనుటకు మారుగ **ఇతరోడ్డీనంబు లింకేటికిన్** అని బలిజేపల్లి అనువదించెను. ఉడ్డీనము అనగా పక్షిక్రిందనుండి పైకి ఎగురుట అని అర్థము. మూలమున **అన్యైః అలం** అని ఉన్నది. ఇందలి అన్య పదమును ఇచ్చట కవి **ఇతర** అని ప్రయోగించెను. అర్థ స్వరూపుడైన పరమేశ్వరుని తత్త్వము అర్థవంతమైన రచనలో ప్రతిపాదించుట సమర్థుడైన సత్కవీంద్రుని సత్కార్యము. ఇట్టి రసవద్రచనా రామణీయకమును బలిజేపల్లి తన ప్రతి పద్యమున ప్రతిభావంతముగా ప్రతిష్ఠించెను.

**ఆకీర్ణేనఖరాజికాంతవిభవైః** అను శ్లోకమునకు **వరనఖరాజి రుక్ప్రయవిభాసితమున్** అను చంపకమనువాదము. ఇందలి **ఉద్యత్సుధావైభవైః అథౌపి** అను వాక్యమును విలసత్ సుధా స్ఫురిత మనియు **పద్మరాగలలితే** అను ప్రయోగమును పద్మరాగరుచి జుష్టమనియు **హంసవ్రజైః ఆశ్రితే** అనువాక్యమును **హంస గణా శ్రితంబు** అనియు **గిరిజా నాథాంఘ్రి సౌధాంతరే** అను వాక్యమును ఉమావర చరణారవింద మణి సౌధమునందు అనియు **రహస్సిస్థిత్వా** అను క్రియా ప్రయోగమును **వసించి** అనియు **భక్తి వధూగణైశ్చనిత్యం స్వేచ్ఛావిహారం కురు** అను ప్రయోగమును **భక్తిసుందర తరుణీ విలాస సలనన్** గను అనియు కవితా కళానిధి అనువదించెనునిత్యము స్వేచ్ఛా విహారము చేయుము అనుభావమును **విలాసకల నంగను** మని సౌందర్య రసస్ఫోరకముగా కవి అనువదించెను. ఈ సౌందర్య భావనకు తగినట్లు వధూగణైః అని ఉన్నదానిని **సుందరతరుణీ** అని మార్చెను. **మానస రాజహంసమా** అను సంభోధనము పద్యాంతమున ప్రయుక్తమై పద్య రచనలో హృద్యతరమైనఅందమును పుణికి పుచ్చుకొన్నది. **రహస్సి** పదమునకు అనువాదము లేదు, సుందరతరమైన భావము ప్రతిపాదించుటచే బలిజేపల్లి తదనుగుణము గా చంపకమాలా వృత్తమును ప్రవేశపెట్టెను. ఇది ఈతని ఛంద శ్శిల్ప సౌందర్య దృష్టికి ఒక నిదర్శనము.

**శంభు ధ్యాన వసంత సంగిని** అనుశ్లోకమునకు ఏనః పర్ణము **లెండిరాలి** అను శార్దూలమనువాదము. ప్రస్తుత శ్లోకమున శివ ధ్యానము వసంతారామ వైభవముతో పోల్పబడినది. ధ్యానమునకు, వసంతమునకు అభేధము తెలుపబడెను. బలిజేపల్లి లక్ష్మీకాంతము గారి శ్లోక ప్రథమ పాదాంతమునగల **అఘ జీర్ణచ్ఛదా స్రస్తా** అను ప్రయోగమును ఏనః పర్ణము లెండిరా అని పద్యపు టెత్తు గడగా గ్రహించెను. **పుణ్య ప్రవాళ శ్రితాః** అను ద్వితీయ పాదాంత విశేషణము ప్రస్తుత పద్యమున **సుకృతాహీన ప్రవాళంబులన్** అని ప్రథమ పాదాంతమైనది. **గుణ కోరకాః జపవచః పుష్పాణి** అను విశేషణములు సద్గుణ **జాలకంబు జప వాచా సూనమై** అని ప్రయోగింపబడినది. అనువాదమున గల **జాలకమునకు లేతమొగ్గ** అని అర్థము. ఇది కోరకమునకు పర్యాయపదము. **హృదారామే** అను ప్రయోగము **మానసోద్యానంబందలి** అని ఆంధ్రీకరింపబడినది. **భక్తి లతాచ్ఛటా విలసితా** అనునది **భక్తి వల్లిక** అని మాత్రమే అనూదితము. ఛటా విలసితా అనుదానికి అనువాదము లేదు. ఇది అనువదింపక పోయినను అర్థ భంగము లేదు. మూలమునందలి లతా-సితా-శ్రితాః అను శబ్దాలంకారమునకై **విలసితా** అన్నది ప్రయోగింపబడినది. **శంభు ధ్యాన వసంత సంగిని**అను శ్లోకారంభము అనువాదమున **శివ ధ్యానంపుబేరామనిన్** అని తృతీయ పాదాంతముగా ప్రయుక్తము. మూలమున తుది పాదము **జ్ఞానానంద సుధా మరందలహరీ! సంవిత్ఫలాభ్యున్నతిః** అని సమాసము. అనువాదమున సంవిత్ఫలము వరకు యథాతథముగా గ్రహించి తుట్ట తుదిగా అభ్యున్నతికి మారుగా **ఆప్తి** అని ప్రయుక్తమైనది. తుట్ట తుదిగా **కనెన్** అను క్రియా పదముతో పద్యము ముగిసినది. [5]"ప్రస్తుత పద్యపు టెత్తుగడ ఏనః పర్ణములను పదప్రయోగ వైచిత్రి బలిజేపల్లి గారి **పాండిత్య స్ఫూర్తిని** వెల్లడించుచున్నది. ఇట్లే జాలకమన్న పదము నందును వారి విద్వత్తు అభివ్యక్తము. వసంతమనుటకు మారుగ అచ్చతెలుగు పదముగు **పేరామనిన్** అని ప్రయోగించుట తేట తెల్లమగు తెలుగు పలుకుబడిపై వారికి గల అభినివేశమును అభివ్యక్తము చేయు చున్నది. మూలమునందలి సుదీర్ఘసమాసములును అందములు అర్థవంతములనిపించినచో యథాతథముగా అనువదించుట శ్రీనాథుని నుండియే సంక్రమించి ఉన్నది. అది మూల కర్తపైగల గౌరవమును అభిమానాతిశయమును వెల్లడించును. ఇట్టి అభిమాన గౌరవములే ప్రస్తుత చతుర్థ పాదమును ఆంధ్రీకరించుటలో విస్పష్టమైనవి."

నిత్యానంద రసాలయం అను శ్లోకమునకు **అలతుల్ సేరెడు పల్వలంబులకు** అను పద్యము ఆంధ్రీకరణము. ప్రస్తుత పద్య ప్రారంభము మూలమున గల చతుర్థ పాదమునకు అనువాదము. మూలమున **కింక్షుద్రాశ్రయ పల్వల భ్రమణ సంజాత శ్రమం ప్రాప్నుయాసి** అను సమాస గతమైన ప్రయోగమునకు **అలంతుల్ సేరెడు పల్వలంబులకు నేలా పోయికీడొంద** అని విడి విడి పదముల తెలుగు నుడి కారము గల రచన అనుసరింపబడినది. అటుపై నిత్యాంద రసాలయం అనునది **అస్ఖలితానంద రసాలయంబు** గా ఆంధ్రీకరింపబడినది. ఇట నిత్య శబ్దమునకు **అస్ఖలిత** అన్నది ఆంధ్రీకరణము. పిదప సురముని **స్వాంతాంబు జాతాశ్రయం** అనుదానికి ముని **రాట్స్వాంతాబ్జ మూలంబు** అని ఆంధ్రీకరణము. ఇందు అంబుజాతము అబ్జముగా, **ఆశ్రయం** మూలముగా ప్రయోగింపబడినవి. **కలుష హృత్సద్వాసనా విష్కృతం** అను సమాసమునకు **దుష్కలుష ఛ్ఛేది సువాసనాఢ్యము** అని అనువాదము. **సద్ద్విజ సేవితం, స్వచ్ఛం** అను విశేషణములు **ద్విజస్వారంబు, స్వచ్ఛంబు** అని అనువదింపబడినవి. ఇందలి స్వారము చలనము గలది అను అర్థమున ప్రయుక్తము. **శంభుధ్యాన సరోవరం వ్రజ** అను వాక్యము **శంభ్వలఘు**

ధ్యాన సరోవరంబునకు బొమ్మా అని అనూదితము. ఇందలి అలఘు శబ్దము ధ్యాన గరిమను సూచించును. మనోహంసావతంస అను సంబోధనము. ఓ మనోహంసమా! అని ప్రయుక్తము. మూలము నందలి ప్రతి ప్రయోగము అనువాదమున పర్యాయ పదవాచిగనో, స్వతంత్రపదప్రయోగ రామణీయకముగనో ప్రకటించి రసస్ఫూర్తితో తన కవిత్వమును నిత్యానంద రసాలయము గావించుట ఈయన రచనలోని విశిష్టత ప్రత్యేకత.

**ఆనందామృత పూరితా** అను శార్దూలము **హర చరణాబ్జమన్ గుదుటి యందు** అను చంపకమాలావృత్తమున అనూదితమైనది. మూలమున ప్రథమపాదమున ద్వితీయ విశేషణముగ పేర్కొనబడిన హర పదాంభోజాలవాలోద్ధృత అను దానికి హరి చరణాబ్జమన్ కుదుటి యందు అను పద్యారంభము అనువాదము. మూలమున ఒకే సమాసమున గల ప్రయోగము ఈచ్చట రెండు పద బంధములలో ప్రయుక్తము. మూలమున గల ఆలవాలమునకు **కుదుటి యందు** అని తెలుగు సేత. **ఆనందామృత పూరిత** అను మొదటి విశేషణము (పాదారంభము) **ముదంబు వలన** నెఱింగి అని అనువదింపబడినది. అమృత శబ్దమున కు **అంబువు, ఆనంద** శబ్దమునకు **ముత్** అనునవి పర్యాయ పదములు. స్థైర్యోపఘ్నం **ఉపేత్య** అనువాక్యమునకు నిబ్బరమగు **తాల్మికంబమున తాకుచు** అని తెనిగింపు. ఇందు స్థైర్య మునకు నిబ్బరమగు తాల్మి , ఉపఘ్నకు ఆధారమగు, కంబమని తెనిగింపు. ఉపఘ్న మనగా ప్రాకుడు కొయ్య. కావుననే **ఉపేత్య** అను క్రియాపదమును **ప్రాకుచు** అని తెనిగించెను. **శాఖోపశాఖాన్వితా** అనుటకు రెమ్మలకొమ్మలన్ అని తెనుగుసేత **ఉచ్చైర్మానసకాయమాన** పటలీమా క్రమ్య అను ప్రయోగమునకు **మనోహర హృదయంపుఁబందిటనునల్లి** అని అనువాదము. ఇచ్చట మనస్సునకు, **కాయమానము**నగా పందిరికి అభేదము. పందిళ్ళ సమూహము నాక్రమించి అనిమూల పద ప్రయోగ తాత్పర్యము. దీనికి పందిటను నల్లి అని అచ్చ తెనుగు కూర్పు. పటలీ అనుటకు తెనుగు లేదు. **ఉచ్చైః** అనగా **ఉన్నత**మని అర్థము. ఆంధ్రీకర్త దీనిని మనోహర అని పేర్కొనెను. **సత్కర్మసంవర్ధితా** అను దానికి **సుకర్మల పెంపు** **జెంది** అని అనువాదము. మూలమున నిష్కల్మష అని ఉన్నది. అనగా చీడ మొదలగు వానిచే శిథిలము గాక అని అర్థము. దీనిని బలిజేపల్లి ఏ కొరతయు లేని అని తెనిగించెను. ఇందలి విశేషణములన్నియు భక్తిలతకు సంబంధించినవి. మూలమున **భక్తి లతికా** అని కలదు. ఇది అనువాదమున భక్తి లత గ కూర్చబడినది. ఈ భక్తిలత నిత్యాభీష్ట ఫలప్రద అగును గాక అని మూలము. కాని బలిజేపల్లి **కూర్చుతనిత్య ఫలప్రసాదమున్** అని అనువదించెను. మూలమున లేని ప్రసాదము పద్యాంతమున ప్రయుక్తమై ప్రసాద స్ఫూర్తి గల ఈతని రచనా విధానమును నిరూపించుచున్నది. ఈతని రచన రస హృదయ మనోహరము. ఇది నిజముగా ఆనందామృత పూరితము.

సంధ్యారంభ విజృంభితం - అను శార్దూలమునకు **తతసంధ్యోద్ధతము** అను మత్తేభము అనువాదము. భ్రమ రాంబికా సమేతుడైన శ్రీగిరి మల్లికార్జున స్వామిని వర్ణించు ఈ శ్లోకమున తొలి విశేషణము సంధ్యా రంభ విజృంభితము. దీనికి తత సంధ్యోద్ధతము అని పద్యపు టెత్తుగడ. ఇట తత అనుటకు విరివి అయిన లేక వ్యాపించిన అని అర్థము. మూలమున గల విజృంభితమునకు ఉద్ధతమనునది పర్యాయ పదము. మూలమున రెండవ విశేషణము **శ్రుతి శిరస్థానాంతరాధిష్ఠితం** అనునది. అనువాద కర్త ఇదే సమాసమునకు ముందు ఉన్నత అను అధికమైన విశేషణమును తుట్టతుదిగ అధిష్ఠిత శబ్దమునకు న్యస్తము అను పర్యాయ పదమును ప్రయోగించి యథా తథముగనే తక్కిన మూల సమాసమును స్వీకరించెను. మూలమున

రెండవ పాదమున స ప్రేమభ్రమరాభిరామం అని ఉన్నది. ఇట అంచిత అను శబ్దమును ప్రారంభమున ప్రేమశబ్దమునకు రాగ అను పర్యాయ పదమును ఆంధ్రీకర్త ప్రయోగించెను. తృతీయ పాదాంతమునగల **గుణావిష్కృతం** గుణశ్రీకంబు అని అనువదింపబడినది. పిమ్మట తృతీయ పాదారంభమునగల **భోగీంద్రాభరణం** అన్నది **భోగీడలంకృతము** అని ప్రయుక్తమైనది. మూలమున మూడవపాదమధ్యమున సమస్త సుమనః **పూజ్యాం** అన్నది **ఉద్యత** సుమనః **ప్రపూజ్యము** అని ఆంధ్రీకృతము. అటుపై **శివాలింగితం** అన్నది **శివాంగీకార్యము** అని అనువదింపబడినది. అసకృత్సద్వాసనా **శోభితం** అను ద్వితీయ పాదాంతమునందలి విశేషణము ప్రస్తుతపద్యమున **ఉద్వాసనాయుతమౌ** అని తుది విశేషణమైనది. నాల్గవ పాదము నందలి శ్రీ గిరిమల్లికార్జునమహాలింగం సేవే అను వాక్యము శ్రీ గిరి మల్లికార్జున మహోద్యల్లింగముంగొల్చెదన్ అని ఆంధ్రీకృతము ఇట మూలమున లేని ఉద్యత్ శబ్దము లింగ శబ్దమునకు ముందు ప్రయుక్తము. ఇట్లు మూలమునందలి విశేషణములన్నియు ముందు వెనుకలుగ ప్రయుక్తములైనవి. మూలమున గల **అసకృద్వాసనను ఉద్వాసనగా** అనువదించెను. అసకృత్ అనగా ఎల్లప్పుడు అని అర్థము. సద్వాసన అనగా సాధువులయొక్క భావన అని భావము. కాని అనువాద కర్త ఇచ్చట ఉత్ అను ఉపసర్గవలన ఒక విశేషార్థమును ద్యోతక మొనర్చెను. ఇది పైకి లేచిన అను అర్థమును తెలుపును. కాని ఉద్వాసన అని ప్రత్యేక పదముగా గ్రహించినచో తొలగింపబడిన, గృహాదుల నుండి వెడలిన లేక ప్రవాసమున ఉన్న అను అర్థములు స్ఫురించును.

**భృంగీచ్ఛానటనోత్కటు** - అను శ్లోకమునకు **భృంగీ చ్ఛానటనోత్కటుండు** అని ప్రస్తుత పద్యపు టెత్తుగడ. మూలమున **కరిమదగ్రాహి** అను సమాసమును **ఉరుకరీంద్రోన్మదగ్రాహకుండున్** అని మరి కొంత క్లిష్ట తర సమాసఘటనతో స్వీయ పాండిత్య ప్రకర్షను కవి ప్రకటించెను. **పంచేషుణాచావృతః** అను ద్వితీయ పాదాంతము ప్రస్తుత పద్యమున ద్వితీయ పాదారంభమున **కామాదృతుడున్** అని అనువదింపబడినది. ఇచ్చటసంధిగతప్రాసములో ఈ కవి కూర్చిన కూర్పు ఎంతో అందగించినది. పిమ్మట **మహాసితవపుః** అనునది **మహాసిత తనుండున్** అని అనూదితము. **స్ఫురన్మాధ వాహ్లాదః** అను ప్రథమ పాదాంత ప్రయోగము **మాధవాహ్లాది** అని ద్వితీయ పాదాంతమున ప్రయుక్తము. మూలమున మూడవపాదమున **సత్పక్షస్సుమనోవనేషు** అని ఉన్నది. దీనినే బలిజేపల్లి **సత్సంగుండున్సుమనోవనప్రియుడు** అని అనువదించెను. మూలమున రెండవ పాదమున గల **నాదయుతః** అన్నదినా**దవ్యక్తి** అని తృతీయ పాదమున కూర్చెను. **మదీయేమనో రాజీవే** అనుదానిని **నామనోబ్జంబునన్** అని పద్యాంతమున ప్రయోగించెను. **భ్రమరాధిపో విహరతాం శ్రీశైల వాసీవిభుః** అను వాక్యమును శ్రీశైల మందుంగాపా భ్రమరాధిపుండలరు చుండున్ అని ఎంతో ఔచిత్యవంతముగా అనువదించెను. **విహరతాం** అను క్రియా పదము **అలరుచుండున్** అనియైనది. మూలమున గల సపునః **సాక్షాత్** అను పదములకు తెనిగింపు లేదు. శ్రీశైల మందుంగాపా అనిశ్రీశైలరక్షకుడుగా అచ్చతెలుగు పదమున కాపు శబ్దమును సంధిగత ప్రాసకు అను గుణముగ సంఘటించుట బలిజేపల్లి ఛందో నిర్మాణ కౌశలమును అచ్చ తెలుగు పలుకుబడిపై అతనికి గల అభిమానాతి శయమును విస్పష్టము చేయుచున్నవి. ప్రస్తుత శ్లోకమున భృంగీ భ్రమరాది శబ్దములు శ్లేషార్థ సంగతములు. భృంగీ అనగా ఆడు తుమ్మెదయే గాక శివ భక్తుడగు భృంగీశ్వరుడును సూచితము. అట్లే భ్రమర శబ్దమున తుమ్మెదయే గాక, భ్రమరాంబికయు సూచింపబడినది, మనస్సును రాజీవముతో పోల్చుటచే

పరమశివుని భ్రమరాధిపునిగ ప్రతి పాదించుట మిగుల ప్రతిభావంతముగా నున్నది. ఈ పద్యమునందెల్లెడల తుమ్మెద ప్రసక్తి కల్పింపబడుటచే తుమ్మెదలకు అనుగుణముగా కరిమద గ్రహణత్వము. మాధవ శబ్దమును బట్టి వసంత ఋతుశోభ, సుమనోవన మను శబ్దమును బట్టి పుష్పవనము ప్రసక్తికి తేఁబడినవి. శివ పరమున గజాసురుడు, మోహినీ రూపమును దరించిన మాధవుడు, సుమనోవనమనగ విబుధ లేక దేవ పరిరక్షణము ప్రకటింపబడినది. శ్లేషార్థము గల పదములను అనువదించుటలో అనువాదకుడు ఎంతో జాగరూకత వహించెను, ఇందలి ప్రతి విశేషణము అటు శివ పరముగా, ఇటు తుమ్మెద పరముగా అన్వయింపబడినది.

**కారుణ్యామృత వర్షిణం** అనునది పరుష విపత్తి పాతపము అను చంపకముగా అనూదితము. ఈ శ్లోకమున మేఘమునకు, శివునికి అభేదము అనేక విశేషణములలో కలదు. ఘన విపద్గ్రీష్మచ్ఛిదాకర్మఠం అను రెండవ విశేషణము. అనువాదమున పద్య పాదపు టెత్తుగడ అయినది. మూలమున మొదటి విశేషణమునకు **అపార దయా రసవృష్టి మాన్పుచున్** అని అనువాదము. **విద్యాసస్య ఫలోదయాయ** అనుటకు విద్దెల పంటకు అని తెలుగు సేత. సుమనస్సంసేవ్యం అన్నది వర సుమనోగణంబలర అని నృత్యద్భక్తి మయూరం అద్రినిలయం అన్నది భక్త మయూరులు గొల్వ నద్రిపై అని ఆంధ్రీకృతము. చంచజ్జటా మండలం అనునది పద్యమున రెండవపాదాంతమునందే **చారు జటాజటాలుడై** అని ప్రయుక్తము. వాంఛతి నీల కంధర సదాత్వాంమేమన శ్చాతకః అను వాక్యమును బలిజేపల్లి నీలకంధరవిభున్ మతి చాతక మిచ్చగించెడిన్ అని అనువదించెను. మేఘునికి, శివునికి అనేక విషయములలోసామ్యము చక్కగా అదికినది. ఉభయులకు పర్వతవాసము, కామ రూపము, జటావల్లి పేర్కొనఁబడినవి. మేఘ పరముగా **జటా** అనగా మెరుపు. ఈ అర్థమును స్వయముగా బలిజేపల్లియే శ్లోక వివరణమున పేర్కొని నాడు.

**ఆకాశేనశిఖీ** అను 53 వ శ్లోకమునకు **అనఘ కలాపియై** 2 మూలమున అను చంపకము అనువాదము. గానులవ చేయదగిన అనిఅర్థముండగా ప్రస్తుత పద్యారంభమునకు సమస్త ఫణినాం నేత్రాకలాపీ అనునది మూలము. **అనఘ కలాపియై ఫణికులాధిపుచే** అని ఆంధ్రీకరణము. **ఆకాశేన శిఖీ** అనుదానికి శిఖియై నభంబుచే అనిఅనువాదము. నతాను గ్రాహీ ప్రణవోపదేశ నినదైఃకేకీ అను ప్రయోగమునకు వినతజనాతనప్రణవ విస్తరబోధన చేత కేకియె అని ఆంధ్రీకరణము. శ్యామాంశైల సముద్భవాం ఘనరుచిం దృష్ట్వానటంతం, నీల కంఠం అనుభావము ఘన రుచి శ్యామ, అద్రి జని గాంచి నటించెడు నీలకంఠు అని ఒక్క అక్షరము కూడ పొల్లు పోకుండ మూలమునందలి విశేషణములన్నియు అనువాదమున వచ్చునట్లు మూడవ పద్య పాదమున నిబంధించెను. మూలమున నాల్గవ పాదము వేదాంతోపవనే విహారరసికంతం నీలకంఠం భజే అనునది. దీనిని బలిజేపల్లి అచ్చ తెలుగు పదముల కూర్పుతో మినుకుల తోటలో తిరుగు మేటి రసజ్ఞునిగ పేర్కొని భజింతు నిచ్చలున్ అని పద్యమును ముగించినాడు. నీలకంఠశబ్దము శివ, మయూర పరమగు ఉభయార్థకముగ ప్రయుక్తమైనది.

54 వ శ్లోకమున పార్వతీపరమేశ్వరులు మయూరీ మయూరములుగ భావింపబడిరి. సంధ్యా ఘర్మదినాత్యయో అని శ్లోకారంభము. అలగోవిందు మృదంగపుంధ్వనియె గర్జారంభమై అనుటకు హరికరాఘాత ప్రభూతానక ధ్వానః వారిద గర్జితః అను వాక్యము మూలము. దివిషదాం దృష్టి చ్ఛటాచంచలా అనుటకు వేల్పుటయ్యల చూపుం గముల మెఱుంగులయి అని తెలుగు సేత. భక్తానాం పరితోష బాష్ప వితతిఃవృష్టిః అని వాక్యమునకు

**భక్తానంద బాష్పంపు సోనల జాల్వానగ** అని అనువాదము. సంజయస్ తొలకరిన్ అనుదానికి సంధ్యా ఘర్మదినాత్యయః అని శ్లోకారంభము మూలము. **మయూరీశివా** అనుదానికి **గౌరీమయూరీ** అని అనువాదము. ఇట గౌరీ మయూరీ మనంబలరన్ అని సమాసమును అనువాదకర్త కొంత పొడిగించెను. శ్లోకమున చతుర్థ పాదము **యస్మిన్ ఉజ్వల తాండవం విజయతే తంనీల కంఠంభజే** అనునది దీనినే **తాండవమాడు నీల గళు నాట్యానర్గళన్ గొల్చెదన్** అని కవి అనువదించెను. **నాట్యా నర్గళున్** అనునది కవి స్వకపోల కల్పితము. యతి స్థానమున తగుపదమును కూర్చుటకై కవి ఈ ప్రయోగము గావించెను. **నీలకంఠం** అనుటకు **నీలగళు** అని అనువాదము. శ్రేష్ఠతా వాచకమగు అల అను అచ్చ తెనుగు పదముతో ఆరంభమైన ప్రస్తుత పద్యము నందలి నాలుగు ప్రాస స్థానములందును అచ్చ తెనుగు పదములే అప్రయత్నముగా చోటు చేసికొన్నవి. దివిషదాం అనుటకు **వేల్పుటయ్యల** అని అనువాదము. ఇందలి ల ప్రాస స్థానము. అట్లే మూడవ పాదారంభమున **బాష్ప వితతి** అను మూలమునకు **బాష్పంబుసోనలజాల్** అను ప్రయోగము అలవోకగా సౌందర్యరసభరితముగా వచ్చి చోటు చేసికొన్నవి. నాల్గవ పాదారంభము **అలరన్** అన్నదియు అచ్చ తెనుగు పదమే. ఇట్లీ పద్యమున అచ్చ తెలుగు పదములు తత్సమ పదములతో సమరస భరితముగా సంధించి ఎంతో ఉజ్జ్వలతను సాధించినవి.

**ఆద్యాయామిత తేజసే** అను శ్లోకమునకు **ప్రకృతికి మించి అవ్వల వెలింగెడు వాని** అను సీసము అనువాదము. ప్రస్తుత శ్లోకమున సమ్యక్ తాండవసంభ్రమము నెఱపు పరమ శివునికి ఎన్నెన్నో విశేషణములు పేర్కొనబడినవి. అనేక విశేషణములతో అభివర్ణింపబడు పరమశివుని విస్పష్ట వివరణకు తగునట్లు సీసము గ్రహింపబడినది. **ఆద్యాయామిత తేజసే** అనుటకు **అమితతేజోమూర్తియైన వాని** అని అనువాదము. ఇట **ఆద్యాయ** కు అనువాదము లేదు. ఈ లోపమును తీర్చుటకై కవి స్వయముగా **ప్రకృతికి మించి వెలింగెడువాని** అని వివరించెను. **శ్రుతిపదైః వేద్యాయ** అని విశేషణమునకు తొలిపల్కుగములచేదెలియంగదగువాని అని తెనిగింపు. **సాధ్యాయ** అనుదానికి **అర్చాదులకు సాధ్యుడైనవాని** అనివివరణ. **విద్యానంద మయాత్మనే** అనుటకు **మహిత విద్యానందమయ మూర్తి యగువాని** అని అనువాదము. **త్రిజగతస్సంరక్షణోద్యోగినే** అను విశేషణమునకు ముల్లోకములను రక్షించు ప్రయత్నము గల వాని కొరకు అనిభావము. దీనిని **అఖిల లోకము లేలునట్టి వాని** అని కవి అనువదించెను. ముల్లోకములు అనుపరిమితి లేకుండ అఖిలలోకములనుట ఎంతో విశాలార్థమును. అట్లే ఏలుటకుప్రయత్నించువాడు అను అర్థము కంటె ఏలునట్టివాడు అనుటయే విశిష్టార్థ స్ఫోరకము. మూలము నందలి భావమే మరి కొంత అర్థవంతముగ ఈ విశేషణమున ప్రకటితమైనది. మూలమున మూడవ పాదారంభము **ధ్యేయా యాఖిలయోగిభిః** అనునది. **మౌనీశ్వరులచేత ధ్యానింపదగువాని** అని సురగణైః **గేయాయ** అన్నది **జేజేకొలంబు భూషించువాని** అని అనూదితము. 2 అనువాదమున అది భూషించుటగా పరిణమించినది. **మాయావినే** అనుటకు **అమేయ మాయావిహారి** అని ఆంధ్రీకరణము. కాని ఈ ప్రయోగమునకుముందు అప్రమేయ అని ఉన్నది. దీనికి మూలము లేదు. అటుపై ,**సంయుక్తాండవ సంభ్రమాయ** అన్నది **తాండవారంభ సంభ్రమోద్దండుడైన** అని ఆంధ్రీకృతము. **జటినే** అనుదానికి **మొదలి జడదారి** అని తెనిగింపు. ప్రమథుల మొదలియారి, అఘవిదారి అను విశేషణములు కవి స్వకపోల కల్పితములు. **నతిశ్శంభవే** అను వాక్యమునకు **జోహారు లిడుదు** అని తెనుగుసేత. ఇట్లీ సీస పద్యమున బలిజేపల్లి మూలమునకు వన్నె

తెచ్చు పద్ధతిలో మూలభిన్నములైనకొన్నివిశేషణములను కూడకల్పించి సీసపద్యమునెంతో మనోహరముగా అంత్యానుప్రాసబంధురముగా అనువదించెను.

56 వ శ్లోకముగు **నిత్యాయ త్రిగుణాత్మనే** అనునదియు పూర్వ శ్లోకమువలె విభిన్న విశేషణములతో నొప్పుచున్నది. పూర్వ శ్లోకమందువలెనే తుది పాదము **సాయం తాండవ సంభ్రమాయ జటినేస్స్యేయం నతిశ్శంభవే** అని ఉన్నది. దీనిని బలిజేపల్లి మత్తేభవృత్తమునందే నిబంధించెను. **తలతున్** అను క్రియాపదముతో పద్యము ఆరంభమైనది. అట్టిపై పద్యమెల్లను పరమేశ్వరు సంబంధ విశేషణములతో కూర్చబడినది. **నిత్యాయ** అన్నది నిత్యం అనియు, **త్రిగుణాత్మనే** అన్నది **గుణత్రయాత్మ** అనియు, **పురజితే** అనునది పురహంతన్ అనియు, **కాత్యాయినీ శ్రేయసే** అన్నది **పార్వతి సత్తపః ఫలమున్** అనియు, సత్యాయ, **ఆదికుటుంబినీ** అనునవి ప్రాక్తనపుంగుటుంబినీ అనియు **మునిమనః ప్రత్యక్ష చిన్మూర్తయే** అనునది మునిమనః ప్రత్యక్ష చిన్మూర్తి నిశ్చలు అనియు **మాయా సృష్ట జగత్రయాయ** అన్నది **మాయా పరి కల్పితాఖిల జగజ్జాలున** అనియు సకలామ్నాయాంతసంచారిణే అనునది **త్రయీవేద్యు** అనియు **సాయంతాండవ సంభ్రమాయ** అనునది నిస్తుల **సాయంనటనోద్భటున్** అనియు **జటినే** అన్నది జటి అనియు వరుస క్రమము తప్పక అనూదితములు. ఇందు చివర **మహేశున్, దీన చింతామణిన్** అనునవి కవి కల్పితములు.

నిత్యం **స్వోదర పోషణాయ** అను శ్లోకమునకు **అకటా నిత్యము పొట్ట నింపుకొన** అను మత్తేభవృత్తము అనువాదము. **అకటా!** అను సంతాపార్థకముతో పద్యమారంభము. ఈ పద్యము మూల విధేయముగా అనూదితమైనను తెలుగు నుడికారమునకు ఎంతో ప్రాముఖ్య మీయబడినది. **నిత్యం స్వోదర పోషణాయ** అనుదానికి **నిత్యముపొట్ట నింపుకొన** అని చక్కని తెనిగింపు. సకలా నుద్దిశ్య **విత్తాశయా** వ్యర్థం పర్యటనం కరోమి అను వాక్యమునకు **విత్తాశన్** సదా కొంప కొంపకునల్లాడుదు అని తెనిగింపు. వ్యర్థముగాతిరుగుదును అనుటకంటె కొంపకొంపకు **నల్లాడుదు** అనుట అనుభవ పూర్వకమైన ఆవేదనను చక్కగా అభివ్యక్తము చేయగలుగుచున్నది. సకలానుద్దిశ్య అనగా అందరి నుద్దేశించి అనిఅర్థము. కాని అనువాదమున అర్థ గౌరవమును సాధించుటకై కవి కొంప కొంపకు అను జాతీయమగు నుడి కారమును ప్రయోగించెను. **భవతస్సేవాంనజానే** అను వాక్యమునకు **నీ చరణ సేవన్ జేయ** అని ఆంధ్రీకరణము. ఇందు మూలమున లేని చరణ శబ్దము ప్రయుక్తము. **మజ్జన్మాంతర పుణ్యపాక బలతః** అనుదానికి **మత్పూర్వ జన్మకృతంబౌ సుకృతంబుచేత** అని అనువాదము. **త్వం శర్వసర్వాంతరః** అనువాక్యమునకు **సకలాంతర్యామివౌ నీవు.** అని ఆంధ్రీకరణము. **తిష్ఠస్యేవ హితేన నాపశుపతే తే రక్షణీయోస్మ్యహం** అను ప్రస్తుత శ్లోక చతుర్థ పాదమునకు **నీవు తప్పక ఉన్నావు. అందుచేత ఓ పశు పతీ నేను నీకు రక్షింపదగిన వాడను** అని అర్థము. '**దీనినే బలిజేపల్లి 'మానక నాయందును లేక పోవిక ననంతానన్ను బ్రోవందగున్** అని తెనిగించినాడు, మూలమునందలి భావము లిందు పదపదమున యథాతథముగా అనువదింపబడక పోయినను అదే అర్థము ఎంతో విస్పష్టముగా హృదయ స్పర్శిగా ప్రకటితము. బిచ్చ మెత్తు కొను వాడు తన పొట్ట నింపు కొనుటకై యింటింటికి తిరుగుట మన మెరిగిన విషయమే. కావుననే కవి కొంపకొంపకు నల్లాడుదు గాని అని ఎంతో చక్కగా వక్కాణించెను. **అల్లాడు** అనుపదమునకు చలించు, తిరుగు క్షోభపడు, బాధనొందు అను అర్థములు నిఘంటువు నందు కలవు. వ్యర్థమైన పర్యటనమునకు పర్యాయ పదముగ అట్టి తెలుగు పదమును కవి ఎన్నుకొనుటలో ఆతని రసౌచిత్య స్ఫోరక రామణీయక హృదయము వెల్లడి అగుచున్నది.

ఏకో వారిజ బాంధవః అను శ్లోకమునకు **అరుణుండొక్కడె** అను మత్తేభము అనువాదము. ఈ శ్లోకమున అజ్ఞానమును తెర తొలగించి సాక్షాత్కరింపుమని పరమేశ్వరుని అభ్యర్థించుట జరిగినది. ఏకో వారిజ బాంధవః అనుదానికి **అరుణుండొక్కడె** అనియు **క్షితి నభోవ్యాప్తం తమో మండలంభిత్వా** అనుటకు **భూనభోంతర తమోహంకారమున్ మాన్పి** అనియు, **గోచరోపి భవతి** అనువాక్యమునకు **గోచరుడౌ దృష్టికి** అనియు **త్వం కోటి సూర్య ప్రభః** అను దానికి **నీవు కోట్యరుణ భాస్వాంతివై** అనియు అనువాదము. **వేద్యః కిం నభవసి అహో** అనువాక్యము **ఎందు నెవ్వారికిం గన్పడవేమి చిత్రమిది** అని ఆంధ్రీకరింపబడినవి. ఘనతరం **కీదృగ్భవేత్ మత్తమః** అను వాక్యమునకు **మాన్పన్ భారమా మత్తమ స్ఫురణంబున్** అని ఆంధ్రీకరణ. **తత్సర్వం వ్యపనీయమే పశుపతే సాక్షాత్ప్రసన్నోభవ** అనుతుది పాదమును **కరుణన్ వహింపుమిక శంభూ! సుప్రసన్నత్వమున్** అని తెనిగించెను. మూలమునందలి భావమే ప్రతి పాదితమైనను అభ్యర్థించిన పద్ధతిలో కొంత వైలక్షణ్యము సుప్రసన్నధోరణిలో ప్రకటితమైనది. మాన్పన్ భారమా అను అభ్యర్థన మూలమున అంత స్పష్టముగా లేదు. కరుణన్ వహింపుమని కవి అభ్యర్థన, దీనిని మూల కర్త అంధకారమును తొలగించి ప్రసన్నుడవు కమ్మని అర్థించినాడు. ఈ ప్రసన్నత్వమును ప్రస్తుత అనువాదకర్తయు పద్యాంతమున ప్రకటించి ఉన్నాడు.

**హంసః పద్మవనం సమిచ్ఛతి యథా నీలాంబుదం చాతకః** అను శ్లోకమున నేయే విధముల భగవత్ పాదారవింద భజన మొనర్పగా తన చిత్తము కోరుచున్నదో వివరింపబడినది. దీనికి **నిరతము వాన కోయిల వినీల పయోధరమున్** అను చంపకమాలావృత్తము అనువాదము. మూలమున రెండవ పాదమధ్యమున గల **ప్రతిదినం**, **నిరతము** అని పద్య ప్రారంభమున కూర్చబడినది. **హంసః పద్మవనం** అనుదానికి మరాళమంబుడుమ వనంబు అని ఆంధ్రీకరణ. **కోకః కోకనద ప్రియం** అనుదానికి **జక్కవనభోమణి** అని అనువాదము. **చంద్రం చకోరః** అనుదానికి **వెన్నెలపుల్గుయామి నీశ్వరు వలె** అని అనువాదము. మృగ్య అనువాక్యమున చిన్మార్గ మృగ్యమునకు **ఉపనిషత్ ప్రతిపాద్యము** అని **మామకంచేతః** అనుదానికి **నామనంబు** అని తెనిగింపు. **గౌరీ నాథ భవత్పాదాబ్జయుగళం కైవల్య సౌఖ్య ప్రదం** అనుతుది పాదము **ముక్తి సంస్క్రియాకరమగు నీ పదాంబుజయుగంబె** అని అనూదితము. **సమిచ్ఛతి, వాంఛతి** అను క్రియాశబ్దముల రెండింటికి **తలంచు** అను ఒకే ఒక క్రియా పదము ప్రయుక్తమైనది. మూలమున విభో! గౌరీ నాథ! పశుపతే! అను మూడు సంబోధనలు కలవు. కాని ప్రస్తుత పద్యమున **ఉమామహేశ్వరా!** అను సంబోధనమొక్కటియే ప్రయుక్తము. వాన కోయిల, జక్కవ, వెన్నెల పుల్గు అనునవి తప్ప తక్కిన రచన తత్సమ పద భూయిష్ఠముగనే సాగినది. మూలము వలె అనువాదమును ప్రసాద గుణ భరితమై ఒప్పుచున్నది.

**రోధస్తోయహృతః శ్రమేణ పథికః ఛాయాంతరోః** అను శ్లోకమునకు **వడబడువాడునీడయు** అను చంపకము అనువాదము. **శ్రమేణ పథికః ఛాయాంతరోః** అనగా **త్రోవ నడచెడివాడు మార్గ శ్రమ చేత వృక్షము యొక్క నీడను** అని ప్రస్తుత వాక్య భావము, దీనిని బలిజేపల్లి **వడబడువాడు నీడయు** అని ఎంతో చక్కగా తెనిగించెను. మూలమున కేవలము బాటసారి అని ఉన్నది. కాని ప్రస్తుత పద్యమున వడ దెబ్బ తగిలినవాడు నీడను ఆశ్రయించినట్లు తెలుపబడినది. ప్రస్తుత శ్లోకారంభము **రోధస్తోయహృతః** అనునది. అనగా ఉదక వేగము చేత ఆకర్షింపబడిన పురుషుడు తీరమును అని దీని భావము. దీనినే

బలిజేపల్లి ప్రవాహమునన్ బడనొద్దు అని తెనిగించెను. వృష్టితః భీతః స్వస్థ గృహం అను వాక్యమునకు పెంజడిన్ దడియ గృహంబు అని అనువాదము. దీనః ప్రభుం ధార్మికం అనుదానికి పేద వడదాత అని అనువాదము. శిశిరంశీతావృతః అను వాక్యము చలిన్ సెగ అనియు దీపం సంతమసాకులశ్చ అనుటకు చిమ్మ చీకటిన్ బడలిన దివ్వె అనియు తెనిగింపు. గృహస్థమతిథిః అనుదానికి అనువాదము లేదు. సర్వ భయాపహం వ్రజసుఖం శంభోః పదాంభోరుహం అను శ్లోక చతుర్థ పాదమునకు భవార్తి తొలంగి సౌఖ్యమున్ బడయ దలంచితేని మనమా! హర పాదములాశ్రయింపుమా! అని అనువాదము. సర్వభయాపహం అనుదానికి సకల భయములను పోగొట్టి అని అర్థము. కాని అనువాద కర్త భవార్తి తొలంగి అనిఅనువదించెను. చేతః అన్నమూలమునకు మనమా అన్న సంబోధనము సరిపోయినను ఆమనస్సును భవార్తి దొలగి సౌఖ్యమున్బడయ దలంచి తేని అని పేర్కొనుట కొంత వినూత్నతను వెలార్చుచున్నది. మూలమున పదాంభోరుహము అని ఏక వచనమే కలదు. కాని అనువాదకర్త హర పాదములని ద్వివచనము పేర్కొనెను. వ్రజ అన్న క్రియాపదమునకు ఆశ్రయింపుమా అన్నది ఆంధ్రీకరణము. ప్రస్తుత పద్యమున కవి చాల వరకు అచ్చ తెలుగు పదములనే ప్రయోగించెను.

అంకోలం నిజబీజ సంతతిః అను శ్లోకమునకు సతియాత్మీయపతిన్ అను మత్తేభము అనువాదము భక్తి స్వరూపమిందు నిర్ణయింపబడినది. మూలమునందలి క్రమము అనువాదమున లేదు. రెండవ పాదారంభము నందలి సాధ్వీనైజవిభుం లతాక్షితిరుహం అను క్రమము పాదారంభము నందలి సతి యాత్మీయ పతిన్ లతావితతి వృక్షంబు అని పేర్కొనిన అనంతరము అంకోలం నిజబీజ సంతతిః అనుదానికి ఆత్మ బీజంపుసంతతి యంకోలము అని అనువదింపబడినది. పిమ్మట సింధుః సరిద్వల్లభం అను వాక్యమునకు ఏల్ల పాంపతిని అని ఆంధ్రీకరించిరి. శ్లోకమున అయస్కాంతోపలోసూచికా అనుటకు పెంటన్ సూది సూదంటురా అని తెనిగింపు. శ్లోకమున మూడవపాదము ప్రాప్నోతీహయధా తథా పశు పతేః పాదార విందద్వయం అనునది దీనికి సతమెచ్చంగిపెనంగు పదాబ్జాతంబులందున్ అని అనువాదము. సాభక్తిః అనుటకు అదియేకాభక్తి అని ఆంధ్రీకరణము.పెనంగి ఉండుట అను తెనుగుపదమునకు మూలములేదు ఉపేత్య తిష్ఠతి సదా ఎల్లప్పుడును పొంది ఉండుచున్నదని మూలము కాని అనువాదకర్త ఒకటికి రెండు మార్లుగ సతమెచ్చంగి పెనంగు అబ్బంగి పెనంగి ఉండుట అని పెనంగి శబ్దమును పేర్కొనిరి పెనగుట అను శబ్దమునకు చుట్టుకొనుట, ఆవరించుట, కూడు, చేరు, మెలిగొను, సంభవించు అను నర్థములున్నవి. ఈ అర్థములన్నియు ఒకదాని యందు ఒకటి ప్రగాఢముగ విలీనమగుస్థితిని ప్రకటించుచున్నవి. భక్తప్రియా అను పద్యాంతమునందలి సంబోధనము సాభిప్రాయము. భక్తి స్వరూపమును నిర్ణయించుచు భక్త ప్రియా! అని పరమేశ్వరుని సంబోధించుట ఎంతో ఔచిత్యవంతము.

అరువది రెండవ శ్లోకమున తల్లి బిడ్డను పోషించునట్లు భక్తి భక్తుని కాపాడునని వివరింపబడినది. ఆనందాశ్రుభిరాతనోతి పులకంనైర్మల్యతచ్ఛాదనం అను శ్లోకమునకు పులకలు వార నా మూల నానందాశ్రు పూరంబులను లాలబోసి పోసి అను సీసము అనువాదము. మూలమున గల పులకలు, ఆనందాశ్రువులు అనువాదమున పేర్కొనబడినను మూలమున కన్న ఎంతో సౌందర్యవంతముగా వాత్సల్యభరితముగ వాక్యము పూరంబులను లాల బోసిపోసి అని విస్తరింపబడినది. మూలమున ఆమూలమని లేదు. లాలబోసి పోసి అను ప్రయోగమున తెలుగు నుడికార మెంతో నిండుగా చిప్పిల్లినది. పోసి పోసి అని రెండు మార్లు

క్రియా పదములను పేర్కొనుటచే వాత్సల్యాతిశయము పెల్లుబికినట్లు ప్రకటితమైనది. ఇట్లే అన్ని పాదములందును ఒకటికి రెండు మార్లు క్రియా పదములు పేర్కొని వాత్సల్య స్ఫూర్తి గల మూర్తిని మన కన్నుల ఎదుట బలిజేపల్లి సాక్షాత్కరింపజేసినాడు. **నైర్మల్యతః ఛాదనం (ఆతనోతి)** అను భావము **కలుషంబులేని విజ్ఞానంబువలని మెత్తలిమంపుఁ బొత్తుల దార్చి తార్చి** అని అనువదింపబడినది. [9] మూలమున ఛాదనమనగా కప్పు వస్త్రము. కాని అనువాదకర్త **మెత్తలిమంపు పొత్తులుగ** వివరించినాడు. తలి మ మనగా మృదువైన దూది పరుపు పొత్తి అనగా మెత్తని సన్నని పాత వస్త్రము. తార్చుట అనగా ఉంచుట లేక చేర్చుట. మూలమున కేవలము నైర్మల్యమను పదము మాత్రమే ఉన్నది. దీనికి అనువాదకుడు విజ్ఞానమును జత పరచి కలుషంబులేని విజ్ఞానముగా పేర్కొనినాడు. అనగా కల్లకపటము తెలియని పసి కందుల నిర్మలత్వము ఆ బిడ్డల యెడ తల్లి చూపు వాత్సల్యాతిశయమిందు వ్యంజింపబడినది. వాచా శంఖముఖైః స్థితైః జఠరా పూర్తించరిత్రామృతైః అను భావమును **మొలక పల్కుల గిన్నెయల తోడ నీ కథా పీయూషమున నుగ్గు బెట్టి పెట్టి** అని బలిజేపల్లి వారు అనువదించిరి. వాక్కనెడు శంఖము యొక్కముఖమందున్న చరిత్రలనియెడి పాలచేతను ఉదరము నిండించుటను విస్తరింప జేయుచున్నదని అనువాదకర్త మూలమునకు అర్థవివరణ గావించి ఉన్నాడు. అతడే తన అనువాదమున వాచా శంఖములను మొలక పల్కుల గిన్నియల ని పేర్కొనినాడు. **చిత్రామృతైః** అనుదానికి **నీకథా పీయూషమున** అని ఆంధ్రీకరణము. జఠ **రాపూర్తం** అనుదానికి మారుగ ఉగ్గుపెట్టి అను మూలమున లేని సౌందర్యమును. అర్థగౌరవమును సంతరించి ఉన్నాడు. రుద్రాక్షైః వపుషం రక్షాం (తనోతి) అనువాక్యమునకు కల అరిష్టములెల్ల తొలగ రుద్రాక్షలన్ బూదులన్ రక్షలు పూన్చి పూన్చి అని అనువాదము. ఇందు అరిష్టముల ప్రసక్తి మూలమున లేదు. బాలారిష్ట దోషపరిహారార్థముగ రక్షలు కట్టుట సహజము. ఆభావమునే అనువాదకుడు కల అరిష్టములెల్ల తొలగ అని వివరించిఉన్నాడు. **భవద్భావానాంపర్యంకేచినివేశ** అను వాక్యమునకు **అవిరతధ్యానమనెడి ఉయ్యాలనునిచి** అని అనువాదము. [10] భానకు మారుగ ధ్యానమను పదమును బలిజేపల్లి గ్రహించుట ఎంతో అర్థవంతముగా ఉన్నది. అట్టుపై గీత పద్యమునందలి రెండు పాదములను అనువాదకుడు స్వయముగా విస్తరించి వ్రాసెను. హాయిగా జోల పాడుచు నరసి యరసి యేట బెంచెడు వానిని బూటఁబెంచు - అను రెండు పాదములలో మూలమున లేని మాతృ భావము మరి కొంత విస్తరింపబడినది. మంచము నందు ఉంచి రక్షించు చున్నదనియే మూలము నందలి భావము. ఈ కవి మంచమును పేర్కొనక ఉయ్యాల నునిచి అని అనువదించెను. ఉయ్యాలలో ఉంచినంత మాత్రమున తల్లి బాధ్యత తీరి పోదు. అట్టుపై జోల పాడవలసిన అవసరమున్నది. అదియును హాయిగా పాడినప్పుడే శిశువు నిద్రించును. శిశువును నిద్రపుచ్చుటయే మాతృదేవి పరమ లక్ష్యము గాదు. వానిని దినదిన ప్రవర్ధమానమగునట్లు పెంచవలసిన కర్తవ్యము తల్లిపై నున్నది. తల్లికి బిడ్డకు గల సంబంధము అనిర్వచనీయము. ప్రతి మాతృదేవియు తన బిడ్డ త్వరగా పెరిగి పెద్దవాడు కావలెనని భావించును. సంవత్సరము పెంచెడి వానిని ఒక పూటలోనే పెంచగల్గుట మాతృవాత్సల్యాతి శయమును తెలుపుచున్నది. **భక్తి జననీ భక్తార్భకం రక్షతి** అని తుది వాక్యము. దీనిని పెంచు **భక్తుడను పిల్లవాని సద్భక్తి** జనని అని చక్కగా అనువదించెను. మూలమున కేవలము భక్తి జననీ అని మాత్రమే ఉన్నది. కాని అనువాదకర్త ఆభక్తికి **సత్** అను విశేషణమును తగిలించి మరి కొంత అర్థవైపుల్యమును ప్రకటించెను. భక్తార్భకం అను రూపకమునకు **భక్తుడను పిల్లవాని** అనునది చక్కని అనువాదము.

అరువది మూడవ శ్లోకమున శివభక్తి వైచిత్ర్యము అనగా తిన్నని భక్తి పరాయణత్వము అభివర్ణితము. **మార్గావర్తిత పాదుకా పశుపతే రంగస్య కూర్చాయతే** అని శ్లోక ప్రారంభము. దీనికి **పలుమరుదారి ద్రొక్కబడు పాదుకశూలికి గూర్చ** అను చంపమాల అనువాదము **గంధూషాంబునిషేచనం పురరిపోర్దివ్యాభిషేకాయతే** అనునది రెండవ పాదము. దీనికా **పుక్కిటన్ జెలగెడు నీర్పు రారికభిషేక బజలంబు** అని అనువాదము. మూడవపాదము **కించి ద్భక్షిత మాంస శేషకబళం నవ్యోపహారాయతే** అనునది దీనిని అరదిన్న నీచపుంబలలవంబు మాపతికి బారణ అని అనువదించెను. మాంస శేషమునకు పలలలవంబు అని ప్రయోగము . **నవ్యోపహారాయతే** అనుదానికి **పారణ** అని మాత్రమే అనువాదము వనచరో భక్తా వతంసాయతే అని శ్లోకపాదాంతము దీనిని బలిజేపల్లి కాన జనించు బోయ భక్తులకు వలంతి యయ్యె అని అనువదించెను. చతుర్థ పాదారంభమునందలి **భక్తిః కింనకరోత్యహో** అనునది తుదకున్ దృఢ భక్తి సాటి యున్నదే అని పద్యాంతమున ప్రయుక్తము మూల మందలి అన్ని పాదములలో **వతె ఆచరించుచున్నది.** అని అర్థమొసగు ఆయతే శబ్దము ప్రయుక్తము కాని దీనిని బలిజేపల్లి నామవాచకముగనే ప్రయోగించెను. **కూర్చాయతే** అనగగా భూమధ్య స్థానము వలె ఆచరింపుచున్నదని అర్థము. దీనిని కూర్చ అన క్రియా పదమున తెనిగించెను. మూలము నందలి భావమునకు ఈ క్రియా పదమునకు అర్థమునంద ఎంతో వ్యత్యాసమున్నను ఆ ప్రయత్నముగ పద సామ్యము కుదురుకొన గలిగినది **కించి ద్భక్షిత** అనుటకు అరదిన్న అను అచ్చ తెలుగు ప్రయోగము ఎంతో అర్థవంతముగ కూర్పబడినది. నీచపుంపలలవంబు తోని నీచపు అను శబ్దము విశేషార్థద్యోతకము.

ఆరువదు నాల్గన శ్లోకమున ఆది శంకరులు పరమ శివునితో తన చిత్తపాదులకలను తొదిగి కొని విహరింపుమని ప్రార్థించినాడు. **వక్షస్తాడన మంతకస్య** అను ఈ శ్లోకమునకు **ఘోరతమంబడంప** అను ఉత్పలమాలావృత్తము అనువాదము. మూలమున **కఠినాపస్మారసంమర్దనమ్** అనునది ప్రథమ పాదాంతము దీనిని అనువాదకర్త ఘోరతమంబడంప అని పద్య ప్రారంభముగా గ్రహించెను **భూభృత్పర్యటనం** అను ద్వితీయ పాదారంభమును కరకున్ గిరికోనజరింప అని కవి తెనిగించెను. వక్ష స్తాడన మంత కస్య అను శ్లోకారంభమును దుంత **బాబారవుతున్ దిటంపు ఔదపైపడదన్న** అని అచ్చతెలుగు పదములలో చక్కగా తెనిగించెను. నమత్ సురశిరః కోటీర సంఘర్షణం అను ప్రయోగమును **సమత్సుపర్వ కోటీర పురాయిడిన్** అని అనువదించెను. మృదులస్య తావక పద ద్వంద్వస్య అనుటకు **నీ మృదుపాదముల్** అని అనువాదము! మచ్చేతోమణి పాదుకా విహరణం సదాంగీకురు అను వాక్యమునకు **మదీయ చిత్త మణి పాదుకలందు చరింపరాదొకో** అని ఆంధ్రీకరణము మూలమున గౌరీ పతే, శంభో అను రెండు సంబోధనములున్నవి ఇవి అనువాదమున లేవు. **నలిగెడిన్గద** అను క్రియా పదము మూలమునందలి కోటీర సంఘర్షణమునకు అను సంధింపబడినది. పాదుకా విహరణమును ఎల్లప్పుడు అంగీకరింపుమని మూల మునందలి భావము దీనికి యధాతధానువాదము తెనుగునకొంత వికటించును. కావునసే చిత్తమణి పాదుకలందు జరింపరాదొకో అని తెనిగించుట జరిగినది. జగద్భారమదీయ **చిత్తమణి పాదులందు** అను ప్రయోగమున **జగద్భార** అను సమాసము కవి కల్పన. ఈ శ్లోక భావమునే బలిజేపల్లి మరియొక మత్తేభవృత్తమందు అనువదించెను. అది పాఠాంతరము **కఱకుంగొండ జరింపదండధరు వక్షః పీఠి దాడింప** అని అనువాదమున **భూభృత్ పర్యటనం** అనిదానికి కఱకుం గొండజరింప అనియు **వక్షస్తాడవ మంతకస్య** అనుదానికి దండధరు **వక్షః పీఠి**

దాడింపఁ అనియు తరినాపస్మారసంవర్ధనమ్ అను విశేషణమునకు నిష్ఠుర నీరంధ్రతమంబడంప అనియు సమత్సుర శిరః కోటీర సంఘర్షణం అను ప్రయోగమునకు మనస్కుర్వాణ గీర్వాణ శేఖర కోటీరములాన అనియు మృదులస్య తావకపద ద్వంద్వస్య అను ప్రయోగమునకు పేదలిరు ముల్కాల్ నొచ్చునీ పాదముల్ అనియు మచ్చేతో మణి పాదుకా విహరణం అనుదానికి మన్మనోమణిమయాంచత్పాదుకా పాళిపై అనియు అనువాదము. అంగీకురు అను క్రియా పదము చరియింపంగదె అని తెలుపబడినది.

వక్షస్తాడన శంకయా విచలితో వైవస్వతో నిర్జరాః అను శ్లోకమునకు ఎదపయి దన్నునంచు యముడింతటనంతట బాఱు వేలుపుల్ అను చంపకమాలావృత్తము ఆంధ్రీకరణము. యమధర్మరాజు ఱొమ్ము తన్నుట యొక్కశంకచే పలాయమానుడగు చున్నాడని ప్రస్తుత వాక్య సారాంశము. ఇట శంకచేత అనునది అనూదితము కాలేదు. తన్ను నంచు అని మాత్రమేపేర్కొనబడినది. విచలితః అను పదమునకు యింతట నంతట బాఱు అనునది చక్కని చిక్కని తెనిగింపు. మూలమున లేని సౌందర్యమును. అర్థగాంభీర్యమును దిక్కుతెలియక అటు నిటు పరుగెత్తు యముని పరముగ ఇంతట నంతట అని పేర్కొనుట ఎంతో ఔచిత్యవంతము నిర్జరాః కోటీ రోజ్జ్వల రత్నదీప కలికా నీరాజనం కుర్వతే అనునది రెండవ వాక్యము . దీనికి వేలుపుల్ గదిసి కిరీటరత్నకలికాతతి నారతులెత్తు చుంద్రు అని అనువాదము. మూలమున సమాసగతమై ఉన్న భావమును విడివిడి పదములతో నిట అనువదించుట జరిగినది. రత్న దీపకలికా అను సమాసము యథాతథముగ పరిగ్రహింపబడినది. మూలమున మొదటి పాదము నిర్జరాః అని ముగియును. ప్రస్తుతము అనువాదకుడు ఎన్ను కున్న చంపకమాలావృత్తము ప్రథమ పాదము వేలుపుల్ అని ముగియుచున్నద. కదిసి అనుదానికి మూలము లేదు కోటీర శబ్దమునకు పర్యాయముగ కిరీట శబ్దము ప్రయుక్తము ఇక మూడవ పాదము దృష్ట్వా ముక్తివ ధూస్తనోతి ని భృతాశ్లేషంభవానీ పతే అనునది. దీనికి తానెదురయి ముక్తికాంతదని యించుచు గాటవు గౌగిలింతలన్ అని తెనిగింపు ముక్తి వధువు గాఢా లింగనము కలిగించుట, చేయుట అని మాత్రమే అర్థము కాని అనువాదమున ఎంతో అర్థవైశిష్ట్యముగలతనియించుచు అను క్రియా పదము ప్రయుక్తమయినది. భవానీ పతే! అన్న సంబోధనమునకు దృష్ట్వా అను క్త్వార్థక పదమునకును అనువాదము లేదు. ఇందు చివరి పాదము యచ్చేత స్తవ పాదపద్మ భజనం తస్యేహకిందుర్లభం అనునది. దీనకి మది భవదీయ పాదములనాటిన వానికి కేటిలోటిలన్ అనునది అనువాదము. తన పాదపద్మ భజనం అనుటకు భవదీయ పాదమున నాటిన అని యచ్చేతః తస్య అనుటకు మది నాటిన వానికి అని అన్వయము. భజనము అన్న పదమునకు మారుగ నాటిన అని యతి స్థానమున కవి పేర్కొనెను. ఇహదుర్లభంకిం అను తుది వాక్యమునకు ఇకేటి లోటిలన్ అని చెక్కని తెనిగింపుఇందు ఇహ శబ్దమునకు ఇలన్ అని తెనిగింపు దుర్లభం అను శబ్దమునకు లోటు అ తెనుగుసేత. ఇట్లే అనువాదమున పరమ శివుని పాదార విందముల సేవించువారికి దుర్భరమేమియు లేదని రూఢిగ చెప్పబడినది.

క్రీడార్థం సృజసి ప్రపంచ మఖిలం క్రీడా మృగాస్తే జనాః అను 6 6 వశ్లోకమునకు నీయాడించు మృగంబులీజనులు తండ్రీ! అను శార్దూలము అనువాదము. క్రీడా మృగాస్తే జనాః అను వాక్యభావము ప్రస్తుత పద్య ప్రారంభము క్రీడార్థం సృజసి ప్రపంచ మఖిలం అనుటకు లోకపుం జేత క్రీడ యత్నలవంబు అని ఆంధ్రీకరణము . సమస్తమయిన లోకమును విలాసమే ప్రయోజనముగా గలుగునట్లుగా సృజించుచున్నావని మూల వాక్యము యొక్కభావము ఇందు లోకపుం జేత అనునది ప్రపంచసృష్టి అను అర్థమున కూర్పబడినది. యత్కర్మాచరితం

మయాచ భవతః ప్రీత్యై **భవత్త్వేవతత్** అను వాక్యమునకు నాచేత నేయే కర్మమాచరింపబడుచున్నదో ఆ కర్మ నీయొక్క ప్రేమ కొఅకు అగుచున్నది అని భావము. దీనినే ఇక **మాకృతంబులగు చేష్టల్ కర్మముల్ గాని బాగోయోగోయవి నీ ముదంబునకెగాదో** అని అనువదించెను. ఈ అనువాదము నందు స్వస్య **కుతూహలస్సకరణం మచ్చేష్టితం నిశ్చితం** అను బావము పొదుగబడినది. **భవతః** ప్రీత్యై స్వస్య **కుతూహలస్య కరణం** అను రెండింటికిని నీ ముదంబునకె గాదే అని అనువాదము. **కర్మాచరితం మచ్చేష్టితం** అను రెండును **చేష్టల్ కర్మముల్** అని వరుసగా ప్రయుక్తములైనవి. బాగోయోగో అనునది కవి కల్పితము. ఈ తెలుగు పలుకుబడివలన పద్యమునకెంతో దీప్తి రసౌచితి ఘటిల్లినది శ్లోకమున చతుర్థపాదమున **తస్మాన్ మామక రక్షణం పశుపతే కర్తవ్యమేవత్వయా** అనునది దీనికి ఏలామము. బ్రోవకుండెదవు శంభూ ! లోకరక్షాగురూ! అని ఆంధ్రీకరణము. నా సంరక్షణము నీచేత చేయదగ్గదే అగుచున్నది. అని మూలవాక్యము యొక్కభావము. మూలమున పశుపతే అన్న సంబోధన ఎంతో అర్థవంతము. దానికి కారణము అతనికి ఈ జనులు క్రీడా మృగములగుట. ఆ సంబోధన అనువాదమునలేదు. మూడవ పాదారంభమున గల**శంభో శంభూ** అయినది. ఇంక **మాదోసమేదో యేలామము బ్రోవకుండెదవు** అని అర్థించుటలో మూలము నందలి భావమే కొంత పరోక్షముగా ప్రకటితము. మామక రక్షణమే నీ కర్తవ్యమని మూలము. ఇటకవి ఇంకను అని కల్పించి ఆ దోసము మూలమున మమ్ము ఏలా బ్రోవకుండెదవని వేడుకొనుట జరిగినది. ఈ పద్యమున తుట్టతుది లోకరక్షాగురూసంబోధనము కవి స్వకపోల కల్పితము ఇందు మొత్తము అభ్యర్థనము యొక్కభావము ఇమిడి ఉన్నది. అతడు లోకమును సృష్టించువాడు రక్షించువాడు. కావుననే లోకరక్షాగురూ! అన్నది ! పశుపతే అను సంబోధనము కంటె మొత్తము శ్లోక భావమును ప్రకటించు అనువాదకుని అర్థగౌరవ స్ఫూర్తిని వెల్లడించుచున్నది. ప్రథమ పాదమున యతి స్థానమున తండ్రీ! అని సంబోధించిగాఢమమైన ఒక నిట్టూర్పుతో కొంచెము సేపు విశ్రమించుట ఎంతో ఔచిత్యము. ఇందు కవి ప్రతిభా స్ఫూర్తి ప్రకటితము.

**బహువిధ పరితోష బాష్పపూరస్ఫుట పులకాంకిత చారు భోగ భూమిం** అను శ్లోకమునకు **అమితానంద సుధా** శ్రు **పూరపుల కాంకా రూఢబోగాది విశ్రమమై** అను మత్తేభము అనువాదము. మూలమునగల సమాసగతమైన రచనా పద్ధతియే అనువాదము నందును పాటింపబడినది. **బహువిధ పరితోష** అనుటకు **అమితానంద** అనియు, **బాష్పపూర** అనుటకు **సుధా**శ్రు**పూర** అనియు **పులకాంకిత చారు** అనుటకు **పులకాంకారూఢ** అనియు, **భోగ భూమిం** అనుటకు **భోగాది విశ్రమమై** అనియు అనువాదము. ఇట్లే చిరపద **ఫలకాంక్షిసేవ్యమానాం** అనుదానికి **శాశ్వత భాగధేయ ఫలకాంక్షా** బద్ధదీక్షా **మనస్కమునీట్సంతత సేవ్యమానమయి** అని సుదీర్ఘసమాస ఘటితముగ ఆంధ్రీకరణ జరిగినది. మూలమునగల ఫలకాంక్షి సేవ్యమాన ప్రయోగములు అనువాదము నందును ప్రయుక్తములు. కాని అనువాదమునమరికొంత వివరణము ఓజో గుణ భూయిష్ఠరచనా విధానమునందు వెల్లడి అయినది. పిమ్మట మూలమునలేని **భావము హింసారూపసంసార**[2] నాల్గవ పాదము పరమ సదాశివ భావంప్రపద్యే అన్నది. దీనినే **పార్వతీశ్వర పదాబ్జ ధ్యానమాశించెదన్** అని ఆంధ్రీకరించెను. ప్రపద్యే శబ్దమున శరణు పొందు చున్నాను భావము ప్రతిపాదింపబడగా **ఆశించెదన్** అను క్రియా పదమున అట్టి శరణా గత భావమునే అను వాదకుడు వెల్లడించెను. పద్యమును కొంత విస్తరించు సందర్భమున మూలమున లేని భావమును సమయసముచిత సమరస దృష్టితో సమన్వయించుట జరిగినది.

**అమిత ముదమృతం ముహుర్ముహంతీం** అను శ్లోకము **వితతముదమృతము బితుకు** అను కందపద్యమున అనూదితము. అపారానందామృతము నొసగు ఏకైక భక్తి ధేనువును కాపాడుమని ప్రస్తుత శ్లోక భావము. మూలము నగల **అమిత** అనువాదమున **వితత** అయినది. **ముహుహుః** శబ్దమునకు అనువాదములేదు అది లేకున్నను అర్థ భంగము వాటిల్లదు. **సుపుణ్యపాకాం** అను విశేషణమునకు **సుకృత ఫలమున సంవసించు** అని ఆంధ్రీకరణము. **విమల భవత్పద గోష్ఠం ఆవసంతీం** అను విశేషణము **త్వదీయాంచిత పాద గోష్ఠమున** అని అనూదితము. **మమ పరిపాలయ భక్తి ధేను మేకాం** అను వాక్యమునకు **మద్భక్తి యను గోవు బాలింపుదయన్** అని భాషాంతరీకరణము. మూలమునందలి **సదయ పశుపతే** సంబోధనములు సాభిప్రాయములు కావునే అనువాదకుడును **పశుపతి** అని సంబోధించి **దయన్** పాలింపుమని అర్థించెను. **దయన్** అనునది విడిగా ప్రయుక్తమైనది. రెండవపాదయతి స్థానమున **ఈశ** అను సంభోధనమును కూడ కవి కూర్చెను.

**జడతా పశుతాకళంకితా** అను శ్లోకమునకు **లేదు జడత్వము కుటిలత** అను కందమనువాదము. అనేక దోషములకు ఆటపట్టు అయినను చంద్రుని వలెనన్నును చేకొనుమని శ్లోకతాత్పర్యము. ప్రస్తుత శ్లోకమున వరుసగా చంద్రుని యందుదోషములు చెప్పబడినవి. ఈ దోషములనే అనువాదకుడు కొంత అటు నిటు మార్చి **లేదు జడత్వము కుటిలత లేదు కళంకితయు లేదు లేదు పశు తయున్** అని పేర్కొనెను. మూలమున అన్ని దోషములకు **నాస్తి** అను ఒకే క్రియా పదము కలదు. అనువాదకుడు ప్రతి దోషమునకు **లేదు లేదు** అను క్రియాపదమును ఒకటికి నాలుగు మార్లుగా నొక్కివక్కాణించెను. **దేవ అస్తి యది రాజమౌళే భవదా భరణస్య నాస్తికిం పాత్రం** అను వాక్యమునకు ఓ దేవ! చంద్రుని శిరస్సునందు భూషణముగా గలవాడా! నాయందు అట్టి దోషములునున్న నీయొక్క ఆభరణమునకు పాత్రమైన వాడను కానా ఏమి అని భావము దీనినే అనువాదకుడు **నాదెస కాదని నీ భూషాదులకున్ రాజమౌళి అర్హుడగానే** అని అనువదించెను. రాజమౌళి అను సంబోధనము సాభిప్రాయము అగుటచే అనువాదము నందును తప్పక అను సరింపబడినది. **నాస్తికిం పాత్రం** అనుటకు **అర్హుడగానే** అనునది చక్కని ఆంధ్రీకరణము **భవదా భరణస్యలో** ఏకవచనము మాత్రమే ఉన్నది. నీ భూషాదులకున్ అని బహువచనమున **ఆది** శబ్దమును అనునందించుట చే ఎంతో అర్థగాంభీర్యమేర్పడినది. బలిజేపల్లి ప్రతి పద్యమునందును మూలమునలేని అర్థ గాంభీర్యమును ఎంతో స్వతంత్రించి సమకూర్చుటకై ప్రయత్నించి కృతకృత్యుడయ్యెను.

అరహసి రహసి స్వతంత్ర బుద్ధ్యా పరివసితుం సులభః ప్రసన్న మూర్తిః అనుశ్లోకమునకు **బహిరంతఃకరణ స్వాతంత్రవమతి** అను మత్తేభవృత్తము పర్యాయపదపూర్వకమైన ఆంధ్రీకరణము. **పరివసితుం సులభః ప్రసన్నః మూర్తిః** అనుదానికి పరిచర్య చేయుటకై సులభుడైనవాడు ప్రసాదోన్ముఖమయిన స్వరూపము కలిగినట్టి వాడని భావము. దీనినే అనువాదకుడు మరికొంత విస్తరించి సుదీర్ఘ సమాస ఘటితముగా ముహుర్ముహురానందరస ప్రసన్న కరుణా స్ఫూర్తిన్ స్ఫుర న్మూర్తియై అని అనువదించెను. స్ఫూర్తి మూర్తి అని అను ప్రాసము పాటింపబడినది. కేవల ప్రసన్నమూర్తి అనక మాటిమాటికి ఆనందరసమును ప్రసాదించు కరుణా మూర్తిగా పేర్కొనుట ఎంతో ఔచిత్యవంతము శ్లోకాంతమున రాజశేఖరః అనునొక విశేషణమున్నది. దీనినే తృతీయ పాదమున **మహనీయుండగు రాజమౌళి**అని అనువదించెను. **జగదధికః** అన్నది **త్రిజగన్మాన్యుండు** అనియు **అగణిత ఫలదాయకః** అనునది **అగణ్య ప్రియావహుడై** అనియు అనూదితము. మూలమున గల ఫలమునొసగువాడు అనునది

ప్రియావహుడుగ మారినది. ఫలమును ఒసగుట కంటె ప్రియావహుడగుట విశేషము. మేహ్యాది అనుదానికి మామది అని ఆంధ్రీకరణము. ప్రస్తుత పద్యాంతమున ప్రత్యహంబునికి సల్పన్ జింతనాకే మికన్ అను వాక్యమున్నది. దీనికి మూలములేదు. సులభః అను మూలమునందలి భావమునకు నిది స్వతంత్రించి చేసిన అనుసరణ. స్వతంత్రమతి సంభావించి కొల్చుట భక్తుని లక్షణమే కాదు ఉత్తమ కవి యొక్క ధ్యేయమనియు నిందు సూత్ర ప్రాయముగ కవి ప్రకటించెను.

**ఆరూఢభక్తి గుణ కుంచిత చాపయుక్తైః** అను శ్లోకమున ఈశ్వరస్మరణచే పాపములు నిర్మూలమై పోయి విద్వద్వరిష్ఠుడు శివ సారూప్యము పొందునని చెప్పబడినది . ఈ శ్లోకమొక రాజపర్యాయముగ కూడ నర్థమగు చున్నదని బలిజేపల్లిగారి వివరణ. ఇందలి మొదటి పాదమునకు భావమను వింట నారూఢ భక్తి గుణమోపి అని అనువాదము శివస్మరణ బాణైః అమోఘైః అనుటకు పరశివ చింతనామోఘశరములేసి అని ఆంధ్రీకరణము. నిర్జిత్య కిల్బిషరిపూన్ అను ప్రయోగమునకు కిల్బిషరిపుల జయించి అని అనువాదము. విజయీ సుధీంద్రః సానంద మావహతి సుస్థిరరాజ లక్ష్మీమ్ అను వాక్యమునకు సుమతి ప్రమదమును గాంచు సుస్థిరరాజు లక్ష్మి అని అనువాదము. సుధీంద్ర అనుటకు సుమతి అనియు సానందం ఆవహతి అను ప్రయోగమునకు ప్రమదమును గాంచు అనియు ఆంధ్రీకరణము. సుస్థిర రాజలక్ష్మి యథాతథముగనే అనూదితము. రాజు ధనుర్బాణములతో శత్రురాజులజయించి రాజలక్ష్మిని పొంది సార్వభౌముడయిన విధముగనే విద్యద్వరిష్ఠుడు ఆరూఢభక్తిని అల్లె త్రాడుగా, అంతఃకరణ వృత్తిని ధనుస్సుగా అమర్చుకొని ఈశ్వరస్మరణమునే బాణముగా అనుసంధించి, పాపములను శత్రువుల నెల్ల వధించి పరమానందముతో పరమేశ్వర సారూప్య లక్ష్మిని పొంది దుష్టనిగ్రహ శిష్టపరిపాలనా రూపముగా సర్వశాసకుడు అగుచున్నాడని ప్రస్తుత పద్యతాత్పర్యము.

**ధ్యానాంజనేన సమవేక్ష్య** అను శ్లోకము పనితధ్యానమహాంజనంబున అని అనూదితము. మూలమున ధ్యానాంజనేన అని కలదు. కాని దానికి పనిత అను విశేషణము కూర్పబడినది. అంజనమునకున మహా అను విశేషణము ను కవి కల్పించెను. పనిత శబ్దమునకు పొగడబడిన అని అర్థము. ప్రాస స్థానమునగల యిందలినకారము తక్కిన పాదములతో చక్కగ నతికినది. సమవేక్ష్య అనుటకు అనువాదము లేదు. తమః ప్రదేశం అన్నది. తమోవాటిన్ అని అనూదితము భిత్వా అను అసమాపక క్రియకు ప్రపాటించి అని ఆంధ్రీకరణము . వాటింబ్రపాటించి అను ప్రయోగము శబ్దాలంకార సౌందర్య దీప్తితో నొప్పారుచున్నది. ఉపసర్గయుక్తమైన ప్రపాటించి శబ్దమువలన అర్థగౌరవము పుంజుకొన్నది. మహాబలభిరీశ్వరనామమంత్రైః అనుదానికి భవదీయ నామ జపమంత్ర శ్రీబలిన్ గూర్చి అని ఆంధ్రీకరణము. ఇందు ఈశ్వర శబ్దమునకు మారుగా భవదీయ అని ప్రయోగము. ఇది భగవంతునితోడి అతి సాన్నిహిత్యమును వ్యక్తము చేయుచున్నది. మూలమున లేని పద ప్రయోగము అర్థ గౌరవ ప్రదము మహాబలిభిః అనుటకు బదులు ఏకవచనమున శ్రీబలి అని బలిజేపల్లి పేర్కొనిరి. రెండవ పాదారంభములో ఆత్మనిరూఢిన్ అని స్వతంత్ర ప్రయోగము ఇందలి మ వలన యతిని ని వలన ప్రాసను సులభతరముగా కవి సాధించిరి. అంతేగాదు. ఇది పద్యరచనా ప్రౌఢిమను హృద్యతర గాంభీర్యమును సంతరింపజేసినది. దివ్యానిషేవ్యంబు అనునది. దివ్యాశ్రితం అనుదానికి ఆంధ్రీకరణము. ఆశ్రితమనగా పొందబడునటు వంటిది. అని అర్థము. నిషేవ్యము అనగా చక్కగా సేవింపదగినది. అని భావము. ఈ పదము మూలమునకన్న కొంత భిన్నమై సేవా భావమును ప్రస్ఫుటము చేయుచున్నది.

అటుపై భుజంగ భూషణమను పదము రెండింటియందును సమానమే. **తేపాదపద్మం** అను మూలమునకు భావత్పాదార విందనిధానంబు ను అని అనువాదము. **యే ఇహ ఉద్వహంతి తేకృతార్థాః** అను ప్రయోగములో **ఉద్వహంతి** అనుదానికి బదులు **చూరగొన్న** అను తెనుగు సేత ఎంతో తేట తెల్లముగా నున్నది. కృతార్థః అనుదానికి **ధన్యుండు** అని ఆంధ్రీకరణము. శివ అనుటకు **ఉమానాయకా** అని పద్యాంతము. పాదారవిందమును నిధానము**తో** అన్వయించుట బలిజేపల్లి రచనా విధానమునందలి విశిష్టతను వ్యక్తము చేయుచున్నది. నిధానము నందలి ని నాల్గవ పాదారంభ ప్రాసస్థానమున నిబంధింపబడినది. మూడవ పాదము యతి స్థానముల **భావత్క** అను పదమునందలి భ పాదారంభము నందలి వ్యలోని వ కారము**తో** పొసగినది భావత్కపద వ్యుత్పత్తి తదర్థ స్ఫూర్తి పరామర్శింపదగి ఉన్నది.

**భూదారతాముదవహద్యదపేక్షయా శ్రీభూదార** అను శ్లోకమునకు **ముక్తి యను మేటి సంజీవి మొలచునట్టి** అను పద్యము అనువాదము. మూలమున శ్రీ భూదారుడైన విష్ణువు భూదారతను అనగా వరాహతను వహించెను. అందువలన ముక్తి మహౌషధులకు కేదారమైన పరమేశ్వర పాదారవింద భజనము లభించినది. కావున ఓసుమతీ! నీవును అట్టి పరమేశ్వర పాదభజనము సేయుము. అని భావము. భూదార శబ్దము శబ్దాలంకారవిలసితము. అట్లే కేదార, పాదార విందప్రయోగములును మూలమున శబ్ద సౌందర్య సముల్లసితములు **ఆకలిత ముక్తి మహౌషధీనాం కేదారం** అనుదానికి **ముక్తి యను మేటి సంజీవి మొలచునట్టి** అని అనువాదము. ఇచ్చట మహౌషధి సంజీవిగా ఆంధ్రీకృతము. **మహా** అనుటకు **మేటి** అని తెనిగింపు మొలచు నట్టి అనుదానికి మూలము లేదు. కాని కేదార మనగా ఉత్పత్తి స్థానము దానికి మొలచునట్టి క్రియా పదము ప్రయుక్తము. **యద పేక్షయా** అను ప్రయోగమునకు **దర్శింపగోరి** అని అనువాదము **యత్** అను పదమున మహేశుపదంబు అను నర్థము నిరూఢము శ్రీ భూదార ఏప అను ప్రయోగము అనువాదమున శ్రీ హరి అని పేర్కొనబడినది. **భూదార తామ్ ఉదవహత్** అనునది **వరాహమయ్యె** అని తెనిగింపు. **ఆ యూహతోనె నిరతము జగద్గురుని** అను దానికి మూలము లేదు. **భజనం లభస్వ** అనుటకు **భజింపుమా** అన తెనిగింపు. మూలమునగల సుమతీ పద్యాంతమున సుమతి అయినది. శబ్దాలంకార కారణముగా మూలమున ప్రౌఢ పదములు ప్రయుక్తములైనవి. అనువాదకర్త కేవలము అందలి భావమునే ప్రధానముగా గ్రహించి సులభతరముగా అర్థము అగునట్లు గీత పద్యమును రచించెను. మేటి సంజీవి జగద్గురుని వంటి ప్రయోగములు భావపరిపుష్టికి దోహదము కలిగించినవి.

**ఆశాపాశక్లేశదుర్వాసనాది** అను శ్లోకము **ఆశాశాటీ కాంఘ్రి** అను కందమునానంద ముగా కూర్చబడినది. ఆశా శాటీ కాంఘ్రి కుశేశయము. అనుదానికి **ఆశా శాటీ కస్య పాదార విందం** అని మూలము. అరవిందమునకు **కుశేశయము** గ్రహింపబడినది. ఇందలి **శే** యతిస్థానము అట్లే శ అను నది ప్రాసస్థానము కుశేశయము అను పర్యాయ పదము అటు యతిని, ఇటుప్రాసను ఎంతో సులభతరముగ పొసగజేసిన అనువాదకుని ప్రతిభ అప్రతిమానము. **చేతః పేటీం** అనుదానికి మదాత్మపేటి అని అనువాదము. ఇందలి మత్ అను సర్వనామమును కవిస్వేయముగా కల్పించెను. **ఆశాపాశక్లేశ దుర్వాసనాదిభేదోద్యుక్తైః** అనునది ఆశా పాశక్లేశదుర్గంధ శయముం బాపి అని అనువదింపబడినది. **దివ్య గంధైః అమందైః వాసితాం తనోతి** అనువాక్యమునకు **దివ్య మౌ గంధమిడున్** అని మాత్రమే అనువాదము. **అమందైః వాసితాం** అనువానికి అను వాదములేదు. గంధ శబ్దము నందే వాసితమన్న అర్థమున్నది. కావున దివ్యమౌ గంధము అని ప్రయుక్తము **భేదోద్యుక్తైః** అను సమాసమునకు **బాపి** అని అచ్చతెలుగు పదము ఎంత**ో** అర్థవంతము.

కళ్యాణిసం సరసచిత్ర గతింసవేగం అను శ్లోకము సకల భావజ్ఞ మనఘము సజవములు ధ్రువలక్షణాఢ్యంబు అను గీత పద్యమున ఆంధ్రీకరింపబడినది. మూలమున **చేతస్తురంగ** మునకు **ఆఱువిశేషణములున్నవి.** రెండవ **పాదారంభమున**గలసర్వేంగితజ్ఞ సకల భావజ్ఞము అని ఆరంభింపబడినది. **సర్వకు** పర్యాయముగా **సకల ఇంగిత** శబ్దమునకు పర్యాయముగా భావజ్ఞ అనునవి **గ్రహింపబడినవి.** అనఘము ధ్రువ లక్షణాఢ్యంబు కళ్యాణ అను ప్రయోగములు **యథాతథముగా స్వీకరింపబడినవి.** సరస చిత్ర గతిం లోని సరస కు మారుగా లలిత **గతికి** పర్యాయముగా **యానము** ప్రయోగింపబడినవి. లలిత లోని లకారము రెండవ పాదమున యతి స్థానము. అట్లే **యానము** లోని యకారము మూడవ పాదారంభమున కూర్చబడి హయము లోని హకారముతో సరసయతిమైత్రిని పొందినది. సవేగం అన్నది సజవము అయినది. **చేతస్తు** రంగ మనునది మనోహయముగ ఆంధ్రీకృతము **సమస్త జగతాం నేతః వృషభాధిరూఢ, స్మరారే** అనునవి తెనిగింపబడలేదు. వృషభాధి రూఢ అను సంబోధనమును కవి మరి యొక విధముగా మలచుకొని నీకు ముదిగొడ్డుప్రియమయ్యెనే మహేశ అన వ్యాజస్తుతి రూపమున చతుర్థపాదమును సర్వస్వతంత్రముగ రచించెను. **అధిరుహ్యాచర** అనగా **ఎక్కి** సంచరింపుము అను భావమునకు బదులు **నా మనో హయము** కంటె నీకు **ముది గొడ్డు** ప్రియమయ్యెనే అను భావము ఎంతో ఔచిత్యవంతము మహేశ అనునది బలిజేపల్లి స్వయముగా కల్పించిన సంబోధనము.

**భక్తిర్మహేశ** పదపుష్కర మావసంతీ అనుశ్లోకము భవునిపద పుష్కరము చెంది **భక్తి మేఘ** పంక్తి అనుగీతపద్యమున అనూదితము. మహేశ పద పుష్కరము అనునది **భవుని** పద పుష్కర మనియు **మనస్తటాకం** మానస **తటాక**మనియు అనువదింపబడినవి. జన్మ సస్య మఖిలం సకలం **పరితోష** వర్షం అనునవి యథా తథముగా గ్రహింపబడినవి. **భక్తికాదంబినీ** అనునది **భక్తి మేఘ పంక్తి**గ అనూదితము **ఆవసంతీ** అనుక్రియ చెంది అనియు, **కురుతే** అనునది **కురిసెడు** అనియు, సంపూరితో భవతి అనునది నింపు అనియు అచ్చ తెనుగు క్రియా పదములలో తెనిగింపబడినవి. నాల్గవ పాదాంతమున సంస్తుతం**బు** అను అనువాదము నాన్యత్ అను మూలమునకు వివరణ.

బుద్ధి స్థిరా **భవితు** మీశ్వర పాదపద్మ సక్తా అను శ్లోకము అమల భవత్ప దాంబు రుహమందె **తగుల్కొ**ని నాదు బుద్ధి నిన్నె అను ఉత్పలమాలావృత్తమున ఆంధ్రీకరింపబడినది. ఇట **సక్తా** అనుదానికి **తగుల్కొని**అని ప్రయోగము. వధూర్విరహిణీవ సదాస్మరన్తీ అనునది మది సరించు చున్ **విరహిణీ సతికైవడి** అని అనూదితము. **సద్భావనా స్మరణ దర్శనకీర్తనాది** అను సమాసము నిత్యము **తలపోయ జూడగ** సదానినుబాడ **దలంచు** అని అలతి అలతిపదము లలో తెనిగింపబడినది. శివ మం**త్రజపేన, నమ్మోహితీవ, స్థిరా భవితుం,** అనునవి నీదునామ మంత్రము జపియించి మోహ పరతన్ స్థిరతన్, అని శబ్దాలంకార సౌందర్యమును పుణికి పుచ్చు కొన్నవి. ద్రుతగతిలో సాగిన అందలి ద్రుత ప్రకృతికములు జపోచ్చారణా విధానమును, భగవం **తుని** యెడల మోహాతిశయమును వ్యంజింపజేయుచున్నవి. మూలమున **తుట్టతుదిలో వింతె** అను క్రియాపదము కలదు. దీనికి **విచారపడుచున్నది.** అని అర్థము. ఇది అనువదింపక పోయి నను **విరహిణీ** సతి తలంచు తలంపులోనే ఆ విచారము అంతర్గర్భితము. శివమం**త్ర జపేన**లో **శివ** శబ్దమునకు ప్రాముఖ్యము. శివ శబ్దము పదేపదే జపింపగా **వశి** అగును. అపుడు అన్నియు వశీకరింపబడును. సర్వవశీకర సమర్థమై సమ్మోహమును కలిగించు స్ఫూర్తి శివ మంత్రోచ్చారణమున సమధిష్ఠితము అను వాదమున శివ శబ్ద ప్రాముఖ్యము ప్రకటితము కాలేదు.

సదుపచార విధిష్వను బోధితాం అను శ్లోకమునకు సముచితోపచారంబుల జూడగఱపి అను తేటగీతి అను వాదము సదుపచార విధిషు లోని సత్ శబ్దమును బలిజేపల్లి సముచిత అని పేర్కొనిరి. విధిషు అనుటకు అనువాదము లేదు. కాని దీని అర్థమును జూడ అను అచ్చతెలుగు పదమున స్పష్టీకరించెను. అనుబోధితాం అను క్రియకు గఱపి అని తెనిగింపు. సవినయాం అన్నది వినయ మెఱిగించి అనియు సుహృదం, సముపాద్రితాం అనునవి సన్మనోవృత్తి నెఱపి అనియు పరగుణేన అనునది మేలి గుణమిచ్చి అనియు నవోఢవధూమివ అనునది క్రొత్తయిల్లాలివలెను. అనియు అనుబుద్ధిం అన్నది నాదుబుద్ధి అనియు ఆంధ్రీకరింపబడినవి. సముద్ధర అనగ ఉద్ధరింపు అని భావము. దీనిని దిద్దు కొనుమయ్యా అని తెనిగించెను. ప్రభో అను సంబోధనకు బదులుగా పద్యాంతమున కవి పరేశ అని పేర్కొనెను. మూలమున గల విశేషణములన్నియు బుద్ధి అను నవోఢ వధువు నుద్దేశించి ఉన్నవి. వానిని ఈ కవితాకళానిధి క్రియా పదములతో సమన్వయించెను.

నిత్యం యోగి మనస్సరోజదళ సంచారక్షమస్త్వత్క్రమ అను శ్లోకమునకు పరమయోగి మనః పద్మనాటి దిరుగు అని గీత పద్యము అను వాదము: ఈ శ్లోకమున అత్యంతం మృదులంత్వదంఘ్రి యుగళం అను తృతీయ పాదమునందలి ప్రయోగమునకు మృదుల మృదులంబులైన నీ పదములు అనియు కఠోర యమరాడ్వక్షః కవాటక్షతిః అనుటకు కటుకఠోర యమేశ వక్షః కవాట పాటన అనియు మే మనశ్చింతయతి అనుదానికి ఎంత నొచ్చెనో అనియు హస్తేనసంవాహయే అను ప్రయోగమునకు పట్టినిమ్ము అనియు ఆంధ్రీకరణము. ఇట మే మనశ్చింతయతి అనగా నా యొక్క మనస్సు చింతిల్లు చున్నది. అని భావము. హస్తేన సంవాహయే అనగా హస్తముచేత వహించుచున్నాను. లేదా ఒత్తుచున్నాను అని భావము. కాని ఈ రెండు వాక్యములు అను వాదమున అర్థభంగము కలుగకుండ మూలభావమునకు సన్నిహితముగా ఎంతో స్వతంత్రించి ప్రయోగింపబడినవి. ఏతల్లోచన గోచరం కురు అనుదానికి అను వాదము లేదు. మూల మున కేవలము యోగి అనియే ఉన్నది. కాని ఇది అనువాదమున పరమయోగిగ ప్రకటితమైనది. మృదుల శబ్దమును ఒకటికి రెండు పర్యాయములు ప్రకటించి అందలి అతిశయభావమును మిగుల మనోహరముగా బలిజేపల్లి వారు తెలిపిరి, మూలమునందలి ప్రసిద్ధ సమాసములు కొన్ని యథాతథముగా మరికొన్ని పర్యాయపద మనోజ్ఞములుగా గ్రహించి గీత పద్యమున కుదించిన విధము ప్రతిభా ధురీణము వక్షః కవాటక్షతిః అనుట కంటె వక్షః అను ప్రయోగము కవాట పాటన శబ్దాలంకార స్ఫూర్తితో నొప్పుచున్నది. అను వాదకుడు ఈ సమాన ప్రారంభమున కటు అను విశేషణమును అర్థ గాంభీర్య దృష్టితో ప్రయోగించెను. ఇట పాటన శబ్దమునకు చీల్చుట అని అర్థము. యమ ధర్మరాజు యొక్క తలుపు వంటి రొమ్మును త్రన్నినట్లు పురాణ ప్రసిద్ధి. చీల్చినట్లు ఈ కవి వర్ణించుట దండధరుని యెడ చూపిన దండ నాతిశయమును తెలుపుచున్నది. ఎంత నొచ్చెనో పట్టినిమ్ము అను వాక్యములు అచ్చ తెనుగు దనమును కలిగి ముందు చెప్పిన సమాస భూయస్త్వముగు కాఠిన్యమునకు విరుగుడుగ ఎంతో మాధుర్య మార్దవములను ప్రసరించుచు రచయితకు భగవంతునిపై గల భక్తి భావమును స్పష్టము చేయుచున్నవి.

ఏష్యత్యేష జనిం మనోస్య కఠినం తస్మి న్నఖానీతి మద్రక్షాయై అను శార్దూల విక్రీడితమునకు జనియించున్ ధరవీడు వీని మదిపాషాణంబు నేనందు అను మత్తేభ విక్రీడితము అనువాదము. ఏష్యత్యేష జనిం అను శ్లోక ప్రారంభము జనియించున్ ధరవీడు అను పద్యారంభమున కూర్పబడినది. మనోస్య కఠినం అను ప్రయోగము వీని

మదిపాషాణంబు అని తస్మిన్నయానీతి అనునది నేనందు నుండన సంగాయని తెనిగింపబడినది. మద్రక్షాయ్యై అను ప్రయోగము నందలి రక్షా శబ్దమునకు అనువాదము లేదు నాకై అని మాత్రమే అనువదింపబడినది. గిరి సీమ్ని కోమల పదన్యాసః పురాభ్యాసితః అను రెండవ పాదము నందలి మూలవాక్యమునకు నీదు కోమలపదన్యాసంబు శిలాద్రిని నభ్యాసము జేసియుందుము అని తెనిగింపు. నోచేత్ అనుటకు అటుగాదెన్ అనితెనిగింపు దివ్య గృహాంతరేషు అనునది సౌధముల్ అనియు, సుమనస్తల్పేషు అనునది ననపాన్పుల్ అనియు తె నిగింపబడినది. వేద్యా దిషు అనుదానికి అనువాదము లేదు. ప్రాయస్సత్సు శిలా తలేషునటనం శంభో కిమర్థం తవ అను ప్రయోగమునకు గిరీశమతియేలాశైల సంచారముల్ అని ఆంధ్రీకరణము. మూలమున శంభో! అని సంబోధనము. కాని అనువాదమున గిరీశ అని ప్రయుక్తము. బలిజేపల్లి వారి ఈ సంబోధనము సాభిప్రాయము. శైల సంచారము గావించు వాడగుటచే గిరీశ అని సంబోదించుట ఎంతో ఔచిత్యవంతము. మూలమున నటనం అన్నది. సంచారములుగా పేర్కొనుట ఈ సందర్భమున మరికొంత అర్థగౌరవమును సంతరించుకొన్నది. కొండలలో రాళ్ళపై ఎల్లప్పుడును శివుడు నాట్యమునే చేయుచుండును. అనుట కంటె సంచారము చేయుచుండెను. అనుట సమంజసము ఎంత నాట్య ప్రియుడైనను సంచారము చేయక మానడు కదా !

కంచిత్కాలముమా మహేశ భవతః పాదార విందార్చనైః అను శార్దూల విక్రీడితము పరమానందముతో భవచ్చరణ సేవంగొంత అను మత్తేభ విక్రీడితము నందు ఆంధ్రీకరింపబడినది. ఈ ప్రథమ పాదము నందలి ఉమామహేశ మత్తేభము చివర ఆర్యాపతీ అని ప్రయుక్తము. పరమానందముతో అను పద్యపు టెత్తుగడకు మూలమున నాల్గవ పాదమున ముదా అను ప్రయోగమున్నది. కంచి ద్ధ్యాన సమాధిభిశ్చ అనుదానికి గాసంతనీస్మరణన్ అని ఆంధ్రీకరణము. మతిభిః కంచిత్ అనుదానికి నీనుతులన్ రవంతయు అనియు యః ప్రాప్నోతి త్వదర్పిత మనాః జీవన్ సముక్తఃఖలు అనువాక్యమునకు నెవ్వాడు త్వత్పరుడై కాలము బుచ్చునో యతడు జీవన్ముక్తుడు అనియు అను వాదము. దశామీదృశీం అనుటకు మారుగా కాలము బుచ్చునో అని కూర్పబడినది. మూలమున కంచిత్ అను పదమే అనేక పర్యాయపదములతో ఆవృత్తమైనది. అది తెనుగునకొంత కాసంత రవంత సుంత కొంచెము. ఇంచుక అను పర్యాయ పదములలో ప్రయుక్తము. త్వదర్పిత మనాః అనుదానికి త్వత్పరుడై అని అర్థభంగము చెడకుండ అల్పపదములలో పరిపూర్ణ భావము ప్రకటితమైనది. అవేక్షణైః అను అనుట కంటె దిదృక్షా దీక్ష అనునది అర్థ పరిపుష్టము. అవేక్షణ అనగా చూచుట దిదృక్ష అనగా చూచుట యందు ఇచ్ఛ అది దీక్షగ చెప్పబడుటచే శబ్దాలంకార దీప్తియేగాక భావగాంభీర్యమును పుణికి పుచ్చుకొన్నది. జీవన్ సముక్తః అను విడి పదములు అనువాదమున జీవన్ముక్తుడను సమానముగా ప్రయుక్తమైనది.

బాణత్వం వృషభత్వ మర్ధవపుషా భార్యాత్వమార్యాపతే అను శార్దూల విక్రీడితమునకు శరమై సూకరమై మృదంగధరుడై సామై సతీ రత్నమై అను మత్తేభము అనువాదము. మూలమున రెండవ పాదారంభమున ఘోణిత్వం సఖితా మృదంగ వహతా అని ఉన్నది. మొదటి పాదమున బాణత్వం తరువాత వృషభత్వం చెప్పబడినది. అనువాదమున ఈ క్రమము లేదు. శరమై అనిన అనంతరము సూకరమై అని అంత్య ప్రాస కల శబ్దము గ్రహింబడినది. అటుపై మృదంగధరుడై అన్నదియు మూలమున రెండవ పాదముననే కలదు. అర్థవపుషా అను శబ్దమునకు సామై అని తెనుగుసేత. సతీరత్నమై అను దానికి మూలము

భార్యాత్వము ఆర్యాపతీ సంబోధనము పద్యాంతమున ఆద్రికన్యాపతీ! అని ప్రయుక్తము. **భార్యాత్వమార్యా** అనిమూలమున అనుప్రాసగలదు. **వృషభత్వం** అనుటకు **తురగంబై** అని తెనిగింపు. **సఖితా** అనుదానికి**చెలియై** అని ఇత్యాదిరూపందదెథౌ అనుటకు **అనేక మూర్తులు గాంచి** అని అనువాదము. **త్వత్పాదేనయ నార్పణంచ కృతవాన్** అనుదానికి **నేత్రంబు నీచరణాబ్జంబున నిల్పి** అని అనువాదము. **కృతవాన్** అనుదానకి **చేసిన వాడాయెను.** అని అర్థము. కాని దీనిని **నిల్పి** అను క్రియాపదమున ఈ కవి తెల్పెను. అట్లే **త్వద్దేహభాగో హరిః** అనునది **నీతనువునంశంబంది** అని అనూదితము. **పూజ్యాత్పూజ్యతరస్సఏవహి** అనుదానికి **పూజ్యులందున పూజ్యుండగు** అని అనువాదము న **చేత్కో వాతదన్యోధికః** అని శ్లోకాంతము. దీనికి శౌరికంటెనెవడాఢ్యుండు అని ఆంధ్రీకరణ. ప్రస్తుత శ్లోకము నందలి భావము లేశమైనను పొల్లువోకుండ అనువాదము యథామూలముగా సాగినది. శివ భక్తులలో అగ్రేగరుడైన విష్ణువు పూజ్యతరుడుగా నిందభి వర్ణింపబడెను.

**జనన మృతి యుతానాం సేవయా దేవతానాం** అను మాలినీ వృత్తము **జననంబున్ మరణంబు గల్గు దివిషజ్జాతంబులం గొల్చుచున్** అను మత్తేభ విక్రీడితమున అనూదితము. ప్రథమ పాదమునందలి భావము పొల్లువోకుండ, తెనుగున అనుసరింపబడినది. దేవతలకును జనన మరణములు కలవని యిందు తెలుపబడినది. **దేవతానాం సేవయా** అనునది **దివిషజ్జాతంబులంగొల్చుచున్** అని ఆంధ్రీకరింపబడినది. **సేవయా** అనగా **సేవచేత** అని అర్థము. అది **కొల్చుచుండిన** అని అనూదితము. **నభవతి సుఖలేశః** అనుటకు **లేశంబుసుఖంబులేదు.** అని అనువాదము **సంశయో నాస్తి తత్ర** అను దీనిని ఈకవి **వినులేనేలేద** అని తెనిగించెను **ఇహ** అనుటకు **ఈ జన్మ మందు** అని అనువాదము. అటుపై పరమ శివు గూర్చిన విశేషణములలో **అజనిం** అన్నది **అనాద్యంతు** అని **సాంబం** అన్నది **ఉమామహేశు** అని **అమృత రూపం** అనునది **అమృతాత్మున్** అని తెనిగింపబడినవి. **భజన్తే** అను క్రియను **కొల్చి సేవించు** అని కవి ప్రయోగించెను. ఈ రెండు క్రియలు ఒకే అర్థమును ఇచ్చు పర్యాయపదములుగా పైకి కన్పట్టును. సమస్కరించి భక్తి భావముతో ధ్యానించి అని గ్రహించినచో అర్థము చక్కగా పొసగును. **పరమ సౌఖ్యం తేహిధన్యాలభంతే** అను శ్లోక పాదాంతము, **ధన్యనరశ్రేష్ఠులు చూఱగొంద్రు పరసౌఖ్య ప్రాజ్య సామ్రాజ్యమున్** అని అనువదింపబడినది. **అధన్యులు** అని మాత్రమే మూలము అనువాదకుడు **ధన్య** శబ్దమును విడువక దానికి అనుబంధముగా ప్రాసస్థానమున నకారము వచ్చునట్లు **నరశ్రేష్ఠులు** అని పేర్కొనెను. మూలమున **పరమసౌఖ్యం** అని ఉన్నది. కాని అనువాదకర్త **పరసౌఖ్య** అని పేర్కొని దానికి అనుబంధముగా అను ప్రాసాలంకార మన్నోజ్ఞమగు **ప్రాజ్య సామ్రాజ్యము**ను పద బంధమును ప్రయోగించెను. ఇట్లీ పద్యమున మూలమునందలి భావము పరిపూర్ణముగా అనుసరింపబడినది. ప్రథమ పాదమున **దేవతానాం** అనుదానికి **దివిషజ్జాతంబులన్** అని బహువచనమున సమూహార్థకముగ ప్రయోగించుట అర్థవి పులీకరణము. **సంశయోనాస్తి తత్ర** కు గల అనువాదము **వినులేనేలేద** అనునది. ఇందు విను అనుదానికి మూలము లేదు. **లేనే లేద** అను వాక్యము నందలి తుది అకారము ఏవార్థ బోధకము.

**శివ తవ పరి చర్యా సన్నిధానాయ గౌర్యా** అను మాలినీ శ్లోకమునకు **ఓ నిర్వ్యాజకృపానిధీ భువన బంధూ!** అను శార్దూల విక్రీడితము అనువాదము. ప్రస్తుత శ్లోకమున మూడవ పాదమున **సకల భువన బంధూ, సచ్చిదానంద సింధో!** అన్నవి నాల్గవ పాదారంభమున **సదయ** అన్నది ప్రథమ, ద్వితీయ పాదారంభము లలో **శివ, భవ,** అనునవి

నంబోధనములు. ఇన్ని నంబోధనలు, గల ఈ శ్లోకమున తృతీయ పాదమున గల సంబోధనలు అంత్యాను ప్రాస మన్నోజ్ఞములు.[13] సదయ అనునది అర్థవంతమగు సంబోధన. ఆది ఈ శ్లోకము నకంతటికి ఆయువు పట్టు. కావుననే బలిజేపల్లి లక్ష్మీకాంత కవి ప్రప్రథమముగా ఓ నిర్వ్యాజకృపానిధీ అని పరమ శివుని సంబోధించెను. హృదయ గేహే సర్వదా సంవసి అను నాల్గవ పాదము నందలి భావము నా చిత్త గృహంబునన్ నిలుపరాదో అని రెండవ పాదమునందే అనూదితమైనది. గౌర్యా తవ పరిచర్యా సన్నిధానాయ అనువానికి నీకు నీ భార్యకున్ గానీ దాస్య మొనర్ప అని అనువాదము. మమగుణధుర్యాం బుద్ధి కన్యాం ప్రదాస్యే అను వాక్యమునకు నాదు మతియన్ కన్యా మణిన్ సద్గుణ శ్రీనిన్ నీ పదసన్నిధిన్ నిలిపితిన్ అని అనువాదము . నీపద సన్నిధిన్ నిలిపితిన్ అనుదానికి మూలము లేదు. ప్రదాస్యే అను క్రియకు దానము చేయు చున్నాను అని భావము. దీనిని ఈ కవి మరి కొంత వివరించుచు నీ పద సన్నిధిన్ నిలిపతిన్ అనుచున్నాడు. ఇందు పరిచర్యకు ప్రాధాన్య మొసగుటచే చేకొమ్మిదే దాసిగా అని మూలమున సూచనా మాత్రముగా ఉన్న భావమును విస్తరించినాడు.

జలధి మధన దక్షో నైవ పాతాళ భేదీ అను మాలినీ వృత్తము కల శాబ్ధిన్ మథియింపలేను ఫణి లోకంబేగి రాలేను అను మత్తేభ విక్రీడితము నందు అనువదింపబడినది. మూలమున రెండవ పాదము నచవనమృగ యాయాంనైవలుబ్ధః ప్రవీణః అనునది. ఇది అనువాదమున కానల పేటాడెడు పాటిమై మను పుళింద గ్రామణిన్ గాను అని అనూదితము. అశనకుసుమ భూషావస్త్ర ముఖ్యాంసపర్యాం అనుటకు అశన ప్రసూన.కములందివ్యన్మణీభార హారల సచ్చేల ములం హొనర్చెద సపర్య చర్య అని అనువాదము. ఇందలి హొనర్చెద అను క్రియకు మూలమున కల్పయాని అని ఉన్నది. కథయ కథ మహంతే కల్పయాని అను వాక్యమునకు చెప్పుము ఎట్లు నేను నీకు కలిగించెదను అని భావము. దీనికి అనువాదము లేదు. కాని ఇందలి భావము అంతర్వాహినిగ ప్రసరించినది. ఏ తెలివిన్ నీకు హొనర్చెద సపర్యా చర్య అన్న వాక్యములో మూలము నందలి భావము పొడిగింపబడినది. ఇందు మౌళే అని శ్లోకాంతము. దీనికి బదులుగా ఆర్యాపతీ అని పద్యాంతము. అశనకుసుమభూషా లోని భూషా శబ్దము దీవ్యన్మణీ భారహార అని సమాస ముగా ప్రయోగింపబడినది. ఇట్లే వస్త్ర శబ్దమునకు లసచ్చేలములన్ అని ప్రాస స్థానమున ల కారము వచ్చునట్లు వివరణ గావింపబడిదని.

పూజా సామగ్రి యున్నను పూజా స్థానము తెలియక పోవుటచే పూజింప సమర్థుడను గాను అని తెలుపు పూజా ద్రవ్య సమృద్ధ యో విరచితాః పూజాం కథం కుర్మహే అను శార్దూల విక్రీడిత శ్లోకము సముపార్జించితి దేవ! నీకు నయి పూజా ద్రవ్యముం గాని పంతముతో అను మత్తేభ విక్రీడిరమున అనూదితమైనది. విరచితాః శబ్దమునకు సముపార్జించితి అను ప్రయోగము పద్య ప్రారంభముననే కూర్పబడినది. పూజా కథం కుర్మహే అని శ్లోక ప్రథమ పాదాంతము నగల ప్రయోగము అనువాదమున పద్యాంతమునందు శక్యం బౌనె పూజింపగన్ అని కూర్పబడినది. పక్షిత్వ నచ వాకిటిత్వమపిన ప్రాప్తం మయా దుర్లభం అనువాక్యమునకు నాచే దుర్లభమైన పక్షిత్వము లేక కిటిత్వము పొందబడలేదు. అని భావము. ఇట బలిజేపల్లి మున్నా రూపములను ధరించిన వారిని మున్ విధి హంసరూపము. రమా దారుండు భూదార రూపమునుందాల్చి అని అనువదించెను. మూలమున నాల్గవ పాదాంతము నందలి న జ్ఞాతం హిపితా మహేన హరిణా తత్త్వేన తద్రూపిణా అను

వాక్యమున పై భావమే ప్రకటితమైనది. శ్లోకమున మూడవ పాదము నేన తేహ విభో అనుదానిని అను వాదకర్త నీ ఉత్తమాంగము నీ పాదము నేనెఱింగి కొన అని అనువదించెను.[14] అనువాదకర్త దివిన్, భువిన్ పెదకి పొల్పన్‌లేని పంతమ్ముతో అను ప్రయోగములను స్వతంత్రించి ఇందు కూర్చెను. దివిన్ భువిన్ పెదకి పోల్పన్ అను ప్రయోగము నందలి ద్రుత ప్రకృతికములు ద్రుతగతి గల హంస, కిటి ప్రవృత్తులలో గల పంతమును ధ్వనింప జేయుచున్నవి. పంతమను అచ్చ తెలుగు పదము వలన పద్య సౌందర్యమేగాక అర్థగాంభీర్యమును హృదయంగ మముగా ప్రకటితమైనది. దివిన్, భువిన్ అను ప్రయోగమును అను ప్రాసాలంకార శోభితమై యథాసంఖ్యముగా ప్రయుక్తమైనది. రసాదారుండు, భూదార అను ప్రయోగములు 73 వ శ్లోకము లోని భూదారత, శ్రీ భూదార ప్రయోగములను జ్ఞప్తికి దెచ్చు చున్నవి. ఉమాజానే, విభో అను సంభోధనలు మూలమున మూడవ పాదము నందు ఉన్నవి. ఆరెండింటికి బదులు అనువాదకర్త ప్రథమ పాదారంభమున సముపార్జించితి అను క్రియా పదము తరువాత దేవ! అని ప్రయోగించెను. క్రియా పదముతో ఈ పద్యపుటెత్తుగడ ఎంతో దీప్తిని పొంద గలిగినది. శివ పాద భక్తి మాత్రము కావలెనని కోరుటఅనంతర శ్లోక సారాంశము.

**అశనం గరళం ఫణీకలా పోవసనం చర్మచ వాహనం మహౌక్షః** అను శ్లోక ము అన్నము విసంబు నగలెన్న బన్నగములు అను గీత పద్యమున అను వదింపబడినది. **అశనం** గరళం అనుదానికి **అన్నము విసంబు** అనియు **ఫణీ కలాపః** అనుదానికి నగలెన్న బన్నగములు అనియు **వసనం చర్మచ** అనుదానికి **వార్వంబు మొసలియెద్దు** అనియు **తవ పాదాంబుజ భక్తి మేవ దేహి** అను దానికి **భవత్పాద భక్తి నిమ్ము** అనియు అనువాదము **కిమస్తి** అనుదానికి **నాకేమి వలదు** అని అనువాదము. ఈ శ్లోకమున **ఫణీ కలాపః** అనునది ఏకవచనము కాని లక్ష్మీకాంతకవి బహువచనమున ప్రయోగించెను.

పరమేశ్వర పాదభక్తి లభించినచో అర్చనము, స్తోత్రము ధ్యానము చేయ సమర్థుడ నగుదునను భావము దృష్టాంత పూర్వకముగా **యదా కృతాంభోనిధి సేతు బంధనః** అను శ్లోకమున ప్రతి పాదితమైనది. దీనినే **బలిజేపల్లి నేనే వారిధి గట్టు రాఘవుడ నేనిన్ వింధ్య భూమీధ్రమున్** అను శార్దూల విక్రీడితమున తెనిగించెను. ఇందలి యథాతథా అవ్యయములకు బదులు ఏనిన్ అని ప్రయోగింపబడినది. యదా కృతాంభోనిధిసేతు బంధనః అను వాక్యమును **నేనే వారధి గట్టు రాఘవుడ నేనిన్** అని బలిజేపల్లి తెనిగించెను. మూలమున సూచింపబడిన పేరునుస్పష్టతకై ఇచ్చట కవి వాచ్య మొనరించెను. **కరస్థ లాఘ కృత పర్వతాధిపః** అనుటకు **వింధ్య భూమీ ధ్రమున్ జేనొక్కంగల కుంభ సంభవుడనేనిన్** అని అనువాదము. దీనికి అరచేతిలో దిగువకు అణచబడిన పర్వతాధిపుడను కలవాడని మూలమున గల భావము. ఇందు ఎవ్వరు ఏ పర్వతమును అణచిరోయిద మిత్థ మని చెప్పలేదు కాని అనువాదకర్త స్పష్టీకరించుచు వింధ్యపర్వతమును అగస్త్యుడు చేనొక్కినట్లు వివరించెను. **చేనొక్కంగల** అను అచ్చ తెలగు పదముల ప్రయోగము రెండవ పాదారంభమున అప్రయత్నముగా ప్రాస స్థానమున న కారము చేరునట్లు కూర్పబడినది. లంఘిత పద్మ సంభవః అను ప్రయోగమునకు **పద్మజున్ మించు విజ్ఞాన శ్రీ నిధినేని** అని అనువాదము. **అతిశ** యింపగల బ్రహ్మదేవుడు గల వాడును అని మూలమునకు భావము. కాని ఆ **అతిశయమెట్టిదో** అనువాదకర్త చక్కగా విస్పష్టము గావించెను. పద్మజున్ మించు వరకే మూల విధేయము. **విజ్ఞాన శ్రీ నిధినేని** అనునది కవి స్వకపోల కల్పితము. **అర్చాస్తవ భావన క్షమః** అను ప్రయోగమునకు పూజయందున్న స్తోత్రము నందును, ధ్యానము

నందును సమర్థుడును అని భావము దీనినే తావక పదార్చా కీర్తన ధ్యాన నిష్ఠా నిష్ణాతుడవై అజని అనువదించెను. మూల మునకు గల స్తవ భావనలను కీర్తన ధ్యానము లనియు తమః అనుదాని నిష్ణాతుడను అనియు వివరణ పూర్వకముగా కవి అనువాదము కావించెను. గణింతుగద ఈశా నీదు సాన్నిధ్యమున్ అను పద్యాంతము నందలి ప్రయోగమునకు మూలములేదు. ఇది అనువాదకుని స్వతంత్రతా స్ఫూర్తికి నిదర్శనము. మూలమున శివ సంబోధనయున్నది. కాని బలిజేపల్లి యతి స్థానమున శ కారము వచ్చునట్లు ఈశా! అని సంబోధించెను. శ్రీ రామాగస్త్య బ్రహ్మాదేవులు శివ పదార్చా కీర్తన ధ్యాన పరులుగా ప్రస్తుత పద్యమున యథా సంఖ్య ముగా పేర్కొనబడినారు. నతిభిః నుతిభిః పూజావిధిభిః ధ్యాన సమాధిభిః సతుష్టః అను వాక్యము నతులున్ నన్నుతులున్ సమర్చలును ధ్యాన ప్రక్రియల్ నీకు సమ్మతిగావేని అని అనువదింపబడినది. ఇందు పూజా విధిభిః అనుదానిని సమర్చలు అనియు ధ్యానసమాధిభిః అనునుదానిని ధ్యాన ప్రక్రియలు అనియు సంక్షిప్తముగా మూలము నందలి భావము కొరవకుండ తెనిగించెను.. సతుష్టః అనగా సంతోషించిన వాడవుకావు అని భావము. దీనినే నీకు సమ్మతి కావేని అని ఆంధ్రీకరించెను. సమ్మతి లోని తకారము ప్రాస స్థానమున కూర్చబడుట ఈ పదప్రయోగము నందలి ప్రత్యేకత ధనుషా అనుదానికి కోదండము దాల్తును అనియు ముసలేన అనుదానికి ముసలమున్ బాటింతునో అనియు అశ్మభిః అనుదానికి రువ్వుదునా మీదన్ గండశైలంబులన్ అనియు అనువాదము. తే ప్రీతికరం వద తదా కరోమి నీకు ప్రియమైనది చెప్పుము. అట్లు చేయుదును అని ఈ వాక్యముల భావము. ఇందు వద అనుదానికి వచింపుము అని అనువాదము. తక్కిన వాక్యమునకు ఏక తనయుష్మత్వృత్తియానో అని ఆంధ్రీకరణము. ప్రీతి అనుట కంటె వృత్తి అను పదమున నీ నడవడిక. నీ జీవనోపాయము ఎటు వంటిదో అన్న భావము వ్యక్తమైనది. సాహసోద్ధతి నీతోడంబెనంగి అను ప్రయోగము మూలమునలేదు. ఇది అనువాదకర్త స్వయముగా కల్పించెను. అశ్మభిః అనగా రాళ్ళ చేత అని అర్థము. దానినే గండశైలంబులన్ అని ప్రయోగించెను. గండశైలమనగా కొండ నుండి జారిపడిన పెద్దరాయి. మూలమున సంక్షిప్తముగా నున్న విషయమును విస్తరించుచు అనవసరములైన పదములకు తావీయక అర్థ గాంభీర్య స్ఫూర్తితో గజ చర్మాంబర ధారి అయిన పరమ శివుని ప్రవృత్తిని మత్తేభ విక్రీడితమున మనోహరముగ ప్రకటించెను. కొందరు భక్తుల వింటి దెబ్బల చేతను మరి కొందరి భక్తుల రోకలిపోట్ల చేతను, ఇక కొందరు భక్తులు రాళ్ళు రువ్వుట చేతను పరమేశ్వరుడు పరమ ప్రీతి నొందెనని పురాణ గాథలు తెల్పుచున్నవి. పూర్వ శ్లోకమునకు ప్రస్తుత శ్లోకము అనుబంధ ప్రాయము. ముందు తెలిపిన భక్తులు సాత్త్వికగుణ సంపన్నులు కాగా ప్రస్తుతము సూచింపబడిన భక్తులు రజస్తమో గుణ పూరితులైన మూఢభక్తులు.

వివిధ విధ భక్తులు వారి అర్చనా పద్ధతులు తెలిపిన అనంతరము శక్తి కొలది త్రికరణ శుద్ధిగా పరమేశ్వరుని సేవింతునను భావము వచసాచరితం వదామిశంభో అను శ్లోకమునప్రకటితమైనది. దీనికి తలపున ను గొలుచుటయున్ అను కందమను వాదము. అనువాదము నందలి ప్రథమ పాదమునకు మనసాకృతి మీశ్వరస్య సేవే అను వాక్యము మూలము. ఈశ్వరస్య ఆకృతిం మనసా సేవే అని అన్వయ క్రమము. ఇదియే తలపున నిను గొలుచుటయున్ అని అనువదింప బడినది. శిరసా చైవ సదా శివం నమామి అని నాల్గవ పాదము దీనికి తలచే మ్రొక్కుటయు అని తెనిగింపు. అటుపై శ్లోక ప్రథమపాదమునందలి వచసా చరితంవదామి అను వాక్యము వాకునను నీ చరితంబులు కీర్తించుట అని అనువదింపబడినది. మూలమున రెండవ వాక్యము

అహము చ్యోగవిధాసుతేఖ ప్రసక్తః అన్నది. దీనికి నేను నీయొక్క ఉన్నత యోగములపిధానములయందు పరిచయము లేనివాడను అని భావము. దీనిని అనువాదకర్త పరిపూర్ణ స్వతంత్రతలో **ఏకలుములు వలదయ్య నాకు** అని పేర్కొనెను. గౌరీరమణా! అను సంబోధనము కంద పద్యాంతమున కూర్పబడినది.

**ఆద్యా విద్యా హృద్గతా నిర్గతాసీత్** అను శ్లోకము **నాదు మదిదొల్తనున్న అజ్ఞానమణగి** అను గీతపద్యమున అనూదితము. హృద్గతమైన ఆద్యమగు అవిద్య నిర్గతమైనదను భావమే **నాదు మది దొల్తనున్న యజ్ఞానమణగి** అని తెనిగింపడినది. హృద్యమగు విద్య నీ కృపనెనగె అని ప్రయోగింపబడినది. **సేవే నిత్యం శ్రీకరం త్వత్పదాబ్జం భావే ముక్తేర్భాజనం** అనునది నిశ్శ్రేయస భాజనంబు శ్రీకరము నీ పదాబ్జ మాసింతు నెపుడు అని అనువదింపడినది. ఇందు **ముక్తేః** అనుదానికి నిశ్శ్రేయస పర్యాయపదము గ్రహింపబడినది. **సేవే నిత్యం** అనుదానికి **ఆశింతు నిపుడు** అని అనూదితము. శ్లోకాంతమున గల **రాజ మౌళీ** అను సంబోధన గీత పద్యమున తృతీయ పాదారంభమున ప్రయుక్తము.

శ్రీకరమగు పదాబ్జమాశించిన ఈకవి తనను ఈ సంసార సాగరము నుండి కడ తేర్చుమని వేడుకొనుట తదుపరి శ్లోకము నందలి భావము. **దూరీకృతాని దురితాని దురక్షరాణి** అను శ్లోకమునకు **దురితంబుల్ సమసెన్ దురక్షరపు పంక్తుల్ మాసె** అనుమత్తేభము అనువాదము. **దూరీ కృతాని** అను పదమునకు దూరముగా పోగొట్టబడినవి అని అర్థము. ఇది దురితాని, దురక్షరాణి దౌర్భాగ్యదుఃఖ దుర హంకృతి దుర్వచాంసి అను పద బంధముల కన్నింటికిని వర్తించును. అనువాదకర్త ఈ ఒక్క క్రియా పదమునే అనేక పర్యాయపదములతో ప్రకటించుచు దురితంబుల్ సమసెన్ దురక్షరపుఁ బంక్తుల్ మాసె దౌర్భాగ్య దుఃఖరిరంసల్ నశియించిపోయె. దురహంకారంబు దుర్వాక్కులున్ దొలగెన్. అని అనువదించెను. **సత్కటాక్షైః** అనుదానికి **నీకృప చేత** అని ఆంధ్రీకరణము. **సారంత్వదీయ చరితం నితరాం పిబంతం మామిహ సముద్ధర** అనువాక్యమునకు సారమైన నీ చరిత్రను మిక్కిలి వినుచున్న (గ్రోలుచున్న) నన్ను ఈజన్మమందు ఉద్ధరింపుమని భావము. దీనినే బలిజేపల్లి కావుమా? సారవచ్చరితోదార భవత్కథా సుధల నీ జన్మంబు వేగించెనదన్ అని అనువదించెను. మూలమున గల విడివిడి పదముల భావమును బలిజేపల్లి సమానగతముగా పేర్కొనెను. మూలమున గల **పిబంతం** శబ్దమును బట్టి **సుధా** ప్రసక్తి సూచనా మాత్రము. కాని ప్రస్తుత సమాసమున ఈ కవి కథా సుధల అని విస్పష్టమొనర్చెను. సముద్ధర అను క్రియా పదమును **కావుమా** అని తెనిగించెను. **వేగించెదన్** అను క్రియా పదము ఎంతో అర్థవంతముగా పద్యాంతమున కూర్పబడినది. ప్రస్తుత శ్లోకము నందలి దురక్షరముల బ్రహ్మ లలాట ములలో వ్రాసిన దుష్టలిపి సూచనములు. దురహంకృతి అనగా దుష్టములగు దేహాదుల యందు **అహం** అను భావము దౌర్భాగ్య దుఃఖరిరంస అను అనువాదమునందలి రిరంస శబ్దమును అనువాద కర్తస్వీయముగా కల్పించి ప్రాసస్థానమున రి వచ్చునట్లు ప్రయోగించెను. దౌర్భాగ్యము నందు, దుఃఖము నందు రమించు ఇచ్ఛలు నశించినవని తెలుపుచు **దుఃఖ** శబ్దములోని ఖ కారము రెండవ పాదారంభమున వచ్చునట్లు కూర్చుట ఎతో సందర్భ సముచితముగా ఉన్నది. దుఃఖ పదమును ఖండించి నట్లే దుఃఖమును కూడ నశింపజేసెనను భావమును ఛందోగతి యందును ధ్వనింపజేయుట గమనార్హము.

**సోమకళాధరమౌళౌ కోమల** అను శ్లోకమునకు **సోమ కళాధర మౌళిన్** అను

కందము అనువాదము. గిరి జానాథే మహోమహసి అనునది హైమవతీ నాథు అని ఏక దేశముగా ప్రయుక్తమైనది. మహోమహసి అనుదానికి మూడవ పాదమున మహుని అని అనువాదము. కోమల ఘన కంధరే అను ప్రయోగమునకు కోమలాంభోదగళున్ అని ఆంధ్రీకరణము. ఇందు కోమల శబ్దము తప్ప తక్కిన రెండింటికి పర్యాయపదములు గ్రహింపబడలేదు. స్వామిని అనుపదము మూలమున సప్తమి యందుండగా అనువాదమున ద్వితీయ మందు స్వీకరింపబడినది. మామక హృదయం నిరంతరం అను వాక్యమునకు మామక హృదయంబు వలచి మఱి రమియించున్ అని చక్కని అనువాదము. వలచి అను శబ్దమునకు మూలము లేదు. పరమ శివునికి సంబంధించిన విశేషణములు ద్వితీయా విభక్తి యందు ప్రయుక్తములు. వలచి మరి రమి యించున్ అను రెండు క్రియాపదములు ఎంతో అర్థవంతముగా కూర్పబడినవి. వలచుట అనగా కోరుట లేక కామించుట. కోరినవస్తువు లభించిన అనంతరమే అందు క్రీడించుటకు వీలగును. కావున ఈ రెండు క్రియా పదముల వరుస క్రమము ఎంతో యుక్తముగా నున్నది.

పార్వతీ పరమేశ్వర రూపమునతో నున్న పరంజ్యోతి స్వరూపమైన పరబ్రహ్మమునందు తన చిత్తమెప్పుడును విహరించుచుండుగాక అని తెల్పిన అనంతరము నాలుక మొదలైనవి ఈశ్వరాయత్తములగుటచేతనే సాఫల్యము కలుగునని సారసనా తేనయనే అను శ్లోకమును శ్రీ మచ్ఛంకర భగవత్పాదులు కూర్చిరి. దీనికి అదె నాలుక అదెకన్గవ అనుకందము అనువాదము. శంకర భగవత్పాదులు ఈ శ్లోకరచనలో అత్యద్భుత క్రమాలంకార విశిష్టమగు పద్ధతిని పాటించిరి. మొట్టమొదట నామ వాచకములు వానికి సంబంధించిన సర్వ నామములు తెలుపుచు తుట్టతుదిలో పై పేర్కొనిన వానికి సంబంధించిన క్రియాపదములను వరుస క్రమములో కూర్చిరి రసనా నయనే కరౌ సః అను వానికి సంబంధించిన సర్వనామములు యాయేయాయః అనునవి. పై వానికి సంబంధించిన క్రియలు వరుసగ వదతి ఈక్షేత్రే అర్చితః స్మరతి అనునవి. భర్గ శబ్దమును పలుకు నాలుకే నాలుక. భర్గుని చూచు కన్నులే కన్నులు, అతనిని సదా అర్చించు చేతులే చేతులు. అతనిని ధ్యానించు భక్తుడే, కృత కృత్యుడు అని ప్రస్తుత శ్లోక భావము. మూలమునందు పేర్కొన్న పద్ధతినే కందము నందలి మొదటి రెండుపాదములలో అదెనాలుక యదె కనగవ యదె కరయుగమత డెధన్యులందున్ ధన్యుండు అని కవి పేర్కొనిరి. తరువాతి రెండు పాదములలో ముందు దెల్పిన క్రమమునే అనుసరించి ఎది శివు బలుకునో, కనునో యెది పూజించెడినో యెవ్వడెంచునో భక్తిన్ అని యథా క్రమముగా రచించెను.

మిగుల కఠినమగు ప్రదేశమును సంచరింపవలసి వచ్చినను సంశయము విడువుమని వేడుకొనుచు అతి మృదులౌమమచరణౌ అను శ్లోకము రచింపబడినది. దీనికి మృదుల మృదులంబులగు నాదుపదము లేడ అను గీతము అనువాదము. మమచరణౌ అతి మృదులౌ అనుటకు మృదుల మృదులంబులగు నాదుపదములేడ అనియు అతికఠినం తేమనః అనుటకు పరుషపరుషంబయిన నీదు భావమేడ అనియు కథమాసీద్గిరౌతథా ప్రవేశః అనుటకు కొండయందెట్లు తిరిగెదు అనియు అనువాదము ఈ శ్లోకము నందలి తుది వాక్యమునకు అట్టి పర్వతమున సంచారము (ప్రవేశము) ఎట్లు అయ్యెను అని ప్రతి పదార్థము. దీనినే కొంత మార్చి కొండయందెట్లు తిరిగెదు అని కవి కూర్చెను. ఇట్లే ఇతి విచికిత్సాం సంత్యజ అను వాక్యమునకు సంశయమును విడువుము అని అర్థము కాని బలిజేపల్లి ఈ భావమునెంతో

స్వతంత్రముగా మూలమునందలి భావమునకు వన్నెకలిగించునట్లు అనిననది చెల్లునయ్యా యతైన అని తెనిగించెను. మూలమున భవానీశ శివ అను రెండు సంబోధనలున్నవి బలిజేపల్లి లక్ష్మీకాంతము ఈ రెండింటికి మారుగా పద్యాంతమున **కొండతేడ** అను సాభిప్రాయ సంబోధనమును కూర్చెను. అతిశయమైన అర్థము తెల్పునపుడు వీరు సాధారణముగా ఒకేపదమును ఒకటికి రెండు మార్లు ప్రయోగించి రచనలో **అని** తరసౌందర్య దీప్తిని కలిగింతురు. ఇది వీరి హృద్యతర స్వీయ రచనలోని ప్రత్యేకత 80వ శ్లోకమునందును అత్యంతం మృదులం అను ప్రయోగమును వీరు మృదుల మృదులంబులైన అని రచించిరి ప్రస్తుత శ్లోకమున అతి మృదులా అతి కఠినా అను ప్రయోగములను మృదుమృదులంబునగు పరుషపరుషంబులైన అని ఆంధ్రీకరించిరి. ప్రస్తుత పద్యమునందు మూడవ పాదము నందు తప్ప తక్కిన వానిలో లేడ, మేడ తేడ అను అంత్య ప్రాసలును పాటింపబడినవి.

**ధైర్యాంకుశేన నిభృతం రభసాత్** అను శ్లోకమున ఈశ్వర పాదమందు తన మనస్సును నిర్బందించుటకై కవి ప్రార్థించుచున్నాడు. ప్రస్తుత శ్లోకమునకు మదవన్మామక చిత్తవారణము నంబానాథ! ధైర్యాంకుశ అను మత్తేభ విక్రీడితవృత్తము సన్నివేశ సముచిత ఛంద శ్శిల్పమర్మజ్ఞతకు నిదర్శనముగా ముద్రాలంకార స్ఫూర్తిని సూచించుచు ఆంధ్రీకరింపబడినది. ప్రస్తుత శ్లోకము అలతి పదములతో ఎంతో అర్థవంతముగా సూక్ష్మములో మోక్షము అన్నపద్ధతిలో రచింపబడినది. ఇందు హృదయ మదేభ ప్రసక్తి ఉండుటచే బలిజేపల్లి లక్ష్మీకాంతము మత్తేభ విక్రీడితమునే ఎన్నుకొనిరి. ప్రస్తుత పద్యభావమున కంతటికి మూలకేంద్రము మత్తేభము కావుననే ప్రస్తుత పద్యము మదవన్మామక చిత్తవారణము అని ఆరంభమైనది. దీనికి మూలము హృదయమదేభం అనునది ధైర్యాంకుశేన అనుటకు ధైర్యాంకుశ ప్రదరంబూని అని అనువాదము. ఇట ప్రదరంబూని అనునది కవి కల్పించిన ప్రయోగ విశేషము. చిద్యంత్రైః అనుటకు దివ్యజ్ఞాన యంత్ర స్థలిన్ అని ఆంధ్రీకరణము. ఈ ప్రయోగమునకు ముందుగా **మదోద్ధతిన్ గెడపి** అని కూర్పబడినది. అది మదవన్మామక చిత్త వారణమగుటచే విశేషించి **మదోద్ధతిన్ గెడపి** అని వివరించెను. **భక్తి శృంఖలయా** అనుటకు భక్తినామ నిగళోర్జాతంబు **తోడన్** అని ఆంధ్రీకరణము. **చరణాలానే** అను ప్రయోగమునకు పదపద్మంబునుకట్టు కంబమునకున్ అని అనువాదము. బధాన అను క్రియను బంధించి సాధింపుమా అని అనవాదకర్త సాధించెను. **రభసాత్ ఆకృష్య** అనుటకు అనువాదము లేదు . కాని ఇందలి భావమునే కదియం జేరరి అను ప్రయోగమున కవి ప్రకటించెను. **పురహర** అను సంబోధనకు బదులుగ **అంబానాథ** అని యతి స్థానమున బిందు పూర్వక బకారము వచ్చునట్లు కూర్పబడినది. ఏనుగునకు మదావళమని పర్యాయపదము ఉన్నది. మదవన్మామక అను దానికి మదము కలిగినదిగ పేరుకెక్కిన అని అర్థము.

**ప్రచరత్యభితః ప్రగల్భవృత్త్యా** అను శ్లోకమునందును మదగజ ప్రసక్తియే కలదు **మదవాన్, గరీయాన్** ఏషమనఃకరీ అను రెండవ పాదమునందలి ప్రయోగము ప్రస్తుత శ్లోకమున కర్తృపదము. ఆ **చిత్తోన్మత్త** గజము **ప్రగల్భవృత్తిలో** అనగా అపరాని గమనముతో అంతట సంచరించుచున్నది. దీనిని **భక్తి** యను త్రాటితో ఎంతో నయమార్గమున పట్టుకొని పరమ స్థాణు పదమున దృఢముగా పొందింపుమని పరిగృహ్యానయేన **భక్తి రజ్జ్వా** పరమ స్థాణు పదం దృఢన్నయాముమ్ అను శ్లోకతృతీయ. చతుర్థ పాదములలో అదిశంకరుడు ప్రతి పాదించెను. దీనినే బలిజేపల్లి కందమున మత్తిల్లి యిచ్చవచ్చిన యెత్తు న నెల్లెడజరించుసీ

నాచిత్తోన్మత్త గజంబుం ఉదాత్తపు భక్తి యనుమేటి స్థాణుపదవును జేర్చువుని అనువదించెను. మూలమునందలి భావమును ప్రకటించుటలో ఎచ్చటను కించిన్మాత్రమైనను లోపము కలుగుట లేదు. ప్రగల్భవృత్త్యా అనుదానికి ఇచ్చవచ్చిన ఎత్తున అని తెనిగింపు అట్లే అభితః ప్రచరతి అనుదానికి ఇచ్చవచ్చిన ఎత్తున అని తెనిగింపు అట్లే అభితః ప్రచురతి అనుదానికి ఎల్లెడజరిందు అని తెనుగుసేత. భక్తిరజ్వా లోని రజ్వా శబ్దమునకు తెనుగు లేదు. అనువాదమున భక్తి అనునది మేటి స్థాణు పదముగా ఆరోపింపబడినది. ఇందు భక్తికి ఉదాత్తపు అను విశేషణము చేర్చబడినది. మూలమునగల రెండవ పాదమున కంతటికి చిత్తోన్మత్తగజము అని అనువాదము నయ అను క్రియాపదమునకు చేర్చుము అని చక్కని తెనిగింపు పొందింపుము అనుట కంటె చేర్చుము అనుట ఎంతో సహజముగా ఉన్నది.

తరువాతి శ్లోకమున కవి కన్యగా భావించిన తన కవితను గౌరీ ప్రియుడు పరమేశ్వరునికి సమర్పించు చున్నట్లు తెలిపెను. ఇందు కవిత్వమునకు, కన్యకకు సరిపడు గుణగుణములు శ్లేషాలంకారయుతములు. సర్వాలంకారయుక్తాం అనుటకు సకలాలంకృత సంస్కృతం బనియు సద్భిః సంస్తూయమానం అనుటకు సుమనస్సంస్తూయ మానంబు అనియు లక్షితాం లక్షణాఢ్యామ్ అనుటకు సర్వకలా లక్షణ లక్షితాఢ్యము అనియు సువర్ణాం ద్యోతమానార్థరేఖాం అనుటకు సువర్ణ ద్యోతమానార్థమున్ అనియు సరస గుణ యుతాం అనుటకు ప్రకట శ్రీగుణమున్ అనియు సాధువృత్తాం అనుటకు సువృత్తమును అనియు ఉద్యద్భూషా విశేషామ్ అనుటకు శుంభద్భూషణం బనియు అనువాదము. సరళపదయుతాం, ఉపగతవినయం కళ్యాణీం అను విశేషణములకు అనువాదములేదు. మమ కవితా కన్యకాం త్వం గృహాణ అను వాక్యమునకు మామకకావ్యంబను కన్యకామణిని ప్రేమం గొమ్ము అని ఆంధ్రీకరణము. ప్రేమన్ అనునది స్వతంత్ర ప్రయోగము అనువాదకర్త సువర్ణా ద్యోతమానార్థరేఖాం అను రెండింటిని ఏకసమాస ఘటితము గావించెను. అతి ముఖ్యమైన సరళ పదయుతాం అన్నది అనూదితము కాలేదు. అనంతరము ఇదంతే యుక్తం వాపరమశివకారుణ్యజలధే అను శ్లోకమున హరిబ్రహ్మాదులకు గూడ గోచరముగానినీవు నాకెటుల ప్రసన్నుడవగుదువో అని వివరింపబడినది. ఈ శ్లోకమునకు సరవిన్ దావక పాద శీర్షకదిదృక్షా దీక్షమైమున్న శ్రీ హరియన్ అనునది అనువాదము.

హరి బ్రహ్మాది దేవతల కన్న నెక్కుడగు మహత్త్వము శ్రీ పరశివ పర బ్రహ్మము నందే కలదని తెలుపుచు శంకర భగత్పాదులు కావ్యాంతము గావించుచున్నారు. స్తోత్రేణాలమహంప్రవచ్మినమృష్టాదేవా విరించ్యాదయః అను శార్దూల విక్రీడిత శ్లోకమునకు నినుసంస్తుత్యలలో గణింత్రుమొనగానింగా విధాత్రాదులెల్ల అను మత్తేభ విక్రీడితమను వాదము .స్తుత్యానాంగణనా ప్రసంగసమయే త్వామగ్రగణ్యంవిదుః అనుశ్లోక ద్వితీయ పాద భావము ప్రస్తుత పద్య ప్రథమ పాదమున ప్రకటితమైనది. అగ్రగణ్యం అను శబ్దమును బలిజేపల్లి మొనగానిం అని అచ్చ తెలుగు పదములో నిన్ అనునది యతి స్థానము వచ్చునట్లు కూర్చెను. అగ్ర శబ్దమునకు తుదిమొన అని అర్థము దీని నాధారముగా గొని ఈ కవి మొనగానిన్ అని ప్రయోగించుట ఎంతో సహజముగా వ్యవహార ప్రసిద్ధముగా, అర్థవంతముగా నున్నది. అచ్చ తెలుగు పదములో ఎంతటి భావగాంభీర్యమునైన పాదిగింప వచ్చుననుటకు ఈ ప్రయోగము కనిదర్శనము. మూలమున మూడవపాదము మాహాత్మ్యాగ్రవిచారణ ప్రకరణే

**ధానాతుషస్తోమ** వద్ధూతః అననది. దీనికి సృష్టిస్థితిలయ సామర్థ్యమును గూర్చిన మొదటి చర్చను చేయునపుడును సారములేని ధాన్యమునందలి పొట్టు అంతయు బోలె కదలిపోయిన వారలై అని బలిజేపల్లి వారు టీకలో ప్రతి పదార్థము నొసగిరి. కాని యిందలి తుది భావము అనగా **ధానాతుషద్ధూతాః** అను ఉపమాలంకారము పూర్తిగా వదలి పెట్టబడినది. ఇందు మాహాత్మ్యాగ్ర అనుదానిని ప్రతి పదార్థములో పేర్కొన్నట్లు **అజాండాదిక సృష్టిలో నయినలీలన్** అని ఆంధ్రీకరించెను. మూలమున ఉపమాలాంకారము నందు పేర్కొనబడిన భావమెంతో మనోహరముగా ఉన్నది. ఇందలి మూలమునకు **తావక పాద శీర్షక దిదృక్షా దీక్ష** అని అనువాదము. మూలమున గల దర్శన ధియా ప్రయోగమునకు **దిదృక్షా దీక్ష** అని ఆంధ్రీకరణము. దిదృక్ష అనగా చూచుటయందు ఇచ్ఛ. ఈ ఇచ్ఛయందు బుద్ధి అనునది సూచితము దీనికి దీక్ష అనుపదము అనువాదకర్త అను సంధించి మరి కొంత అర్థ గాంభీర్యము కలిగించెను. **తిర్యగ్రూపం గతౌ** అనుటకు **శ్రీహరి యుందామరస ప్రసూతియు** అని **దివిభువిచాంతౌ** అనుటకు భూనభోంతరము గాలించి అని అనువాదము. ఆద్యంతము పంతముంగని అనునది మూలమున హరి బ్రహ్మాదులకు సంబంధించిన విశేషణము. అది అనువాదమున శ్రీమన్ అని పేర్కొనబడినది. మూల శ్లోకమున పాదాంతమునందు **శంభోస్వామిన్ కథయమమ వేద్యోసి పురతః** అని ఉన్నది. శ్లోకారంభమున **ఇదంతేయు** క్తంచ అని కలదు. వీనికి నాముందర కనుగొనదగిన వాడవునట్లు అగుదువు చెప్పుము ఇది నీకు తగునా అని భావము కాని అనువాదమున **తావరయంజాలని** నీపదంబిక ననంతా కాంతునేనే క్రియన్ అని వివరింపబడినది. ఇందలి కాంతునేనే క్రియన్ అను వాక్యము మూలమునందలి భావమును సూచించుచున్నది. కాని మూలమునకు నిది కొంత వివరణ ప్రాయము. మూలమున పరమ శివుని, కారుణ్య జలధే, శంభో స్వామిన్ అను నాలుగు సంబోధనలు కలవు. అను వాదమున నాల్గవ పాదమున యతి స్థానమున ప్లుతయతి కనుగుణముగా అనంతా అను సంబోధనము మాత్రమే కూర్చబడినది. పద్యప్రారంభమున సవిరన్ అనునదియు తురవాత దెలుప బోవు క్రమమును ముందుగనే విస్పటము ఉపమను గ్రహింపక పోయినను వారునీ ముందు నెందునకుంగారు అను వాక్యమునమూమూలు మాటలతో వ్యావహారికమున కెంతో సన్నిహితముగా నున్న అతి సహజధోరణిలో శివుని మహాత్మ్యమును వ్యక్తము చేసిరి. **త్వాం విదురుత్తమోత్తమ ఫలం శంభో భవత్సేవకా** అను వాక్యార్థమును ఇక **ఉత్తమోత్త మఫల స్తోమంబు నీకంటె లేదని నీ భక్తి జనం బెఱుంగు** అని తెనిగించిరి **భవత్సేవకాః** అను ప్రయోగమునకు బలిజేపల్లి తన టీకయందు నీ భక్తులైన అని అర్థముమొసగిరి. అది **విరించ్యాదయః దేవాః** అను దానికి విశేషణముగా టీకయందు పేర్కొనబడినది. ప్రస్తుతము **భవత్సేవకాః విదుః** అనువాక్యము **నీభక్త జనంబెఱుంగు** అని విధాత్రాదులకు అన్వయింపకవిడిగా పద్య రచనలో ప్రకటితమైనది. **స్తోత్రేణ అలం అహం** **ప్రవచ్మిన మృషా** అను మొదటి పాదము నగల వాక్యమును బలిజేపల్లి **నిజమీశా ఇంక జాలు న్నుతుల్** అని పద్యాంతమున తెలిపి కావ్య సమాప్తమొనరించుట ఎంతో ఔచిత్యవంతముగా ఉన్నది. య మృషానప్రవచ్మి అనగా అసత్యమును చెప్పను అని భావము. దీనికి నిజము అని మాత్రమే భావము స్తోత్రేణ అలం అనుదానికి స్తుతి చేతచాలును అని అర్థము. దీనిన బలిజేపల్లి ఇంక జాలున్నుతుల్ అని బహువచనముగా ప్రయోగించుట మిగుల సమంజసముగా నున్నది. మూలమున శంభో అని సంబోధనమున్నది దీనికి బదులు ఇందు ఈశా అని సంబోధించి శ కారమున గల అచ్చుకు ప్లుతయతిని పాటించెను.

ఇట్లు బలిజేపల్లి లక్ష్మీకాంతకవి శివానందలహరి లోగల శివస్తవ శ్లోకములను ప్రతి పదాంధ్రటీకా తాత్పర్య పద్య సహితము గా ఆంధ్రీకరించిరి. 5-7-1930 వ తేదీన తాను గుంటూరులో ఉన్నప్పుడు ఈ గ్రంథము రెండవ కూర్పు ముద్రింపవలసిన అవసరము గలిగి నట్లుతన పీఠికలో పేర్కొనిరి. మొదటి కూర్పు ఎప్పుడు అచ్చు అయినది పీఠికలో ఉట్టంకించినచో ఎంతో బాగుండెడిది. అల్లూరి వాస్తవ్యులు, ఆస్తిక శిఖామణులు, నాట్యగాన కళాకోవిదులు, శ్రీమంతులునగు శ్రీయుత పర్వతరెడ్డి రామచంద్రారెడ్డి గారు ప్రస్తుత పుస్తకమునకు ముద్రణ మూల్యము ఒసంగినట్లు పీఠికలో పేర్కొనిరి. ప్రతి పదార్థమును వ్రాయునపుడు మూలమునే గ్రహించుట అందందు ప్రతి పద్యమునకు ప్రారంభమున ఆయా శ్లోకముల సారాంశమును ప్రకటించుట. కొన్ని సందర్భములలో ముందు శ్లోకమునకు తరువాత శ్లోకమునకు గల అను బంధమును ప్రతిపాదించుట ఈ రచన యందలి ప్రత్యేకత పద్యరచనలో సుప్రసిద్ధుడయిన ఈ మహాకవిరచనలను చదివి అందలి స్వారస్యములను నా బుద్ధి మేర గ్రహింవగలుగు భాగ్యమునకు నేనెంతో సంతోషించుచున్నాను. వీరి గ్రంథములను గూర్చి సవిమర్శకముగా చర్చించు అవకాశము లభించినందులకు నిజముగా గర్వించుచున్నాను. వీరు తమ జీవితములో ఎన్నో కష్టనష్టములు, ఒడిదుడుకులు, ఉచ్చనీచస్థితులు, దారిద్ర్యబాధలు అను భవించిన వారు. ఆ అనుభవము లన్నియు రసహృదయుడు. సహృదయుడు అయిన ఈతని రచనలలో ప్రతి ఫలించి సహజసిద్ధముగా నెలకొని పద్యరచనా ప్రతిభకు అలంకార ప్రాయములు కాగలిగినవి.

బలిజేపల్లి లక్ష్మీకాంతకవి శివానందలహరికి వ్రాసిన అనువాద పద్యములతోపాటు టీకా తాత్పర్య విశేషాంశములను ప్రచురించి, నిజముగా ముముక్షుకోటికి మహోపకార మొనరించిరి. కేవలము అనువాద పద్యములనే ప్రచురించియున్నచో నిది ఏకొందఱను మాత్రమే అలరించి ఉండెడిది. అట్లుకాక సర్వజనామోదదాయకముగా, టీకాతాత్పర్యములతో రెండవ కూర్పును పర్వతరెడ్డి రామచంద్రారెడ్డి గారి సాయముతో ముద్రించి లోకమునకు వెల్లడిచేసిరి. భక్తి భావమును బహుళ ప్రచారము గావించుటలో వీరి యీ ప్రచురణ ఎంతో సహకరించినది, ఆంధ్రులలో ఆది శంకరునిపై విశుద్ధ ప్రగాఢాభిమానమును పెంపొందించుటకు దోహదకారియైనది.

ఇట్లే సంస్కృతమున నిత్య పారాయణ గ్రంథమగు ఆదికవి వాల్మీకి సుందరకాండము నందలి విషయమును గూడ ఆంధ్రులకు అనువాద రూపమున అందజేయు మహనీయ సంకల్పముతో మూలమునందలి భావమెచ్చట కొఱవడకుండవాద్యపద్యప్రబంధమును నిబంధించిరి. సుందరకాండమును వీరు తమ జీవిత చరమదశలో రచించిరి. అసంపూర్ణముగా మిగిలిపోయిన భాగమును శ్రీ మేడవరం రామబ్రహ్మశాస్త్రిగారు పూరించిరి. నా కవిత్వంతో మీ కవిత్వం చక్కగా కలుస్తుంది కాబట్టి మీరీ సుందర కాండము పరిపూర్తి చేయండి అని బలిజేపల్లి వారే రామబ్రహ్మశాస్త్రిని కోరినట్లు తెలియుచున్నది. శాస్త్రిగారు రందుకంగీకరించిరి ఒకసారి వ్రాసిన పద్యములను పోగొట్టుకొని, మరల రెండవ పర్యాయము రచించి సుందరకాండమును పూర్తియొనర్చిరి. ప్రస్తుత మీ గ్రంథము ముద్రితమైమనకు లభ్యమగుట మన అదృష్టవిశేషము. ఇక ఈ గ్రంథమునందలి రచనా విశేషణములను - అందు ముఖ్యముగా లక్ష్మీకాంతకవి గారి అనువాద విధానమును సంగ్రహముగా పరిశీలింతము.

# సుందర కాండము

సంస్కృత వాఙ్మయ జగత్తులో ఆది కావ్యమైన వాల్మీకి రామాయణమునకు గల ప్రాముఖ్యము మరియే ఇతర గ్రంథములందును గానము. గానమొనరించుటకు అనువుగా ఈ గ్రంథ రాజము వర్ణింపబడుటచే కొందరు సంగీత శాస్త్ర కావ్యముగా భావించుచున్నారు. ముఖ్యముగా రామాయణమున సుందర కాండమునకు గల ప్రాశస్త్యము అగణ్యము. మంత్రాక్షర మహితమైన సుందర రామాయణము పలువురికి నిత్య పారాయణ గ్రంథము. దానికి కారణమది లలిత మధురాక్షర నిబద్ధము. మంత్ర రహస్య సంకలితము. ఇందలి ప్రతి శ్లోకమున గాయత్రీ మంత్రము నందలి బీజాక్షరములు కవితా సౌందర్యమును పుణికి పుచ్చుకున్నవి. శాశ్వత ధర్మ ప్రతిష్ఠకు ఉపస్కారకముగా మంత్రాక్షరమహితము, సర్వలోకహితము. సత్య సమ్మతమునగు పద్ధతిలో రామాయణమెంతో సుందరతరముగా సాగి, ధర్మ మార్గానుయాయులైన సత్యాన్వేషణ పరులకు నిత్య పారాయణ యోగ్యము కాగలిగినది. పురుషార్థములన్నింటిలో ధర్మమే పరమ పురుషార్థమని రామాయణము చెప్పుచున్నది. ప్రకృతి తన అనంత వ్యాపారములను ధర్మము ననుసరించియే సాగించుచున్నది. ధర్మము పైననే ఈసృష్టి అంతయు ఆధారపడి ఉన్నది. కాన లోక ప్రతిష్ఠాహేతువగు ధర్మము నెవ్వరును భంగింపరాదు. ధర్మ భంగము వలన ప్రకృతి యందు వైకృత్యమేర్పడును. కనుకనే ధార్మిక ప్రాణులగు మహర్షులు పలు పాట్లు పడి తమ యావచ్ఛక్తిని ధర్మ ప్రతిష్ఠ కొరకై వినియోగించిరి. అట్టి ధర్మ ప్రతిష్ఠనుద్దేశించియే వాల్మీకి మహర్షి రామాయణమును రచించెను. అతడు తన గ్రంథమున ధర్మ మూర్తియగు రాముని, నాయకునిగ స్వీకరించెను. ధర్మ ప్రతిష్ఠ ధర్మాత్ముల వలననే జరుగునని, ధర్మ ప్రతిష్ఠ చేయుటకు ధర్మ బద్ధమైన ఆచరణ సత్య నిష్ఠమైన వాక్కు. ఈ రెండును అపేక్షితములని గ్రహింపవలెను. రామాయణమున అనేక సందర్భములలో ధర్మ స్వరూపము నిరూపింపబడినది. **ధర్మాత్ ప్రభవతేసుఖం, ధర్మేణలభతే సర్వం, ధర్మసారమిదం జగత్** అని అరణ్య కాండము. **ధర్మోపరమోలోకే ధర్మే సత్యం ప్రతిష్ఠితం** (40-21-2 రామాయణం) ఇంత యేల? **రామో విగ్రహవాన్ ధర్మః** అని గదా ప్రమాణోక్తి.

కేవలము భౌతికమైన అధర్మ శక్తి పైకి చాల శక్తిమంతముగా ఉన్నట్లు కన్పించును. కాని ఆధ్యాత్మికమైన ధర్మ శక్తి ముందు అది నిస్సారము. ఆధ్యాత్మికమైన ధర్మశక్తి ఎంతో బలవత్తరము. అట్టి ఆధ్యాత్మిక శక్తినే ధర్మ బద్ధముగ తమ కావ్యములలో మహర్షి తుల్యులైన కవులు ప్రతిపాదించిరి. సత్య శివ సుందరాద్వైత లక్ష్య శుద్ధితో నిత్య నవ్యములగు నట్లు సుందర నందన సమములగు కావ్యములను భావి శుభాభిరామములుగ తీర్చి దిద్దుట మన సుకృతము. అట్టి సుకృత పరిపాక విశేషము రామాయణమున ఎంతో మహనీయముగ అను సంధింపబడినది. ధర్మమునకు ప్రతి రూపము రాముడు. తచ్చరితమే రామాయణము. ఈ రామాయణ పరమ లక్ష్యము సుందర కాండమున ప్రత్యక్షరమున ప్రతిభాపూర్ణముగా ప్రత్యక్షమగుచున్నది. సుందరకాండము నందలి రచనా సౌందర్యమునకు, గాయత్రీ మంత్ర విలసితమగు అర్థ గాంభీర్యమునకు, ఆకృష్టులై పలువురు నిత్య పారాయణము గావించినను, అందలి సారమును తనివి తీర రుచి చూచి తరింపవలెనని ఎందరో సరసహృదయులైన సహృదయులు అభిలషించుట వారి వారి రసాస్వాదన పరతకు చక్కని నిదర్శనము. సంస్కృతము నందలి ఆ సౌందర్యమును, అందలి అర్థ గాంభీర్యమును కవితా స్వారస్యమును అందలి సారమును ఆంధ్ర పాఠక లోకమునకు చక్కని చిక్కని పద్య రచనలో అందించుట

సమంజసమని భావించిన బలిజేపల్లి లక్ష్మీకాంతకవి సుందర రామాయణ రచనకు గడంగుట మిగుల కొనియాడదగిన విషయము. ఇది తనచే అసంపూర్ణముగ అనూదితమైనను తక్కిన భాగములను తెనిగించుటకు కీ॥శే॥ మేడవరము రామ బ్రహ్మ శాస్త్రి గారు పూనుకొనుట గమనార్హము. శ్రీ మేడవరము రామబ్రహ్మ శాస్త్రి గారు ద్వితీయ భాగమును తెనిగించుటకు ముందు కావ్య పీఠికలో తమ ఇష్ట దైవములను, తల్లి దండ్రులను, పూర్వ సంస్కృతాంధ్ర కవులను స్తుతించుచు **శ్రీకాంతాపతి పాదసేవకుడు బల్జే పల్లి వంశ్యుండు లక్ష్మీకాంతాఖ్య కవీంద్రుడాది కవి వాక్ శ్రీధుర్య రామాయణ, శ్రీకిన్ సుందర కాండ ముత్తమముగా జింతించి యాంధ్రీకృతిం, జేకొంచిర్వదినాల్గు సర్గములు వ్రాసెంగించి దూనంబుగాన్** అని బలిజేపల్లి లక్ష్మీకాంత కవి గారు వ్రాసిన ఇరువది నాల్గు సర్గముల అనువాదమునకు అనుబంధముగా తన అనువాదమును ఇరువదియైదవ సర్గము నుండి ప్రారంభించెను. ఈసందర్భమున బలిజేపల్లి లక్ష్మీకాంతకవిని గూర్చి తెలిపిన కొన్ని విశేషణములు గ్రహింపదగినవి. ఆ లక్ష్మీ కాంత కవి కవితా గానకళాకుశలుడు. వివిధ నాట్య లాలసమతి. హృద్యాకృతి. ఇందు సంగీత సాహిత్య, నాట్య కళలలో ఆరితేరిన లక్ష్మీకాంత కవి యొక్క నైపుణ్యము అతని సుందరాకారము సూచింపబడినవి. అతని అనువాదముతో తన అనువాదము సాటి గాకున్నను కుంటుదనము లేకుండ సాగి పోగలదను ఆత్మ విశ్వాసమును ప్రకటించిరి. **మత్కృతి తత్కృతినేకరణి బోలు**అను ప్రశ్నార్థకమును బట్టి బలిజేపల్లి లక్ష్మీకాంతకవి కవిత్వము నాన్యత స్సాధ్యమని దాని నితరులు అనుకరించుటకు వీలు కాదని, అది ఎంతో ప్రతిభావంతమై, అసమానరస స్ఫూర్తి కలిగియున్న దని వెల్లడి అగుచున్నది. తన కవిత **కుంటునెనయమిచాలున్** అని మేడవరము రామబ్రహ్మ శాస్త్రి గారు భావించుట వలన పరిపూర్ణముగా బలిజేపల్లి లక్ష్మీకాంత కవి గారి కవిత్వ పద్ధతిని యథా తథముగ పాటింపలేక పోయినను కొంతకు కొంత అత్రోవలో ఆకోవలో తన రచన సాగనున్నదని తెలిపి సుందర కాండము నందు (మిగిలిన) తక్కిన నలుబది నాలుగు సర్గములను తెనిగించిరి. బలిజేపల్లి లక్ష్మీకాంత కవి గారు, రామబ్రహ్మ శాస్త్రి గారు గద్వాల సంస్థానములో కలుసుకొన్న నాటికే బలిజేపల్లి కొంత వరకు సుందర కాండమును తెనిగించి ఉండిరి. రామ బ్రహ్మ శాస్త్రి గారితో బాగుగా పరిచయము పెరిగిన తరువాత బలిజేపల్లి లక్ష్మీకాంత కవి కర్నూలుకు వచ్చి కొన్నాళ్ళుండి నాకవిత్వముతో మీ కవిత్వం చక్కగా కలుస్తుంది. కాబట్టి మీరే సుందరకాండను పరిపూర్తి చేయండని కోరగా అట్లే అని శాస్త్రిగారు అంగీకరించి అనువదించిరి, కానీ మొదట వ్రాసిన పద్యములన్నియు పోగొట్టు కొనగా రెండవ పర్యాయము వ్రాయ వలసి వచ్చినది. ఇరువురును మూలాను సరణమైన ఆంధ్రీకరణమునే ప్రతిజ్ఞగ చేపట్టిరనుట యథార్థము.

మన ఆంధ్ర వాఙ్మయము అనువాదముతో ఆరంభమైనదనుట అందఱకు విదితమే. మొదట మహాభారతము కవిత్రయము వారిచే అనూదితమైనది. ఆముగ్గురు కవులును ఎంతో ఔచిత్యమును పాటించి మూలమునకు ఎన్నో సందర్భములలో వన్నెలు చిన్నెలు దిద్దుచు స్వతంత్ర కావ్యమువలె అద్వితీయముగా రచించిరి. మూల గ్రంథము కంటె ఆంధ్ర భారతమే తెలుగు వారిని మిగుల ఆకర్షించినది. పంచమ వేదమనదగిన భారతములో ఎన్నెన్నో ఉపాఖ్యానములు చోటు చేసికొన్నవి. అందందు మూలమున కొన్ని ఘట్టములు పునః ప్రకటితములైనవి. అట్టి పునరుక్తి దోషములను అసందర్భములను, అనౌచిత్యములను పరిహరించి కవి త్రయము వారు మనకు అందించిన శ్రీమదాంధ్ర మహాభారతము నిజముగా మన జాతి గర్వింపదగినది. పురాణానువాద యుగము నందే రామాయణముకూడ తెనుగున

పరివర్తింపబడినది. ఇది భారతమువలె అనేకోపాఖ్యానకుల సమాహారముకాదు. ఏకైక నాయకాశ్రయమైన గ్రంథరాజము. వాల్మీకి మహర్షి ప్రకృతి సౌందర్య దిదృక్షను రామాయణ కథ సందర్భముతో అదికిన వైనము అప్రతిమానము. మూల గ్రంథము ఆది కావ్యముగా ప్రసిద్ధము. అది ఎంతో రస వత్తరముగ, అనౌచిత్య రహితముగ లోక హితమును, మూర్తీభవించిన ధర్మమును రామునిలో ఆరోపించి తనకు తానే సాటి అనిపించు కున్న రమణీయ గ్రంథము. ఇట్టి గ్రంథమును ఏ భాషలో అనువదించినను మూలమునగల దీప్తి పరివర్తనమున ప్రాప్తించుట కష్టసాధ్యము. కావుననే ఆంధ్రము నందును ఎన్నో రామాయణములు వెలువడినను మూలమును పరిపూర్ణముగా అనుసరింపలేకపోయినవి. కొందఱు రామాయణ కర్తలు జన ప్రచారములో ఉన్న కొన్ని ఘట్టములకు ప్రాముఖ్యమొసగి తమ ప్రత్యేకతను ప్రదర్శించుకొనిరి. కాని మొత్తము మీద ఎన్నో రామాయణములు తెలుగున వెలువడినను మూలమునందలి ఆత్మ సౌందర్యమును అభివ్యక్తీకరించుటలో అసమర్థములైనవి.

కొందఱు కవులు ఆధునికముగా యథా తథ పరివర్తనకు పూనుకొనిరి. కాని ఏ వియును మూలమునకు దీటు కాలేక పోయినవి. ప్రకృతము రామాయణమున మిగుల ప్రసిద్ధమైన సుందరకాండమును మాత్రమే మూలవిధేయముగా ఆంధ్రీకరించుటకు బలిజేపల్లి లక్ష్మీకాంతం గారు ప్రయత్నించి ఇరువది నాల్గు సర్గముల రచించిరి. బలిజేపల్లి గారికి మొదట నుండియు అద్వితీయ కవితా పాటవముతో ఔచిత్యమును పాటించి అవసరమున్నను లేకున్నను కొంత స్వతంత్రతా స్ఫూర్తిని ప్రకటించుట పరిపాటి. అది ఆయన సహజ ప్రవృత్తి. కాని సుందర కాండమును రచించునపుడు మూలాను సరణముగనే వ్రాయుదునని వీరి ప్రతిజ్ఞ. అట్టి ప్రతిజ్ఞలో వీరు ఎంతవరకు కృతకృత్యులయిరో ప్రకృతము మనము పరామర్శింపవలసి ఉన్నది. హనుమంతుని సముద్ర లంఘనారంభ సంరంభముతో సుందర కాండ ప్రథమ సర్గము ప్రారంభమగును. అనంతరము శత్రు కర్షణుడైన హనుమంతుడు రావణునిచే కొని పోబడిన సీత నరయుటకై అంబర మార్గమున పయనించెను. మూలమున చారణా చరితే పథి అను దానిని అంబర సరణిన్ అని మాత్రమే లక్ష్మీకాంత కవి అనువదించెను. దుష్కరము, నిష్ప్రతిద్వంద్వమగు కర్మను చేయకోరిన వాడై సముదగ్ర శిరోగ్రీవముగల గవాంపతి వలెవైడూర్య వర్ణములు సలిల కల్పములగు శాద్వల ములందు తిరుగుచు కేసరి వలె పశులను బెదరించి ఱొమ్ముతో పాదములను హరించుచు నీలలోహిత మాంజిష్ఠపద్మ వర్ణములతో సితా సితములగు వన్నెలు కలిగి, కోరిన రూపము ఎత్తగల దేవతుల్యులైన యక్ష, కిన్నర, గంధర్వులు తమ తమ పరివారములతో తిరుగు మహేంద్ర పర్వతమును ఒక కొలనులో మదించిన ఏనుగువలె నొప్పారెనని మూలమందు వర్ణింపబడినది. దీనిని లక్ష్మీకాంత కవి దుష్కర కార్యమున్ సమర్థింప గడంగి గోపతి గతిన్ మెడసాచి తలన్ నిగిడ్చి సొంపగు శాద్వల స్థలుల జొచ్చి విహంగముల నదలించుచు తరువులను ఱొమ్మాది వ్రక్కలించుచు పంచానన విక్రమ ప్రభా భాసితుడై పంచరించి అమ్మహేంద్ర గిరీంద్రంబందు నొక్క మడుగులో జల్లు పొరాడు మద కరీంద్ర కరణి బురణించెనని వర్ణించెను. ఇచ్చట మహేంద్రగిరిని వర్ణించు సందర్భమున సీస పద్యము కూర్పబడినది. కవి యిట స్వయముగా కొంత కల్పన మొనరించెను. ఇందు విద్యాధరాదుల మేనితొడవుల రాలు పుప్పొడుల కల్మిమహితమై అను ప్రయోగము ఎన్నదగినది. అనంతరం తరణికి, మహేంద్రునకు, మాతరిశ్వునకు, బ్రహ్మకు మారుతి ప్రణామములిడి ప్రయాణమయ్యెను.

ప్రథమ సర్గమున గల తొమ్మదవ శ్లోకమునకు తెనిగింపు లేదు. ప్రాఙ్మఖము

నుద్దేశించి అంజలిని ఘటించుచు తన తండ్రి వాయుదేవునికి అంజనేయుడు నమస్కరించెను.. పిమ్మట దక్షుడై దక్షిణ దిశ నుద్దేశించి పోవుటకై శరీరమును పెంచెనని ఆశ్లోకము యొక్క భావము. దీనిని పునరుక్తిగా భావించి అంగ్రీకర్తత్యజించెను. పర్వములందు సముద్రముపలె రామ వృద్ధ్యర్థమై ప్లవగ ప్రవరులచే చూడబడిన వాడై శరీరమును పెంచెనని తరువాతి శ్లోకభావము. దీనిని బలిజేపల్లి నిశ్చలాశ్చర్య దృష్టులనిక్క, తోడి ప్లవగవరులెల్లలను జూడ రామ కార్యర్థమై పర్వదివసంబులందకూపారమట్లు పవన సూతి శరీరము పెంచె నని అనువదించెను. మూలమున దృష్ట అని మాత్రమే ఉన్నది. ప్లవనే కృతనిశ్చయః అనుదానికి అనువాదము లేదు. నిశ్చలాశ్చర్యదృష్టుల నిక్క అనునది కవి స్వతంత్ర ప్రయోగము రామవృద్ధ్యర్థమునకు రామ కార్యార్థము అని తెనిగింపు. అటుపై నిప్రమాణ శరీరుడు అనుకరుడు తన బాహువులతో చరణములతో పర్వతమును పీడించెను. దీనిని ... మీరు శనిస్ఫురణతో సంద్రమును దాటు సముద్దరత కలిగి ధరాధరమును కరచరణములచే గ్రక్క దలించినట్లు కవి తెనిగించెను. మూలమున గల సమాసము ఇచ్చట తెలుగు పదములలో వివరింపబడినది. పీడయామాస అన్న క్రియ చరచి, గ్రక్కదలింప అను అచ్చ తెలుగు పదములతో కరచరణములు గావించిన క్రియలకు అను గుణముగా ప్రయుక్తము. పిమ్మట నాలుగు శ్లోకముల భావము ఒక సీసముననే కూర్చబడినది. మూలమున సుగంధినా అని ఉండగా నెరయురాలిన కమ్మవిరుల ప్రోవుల కల్మి గొమరారె అనిఅచ్చ తెలుగు జిలిబిలి పలుకుల అల్లిక జిగిబిగిని ఎంతో అందముగ కవి ప్రదర్శించెను. శైలము ప్రస్ఫుటముమన్న దానిని పూలకొండవోలె అని తెనిగించెను. ముమోచచ శిలాః శైలో విశాలాః సమనః శిలాః ...ధూమరాజ దివానలః అనుశ్లోకమును జ్వలదనలము నడిమింటన్..... గలసిన పెను బండలనగ నెగ జిమ్మ బడబడన్ దొరలి పడన్ అను కంద పద్యమున అప్పటి సన్నివేశము ప్రత్యక్షీభూతమగు పద్ధతిలో పదముల కూర్పులోని నేర్పును ప్రదర్శించెను. పెను బండలనగ అను పదములోని బం అనుచోట విరిగిన సరణియు మరియు నిందలి అనేక ద్రుత ప్రకృతికముల ప్రయోగముచే అప్పటి ద్రుత గతిని చక్కగ సన్నివేశాను గుణముగ కవి తన పదముల కూర్పుతో వ్యంజింపజేసెను.

తరువాతి రెండుశ్లోకముల భావము హరివీరోద్ధతి అను మత్తేభవృత్తమున అప్పటి కోలాహలము ధ్వనించునట్లు గంభిర పద్ధతిలో వివరించెను. పిమ్మట రెండు శ్లోకముల భావమును ఒక గీతమునందే తెనిగించెను.

నాల సంద్రాల తమ్మైన పడగ లెత్తి
విషములు ఘోర విషవహ్నులో కిలించి
నెఱకు కోఱల కఱపగ గండ శిలలు

తటపటను పేయి తునకలై ప్రేలి పడెనని తెలుపబడినది. ఎంతటి విషమునైన నాశమింపచేయు ఆకొండ యందలి చెట్ల మూలికలకు ఆ విష ధరముల విషములు వ్యర్థమయ్యెను. ఇరువది మూడునుండి ఇరువదియైదు వరకు గల శ్లోకముల భావము సీసమున నిబంధింపబడినది. ఇందుకవి అచ్చ తెలుగు పదముల కూర్పునకే ప్రాముఖ్యమొసగెను.. అనంతరము రెండు శ్లోకముల భావము సీస పద్యముననే కూర్చబడినది. ఇది మూలమునకు వ్యాఖ్యాన ప్రాయము. హారవునూపుర [illegible]రపారిహార్యధరులైన స్త్రీలు రమణులతో కూడి ఆకసమునకు ఎగరగా వారు విస్మితులై [illegible]స మొనరించి రని శ్లోకభావము. ఇందలి మొదటి పాదము యొక్క భావము సీసమునకు

అనుబంధముగను, రెండవ పాదము నందలి భావము ప్రత్యేకించి కంద పద్యముగను నిబంధింపబడినది. ఇరువది యేడు, ఇరువది ఎనిమిది శ్లోకముల భావము ఉత్పలమున కూర్పబడినది. అణిమాద్యష్టవిశుద్ధసిద్ధులు గలవిద్యాధరులు, సిద్ధచారణులు, పరబ్రహ్మమును భావించు మహర్షులు హనుమంతుని గాంచి విస్మయ సమాహూతులై యిట్లను తించిరని శ్లోక భావము. విద్యాధరతాపసులు హనుమంతుని గూర్చి ఇతడే పర్వత సంకాశుడైన హనుమంతుడు మారుతాత్మజుడు, వరుణాలయమగు సముద్రమును దాటుచున్నాడు. రామార్థము, వానరార్థము దుష్కరకార్యము చేయ నిచ్చగలవాడై దుష్ప్రాపమైన సముద్రముయొక్క పారమును ప్రాప్తించుటకై కోరుచున్నాడని తెలిపిరి. ఈ భావము రెండు శ్లోకములందున్నది. దీనిని బలిజేపల్లి అతడే వాయు తనూభవుండు రఘురామార్థంబు కీశార్థమున్నతశైలాకృతియై అన్న మత్తేభ వృత్తమున వివరించెను. మూలమున లేని గాంభీర్యమును తాను ఎన్నుకొన్న పద్య గతికి అను కూలముగ సమాస కల్పనా చాతురితో ప్రదర్శించెను. దుస్తరోగ్రతికి గ్రాహ సముచ్ఛలవణ పారావారము సముగ్రారంభ సంరంభియై అను ప్రయోగములు మూలమున లేవు. సముద్రస్య పరంపారం దుష్ప్రాపం మహా వేగః అను మూలమున గల వాక్యములకు పై సమాసములు కల్పింపబడినవి. తమ ప్రమేయం దదృశుః అన్న వాక్యములో ఒక్క విశేషణము మాత్రమే ఆంజనేయుని ఉద్దేశించి ఉన్నది. అనువాదమున అప్రమేయు, జగత్గేయు, ఆంజనేయు అను పాదము అంత్యాను ప్రాసమనోజ్ఞముగా కూర్పబడినది. పిమ్మట హనుమంతుడు తన రోమములను విదిలించి తోయదమువలె గర్జించునట్లు తెల్పుచు ననాదసుమహానాదం సుమహానివతోయదః అని మూలమున గలదు. దీనికి

పర్వత ప్రాంశుమూర్తి అప్పవన సూతి
తనువు విదిలించి రోమ సంతతి విదిర్చి
ప్రావృషేణ్యమహ పయోవాహలీల .

గడలు కపింప గర్జించి గండరించి నట్లు అనువదించెను. ఇందలి పర్వత ప్రాంశుమూర్తి మూల భిన్నము. ప్రావృషేణ్యమహాపయోవాహ మన్నది. కాళిదాసుని ప్రయోగమును తలపించుచున్నది. హనుమంతుడు అను పూర్వము, వృత్తము మరియు రోమములచే కప్పబడిన తన లాంగూలమును పక్షిరాజు ఉరగమునువలెపైకి ఎగర్వైచి మిగుల కదిలించెను. దీనిని బలిజేపల్లి తర తరమును వజ్రువయునుస్వరు కర్కశదీర్ఘలోమసంబును రాత్రించర శూలమునకు వాలము గరుడుండురగమును బోలెగడు నల్లార్చెనని వివరించెను. అను పూర్వము నకు తరతరమనియు, వృత్తమునకు వజ్రువ అనియు రోమభిశ్చితమ్ అనుదానికి స్వరుకర్కశ దీర్ఘలోమశము అనియు అనువాదము. ఇందలి తుది విశేషణమున స్వరు అనగా వజ్రాయుధము దానివలె కర్కశము, దీర్ఘమునై శరీరము నిండ రోమములు కల్గినట్టి వాలము అని పేర్కొనెను. రాత్రించర శూలము కవి కల్పితము. హనుమంతుడు నింగికెగయు సందర్భమున కూర్పబడిన సీసము తదనుబంధమగు తేటగీతియందు కేవలము అసమాపక క్రియలతో నాలుగుపాదములందును కూర్చినకూర్పు మూలమున కంటె విస్తరముగా వివరింపబడినది. తాను లంకయందు ప్రవేశించి అచ్చట జానకిని కనకున్నచో అట్లే సురాలయమునకు ఏగుదును. అత్రిదివమునందును చూడకున్నచో రాక్షసరాజైన రావణుని బంధించి తెత్తును. సర్వదా కృతకార్యుడనై సీతతో రాగలను. లేనిచో సరావణముగ లంకను సముత్పాటించి వత్తునని హనుమంతుడు జాంబవదాదులకు తెల్పినట్లు మూలమున గలదు. రాఘవ నిర్ముక్తమైన శరము వలె రావణ పాలితమైన లంకను చేరగలననియు తెలిపెను. ముప్పది ఎనిమిదినుండి

నలువదిమూడుశ్లోకములవరకుగల పై చెప్పిన విషయము రెండు మత్తేభవిక్రీడితములలో నిబంధింపబడినది. రామ విసిర్ముక్తః శరః అని మూలము రామునమోఘోగ్ర శిలీముఖంబని అనువాదము. రావణపాలిత మన్నదానికి అనువాదము లేదు. కేవలము లంకాపురి అని ఉన్నది. కృతశ్రముడనై రావణుని బంధించి తెత్తునని మూలభావము చెప్పెరసురారిన్ రావణుం బట్టికట్టి చెఱన్ దెచ్చెద అడ్డమైన రిపుకోటన్‌మీటి అని మూలమునకు కొంత వ్యాఖ్యానప్రాయముగా తెనిగింపు. ప్రమురాట్టాలకుమున్ సమూలముగ నుత్పాటించి అను ప్రయోగమున ఉత్పాటించి అను దానికే మూలమున్నది. సరావణమ్ అను దానిని ఆంధ్రీకర్త ఇట్లువిస్తరించెను. ఇరువది ఏడవపద్యము పూర్వాపరసందర్భములను సమన్వయించుచు కవి స్వయముగ ఒక క్రమ పద్ధతిలో విస్తరించిన విశేషము. 28 వచనమున విషయమును మరికొంత సుబోధ మొనర్చుచు నలువది నాల్గవ శ్లోక భావమును కొంత అనుసరించెను, నలువదినాల్గన్నర నుండిఅరువది యెనిమిది వరకు గల శ్లోకములను ఇరువది తొమ్మిది నుండి ఏబది ఒకటి వరకు గలపద్యములలో అనువదించెను. హనుమంతుడు పైకి ఎగసినపుడు ప్రకృతి యందు కలిగిన పరిణామము, అప్పటి ఆతని ఆకారాభివర్ణనము ఇందలి శ్లోకములలో చోటు చేసికొన్నది. ఆకసమునకు ఎగసినపుడు గగన మందు ఒదవిన దృశ్యములు అరువది ఎన్మిదవశ్లోకము నుండి వివరింపబడినవి. తస్యాంగవేగేన సొన్మాదఇవ లక్ష్యతే అను వాక్యమును తదీయదీర్ఘోరుజవావేశమున సుడియ నంభోరాశిని, సొన్మాద భంగురంబుగ దోచె నని అనువదించెను. మూలమున కేవలము అంగవేగమని ఉండగా అనువాదకర్త దానిని మరికొంత విస్తరించెను. అరువది తొమ్మిది నుండి డెబ్బది మూడువరకు గలశ్లోకములు 53, 54, 55 పద్యములలో అనువదింపబడినవి. కపివాతమునకు, మేఘవాతమునకు సాగరము మిగుల కంపించిన విషయమును కపితనూద్యద్వేగఝంఝూనిలంబునకున్ దోడుగబేర్చి మేఘపవనంబున్ అని పేర్కొనెను. ఇట్లే అన్యక్రామన్ మహావేగః తరంగాన్ గణయన్నివ అనువాక్యము వారాశిలోనంగల్లోలము లెన్నియో తెలియనెన్నంబోవు చందంబునన్ అని ఎంతో సుబోధముగ, సరళముగా భావపరిపూర్ణముగా అనూదితమైనది. శరదభ్రమి వాతకమ్ అనునది శారదనీరదవిశేషసరణి అని అనూదితము క్రిమినక్రఝషాః కూర్మాః దృశ్యంతే..... వస్త్రసమ కర్షణేవ శరీరాణి శరీరిణామ్ అనుశ్లోకము తిమిఝషగ్రాహ కూర్మములు వలువ దలగనూడ్చిన దేహి గాత్రముల పగిది అని అనువదింపబడినది. కాని ఈ పద్యమున మొదటి రెండు పాదములను కవి కొంత స్వతంత్రించి కల్పనగావించెను. ఆ రెండు పాదములివి.

బలిముఖోద్ధూత కల్లోల సలిలమైన

వనధియుదరంబు తెఱపియై బయలు పడియె!

తరువాతి శ్లోకమున ఆకసమునందు ఎగురు కపి శార్దూలమును భుజగములు గరుత్మంతుని వలె భావించినట్లు కలదు. దీనిని గరుత్మంతుడనుచు సాగరచరంబులైన భుజంగములు వెఱ చరచిచ్చినట్లుసేల గఱచుకొనియె అని తెనిగించెను. ఇందలి తుది పాదము భావవిస్పష్టతకై కవి కల్పించిన అర్థవత్పదబంధనముదాయము. దశయోజన విస్తీర్ణము, త్రిశంత్ యోజనము నిడుపును గల వానరసైన్యము యొక్క నీడ వాయుపుత్రను గామినియై శ్వేతాభ్రఘనరాజీవమై మిగుల చారుతరమయ్యెను. దీనినే బలిజేపల్లి ఉడుపథమందు దాటు ప్లవగోత్తము నెమ్మెయినీడవారిధిన్‌బడి నిర్మల నీరద పంక్తి నా గడుంబెడగయి వెంటనే సాగుచున్నట్లు చెప్పబడినది. ఇచ్చట పదియోజనంబుల తనర్చునంతకు ముమ్మడించు పెట్టునిడుపు అను ప్రయోగములు మూలానుసరణములు. నిరాలంబమైన వాయుమార్గములో

మహాతేజుడు, మహాకాయుడు, మహాకపి, పక్షములుకలిగిన కొండవలె పయనించెనని మూలము. ఆ భావమునే బలిజేపల్లి -

అంబర తలంబునను నిరాలంబనీల
నప్రతీపప్రతాపప్రదీప్తమైన

విపుల తనువున తెక్కల కొండవోలె జనుచుండెనని అనువదించెను. ఇందలి మహాతేజ అనుటకు అప్రతీప ప్రతాప ప్రదీప్తమని శబ్దాలంకార మనోజ్ఞముగా ప్రయోగము పక్షవానివపర్వతః అనుటకు తెక్కల కొండవోలె అని తెనిగింపు సుందరముగానున్నది. 81వ శ్లోకము పాండు రారుణ వర్ణాని నీల మంజిష్ఠకానిచ కపినాకృష్యమాణాని మహాభ్రాణి చకాశిరే అనునది. దీనికి -

హనుమదాకృష్యమాణ మహాంబుదములు
శ్యామలారుణ పాండుర ధూమలంబు

లంబరంబున చిత్ర చిత్రంబుగ కనబడుచునుండె అని అనువాదము. మూలమున కల నీల మంజిష్ఠకాని అను విశేషణమును ఇతడు ప్రత్యేకించి ప్రయోగింపక పోయినను శ్యామలధూమల శబ్దములనుసమాసము నందుఆద్యంతములలో ప్రయోగించి మరికొంతవివరించుచు అంబరంబున చిత్రచిత్రంబుగ నేత్రోత్సవంబుగాగ కనంబడుచునుండెనని విస్తరించెను. మూలమున చకాశిరే అన్న క్రియకు ప్రకాశించినవి అని అర్థము. ఆ ఒక్క క్రియా పదమును అనువాదకర్త రెండుపాదములుగ పెంచి సుబోధమొనరించెను. మబ్బులలో ప్రవేశించి మరల మరలవెలువడు హనుమంతుడు ప్రచ్ఛన్నుడు, ప్రకాశకుడునగు చంద్రుని వలె కన్పట్టెనని ఎనుబది రెండవ శ్లోకము యొక్క భావము. దీనికి తఱుచు మబ్బులలో దూరి మఱుగుపడుచు వెలుపలికి దాటి మాటికి వెలుగుచుండె తరుచరలలాముడల కళాధాము కరణి అని తెనిగింపు. కాని ఇందు మింటి ఘంటాపథంబు గమించునపుడు అను మూడవ పాదమును మరికొంత విస్పష్టతకై ఆంధ్రీకర్త కల్పించెను. 83వ శ్లోకమున దేవగంధర్వ చారణులు పుష్పములను వర్షించునట్లు కలదు. దీనిని లక్ష్మీకాంతకవి మత్తేభవృత్తమున కొంత విస్తరించి వర్ణించెను. అటుపై 84 నుండి 86 వరకు గల శ్లోకములభావము సీసపద్యమున నిబంధింపబడినది. రామకార్యార్థ సిద్ధి కొరకు సూర్యుడు తపింపజేయలేదు. తతాపనహితం సూర్యః అనుదానికి ఖరకరుండును సుధాకరునిచందమున బీరుండయుం బాసి రేయెండగాసె అని అనువాదము. మూలమునలేని సుధాకరునిప్రసక్తి అనువాదమున విస్తరింపడినది. ఇట్లేవాయువు, ఋషులు, దేవగంధర్వులు, నాగులు, యక్ష, రాక్షసాదివివిధవర్గములవారు సంతసించి ప్రశంసించినట్లున్న భావము సీసమున నెంతో సుందరముగ అనూదితమైనది. ఇక్ష్వాకుకుల మానార్థి అయిన సాగరుడు హనుమంతుని విషయమున ఇట్లు తలచెను. అను భావము వచనమునందు ఇక్ష్వాకుకుల సత్కారార్థియగుసాగరుండును తనలో వితర్కించు కొనువాడై అని తెలుపబడెను. అటుపై రెండు శ్లోకముల భావము ఒకఉత్పలమున నిబంధితము. మూలమున నేనిప్పుడుహనుమంతునికి సహాయము చేయకున్నచో లోకులందరిదృష్టిలో నిందాపాత్రునగుదును. నేను ఇక్ష్వాకునాధుడైన సగరునిచే వివర్ధితుడను. ఇతడు ఇక్ష్వాకునచివుడు కావున ఇతనిని శ్రమపెట్టుట తగదుఅనుభావము తెలుపబడినది. ఈ కుమారి కోపినమెయిన్ తగుసాయము చేత నీతడిక్ష్వాకు లలామ రామ నృపచంద్రునకుం ప్రియదూతయేను నిక్ష్వాకులమేటిచే సగరువల్లభుచే, లోకైక శుభంకరుండితనికిచ్చు సపర్య జగద్ధితంబుగన్ అని ఉత్పలమాల యందు కూర్చబడినది. లోకైక శుభంకరుడు ఇతనికిచ్చు

సపర్య జగద్ధితము అను దానికి మూలము లేదు. మూలమున తన్నార్హత్యవసాదితమ్, అనునది 89వ శ్లోకము నందలి తుదిపాదము. దీనికి శ్రమించుటకు అతడు తగడు అనునదియే సరిఅయిన అనువాదము. కాని బలిజేపల్లి ఉత్పలమాల తుదిలో హనుమంతుని సర్వలోకములకు శుభము కూర్చువానిగా, ఆతనికి ఒసగు పరిచర్య లోకహితమైనదిగా, సముద్రుడు భావించునట్లు తెలుపుట ఎంతో అర్థవంతముగా ఔచిత్యవంతముగా ఆభ్యాగత సేవ వలన కలుగు లోకహితమును సూచించుచున్నది. నాయందు ఇతడు కొంత విశ్రమించి సుఖియై దాటి పోగడలను తలంపుతో తనలో దాగిన హిరణ్యనాభుడు గిరిసత్తముడగు మైనాకుని పిలిచెను. ఇందలి రెండు శ్లోకముల భావమును కూడ రెండు ఉత్పలమాలా వృత్తములలో బలిజేపల్లి విస్తరించి వర్ణించెను. ఇచ్చట కూడ 68 వ పద్యము యొక్క అంతములో మైనాకుని ఉద్దేశించి ఓ అనుంగా! కలదొక్క కార్యము జగద్ధితమే యొనరింపగాదగున్ అని పల్కినట్లు కొంత విస్తరించెను. 92 నుండి 95 వరకుగల శ్లోకముల భావము సీసమున పేర్కొనబడినది. 95 వ శ్లోకము నందలి భావము సీసమునకు గల అనుబంధమగు గీతమున వివరింపబడినది. రామకార్యార్థి భీమకర్ముడు, వీర్య వంతుడు, కపి శార్దూలము అగు హనుమంతుడీతడె. ఇందు త్వాం ఉపర్యేతి అను వాక్యమునకు నీపైన నల్లదే ఉప్పరమున నేచి చనుదెంచుచున్నాడు. అని విపులీకరణ. సముద్రుడు మైనాకుని హనుమంతుని విశ్రామార్థమై పైకి లేచి రమ్మని అడిగిన ఘట్టము 92 నుండి 100 వ శ్లోకము వరకు గలదు. దీనిని బలిజేపల్లి 68 నుండి 73 వరకుగల పద్యములలో అనువదించెను. ఇందు మనకే గాదు జగత్త్రయంబునకు మాన్యుడు అనుపాదము స్వీయ కల్పితము. శేషంగమిష్యతి అను వాక్యమునకు ఇమ్మ హితుండు మార్గశేషంబు ధరింపుగాక అనియు కాకుత్స్యస్యానృశంస్యం మైథిల్యాశ వివాసనం, శ్రమంచ ప్లవగేంద్రస్య సమీక్ష్యోత్థాతుమర్హసి అనునూరవ శ్లోకము 73 వ పద్యమున రామచంద్రునలంతయు జానకీప్రవాసంబును నీ కపీంద్రుని ప్రచండపరిశ్రమమించి లెమ్మికన్ అని అనువదించెను. కానీ ఈ పద్యము యొక్క ఆరంభమున కాంచన మణీ రమణీయములైన నీ శిఖాగ్రమ్ముల సేద దీర్పుము అని ఉన్నది. 104 వ శ్లోకమున శాతకుంభమయైః శృంగైః అనుపాదమునకు ఇది అనుసరణము. మూలమున మైనాకుని ఉద్దేశించి హిరణ్య గర్భః చామీకర మహానాగ, దేవ గంధర్వ సేవిత వంటి విశేషణములు సంబోధనలు గలవు. ఇవి తెనిగింపున లేవు. మైనాకుడు సాగర జలమును భేదించిన మహాద్రుమలతావృతుడు, దీప్తరశ్మి దివాకరుడునై వెంటనే వెలువడెను. ఈ విషయము మరి కొంత విస్తృతముగ 101 వ శ్లోకము నుండి 106 వ శ్లోకము వరకు వివరింపబడినది. ఈ శ్లోకముల యొక్క భావము 74, 75 మత్తేభ వృత్తములలో అనూదితము. 73 వ పద్యమున కాంచన మణీ రమణీయములైన నీ శిఖాగ్రమ్ముల సేద దీర్పుమని పూర్వాపర సందర్భ సమన్వయ స్ఫూర్తితో ప్రయోగించినను మైనాకుడు పైకి వెలువడి వచ్చు సందర్భమున మరల సువర్ణమయ శృంగ శ్రేణితో వెలువడినట్లు అనూదితమైనది. 105 వ శ్లోకమునందు తస్య జాంబూనదైః శృంగైః అని మరల పేర్కొనబడినది. దానికి అనుగుణముగనే అనువాదకర్తయు 75 వ పద్యములో బంగారు గొప్పరముల్ అని తెనిగించెను. తరువాత రెండు శ్లోకములు 76 వ పద్యమున అనూదితము. మైనాకుడు తనకు మార్గమధ్యమున విఘ్నము కలిగించుటకై వచ్చిన వాడుగ భావించి శరీరము పెంచి, మేఘమును వాయుదేవుడు తాకినట్లుగ మైనాకుని తన రొమ్ముతో పడవేసెను. హనుమంతుడు కుమ్మిన కుమ్మునకు సుడి తిరిగిన మైనాకుడు తెప్పరిల్లి ఆతని వేగమునకు సంతోషించుచు మానవరూపమును ధరించి అతనికి సంప్రీతిగా పలికిన పలుకులు 111 వ శ్లోకము నుండి 129 వ శ్లోకము వరకు ఉండగా అనువాదమున 79 నుండి 86 వ పద్యము వరకు వివరింపబడినవి. అనువాదకర్త

ఇచ్చట ఇరువది పాదముల ద్విపదను సంభాషణారంభమున ప్రయోగించెను. అటుపై ఉత్పలమాల, సీసము, గీత పద్యము, చంపకమాల, కందము, మత్తేభము గీత పద్యము కూర్చబడినవి. మూలమున వాయుదేవుని ప్రసక్తి త్వంహిదేవ వరిష్ఠస్య మరుతస్య మహాత్మనః పుత్రస్తస్యైవ వేగేన సదృశః కపికుంజర పూజితే త్వయి ధర్మజ్ఞే పూజాం ప్రాప్నోతి మారుతః తస్మాత్ త్వం పూజనీయోమే అని ఉన్నది. దీనిని బలిజేపల్లి మరికొంత విస్తరించెను. మూలమునవేగము అని మాత్రమె ఉండగా బలవేగ విక్రమ ప్రాగల్భ్యమున తండ్రి నాకు పరమోపకారకుండు అని వివరించెను. శృణు చాప్యత్ర కారణం అనుదానికి పాత్రముగ మన సంబంధ బాంధవంబునేటిదో మూలమింత విప్పింతు వినుము అని వవరణ. మైనాకుడు పూర్వవృత్తాంతమును తెలుపుచు బలారి తెక్కల దునుమాడ కులిశమెత్తినపుడు గరువలియే తన్ను సాగరమున పడ జిమ్మి తెక్కకువదక్కించెననియు, నగారి బారి బడకుండ కాచి రక్షించిన అనిలుడు ఎంతయు మిత్రుడగుటచే అమ్మేటి పుత్రుడవైన నీకు కడు గూర్చి ధన్యత గావింతునని తెలిపెను. ఈవిషయము మూలమున 121 నుండి 128 వ శ్లోకము వరకు గలదు. శ్రమం మోక్షాయ పూజాంచ్చ గృహాణ ప్రీతోస్మి తవ దర్శనాత్ అని 129 వ శ్లోకము. అస్మదీయాతిథేయంబునాదరించి బడలికం బాసి చనుము అని శ్లోకమునకు అనువాదము. నీదర్శనము చేత ప్రీతుడను. పూజను గ్రహింపుము అను వాక్యములకు అంతకుముందు పద్యమునసే నిన్నుగనుగొంటిన్ ధన్యతంగంటి మన్ననా విందు పరిగ్రహించి చనుమన్న అని అనువాదము కలదు. పూజకు బదులు విందును పరిగ్రహించి చనుమని అభ్యర్థన. ప్రాస స్థానమున అన్నా అను సంబోధనాంతము, అనంతర పద్య పూరణములో కొంతవిశ్రాంతియై అని ప్రయోగించుట ఎంతో ఆప్యాయతను, ఆత్మీయతను ధ్వనింపజేయుచున్నవి. హనుమంతుడు మైనాకుని వీడుకొను సందర్భమున రెండు శ్లోకములు గలవు. అందు ప్రీతోస్మి కృత మాతిథ్యం మన్యురేషోపనీయతాం త్వరతే కాలకాలోమే అహశ్చాప్యతి వర్తతే అని ఉన్నది. ఈ సందర్భమున బలిజేపల్లి అలతి అలతి వాక్యములతో నీ కనిన కూర్మిసాలదే, విందులేల, పెందలకడ పోవలెన్, విరసనంబనియెంచకు, ప్రొద్దువోయె అని ఎంతో ముక్త సరిగ, సుందరతరముగా అప్పటి ప్రయాణత్వరకు అనుగుణముగు పద్ధతిలో సహజముగా మాటాడుకొనుధోరణిలో తెలిపెను. హనుమంతుడు మైనాకుని విడి పోవుటకు ముందు ప్రతిజ్ఞాచమయా దత్తా నస్థా తవ్య మిహాంతరమ్ అని తెలిపెను. దీనికి మెలగి ప్రతిజ్ఞ సేసితి క్షమింపుము, పంపుము పోయివచ్చెదన్ అని అనువాదము. కాని ఇచ్చట బలిజేపల్లి మూలమును మరి కొంత విస్తరించి మరి యొక గీత పద్యమును గూడ రచించెను. ఆపద్యము యొక్క తుదిలో ఇపుడు నిలుచుట గాదు పోనిమ్ము నన్ను అని తెలిపెను. నేను మరల తిరిగి వచ్చినపుడు గారవింతువులే, అను భావము మూలమును లేదు. ఇతడీ భావమునే మరికొన్ని సందర్భములతో జోడింపుచు ప్రతిన వెంబడి వడి సముద్రము దరించి, లంక గాలించి, రాము విల్లాలి గాంచి, ప్రీతి నేతెంచు తరి అని వివరించెను. లక్ష్మీకాంత కవి మూల విధేయముగనె తెనిగించుటకు ప్రతిజ్ఞ సల్పినను సందర్భములను బట్టి అచ్చటచ్చట కొంత స్వతంత్ర ప్రతిపత్తితో రచనా కౌశలమును ప్రతిభావంతముగా ప్రదర్శించిరి. ఇది వారి సహజ ప్రవృత్తి. ఏతత్ప్రవృత్తి ఈ అనువాదములో అచ్చటచ్చట పాఠకులకు ప్రత్యక్షీభూతము. కేవలము మూలమున ఉన్నది ఉన్నట్లు రచించినచో ఆయా భావముల స్వరూపస్వభావములకు అది అంతగా అనుకూలించక పోవచ్చును. మూలమునందలి ముఖ్యవిషయమునకు ప్రతిబంధకము లేకుండ సహజ సుందరముగా స్వతంత్ర రచన వలెకొనసాగించుటయు సహృదయుడు, రసహృదయుడునగు ననువాదకర్త యొక్క కర్తవ్యము. అట్టి పద్ధతిని బలిజేపల్లి అనుసరించిరి.

# సురసను జయించుట

మైనాకుని వీడి హనుమంతుడు మింటి మూర్గమున గమించెను. అపుడు హరిపుంగవుడైన హనుమంతుడు చేతితో శైలమును నగుచుస్పృశించెను. దీనికి మూలము పాణినా శైలమాలంభ్య..... ప్రహసన్నివ అని ఉన్నది. ఇచ్చట బలిజేపల్లి అనికేలూది హిమాచలేంద్రసుతుసెయ్యింబార లాలించి నట్లు పద్యమును ప్రారంభించెను. అనంతరము పర్వత సముద్రము దాచిన మూపులు మూలమున బహుమానాత్ అపేక్షితః అవికలదు. బలిజేపల్లి దీనిని ప్రియంబున జేయించు సుదూరమబ్బురపు దీపుంజాపులన్ జాలువార్చినరీతి గనుచుండ అని ఎంతో మనోహరముగాస్వచ్ఛమైన ప్రీతిని అచ్చ తెలుగు పలుకులలో తేనెలు జాలువారు నుడికారపు సొంపులతో విలక్షణముగా, సౌందర్యము గుభాళించునట్లు తెల్పెను. 135 వ శ్లోకములో హనుమంతుడు ఎంతో దూరము పోవుచూ వెనుతిరిగి మైనాకుని చూచిన సరణి భూయశ్చోర్ధ్వం గతింప్రాప్యగిరిం తమవలోకయన్ అని ఉన్నది. అనువాదకర్త వెనుదిరిగి తిరిగి మైనాకుని చూచుచు నంతకంతకును మబ్బులలో వెనుదవ్వొసనియెవడి అని తెనిగించెను. మూలమునకేవలము అతడు ఊర్ధ్వగతిని పొంది గిరిని చూచుచు అని మాత్రమే ఉన్నది. అనువాదములో తెలుగుదనపు సొబగులు వెల్లి విరియునట్లు ఎంతో తేట తెల్లముగా సవిస్తర ధోరణిలో వివరింపబడినది. ఒక్క సంస్కృతసమమైన పదమును కూడ ప్రయోగింపక కేవలము అచ్చతెలుగుపదములతో దేశీయచ్ఛందమగు కందములో అంద చందములు తొణికి సలాడునట్లు సన్నివేశరమణీయకమును మనకన్నులలో నడయాడునట్లు మూలమునలేనిదీప్తిని అనువాదమున కల్పించెను. ఇట్టి అనువాద కౌశలము ప్రత్యక్షరమున ప్రత్యక్షమగుచుండుట వీరిరచనలోని ఒక విశిష్టత. అనంతర ఘట్టమున దేవేంద్రుడు సాగరుని కృతజ్ఞతను మైనాకుని సఖ్య పరత్వమును నుతించెను. అంతేగాక మైనాకునితో నీకునేను అభయమిచ్చితిని. నవజ్రభయమునీకుఇక లేదు. నీతోచుట్టరికమునర్తునని పలికెను. దీనికిమూలమున అభయంతే ప్రయచ్ఛామి గచ్ఛసౌమ్యయథాసుఖమ్ అని ఉన్నది. హనుమంతుడు సముద్రమును దాటగనే సురసకల్పించెను. ఆమెను గూర్చి సూర్య ప్రభాభావిభాసుర సారన్ అని మత్తేభవృత్తమునకు తగిన గాంభీర్య సరణిలో సమాసగతరచనకు ప్రాముఖ్య మొసగెను. దేవతలు పురికొల్పగా ఆమె వికృతము విరూపము, భయావహము అగు ఆకృతిలో హనుమంతుని ఆవరించినది. ఆమె గంభీరాకృతిని తలపించుటకు అనుగుణమగు పద్ధతిలో రకార ప్రాసఃవృన్యముకల సమాసము భీకరవికారాకారఘోరాసురీతమురేఖన్ అని కూర్చబడినది. మూలమున విడివిడిగా ఉన్న ప్రయోగములిచ్చట సమాసగత గాంభీర్యమును పుణికిపుచ్చుకున్నవి. సురస, హనుమంతుని అడ్డగించి అహంత్వాం భ క్షిష్యామి..... ప్రమే మావసం అని పలికినది. ఆ భావము కేవలము ఎటంబోయెదువిన్నుమ్రింగెద రమ్ము చొరుము మదీయవదనగహ్వరము నందు అని రెండు పద్యములలో(100,101 పద్యములలో) అనువదింపబడినది. అపుడామెతో హనుమంతుడు తాను విచ్చేసినకార్యమును నవ్వు మొగముతో విన్నవించెను. అవనిజ గాంచి వచ్చిన అనంతరము నీదువదనమున ప్రవేశింతునని తెలుపుసందర్భమున (155వ శ్లోకము) అథవా మైథిలీం దృష్ట్వా రామం చాక్లిష్టకారిణమ్ ఆగమిష్యామితే వక్త్రం సత్యం ప్రతి శృణోమితే అను శ్లోకము (155) న్నది. దీనికి 104వ పద్యము అవనిజ గాంచి ఆ ముత్తెమంతమాట తేవి కెటిగించి క్రమ్మఱవే వత్తు నీదు వదనంబున చొత్తు నిక్కమింతనమ్ము అనునది అనువాదము. మూలమున ముత్తెమంత మాట తనకెఱిగించుటకుబదులుగా రామం చాక్లిష్ట కారణం అని ఉన్నది. ఇందలి ముత్తెమంత మాట కవి స్వ కపోల కల్పితము. 151,158 శ్లోకములలో వరమేషాపురాదత్తోమమధ్రాతేవిపత్త్వరా అని యున్నది. మూలమునగల ఈ ఒకేవాక్యము అనువాదమున నాక్షాృవడి నెక్కటి వరమొసగె ధాతయే అనియు విరించి వరము చరితార్థమయ్యోగా అను 110వ పద్యము నందు అనువదింప

బడినది. ఇరువురు పంతు పరుసలతో మిగుల విజృంభించిన అనంతరము హనుమంతుడు ఉన్నట్టుండి బొట్టనవ్రేలంతయై సురసనోటిలో దూరెను. దీనికి మూలము తస్మిన్ ముహూర్తే హనుమాన్ బభూవాంగుష్ఠమాత్రకః అని కలదు. ఈ భావము 109వ పద్యమున కపి యొక్కింతయు జేరికింగొనక ప్రజ్ఞాధీరుడా దిట్టబొట్టనవ్రేలంత అలంతియై సురసనోటన్దూరి అని ఉన్నది. అటుపై 169 శ్లోకములో ప్రవిష్టోస్మి తేవక్త్రమ్ దాక్షాయణి నమోస్తుతే గమిష్యే యత్రవైదేహీ సత్యశ్చాసీద్వచస్తవ. దీనికి 110వ పద్యము అనువాదము చెప్పినటు నోటజొచ్చి వచ్చితి ధరణిసుతయున్న చక్కటికరుగ వలయు,సరగ దాక్షాయణీ నమస్కారము అని అనువాదము. 170వ శ్లోకములో తం దృష్ట్వావదనాన్ ముక్తన్ చంద్రంరాహు ముఖాదివ అబ్రవీత్ సురసాదేవి స్వేన రూపేణ వానరమ్ అని కలదు. ఇది 111వ పద్యమున రాహుముఖముక్తుడైన రేరాజు వోలె అని అనూదితము. దేవీస్వేనరూపేణ అను దానికి నైజరూపంబూని అని ఆంధ్రీకరణము. కాని మూడవ పాదమున తేజరిల్లుచున్న వాయుతనూజు గాంచి అనువాక్యమున మూలమునకు తేజరిల్లు పదము ఎంతో అర్థవంతము. గ్రహణము వీడిన చంద్రుడు, మిగుల ప్రకాశించును. ఆ భావమే ఈ ప్రయోగమున అభివ్యక్తము. తరువాతి శ్లోకము అర్థసిద్ధ్యై...సమాన యచ వైదేహీం రాఘవేణ మహాత్మనా అనునది దీనికి తరుచ రోత్తమ పొమ్ము యధాసుఖముగ కార్య సంసిద్ధి అయ్యెడుగాత మింక నవనిసుత నొప్పగించి మహాను భావురామునారార్చి అని అనువాదము. ఇందు యధాసుఖము యథాతథముగా అనువదింపబడినది. యధాసిద్ధికి బదులు కార్య సంసిద్ధి అని ప్రయుక్తము. మహాత్ముడైన రాఘవునితో వైదేహిని కలుపుము అని వివరణ. ఇచ్చట ఆరార్చికి మూలములేదు. పైగా పద్యాంతమున చిరయశోగామి వనయ నిదీవించుట కవి స్వీయముగా కల్పించినది. తరువాత రెండు శ్లోకములు ఒక మత్తేభమున పరివర్తింపబడినవి. ఇందు మూలమున తత్తృతీయం కర్మదుష్కరం సాధుసాధితి అని కలదు. దీనికి తృతీయంబైన ఖమ్మెట దుష్కర కార్యమునకు క్రందువ సాధు వాక్కులవేమఋన్ ప్రస్తుతించిరి. అనిఅనువాదము. సాగరంబాధృష్యం వేగేనగరుడోపమః అనునది దుస్తారపయోధి వైనతేయుండనన్ అని ఆంధ్రీకరణము. 174నుండి180వరకుగల శ్లోకములు రెండుసీసములలో అనూదితము. 180వ శ్లోకమున గరుడానివమారుతిః అని కలదు. దీనిసే వైనతేయుండనన్ అని అనువదించెను.

**సింహికా సంహారము**: 116వ పద్యమునందును తార్క్ష్యుండన నంబరంబున నిరాలంబంబు నందాటుచున్ అని ఉన్నది. 181,182శ్లోకములకు అనువాదము లేదు పక్షయుక్త వివాద్రిరాట్ అను ప్రయోగమునకు సపక్షమ్మధరాభీలలీలన్ అని ఆంధ్రీకరణము. 185వ శ్లోకము అద్యదీర్ఘస్యకాలస్య భవిష్యామ్యహమాసితా అనుటకు కడుపునిండక యెంతేవికాలమయ్యె అనితెనిగింపు సంగూకృత పరాక్రమః ప్రతిలోమేన వాతేన మహానౌరివ సాగరే అను 187వ శ్లోకమును ఎదురుగాగాలికి మున్నీట నీడిగిలగబడిన పేరోడగతి కుంటుబడియె వడక అని అచ్చతెలుగుపదములో సహజ సుందరముగా సుబోధముగా కవి తెనిగించెను. 190వ శ్లోకమున కవి రాజ్ఞాయదాఖ్యాతం సత్త్వమద్భుత దర్శనచ్ఛాయాగ్రాహిమహావీర్యంతదిదం నాత్ర సంశయః అను శ్లోక భావమును సుగ్రీవప్రభువన్న యబ్రపుగరాసుంగబ్బిరాకాసి ఛాయాగ్రాహంబిదియే ధ్రువంబు అని అనువదించెను. అద్భుత దర్శనం అనుదానికి అబ్రపుగరాసుంగబ్బిరాకాసిఅని తెనిగింపు. అత్లేతదిదం నాత్ర సంశయః అనుటకు ఇదియే ధ్రువంబు అని ఆంధ్రీకరణము. 191వశ్లోకము భావమును కూడ 121వ పద్య మగు శార్దూల విక్రీడితమునందే అనువదించెను. సింహిక యొక్క గంభీరాకారమునకు అనుకూలముగా శార్దూల విక్రీడితము ప్రయుక్తము. ఇందలి గ్రకార ప్రాసమునందును అనువాదకుడు కొంత వైలక్షణ్యమును ప్రదర్శించెను. ప్రావృషీత్యవలాహకః అనుదానికి ప్రావృట్ పయోముగ్రేఖన్ అనిఅనువాదము మతిమాన్ కపిః అనుదానికి బుద్ధిమత్ప్రాగ్రియుండు అని గ్రకారము వచ్చునట్లు కూర్చెను. సులభ గ్రాహ్యమైన మూలపదములను ప్రౌఢములైన పదబంధములుగ

సందర్భమునుబట్టి సంధించుట మహాకవులకు పరిపాటి. ఎంత క్లిష్టతరమైన విషయమునైనను సులువుగ, సర్వజనసుబోధముగ, సహజసుందరముగ, రసస్ఫోరకముగ, హృదయావర్జకముగ మామూలుమాటలలో సౌందర్యముట్టి పడునట్లు చెప్పగల మహాకవి బలిజేపల్లి అచ్చటచ్చట ప్రౌఢప్రయోగములను స్వతంత్రించి ప్రయోగించి ఉన్నాడు. వక్త్రంప్రసారయామాస పాతాళాంబ రసన్నిభమ్ ఘనరాజీవగర్జంతి అను మూలవాక్యమును శార్దూల విక్రీడితమందు నిబంధించినమాస గతమైన గాంభీర్యము నప్పటి సందర్భమును ప్రతిఫలింపచేయునట్లు పాతాళాంతర సోదరోదర దరీవక్త్రంబు జీమూతమాలా తీవ్రంబుగ మార్చుచున్ దెఱచి అని అనువదించెను. మూలమున పాతాళాంబరము అని ఉన్నది. అనగా పాతాళము మరియు ఆకాశము యొక్క మధ్యభాగము నకు సమానముగా నోరు తెరచెనని అర్థము. ఘనరాజీవ అనుటకు జీమూతమాలా అని గర్జంతి అనుటకు తీవ్రంబుగ నార్చుచున్ అని అనువాదము వక్త్ర ప్రసారయామాస అన్నప్రయోగమునకు తెఱచిఅను అచ్చ తెలుగు అసమాపక క్రియా పదము తరువాతి విషయమునకు అనుబంధముగా ప్రయుక్తమైనది. 192వ శ్లోకమున సింహికను వికృతము సుమహాన్ముఖముమ చూచెను. అంతేగాక మేధావి అయిన ఆ మహాకవి దాని మర్మములను గూడ గ్రహించెనను ఈ శ్లోకభావము ను ప్రజ్ఞాతంత్రుడు తదయతీక్ష్ణముఖాంతర్మాళ జీవానిలస్రోతోమర్మమెఱింగి అని అర్థవత్ సమాస బంధురముగా అను వదించెను. మేధావి శబ్దమునకు ప్రజ్ఞా తంత్రుడు అని ఆంధ్రీకరణము. ఇంత తకారము ప్రాసస్థానము వచ్చునట్లు కూర్చబడినది. జీవానిల స్రోతోమర్మము అననది కల్పనాత్మకము అర్థసహితము. ఇది ప్రాబంధిక ప్రౌఢశైలీపరిపక్వతను రచనాసౌందర్యమును తెలుపుచున్నది. సింహికను హనుమంతుడు చీల్చి చెండాడిన ఘట్టము మత్తేభవృత్తమున కలదు నఖైః తీక్ష్ణైః మర్మాణ్యుత్కృత్య అనుదానికి కరుచున్నఖరప్రఘాతముగా వీకన్ దాని మర్మంబు లూపిరి నాళంబుల ద్రెంచి అని అనువాదము. తీక్ష్ణములైనవఖములతోమర్మములనుపెకలించి అని మూలము నకు అర్థము అనువాదమున హనుమంతుని మహోత్సాహమునకు అనుగుణముగా అతని రౌద్రము రకార పౌనఃపున్యమునందు మహాప్రాణాక్షరములందు చక్కగా ప్రతిఫలించినది. ఊపిరి శబ్దమును మధ్యలో త్రుంచి రెండవ పాదమున ప్రాసస్థానమున రి వచ్చునట్లు కూర్చిన పద్ధతి పేర్చిన అతని ఉద్ధతిని తలపించుచున్నది. ఎట్లు త్రెంచెనో ఛందశ్శిల్పజ్ఞుడైన బలిజేపల్లి రచనానైపుణ్యముతో ప్రదర్శించెను. దానినోరు విరలింపబడినట్లు ఉండగా నిర్భరదోర్వీర్యధృత ప్రతాప జవసత్వ ప్రౌఢిరూఢముగ విన్ వీధికి మారుతి దాటెనని అప్పటి అతని రౌద్రస్ఫూర్తికి తగినట్లు ఓజోగుణ భూయిష్ఠమునకు రచనాపాటవమును బలిజేపల్లి ప్రదర్శించెను. 126వ మత్తేభవృత్తమును రకారప్రాసతోమొదలిడి ఆ రకారము మాటిమాటికివచ్చునట్లు హనుమంతుని కోపాగ్నికి సూచకముగా వర్ణించెను. మూలమున కన్న ఈ ఘట్టము కొంత వ్యాఖ్యాన ప్రాయముగా, పాండిత్య స్ఫోరకముగా అనూదితమైనది. సింహికను సంహరింపగనే దేవతలు హనుమంతుని మిగుల వినుతించిరి. 200, 201 శ్లోకములలో హనుమత్ప్రశంస కలదు. ఇది128వ పద్యమున అనువదింపబడినది. మూలమున భీమాద్యకృతంకర్మ అనుటకు అనవద్యం బతి భీషణంబిది అనియు ధృతిర్దృష్టిర్మతిర్దాక్ష్యం అనునది ధైర్యము సూక్ష్మబుద్ధి మతి యున్ ప్రావీణ్యమున్ అనియు అనూదితము ఈ పై చెప్పిన నాల్గుగుణములను ఏతాని చత్వారి అని మూలమున తెలుపబడినది. అది అనవసరమగుటచే తెనిగింపలేదు. 203 నుండి 213 వరకుగల శ్లోకములలో హనుమంతుడు సాగర తీరమున మలయప్రాంతోరుకాంతారములో అరసి ఉల్లాసియై ఎంతో ఉన్నతమైన అతని దేహమును కుంచించి వామనమూర్తివలె రూపమునుధరించి లంకను గాంచి తనివి చెందిన వృత్తాంతము 129 నుండి 134 పద్యముల వరకు అనూదితమైనది. ఇట్లు సుందర కాండము నందలి ప్రథమ సర్గమున కల 213 శ్లోకములు 134 పద్య గద్యములలో పరివర్తింపబడినది.

## రెండవ సర్గము - సముద్రోల్లంఘనము - లంకాదర్శనము

మూలమున ద్వితీయసర్గ 58 శ్లోకములలోనున్నది. అనువాదకర్త బలిజేపల్లి 135 నుండి 170వరకుగల పద్య గద్యములలో ఈ ద్వితీయ సర్గను అనువదించెను. ఇందు రెండు వచనములు కలవు. తక్కిన దంతయు పద్యమయమే. నూరామడల సముద్రమును సునాయాసముగ గ్లాని లేకుండ దాటిన హనుమంతుడు లంబ పర్వతమును గాంచెను. అచ్చట గల రకరకముల చెట్లను వాని వాని వాసనలను అందలి వివిధ పక్షుల నినాదములను కని విని ముందుకు పయనించెను. లంకాపుర సౌందర్యమును చూచి తలయూచి ఇది పూర్వము కుబేరుని కాపురము నేటికి గాలికైన మెలగ వీలు గాదు. ఈ గంభీర పయోధియే దీనికి పెట్టని కందకము ప్రాకారము అంబుధి వస్త్రముగా, ఉన్నతటాలకము అవతంసకముగా, శతఘ్ని శ్రేణి వేణిగా ఆవిశ్వకర్మ దీనిని కమనీయాకృతి గలకాంతవలె తీర్చిదిద్దెను. అని వివిధ విధముల లంకా సౌందర్యమును భావించెను. స్త్రీతో పోల్చబడిన లంకాపురవర్ణన 21వశ్లోకమున వప్రప్రాకారజఘనాం విపులాంబు వనాంబరామ్ శతఘ్నీ శూలకేశాంతం అట్టాలకావతంసకాం మనసేవ కృతాం లంకాంనిర్మితాం విశ్వకర్మణా అని కలదు. ఇందుతుదిపాదము 148 వ పద్యములో మనసుతోనే తీర్చినో నాత్రిలోకాకల్పంబై విశ్వకర్మ రచితంబై మించు లంకాపురిన్ అని అనువదింపబడినది. రావణ పాలితమై దుర్గమము అగు లంకను సుమహాబాహుః కింకరిష్యతి రాఘవః అను 28వ శ్లోకమున తెలుపబడినది. ఆరఘునాథుడైనను మహోగ్రహనంబగు నిట్టి లంకకున్ జేరుట కల్గినేనియును జేసెడి దేమి అని ఉత్పలమాలావృత్తమున అనువదింపబడినది. తరువాతి పద్యభాగమున దశాస్యుదాబల శ్రీ రుచిరత్వశాలి అవిజేయుడు రుద్రునకైన వీరకంఠీరవుడైన రాముని కడిందియు నిందుల సందియంబగున్ అని వివరింపబడినది. ఇచ్చట కవి బలిజేపల్లి అంతకు ముందు చెప్పిన భావమునే మరికొంత విపులీకరించు ఉద్దేశముతో కొంత స్వతంత్రించి, పెంచి వ్రాసెను. 32వ శ్లోకమున వైదేహిని ముందుగా గాంచి అటుపై ఆలోచింతును అను భావము తెలుపబడినది. యావత్ జ్ఞానామివైదేహిం యదివావతి వాన వాతత్రైవ చింతయిష్యామి దృష్ట్వాతాం జనకాత్మజాం అను శ్లోకము అమరేశ్వరుదేవి ప్రాణానున్న కందువ నెఱింగి, యామెకు గానిపించి అని అనువదింపబడినది. ఇందు ప్రాణానునున్నకందువ అను ప్రయోగము మిగులనర్థవంతము కందువ అన్న తెలుగుపదము ఆ భావమునకంతటికీ ప్రాణప్రతిష్ఠాకరము. 34వ శ్లోకమున వంచనీయమయాసర్వే జానకీం పరిమార్గతా అని కలదు, దీనికి 157 వ పద్యమున రాము దేవేరిని రోయుచు నమరవీరుల నందఱనే మరింపనౌనేరిమి రూపమూని అని అనువాదము. వంచనీయ అన్న పదమునకు అందరినేమరింప అను అచ్చతెనుగు పదమును ఎంతో ఔచిత్యవంతముగా బలిజేపల్లి ఇచ్చటప్రయోగించెను. 158వ పద్యమున మాపటివేళ నగరమున జొచ్చి జనక తనూజాన్వేషణమున వేగనులూనియత్నమును సాధింతును అనుదానికి రాత్రౌలంకాపురీ ప్రవేష్టుంమే శక్యం సాధయితుం మహత్ అనునది మూలము. తెనుగునందు వేగనులూని యత్నమును సాధింతున్ అని చెప్పుట తెనుగు నుడికారపు సొంపునునింపుట యే రావణిష్య పురీం రాత్రౌ ప్రవేశ సుదురా పదాంప్రవిశ్యభవనం సర్వంద్రక్ష్యామి జనకాత్మజాం అను 47 శ్లోకము యొక్క భావము 165 వపద్యమగు ఉత్పలమున తెలుపబడినది. ఏకడనైన నెవ్వరికి నే కనరాకమొఱింగి అని ప్రస్తుత పద్యారంభము కాని దీనికి మూలము కానరాదు. అటుపై పద్యమున రేయినా ఆకృతి సంగ్రహించి వెరవార దురాసదమైన యిప్పురిన్ గైకొని పొచ్చి అని కలదు. ఇది శ్లోకమున మొదటి పాదమునకు అనువాదము. ఇచ్చట ఆకృతి సంగ్రహించి అనుమాటకు స్వేనరూపేణరజన్యాంప్రాప్య తాంగతాః అను పూర్వశ్లోక

భావము ఆధారము. భవనమున ప్రవేశించిజనకాత్మజనుచూడగలను. అని మాత్రమే మూలము. కాని దీనికి వ్యాఖ్యాన ప్రాయంపముగా అనువాదమున ఎల్ల సదనంబుల వెకువతోడరోసెరెపేకనుగొందుగాకల మహీసుతను. అని వివరింపబడినది. ప్రస్తుత పద్యాంతము అంచు వినిశ్చితాత్ముడై అనునది. ఇది మూలమున 48వ శ్లోకమునకు అనుబంధము. అచట ఇతి నిశ్చిత్యహనుమాన్ అని ఉన్నది. వృషదంశుక మాత్రః ప్రదోషకాలే హనుమాన్ తూర్ణముత్ప్లుత్య దేహం సంక్షిప్య వంటి ప్రయోగములు మునిమోపునవృషదంశుకతను ప్రమాణముమేను దగ్గించి మరుత్తనయుడు లంకా నగరంబున కెగసి అను కందమున అనువదింపబడెను. 51 వశ్లోకమునుండి 55వ శ్లోకము వరకు గల భావము వచనమున (168) వివరింపబడినది. రాముని రాయబారితో చదువుల జ్యోతి చెలిమి సల్పుటకు వచ్చెనేమో యనగ చంద్రోదయమైనది. ఈ భావము 57 వశ్లోకమున కలదు. 58వ శ్లోకమున తుట్టతుది రెండు పాదములలో దదర్శచంద్రం సకపి ప్రవీరః పోప్లూయమానం సరసీవ హంసం అను వాక్యము ఉపమాలంకారమనోజ్ఞము. తటాకమున ఈదులాడుమరాళమువలె మింటి పొంత గమించు సుధాకరుని మారుతి చూచెనని దీని భావము. ఉత్పలమాలవృత్తమున ఈ భావము అనువదింపబడినది. ఇది చంద్రుని ప్రసక్తి అగుటచే ఉత్పలమును గ్రహించుట ఎంతో ఔచిత్యవంతము.

## తృతీయ సర్గము - లంకానగర వర్ణన

సుందరకాండమునందలి తృతీయ సర్గము 171 వపద్యమునుండి 193 వపద్యము వరకు అనువదింపబడినది. ఇందు లంకానగరవర్ణన కలదు. హనుమంతుడు లంకానగర సౌందర్యమునకు అబ్బుర పాటుచెంది మీది కార్యమును తలంచెను. 24వ శ్లోకమున లంకిణి కపివీరునకు అడ్డము వచ్చి నిలునిలు మెందుబోయెదవురావణోగ్ర భటవారదురాసదమైన లంక చేరంగా నీకు అలవియే అని పలికినది. ఈ భావము నశక్యం ఖల్వియం లంకాప్రవేష్టుంవానరత్వయారక్షితా రావణ బలైః అభిడక్ష్యాసవంతతః (24) అను శ్లోకమునగలదు. అపుడు హనుమంతుడు ఆమెకు ఎదురుగా నిలిచి నీవెవతవు. ఈ పురద్వారమున ఏలఉన్నావని పలికెను. కాత్వం విరూపనయనా పురద్వారేవ తిష్ఠసే కిమర్థం చాపిమాం క్రోధాత్ నిర్భర్త్సయసి ధారుణీ అన్నది 181 వ పద్యములో ఈ బెదిరింపులేటికోట వికృతాస్య! నీవెవతవో యొకయింతవచింపుము అని అనూదితము ఇందలి విరూపనయనకు వికృతాస్య అని అనువాదము క్రోధముతో దేనికొరకు నన్ను బెదిరింతువు అను అర్థము గల మూలవాక్యమునకు ఈ బెదిరింపు లేటికి అని అనువాదము. కాని ఈ పద్యముననే పంతపుగంత లేటికిన్ అని ఉన్నది. దీనికి మూలము లేదు. 25వ శ్లోకమున కథయిష్యామితత్ తత్త్వం యన్మాం పరిపృచ్ఛసి అను భావమునకు ఆవలన్ వినిపింతు నా విషయమున్ అని తెనిగింపు. 38వశ్లోకములో లంక హనుమంతుని చఱచిన విషయము తలేనవానర శ్రేష్ఠం తాడయామాస అను వాక్యమున గలదు. దీనికి ఇంక చచ్చితివని తెగ నరచేత సరవ అని తెనిగింపు అంతకముందు 183 వపద్యము అరచేతి పండ్లు వచ్చినా కరచెదుగాకేమి అని ఉన్నది. ఇది జాతీయమైన తెలుగుపలుకుబడిలో సన్నివేశాను గుణముగా స్వతంత్రించి చేసిన ప్రయోగము. హనుమంతుడు లంకిణిని ఎడమ చేతి పిడికిటితో పెడతల పొడవగనేలబడి విలవిల తన్నుకొన్నది. ఆ భావము 40,41 శ్లోకములలో గలదు. 44 నుండి 49 వ శ్లోకమువరకు లంక హనుమంతునితో నన్నుకాపాడుమని అర్థించుచు పరమేష్ఠి వరమును బట్టి నీవు నన్ను నిర్జించితివిగాన ఈ

అసురకులమునకు చేటుపట్టుట నిక్కము. విధిమాటకు అన్యథార్థంబు లేదు. సీత నిమిత్తమున దశాననుడు మడియును. ఏమను తెల్లనిరాటంకముగా జరుగును అని తెలిపెను. ఈ తృతీయ సర్గమున బలిజేపల్లి మూలమునకు ప్రతి బంధకముగాని పద్ధతిలో ఔచిత్యమును పోషించుచు అటనట కొంత స్వతంత్రతను పాటించెను.

## చతుర్థ సర్గము

చతుర్థ సర్గమునందలి 30 శ్లోకములు 194 నుండి 204 వరకు గల పద్యములలో అనువదింపడినది. హనుమంతుడు లంకా నగరమున ప్రవేశించి రాజమార్గములో వడవాడలను దర్శించిన వృత్తాంతము 8 వ శ్లోకమువరకు కలదు. ఇది మూలమున మూడు పద్యములలో వివరింపబడినది. 9 వ శ్లోకమున రామార్థేచరణ్ శ్రీమాన్ దదర్శచ ననందచఅనునది 197 వపద్యమున అనూదితము. రామార్థమై తిరుగుచు అని మూలము దీనిని కొంత విస్తరించి ఇంక భూసుతనుగనుంగొన కా కౌతూహలమున వెదుకదొడంగె అని కందమున వివరించెను. పదవశ్లోకమునకు 198 వ పద్యము అనువాదము. శుశ్రావరుచిరంగీతం త్రిస్థానస్వరభూషితం అను వాక్యమునకు త్రిస్థానోల్ల సన్మంద్ర మధ్యమ తారస్వర గుంభితంబుల అని అనువాదము. ఇచట త్రిస్థానముల పేర్లు తెలుపబడినవి. శుశ్రావ కాంచీ నినదం నూపురాణాంచ నిస్వనం అను వాక్యమువరకు గల విషయము (11-13 శ్లో) కనక కాంచీ కలాపఘంటికా ఘల ఘలన్ అను సీసపద్యమున (199) వివరింపబడినది. ఇందలి గీత పద్యమున గల విషయము కవి కల్పితము రకరకముల వ్యక్తులను చూచినట్లు 15 నుండి 22 శ్లోకములవరకు తెలుపబడినది. దీనిని బలిజేపల్లి వారొక సీసము మఱియొక వచనములో అనువదించిరి. దశాస్యు కోట మొగసాల జొచ్చువరకు గల ఇతి వృత్తముతో చతుర్థ సర్గము గియు చున్నది.

## పంచమ సర్గము :

పంచమ సర్గము 205 వ పద్యముతో ప్రారంభమై 232 వ పద్యముతో ముగియును. 205,206 పద్యములకు పాఠాంతర పద్యములును కలవు. మూలమున ఈ సర్గము 27 శ్లోకములలో ఉన్నది. రావణుని అంతఃపురము నందలి ప్రతి గృహము పరిశీలించి సీతనుగానక దుఃఖించుట ఈ సర్గము నందలి కథాంశము. మూలమున గల 8 వ శ్లోకము 210 వ పద్యమున ప్రౌఢముగ మత్తేభవృత్తమున నిబంధింపబడినది. రామాభిరామేరిత చిత్తదోషః అనునది జగదభిరామాభిరాకురిత స్వమనో దుస్సహరోషదోషమనియు ప్రవృద్ధ రక్షః పిశితాశి దోషః అనునది అవి వార్య స్వైర హింసా సముద్యమ రక్షః పిశితాశి దోషము అనియు అనువదింపబడినవి. మూలమున కంటె అనువాదము సుదీర్ఘ సమాస భూయిష్ఠమై ప్రౌఢిమను సంతరించుకొన్నది. 15 వశ్లోకము బుద్ధి ప్రధానం రుచిరాభిధానం..... దదర్శ తస్యాంపురి యాతు ధానం అనునది. వితతమతి ప్రధానులు వివేక నిధానులు అనంత విధానులు యాతుధానులానత మమనః ప్రధానులు అను 217 వ పద్యమున అంత్యాను ప్రాసమనోజ్ఞమై కూర్పబడినది. మూలమునందును అంత్యప్రాసకలదు. కాని యిందు అనువాద కర్తమరి కొన్నివిశేషణములను కల్పించిచంపకమాలను మనోజ్ఞముగ తీర్చిదిద్దెను. 222 నుండి 229 వరకు గల కందములు, గీతము, ఆటవెలదులలో మూలము. కొంత విస్తరించి వివరింపబడినది. 23 వ శ్లోకము నవ్యేత సీతాం పరమాభిజాతాం అనునది. మూలమునగల నాలుగు పాదములు ఒకసీసమున విస్తరించి వర్ణింపబడినది. 231 వ పద్యమునకు 25 వ శ్లోకము మూలము. 26,27 శ్లోకములకు 230 వ సీసము అనువాదము. ఈ సీస పద్యము లన్నిటిలో

విషయము కొంత స్వతంత్రించి విస్తరింపబడినది. సహజసిద్ధముగా బలిజేపల్లిసాధ్యమైనంత వరకు స్వతంత్ర రచనా కౌశలమును తన ప్రతి రచనలో ప్రదర్శించుట పరిపాటి. ఇట్టి పద్ధ ప్రస్తుత పరివర్తనమునందును కొంత పాటింపబడినది. వీరు ఔచిత్యము కొరకు అక్కడక్కడ కొన్ని చిన్నచిన్న సన్నివేశములను కల్పించినను అవి మూలమునకు పూర్తిగా భిన్న ములు గాక ఎంతో వన్నెను, వాసిని కలిగించు చుండును. వీరి ఉత్తర రాఘవముకూడ కొంత మూల విధేయము మరికొంత స్వతంత్ర రచనా కౌశలము నెరపిన నాటక రాజము ప్రస్తుతము సుందర కాండమునందును అట్టి స్వతంత్ర రచనా కౌశలము రేఖా మాత్రముగా ప్రదర్శితమైనది.

## ఆఱవ సర్గము

54 శ్లోకములు గల ఆరవ సర్గమున హనుమంతుడు, రావణుడు మరియు నితర రాక్షసుల గృహములలో సీతాదేవిని వెదకిన సన్నివేశము వివరింపబడినది. 230 నుండి 257 వరకు గల పద్య గద్యములలో ఇది అనువదింపబడినది. ఇందలి 15వ శ్లోకము లంకాభరణ మిత్త్యేవ సోమనిథ మహా కపిః అనునది. 237 వ మత్తేభ విక్రీడితమున కవి వివరించెను. ఇది లంకాభర ణంబహో అని పద్మయపు టెత్తుగడ. ఈఎత్తుగడకు మాత్రమే మూలమున్నది. అటుపై నురపురంబేపాటి కీవీటికిన్ తుదియెందో ఉవి పంక్తి కంధరుని పంధుల్ మంత్రులున్, బుత్రులుండు దివా ణంబులౌ రాణి వాసములౌ అని ఎంతో స్వతంత్రించి విస్తరించెను. అటుపై ఒక్కొక్కరి గృహము చూచినట్లు రెండుసీసములలో వరునగ వర్ణింపబడినది. పిమ్మటచతు రంగ బలములనుగాంచిన సన్నివేశమున్నది. 32వశ్లోకము రక్తాన్ శ్వేతాన్ సితాం శ్చాపిహరిం శ్చాపిమహాజవాన్ అనునది. హరిదరుణ ధవళరుచి భాస్వరములు పవమానమావ డవనంబులు సంగర రంగభంగములు నగు తురంగముల గముల చూచినట్లు అభివర్ణితము ఈ కందమున బలిజేపల్లి తురంగగతిని సూచించెను. కావలి కత్తెలును,. జేదులును,. నడుమంత్రపు హెగ్గడీం డ్రను పరికించి హనుమంతుడు ముందుకేగెను. అచట కుబేర గృహమునుకూడ చూచినట్లు 255 వ పద్యమున వర్ణితము. దీనికి 42వ శ్లోకము మూలము. నూపురాణాంచఘోషేణ కాంచీనాం నిస్వనేనచ అను 43వ శ్లోకము కణకణలాడు మృదంగ క్వణన ధణంధణలబలిమి అను కందమున అనూదితము బడినది. ఇట మృదంగధ్వని అనుకరణ కలదు.

## సప్తమ సర్గము

సప్తమ సర్గము మూలమున పదునేడు శ్లోకములలో కలదు. రావణుని భవనము, పుష్పక విమాన వర్ణనము ఇందలి విషయము. ఇట మూలమునగల శ్లోకములు అంత్యానుప్రాసతో కూర్పబడినవి. పంచమసర్గము నందలి ఛందస్సే ఈ సర్గమునందును అనుసరింపబడినది. గృహాణినానా వసురాతతాని . దేవైస్సురైశ్చాపిసుపూజితాని అను మూడవశ్లోకమునానారత్నకదంబులతియత్నప్రౌఢ శిల్పాగమస్థానంబుల్సురదైత్యసేవ్యములని 259 వ పద్యమున అనువదింపబడినది. మూలమున కేవలమ్మునావసు రాజితములనియే యున్నది. అది అనువాదమున ప్రౌఢ శిల్పముతో విస్తరింపబడినది. ఈ విస్తృతి అతి యత్నమని కొందరు భావించవచ్చును. కాని పద్యపుటెత్తుగడను బట్టి గాంభీర్యమును సంతరింపజేయుటకై బలిజేపల్లి సమాన గతమైన శిల్ప సౌందర్యమును అనుసరించెను. ఆరవ శ్లోకము మహీతలే స్వర్గప్రకీర్ణమ్ అనునది. దీనికి దివినుండు విధవశంబున భువికి దిగబడిన స్వర్గపురమనగ అను కందము అనువాదము. మూలమున మూడవపాదమున నానాతరూణాం కుసుమావకీర్ణం అని ఉన్నది. దీనిని సుమపరాగ ప్రవికీర్ణం బని కవి అనువదించెను. సుమమనగ

తరువుల ప్రసక్తియునందు స్పృశింపబడినట్లే అని అనువాదకుని అభిప్రాయము. 7, 8 శ్లోకముల భావము 262 వ పద్యమగు సీసమున కొంత విస్తరించి అభివర్ణింపబడినది. సప్తమసర్గము నందలి తుది శ్లోకము అష్టమసర్గమునందలి మొదటి రెండు శ్లోకముల భావము 268వ పద్యమగు సీసమున అనువదింపబడినది,. పుష్పక విమాన దర్శనమే ఈ అష్టమసర్గమున అభివర్ణితము. ఆపుష్పకము తపస్సమాధాన పరాక్రమార్జితము. మనస్సమాధనవిచార చారిణము. అనేక సంస్థాన విశేష నిర్మితము అను మూలమునందలి భావము అనువదింపబడలేదు. చిరతపోనిష్ఠనవ్విరించిన భజించి కాంచె యక్షేశుడా పుష్పకమును వాని బుజభుజపరాక్రమమును నిర్జించి వడసె రావణుండు త్రిలోకవిద్రావణుండు అను పద్యమునకు నవమసర్గమునందలి 12వ శ్లోకము మూలము. పరేణ తపసాలేభే యత్కుబేరపితామహాత్ కుబేరయోజసాజిత్వాలేభేతత్ రాక్షసేశ్వరః అను శ్లోకభావమే 270 వ పద్యమున పరివర్తింబడినది. అనువాదకర్త అష్టమసర్గమునందలి కొంత విషయమును పరిహరించినట్లు తెలియుచున్నది. ఇచ్చటమూలమునందువలె సర్గ విభజనము కానరాదు.

**నవమ సర్గము** : మూలమున నవమ సర్గమున 73 శ్లోకములున్నవి. అనువాదమున 310 వ పద్యము నండి 328 వరకే 9వ సర్గముగా బలిజేపల్లి విభజించెను. 8వసర్గమునకు సంబంధించిన ఇతి వృత్తము ప్రత్యేకముగా నిది అని యిందు సూచింపబడలేదు. ఈ సందర్భమున బలిజేపల్లి ఏప్రతిననుసరించెనో తెలియకున్నది. రావణుని శయ్యా సదన నిర్మాణచాతురిని అందు ఒడలుమరచి నిద్రించుస్త్రీల పరిస్థితిని లంకేశ్వరునికి పరిచర్యలు చేసి అతనిని నిదురపుచ్చి అచట శయనించిన సురగరుడోరగ విధ్యాధర కిన్నర సిద్ధసాధ్యతరుణీ పరివారమును హనుమంతుడు చూచి జానకి తప్పితక్కిన వనితలు రావణుని బాహుబల సంపదకు, గుణ సంపదకు ఇష్టపడి వచ్చిన వారే కాని లాతి చెలి లేదచ్చట అని భావించెను. అంతేగాక అతడు తన విజయవిఖ్యాతిని చాటుటకై యిందఱలతాంగులను తెచ్చెనే కాని మోహాతిశయము కాదనియు తలచెను.. వెంటనే హనుమంతునికి సీతాదేవి స్ఫురణకు వచ్చి ఆరఘుకులపత్నియు తన కూరిమి పతినెప్పుడు చేరి సుఖపడునో అని మిగుల జాలిపడెను. అటుపై ఇంత మహత్వము, ఇంతసిరి, ఇంతటి భోగవిలాసము, యింత విశ్రాంతి గలిగిన రావణుడు ఎంతటి అనార్యకృతిని గావించెనో కదా! ఇంతటితోనైన సీతను రామునికి అర్పణ చేసినచో తానెంతసుఖించునో ఆరఘు కులేశ్వరుడు ఎంతగా సంతసించునో అని హనుమంతుడు పరిపరివిధముల తలంచెను. ఈ పై చెప్పిన భావములు నవమసర్గమునందలి 68వ శ్లోకమునుండి 73 వ శ్లోకము వరకుకలవు.

**దశమ సర్గము** : 310 నుండి 328 వ పద్యమువరకుగల విషయము దశమసర్గమున 54 శ్లోకములలోకలదు ఇటమొదట హనుమంతుడు, రావణుని శయనాసనమును చూచినట్లు గలదు. తత్రాదిత్యోకమం ముఖ్యంస్ఫాటికం రత్నభూషితం అవేక్ష్యమాణో హనుమాన్ దదర్శ శయనాసనమ్ అని మొదటి శ్లోకము. దీనిని బలిజేపల్లి ఆవెంటన్ జనిగాంచె....మహోజ్జ్వలంబైన పర్యంకమున్ అని 311 పద్యమున అనువదించెను. ఇందు రెండవశ్లోక భావమును గూడ కవి అను సంధించెను. 3వశ్లోకమువరకు గల భావము 312 నుండి 314 వరకు గల పద్యములలో తెలుపబడినది. 14వశ్లోకము నుండి 16వ శ్లోకమువరకు గల భావము 315 వ పద్యమగు స్రగ్ధరావృత్తమున ప్రౌఢముగా పరివర్తింపబడినది. వక్త్రోల్లిశితపీనాంసా అను 16వ శ్లోకమునందలి భావము పవిచిత్ర

స్ఫారధారాప్రణే తరణ కిణప్రౌఢగాఢాంస రేఖల్ అని ప్రౌఢసమాసమున నిబంధింపబడినది. 15వ శ్లోకమున వితిస్త్రారాక్షసేంద్ర స్వభుజావిందధ్వజోపమౌ అను వాక్యము యొక్క భావము. ఇంద్రధ్వజతులిత మహాబాహువులు సాచి అని అనువదింపబడినది. మూలమునకంటె ఈ అనువాదము భావపరిపుష్టమై ప్రౌఢిమతో రావణుని గాంభీర్యమును స్ఫురింపజేయు పద్ధతిలో కూర్చబడినది. గంధద్విపప్రసక్తి ఉండుటచే మత్తేభవృత్తమును రచించెను. కాని ఇచ్చట గమనము ప్రధానముకాదు వనాంతసుప్తగంధ ద్విపమువలె నిద్రించు నక్రంచరేంద్రుని గూర్చి తెలుపబడినది. కావున ఈ కవి ఇచ్చటస్రగ్ధరావృత్తమును సంతర్భానుసారముగా ప్రయోగించెను. నిద్రామత్తులై ఒక్కొక్కరు ఎట్లుపవళించి ఉన్నారో ఈ సర్గమున వర్ణింపబడినది. 44వ శ్లోకమున డిండిమం పరిగృహ్యాణ తథైవాసక్త..వత్సం ఉపగుహ్యేవ భామినీ అని ఉన్నది ఈ శ్లోక భావమును గుమ్మెట వాద్యపు ముద్దులు గుమ్మయొకతే ..జనుబాలు గుడిపి కొను తల్లివలెను. అని ఎంతో సుందరముగా అందమైన కందములో పొందుపరచెను. పిమ్మట మండోదరిని జూచిసీతను కనుగొంటినని భ్రమించిన సన్నివేశము 52,53 శ్లోకములలో గలదు. దీనిని బలిజేపల్లి ఒక సీసమున అనువదించెను. తర్క్యయామాససీతేతి అనుశ్లోకభావమును మునుకులాధీశు దేవిగ మది భ్రమించి అని అనువదించెను. తర్క్యయామాసకు మారుగ భ్రమించి అని అనువాదము. కాని అనువాదకర్త అంతటితో ఆగక కనుసెదరికంటి సీతను గంటినని ఉప్పొంగినట్లు వివరించెను. అటుపై గల శ్లోకభావము పదిపాదముల ద్విపద ఛంధస్సులో కూర్చబడినది. ప్రస్ఫుటయామాసచుచుంబపుచ్ఛమ్ అనుటకు లాంహగూలంబు కౌఊకి అని అనువాదము. కాని ఇచ్చట కపి చేష్టల వర్ణన కొంత విస్తరింపబడినది. పరికించి శివశివాహాహాన బడిలి ధరణిజగాదాయె ధరణిజగాదు అని నిర్ణయించుకొనుటలో 9వ సర్గము ముగిసినట్లు అనువదమున కలదు. మూలమును బట్టి ఇదిపదవ సర్గము ముగింపుఅగును.

**ఏకాదశ సర్గము** - 11వ సర్గమున 48 శ్లోకములున్నవి. ఇందలి భావము 329 వపద్యము నుండి అనువదింపబడినది. ఏకాదశ సర్గ 2వ శ్లోకముననరమేణ విముక్తాసాన్వపుమర్వత భూనినీ..నపాన ఉపసేవితం అని ఉన్నది. దీనికి 330 వ పద్యము అనువాదము. ఆరఘురాము బాసిజనకాత్మజ నిద్రపోవునా సుధాహారములైన దావలచునా జలమైనను ద్రావునా అలంకారము సేయునా అని బలిజేపల్లి ఉత్పలమాలావృత్తములో ఎంతో సహజసుందరమైన సరణిలో అప్రయత్నలబ్ధమగు సంభాషణ చారిమతో అనువదించిరి. హనుమంతుడు పానశాలను చూచిన సందర్భమును బలిజేపల్లి (333వపద్యము) తరువోడ పద్యమునవివరించిరి. 21వశ్లోకమునుండి 24 వరకు గల శ్లోకమునగల భావము సీసమున కూర్చబడినది. మనోహిహేతుః సర్వేషామింద్రియాణాం ప్రవర్తనే. శుభాశుభస్వవస్థాసు తచ్చమే సువ్యవస్థితమ్ అను 42 వ శ్లోకము మనసె నిఖిలేంద్రియప్రవర్తనకు మూలము అను 340 వపద్యముననే గాక కరణములెల్లనంతఃకరణమ్మె ప్రమాణ మీచటికార్యాచరణములకు నాయంతః కరణ విశుద్ధియె ప్రమాణగతి చరించునని 342 వ పద్యమునందును అను సరింపబడినది.

**ద్వాదశసర్గము** :ఎచ్చటనుసీతనుగానని హనుమంతుడుఆమె మరణించెనేమో అని అనేక స్థలములు దర్శించి మిగుల చింతిల్లు సన్నివేశము ద్వాదశ సర్గమున 25 శ్లోకములలో వర్ణింప బడినది. ఇది అనువాదమున 345 నుండి 356 వరకు గల పద్యములలో వివరింప బడినది. జాంబవంతుడు, అంగదుడు తక్కిన తరుచరములు సీతను

నూచి తివా అని అడిగినచో వారికి ఏమని సమాధానమొసగుదునని తలచి ఎంతో నిర్వేదములో లంకనెల్ల జానకికొరకు గాలించెను. ఆ అసురపతి పురమును జొచ్చి చూచిన సందర్భమున స్రగ్ధరావృత్తము నిబంధింపబడినది. 15వ శ్లోకమున గల భావము ఈ స్రగ్ధరకు మూలము. ఇందలి మొదటి రెండు పాదములు అచ్చతెలుగు పదములతో ద్రుతప్రకృతికముల బాహుళ్యముతో ఎంతో సుందరముగా సాగినది. ఇందలి 15వశ్లోకము అవతీర్యవిమానాచ్చ హనుమాన్ మారుతాత్మజః చింతాము పజగామాధ శోకోపహతచేతనః అనునది. అంతక ముందు గల రెండు శ్లోకములు భావమనుకూడ అనుసందించి, చంపక మాలావృత్తమును రచించెను. ఇందు అవతీర్య విమానాచ్చ అనుదానికి 357 వ పద్యమున విమానతటి నుండి కుఱంగటి యావరణమునకు డిగి అని కలదు.

**త్రయోదశ సర్గము** : త్రయోదశ సర్గమున 69 శ్లోకములు అనువాదమున 357 నుండి 394 వరకుగలపద్యములలో వివరింపబడినవి. మూలమున ఇహసంపాతినా సీతారావణస్య నివేశనే ఆఖ్యాతా గృధ్రరాజేననచసాదృశ్యతేనకిమ్ అను 5వ శ్లోకమునకు అవనిజదశాస్యునింటనున్నట్లు పలికినాడు. సంపాతియను **శకునాల ఱేడునమ్మి** వచ్చితి మెను సముద్రమ్మునుదాటి శకున వాక్యాలు వట్టి యిచ్చకములేమొ అని అనువాదము ఇందలి తుది రెండు పాదములు కవి కల్పితములు గృధ్రరాజేన అనుదానికి **శకునాల ఱేడు** అని అనువాదము. ఇది నాల్గవపాదముతో అనుబంధము కలిగి అనువాదములో వినూత్నతను, రామణీయకమును, అర్థగౌరవమును పుణికి పుచ్చుకొని రసస్ఫూర్తిగల భావమహోత్కృష్టతను వెలార్చినది. మామూలు మాటలలో ఎంతో ఆర్ద్రతను కవి యిచ్చట ప్రదర్శించినాడు రావణస్యోరు వేగేన భుజాభ్యాంపీడితేన..**త్యక్తం జీవితమార్యయా విచేష్టమానాపతితా** సముద్రే జనకాత్మజా **భక్షితాసీతా** అను వాక్యముల **భావమును సంద్రమునంగూలెనో** రావణోగ్రభుడ బంధక్లిష్టయై దుక్కు మాలి **మృతింజెందెనొ, రాకాసాంగువలు బల్మిన్ బంచి భక్షించిరో** అని 359 వ పద్యమున అనువదించెను. **ఈ పద్యప్రారంభము రమణిన్ ముచ్చిలి పాఱువేళ రఘువీర క్రూర శస్త్రాహతి భ్రమ వార్థిన్ డిగద్రోచెనో** అనునది. **మూలశ్లోకముల** భావము యథాక్రమముగా ననుస, రింపక **పోయినను కొన్ని వాక్యముల నటునిటు మార్చి** స్వతంత్రరచనవలె తీర్చిదిద్దుటలో బలిజేపల్లి చూపిన ప్రతిభ **అప్రతిమానము. ఇట్టి** ప్రతిభ వారి రచన యందెల్లెడల సందర్భాను సారముగా కన్పట్టును. 13వశ్లోకమునకు 361 వపద్యము అనువాదము. సందర్భశుద్ధి చెడకుండకొంత ముందు వెనుకలుగా అచ్చటచ్చట అనువాదము సాగించెననుట కివినిదర్శనములు. **నివేద్యమానే దోషఃస్యాత్ అని వేదనే కథం నఖలు కర్తవ్యం విషమం ప్రతిభాతియే** అను 18వ శ్లోకము **ఎఱింగింతునేని కీడగు నెఱిగింపకయున్నకీడె ఈ రెండింటన్ దఱికిదగుకర్జమేదని అఱిముఱిదల పోయ జొచ్చి** అని అనువాదము. ఈ కందపద్యములో ఒక్క తత్సమ పదమును కానరాదు. కేవలము అచ్చ తెలుగు పదములతో ఎట్టి విషయమునైన ఎంతో స్వేచ్ఛగాసహజసుందరముగా ప్రకటించుటకు వీలగునని అనేక సందర్భములలో బలిజేపల్లి కవి నిరూపించి యున్నారు. ప్రస్తుతమిది యొక దృష్టాంతము. యదిసీత మదృష్ట్వాహం వానరేంద్రపురీమితః గమిష్యామి **తతః కోమే పురుషార్థో భవిష్యతి** అను 20వశ్లోకము **జానకి గానక కిష్కింధా నగరంబునకు బోదునా పౌరుషమా మానము మరియాదామది. వానరవల్ల భున కేమి వార్తలు** దెలుపుదు అని అనూదితము. ఇందు **మానము మరియాదా** అను తెలుగు నుడికారపు సొంపు ఈ సన్నివేశమున ఎంతో ఔచిత్యకారకమై

రసస్ఫోరకముగా నున్నది. 21,22వ శ్లోకములు 367 వ పద్యమున అనువదింపబడినవి. నద్భష్టేతిమయాసీతా అనుటకుసీతయెవ్వలననన్ లేదు వృథాశ్రమంబ (367ప) అని అనుసరణ తీక్ష్ణ మింద్రియ తాపనము అగు వాక్యమును విన్నచో రాముడులేడు. అతడు లేనిచో లక్ష్మణుడును లేడు. అట్లే భరతుడు, శత్రుఘ్నుడు, కొడుకులు కోడండ్రట్లగుటకు దురపిల్లి కౌసల్య, సుమిత్ర, కైకలు ముచ్చిచ్చుచొచ్చి చత్తురు. అనంతరము సుగ్రీవుడు, వాని భార్యరుమ, వాలి మృతి కెసగ పడిన తార సుగ్రీవు చావుచూచి సొదబడి నశించును. వీరికంటె మున్నే అంగదుడు మడియును అనుదానికి మూలము 24 నుండి 31 వశ్లోకమువరకు గలదు. అటుపై వానరులు రకరకముల చత్తురన్నవిషయమును బలిజేపల్లి కవి యిచ్చట 17 ద్విపద పాదములలో తెలిపెను. ఇది 32 నుండి 36 వరకు గల శ్లోకములలో వివరింప బడినది. తాను జానకిని గానక కిష్కింధ ప్రవేశింపననియు చిచ్చుఱుకుటో, అంభోనిధిని జొచ్చుటయో లేక ప్రాయోపవేశమున ప్రాణము వీడుటో చేయవలెనని తలచెను. కాని అంతలో ప్రాణ త్యాగము పురుషార్థమా! ధర్మ సాధనమునకీ తనువేగదా ప్రధానమని నిశ్చయించుకొనెను. ఈనిశ్చయము 47 వ శ్లోకమున **వినాశే బహవో దోషా జీవన్ ప్రాప్నోతి భద్రకమ్ తస్మాత్ ప్రాణాన్ ధరిష్యామి ధ్రువో జీవతి సంగమః** అని ఉన్నది. 374 వ పద్యములో ఇది అనువదింప బడినది. ఒక నిశ్చయమునకు రాకముందు ప్రాణ త్యాగమొనరించుటకై ఎన్నెన్నో విధముల భావించెను. అట్లు భావించు సందర్భమున గల కొన్ని శ్లోకములకు అనువాదములేదు. ప్రాణధారణమే భద్ర కారణమగు నిర్ణయమునకు వచ్చు సందర్భమున మూలమున లేని కొన్ని భావములను ఎంతో ఉదాత్తముగా, మహోజ్వలముగా కవి యూహించి తెలి వెన్నెల సోనల దలపించు ప్రశాంత స్థితిని నెలకొనునట్లు చేయ జూచుట గమనార్హము.

యశస్విని యగు రామ పత్నిని గాంచు నంతవరకు మరల మరల ఈ లంకాపురినివెదకె దనని హనుమంతుడు భావించునట్లు 52వ శ్లోకమున గలదు. దీనికి 357 వ పద్యము అనుసరణ. 56 వ శ్లోకము అగు **వసూన్ రుద్రాన్ తథాదిత్యాన్ అశ్వినౌ మరుతో** పిచనమ స్కృత్వా గమిష్యామి రక్షసాం శోక వర్ధనం అనుదానిని 383 వ పద్యము కందమున వసురుద్రాదిత్య మరుద్విసరములకు నశ్వినులకు విరచించి ప్రణామ సహస్రంబులు నాకున్ వసుధాసుధ జావుడని అనువదించెను. తరువాతి రెండు శ్లోకములకు అనువాదములేదు. 59 వ శ్లోకము స్తుతి ఇది యథాతథముగా గ్రహింపబడినది. పిమ్మట హనుమంతుడు సమస్త దేవతలకు ప్రణామము లర్పించెను. 68 వశ్లోకమున వసుధాసుత ముఖ సౌందర్యమును వర్ణించుచు **పాండు రదంత శుచి స్మితం పద్మపలాశలోచనం ప్రసన్నతారాధిపతుల్యవర్చనం** అను విశేషణములు కలవు. ఈ శ్లోక భావమే 393 వ పద్యమున నిబంధింపబడినది. 68 వ శ్లోకములో మొదటి విశేషణము తదున్నసం అనునది. చంపగము వంటి నాసిక ఛందస్సును బట్టి స్ఫురణకు వచ్చునట్లు చంపకమాలావృత్తముననిది ప్రయోగింపబడినది. తెనుగున **వసుధాసుత నెమ్మగము మొలకయలంతి నవ్వు సమున్నత నాస జాజిపూవులు వరుస దళన్నళినపత్ర విశాల విలోల నేత్రములు లలిత కపోలములు శశికళా మృదుల ద్యుతి మత్ప్రసాద కందళికలను** అందగించునదిగా వర్ణింపబడినది. మూలమున లేని కొన్ని విశేషణములిందు అధికముగా కూర్పబడినవి. పాండురదంతమని మూలము సన్నజాజి పూలతో దానిని అనువాదకర్త ఉపమించెను. కపోలముల ప్రసక్తి మూలమునలేదు. శుచిస్మితం అను విశేషణము మొలకయలంతి నవ్వుగ తెనిగింపబడినది.

**చతుర్థశ సర్గము :** పిమ్మట చతుర్దశ సర్గమున గల 5 2 శ్లోకములు 3 9 5 నుండి 4 2 1 వరకు గల పద్య గద్యములలో ఆంధ్రీకరింపబడినది. అశోక వనమున ప్రవేశించి అందలి శోభను దర్శించి సీతాదేవి పరిస్థితికి మిగుల చింతించుట ఈ సర్గమునందలి వృత్తాంతము. 1 5 వ శ్లోకము 3 9 9 వ పద్యమున 1 6 , 1 7 శ్లోకములు 4 0 0 వ పద్యమున అనువదింపబడినవి. దీనిలో విహంగ సంఘైః హీనాస్తే స్కంధ మాత్రా శ్రయాద్రిమాః అను ప్రయోగము ద్విజకుటుంబాలు తమ గూళ్ళు విడిచిపోయినస్కంధ మాత్రావశిష్టముల్ క్ష్మారుహములు అని అనువదింపబడినది. 4 0 0 న పద్యమున గల తుదిపాదము చూడ చుట్టంబులేని గేస్తులనమిగిలె అని కవి స్వయముగా కల్పించి తెనిగింపులో ఎంతో స్ఫూర్తిని ప్రకటించెను. 1 8 వ శ్లోకమునకు బలిజేపల్లి ఒకటికి రెండు పద్యములను వ్రాసెను. అందొకటి పాఠాంతరము. పాఠాంతరమున అచ్చ తెలుగు పదములకు ప్రాముఖ్యము. పై శ్లోకమునకు 4 0 1 వ పద్యము అనువాదము. ప్లవగాఖీల కరాంఘ్రివాల మిహతన్యామర్దితంబై యశోక వనీనాటి రతి శ్రమాంగనగతిన్ గన్పట్టె నిశ్శేష పత్ర విశేషాంగి నితాంత దంతనఖ సందష్టాధరోష్ఠ ప్రవాళవికీర్ణాలకజాలక భ్రమర మాలోల ధమ్మిల్లమై అను పద్యమున నిపీత శుభదంతోష్ఠనఖైర్దంతైశ్చ విక్షతా అను ప్రయోగములు అనూదితములైనవి. ప్రస్తుత పద్యము ప్రకృష్టపదబంధ విలసితమై ప్రాబంధిక పద్ధతిలో సాగినది. దీనికి పాఠాంతరము చిందఱావాఱుకురుల్ రదక్షతిన్ జరిగిన కావిమోవినును జెక్కిలిసై విర్వపోవు బోటికరణున్ అన్నది. ఇందు అశోక వటి వానర వరవాలహస్తచరణ త్రుటితద్రామపత్రవల్లి అను సమాసము దీర్ఘలాంగూలమునుకు దాని సామర్థ్యమునుకు సూచన. హనుమంతుడు శింశుపా వృక్షమును దర్శించి. దానిపైనెక్కి వనము నాలుగు వైపుల కలయజూచిఅశోకవన సౌందర్యమున కాశ్చర్యపడెను. 3 6 , 3 7 శ్లోకములలో ఈ విషయము వర్ణింపబడెను. 4 0 9 వ పద్యమగు మత్తేభమునశింశుపావృక్ష వర్ణనము ప్రౌఢముగా సాగినది. సీతాదేవినిసందర్శింతునని ఆమెను గూర్చి ఆలోచించును. 4 6 , 4 7 శ్లోకములలో వనకుష్యతి సాధ్వీహారామచింతాసుకర్శితారామ శోకాభి సంతప్తాసాదేవీ వామలోచనా వనవాసు రతా నిత్యం ఏష్యతే వనచారిణీ అని వర్ణింపబడినది. తప్పక రాముని దేవేరివనవాసరతయగుటచే వనమునకురాగలదని భావించెను. అది సంధ్యాసమయము తప్పక జానకి వచ్చునని తలచెను. ఈ విషయముసంధ్యాకాలమనాన శ్యామా ధ్రువయేష్యతి జానకీ అన 4 9 వ శ్లోకమున ఉన్నది. దీనికి సీత సంధ్యాసము పార్జనా విధికి తానరులెంచు అని అనువాదము తారాధిసన్నిభాననయైన ఆదేవి జీవించి ఉన్నచో అవశ్యము శీతజనముగల ఈ నది నుద్దేసించి వచ్చునని 5 1 వశ్లోకము యొక్క భావము. 4 1 9 వపద్యమున రారాపుల్ సైరించి బ్రతికి యుండిన రానే వచ్చు అని అనువాదవు. ఇందు శీత జలవుగల నదీ ప్రసక్తి కానరాదు. మూలమునకు అనువాదమునకు అందందు కొంత భేదము కన్పట్టుచున్నది. అచ్చటచ్చట కొన్ని శ్లోకములు పునరుక్తములని తలచినవి కవి వదలి వేసినట్లు కన్పట్టును. స్వతంత్రరచనవలె కవి స్వయముగా కొన్ని చిన్న చిన్న కల్పనలు ఆటనట కావించి అను వాదమున తెలుగు దనమును చాల చక్కగా పోషించెను.

**పంచదశ సర్గము :** 4 2 2 వ వచనము నుండి 4 5 4 వపద్యము వరకు గల అను వాదమునకు పంచదశసర్గము మూలము. ఇందు 5 4 శ్లోకములున్నవి. పంచదశ సర్గ ప్రారంభమున అశోకవాటి వర్ణన కొంత కలదు. అదినందనము చైత్రరధము వోలె ఉన్నదని

11వ శ్లోక పాదమునకు భావము. హనుమంతుడు సీతను చూచిన వృత్తాంతము 18 వ శ్లోకమునుండు 39 వ శ్లోకమువరకు గలదు. ఇది అనువాదమున 426 నుండి 36వ పద్యము వరకు కలదు. ఆమెను చూచిన అనంతరము ఈమె ఆమె అవునా అని తర్కించుట 40 వ శ్లోకమునుండి వర్ణింపబడినది. 41వ శ్లోకము వైదేహ్యా యాని చాంగేషు తదారామోస్య కీర్తయత్ తాన్యా భరణ జాలాని గాత్ర శోభీన్యలక్షయత్ అనునది. ఈ భావము 438 వ పద్యమగు కందమున సీతకే యేరవణంబులు గలవటంచు రఘుపతి నాకున్ వివరించె నానవాలుగనవి యేవియు నీపెమేన నగుపడవు గదా! అని తెనిగింపబడినది. మూలమునందలి భావమే అనువాదమున చెప్పబడినను చెప్పిన పద్ధతిలో ఎంతో స్వతంత్రత సహజ సుందరత చోటుచేసుకున్నవి. పతిని బాసినట్టి సతికలంకృతి సీత విధినిషేధమంచు విడిచె నేమొ అను భావము స్వయముగా కవి కల్పించినది. 441 నుండి 454 వరకు గల పద్యములు చాల వరకు కవి స్వయముగా కరుణ రసావిష్కృతికై కల్పించివ్రాసినట్లు అనిపించును. ఇచట మూలమును నిమిత్తమాత్రముగా గొని హనుమంతుడు సీత పాటునకు మిగుల కుందినట్లు కవి భావించెను. భావనలో తదనుగుణ రచనా కౌశలము, అందు ముఖ్యముగా ఎంతో సుకుమారములగు తెలుగు పదముల కూర్పులో కవి చూపిన నేర్పు ఎన్నదగినది. శోకసమాకులాత్ముడైన హనుమంతుడు సీత యొక్క దురవస్థను చూచి అకటా! దుర్విధి నేమనవలె. మా శ్రీరాముగా రాము పత్నికా! ఇంతటి పాటు ఛీఛీ ఏమనవలయు. అటు పుట్టినింట మెట్టినింట ఎంతటి సిరి, ఎంతటి బలగము. ఇంత ఉండియు ఈసీతకు ఇన్ని కడగండ్ల పతియు తాను సుఖపరంపరల తేలగల్గిన ప్రాయాన ఇట్టి పాటు దాపురించెనొ. చెట్టునకునొకపక్షిగా చీలిపోయి సీతయిటురాముడటు కృశింపనయ్యెనే. హారఘుకులేంద్ర రామచంద్రా అని అరాటించెడి సీతరోదనకు ఈ శిలలే నీరైపోవుగదా! నేనేమో అను కొంటిని. రఘురాముని మనస్సెంతటి కటికరాయో. ఈరామామణిని బాసియుప్రాణముతోమనియున్నాడు. ఈ పై తెల్పిన భావములన్నియు బలిజేపల్లి స్వయముగా హనుమత్ పాత్రమూలమున పలికించినది. ఈ మహాకవి కరుణ రసమునుగాని, కరుణ విప్రలంభమును గాని వర్ణించుటలో తన్ను తానే మరచును. అట్టి రసాభినివేశము ప్రతి పాఠకునిలో కలిగించునట్టి రచనా పరిణతి ఈ కవి కావ్యములలో మనకు కన్పట్టును. అంతి అంతి తెలుగు మాటలలో ఎంతటి కఠినమైన మనస్సునైన కరిగింపగల రచనా నైపుణ్యమునీ కవి ప్రదర్శించుట ఆంధ్రులపుణ్యము.

**షోడశ సర్గము**: 32 శ్లోకములలో గల షోడశసర్గము మిగుల సంక్షిప్తముగా 455 వ పద్యము నుండి 464 వ పద్యము వరకు అనువదింపబడినది. తేజస్వీఅయిన హనుమంతుడు సీతను ఆశ్రయించి బాష్పపర్యాకులేక్షణుడై విలపించెను. దుఃఖార్తమైన సీత లక్ష్మణునకు ఎంత మాన్యయో! కాలమెంత దురతిక్రమము. జలదాగమగంధానమ్మైన ఈ దేవి మిగుల శోభించుటలేదు అను భావములు గల శ్లోకములకు తెనిగింపు లేదు. సీతకై రాముడు ఎన్నోవీర్యకార్యములను సాధించునట్లు తెలుపుచు 7 వ శ్లోకమునుండి 14 వశ్లోకమువరకు పలువురు దుష్టులను దునుమాడిన విషయము అభివర్ణితము. ఇది తునియెన్ దోర్బల పంక్తికంధరసబంధున్ దుష్కబంధున్అను పద్యమున దిఙ్మాత్రముగా సూచింపబడినది. సీతయొక్కగుణగణములు 17 వ శ్లోకమునుండి 27 వ శ్లోకము వరకు వర్ణింపబడినవి. రాఘవ లక్ష్మణులచే రక్షింపబడు భూదేవి వలె ఓర్పు కలిగిన సీత వికృతపు చూపులు గల

రాక్షసులచే ఇపుడు వృక్షమూలమున సంరక్షింప బడుచున్నది. అను భావము 27 వ శ్లోకమున వర్ణింపబడినది. అనువదమునపై తెలిపిన భావము లేమియు లేవు. బలిజేపల్లి అంతకుముందు రఘురాముని మనసెంత కటికరాయో బెట్టిదుండే పనికిన్ అని అనుటచే వెంటనే అంతటి పరుషమైన మాట రామునుద్దేశించి పలుకుటయా అని తలచి 455 వ పద్యమున కరుణా పరవశ మతినై పరుషములాడితిని. రామభద్రుని కంటె కరుణా సముద్రుడు ఆపచ్చరణ్యుడు ఇంకొక్కడు గలడే అని పూర్వము తలచిన తప్పిదమును ప్రస్తుత పద్యమున సవరించెను. సీతారాముల తనువులు రెండు దవ్వులయ్యెను. మనములు మిగుల దాపని తెలుపుచు 457 వ పద్యమున శ్రీరామ హృద్వనజంబు బొందని సీత హృదయాబ్జంబందు రామ ప్రభుండు అధ్యాసీనులై ఉన్నారని తెలిపెను. 460 వ పద్యమున మూలమున లేనికాకాసుర ప్రసక్తి కల్పింపబడినది. ఏదో పుణ్యసాధనముచే వారిధిదాటి సీతమ చూడగంటిని. ఆమె సంతత రామ చింతనలో ముక్కున కొన ఊపిరినిల్పుకొని ఉన్నది అని స్వతంత్ర ధోరణిలో రచించెను. మూలమునలేని ఇందలి భావములు అప్పటి సన్నివేశమునకు ఎంతో దీప్తివి కలిగించినవి.

**సప్తదశ సర్గము:** సప్తదశ సర్గము గల 32 శ్లోకములు 465 నుండి 476 వరకు గల పద్యములలో అను వదింపబడినది. ఈ సర్గమందు మొదట సీతాదేవి పరిస్థితిని తెలిపి పిమ్మట ఆమెను చుట్టుముట్టిన వికృతస్వరూపులగు రాక్షసాంగనల వర్ణన చేయబడినది. సర్గాంతమున బలు మగిటిమియును మతిది దివ్య మార్గణ శక్తిని నమ్మి సీతరాముని ఆదృష్టముచే ఇంతవరకు తెగకున్నదను భావము ను హనుమంతుడు తలచినట్లు తెలుపబడినది. ఇది మూలమునకు భిన్నమైన కల్పన. పిమ్మట 18 ద్విపద పాదములలో సీతాదేవి పరిస్థితి ఉపమాలంకార యుతముగా వర్ణింపబడినది. 471 నుండి 475 వరకు గల పద్యములలో వివిధాకృతులు గల రాక్షసాంగనల వర్ణన కలదు. అటుపై 476 వ పద్యమున 14 ద్విపద పాదములలో ఆరాక్షసకాంతలు ఆమెకడ చేయు నానావిధ చేష్టలు వర్ణింపబడినవి. తుట్టతుది రెండు పాదములలో హనుమంతుడు ఇది పరమాశ్చర్య మిదినాదుసుకృత మిదిదైవ సంకల్పిమిది కార్యసిద్ధి అని తెలుపును. మూల మున 30 వ శ్లోకము ప్రహర్షమతులం లేబే మారుతిః ప్రేక్ష్యమైధిలీం అనియు 31 వ శ్లోకమున హర్షజానిచసోఽ శ్రోణి తాందృష్ట్వా మది రేక్షణాం ముమోచ..... చరాఘవం అనియు కలదు అనగా మారుతి ఆనందముగా మైథిలిని చూచి ఆనందముతో కన్నీటిని విడచెను. పిమ్మట రామునుద్దేశించి నమస్కరించెను. అనిపై శ్లోకముల భావము. అనువాదమున మూలమునందలి అభిప్రాయము ఈ సర్గాంతమున లేదు.

**అష్టాదశ సర్గము:** అష్టాదశ సర్గము మూలమున 32 శ్లోకములలో కలదు. వీనికి 477 నుండి 479 వరకు గల పద్యములు అనువాదము. ఈ సర్గమునందు రావణుడు ఉదయముననే లేచి సీతాదేవి మనస్సులో మెదలగా తన పరివారముతో ఆశోకవనమునకు ప్రవేశించినదృశ్యమును హనుమంతుడు చూచినట్లు అభివర్ణింపబడినది. మంగళవాదిత్రములు శ్రోత్రమనోహర శబ్దములతో ప్రతాపదంతుడు, మహాభాగుడు అయిన రాక్షసేంద్రుడు మేల్కాని వైదేహిని చింతించెనన్న భావము మూడు నాల్గు శ్లోకములలో కలదు. రెండవశ్లోకమున షడంగవేదవిదుషాం క్రతుప్రవరయా జనాం శుశ్రావ బ్రహ్మఘోషాంసః అని ఉన్నది. ఇచట 2, 3, 4 శ్లోకములబావము 478 వ పద్యమున అనువదింపబడినది. దీనికి

పాఠాంతరమును కలదు. పాఠాంతరము శార్దూలమున ఉన్నది. దీనినే సీసపద్యమునను బలిజేపల్లి రచించెను. కొక్కొరకో యంచు కోళ్ళు కొన్పులకెక్కి పాటమామికుల హెచ్చరికచేసె అను భావమునకు మూలములేదు. అట్లే గీత పద్యమునగల విషయమును కవి విస్తరించి వ్రాసెను. రావణుడు ఈ ప్రాభాతిక సేవావిధి మేల్కాంచి సీతాసతిపై భావంబు తగిలిన వాడయ్యెను. కామవికృతిని వర్తింపగల వివేకియుయ్యు తప్పని దైవో పహతికి చిక్కెనని బలిజేపల్లి రావణుని హృదయతత్త్వమును సూత్రప్రాయముగా నిట తెలిపెను. ఈ భావము కవి స్వకపోల కల్పితము. మనస్సున తదేక ధ్యానముతో సీతను చింతింపగా ఆమె వచ్చినట్లు తన చెంతనిల్చినట్లు మెల్లమెల్లన సమ్మతించినట్లుఅంతలో పొలయల్క వహించినట్లు భావించి విరాళితో అళీక స్థలి కౌగిలింపబోయి భళ్ళునసెజ్జపై కూలెను. ఇది కవి కల్పితము రావణుని అతి వ్యామో మిందు చక్కగా ప్రదర్శితము. అటుపై అతడు తలయూచి అశోకవనమునకు పయనమయ్యెను. అతడు అలంకరించు కొన్నవిధము 6 నుండి 9 వరకు గల శ్లోకములందు అభివర్ణితము. అటుపై అతనిని అనేకులు అనుసరించిరి. అప్సరోంగనలు, నాగకన్యలు, యక్షకామినులు, గరుడ కాంతలు అతనికి పరిచర్యలు చేయగా అశోకవనమునకు నడచెను. ఉపవనద్వారపాలకులు ఎదురు కోలిడగా లంకేశ్వరుడు మెల్లమెల్లగా నడచెను. 493 వ పద్యము యొక్క అంతము ఆలంకేశువిన్నాణము పులులన్ మేకల నొక్కతావున జలంబుల్ గ్రోల్చు తార్కాణముల్ అని లక్ష్మీకాంతకవి తెలిపెను. రాక్షసులు దేవతలగీతికి తాండవము చేసిన సందర్భము పులులు మేకలు కలిసినట్లున్నదని కవి కల్పించుట ప్రశంసార్హము. కాంతాపరివృతుడై వచ్చు రాక్షసేశ్వరుని ఆంజనేయుడు చూచి ఆవులమందలో వృషభమువలె, చుక్కలగుంపులో తారా విటుని వలె బహు పురంధ్రుల మధ్య మెలగు చున్నాడని తలచెను. 26,27 శ్లోకములలో ఈ విషయము సూచనామాత్రము అపేక్ష్య మాణస్తు తథాదదర్శకపి కుంజరాః రీపయౌదవ సంపన్న రావణ్యస్యవరస్త్రియః అని మూలము. కాని అనువాద కర్త కొన్ని ఉపమలతో ఈ భావమును మరికొంత సుందర తరమొనరించెను. 31 వ శ్లోకమున సోయమేవ పురాసేత పురమధ్యే గృహోత్తమే అని తలచినట్లున్నది. కాని దీనిని లక్ష్మీకాంతకవి కొంత విస్తరించి మత్తేభవృత్తమున ఇతడౌవైశ్రవసుండు రావణుడహో ఈ వీరతేజోబలాకృతిచందాంశుని భంగిదుస్సహము దుష్ప్రేక్ష్యంబిసీ, కామవంచితుడైకాలము తీరగా జనకవచ్చెన్ రాము దేవేరినేగతివర్తించునో చూతుగాక తరుశాఖాపల్లవాంతర్గసై అని వివరించెను. ఈ పద్యమున సగము వరకు రావణుని ఆధిక్యము, ఆతని తృణీకారభావముతో అతడు కామవంచితుడై కాలము తీరుటకై సీతాదేవిని చెరపట్టినని నిర్ధారించెను. అట్లు నిర్ధారించి తాను ఆతని పోకడలను చూచుచు ఒకతరుశాఖ యందు దాగెను. అతడుతరుశాఖ యందు దాగిన విషయము పత్రే గుహ్యాంతరే సక్తః మతిమాన్ సంవృతో భవత్ అను పాదమున తెలుపబడినది.

19 వ సర్గమునగల శ్లోకములు 22 అనువాదమున 500 నుండి 509 వరకు గల పద్యములలో అభివర్ణింపబడినవి. రావణుని చూచి దుఃఖము, భయము, చింతముప్పిరిగొన్న సీతాదేవియొక్క అవస్థ ఇందు వర్ణితమైనది. రూపయౌవనసంపన్నుడు, భూషణోత్తమ భూషితుడు, రాక్షసాధిపుడునగు రావణుని అనిందిత, రాజపుత్రియగు వైదేహి చూచినను 112 శ్లోకమునందలి భావమును బలిజేపల్లి 499 వ పద్యము నందే సీత గనుంగొనియె గుండెల వియగరక్కసునిన్ అను వాక్యమున క్లుప్తముగా తెలిపెను. ప్రస్తుతము

రెండు, మూడు శ్లోకముల భావమును మరికొంతవిస్తరించి చంపకమాలావృత్తము రచింపబడినది. ప్రావేపతకు రారోహప్రవాళైక దళీయథా ఊరుభ్యాం ఉదరం చాద్య బాహుభ్యాం చ పయోధరౌ అను శ్లోకముల భావము సుడిగాలి తాకునన్ గదలివలె వడకుచున్ తనబాహులతో సురస్థలిన్ బొదులుచు నూరు యుగ్మమున బొక్కున బొక్కిలి మాటుచు అని అనువదించెను. పయోధరములకు మారు ఉరస్థలి ఉదరమునకు మారు పొక్కిలి ప్రయోగింపబడినవి. ఇక తక్కిన పద్యమంతయు కవి కల్పితమే. ఆ పద్య ప్రారంభమున దెదరి భయాకులత్వ పరివేదనతో అని ఉన్నది. పద్యాంతమున ఇట్టి భంగపాటొదవియు చావనైతినని హోరున రాల్గర గంగ నేడ్చుచు నున్నట్లు అభివర్ణింపబడినది. నాల్గవ శ్లోకమునుండి 22వ శ్లోకమువరకు గల భావములకు అనువాదమునకు సంబంధమున్నట్లు కానరాదు దదర్శ దీనాంతు దుఃఖార్తామ్ నావం సన్నామివార్ణవే ఈ భావము నడి సంద్రంబున నవి సెడు పడవగతిన్ దిక్కుమాలి అని 505 వ పద్యమున అనుసరింపబడినది. బలిజేపల్లి ఆపద్యమునకు అనుబంధముగ పతి సగతుఆ చేయబడిన నిరాధార స్థితి చెడి చెదిరిన సేన భంగి శిథిలాశయయ్యైఅని ప్రయోగించెను. ఇందలి ఉపమానము కవి భావనా సముద్రము నుండి ఉద్భవించిన భావ చంద్రోదయము. 9వ శ్లోకమున ధూప్యమానాం గ్రహేణేవరోహిణీం ధూమకేతునా అని ఉన్నది. ఇది 502వ పద్యమున ధూమకేతు గ్రహోద్ధూప ధూపమాన రోహిణీ తారకైవడి రూపుమాసి అని ఆంధ్రీకరింపబడినది. ఇచట చెప్పిన ఉపమానము మరియొక్క ఉపమానమును కవిస్వయముగా కల్పించి గ్రీష్మ సమయాతపమున వర్వేణి కరణి మిగుల శుష్కరించి పోయిన మేనితోడ సీత యున్నట్లు తెలిపెను. ఇంతేగాక కవి మరికొన్ని ఉపమానములను కల్పించెను. అవి మణిమంత్రంబుల జిక్కిన ఫణి ఫణితి మైల సోక నణగారు మఖాగ్నిలీల, భగ్నమై చితికిన సంపద అనునవి. 506 వ పద్యమున ఏదేవుడైన నన్ని పుడాదుకొనన్ రాడునాదెసనాపతి చెవిలో నూనిన రాకున్నె వీని యుసురార్చుటకై అని తలచిరి. ఈ పద్యమున జానకి యొక్క ఆవేదన, ఆక్రోశము, అసహాయస్థితి స్థితిని 508 పద్యమున బలిజేపల్లి కేవలము క్రియాపదముల కూర్పుతో వివరించెను. ఆ పద్య ప్రారంభము తలపుచు తత్తరంపడుచు తల్లడమందుచు తలటిల్లుచు కలగుచు కంపమొందుచు కకావిక లందుచు, సమ్మతించుచు ననునవి. ప్రలోభయామాసవధాయరావణః అనునది ప్రస్తుత సర్గమునందలితుది వాక్యము. దీనికి మోహదోహలమతి యేద్వగనిడవధార్థమ్ము రావణుడు అని అనువాదము.

**ఇరువదవ సర్గము :** ఇరువదవ సర్గము నందలి మొదటి శ్లోక భావమును బలిజేపల్లి 509 వ పద్యమున అనుసరించెను. మూలమున ఇరువదవ సర్గమునందు 36 శ్లోకములు గలవు. అనువాదకర్త 511 నుండి 533 వరకు గల పద్యములలో ఇరువదవ సర్గమునందలి శ్లోకముల భావమును అనుసరించెను. మాంద్రుష్ట్వానాగనాసోరు గూహమానస్తనోదరమ్ అను భావము ఇంత దాచికొననేలభీతిమ్మై నీ కుచోదర సౌందర్యము దృష్టి దాకునని చింతన్ గాదు గదా అని అనువదించెను. బలిజేపల్లి ఈ సర్గమందును యథాతథపరివర్తనము గావింపక అందందు అతి ముఖ్యములైన కొన్ని శ్లోకముల భావమును మాత్రమే అనుసరించి తక్కిన విషయము నెంతో స్వతంత్ర పద్ధతిలో రచించెను. 511 వ పద్యమున గగన సుమమైన కైమసంబగును గాని కైవసంబేరికౌను నీ కౌనుదీవ అణువు కంటె నణీయసంబదియు కేలదాచికొనెదు

అని పూర్వపద్యమునకు అనుబంధమగునట్లు స్వతంత్రించి ప్రస్తుత కల్పనము గావించెను. నీవు భువన మోహన సౌందర్యమూర్తివి. నాకు ప్రేయసివి. నన్ను పరిగ్రహించి ఏలి కొనుమన్న 512 వపద్యము నందలి భావమును బలిజేపల్లి కల్పించినదే. మూలమునందు 16 వ శ్లోకము ధవమైథిలీ భార్యామి మామాగ్రమహిషీభవ అని ఉన్నది. ఇది పరిగ్రహించి ఏలి కొనుము హృదీశ్వరీపై అను వాక్యమున సూచనమాత్రముగ అనూదితము రావణుడు సీతతో నీ అనురాగ లబ్ధికై ప్రాణమే కుదువబెట్టితి. పరదారాభిగమనంబధర్మమని వాదింతువా నేను రాక్షసేశ్వరుడను. మాజాతికి పరాంగనాపహరణాచారము. వరధర్మము. స్వధర్మమందు మృతమైనను శ్రేయమే నీ పరమాంగీకృతి లేనిదే బల్మినిన్ను వభిచరింపరాదు. మనస్సులు చేరని పొందు సుఖము చేటేకదా ఇందలి భావములు మూలమున సూత్రప్రాయముగనున్నవి. బలిజేపల్లి ఆ భావములను విస్తరించి ఉచితరీతివర్ణించెను. 13,14 వ శ్లోకము లందు గల బావము 516 వ పద్యమున నలువ తనశిల్పకల్పనానైపుణ్యంబునెల్ల నీ యందె వెచ్చించెనేమొ. మఱల నిన్ను బోలిన యన్నులమిన్ననొకతెనేని సృజియింపగా నేరడింతదనుక అని అనువదించెను. త్వాంకృత్వోపరతో మన్యేరూపకర్తాసవిశ్వకృత్ అనుశ్లోక భావమునే కవి తనకు ఇచ్చ వచ్చిన పద్ధతిలో తేట గీతి యందు తేట తెల్లమొనర్చెను. 11 వ శ్లోకమున యౌవనము పయః ప్రవాహముతో పోల్ప బడిన వాక్యమున్నది. యదతీతం పునర్నైతి శ్రోత శ్శ్రోతసివనామివ అనునది ఆవాక్యము. దీనికి 519 వ పద్యము తుదిలో వడి చెందవచ్చునే అని అనువాదము ఇది ఎంతో సుందరతరము. అన్నువ ప్రాయమేమి సతమాకడ చన్నది. నిన్ననేడు రమ్మనను వచ్చునా అను భావమునకిది ప్రోద్బలకము. సకల దేవకాంతలను సీతకు సపర్యలు చేయుటకు నియమింతునని తెలిపిన విషయము సీసమున వర్ణితము. విజిత్యపృథివీ సర్వాం నానానగరమాలి నీం జనకాయ ప్రదాస్యామి అను 18 వ శ్లోకము నందలి భావము ఏకచ్ఛత్రముగాగ నీ జనకుచే నేలింతు పాథోధి వేలాకూలంకషమైన ఈ పృథివి ఎల్లన్ నీకునై అను పద్యమున ఆంధ్రీ కరింపబడినది. 16 వ శ్లోకము నిక్షిప్త విజయోరామః గత శ్రీర్విజయవన గోచరఃవ్రతస్థండిల శాయీశ శంకే జీవితవానవా అనునది. 17 వ శ్లోకము, 34 వశ్లోకము నందును రాముని ప్రసక్తి ఉన్నది. 17 వ శ్లోకమున రావణుడు తన ఆధిక్యమును తెలుపుచున్నచక్కని ఉపమానము పురోబలాకైరసితైః మేఘైఃజ్యోత్స్నరివావృతామ్ అను వాక్యమున పేర్కొనబడినది. *కొంగల సంచారముగ నల్లమబ్బులచే క్రమ్మ బడిన వెన్నెలను బోలె నాయధీనత యందున్న నిన్నురాముడు చూడనైనను జాలడు అని ఈ శ్లోకము యొక్క భావము. ఇది అనువాదమునలేదు. 529 నుండి 531 వరకు రాముని ప్రసక్తి ఉన్నది. ఈ మూడు పద్యములు కవిసందర్భానుసారముగ ఎంతో ఔచిత్యముతో కూర్చినది. ఎక్కడి రాముడు రాజ్యము దక్కగొనన్ లేక దీనతన్ కానలలో చిక్కువడి కాయగసురల కక్కుర్తి తో బ్రతుకుచున్నాడు. అట్టి పేదకై వగపేల నన్ను నాప్రాభవమును నా ప్రతాపమును జూడుము. ఆబైసిచెడిన పెనిమిటి కొరకై ఏమి సుఖమని పెనగెదవు. తమ్ముడు, తాను కానలలో జీవములు బాసి ఉండును. అథవా మనియున్న ఈ సముద్రము తరింపనోపరు. ఒకవేళ ఓపినను నన్ను గెల్వనోపరు. ఇక అడియాసలేల అని తెలిపెను. ఇది పూర్తిగా మూలమున లేనిది. 35 వ శ్లోకము పిబవిహార రమస్య భుంక్ష్వభోగాన్ అనునది. దీనికి ఇంపుమెయిన్ భుజింపు యధేచ్ఛ.......నాస్వాదింమను అను పద్యము అనువాదము. 533 వ పద్యమునకు 36 వ శ్లోకమున తుది వాక్యము విహర మయాసహ భీరుకాననాని అనునది. రమింతము రమ్ముపూలదోటకున్ అని ఏతద్వాక్యమునకు అనువాదము.

**ఇరువది ఒకటవ సర్గము :** అనంతరము 21 వ సర్గమునందు గల 34 శ్లోకముల భావము 534 నుండి 560 వరకు గల పద్యములలో అనుసరింపబడినది. సీతను రావణుడు ఆడిన మాటలకు మిగులశోకించి జానకి ఒసగిన సమాధానమే ఈ సర్గము నందలి ఇతి వృత్తము. మూడవ శ్లోకమున **తృణమంతరతః కృత్వా ప్రత్యువాచ శుచి స్మితా** అని ఉన్నది. ఇందలి **శుచిస్మితా** అను ప్రయోగమునకు 534 వచనము యొక్క అంతమున **వెడవెడనిదరహాసంబును దోడు కొన** అనునది అనువాదము. 535 వ పద్యముతుదిలో **అంతరంబున తృణఖండమునాని పెడమోమున జానకి వానికిట్లనన్** అనునది. **తృణమంతరతఃకృత్వా** అనుదానికి అనువాదము. ఇట్లు ఒక పాదమున గల ప్రయోగములే విడివిడిగ అచ్చటచ్చట అను సంధానపూర్వకముగా అనూదితములైనవి. **కులంసంప్రాప్తయా పుణ్యం కులే మహతి జాతయా** దీనికి **పుట్టితి సత్కులమున చేపట్టితిపురుషోత్తమున్** అను నది అనువాదము. **ఆత్మానముపమాం కృత్వా స్వేషుదారేషురమ్యతాం** అను శ్లోకభావము. **నీకాంతలే నినుగాక అన్యపురుషున్ వీక్షింనేరాని యట్లా కాంక్షితువె** అని అనుసరింపబడినది. 540, 541 పద్యములలో సీత మిగుల కోపించి ఇంద్రియ చాపల్యముతో పరనారీలోలుడైన దుర్నయుడు **బలవన్మరణము కాక తప్పదు. ఓరీ! తులువా! ధర్మజ్ఞులు నీకు బుద్ధులు తెలుపలేదా లేక నిన్ను కతఘ్నుడుని వర్జించిరా? దుష్టుల నీడ శిష్ట జన బంధులు నిల్తురా? కొల్తురా** అని తీవ్రముగా మందలించినది. 11,12 శ్లోకముల భావము 542 వ పద్యములో ప్రకటితము **అకృతాత్ముండగు భూమి పాలకుని యత్యాచారమే వాని కొంపకుచేటై..... తద్రాజ్యమంతకును చేటగును. దివ్యరత్న కదంబాంకకు నీదు లంకకు నీ యొకని చేతనే చేటగునని** సీత తెల్పెను. వాక్యములు మూల భావమును మెరుగులు దిద్దుచున్నది. [20] **వాని కొంపకు చేటై** అన్న ప్రయోగము తెలుగు పలుకు బడిలో ఎంత తీవ్రమైన మాటనైనను మనస్సునకు బాకు వలె తాకునట్లు ప్రకటింపవచ్చునని తెల్పుచున్నది. 18 వ శ్లోకమున **సాధురావణ రామేణ మాంసమానయ దుఃఖితామ్ వనే వాసితయా సార్థమ్ కరేణ్వేవగ జాధిపమ్** అని కలదు. దీనిని చక్కని ఆటవెలది పద్యములో **ఆడవినొంటి జిక్కి యల్లాడు నేనుంగు పడ తినని పెయూథపతిని జేర్పుపగిది నన్ను నాదు పతి కప్పగింపుమీ తెఱవునీకు బ్రతుకు దెరువు వినుము** అని బలిజేపల్లి అనువదించిరి. ఇందలి తుదిపాదము రావణునికి హెచ్చరికగా కవి కల్పించిన హితోపదేశము. ఇచ్చట గజాధిపం అనుదానికి యూథపతి అని ఆంధ్రీకరణము. రాముని శరణుజొచ్చుమని తెలుపుచు 19 నుండి 27 వరకు గల శ్లోకముల భావము, బలిజేపల్లి 550 వరకు గల పద్యములలో వివరించెను. పిమ్మట రామలక్ష్మణుల భుజబలము 556 నుండి 558 వరకు గల పద్యములలో ప్రకటితమైనది. ఈ పద్యములకు మూలము సూచన ప్రాయము **తెక్కలిపై తెరచినయిలు కుక్కవలెన్ జొచ్చి నాచి కొన్నను నీకున్ దుక్కుదునే** అనునది కవి కల్పితము. ఇట రావణుని కుక్కతో పోల్చి నిందించుట గమనార్హము. 31 వ శ్లోకమున **శక్యం సందర్శనే స్థాతుంశునా శార్దూలమోరివ** అనుదానికి **వేపపులులెదుట ఉండజాలునట్లు రామ లక్ష్మణులను బొడగాంచినీవుండ జాలవని** హెచ్చరించినది. 555 వ పద్యమున **పులిగాలి వాఱు పడగ మెలంగునే శునక మొకనిమేషము** అని కలదు. శార్దూలమోః అని మూలమున రామలక్ష్మణుల ప్రసక్తి ఉండగా ఇచ్చట పులి అని ఏకవచనమున మాత్రమే రామపరముగా ప్రయుక్తమైనది. 28 వ శ్లోకమున **అనురేభ్యః శ్రియం దీప్తాంవిష్ణుః త్రిభిరివక్రమైః** అనుపాదముకలదు. దీనిని

559 వ పద్యమగు ఉత్పలమాలావృత్తమున తొలిత్రివిక్రమ స్ఫురణతో బలిదానవు నుక్కడంచి యా బల్లిదు చేత జిక్కిన దివస్పతి రాజ్యమున్ రమాంగనా వల్ల భుడాదటన్ గొనిన భంగి అని అనువదింపబడినది. 34 వ శ్లోకమువందలి భావము 560 వ పద్యమగు శార్దూలమునందు అనువదింపబడినది. *కాలహతమైన క్రౌంచమూకు పిడుగు నుండి తప్పించుకొన జాలనట్లు నీవు పై లోకములకు పోయినను, పాతాళములకు పోయినను తప్పించుకొన జాలనట్లు దశరథ పుత్రుడైన రాముని బారినుండి తప్పించుకొనజాలవు అని 34 వ శ్లోకము యొక్క భావము. ఆ శ్లోకమిది గిరింకుబేరస్యగతో ధవాలయం సభాంగతేవా వరుణస్య రాజ్ఞః అసంశయం దాశరథేర్విమోక్ష్యసే మహాద్రుమః కాలహతే శనేరివ దివికికైలాసంబున కేగి శంకరుని వంకన్ దాగినన్ బారి పాతాళంపున్ గవిదూరినన్ జలధిమధ్యం జొచ్చినన్.......దురవున్ దహించుగతికిన్ బూర్ణాహుతిన్ జేయరే అని అనువాదము. కుబేరుని యొక్క గిరి అనగా కైలాస గిరి. కావుననే అనువాదము కైలాసంబు నకేగి అని శార్దూలవృత్తపు ఎత్తుగడలో ఆరంభమైనది. మహాద్రుమః కాలహతో శనేరివ అను వాక్యమునందలి అశనిః శబ్దమునకు అమరమ్మదాఘాతమని ఆంధ్రీకరణ మహాద్రుమమునకు మూలంబున్ దరువున్ అని అనువాదము కాలహతః అనుటకు దహించుగతి అని భాషాంతరీకరణము.

**ఇరువది రెండవ సర్గము** : 46 శ్లోకములు గల 22వ సర్గము 561 నుండి 592 వరకు గల పద్య గద్యములలో అనువదింపబడినది.. సీతాదేవి తన్నుమిగుల తెగనాడి నందులకు రావణుడు కోపించి గర్జించుచు కొందరు రాక్షసస్త్రీలను ఆమె మనస్సును మరల్చుడని నియోగించి మరల అంతః పురమునకు వెడలి పోయిన వృత్తాంతము ఈ సర్గమువందు ప్రతి పాదితము. 562 వ పద్యములో తేటగీతియందు రావణుని ఓరగన్నుల కెంపాలుకోరగింపు సెలవిమోరనౌయారంపు చిలిపినగవుకలికి తనము, వలపు గరువ తనము తొడిబడినట్లు నుడువబడినది. ఇది పూర్తిగా మూలమునకు భిన్నము. రెండవ శ్లోకములోని భావము 563 వ పద్యమున అనువదింపబడినది. యథాయథాసాంత్వయితావశ్యః స్త్రీణాం తథాతథా యథాయథా ప్రియంవక్తా పరిభూతః స్తథాతథా అని మూలము. ఎంతెంతగా ఓదార్చునో అంతంతగా స్త్రీలకు వశ్యుడు ఎంతెంతగా ప్రియమును పల్కునో అంతంతగా తిరస్కృతుడు లేక పరిభూతుడు అని ఈ శ్లోకము యొక్క భావము బతిమాలు కొలంది వెలంది పూరుషున్ దేలిక జేసిలో గొనును పదింబదినెంతగ బుజ్జగించిన పరాభవించి యుడికించుట సరిపాటి అని అనువదింపబడినది. తరువాతి శ్లోకమున గల మొదటి రెండు పాదములలో అనూదితము 566 వ పద్యమునకు ద్రవతే మార్గమా సాధ్య హయానివ సుసారథిః అనునది మూలము. 564 పద్యమున గల ఇందలి భావము ఒక విధముగ అనుసరణమనుట కంటె స్వతంత్ర కల్పన మనుట సమంజసము. ఆ మూడవ శ్లోకమునందలి మొత్తము భావము 566 వ పద్యముననే ప్రకటితము. పెడత్రోవబట్టు తురగమువడి సెటగల రౌతు దిగిచి పట్టినగతి సీతయెడలగల కామావేశము నడంచు చున్నది. మదాగ్రావేశంబు అని ఎంతో సుందర తరములకు పదబంధములతో కూర్చబడినది. తురగము కామావేశము మదగ్రావేశము అను మూడు తత్సమ పదములు తప్ప తక్కిన పద్యమంతయు అచ్చ తెలుగు పదములతో కూర్చబడినది. రెండవ పాదము ఎక్కడికక్కడ లాగి పట్టినట్లుగ విడివిడి పదములతో వడి సురిగిన సరణిలో రచింపబడినది. 565 వ పద్యమున కక్కసమున సీవాడిన

ఒక్కొక్క పరుసంపు మాటకు ఒక్కొక్క కండన్ జెక్కించి కాకులకు, శవ భుక్కులకు బలియెడగ బోవలదే అను భావము సన్నివేశ సముచితముగా కవి కల్పించినది. ఇట్లే కరుణకునైన గొండొక పరిమితి గలదె అను పద్యము స్వకపోలకల్పితము. వధార్హవు, అవమానార్హవు అయిన నిన్ను చంపక విడిచి పెట్టుటకు నీయెడ నాకు కలిగిన కామమే కారణము. అని 4, 5, 6 శ్లోకములలో తెలుపబడినది. ఇది 5 6 7 వ పద్యమున కామ మెంతటి వికారంబేని సైరింపు వధార్హన్నీయెడన్ బ్రేముడిన్ వధియింపకకాచితినని తెలుపబడినది. 8 వ శ్లోకము ద్వౌమాసౌ రక్షితవ్యౌ కుమోవధిస్తే మయాకృత్తః అను పాదము ఇది మాస ద్వితియంబు నీకు గడువిచ్చి అను పద్యపాదమున అనూదితము. అనంతరము ఆ పద్యమున బోనకాండ్రు కడికండల్ గోసి వండించి సూడిద వడ్డింతురు నాకు నీ కరకు గుండెన్ భ్రాతరాశార్థమై అను విస్తరణ కవి స్వతంత్రకల్పన అపుడు దేవ గంధర్వ కన్యలు సీతను కన్నుసన్నలతో భ్రూభంగికలతో కరాంతచాలనంబులతో, అధర విస్పందనములతో ఓదార్చిరి. ఆ విషయము దేవ గంధర్వ కన్యాస్తా ఓష్ఠప్రకారైరపర నేత్రైవక్త్రై స్తదాపరా సీతా మాస్వాదయా మాసుః అను మూల ప్రయోగములో కలదు. అట్లు ఊరడింపబడిన సీత అతనితో సగర్వముగా కొన్నిమాటలనినది. ఇట 1 4, 1 5 శ్లోకముల భావము మరికొంత విస్తరింపబడి మత్తేభ వృత్తమున కూర్పబడినది. 1 6 వ శ్లోకమునగల యథాదృక్తశ్చమాతంగః శశశ్చసహితౌవనే అను భావము ఒక కుందేలు మదావళము నెదిరి ఈల్గుటగాదే మూలమున ఈ భావమే మరికొంత విశదీకరింపబడుటకై తదాద్విరదవత్ రామః త్వం నీచ శశవత్ నీచః అని ఉన్నది. 2 2 వ శ్లోకము శూరేణ ధనదభ్రాత్రా బలైః సముదితే నవఅపోహ్యరామన్ తస్మాశ్చిత్ దారచౌర్యం వయాకృతం అను శ్లోకభావము 5 7 8 వ పద్యములో యక్షేశ్వరుతమ్ముడని అక్షీణ పరాక్రముండనని గర్వింతె అని అనూదితము. సీతమాటవిని ఉగ్రుడై రావణుడుచూచిన చూపు 2 4 వ శ్లోకమున గలదు. ఇది 5 8 2 లో వచనమున వివరింపబడినది.[21] 3 0 వ శ్లోకము నందు కోపసంరక్తలోచనః భుజంగలువ నిశ్వసన్ అను ప్రయోగమును ఆధారముగా గొని బలిజేపల్లి 5 8 3 వ పద్యమగు శార్దూలమునప్రౌఢప్రాబంధిక శయ్యాసౌభాగ్యముతో శార్దూలము వంటి రాక్షసునిక్రూరత్వమును స్ఫురణకు దెచ్చుపద్ధతిలో రచనసాగించెను. కోపసంరక్తలోచనః అనుటకు ఘోరక్రోధ విఘూర్ణన స్ఫురిత చక్షుర్గోళముల్ వైద్యుతాంగారంబుల్ గురియన్ అని ఆలంకారికమైన శైలితో సమాస భూయస్త్వమగు గాంభీర్యమును కల్గించెను. భుజంగమువలె నిశ్వసించుచు అను భావమునకు హుంకారాకృతి రోజుమున్ జలదుదగ్రవ్యాళ జిహ్వా విషస్మేరక్రూరగతిన్ అని రౌద్రాకృతి కనుగుణముగా రచనా గాంభీర్యమును ప్రదర్శించెను. ఈ పద్యము తదిలో చిరాలున కరాసిన్ దూసి అని ఉన్నది. అటుపై శార్దూలవృత్తమునందు నాశయామ్యహమద్యత్వాం సూర్యః సంధ్యారాగముంబోలె బాహాసిన్ నిన్నుదెగటార్తు అను ప్రయోగమున అనుసరింపబడినది. ఇట్లు పటురంహస్సింహ సంరంభణోల్లాసుడై రఘురాముదేవి పయికిన్ లంఘించు లంకేశ్వరుని గాంచి హనుమంతుడు ఓహో శ్రుతి మించి రాగమున బడెనని ఉగ్రక్రోధసంరంభియై ఇదే దనుజుని చంపెదనని చెట్టునుండి క్రిందికి దిగజూచెను. ఆ సందర్భమున ఆలంకాధీశ్వరుని ఇల్లాండ్రలో ఒకతె అయిన ధ్యానమాలిని అతని చెయివట్టి యిది యేమి తెగువ ఇంతవెట్టి మరులేల నీకు కల్గెను. కామము లేని వెంగలి దాని పొందు కాముకుని ఆయువు కడతేర్చునందురు. అని నయ ప్రియలాలన చాలనోక్తులతో అతనిని చల్లబరచి అంతః పురము వైపునకు మరల్చినది. ఇచ్చట మూలమున

మధ్యలో హనుమంతుని ప్రసక్తి లేదు అంతేగాక 33 నుండి 37 వరకు గల శ్లోకములలో వివిధకృతులుకల రాక్షసాంగనల వర్ణన కలదు. దీనిన బలిజేపల్లి వదలివేసెను. ధ్యానమాలిని సీతాదేవిని బెదిరించు దశకంఠుని కౌగిలించుకొని నాతో రమింపుము. ఇది కాంతిలేనిది పిరికిది. దీనితో రమంచిన నీకేమి సుఖము కలుగును. కామము లేని దానిని కామించు వాని శరీరమునకు మంటలు పుట్టును. వలపు గల వనితతో క్రీడించిన ఆనందము కలుగునని తెలిపి ఆవలికి ఈడ్చినది. ధాన్య మాలిని చెప్పిన మాటలు ఇరువది ద్విపద పాదములలో కలవు. 46 వ శ్లోకము తుదిలో **విహాయ సీతాంమదనేన మోహితః స్వమేవ వేశ్మ ప్రవివేశరావణః** అని ఉన్నది. అనువాదము చిరత్నరత్న ప్రభాభాసురమై తరుణార్క సముజ్జ్వలమగు అంతఃపురము ప్రవేశించెనని వచనమున తెలుపబడినది. 44 వ శ్లోకములో జ్వలద్భాస్కరసంకాశం అను విశేషణము అతని అంతఃపురమునకు ప్రయుక్తము.

**ఇరువది మూడవ సర్గము** : అనంతరము 23 వ సర్గమున 19 శ్లోకముల ఇతివృత్తము అనువాదమున 593 నుండి 617 వరకు గల పద్య గద్యములలో అనువదింపబడినది. [22]ఈ సర్గమునందు రాక్షస స్త్రీలు సీతను బెదరించు విషయము వర్ణితము. అనువాదము ప్రారంభమునందు మూడు కందములలో రాక్షస కాంతలు సీత చుట్టుచేరి పరుషవచనములతో బెదిరించుచు, కేరుచు, మారుచు లంకేశ్వరుని ప్రియ భర్తగా వరింపుమని తెలిపిరి. ఈ మూడు పద్యములను కవి కల్పితమును చెప్పినది. 5 నుండి 8 వరకు గల శ్లోకములలో గలఈ భావము 596 నుండి 598 వరకు గల గద్య పద్యములలో వివరింపబడినది. అటుపై హరిజట అను రాక్షసి పిల్లి కన్నులు త్రిప్పుచు ఓసీ! ఇంత కావరమా! రావణుండనినెవడను కొంటివి. అట్టి మేల్ మగని కంటె మగవాడెవడె అని పలికినది. 9,10,11 శ్లోకములలో గల ఈ భావము 599, 600 పద్యములలో స్వేచ్ఛగ అనూదితము. అటుపై ప్రఘస అను రాక్షసి మాటలు 602,603 పద్యములలో గలవు. 12,13 శ్లోకములు దీనికి మూలము. పిమ్మట వికట, దుర్ముఖి అను రాక్షస స్త్రీలు రావణుని పరాక్రమాది గుణములు ఉగ్గడించిరి 14,15 శ్లోకములలో గల భావము సీసపద్యమున అభివర్ణితము. దుర్ముఖి రావణుని వైభవమును తెల్పుచు ఎంతవలయునంతెగాని మిగులంగనిమడెండగాయుడెఱుము తరువులు కూడ కోరినపుడె క్రొవ్విరితేనె వాన కురియును. వాయు భట్టారకుడును ఛేటికాపాణి తలముల జిక్కి చామరాకృతిని వహించి మెల్లమెల్లన వీచును అనెను. **భీతోయస్యసమారుతః నవాతి స్మాయతాపాంగీ** అని వాయు ప్రసక్తి మూలమున గలదు. దీనిని అనువాదకర్త విస్తరించి వర్ణించెను. లంకేశుని కామింపుము బిగియించి బ్రతుకలేవిట క్షణము అనునది. 608వ పద్యము. ఇది ఈ సర్గాంతమునగల **గృహాణ సుస్మితే వాక్యం అన్యథాన భవిష్యసి** అను వాక్యమునకు అనువాదము. 609 నుండి 617 వరకు గల విషయమంతయు **దివ్య మంగళ కళాలలితాంగుడైన నీవు హీనుడు, రాజ్యభ్రష్టుడు, దీనుడు, కొఱమాలిన వాడునగు మగని విడిచి రసికుడు, ప్రియంవదుడు, రూపసి, త్యాగి, మహాభోగినగు దానవేంద్రుని గ్రహింపుమని** వివిధ విధముల తెలిపినట్లు వర్ణింపబడినది.

**ఇరువది నాల్గవ సర్గము** : ఇరువది నాల్గవ సర్గమునగల 47 శ్లోకముల **భావము** 618 నుండి 636 వరకు గల పద్యములలో రాక్షస కాంతలు సీతను బెదిరించిన విషయము అభివర్ణింపబడినది. ఇట మొదటి 5 శ్లోకములలో రామునికి, రావణునకు గల

వ్యత్యాసమును రాక్షస కాంతలు వర్ణించినట్లున్నది. 6 వ శ్లోకమున సీత రాక్షసకాంతలాడిన మాటలకు కన్నీరుకార్చుచు పలికిన పలుకులు కలవు. బలిజేపల్లి పూర్వసర్గముననే రామునికి, రావణునకు గల వ్యత్యాసమును రాక్షస కాంతలు చెప్పినట్లు వివరించెను. అది కొంత స్వతంత్ర రచన. ప్రస్తుత సర్గము యొక్క ప్రారంభమందలి విషయమునే అది తెలుపుచున్నది. ఇప్పుట సీత క్రూరు ని శాటి పటలముట్టికొన నాక్రందించుచు భయసముత్కంపాను కంపాకృతితో కొందలమున కందామరలు అశ్రుధారలొలుకగా ఇట్లనిన దని మత్తేభ వృత్తముతో 24 వ సర్గమును ప్రారంభించెను. నేత్రాభ్యాం అశ్రు పూర్ణాభ్యాం ఇదవచన మబ్రవీత్ అని 6 వ శ్లోకమునందలి తుదిపాదము. సీత రాక్షసకాంతలతో తెల్పిన విషయము 7 వ శ్లోకమునుండి 12 వ శ్లోకము వరకు గలదు. అనువాదమున మూలమునందలి విషయమే కొంత ముందువెనుకలుగ 619 నుండి 621 వరకు గల పద్యములలో వివరింపబడినది. నమానుషీరాక్షసస్య భార్యా భవితుమర్హతి కామంఖాదతమాం సర్వాః అను 8 వ శ్లోకమునందలి భావము ఔచిత్యంబగు నేవరించుట మనుష్య స్త్రీమను ష్యాదుననియు ఏచావైనను అత్తుగా కొరుసక్తై ఇమ్మని వెచ్చింతునే అని తెలుపబడినది. అటుపై సీసమున సూర్య చంద్రాదులు, ప్రసిద్ధమహర్షులు, ప్రసిద్ధ రాజర్షులు వారి వారి సతీమణులను గూర్చి సీతాదేవి పేర్కొని ఎట్టి దశనైన శ్రీరాముడేవిభుండు గరుడు దైవంబు జీవితేశ్వరుండు నాకు అని నిర్ధారించినది. పిమ్మట 621 వ పద్యము అంతకముందు విషయమునే మరికొంత విస్పష్టముగా వించినది. ఇట చంపుడు నొంపుడు నరకుడు రంపాలంబెట్టి కఱకఱన్ గ్రోయుడు మీఱంపులకు పెఱచి విడను నిలింపులువేడిననునే జలింపను సుండీ అని రాముని పై తానునిలిపిన తలంపును చలింపనీయనని తెలిపినది. ప్రస్తుత పద్యమున నిలింపులు వేడినను నే చలింపను సుండీ అని తెలుపుట ఆమె దీక్షయందు గల తీక్ష్ణతను నిరూపించు చున్నది. ''ఈ పద్యమున బిందు పూర్వకమగు పకార ప్రాసయందు రాక్షసకాంతలు తన్ను ప్రాసల వంటి పరుష వాక్కులతో పొడిచిపొడిచి నొప్పించిన విధము ధ్వనితము. కఱకఱ, ఱంపాల నఱకుడు, ఱంపులు, పెఱచి మొదలగు వానిలోని అలఘురకారము అనగా శకటరేఫము రాక్షసకాంతల కఠిన ప్రవృత్తిని నొక్కివక్కాణించుచున్నది. 13 వ శ్లోకమునుండి సీతను రాక్షసకాంతలు అనేక విధముల బెదిరించిన విధము కలదు. వారామెను గవిసిన విధము 622 వ పద్యమున పటు తీవ్రకోపగర్జనలతో అరాళ కరాళ విషాణదంష్ట్రికలతో కనదనల స్ఫులింగసములో, గదా, పరిఘ కుఠారిక హననసము ద్ధితతో గవియగ సీత విభీతచిత్త యైనట్లున్నది. ఈ సంఘటనను శింశుపావృక్షమున దాగి హనుమంతుడు చూచుచున్నట్లు అవలీనః సనిర్వాక్యో హనుమాన్ శింశుపాద్రుమే సీతాం సంతర్జయంతి స్తారాక్షసీ ర్రశుణోత్కపిః అను 14 వ శ్లోకమున కలదు. 623 వ పద్యము న పవన సూతి ఒదింగిన శింశుపా కృణ్మాలముజేరి చూచుచున్నట్లు తెలుపబడినది. 625 వ వచనమునందును చెట్టుపై నుండి హనుమంతుడు ఈ అసురకృత్యమునవలోకించు చుండెననికలదు. మరలమరల అసురకాంతలు రావణుని వరింపుము. వరించి తరింపుము. అని బెదిరింపులతో మిగుల వనట కలిగించిరి. ఆ సందర్భమున ఒక రాకాసి జానకిని తర్జించుచు నీ మగడెన్నడో మడసి యుండును. ఒకవేళమని యున్నను నీయుదంతమొక్కింతయు నెరుంగడు ఒక వేళయెఱిగినను లంకకు రాగలుగడు అని ప్రవేశించుట కు వీలుకాని లంక గొప్ప తనమును 627 వ పద్యమున వర్ణించెను.

[24]మూలమున లంకానగర (వర్ణన) ప్రసక్తి ఒక వాక్యమునే కలదు. కాని దీనిని బలిజేపల్లి శార్దూల విక్రీడితమున ఎంతో గాంభీర్యముట్టిపడినట్లు వర్ణించెను. వికటఅను రాక్షసి తెలిపినమాటలను లక్ష్మీకాంతకవి మరికొంత మార్చి 629 వ పద్యమున వివరించెను, అలమశ్రు నిపాతేనత్యజ శోకమనర్థంభజప్రీతం ప్రహర్షేచత్యజంతి నిత్య దైన్యతాం అను 33 వ శ్లోకము 629 వ పద్యమున కడచిన దానికై తెగబోకాలుచు రే బవలు అశ్రుధారలతో జడియుచు దీనతతో కుమిలి చస్పుటేజన్మఫలమటే మనుగడకు సుఖాశయే గదా వికాసము ప్రాయపువన్నె ఇటే తిరంబటే అని వివరించెను. ఇందలి తుదివాక్యమునకు స్త్రీణాంయౌవనమధ్రువం అను వాక్యము (34 శ్లోకము) మూలము. తరువాతి పద్యమున ఉద్యానానిచరవ్యాణి పర్వతోపవనానిచ సహరాక్షస రాజేన చరత్వం మదిరేక్షణే స్త్రీ సహస్రాణి తేదేవీ స్త్వాస్యంతిసుందరీ ఉత్పాట్య వతేహృదయమ్ భక్ష్యామిమైథిలి అను మూలవాక్యముల భావము 630 వ పద్యమగు ఉత్పలమాలలో తెలుపబడినది. ఈ 630 వ పద్యమును కీ॥శే॥మేడవరం రామబ్రహ్మశాస్త్రిగారు బలిజేపల్లి లక్ష్మీకాంతకవి గారి రచనను తలపించునట్లు అనువదించిరి. తరువాత ఆరుపద్యములతో ప్రథమ భాగము ముగియును. ద్వితీయ భాగము 1003 పద్యములతో ముగియును. ఇందు శ్రీ కీ॥శే॥ మేడవరం రామ బ్రహ్మ శాస్త్రి గారు కావ్య పీఠికలో కూడ పేర్కొనిరి. బలిజేపల్లి వంశీయుడైన లక్ష్మీకాంతాఖ్య కవీంద్రుడు శ్రీ కాంతపతి పాద సేవితుడగుటచే ఆదికవి వాక్ శ్రీధుర్య రామాయణ శ్రీకి సుందరకాండముత్తమముగా జింతించి ఆంధ్రీకరణము ఇరువది నాల్గుసర్గములు వ్రాసెననితెలిపిరి. ఈ పద్యాంతమున కించిదూనంబుగాన్ అని కలదు. ఆ కొంచెము 630 నుండి 636 పద్యములకు గలవిషయము. వీరు జంట కవులుగ ప్రసిద్ధులు కాక పోయినను ఒకరికొకరి కేర్పడిన పరిచయము ప్రగాఢమై ఒకరికవిత్వము మరొకరి కవిత్వము కొంత నంవదించుటచే తాను వదిలిన భాగము రామబ్రహ్మశాస్త్రిగారు పూర్తి చేయవలెనని బలిజేపల్లి అభ్యర్థించుటచే ద్వితీయ భాగమును కించి దూనముగా తాను వదలిన ప్రథమ భాగము నందలి శేషమును శ్రీ మేడవరం రామబ్రహ్మ శాస్త్రి గారు పూరించిరి.

శ్రీ బలిజేపల్లి లక్ష్మీకాంతంగారికి రామాయణము పై అందును నిత్యపారాయణ యోగ్యమగు సుందరకాండముపై గల అభిమానము అనుపమానము. కరుణ విప్రలంభము, ప్రాముఖ్యము గల ఏతత్ సుందరకాండము యొక్క ఆంధ్రీకరణము కూడ వీరి అమృతలేఖినివలన నిజముగా అమరత్వమును పుణికిపుచ్చుకొన్నది. సుందర కాండము తరువాత ఉత్తరకాండములో కరుణ రసము పరాకాష్ఠ నందు కొన్నది. కావుననే ఏకోరసః కరుణ ఏవ అని ప్రతి పాదింపబడి ఉత్తరే రామచరితే భవభూతిర్వి శిష్యతే అని ప్రసిద్ధికెక్కిన భవభూతి ఉత్తర రామ చరిత్రమును ఈ కవి యథాతథముగా అనువదింపక అందందు కొన్ని మార్పులు చేర్పులతో స్వతంత్ర నాటకమువలె నంతరించి ఉత్తర రాఘవము అను పేరఅనువదించెను.

ఇక బలిజేపల్లి లక్ష్మీకాంతకవిగారి ఉత్తరరాఘవ నాటకమును తులనాత్మకముగా సమీక్షించుటకు ఉపక్రమింతును.

## ఉత్తర రాఘవము - తులనాత్మక సమీక్ష

**ఉత్తరామ చరితే భవభూతిర్విశిష్యతే** అని ప్రసిద్ధి కెక్కిన భవభూతి ఏడు అంకముల ఉత్తరరామచరిత్ర నాటకమును బలిజేపల్లి లక్ష్మీకాంతకవి కొలది మార్పులతో ఎనిమిది అంకముల నాటకముగా అనువదించిరి. ఉత్తరరామచరితమున ప్రథమాంకము నందలి చిత్రపటవృత్తాంతము ఉత్తర రాఘవమున ఏవో కొలది మార్పులతో యథామాతృకముగనే పరివర్తింప బడినది. ఉత్తర రామ చరిత్రమున అతిప్రసిద్ధమైన లౌకికానాంహి సాధూనామర్థంవాగనువర్తతే, ఋషీణాం పునరాద్యానాం వాచమర్థోనుధావతి అనుశ్లోకమును ఏలనో బలిజేపల్లి తెనిగింపలేదు. మంథరావృత్తాంతమునకు ముందున్న **ప్రతమ విరహే ప్రాన్తోన్మీలన్మనోహరకున్తలమ్** అను శ్లోకమునకు కూడ అనువాదము లేదు. మూలమున మధ్యమాంబా వృత్తాంతమని యున్నది. దీనిని కైకేయి వృత్తాంతమని అందరకు తెలియునటుల అనువదించెను. భగవతి భాగీరథికి నమస్కారము గావించు రాముడు భగీరథుని వృత్తాంతమును జ్ఞప్తికి తెచ్చును. ఈ సందర్భమున **తురగవి చయవ్యగ్ర** అను శ్లోకమున్నది. దీనిని గూడ బలిజేపల్లి అనువదింపరైరి. భరద్వాజా శ్రమమును గూర్చి ముచ్చటించునపుడు ఆటకాళిందీ తీరమున శ్యామమను మఱ్ఱిచెట్టున్నట్లు మూలమునందున్నది. ఈ మఱ్ఱిచెట్టు ప్రసక్తిని కూడ బలిజేపల్లి వదలి వేసిరి. ఇట్లే ఏషవింధ్యాటవీ **ముఖేవిరాధసంబోధః** అను వాక్యమును కూడ బలిజేపల్లి ఆంధ్రీకరింపలేదు. మునిపల్లెల జీవితము కన్నులకు కట్టినట్లున్నదని రాముడు తలచుసందర్భమున బలిజేపల్లి స్వయముగా నొకసీసపద్యమును ఆశ్రమ వాతావరణ పవిత్రత అనుభవైకవేద్యమగునట్లు అభివర్ణించిరి. అట్టివానిలో ప్రథమాంకము నందలి 19 వ శ్లోకము స్మరసి సుతను **తస్మిన్ పర్వతే లక్ష్మణేన** అను దానికి ఈ నీ మఱిందికుఱ్ఱ నానావిధ రుచ్య ఫలాహారంబులు సేకరించి కొని వచ్చి మనల సేవించు చుండెడివాడు అని అనువాదము. అటుపై 20 వ శ్లోకము **కిమపి కిమపి మన్దం**అనునది దీనికి లలి లేజెక్కు న జెక్కు సేర్చి మెల మెల్లన్ **తాఱు మాటైనపల్కులనేమొ మొదలించు కొంచు** అను పద్యనను వాదము. ఈ శ్లోకమున తుదిపాదమున **అవిదిత గతయా మారాత్రి రేవ్యరంసీత్** అని ఉన్నది. దానిని బలిజేపల్లి ఏమనంగల నా రాత్రియే **గతించి తెలియంగారాని యామంబులన్** అని లాలిత్య మాధుర్య మార్దవము లుట్టిపడునట్లు మనస్సునకు హత్తుకొను నుడికారపు సొంపుగల బాసలో స్వతంత్ర రచన వలె అనువదించెను. అటుపై సీత రామునితో మాటాడిన సంభాషణ సీస పద్యమునకవి స్వయముగా కల్పించి అభివర్ణించెను. అరణ్యము నందలి సౌఖ్యమును తెలుపుచు సీత దోరలబండిన రేగుబండ్ల బేసంబు రాజధాని యందులభించునా అట్లే చేతిమేతల పెంచి మంచిన మనకురంగీస్నేహవైభవము తుస్సీను లాదరముతోడ సారె బెట్టినమేలి నారచీర గోదావరి పులినహంసాంగనా విలసనములు మరల మరల లభించునా అని అరణ్యమునందు సౌఖ్యముగనే కాలము గడిపితిమని రామునికి విన్నవించినది. ఈ కల్పనమంతయు కవి తనకు తానై ఊహించి ప్రకటించినదియే. పంచవటి యందు శూర్పణఖ ప్రవేశించినట్లు చిత్రింపబడిన చిత్రపటమును చూచి ఇంతవరకే గదా మిమ్ముకలసియుండు భాగ్యము నాకు అని సీత పలికెను. అంతలో లక్ష్మణుడు జనస్థాన వృత్తాంతమును తలచినచో రాయియైనను కరుగును. వజ్ర హృదయమైనను భిన్నమగునని పలికెను. చిత్రపట దర్శన మాత్రముననే రాముడు మిగుల మనోవైకల్యము చెంది సీపు ఎరుగని వాడవుకావు కదా! ఆ వృత్తాంతమట్టిదని తెల్పెను. ఈ సందర్భమున తత్కాలం ప్రియజన విప్రయోగజన్మా....హృన్మర్మ వ్రణ ఇవవేదనాంతనోతి అనిమూలమూలగలదు. దీనినే ప్రియజన విప్రయోగమునబేర్చిన యిప్పటి శోక వహ్ని....పరిపక్వమైన హృదయ వ్రణమట్లొనరించువేదనన్ అని రవంతయైన కొఱంత కలుగకుండ రసవంతముగా బలిజేపల్లి ఆంధ్రీకరణము. శబరి గావించిన అతిథి పూజా తాత్పర్యము తలచినపుడు ఏతస్మిన్మదకల మల్లికాక్షపక్ష అను శ్లోకమున్నది. ఇచ్చట బలిజేపల్లి ఎలమి కన్నీటి చుక్కలు చాలవనియేమొ పానీయమున నర్ఘ్యపాద్యమొసగి అను సీసపద్యమున స్వతంత్ర భావకల్పనా

చాతుర్యముతో అత్యద్భుతముగా ఆమె రూపముమనకన్నుల యెదుట నిలిచినట్లు అభివర్ణించెను. ఈ సీస పద్యమునందలి ప్రతి పాదమునందును కవి రచన రసమయమై మెత్తని కమ్మవిరుల పరిమళమును తేరిన మంచిపూదేనె మాధుర్యమును ఉపాహారఫలముల రసస్వారస్యమును వెలువరించి రసహృదయుడైన సహృదయుడే సాక్షాత్తురాముని వలె నోరూర ఆరగించునట్లు కవితా మరందమును జాలువార్చెను. మూల్యవంతమును వర్ణించు సందర్భమున సోయంస్తైలః అను శ్లోకము తావులు మద్ది క్రొవ్విరుల తావుల తావలమై అనుఉత్పలమాలావృత్తమున, అనువదింప బడినది. ప్రథమాంకము నందలి జీవయన్నివ ససాధ్య సశ్రమ స్వేద బిన్దు అన్న 27 వ శ్లోక భావము వినిశ్చేతుం శక్యో అను 28 వ శ్లోక భావము వచనమునందే అనువదింపబడినది. 29 వ శ్లోకము మ్లానస్య జీవ కుసుమస్య వికసనాని... కర్ణామృతాని మనసశ్చరసాయనాని అనునది. దీనిని తెల్లనగు తేటగీతిలో

ప్రణయ మధురంబులైన నీ భాషణములు
వాడు వారిన జీవన ప్రసవములకు
వికసనమ్ము లింద్రియ మోహ విభ్రమములు

శ్రవణ పేయంబులు మనోరసాయనములు అని ఎంతో చక్కగా మూలమునందలి భావమునకు లేశమైనను అర్థభంగము కలుగని పద్ధతితొ ప్రతి పద రమణీయముగా, భావబంధు రముగా తెనిగింపబడినది. ఆ వివాహ సమయాద్గృహేషు....రామ బాహురు పధానమేషతే అను 30 వ శ్లోకము కలనైనను బరాం గనకు గాక వివాహమె ఆదిగా... గృహంబునన్ గహన సీమలోను చింతపుసేవలన్ గొలిచెడి రామబాహు విదిగో తలదిండగు జానకీ! అని ఎంతో అలవోకగా సహజముగురీతిలో అతి స్వతంత్ర రచన వలె కవి అనువదించెను. మూలము నందలి అర్థవంతముగు ప్రతి పదము యొక్క ఔచిత్యమును పరామర్శించి అది అను వాదమున రసస్ఫూర్తితో అభివ్యక్తమగునట్లు ప్రతిభతో ప్రకటింపగల నేర్పు బలిజేపల్లి కవికివెన్నతో పెట్టిన విద్య అన్న అతిశయోక్తి కానేరదు. ప్రథమాంకము నందు 31 వ శ్లోకము ఇయంగేహేలక్ష్మీః అన్నది దాంపత్య ధర్మమునకు వ్యాఖ్యాన ప్రాయమైనది. అనుకూల వతియగు ఇల్లాలి వలన కలుగు సౌఖ్యము ఎంత విలువ కట్టలేనిదో ఈ శ్లోకమున అభివర్ణితము. దీనినే బలిజేపల్లి ఈ మహిళా లలామము గృహేందిర కన్గవకీమెమూర్తి దివ్యామృతవర్తి స్పర్శసుఖమో! హరిచందన చర్చ మేనికి అని వర్ణించెను. ఇందలి శ్లోకాంతమున గల అసహ్యాస్తు విరహః అనుదానికి మహా విరహంబు దుర్భగన్ అని ఆంధ్రీకరణము. వెంటనే ప్రతీహారి ప్రవేశించి దేవ ఉపస్థితః ( దేవవచ్చెను) అని తెలిపెను. ఇచ్చట పూర్వ శ్లోకాంతమునందలి ప్రయోగమును ప్రతీహారివాక్యముతో అను సందించినపుడు విపరీతార్థము స్ఫురించును. ఇది భవిష్యత్తులో జరుగనున్న మహానర్థమును సూచించుచున్నది. ఇట్టివిపరీతార్థము భావ్యర్థ సూచనము ప్రకటించు ఘట్టములనే గండములందురు. ప్రకృతమునకు సంబంధియనదయ్యు మఱియొక అర్థమును కల్పించపజాలి ఆకస్మికముగా ప్రతీహారి వాక్యమున సహజధోరణిలో ప్రకటితమైనది. బలిజేపల్లి ఉపస్థితః అను ప్రయోగమును వచ్చునాడు అని అనువదించెను. అటుపై దుర్ముఖుడను శుద్ధాంతసంచారి వేసున దుృ ఆనన్న పరిచారకుని పేరు భద్రుడని ఉన్నది. కాని భవభూతి దుర్ముఖుడను పేరుగూఢచారిపాత్రను ప్రవేశపెట్టెను. జనాపవాదము నెట్లు మనవి చేయుట అని దుర్ముఖుడు సందేహించెను. అదే సందర్భమున చిత్ర దర్శనము వలన రాముడు మిగుల కలతచెంది విశుద్ధమైన ప్రేమను గూర్చి భావించెను. ఈ సందర్భమున అద్వైతం సుఖదుఃఖయోః అను శ్లోకమున్నది. దీనినే బలిజేపల్లి ఏదద్వైతము ఖేదమోదముల దాంపత్య శుభానుభోగమేకదా ఆశింతురెట్టేనియున్ అని అనువదించెను. ఈ శ్లోకమున కాలేనావరణాత్యయాత్ అను ప్రయోగమున్నది. దీనికి ఏదో నావరణాత్యయప్రబలమై అని ఆంధ్రీకరణము ఇట్టిశరీరనాశన పర్యంతమను అర్థమును గ్రహింపవచ్చును. కాని నిజము నకు ఆవరణమనగా కప్పుతెర అని అర్థము అది తొలగి అద్వైత భావము చే దాంపత్యమపవర్గ తుల్యమగుటయని గ్రహింపవలెను. ఇట్లు దాంపత్యమును గూర్చి భావించు సందర్భముననే దుర్ముఖుడు ప్రవేశించి దేవరకు జయమగుగాక అని

పలికెను. అటుపై రాముడు ఏది ఉపలబ్ధమో చెప్పమనును. దీనికి మూలము బ్రూహి యదుపలబ్ధం అని దీనిని బలిజేపల్లి నేటివిశేషము లేమి! అని అనువదించెను. అటుపై రాముడు పౌరులు మిమ్ము మేనొళ్ళ కొనియాడుచునేయున్నారు. అను దుర్ముఖుని మాట విని యిది అర్థవాదము దోషమున్న చెప్పుము అనును. అర్థవాదమన్న ప్రయోగమును బలిజేపల్లి కేవల శ్లాఘావాక్యమని అంగీకరించెను. అనంతరము దుర్ముఖుడు కన్నీరు క్రమ్మగా మహారాజ! అవధరింపుడని చెవిలో ఇట్లు ఇట్లు అని తెలిపినటుల మూలమున కలదు. ఇచ్చట బలిజేపల్లి కొంత మార్పు గావించెను. మూలమున భవభూతి ఎంతో మెలకువతో ఔచిత్యముతో నిందను బయటకు పొక్కనీయకుండ ప్రేక్షకుల ఊహకు వదిలివేసి చెప్పరాని మాటను చెవిలో అన్నట్లు సన్నివేశమును కల్పించెను. బలిజేపల్లి ఈ సందర్భమునను భవభూతి కంటె మరింత ఔచిత్యమును పాటించి అదినోట వక్కాణించుటకే అసంబద్ధమైన మాట అని ఒక పత్రమున సర్వమును వ్రాసి ఆకాగితమును అందించును. ఈ సవరణ ఎంతో ఆధునికముగా, నాటకీయముగా, రాముని గౌరవ ప్రతిష్ఠలను ఇనుమడింప జేయున దిగా గూఢచారి యొక్కసమయస్ఫూర్తికి, అతడు ప్రభువు సెడ ప్రవర్తింపవలసిన విధానమునకు నిదర్శనముగా నున్నది. ఎంత గూఢచారి అయినను రాజుచెవిలో రంగస్థలమున చెప్పినట్లు ప్రదర్శించుట రాజుయొక్క గౌరవమును కొంత తక్కువ పరచినట్లగును. నోట వక్కాణించుట కుదీలుకాని కాగితము నందలి విషయము మహోన్నర్థమును తెలుపగలదని తలచి దానిని చదువుకొని రాముడు మూర్ఛిల్లును. మూలమున తీవ్రసంవేగో వాక్ వజ్ర అని ఉన్నది. పిడుగువంటి మాట అనునది దుర్ముఖుడు చెవిలో చెప్పినప్పుడే తట్టించెను. అతడు కాగితములో విషయమును తెలుపుటచే స్వయముగా చెప్పినట్లుగాదు. కాన ఆ వాక్యమును బలిజేపల్లి అనువదింపలేదు. మూర్ఛనుండి తేరిన రాముడు ఆ వైపరీత్యమునకు వగచి జానకి దేవి పవిత్రతను పరివరివిధముల భావించెను. వరుసగా మూడు శ్లోకముల భావము మనము నందే కలదు. దుర్ముఖునితో రహస్యము చెప్పుటకు ముందున్న 3 6 వ శ్లోకము త్వయా జగంతిపుణ్యాని అనునది తేటగీతిలో పరమ సాధ్వీత్వ సామ్రాజ్య పట్టమంది ముజ్జగము లేలు చున్నయో ముద్దరాల అని అనూదితము. ఆ శ్లోకము యొక్క భావము అనువాదమున యథాతథముగా పరివర్తింపబడలేదు. పాపి విధిచేత మిథ్యా ప్రవాదమంది అనదవైదిక్కు మాలి అల్లాడవలసె అని తుది రెండు పాదములలో మూలముయొక్క భావము చెడకుండ స్వతంత్ర రచనా కౌశలము కొరవడకుండ సన్నివేశ ప్రాముఖ్యము లేటతెల్లము చేయబడినది. అనంతరము దుర్ముఖుని చెవిలో రాముడు తన రహస్య సందేశమును వెల్లడించెను. ఈసందర్భ మునకూడ బలిజేపల్లి దుర్ముఖుడు కాగితమును వ్రాసియిచ్చినట్లే రాముడును కాగితముపై నేమియో వ్రాసి క్రొత్తరాజు నీకీ యాజ్ఞా పత్రమును పంపినాడని లక్ష్మణునికిమ్ము అని తెలిపెను. ఇచ్చట క్రొత్తరాజు అనుటకు మూలము నూతనో రాజా అనునది. ఆ ప్రయోగమున వక్రోక్తి చోటు చేసికొన్నది. దుర్ముకుడు జానకీ విషయమున ఎంత నిర్దాక్షిణ్యముగా పరిణమించినదో అని పరితపించి మిగుల సుదీర్ఘముగా యోచించును. ఇందు బలిజేపల్లి కొంత మూలముకన్న భిన్నముగా విస్తరించి జానకి రామునికి గావించిన సేవలను స్మరణకు దెచ్చుకొను సందర్భమును అభివర్ణించెను. పని కత్తెలెందరున్నను పైట చెరగునందు ఉడి పాదుకలిడి తొడిగినావు అను సీస పద్యమును బలిజేపల్లి స్వయముగా కల్పించెను. 3 8 వ శ్లోకమునుండి 4 2 వ శ్లోకము వరకు గల విషయమంతయు రాముని మానసిక వేదనకు సంబంధించినది. ప్రియగృహిణి అయిన గృహలక్ష్మిని ప్రేమంపుటిల్లాలిని నాదు గృహేందిరను ప్రసవ వేళా లోలయౌ నిండు చూలాలిని దయమాలి నేడు బలిగా కిరాత వ్రాత మధ్యమునకు అర్పించుచుంటినిగదా అనివిలవిల రాముడు వాపోయెను. ఇచ్చట మూలమున సీతాయాఃపాదౌశిరసి కృత్వాదేవిఅయం పశ్చిమఃతే రామస్య శిరసా పాదపంకజః స్పర్శః అని సీత యందు రామునికి గల పూజ్య భావమును తెలుపువాక్యము గలదు. దీనికి అనువాదము లేదు జానకీ లగ్నమైన మనస్సును మరియొకమారు మరలించి ఆతని ధీరోదాత్తనేతృత్వమును నిరూపించుటకై సేపద్యమున అబ్రహ్మణ్యము

అబ్రహ్మణ్యము అని గగ్గోలు వినిపించెను. లవణాసురుని బారి నుండి తపోధనులను కాపాడదలచి రాముడు కోపముతో దురాత్ముడైన కుంభీనస పుత్రునిసంహరించు టకై శత్రుఘ్నుని పంపుచున్నానని నిష్క్రమించెను. నిష్క్రమించుటకు ముందును తనదేవేరి సీతను తలచి దేవీ! ఏమి కానున్నావో! నిన్నెవరకు అప్పగింతునో. భగవతీ! భూదేవి! నీవే నీ కూన్నను రక్షించుకొమ్ము అని పల్కెను. అటుపై సీత కలలో ఆర్యపుత్రవిగ్రహమును దర్శించి దిగ్గనలేచి ఆర్యపుత్రుడు తన్నువీడిపోయెనా అని అటునిటు చూచును. అటుచూచి చేతనైనచో కోపించెదను ఎవర్కడ! అని అనెను. ఈ కోపించెదను అనుదానికి భవతు అస్మైకోపిష్యామి అని మూలము. వెంటనే దుర్ముఖుడు ప్రవేశించి కుమార లక్ష్మణులు రథము సిద్ధము చేసిన విషయమును నివేదించెను. [4] సీత లేచి పరిక్రమించి ఇయం ఆరోహామి స్ఫురతిమే గర్భ భారః తతః శనైః గచ్ఛావః అని పల్కును. ఉత్తరభారప్రసక్తిని కాని, మెల్లగా పోవుదము అని కాని తెలుపలేదు. అట్లు సీతపలుకుట అనౌచిత్యమని బలిజేపల్లి భావన. తుట్టతుదిగా సీత నమోరఘు కుల దేవతాభ్యః అని పల్కుటతో ప్రథమాంకము ముగియును. బలిజేపల్లి వారు రఘుకులదేవతలకు నమస్కారములు అని తెలిపి అంతటితో ఆగక ప్రథమాంకాంతమునతపోధనులకు అభివందనములు అని తెలిపెను. ఈ వాక్యము అనంతరము జరుగనున్న కథాంశము నకు అను సంధానము. భావ్యార్థమిందు సూచ్యము [5] ఇట్లే ప్రథమాంకము నందలి వృత్తాంతము అక్కడక్కడ కొలది మార్పులతో ఉత్తర రాఘవమను పేర స్వతంత్రించి అనువదింపబడినది. చిత్రదర్శనము అను ఈ అంకమున చిత్రకారుడు అర్జునుడనియు న్నను బలిజేపల్లి ప్రకటింపక చిత్రకారుడు అని మాత్రమే ఆంధ్రీకరించిరి. ఈ ప్రవాదము యావజ్జీవితమైనది. అని రాముడు అనినవెంటనే ఒక శ్లోకమున్నది. అది ప్రక్షిప్తమో ఏమో బలిజేపల్లి దాని తెనిగింపలేదు. చిత్రపట మును చూచుటకు ఉపక్రమించిన సీత చక్కగాచూచి (నిర్వర్తించి) ఆకసమున క్రిక్కిరిసినట్లు నిలువంబడి ఆర్యపుత్రుని స్తుతించుచున్న ట్లున్నారని బలిజేపల్లి తెనిగించెను. దగ్గరదగ్గరగా నిలువ బడిపైనుండి ఆర్యపుత్రుని స్తుతించుచున్నవీరు ఎవరని జయంతిరామయ్యగారి తెనిగింపు. జృంభకాస్త్ర ప్రసక్తిసందర్భమున ఇది పూర్వము భృశాశ్వుడు కౌశికునికి ఉపదేశించినట్టి అను విశేషణమును మంథరవృ త్తాంతమునకు ముందున్న శ్లోకమును, భగీరథుని ప్రసక్తి గల శ్లోకమును బలిజేపల్లి తెనిగింపలేదు. నిషాదపతినా అను ప్రయోగమును జయంతి రామయ్య గుహునితో అని అనువదింపగా బలిజేపల్లి పల్లెమన్నీనితోడ అని తెనిగించిరి. చిత్రపటమున జటాయువును గూర్చి బలిజేపల్లి పేర్కొనలేదు. [6] లక్ష్మణుడు జనస్థాన పశ్చిమమున కబంధరూపుడాక్రమించుకొన్న కుంజవంతమున్న దండకారణ్య భాగమిదియని చూపును. ఇది ఉత్తర రాఘవమునలేదు. చిత్రపటమును చూచినవెంటనే సీత తాను భాగీరథియందు అవగాహనము చేయవలెనను కోర్కెను తెలుపును. అపుడు రాముడు రథమును సిద్ధము చేయింపుమని లక్ష్మణునితో పల్కును. వెంటనే సీత ఆర్యపుత్ర! మీరుకూడ రావలయునని తెలిపెను. దానికి రాముడు అతికఠిన హృదయురాల! ఆమాట నీవనవలయునా! అని పల్కగా సీత అట్లైన నాకు మిక్కిలి సంతోషమని వ్యాఖ్యానించెను. ఈ సంభాషణము, సన్నివేశము ఉత్తర రాఘవమునలేదు. [7] దుర్ముఖుడు రామునికి కాగితమును ఇచ్చినట్లు బలిజేపల్లి కావించిన మార్పు ఎంతో ఔచిత్యముగా రాజు గారి మర్యాదను కాపాడునదిగా అధునాతనపద్ధతిలో నాటకీయతను పుణికిపుచ్చుకున్నది. అందును ముఖ్యముగా చెప్పరాని మాటలను చెవిలో అనుటయు అంత సమంజసముకాదు కాన కాగితములో వ్రాసి ఇచ్చుట చక్కని సమయస్ఫూర్తిని తెలుపుచున్నది. ఇట్లేదుర్ముఖునికి రాముడు తెలిపిన విషయముకూడ కాగితమున వ్రాసియిచ్చినట్లు బలిజేపల్లి మార్చిరి నిందను వెర్రికుక్కవిషమువోలెనంతటు వ్యాపించెనను చక్కని ఉపమానమును బలిజేపల్లి తెనిగింపలేదు. ఇట్లీ యంకమున బలిజేపల్లి లక్ష్మీకాంతకవి అందందు కొన్ని శ్లోకములను చిన్నచిన్న సన్నివేశములను వదలి వేసినను కొన్నిచోట్ల స్వతంత్రించి విస్తరించి ఔచిత్యమును పోషించుచు రసవద్రచనా రామణీయకమును ప్రదర్శించిరి.

ఉత్తరరామ చరిత నాటకమున ద్వితీయాంక ప్రారంభమునందలి శుద్ధవిష్కంభము ఉత్తర రాఘవమున తృతీయాంకప్రారంభమున ప్రవేశపెట్టబడెను. బాటసారి వేషమునతాపసి ప్రవేశించును. తాపసీ వనదేవతలు, ఆత్రేయ వనదేవతలు, వాసంతి పాత్రల సంభాషణ రూపమున ఈ శుద్ధవిష్కంభము ఉత్తరరామ చరితము నందు వలెనే ఉత్తర రాఘవమునందును యథాతథముగా పరివర్తింపబడినది. యద్భూంభోగ్యం అను శ్లోకభావము ఘనపుణ్యంబునగాక సాధు జనసాంగత్యంబు చేకూరదు. అను పద్యమున అభివర్ణితము. అట్లుపై ప్రియ ప్రాయావృత్తిః....సాధూనాం అనువది విశుద్ధం విడయతే అను శ్లోక భావమంతయు నిసర్గపవిత్రముగు నిట్టి సాధు సౌశీల్యము సర్వదా వర్ధిల్లుగాక అను తాపసీ వాక్యమున వచన రూపమున నిబంధింపబడినది. ఆత్రేయినోట అస్మిన్నగస్త్య ప్రముఖాః ప్రదేశ అని పలికించిన శ్లోకభావము కూడ బలిజేపల్లి ఈ ప్రదేశమున అగస్త్య ప్రముఖులు ఉద్దీధవేత్తలు పలువురున్నారు. అను వచనముననే అనువదించిరి. ఇట్లే కుశలవుల వృత్తాంతమును తెలుపుచు వాల్మీకి వారికొసగిన శిక్షణ అట్టి వారి సహృదయన యోగ్యత వితరతి కురుః ప్రాజ్ఞేవిద్యాం యథైవ తథా జడే.... ప్రభవతి శుచిః బింబగ్రాహేమణిః నమృదాంచయః అను శ్లోకమును ప్రాజ్ఞునకు నెట్లో జడునకు కూడనట్లెగురుడు విద్య నేర్పును. ప్రతి బింబమును జాతి రత్నమువలె గ్రహింపగల్గునామట్టి ముద్ద అని బలిజేపల్లి వారు వచనమునందే తెనిగించిరి. మానిషాద ప్రతిష్ఠాంత్వం అను శ్లోకమును గీర్వాణభాష యందే ఉండుట సమంజసమని భావించిరి. ఆత్రేయి వనదేవత పంచవటి మీదుగా గోదావరీ తీరమును బట్టి పొమ్మని తెలిపినది. అపుడు ఆత్రేయికన్నీటితో అపితత్ తపోవనం అపి ఏషా పంచవటీ అపి సరిదియం గోదావరీ అపిజనస్థాన వనదేవతా వాసంతీత్వం అని అనును. దీనిని బలిజేపల్లి ఆతపోవనమా యిది! ఇది గోదావరి నదియా అనునది అనువదింపలేదు. అపుడు ఆత్రేయ జానకిని వత్సా! జానకీ! అని పిలుచును. ఇట ఏషతే వల్లభ బంధువర్గః అను శ్లోకమునుఇచ్చట నీ ఆప్తబంధు వర్గమును చూడగనే నీవు నామశేషమైపోయినను కన్నుల గట్టినట్లున్నావు. అని బలిజేపల్లి వారు వచనములో అనువదించిరి. మూలమున గల ప్రత్యక్షదృశ్యామివ నామశేషాం అను ప్రయోగము చక్కగా తెనుగున తెనిగింపబడినది. నామశేష అన్న పదమువిని వాసంతి సీతాదేవికి ఏమి అత్యాహితమో అని ప్రశ్నించినది. దానికి ఆత్రేయకేవల మత్యాహితం సాపవాదంచ (క్లేశమేమిన) అని తెలుపును. దీనిని అత్యాహితమే కాదమ్మ అపవాదము (చెవిలో) ఇదికథ అని అనువదించిరి. ఏవమివ అన్నదానికి ఇదికథ అనునది బలిజేపల్లి వారి స్వతంత్రతను వెల్లడించుచున్నది. అశ్వమేధ యాగము చేయనెంచిన శ్రీరాముడు మరల పెండ్లి చేసికొనెనా యాగవేది యందు మతి సహధర్మచారిణియో అని వాసంతి ప్రశ్నింపగా బంగారుసీతా ప్రతిమ యట అని ఆత్రేయి సమాధానమిడును. అపుడు వాసంతి ఆశ్చర్యమును ప్రకటించుచు తెలిపిన సమాధానము వజ్రాదపి కఠోరాణిమృదూని కుసుమాదపి లోకోత్తరాణాంచేతాంసి కోను విజ్ఞాతుమ్మర్హతి అను చక్కని శ్లోకమున ప్రకటిత మైనది. ఆశ్లోకమును బలిజేపల్లివారు ఎవరికెరుక మహాత్ముల చిత్తములు. కులిశాయుధము కంటె ఘోరములు. సుమములకంటె కోమలములు అని వచనమునందే అనువదించిరి. ఆశరీరవాణి రామ భద్రునితో శంబూకుడను ఒకవృషలుడు (శూద్రుడు) తపమాచరించు చున్నాడు. వానిని దండించి బ్రాహ్మణ బాలుని బ్రతికింపుమని తెలిపిన విషయము మూలమున శ్లోకము, దీనిని బలిజేపల్లి వచనమునందే అనువదించెను. శుద్ధవిష్కంభము యొక్కతుదిలో వాసంతి కఠోరఖాతదివసః తథాహి అని తెలిపి అట్లుపై కండూల దిపగండపిండకషణోత్కంపేన సంపాతిభిః అను శ్లోకమున ఎండ తీవ్రతను ప్రకృతిలోని భిన్నభిన్న సంఘటనలతో అభివర్ణించెను. ఈ శ్లోకమును బలిజేపల్లి వదలివేసిరి ఎండచాలయెక్కువది అని మాత్రమే తెలిపిరి.

ఉత్తర రామ చరితమునందలి ద్వితీయాంకశుద్ధవిష్కంభము పిదప రాముడు కృపాణపాణియై తపస్సమాధిలోనున్న శూద్రతపస్వి శంబూకుని కడకువచ్చేయును. అతనిని నీవు ఎవ్వడవు. ఇట్టి మహోగ్రతపము ఏల యొనర్చుచుంటివి. నీవు ఏకులమునందు దయించితివి యథార్థము చెప్పవలెనుమని

అడుగగా అతడు వృషలుడను శంబుకుడను. యదార్థము గాపగ అంతపాపినా. అక్షయ కాయసిద్ధి బడయుటకై అక్షరత్వబోధకుడైన నీమందు దేకమిచ్చి తపంబొనర్చుచుంటినని తెలిపెను. తపమువలనబ్బితియే అక్షయ సౌఖ్యమొనగునని శంబుకుని వలన విని అయినచో నాకారవాలముచే నీకట్టి సౌఖ్యమే లభిందునా కఠోరము రాజధర్మమని తెలుపును. ఇంత వరకు గల సంవాదమంతయు బలిజేపల్లి సొంతముగా కల్పించెను. అనంతరము రేహస్త దక్షిణ అను ద్వితీయాంకప్రారంభము నందలి శ్లోకము మను మార్గంబిదియోసి దక్షిణ కరంబా! అను మత్తేభవిక్రీడితమున అనువదించెను. శంబుకుడు దివ్యపురుషుడై శ్రీరాముని దత్తాభయేత్వాయి యమాదపిదండధారే అను శ్లోకమున ప్రస్తుతించును. ఈ శ్లోకమునకు యముని ధృణీకరించి యభయంబిడు దండ ధరుండ వీవు. అనునది అనువాదము. ఇందలి శ్లోకాంతమున సత్సంగజాని నిధనానసితారయంతి అనునది. దీనిని బలిజేపల్లి తారకంబు లొదాయిన సాధులచేతి చావులన్ అని ప్రతిపదరమణీయముగా ఎంతో అర్థవంతముగా అనువదించిరి అటుపై రాముడు నీమ గ్రతపన్నునకు ఫలమను భవింపుమనెను. ఇటవైరాజములను లోకముల ప్రసక్తిని వైరాడానామతేలోకాః తైజసాః సన్తుతే ధ్రువాః అను శ్లోకాంతమునపేర్కొనెను. ఇందులోని ఒక్కపదము కూడ పొల్లుపోకుండ తేటగీతిలో తైజసములై వెలుంగు వైరాజనామ.

భువనముల నీకు భోగ్యంబులవును ధ్రువము అని ఎంతో చక్కగా అనువదించెను. అటుపై శంబుకుడు తన తపస్సాఫల్యము వలననే రాముడు దండకాటవికి అయోధ్యను దాటివచ్చెనని. తెలుపు సందర్భము కూడ ప్రసన్న గంభీర ధోరణిలో అనూదితమైనది. రాముడు దండకారణ్య భాగములను స్నిగ్ధశ్యామాకచిద పరతో భీషణ భోగరూక్షాః అను శ్లోకమున అభివర్ణించెను. దీనినే బలిజేపల్లి లలిత శ్యామల తెనిగించెను. పరిచిత భువః అను మూలమునకు పరిచితంబులని ఆంధ్రీకరణము. ఇట్లే మూలమునందలి ప్రతిపదము యొక్క ఔచిత్యమును గ్రహించి స్వతంత్రరచనవలె బలిజేపల్లి అనువదించిరి. శంబుకుని సిద్ధిక్షేత్రమగు జనస్థానమును దండకారణ్యమును ద్వితీయాంకమునందలి, 6 , 7 శ్లోకములలో భవభూతి అభివర్ణించెను. ఇందలి 6 వ శ్లోక భావమును, 7 వ శ్లోకమును వరుసగా మూడు తేటగీతి పద్యములలో ఆంధ్రీకరించిరి. జనస్థానమునందు తాను భవించిన అనుభవములను జ్ఞప్తికి తెచ్చుకొని తనతో కూడ అడవులకు వత్తునని చెప్పిన జానకీ దేవి మాటలను తలచుకొని రాముడు శంబుకునితో తెలిపిన విషయము ఉత్పలమాలావృత్తమున. తేటగీతి పద్యమున అభివర్ణింపబడినది. పిమ్మట శంబుకుడు ప్రశాంతగంభీరములగు మధ్యమారణ్యములను 1 2 శ్లోకములలో అభివర్ణించెను. ఈ శ్లోకములను బలిజేపల్లి బలుప శకుంతముల్ పరచి వ్రాలిన వ్రాలెడు ప్రసవపూల తావులు అను చంపకమాలావృత్తమున. గుహల సంబూకృతమొనర్చు గున్నఎలుగు టిలుగులును అన్న గీతపద్యమున ఆంధ్రీకరించిరి. అంబూకృత అన్న ప్రయోగమును అంబూకృతమొనర్చు అని మూలమునందలి పదమునే క్రియా పదముగా గ్రహించిఆంధ్రీకరించెను. శంబుకుడు నిష్క్రమించుచు యావత్పురాణ బ్రహ్మావాదినం అగస్త్యం ఋషిం అభివాద్య శాశ్వతం పదంప్రవిశామి అని తెలుపును. దీని బలిజేపల్లి పురాణ బ్రహ్మవాది యగునగస్త్య భగవానునవెల్లనగొని శాశ్వతస్థానమునకు పొయెదను. అని అనువదించెను. మూలమున ఋషి అని ఉండగా ఇచ్చట భగవాను అని ఋషి శబ్దమును భగవత్పరముగా అన్వయించెను. అటుపైరాముడు 1 3 వ శ్లోకము నుండి 1 9 వ శ్లోకము వరకు తన పూర్వానుభవములను స్మృతికి దెచ్చుకొని అందందు కొన్ని ప్రదేశములు కొంత మారినవనియు ఎంత తప్పించుకొని పోవుదమను వంతవటే స్నేహము తన్ను బలవంతముగా ఆపుచున్నదని గోదావరీ తీర విశేషములను అభివర్ణించెను. . మరల తప్పుకుదిగా శంబుకుడు ! దేవా! యిటు ఇటు అని తెలుపగా రాముడు భగవతీ! పంచవటీ! క్షమింపుము. గురుజనాదేశము అతిక్రమింపరానిది. ఒక్కక్షణ కాలమీ రామునకు సెలవిమ్మని పంచవటి నుండి నిష్క్రమించును. అంతటితో ఉత్తర రామునమున తృతీయాంకము ముగియును కాని మూలమున శంబుకుడు తప్పుకుదిగ గుంజత్ కుంజ కుటీర కౌశిక ఘటా ఫూత్కారవత్ కీచక స్తంబాడంబర మూకమౌకులి కుల క్రౌంచావతో యం గిరిః.. కుహరేషు గద్గదనదత్ గోదావరీ వారయో అని తెల్పిన రెండు శ్లోకములను బలిజేపల్లి అను వదింపలేదు.

ఉత్తర రామచరిత నాటకమున తృతీయాంకమునకు పూర్వము తమస, మురళ సంభాషణ రూపమున ఉన్న శుద్ధ విష్కంభము ఉత్తర రాఘవ చతుర్థాంక ప్రారంభమున లోపాముద్ర, మురళ వాద రూపమున కొలది మార్పులతో ప్రవేశపెట్టబడినది. బలిజేపల్లి కవి ఏలనో తమసానదీ దేవతా పాత్రను గ్రహింపక ప్రత్యామ్నాయముగా లోపాముద్ర పాత్రను గ్రహించిరి. మూలమున లోపాముద్ర రంగస్థలమున కన్పట్టకున్నను తత్ప్రసక్తి మాత్రము కలదు. ప్రసక్తి మాత్రమైన ఈ పాత్రకు కొంత ప్రాముఖ్యము కల్గించుటకై తమసా పాత్రను పూర్తిగా వర్జించిరి.[10] ఉత్తర రాఘవమున ఎచ్చట గాని తమసా ప్రసక్తియే కానరాదు. ఏల ఆ పాత్రను బలిజేపల్లి వారు తొలగించిరో తెలియకున్నది. తమసకు బదులు లోపాముద్ర పాత్రను ప్రవేశపెట్టుటచే సంవాద క్రమమున అంక ప్రారంభములో కొద్ది మార్పులు ఆయా పాత్రల కార్యనిర్వహణను బట్టి ఏర్పడినది. శుద్ధ విష్కంభము యొక్క తుదిలో తమసా పాత్రముఖమున పరిపాండు దుర్బల కపోల సుందరమ్ దధతీ విలోల కబరీకమాననమ్ కరుణస్య మూర్తి రథవా శరీరిణీ విరహవ్యథేవ వనమేతి జానకీ అని తెలుపబడిన శ్లోకము ఉత్తర రాఘవమున లోపాముద్ర వలన

పాలి నుసిన చెక్కిళ్ళు ప్రేలు కురులు
చిన్న మోమునకొక వింత వన్నెకూర్ప
కరుణ మూర్తియో మేకొన్న విరహదశయొ
మనగ వనికేగుదెంచె నల్లదిగో సీత - అని తేటగీతిలో తెలుపబడినది. ఇటతుట్ట తుదిగ

మురళ తెలిపిన విషయము ఆంధ్రీకృతము కాలేదు. అనంతరము సీత ప్రవేశించుటలో ఉత్తర రాఘవమున చతుర్థాంకము ప్రారంభమగును. ఉత్తర రామచరిత తృతీయాంకమున తమసా పాత్ర స్థానమున మురళా పాత్ర ప్రవేశపెట్టబడినది. శ్రీరాముడు జానకీ కరస్పర్శచే ఆనంద పారవశ్యమును పొందును. అపుడు సీత ఆర్యపుత్రులు నన్ను గుర్తించిరేమోయని మూలమున చెలికత్తె తమసపాత్ర స్థానమున ప్రవేశపెట్టబడిన మురళ వాల్మీకి వర ప్రభావమున వన దేవతలకు కూడ నీవు ఆగపడవు. జడియకుమని తెలిపెను. మూలమున భాగీరథీ ప్రసాదాత్ వనదేవతా నామపి అదృశ్యాసి అని ఉన్నది., భాగీరథీ ప్రసాదమునకు మారుగ వాల్మీకి వరప్రభావమని ఉత్తర రాఘవమున పేర్కొనబడినది. ఈ విషయమే ఉత్తర రాఘవమున మఱి ఒకటి రెండు సన్నివేశములలో ప్రసకి తేబడినది. సీత, నా హృదయ మీతడు, ఇతని హృదయమును నేనును ఎరుగుదును. నాకొరకై ఆక్రోశించు అతని చూచినపుడు నా హృదయావస్థ ఎట్లున్నదో అని పల్కును. అట్లుపై మూలమున తమస జానామి వత్సే జానామి అని, అమె హృదయావస్థను తటస్థం నైరాశ్యాత్ అను శ్లోకమున వివరించును. ఇది అనువాదమున కానరాదు. రాముడు జనస్థానమును గాంచి హృదయ మర్మములు గోయుచున్నవి పూర్వకథా ప్రసంగములు అని వ్యథనొందును. అపుడు సీత, వనదేవతలు కూడనన్ను చూడ జాలకున్నారు. అని తెలుపును. అపుడు మూలమున తమస వత్సే సర్వదేవతాభ్యః ప్రకృష్టం ఐశ్వర్యం భగవత్యా మందాకిన్యాః తత్కి మితి ఆశంకసే అను పలుకును. దీనినే బలిజేపల్లి మురళా పాత్ర ముఖమున మరిసాధారణమా! వాల్మీకి వర ప్రభావమని పలికించును. ఇష్ట దేవతల ప్రసక్తి కాని, మందాకిని ప్రసక్తి కాని లేదు. సీత వాసంతితో నీవే ఆర్యపుత్రుని మరింత క్షోభింపచేయుచున్నావు. అని పల్కిన అనంతరము మూలమున తమస ప్రణయ యేవం వ్యాహరతి శోకశ్చ అని పల్కును. ఈ వాక్యము మురళపాత్ర ముఖమున బలిజేపల్లి వారు పలికించి ఉండవలసినది. కాని దీనిని వారు అనువదింపలేదు. రాముడు తన జీవ యాత్రమటు చూచినను కష్టభూయిష్ఠమై పోయెనే అని మిగుల వ్యధనొందును. ఆ సందర్భమున దళతి హృదయంగాఢోద్వేగాత్ ద్విధాతునభిద్యతే అను శ్లోకమున తల దుర్భర దుస్సహక్లేశమును తెలుపును. ఈ శ్లోకమునే బలిజేపల్లి వారు వ్రీలున్ గుండియ శోక తీవ్రత ద్విధా ఛిన్నంబు గాదింతకున్ అని కరుణ రసార్ద్రముగా తెనిగించిరి. అట్లుపై రాముడు పౌర జనులను సంబోధించుచు తన అవస్థను వెల్లడించి క్షమింపుండయ్య. నేదీనుడనని

విలపించును. అపుడు తమస తనలో అతి గంభీరం అపూరణం శోకసాగరస్య అని తలచును. దీనినే మురలా పాత్రముఖమున ఈ శోకసాగరము అతిస గంభీరమని బలిజేపల్లి వారు తెలిపిరి. ఆ సందర్భమున వాసంతిక రామునితో ధైర్యమవలంబింపుడని తెలుపును. అంత రాముడు వాసంతీ! ఇంకను ధైర్యమనుచున్నావేమి అని అనును. ఈ సందర్భమున మూలమున దేవ్యాశూన్యస్య జగతః ద్వాదశః పరివత్సరః నష్టం సీతేతి నామాపి నచరామోన జీవతి అని కలదు. దీనిని -

జానకీ శూన్యమైన ఈ జగతి యందు
పదియు రెండేండ్లకాలమిప్పటికి జరిగె
సీతయను పేరు కూడ నశించిపోయె
రాముడు నశించె ననుమాట రాకపోయె - అని తేటగీతి పద్యములో ఎంతో తేటతెల్లముగా

తెలుగు నుడికారపు సొంపు గుబాళించు నటుల సర్వస్వతంత్ర రచనవలె హృదయము ద్రవీభూతముగు పద్ధతిలో అనువదించెను. సీతవాసంతిని గురించి ఈ వాసంతి దుఃఖోద్దీపకము లనే వినోదోపాయములని భ్రమించుచున్నదని పలుకగా, వాసంతి రామునితో కనుగొమ్మిపాదరింటనే చెలియరాకన్ వేచియున్నావు. మానినీ గోదావరి రేవు నందినుకతిన్నెన్ చూచువేడ్క జాగైచనుదెంచ నీవు పాలయల్కన్ గొంటివిగదా అని తెలుపును. దీనికి అస్మిన్నేవలతాగృహే అన్న శ్లోకము మూలము. ఆర్యపుత్రుడు హాహాదేవీ స్ఫుటతి హృదయం ధ్వంసతే దేహబంధః శూన్యంమన్యేజగత్ అని తన దౌర్భాగ్యమునకు దురపిల్లి మూర్ఛిల్లును. ఇటపేర్కొన్న పై శ్లోకమునకు హా! దేవీ హృదయంబు భిన్నమగుచున్నది దేహబంధంబులన్ లేదయ్యెన్ జగము అనునది అనువాదము. మూర్ఛిల్లిన రామ భద్రునికి సీతాకర స్పర్శయే సంజీవనోపాయమని మురళతెల్పగా సీత, రాముని నొసటస్పృశించెను. అంత రామ భద్రునకు మరల ప్రాణములు చేరుకున్నవి. వాసంతికతో రాముడు ప్రలాపముల కావు. నిజముగా సీతదొరికినదని పలుకును. సీత ఆర్యపుత్రునస్పర్శము నుండి విడిపించుకొని ఆవలకేగును. పరిత్యజించిన మగనిపై యింత అనురాగమేమి అని మురళ పలుకగా జానకి సిగ్గిల్లెను. విడిపించుకొని ఆవలికేగిన సీతను దలచి ఓసీ! నిర్దయురాలా! అని అనెను. సీత నిజముగా నేను నిర్దయురాలనే అని నాథుని అవస్థకు మిగుల వ్యధనొందినది. రాముడు కపీంద్రసఖ్యము హనుమద్విభీషణుల సాన్నిహిత్యము సౌమిత్రి బాణ సంచయము అన్నియు వ్యర్థమయ్యెగదా! ఎట్టి దుర్గమము అయిన చోట జానకి యున్నదో ప్రాణములు కోసి యిడునంత బలగముండి కూడ జానకి అవస్థను తప్పింపలేనైతిని గదా అని విలపించును. ఈ సందర్భమున బలిజేపల్లి మూలమునందలి భావమును విస్తరించిరి. మూలమున తృతీయాంకాంతమున గల ఏకోరసః కరుణేవ నిమిత్తభేదాత్ భిన్నః అను శ్లోకము, అట్లే తమసావాసంతులిరువురు సీతారాముల నుద్దేశించి పలికిన ఆవని రమర సింధు స్యార్థమస్మద్విధాబిః అను శ్లోకమును ఆంధ్రీకరింపబడలేదు. ఛాయానామ తృతీయాంకము ఉత్తర రాఘవమున చతుర్థాంతకముగ ఇట్లు పరివర్తితమైనది. ఒక తమసా పాత్రస్థానమున మురలాపాత్రను కల్పించుట తప్ప ప్రత్యేకించి యితివృత్తమునందు ఎక్కువ మార్పులను కవి ఈ అంకమున కూర్పలేదు. తృతీయాంకమున విష్కంభమందు మాత్రము తమసాపాత్ర స్థానమున లోపాముద్ర పాత్రను కల్పించెను. తమ పాత్రను పూర్తిగా పరిత్యజించుటలో బలిజేపల్లి వారి అభిప్రాయమును యిదమిత్థమని నిర్ణయించుటకు వీలులేకున్నది.

ఉత్తర రాఘవము పంచమాంకము ప్రారంభము నందలి విష్కంభము బలిజేపల్లి స్వయముగా కల్పించినది. ఇది పూర్తిగా ఉత్తర రామ చరిత నాటకమునకు భిన్నమైనది. గాలవుడు, కుశలవులు ఈ విష్కంభకమున తాము వాల్మీకి మహర్షి కడ చదివిన రామాయణమును గూర్చి ముఖ్యముగా యుద్ధకాండమునందలి శ్లోకములను గూర్చి జ్ఞప్తికి తెచ్చుకొందురు. గాలవుడు ఈ సందర్భమున ఎప్పుడు యుద్ధకాండము ప్రారంభించితిమో నాటినుండి తనకు కంటికి నిదురలేదని కన్నుమూయుటే తడవుగా లంకోని దిక్కుమాలిన రక్కసి ముండకొడుకు లందరు వికృతాకారములతో కన్పట్టుచున్నారని తెలిపెను.

యుద్ధకాండ పారాయణఫలితముగా తన్ను బ్రహ్మరాక్షసపిశాచములు పట్టిపీడించునేమో అని అదరి పోవుచున్నట్లు తెలిపెను. అపుడు లవుడు సుగ్రీవాది వానర పుంగవులు నీకు కన్పించుట లేదా! అని అడుగును. దానికి గాలవుడు నిదురలో దర్శనము కంటె మృత్యుదర్శనమే మేలని అందురని తెలిపెను. అటుపై కుశుడు రామలక్ష్మణులు కన్పించుచున్నారా అని అడిగెను. పాపము వారెవరు నా జోలికి రాలేదని సమాధానము చెప్పెను. వారు నీ దగ్గరకు రాకున్నచో నీవైన వారిదగ్గరకు పోరాదా అనిరి. ఎక్కడ అయోధ్య. దగ్గర దాపా అని పలికెను. అంతకుశుడు వికృతాకారులు తప్ప అన్యులను చూడనని దీక్ష పట్టితివా ఏమి నేను వారిని చూడలేదు. వారేనన్ను చూచుచున్నారు. అనిగాలవుడు సమాధానమొసగెను. అటుపై లవుడు ఇది అంతయు నీపిరికి తనము అనును. కుశుడు యుద్ధకాండమునందలి వర్ణన ఉత్తరకాండమున కుశలవులరణోత్సాహమునకు దోహదకారి అయినటులుగా భావి ప్రయోజనము నుద్దేశించి ఇచ్చట యుద్ధకాండ ప్రసక్తిని బలిజేపల్లి వారు కల్పించిరి. వాల్మీకి భగవానుల ప్రసక్తియు ఇందు కలదు. గాలవుడు విష్కంభకము యొక్క అంతమున మన ఆశ్రమమునకు ఎవరో పెద్దపెద్ద గడ్డాల వారు వచ్చిరి. వారెవరో విచారింతము రండనును. గురువాదేశించిన విధముగా కుశుడు భరతాశ్రమమునకు పోవును. ఉత్తరరామ చరితనాటక చతుర్థాంక ప్రారంభమున సౌధాతకి దా(భాం)డాయనుల మధ్య జరిగిన సంభాషణము మిశ్రవిష్కంభక రూపమున ప్రవేశపెట్టబడినది. ఇందు వాల్మీక్యాశ్రమమునకు పలువురు అతిథులు విచ్చేసినట్లు వారిలో ఋష్యశృంగాశ్రమమునుండి అరుంధతీపురస్కృతుడై దశరథమహారాజు భార్యలను వెంటబెట్టుకొని వసిష్ఠుడు వచ్చినట్లు తెలుపబడినది. సమాంసో మధుపర్కః అను శాస్త్రమునను సరించి శ్రోత్రియాభ్యాగతులకు గృహస్థులు తఱపిపెయ్యను గాని, యెద్దును గాని వండి పెట్టుదురు. అని దాండాయనుడనగా సౌధాతకి, వసిష్ఠుడు వచ్చుటచే తఱపిపెయ్యను చంపిరి. రాజర్షి జనకుడు రాగా ఆయనకు మధుపర్కమిచ్చి తఱపిపెయ్యను విడిచిపెట్టనని తెలిపెను. దాండాయనుడు. జనకుడు మాంస భక్షణము విసర్జించుటకు కారణమును కూడ చెప్పెను. సీతాదేవికి సంభవించిన ఆపత్తునువిని వాన ప్రస్థాశ్రమము పూని జనకుడు చంద్రద్వీపమున తపము చేయుచున్నాడు. ప్రస్తుతము ప్రియమిత్రుడైన వాల్మీకి మహర్షిని చూచుటకై విచ్చేసెనని తెలిపెను. అపుడు సౌధాతకి వియ్యపురాండ్ర సమావేశమయ్యెనట్లు లేదా అని అడుగును. మరల జనకుని ప్రసక్తిని సౌధాతకి కల్పించుకొని అతడెక్కడ అని అడిగెను. ఆయన వశిష్ఠుని, వాల్మీకిని సేవించి లోలోపల సీతా వియోగదుఃఖమునకు తపించుచు కడుపులో నిప్పు గుప్పుమన్న చెట్టు వలె ఒకచెట్టు క్రింద కూర్చుని ఉన్నాడని తెలుపును. ముఖ్యముగా ఈ మిశ్రవిష్కంభకమున జనక వశిష్ఠులు వాల్మీక్యాశ్రమమునకు విచ్చేసిన ఉదంతము కలదు జనకుడు చెట్టుక్రింద కూర్చొని ఉన్నాడని తెలిపిన అనంతరము జనకుని పాత్ర ప్రవేశపెట్టబడినది. జనకుడు వాల్మీక్యాశ్రమమునకు వచ్చినట్లు వర్తిష్యమాణకథాంశములలో ఆ పాత్రకు ప్రాముఖ్యమున్నట్లు సూచించుటయే లేదు. కాని బలిజేపల్లి గాలవుని మాటలలో చక్కని చిక్కని మృదుతర హాస్యమును చొప్పించి తుట్టతుదిగా మన ఆశ్రమమున కెవరో పెద్దపెద్ద గడ్డాలవారు చాలా మంది వచ్చినారు అని తెలిపెను. వసిష్ఠాది మహర్షులు, జనక మహారాజు మొదలయినవారు వచ్చిరని మనము దీనిని బట్టిగ్రహింపవలసి ఉన్నది. గాలవుని మాటలలో గల సూచన దాండాయన సౌధాతకుల సంభాషణము నందు చివరకు నిరూపించబడినసారాంశమొక్కటియే. అయినను బలిజేపల్లివారు యుద్ధకాండ ప్రసక్తిని, వాల్మీకి మహర్షివైభవమును, ఆదికవి అయిన ఆ మహర్షి యొక్క రామాయణరచనా రామణీయకమును. అద్వితీయమైన ఆ కవి సృష్టి బ్రహ్మసృష్టినేమించెనన్న పరమార్థమును రామాయణము నందలి విషయమును కుశలవుల. ప్రత్యక్షాను భవమున ప్రకటితమైన విధమును సూచించిరి.

[16] బ్రహ్మ సృష్టికి, కవిసృష్టికి గల భేద సాదృశ్యములను సమయ సముచితముగ ఈ దృశ్యమున సన్నివేశ బంధురముగా కల్పించి కావ్య పరమార్థమును కథా సూత్రమునందు అతికించిన విధానము. ఆ ప్రతి మానము. కవిత్వతత్త్వమును క్షుణ్ణముగా గ్రహించిన రసహృదయుడు కావుననే లక్ష్మీకాంతకవి ఇట్టి

సన్నివేశమును ఈ దృశ్యకావ్య మధ్యమున ప్రవేశపెట్టెను. ఉత్తర రామ చరితము నందలి విష్కంభకము కంటె బలిజేపల్లి వారు కల్పించిన ఈ విష్కంభకము ఎంతో ఔచిత్యవంతముగా, పూర్వాపర సందర్భ సంధాయకముగా, రస రామణీయకముగా ప్రతి భాదురంధరము గా నొప్పారినది. ఉత్తర రామ చరితనాటక చతుర్థాంక ప్రారంభమున జనకుడు ప్రవేశించి సీతను గూర్చి పరిపరి విధముల తలచును. అంతలో కంచుకి, ఘృష్టిదారి చూపగా అరుంధతీ కౌసల్యలు విచ్చేయుదురు. జనకుడు అరుంధతిని సమీపించి అభివాదమొనర్చెను. అపుడు జనకుడు జానకిని తలచుకొని నా కూతును పరిశోధించుటకు అగ్నిఎవడని కోపించును. అరుంధతియు ఆతని మాటలను సమర్థించును. జనకుడు దశరథుని ప్రియ పత్నిని ఎంతో కాలమునకు చూచియు శత్రువువలె భావించి తిని అని పశ్చాత్తాప పడెను. కౌసల్యయు, జానకిని తలచుకొని మిక్కిలి దుఃఖించునది. తుట్టతుదకు అరుంధతి, కౌసల్యను ఊరడించి అప్పుడప్పుడు బాష్పవి శ్రామము కర్తవ్యమే మీకుల గురువు చెప్పినట్లు చివరకుశుభము కలుగునని పల్కినది. ఇచ్చట ప్రత్యాశ అరుంధతీ వాక్యమున సూచితమైనది. ఉత్తరరామచరితము నందు చతుర్థాంకమున గల ఈ విషయమంతయు ఉత్తర రాఘవమున అనూదితము కాలేదు.

తెరచాటున కలకలము విని జనకుడు ఇది శిష్టానధ్యయనము కాబోలు. కావునే వటువులు యథేచ్ఛగా నాడుకొనుచున్నారు అను ఈ సంఘటనమునుండి అనువాదము సాగినది. కౌసల్య, వటువుల మధ్యనున్న బాలుని చూచి మతినిలో రామచంద్రుని పసితనపు లీలలు కలవని తలుచును. అపుడు అరంధతి తనలో ఇదంనాదు తద్భాగిరథీ నివేదిత కర్ణామృతం అనును. దీనిని బలిజేపల్లి యిదియేగదా వాల్మీకి చెప్పిన రహస్య కర్ణామృతం అని అనువదించెను. ఒండు రెండు చోట్లు ఈ ప్రసక్తి వచ్చినపుడు భాగీరథికి బదులుగా వాల్మీకిచెప్పినట్లే ప్రకటింప బడినది. జనకుడు అహో ఎవ్వడి బాలకుడని వర్ణించు సందర్భమున కువలమదల స్నిగ్ధ శ్యామ శ్శిఖడకమండనో అను శ్లోకమున్నది. దీనికి కలువ రేకుల కాంతి జిలుగునున్న దనంపుమెరుగు చామన ఛాయ మేను వాడు అను సీస పద్యమున అనువాదము. ఈ పద్యమున బలిజేపల్లిమూల శ్లోక భావమును ఆధారముగా గ్రహించి ఎంతో విస్తరించి వర్ణించెను. అచ్చ తెలుగు పదముల అల్లిక జిగిబిగిలో లక్ష్మీకాంతకవి నెరపిన అందచందములు గుమనార్హములు. చలువ వెన్నెల జాబిలివోలె, వున్నెంపుసిరినించుచున్నవాడు. పిల్ల సిగతోడ ముద్దాడు చిన్నారి మోమువాడు వంటి ప్రయోగములలో అచ్చ తెలుగు నుడికారపు సొంపు వటు( బాల) సౌందర్య వర్ణమున ప్రతి ఫలించినది. ఇనంతరము కంచుకి ఈ బాలకుడు క్షత్రియ బ్రహ్మచారి అని నమ్మకమునును. అపుడు జనకుడు సందేహమెందుకని ఆ బాలకుని మరల అభివర్ణించెను. చూడా చుంబిత కంకపత్రమభిత స్తూణీద్వయంపృష్ఠతః అను శ్లోకమున ఆ బాలుని ఆభివర్ణణమున్నది. ఈ సందర్భమున కూడ బలిజేపల్లి వీపు నందిరు వంక పెలయు గ్రొమ్ముడి దాకు కంక పత్ర కదంబకముల దొనలు అను సీస పద్యమును రచించెను. ఇట తేటగీతికి మూలము లేదు. దీనిని కవి స్వయముగా విస్తరించెను. ధీరలలిత ప్రసన్న గంభీరమైనఅల్లుమా హొక్క తేచాలదాఇతండు క్షత్రియ బ్రహ్మచారి నిక్కమని తెలుప అని మూలభిన్నమగు వివరణ. మూలమున గలపై శ్లోకమునకు పిదప భగవత్యరుంధతికి ముత్ప్రేక్షసే కుతస్త్వే2 యమితి అని జనకుడు అనగా అరుంధతి మయమద్యైవాగతాః అని సమాధానమిడును. అటుపై కంచుకితో జనకుడు అతీవకౌతుకమే వర్తతే అని తెలుపును. బలిజేపల్లి ఈ సందర్భమున అరుంధతిని నంబోధించిన విషయము అనువదించెను. ఇట కొంత కౌసల్యా జనకుల సంభాషణను బలిజేపల్లి వారు పరిత్యజించిరి. లవుడు ప్రవేశింపగనే అరుంధతీ జనకులు అతనిని దీవింతురు. ఈ దీవెన గీర్వాణభాష యందే ఉండుట సముచితమని మూలమునున్నట్లే కల్యాణిన్. ఆయుష్మాన్ భూయాః అని ప్రయోగించెను. అరుంధతీ కౌసల్యలు లవుని తమయొడిలోనికిచేర్చుకొని అతని మొగమును చూచి పరమానందమొందిరి. కౌసల్యలవుని చుబుకమునెత్తి చూచి జనకునితో రాజర్షీ! కనిపెట్టితివా! నీని ముద్దు మోము నందు కోడలి మోము

చందురుని జాడలు చూపట్టుట లేదా! అనెను. జనకుడును పశ్యామి సఖి! పశ్యామి (చూచుచున్నాను సఖీ చూచుచున్నాను) అని తెలిపెను. అనంతరము జనకుడు ఆ బాలుని యందు జానకీ రాఘవుల పోలికలను గమనించును. ఇటు వత్సాయా శ్చరఘూద్వహస్య......సంపూర్ణ ప్రతి బింబితేవ నిఖిలా సైవాకృతి స్సాద్యుతిః సావాణీ వినయస్స ఏవ సహజః అని జానకీ రాముల లీలలు ఆతనిలో అచ్చు గ్రుద్దినట్లున్నవని అభివర్ణించెను. దీనినే బలిజేపల్లి -

ప్రతిభావంబు సమగ్రముట్టివడు శేవన్ జానకీ రాఘవుల్ ప్రతిబింబించిరొవీనిలోపల సురూవశ్రీలవే వాకదే గతి తేజో వినయంబు లాయపె నిసర్గ ప్రాభవంబౌనదే అని మూలము నందలి భావము కొరవకుండ ప్రతి పదౌచిత్య స్ఫూర్తిని గుర్తించి మూలమునందలి శార్దూలమును మత్తేభముగ అనువదించిరి. కౌసల్యమని నీవెవరి వాడవు తెల్పుమని అడుగునపుడు తెరలోపల సైనికుల నుద్దేశించి ఎవ్వరినో ఆశ్రమోపాంత ప్రదేశములను ఆక్రమింపకూడదని కుమార చంద్రకేతువు ఆదేశించును.. పిమ్మట ఆరుంధతీ జనకులిరువురు యాగాశ్వరక్షా ప్రసంగముచేసమీపించు చంద్రకేతువును చేతగలము. అహో! ఇదేసుదినము. అని అందురు. దీనిని అరుంధతి మాత్రమే అన్నట్లు బలిజేపల్లి వారు పేర్కొనిరి. జనకుడును లవునివలన కుశ లవుల వృత్తాంతమును వాల్మీకి రచిత కథా భాగమున వారికి కల స్థానమును విని సంతోషించును. కాని అంతలో మిథ్యాపవాదమునకు గురియై సీతా మహాదేవిని అడవిలో లక్ష్మణుడు ఏకాకిగా విడిచిపెట్టెనని లవుని వలన విని జనకుడు సీతా ఏమై పోతివి అని విలపించును. ఇట నూనం త్వయా పరిభవంచ నవంచ ఘోరం అను శ్లోకమున్నది. దీనిని అనిమిత్తంబగు నిందచేనడవి పాలై సాయముం జేయనా యను వారెవ్వరులేక అను పద్యమున లక్ష్మీకాంతకవి వివరించెను. జనకుడు సీతకు కలిగిన అవమానమునకు మిగుల కోపించెను. అపుడు కౌసల్య భగవతి రక్షింపుము. కుపితుడైన మానవంతుడు నింతకంటె ప్రాయశ్చిత్తములేదు. రాముడు నీకు పుత్ర విషయము కృపణుడైన ప్రజలను పాలింపదగిన వారని తెలిపెను. వెంటనే జనకుడు శాంతంవా రఘునందనే తదుభయంతత్పుత్ర భాండంహిమే భూయిష్ఠ ద్విజడ బాలవృద్ధ వికల స్త్రైణ శ్చపైరో జనః అని పల్కును. కాని ఈ శ్లోక భావమును కూడ బలిజేపల్లి అరుందతి చెప్పిన విషయము నందే అన్వయించుచు ఆదరణీయ ద్విజ బాలవృద్ధ వికల స్త్రైణంబికన్ సైపనౌ అను వాక్యమున పేర్కొనెను. ఇంతలో వటువులు అశ్వ స్వరూపమును గూర్చివింట మని పశ్చాత్ పుచ్ఛం వహతి విపులం అను శ్లోకమున వివరించిరి. బలిజేపల్లి దీనిని ఒకరికినలువురు వటువులు మాటాడినట్లు విడి విడి సంభాషణలలో అనువదించిరి. ఇటుపై వారు లవుని లాగికొని పోవజూచిరి. ఇచ్చట అరుంధతీ జనకులు పూరయతు కౌతుకం వత్సః అని అన్నట్లు కలదు. దీనికి ఉత్తర రాఘవమున అనువాదములేదు. అనంతరము కంచుకి ఘృ(గృ)ష్టి ప్రవేశించి వాల్మీకి భగవానులు తక్కిన విషయము తనసమయవలన మీకే తెలియునట్లు సెలవు ఇచ్చినట్లు తెలిపెను. పిమ్మట జనకుడు అరుంధతీ, కౌసల్యలు వాల్మీకిని దర్శించుటకై వెడలిరి. వటువులు, లవుడు మాత్రమే అశ్వమును గూర్చి చర్చించుకొనిరి అంత లవుడు ఆత్మను రగిలించుచున్నవి. ఈ అక్షరములు అనును. ఇంతలో ఒకపురుషుడు క్రోధదర్ప ములతో ప్రవేశించి ఏమీ అల్లరి. వెంటనే మా రాజపుత్రుడు ఇటకు తిరిగి రాకమునుపే పారిపొండని తెలుపును. తుట్టతుదిగా లవుడు నవ్వుచు ఏమీ! విచ్చుకత్తెల ఝడిపింతురా! అని ధనుస్సను ఆరోపించుచు జ్యాజ్వాయా వలయ తోత్కట కోటిదంష్ట్ర అను శ్లోకమున తన రాజసిక దీప్తిని ప్రదర్శించును. ఈ తుది శ్లోకమును బలిజేపల్లి వారు అనువదింపలేదు. ఇంతటితో మూలమున కౌసల్యా జనక యోగమను చతుర్థాంకము ముగియును. ఉత్తర రాఘవమున నిది పంచమాంకము.

ఉత్తర రామ చరితము నందలి కుమార విక్రమమను పేరు గల పంచమాంకము ఉత్తర రాఘవమున కూర్పబడినది. సుమంత్ర చన్ద్రకేతుల సంభాషణతో ఈ అంకము ప్రారంభమైనది. చన్ద్రకేతువు సుమంత్రునితో ఆ బాలుడెవడో చూడుమని తెలుపు సందర్భమున కిరితి కలిత కించిత్ కోప

రజ్యన్మ్మఖ(శ్రీః ముని జన శిశురేక స్సర్వత స్సైన్యకాయే అను రెండు శ్లోకములున్నవి. ఇందు మొదటి శ్లోకమునకు కించిత్ప్రమముతో ముఖాంబుడ రుచుల్‌కెంపార అను పద్యము అనువాదము. రెండవ శ్లోక భావము వచనము నందే అనువదింపబడినది. సుమంత్రుడు అతనిని చూచి ధృత ధనుషం రఘునందనం స్మరామి ( ధనువుదాల్చిన రఘు నందనుని స్మరింతు) అని సమాధానమొసగెను. అపుడు చన్ద్రకేతువు ఒకని నుద్దేశించి వలువురు ఇంతగా పెనగు చుండుట తనకు సిగ్గుగున్నదను సందర్భమున అయం హి శిశురేకః సమర భార భూరిస్ఫురిత్ అను శ్లోకమున సైన్యవర్ణనము కలదు. ఏలనో దీనిని బలిజేపల్లి అనువదింపలేదు. మరల వెంటనే చన్ద్రకేతువు ఆగుంజత్ గిరికుంజత్ కుంజరఘుత్తై అను శ్లోకమున నుగ్గు నూచముగు సైన్యమును గూర్చి వివరించును. దీనిని బలిజేపల్లి భేరీ భాంకృతఘూర్ణమాన నిజమౌర్వీ భాంకృతింజేసి అను శార్దూల వృత్తమున ఆంధ్రీకరించిరి. చన్ద్రకేతువు లవుని ప్రశంసించు సందర్భమున భోః భోః లవ! మహాబాహో ...... తేజస్తే జసి శామ్యతు అనిపొగడెను. దీనిని బలిజేపల్లి ఔరా! ఓ లవ! వీరాగ్రణివి గదోయి.... తేజము శమించు గావుత! తేజమందె అని అక్షరాక్షరము అనువదించెను. అనంతరము సుమంత్రుడు కుమార! చూడుము! అతడు మనపైకి పొగరు సింగపుపిల్లవలె వచ్చుచున్నాడు. అని తెలుపును. దీనికి మూలము వ్యపవర్తత ఏష బాలవీరః...... దృష్ట సింహశాబః అను శ్లోకము. ఇట బలిజేపల్లి దీనిని వచనమునందే అనువదించిరి. లవుడు సేనపై మరలగా చన్ద్రకేతువు సుమంత్రునితో ఈ వీర కిశోరుని విజృంభము చూడుమని తెలుపు సందర్భమున దర్పేణ కేతుక వతామయి ఖద్గలక్ష్యః అను శ్లోకము కలదు. దీనికి అనువాదము లేదు. కుమారులిరువురు సస్నేహానురాగములతో ఆహో! ప్రియదర్శనుడీ కుమారుడని చన్ద్రకేతువు నుద్దేశించి తలంతురు. ఈ సందర్భమున యదృచ్ఛాసంవాదః కిము కిముగుణానా మతిశయః పురుణోవా జన్మాన్తర నిబిడబద్ధపరిచయః నిజవాసమ్బన్ధః కిమువిధివశాత్కోప్యవిదితో మమైతస్మిన్ దృష్టే హృదయమవధానం రచయితి అను చక్కని శ్లోకమున్నది. దీనిని బలిజేపల్లి రసబంధురముగా మత్తేభవృత్తమున ఇట్లను వదించిరి.

> కనుగొన్నంతనే వీనియందు మదిలగ్నంబయ్యె నద్వైతభా
> వన! యాదృచ్ఛికమో, గుణాతిశయ సౌభాగ్యంబో, జన్మాంతరం
> బునజేకూరు, నిరూఢమై తగుచిరంపున్‌మైత్రియో, యొక్కడో
> క్కని సంబంధము దైవతంత్రము నెరుంగన్‌రాని భాంధవ్యమో

అనువాదమున మూలమునందలి పదపదము యథాతథముగా పరివర్తింపబడకున్నను మూలమునందలి భావమే యిందు రసోద్దీపముగా స్వతంత్రతా దీప్తితో ప్రకటితమైనది. సుమంత్రుడును ఒకరిపైనొకరికి రసమయమగు ప్రీతి. అకారణముగా జనియించి హృదయ మర్మములను పెనవేయుచున్న భావమును పేర్కొనెను. ఇట్టి ప్రీతిని అనుభవజ్ఞులు తారా మైత్రము, చక్షూ రాగమని వ్యవహరింతురనెను. ఇట అహేతుః పక్షపాతో యస్తస్యనాస్తిఅను శ్లోకమున్నది. హేతువే లేని ఈ పక్షపాతమునకు అను గీతపద్యము దీనికనువరణ ఇటకుమారు లిరువురు ఒండొరులను గూర్చి తలచిన భావములు 18, 19 శ్లోకములలో అభివర్ణితములు 18 వ శ్లోకము గీతమున, 19 వ శ్లోకము వచనమున అనూదితము. సుమంత్రుడు లవుడు నిర్వర్ణించి చూచి కన్నీళ్లతో తనలో హృదయమా! ఏలనీకీ అడియాస అను తలచు సందర్భమున మనోరథస్య యదగ్రేణ తత్ద్దైవేనాదితో హృదయ్ లతాయాం పూర్వ లూనాయాం ప్రసవస్యోద్గమః కుతః అను శ్లోకమున్నది. దీనికి బలిజేపల్లి వారు ఎంతో తేటతెల్లముగా తేటగీతిలో రసమయముగా తెనిగించిరి. అది యిది.

> అక్కటా! మనోరథంబుల కాదిమూల
> మేదొ దైవంబు దాని మున్నే హరించె

త్రెంపి మునుయే పాఱమైన తీవకింక

క్రొత్త విరి మొగ్గమేమి చేకూరు తీమి! - రాముని మనోరథబీజమునే దైవము హరించెను. అనగా సీత దర్శ్వధిచే రామునికి ఎప్పుడో దూరమైన దని సుమంత్రుని ఆవేదన. తీగయే తెగి పోగా ఇక మొగ్గ యెట్లు పుట్టునన్న మృదు లలిత మనోహర భావమును హృదయస్పర్శగా అచ్చ తెనుగు పద జాలమున బలిజేపల్లి వివరించిన విధము మూలమునకే సొగసులు దిద్దినది. మున్నే త్రెంపబడిన తీగ అను భావమునకు లతాయాం పూర్వలూనా యాం అని మూలము. దీనికి త్రెంచి మునుపారమైన తీవ అని తెనిగింపు. పారమైన అనుటకు మూలము లేదు. కవి ప్రయోగించిన ఈ క్రియాపదమువలన మూలభావమునకు మెరుగులు దిద్ద బడుటయేకాక మనస్సు నెంత అది బాధించు చున్నదో రసోద్వేలముగా ప్రకటిత మైనది. ఇట్లే ప్రసవస్య ఉద్భవః అన్న ప్రయోగము చు విరిమొగ్గ అని అచ్చ తెలుగు పదబంధ ములో తెనిగింపబడినది. ఈ పదబంధము నందలి ద్విత్వాక్షరములు, అందలి రకారములు మానసికమైన తాపమును నొక్కి వక్కాణించు సుమంత్రుని మనస్స్థితిని వ్యంజింపచేయుచున్నవి. సుమంత్రుడు చన్ద్రకేతునితో నీవు దర్శాచారము నతి క్రమింపలేదు. ఇదియే సనాతన సాంగ్రామిక ధర్మము అని తెలుపును. ఇట మూలమున శ్లోకముండగా బలిజేపల్లి వచనము నందే అనువదించిరి. వెంటనే చన్ద్రకేతువు అప్రతిరూపం వచనం ఆర్యస్య అనును. దీనికనుబంధముగా ఇతిహాసం పురాణంచ ధర్మ ప్రవచనానిచ అను శ్లోకమును గలదు. బలజేపల్లి చన్ద్రకేతువు యొక్క సంభాషణమును పూర్తిగా విడిచిపెట్టిరి. ఇట మరికొంత సంవాద క్రమమును ( అనగా సుమంత్ర చన్ద్ర కేతువుల శ్లోక రూప సంభాషణ) పరివర్తింపక వదలి పెట్టబడినది. చన్ద్రకేతువు రథమును దిగి సుమంత్రు నుద్దేశించి నమస్కరించును. అటుపై సుమంత్రుడు 27, 28 శ్లోకములలో తెలిపిన విషయమునకు అనువాదము లేదు. అజితం పుణ్యమూర్జస్వి దేవస్త్వాం సవితాధినోతు అనునవి ఆ రెండు శ్లోకములు. లవుడు సుమంత్రునితో ఆర్యా! ఆరాజర్షి సజ్జనుండని ప్రసిద్ధ అని తెలిపిన అనంతరము మూలమున వయమపినఖలు పేమంప్రాయాః క్రతుప్రతిఘాతినః అను శ్లోకమున్నది. దీనికి సత్రాలంబడ గొట్టుపాటి అసదాచారమ్ము సైరింప అను శార్దూల విక్రీడితవృత్తము అనువాదము. చన్ద్రకేతువు చిరునవ్వుతో కింను భవతః తాత ప్రతాపోత్కర్షేపి అమర్షః అని లవును ద్దేశించి పలుకును. తండ్రి గారి ప్రతాపోత్కర్షమున గూడ నీకసహనమా అని అనువాదము. తాత అనగా తండ్రి అని అర్థము కాని సందర్భమును బట్టి పెద తండ్రి అని ఇట గ్రహింపవలెను. జయంతి రామయ్యగారు మా పెద నాయనంగారి అని అనువదించిరి. చన్ద్రకేతువు లవునితో మాటకు మాట పెంచుకొని అధిక ప్రసంగమిందుకను సందర్భమున కోహ్యేష సంప్రతినవః పురుషావతారో! అను శ్లోకమున్నది. దీనిని బలిజేపల్లి వారు జాతీయమగు పలుకు బడితో రసోద్దీపకముగా మత్తేభవృత్తమున నిట్లు వర్ణించిరి.

ఇకనేమీతఁడు క్రొత్తగా వెలసినాఁడేవీరు డిమ్మేదినిన్

భగవంతుండగు జామదగ్న్యు తలలో నందూటి పోగల్గువా

డగు నేకా - అని తెనిగించెను. తలలోనందూరి పోగల్లవాడు అను తెలుగు పలుకుబడి వలన భావప్రకటనలో వీర రసస్ఫూర్తిగల ఉపు సౌందర్యోత్పాదకము ప్రాపు ఒకటిగా జత కూడినవి. నిర్లక్ష్యము గా ఎదుట వాని నెదిరించెడి హాస్య ధోరణియు ఈ జాతీయ నగు పలుకుబడియందు ప్రస్ఫుటముగా అభివ్యక్తమయినది. అటుపైలవుడు ఆ రఘుపతి చత రితము మహిమ మాకెరుకయే అని తెలుపును. ఈ సందర్భమున వృద్ధాస్తేన విచారణీయ చరితా స్తిష్ఠంతు కింవర్ణ్యతే అను శ్లోకమున్నది. దీనిని ఎంతో సహజముగా అలతి అలతి వాక్యము లలోల లిత మధుర పదజాలముతో ఉత్పలమాలావృత్తమున బలిజేపల్లి అనువదించిరి. ఆన్నపులెంతయైనను మహాత్ములు పెద్దలు గాన వారిసేమనరాదు అను ఉత్పలమాలయే పైశ్లోకమునకు అనుసరణ. అటుపై పంచమాంకాంతమున చన్ద్రకేతువు తండ్రి గారిని అధిక్షేపించుచున్నావుగదా అని లవునితో ఎదిరించి మాటాడును. ఇట లవుని మూలమున

తాతావాద భిన్నమర్యాద! అని సంబోధింపబడి ఉన్నది. అది అనువాదమున లేదు. పిమ్మట లవుడుచన్ద్రకే
తువును మయ్యేవత్రుకుటీధరసంవృతః అను అనును. ఓయీ! నా మీదనే-ఈ కను బొమ్మలు ముడిపెట్టు
అని జయంతి రామయ్య గారి అనువాదము. ఇది ఉత్తరరాఘవమునలేదు. అంకాంతము సుమంత్రుడు
స్ఫురితమనయోజాటోపేన అని పలికిన పిదప చూడామండల బంధనం తరళయాత్మకూత జోపేపధుః
అను శ్లోకమున కోపించినప్పటి ఆకృతిని కూడ అభివర్ణించినట్లున్నది. ఉత్తరరాఘవమున నిదిలేదు
అందరు నిష్క్రమింపబోవుటకు ముందు కుమారులు తదితోవమర్ధతమాంభూమింఅవరావః అని
అందురు. ఈ వాక్యమునకు తగిన చోటుకు పోదుము రమ్ము లవుడు చన్ద్రకేతువుతో అని ఇరువురును
దర్పముతో నిష్క్రమించినట్లున్నది. అటుపై సుమంత్రుడు రథముతో వెంటపోవుననియు ఉత్తరరాఘవ
షష్ఠాంకమునసూచింప బడినది. అంతేకాని సుమంతుడు వారి కోపమును అభివర్ణించుటను బలిజేపల్లివారు
ఎందువల ననో వదిలివేసిరి. బలిజేపల్లి వారు ప్రత్యాంకమునందును అంతమునగల కొంత విషయమును
అనువదింపక వదలిపెట్టు చున్నట్లు తెలియుచున్నది. ఇట్లు ఉత్తరరాఘవ షష్ఠాంక మునందలి ఇతి వృ
త్తము అక్కడక్కడ కొంత ప్రక్షిప్తము అగుట తప్పచాలవరకు మూలవి ధేయముగనే సాగినది.

భవభూతిక ఉత్తరరామచరితనాటకషష్ఠాంక ప్రారంభమునందు విద్యాధరీ విధ్యాధరసంవాద
రూప మిశ్రవిష్కంభకమున్నది. వారిసంభాషణమున యుద్ధవర్ణన కలదు. ఇది ప్రదర్శింప బడని
విషయమగుటచే ఆకసమున విద్యాధరీ విద్యాధరులు చూచి అభివర్ణించినట్లున్నది,. వారి వర్ణనము
సూచనా మాత్రమే. ఇది అంత రసవంతమైన విషయముగాదని బలిజేపల్లి పూర్తిగా వదలివేసెను. విధ్యాధరీ
విధ్యాధరులు నిష్క్రమింపబోవు సందర్భమున రాముడు పుష్పకము నుండి దిగివచ్చుచున్నట్లు తెలుపుదురు.
ఆటనుండి రామ, లవ, చన్ద్రకేతు, కుశ లవుల సంభాషణము షష్ఠాంకము నందలి యితి వృత్తము.
బలిజేపల్లి వారు రాముడు పుష్పకము నుండి దిగివచ్చిన సన్నివేశము నుండియే మూలమును అనుసరించెను.
కాని వారీ సందర్భమున విధ్యాధరీ విద్యాధరపాత్రలకు బదులుగా సప్తమాంకమునందు ఆకాశమ్మున
అని శార్దూల వృత్తము నందు యుద్ధమును గూర్చి యిట్లు అభివర్ణించిరి. ఓహో! వీరకిశోరులార! భువనా
త్యుగ్రంబు డీలీమారణోత్సాహంబుల్ విరమింపు అను పద్యమున లవునకు, చన్ద్రకేతువునకు జరిగిన
యుద్ధము తద్భీకరత్వము సూత్రప్రాయముగా అభివర్ణింపబడినది. ఆ పద్యమునకు వెంటనే అహో
ఏమీయామేఘ నిర్ఘోషము అనును. పిమ్మట సుమంత్రుడు లవుని, చన్ద్రకేతువు నుద్దేశించి శంబుకవద్ధా
మే గిన రఘునాధుడీ మార్గమున వచ్చుచున్నట్లున్నాడు అని తెలిపెను. సుమంత్రుని వాక్యము వలన ఇటులవ
చన్ద్రకేతుల యుద్ధమే కాక, అటు శ్రీరామ చంద్రుడు కావించిన శంబుకవధ వృత్తాంతమును సూచితమైనది.
యుద్ధము, వధఅను రెండును నాటకమున సూచింపదగినవి. కావున ఉత్తర రామ చరితమున విద్యాధరుడు
నిష్క్రమింపబోవు సందర్భమున తెలిపిన అంశమే ఉత్తరరాఘవమున సుమంత్రుని మూలమున సూచింప
బడినది. అనంతరము మూలవిధేయముగనే ఉత్తరరాఘవమున ఇతి వృత్తము అనువ దింప బడినది.
రాముడు పుష్పకము నుండి దిగి చన్ద్రకేతువును గ్రుచ్చికౌగిలించి దివ్యాస్త్రధర దేహునకు కుశలమే గదా!
అనును. కుశలం అత్యద్భుతక్రియస్య ప్రియ దర్శన్య లాభాభ్యుదయేన అని చన్ద్రకేతువు సమాధానమొసగును.
ఉత్తరరాఘవమున ఈ సందర్భమునందు ఈ లవుని చెలికాడుచే అని ఆప్రియదర్శనుడు అత్యద్భుత
క్రియుడెవరో విస్పష్టముచేసెను. లవుడు శ్రీరాముని చూచితనలో ఈమహానుభావుడు నన్నుకూడ
కౌగిలించుకొన్న బాగుండును. అని తలచును. ఈ భావము మూలమునలేదు. ఇది కవిస్వీయముగా
కల్పించినది. ఈ కల్పన ఈ సందర్భమున రసస్ఫోరకముగా, ఔచిత్యవంతముగా, సహజ గాంభీర్యముగా,
మధురమరందముగా, ఉత్కంఠావహముగా ఉన్నది. లవుని గాంచిన రాముడును ఈతడొకసారి కౌగి
గావించుచున్నాడు. ఈస్నేహమునకునిమిత్తమేమి అని తలచును. ఈ ప్రేమ బహిరుపాధులచేత యేర్పడదు.
కలువచెలికానిగని చన్ద్రశిలకరిగినట్లు, ప్రొద్దుపొడువగనే తమ్మి మొగ్గవిచ్చునట్లున్నది కదా! అని తలచును.

దీనికి మూలమున గల శ్లోకములో నఖలు బహిరుపాధీన్ ప్రీతయః ద్రవతిచ హిమరశ్మౌ చన్ద్రకాంతః పతంగస్యోదయేపుండ రీకం అను ప్రయోగములున్నవి. లవుడు నమస్కరింపగనే రాముడు ప్రేమతో కౌగిలించి చలువవెన్నెలతో గంధమలదునట్లు అతని మైతాకు తనకు ఆమోదమయ్యె నని తెలిపెను. మూలమున ఈ స్పర్శసుఖమును గూర్చి నందయతి చంద్రచందన నిష్యంద జడస్తవస్పర్శః అని కలదు ఈ ప్రయోగమునకు చంద్రునివలెను. చందనమువలెను. చల్లగా నున్నదని భావము. బలిజేపల్లి మరికొంత వినూత్నముగా దీనిని తెలిపెను. చలువవెన్నెల, గంధము ముందు ప్రయోగింప బడినను వెన్నెలతో గంధ మలదునట్లు చెప్పుట ఎంతో క్రొత్తదనము రామునితో చన్ద్రకేతువు వినలవుడు ఇంచుక విక్రమించి నాడని తెలుపగా క్షాత్రమునకిది అలంకారమే గదా అని సతేజస్తేజస్వి అను శ్లోకమున సమర్థించెను. దీనిని బలిజేపల్లి తేజశ్శాలి సహింపడెన్నడు పరోత్తేజంబదేమీనికిన్ సైజంబై అవి అనువదించెను. లవుడు, రామునితో మేము ఇరువురము అన్నదమ్ములము. కవలము అని అన్నపుడు రాముడు అట్లైన రెండవవాడు ఎవ్వడని ప్రశ్నించెను. ఇంతలో నేపథ్యమున భాండాయన! భాండాయన! అను సంబోధనముతో ఆయుష్మతః కిల లవస్యనరేంద్రసైన్యైః అను శ్లోకము కూర్చబడినది. దీనిని భూమీపాలురసైన్య కోటికిని తమ్ముంగుఱ్ఱకున్....... అని నిజంబే చెప్పుము అని ఆంధ్రీకరింపబడినది. కుశపాత్ర ప్రవేశము సూచించుటకు ముందు తెరలో తెలుపబడిన విషయము భాండాయన సంబోధనాత్మకముగా సాగినది. జరిగిన, జరుగనున్న కథాంశములను సూచించుటకై చతుర్థాంక ప్రారంభమునందే భాండాయన సౌధాతకి పాత్రలు ప్రవేశపెట్టబడినది. ఉత్తరరాఘవమున ఆపాత్రల ప్రసక్తి ఆ సందర్భమున పూర్తిగా వదలిపెట్టబడినది. ఈ సందర్భమున యథాతథమగు అనువాదము గావించుచు భాండాయన ప్రసక్తిని కూడ అట్లే స్వీకరించెను. ఈ పాత్రవలన ప్రత్యేక ప్రయోజనము కథాదృష్టితో చూచినపుడు లేకున్నను, జరుగనున్న వృత్తాంతమును నేపథ్యమున తెలుపుటకు సాధనగా నాటక లక్షణములను బట్టి ప్రవేశ పెట్టబడినదనిమనము గ్రహింపవలెను. కుశుడు అద్భుత హర్షధైర్యములతో ధనువునాస్ఫాలించుచు ప్రవేశించెను. అతనిని రాముడు చూచి ఈ క్షత్రియ బాలకుని పౌరుషాతిరేకము ఏమి. అని ఆశ్చర్యపడెను. ఈ సందర్భమున దృష్టిస్తృణీకృత జగత్త్రయ సత్త్వసారా .... వీరోరసః కిమయమేత్యుదర్పవ అను శ్లోకమున కుశుని బాలవీరత్వము అభివర్ణితము. బలిజేపల్లి ఈ శ్లోక భావమునే కఱకు మెఱుంగు చూపుత్రిజగంబుల సత్త్వబలంబులన్ తృణీకరణమొనర్ప... దురదురవచ్చెడిన్ ధనువుతో నడుపీరములేక దర్పమో అని ఆంధ్రీకరించెను. వీర రసమా అన్నదానిని తనువుతో నడుమ వీరముగా పేర్కొనెను. రాముదు కుశుని కౌగిలించుకొని తనలో భావించినవాత్సల్యము అంగాదంగాత్ స్రుత ఇవ నిజో దేహజః స్నేహ సారః అను శ్లోకమున అభివర్ణితము దీనిని అంతర్నాడికలం దొరంగునిజదేహస్నేహ సారంబో అను పద్యమున అర్థవంతముగా ఆంధ్రీకరించెను. కుశ లవుల జన్మవృత్తాంతములో ఏదో రహస్య ముండి తీరునని రాముడు తనలో భావించిన సందర్భమున భవభూతి వరుసగా ఒకటికి నాలుగు శ్లోకములను రచించిరి. ఇందలి మొదటి రెండు శ్లోకముల భావము వచనము వందే బలిజేపల్లి అనువదించిరి. కఠోరపారావతకంఠమేచకం అపిజనకసుతాయాస్తచ్చ తచ్చారురూపం అను రెండు శ్లోకముల భావమును తరుణ కపోత కంఠచ్ఛాయతో రాయమెఱు గారు నిద్దంపుమేని చాయ అను సీస పద్యమున పేర్కొనెను. సీస పద్యమునందలి నాలుగు పాదములతో 18 వ శ్లోకము కొంత విస్తరింపబడినది. ప్రసన్నసింహస్తిమితం చవీక్షితం ధ్వనిశ్చ మాంగల్య మృదంగమాంసలః అను రెండు పాదములు ధీర ప్రశాంత గంభీర నిశ్చలమైన కొదమ సింగంపు మేలు దుటు చూపు కణకణ లాడు మంగళమ్ము దంగధ్వనిం దలపించు కంబు కంఠ స్వరంబు అని కొంత వివరణాత్మముగా వివరింపబడినది. మూలమున కంటె ఇందలి భావము ఎంతో తేటతెల్లముగా కన్నులకు గట్టినట్లు తేటగీతి పద్య.ములో తెలుప బడినది. సూక్ష్మముగ మరిమరి చూచుకొలది జానకీ లీలలెన్నియో గానవచ్చు కనులలో

నాడుచున్నదా కలికిమోము అని అనువాదము. మూలమున తామరాకులప్రసక్తి యోలాదు గోచరీభూతం అక్ష్ణోః అనగా కన్నులకు గోచరమని అర్థము. కాని కనులలో ఆడు చున్నది అను తెనిగించుట భావజన్యనిత్యచైతన్య స్ఫూర్తి విలసనమునకు నిదర్శనము ఆడుచున్నది. అన్న ఆక్రియాపదమున నిత్యము కనులఎదుట కదలుచు మెదలుచున్నదన్న భావము ధ్వనితము. నైపుణోన్యేయం అని మూలమున ప్రయోగము. దీనికి నేర్పుతో కనుపెట్టవలెనన్న సూక్ష్మతర దృక్పథము అవసరము. సకృతి సూక్ష్మముగా ఒక్కమారు చూచినంతనే ఒక వస్తువుయొక్క తత్త్వము పరిపూర్ణముగా గోచరముగాదు. మాటిమాటికి చూడవలెనన్న ఆసక్తి రమణీయ వస్తు విషయముననే నిశ్చలముగా నిలుచును. క్షణక్షణము దేని యందు క్రొత్తదనము కన్పట్టునో అందపరిపూర్ణసౌందర్యము. నిత్య నిరంతరము తొణికిసలాడు చుండును. జానకీదేవి యొక్కసౌందర్యచ్ఛాయలు కుశలవులలో రామునికి కన్పట్టినవి. జానకీలీలలెన్నియో గాననగుచు అని బలిజేపల్లి పేర్కొనుట ప్రశంసార్హము ఇచ్చట లీలలన్న పదమునకు కేవలము ఆమె యందు కాననగు పోలకువలే గాక అంతర్ జగత్తునుండి అభివ్యక్త మగు మెలకువలు కూడ సూచనములు. లీల యనగా విలాసమని సామాన్యార్థము కాని ఇట జానకికి సంబంధించిన ప్రతి విషయము ఈ లీలలన్నపదమున నిరూఢము. కుశలవులిరువురు బాల చరిత్రయొక్క అంత్యమాధ్యాయములోని రెండు శ్లోకములను పఠింతురు.

ప్రియాతు సీతా రామస్యదారా పితృకృతా ఇతి

గుణా ద్రూప గుణాచ్చాపి ప్రీతిర్భూయో వ్యవర్ధత - ఇది కుశుడు పఠించినది. తథైవ రామస్సీతాయాః ప్రాణేభ్యోః ప్రియో భవత్

హృదయస్త్వేవ జానాతి ప్రీతియోగం పరస్పరమ్ ఇది లవుడు శ్రీరాముడు కోరగా పఠించినది. ఈ శ్లోకములు యథాతథముగనే స్వీకరింపబడినది. కాని వాని అర్థమును పాఠకులు గ్రహించు నిమిత్తమై అథస్సూచికలో వాని తెనిగింపు తేటగీతి పద్యములలో కవి తెలిపెను. రాముడు పాడు ప్రాణంబులేటికో పానిపోక ప్రాకులాడుచునున్నవి పాపి బొంది అని దుర్భరవియోగ భారము అనుభవించు సందర్భమున కుశుడు మరియొక శ్లోకమును చదివెదనని చిత్రకూట విహారవేళ రఘునాథుడు సీతా దేవిని గూర్చి పలికిన త్వద్దర్శమివవిన్యస్త శిలాపట్టోయమగ్రతః అను శ్లోకమును చదువును. అపుడు రాముడు మనివాంద్రు చాలబేలలు, విశేషించి అరణ్య సంచారులు అని అనును. ఇట శ్రమాంబు శిశిరీ భవత్ ప్రస్త మంద మందాకినీ అను 30 వ శ్లోకమునకు చిరం ధ్యాత్వాధ్యాత్వా అను 31 వ శ్లోకమునకు అనువాదము లేదు. నేపథ్యము నందలి 32 వ శ్లోకభావమువటువుల మూలమున వచనమున ప్రకటితమైనది. ఏమ్మట రాముడు అరుంధతీ వశిష్ఠులను, తల్లులను, మామగారినే మొగమున చూతును. నేనెంతమందభాగ్యుడను. అని అనేక విధముల పరితపించును. బలిజేపల్లి వారు ఇచ్చట కొంత స్వతంత్రించి రచించిరి. నేపథ్య శ్లోకము వదలిపెట్టబడినది. తుట్టతుదిగా రాముడు హాతాత జనకా! హామాతరః అని సంబోధించును. జనకానాం రఘూణాం చయత్కృత్స్నం గోత్రమంగళం అస్మిన్నకరుణే పాపే వృథావః కరుణామలు అని పల్కును. దీనిని బలిజేపల్లి హాజనకా! హా తల్లులారా! జనక రఘువంశముల రెంటికినే సాధ్వీతిలకంబు సమస్త కల్యాణముల కాస్పదమో అట్టి పావని యెడనైతము దయ మాలిన కఠినాత్ముడను నా యందు మీరు కరుణ చూపవలదు! అని తెనిగింపు షష్ఠాంకాంతమున కుశలవులు ఇతఇతస్తాతః అని అందురు. దీనికి అనువాదము లేదు. కాని దీనికి ముందు బలిజేపల్లి స్వయముగా ఒక వాక్యమును కల్పించెను. ఇది రాముడు ప్రకాశముగా కుమారులనుద్దేశించి అన్నమాట. మనమే త్వరగాబోయి వారిని సంభావింతము రండు అనునది. ఇట ఈ వాక్యము ఎంతో ఔచిత్యముగా ఉన్నది. ఎవరి దారి వారు పోక పెద్దలకడకు మన మందరము పోవుదము రమ్మని ఆహ్వానించు రాముని వినయగౌరవ సంపత్తిని పూజ్య పూజా ధార్మికత్వమును వెల్లడించుచున్నది. ఇట్లు కుమార ప్రత్యభిజ్ఞానమును షష్ఠాంకము

ముగిసినది. ఉత్తర రాఘవమున నిది సప్తమాంకము.

ఉత్తరరామచరితము నందలి సప్తమాంకము ఉత్తరరాఘవమున అష్టమాంకముగా కూర్పబడినది. ఈ అంకము యొక్క ఆరంభమున లక్ష్మణుడు ప్రవేశించి వాల్మీకి అప్సరస్త్రీలచే నాడించు నాటకమును భాగీరథీతీరమున చూచుటకు ఆర్యుడగు శ్రీరామభద్రుడును దయచేయుచున్నాడని తెలియచేయును పిమ్మట రాముడు ప్రవేశించును. సమ్మేళనము ఈ అంకమున ప్రదర్శితముగు అంతర్నాటకము కరుణాద్భుత రసబంధురము. తెరలో పాత్ర ప్రసవవేదనతో అల్లాడున్నను ఈ గంగకే అప్పగించితిరా! అని మొరపెట్టుకొనును. దీనిని సూత్రధారుడు చెప్పి నిష్క్రమింపగనే రాముడు జానకీ! సాహసింపకుము. లక్ష్మణా! రక్షింపుము అని అరచును. లక్ష్మణుడు ఇది నాటకము. ఈ ప్రబంధార్థమును తిలకింపుడనును. పృథ్వీ భాగీరథులు సీతకడకు విచ్చేయుదురు. లక్ష్మణుడును ఆర్యపృథ్వీ భాగీరథులచే అనుగ్రహింపబడినదని కొంత ఊరటనొందును. పృథ్వీ భాగీరథితో రామభద్రునకు సీతపైగల గాఢానురాగము నేను మాత్రమెరుగనా అని పలుకును. ఈ సందర్భమున **దహ్యమానేన మనసా దైవాద్వత్సాం విహాయసః... ప్రజా పుణ్యైర్జీవతి** అను శ్లోకమున్నది. దీనినే **బలిజేపల్లి విధివశంబున ప్రియురాలు విడువియతడు- బ్రతికియున్నాడు, ప్రజలసౌభాగ్యమును** అని అనువదించెను. వెంటనే రాముడు **సకరుణా హి గురవః గర్భరూపేషు** అని అనును. దీనిని **పిల్లలయందు పెద్దలకెపుడు దయమే ఉండును గదా!** అని జయంతి రామయ్యగారు అనువదించిరి. ఉత్తరరాఘవమున దీనికి అనువాదమే లేదు. జృంభకాస్త్రముల ప్రసక్తి వరలనిట కల్పింపబడినది. అంతరిక్షమంతయు ప్రజ్వలించు జృంభకాస్త్రములు సీతాదేవికి ప్రణమిల్లినట్లు తెరలో తెలుపబడినది. అపుడు సీత దిష్ట్యా అస్త్రదేవతాః స్ఫురంతి అనును. దీనిని బలిజేపల్లి ఆహా! ఆనందము అస్త్ర దేవతలు ప్రస్తుతించుచున్నారు. అని అనువదించెను. పృథ్వీభాగీరథులు సీతతో ఈ పుత్రకులిపుడు రామభద్రుడంతటివారైరి. అని తెలిపిరి. అపుడు సీత **ఏతయోః క్షత్రియో చితం కర్మ కరిష్యతి** అని పల్కును. వీరికి క్షాత్రసంస్కారమొనర్చువారెవరని దీని అర్థము ఈ వాక్యమునకు ముందు సీతదిక్కులేని దాననైతిని గదా అని అనును. ఇది బలిజేపల్లివారు స్వయముగా కల్పించిన వాక్యము పృథ్వీదేవి తన పుత్రికతో రసాతలమును పవిత్రీకరింపుమని అనును, అపుడు సీతనన్ను నీలో చేర్చుకొని లయమొందింపుము. ఇటువంటి జీవలోక పరివర్తనమింక నేను అనుభవింప జాలనని తెలిపినది. అపుడు పృథ్వీదేవత స్తనత్యాగం. వత్పుత్రయోరపేక్ష్యాపరేణతు తేయథారోచతే తథాకరిష్యసి అనినట్లు పాలు విడుచువరకు నీకొడుకులను పెంపుము. పిమ్మట నీ యిష్టప్రకారము చేసెదనని జయంతి రామయ్యగారి అనువాదము. బలిజేపల్లి వారు బిడ్డా! పాలు విడుచు వరకు నీవు నాకడుపుననుండి బిడ్డల కాపాడుకొనుచుండుము. పిదప వాల్మీకి నియోగమెట్లో అట్లు గావింతువు గాని రమ్ము అని పై భావమునే కొంత మార్చి రచించిరి. వాల్మీకి నియోగమున్నది కవికల్పన. అటుపై **ఏసంనామ** అను భాగీరథి పల్కును. దీనికి ఈ మాట బాగున్నది. వాల్మీకి ఆనతియు నిల్లేగదా అని బలిజేపల్లివారు వివరించిరి. ఇచ్చట గల వాల్మీకి ప్రసక్తియు లక్ష్మీకాంతకవి కల్పనమే అరుంధతి సీతతో **ప్రణయహితమైన నీకరస్పర్శ చేత రమ్ము బ్రతికింపు వేగమా రామభద్రు** అని పల్కెను. దీనికి మూలము ఏహి జీవయ మే లత్సం ప్రియస్పర్శయమపాణినా అనునది. సప్తమాంకము యొక్క చివరలో **జగత్పతే రామభద్ర నియో జయయథాధర్మం ప్రియాం త్వం ధర్మచారిణీం హిరణ్మయ్యాం ప్రతికరోతే** అను శ్లోకము అరుంధతి చెప్పినట్లుండగా వాల్మీకి చేసినట్లు బలిజేపల్లివారు మార్చిరి. అటుపై సీత తనలో ' జానాతి ఆర్యపుత్రః సీతాదుఃఖప్రమార్ష్టుం' అని తలచును. ' ఆర్యపుత్రుడు సీత దుఃఖమును మాన్ప దలంచెడునా ' అని దీని భావము. ఏలనో ఈ వాక్యమును బలిజేపల్లివారు వదలిపెట్టిరి. నాటకాంతమున భరతవాక్యమునకు ముందు వాల్మీకి పాత్ర ప్రాముఖ్యము ప్రకటితమైనది. వాల్మీకి ' కిమితిభూయః ప్రియ ఉపహరామి'

అని అడుగును. దీనికి 'రామభద్రునకు మిక్కిలి ప్రియమైన దేదియో కావించెదను' అని అర్థము. ఉత్తర రామ చరితమునందలి సప్తమాంకమును బలిజేపల్లివారు ఉత్తర రాఘవము ఎనిమిదవ అంకముగ స్వల్పములైన మార్పులతో మూలమునను సరించి అనువదించిరి. నాటకమును యథాతథముగా అనువదించుట అనగా శ్లోకమునకు పద్యము, వచనమునకు వచనము అను పద్ధతిని పలువురు పాటించిరి. బలిజేపల్లి ఉత్తర రాఘవముపేర కొలది మార్పులతో తెనిగించుచుంటినని ప్రస్తావనయందే పేర్కొనిరి. రాఘవమున్నను, రామ చరితమున్నను ఒక్కటేకాని తాను కొలది మార్పులుచేసెదనని ప్రారంభమునసే తెలుపుటచే నాటకనామదేయమునందును అట్టికొద్దిమార్పును ప్రకటించిరి. ఇది వీరి ఔచిత్యస్ఫూర్తిని సమయ సముచితరసమయకావ్య నిర్మాణ చాతుర్యమును ప్రకటించుచున్నది. మూలమునకు వన్నెపెట్టి స్వారస్యముతో రసిసిద్ధిని ప్రదర్శించుటయే వీరి రచనా లక్ష్యము. అందులకు వీరి ప్రతి గ్రంథమునొక ప్రత్యక్ష సాక్ష్యము.

సర్వ స్వతంత్ర పద్ధతిలో సాగిన ఉత్తర రాఘవమునందలి కల్పనలు అందలి ఔచిత్యము ప్రశంసార్హము. బలిజేపల్లి పద్యరచన అనన్య సామాన్యము. ఎందరో ఉత్తర రామచరిత్రమును అనువదించిరి. ఇది పలుచోట్ల ప్రదర్శింపబడి ప్రేక్షకుల ఆదరాభిమానముల చూఱగొన్నది. చర్ల గణపతి శాస్త్రిగారి ఉత్తర రామ ప్రణయ చరిత్ర (సీతా రామ ప్రణయ చరిత్ర) ప్రారంభమున "సీతారామ చరిత్రము-అనువాదములంతీరులు" అనుశీర్షికయందు వెంకటరామ కృష్ణులు, జయంతి, మల్లాది, రాయప్రోలు మొదలగు వారి పద్యములను మచ్చునకు కొన్ని తెలిపిరి. అందు బలిజేపల్లివారి- "1. లలితే జెక్కులజేర్చి 2. మునుమాయామృగకైతవంబున 3. ఈమహిళా లలామము గృహేందిర 4. ఏదద్వైతము ఖేదమో దముల 5. మను మార్గంబిది యోసిదక్షిణకరంబా 6. నలలితచందన ద్రుమకిసాల 7. అనుకూలియగు పోయెదేవి" అను పద్యములనుదాహరించిరి. సర్వ స్వతంత్రసరణిలో సాగిన బలిజేపల్లి ఉత్తరరాఘవమునందలి కల్పనలు- అందలి ఔచిత్యమును సింహావలోకన ప్రాయముగా నిట వివరించుచున్నాను.

**ముఖ్య స్వతంత్ర కల్పనలు-రసౌచితి:-**

ఉత్తర రామచరిత్ర ద్వితీయాంకమునందలి శుద్ధవిష్కంభము ఉత్తర రాఘవమున తృతీయాంక ప్రారంభమున చేర్చబడినది. తృతీయాంకము చివర వాసంతిక గోదావరిని వర్ణించును. బలిజేపల్లి గారీ శ్లోకమును వదలివేసిరి. బలిజేపల్లివారుత్తర రామచరితములోని అనేక శ్లోకములను మన రూపమునసే అనువదించిరి. పూర్తిగా ద్వితీయాంకము కవి స్వకపోల కల్పితము. లక్ష్మణుడు సీతను అరణ్యమున విడుచు ఈ ఘట్టముత్తర రామచరిత నాటకమున కేవలము సూచితము. కాని దీనిని స్వతంత్రించికంకంటె పాపరాజు పద్యములకంటే మిగుల లలితముగా ఉండునట్లు బలిజేపల్లి ఒక ప్రత్యేకమైన అంకముగా తీర్చిదిద్దిరి. ఇందు రామ పవిత్ర గుణములు వివిధ వృత్తములలో సీసములలో వజ్రమువంటి హృదయములు సైతము ద్రవించు పద్ధతిలో వర్ణింపబడినవి. స్వేచ్ఛగా తనకు తాను కల్పించుకొని వ్రాసిన అంకముగుటచే ఈ ద్వితీయాంకము అద్వితీయ రచనా సౌందర్యముతో అప్రయత్న స్ఫూర్తితో ఎంతో రసభరితముగా ఔచిత్యవంతముగా, భావ మహోత్కృష్టముగా సాగినది. ఈ అంకము సంవాదాత్మక గద్యపద్యసమ్మిశ్రితకరుణరస ప్రపూర్ణ మహాప్రబంధమనదగియున్నది. ఇందు 'ఏకో రసఃకరుణ ఏవ' అన్న భవభూతి వాక్యసారము ప్రత్యక్షరమున ప్రత్యక్షము. ద్వితీయాంకమున శుద్ధవిష్కంభము తరువాత శ్రీరాముడు ఖడ్గధారియై ప్రవేశించును. ఇందు శంబూకుడు దివ్య పురుషుడై ప్రవేశించి శ్రీరామునికి జయము పలుకును. అనంతరమిరువురు సంభాషింతురు. ఈ ఘట్టమున శుద్ధవిష్కంభమైన వెంటనే శ్రీరామ శంబూకసంవాదము కొంత తాత్త్వికధోరణిలో సాగినది. మూల భిన్నమైన ఈ కల్పన కావ్యమునకు మరికొంత ప్రశస్తి కలిగించినది. అక్షరతత్త్వబోధకుడైన జగత్పతిగా శ్రీరాముని భావించిన శంబూకుడు తానక్షయ కాయసిద్ధి పడయగా దపియించుచున్నానని శ్రీరాముని కరవాలము వలననే తనకు అక్షయ

సౌఖ్యము లభించుమనని ముందుగనే తెలిపిన విషయమును బట్టి శంభూకుని వధను గూర్చిన అపోహతొలగిపోవుటకు వీలు కలుగుచున్నది. లేనిచో ధర్మస్వరూపుడైన రాముడింతటి అధర్మ కార్యమునకొడిగట్టుట యేమి న్యాయమని పలువురు విమర్శించియుందురు. శంబూకుడు తాను యుగధర్మ మెఱిగినవాడై యెఱిగి రామునివలనమృతిగోరియే తపముచేసితినని స్వయముగా తెలుపును. శ్రీరామ చరణపంకజ రేణుపాతకమూడ్చుటయేగాదు అచేతనపుంజత్రాతినినాతినిచేసెననియు, తనయ విద్యా తనుపూడ్చి యక్షరమహత్తర కాయమొసగుననియు శంబూకుడు రాముని మహత్వమెఱిగియే అంతగా నర్థించి తాను దండ్యుడు కాన దండించి మనుమార్గప్రతిష్ఠాపకుడవు కమ్మని విధి నిర్వహణను పదేపదే జ్ఞప్తికి తెచ్చును. 'మనుమార్గంబిది' అను పద్యమున ఆ ప్రయోగమునే 'విప్రసంతానమున్ మనుమార్గంబిది' అని ప్రస్తుత శ్రీరామ కర్తవ్యమునందును సంధించినట్లు అక్షరమత్కృతితో అక్షయమైన తత్వమును ప్రస్ఫుటీకరించుట ఎంతో అర్థసహితముగా ఉన్నది. ముఖ్యముగా ఈసన్నివేశమును కవి స్వయముగా కల్పించి ఎంతో ఔచిత్యమును పాటించెను. అటుపై మూలవిధేయముగా అనువాదము సాగినది. ద్వితీయాంకమున శంబూకుడు వర్ణించిన వర్ణన ఉత్తర రాఘవ తృతీయాంకాంతమున అనూదితము కాలేదు. ఉత్తరరాఘవము నందలి ద్వితీయాంకమునందలి విషయము పూర్తిగా బలిజేపల్లివారు స్వయముగా కల్పించినదే. సీతా నివాసము అనగా లక్ష్మణుడు సీతను భాగీరథీ తీరమున విడిచివచ్చు సంఘటన సర్వప్రజలను ఆకర్షించు కరుణ రసమయ సన్నివేశము. ఉత్తర రామాయమున కంకంటి పాపరాజు ఈ సన్నివేశమును ఎంతో కరుణరసాత్మకముగా చిత్రించియున్నారు. జైమిని భారతము వంటి గ్రంథములలో కూడ సీతాపరిత్యాగఘట్టమునకు ఎంతో ప్రాముఖ్యమియబడియున్నది. ఉత్తరరామాయణములోని సీతా పరిత్యాగఘట్టమే రాముని ధర్మదృష్టిని వెల్లడించుచు సీతా సౌశీల్యమును నిర్ధారించుచున్నది. 'సీతాయాఃచరితం మహత్' అన్న వాక్యమునకు ఈ ఉత్తర కథయే సర్వవిధముల సాక్షిభూతము. ఇది సర్వ సామాన్య ప్రజనాకర్షించు మహోదాత్తపవిత్ర చారిత్రము సామాన్య ప్రజకతి సన్నిహితమై హృదయమును మథించు ఈసన్నివేశము ప్రత్యేకముగా ఒక అంకమున ప్రయుక్తమైనచో కావ్యగౌరవమినుమడింపగలదని బలిజేపల్లి వారు భావించుయుందురు. కంకంటి పాపరాజుత్తర రామాయణమున ఎంతో రసవంతముగా సామాన్య ప్రజలను సైతము కంటతడిపెట్టునట్లు రచించిన యితివృత్తమునే ఉత్తర రాఘవమున ద్వితీయాంకమున వీరు మలచిరి. ఇందలి ప్రతి పద్యమునందలి పద పదములలో, సంభాషణలోని ప్రతి వచనములో రచన లలితలలితముగా మధురమరంద సదృశముగా, మృదుపేశలమనోజ్ఞముగా లాలిత్యము మాధుర్యము, మార్దవము ముప్పిరిగొన్న రీతిలో కరుణ రసము పరాకాష్ఠనందినది. ఇట్లు ద్వితీయాంక వృత్తాంతముత్తర రామచరిత్రము నందలి యితివృత్తముతో భేదించి ఒక అంకము అధికమైనది. కావుననే ఉత్తర రాఘవము ఎనిమిదంకముల నాటకమైనది.

ఉత్తరరామ చరిత్రమునందలి తృతీయాంక ప్రారంభమునందలి తమసా మురళా సంవాదరూపశుద్ధ విష్కంభము ఉత్తర రాఘవ చతుర్థాంకము మొదట ప్రవేశపెట్టబడినది. కాని యిది ఉత్తరరాఘవమున కొలది మార్పులతో కూర్పబడినది. మూలమున మురళను లోపాముద్ర గోదావరికి పిలుచుకొని రమ్మని చెప్పినట్లున్నది. ఉత్తర రాఘవమున అట్లుగాక వృత్తవర్తిష్యమాణ కథాంశములు లోపాముద్ర మురళల సంభాషణమున సాగినట్లు మార్చబడినవి. తమసా పాత్రకిచ్చుట అవకాశము లేకపోవుటచే మూలమునందలి సంవాదక్రమము కొంతమారినది. మూలమున కొంత విస్తరింపబడిన సంవాదమిచ్చట కొంతసంక్షిప్తీకరియబడినది.

ఉత్తర రామచరితమునందలి తృతీయాంకమంతయు ఉత్తర రాఘవమున చతుర్థాంకమునందు అనువదియబడినది. ఈ అంకమున బలిజేపల్లి తమగు సంభాషణలను కొన్నింటిని మురళపాత్రముఖమున మఱి కొంత వాల్మీకి ముఖమున ప్రకటించిరి.

ఉత్తరరామచరిత్రమున చతుర్థాంక ప్రారంభమునగలదాండాయన సౌధాతకీ సంభాషణము, అరుంధతీ కౌసల్యా కంచుకులతో సాగినకొంతసంభాషణమును బలిజేపల్లి ఉత్తరరాఘవమునవదలిపేసిరి. పంచమాంక ప్రారంభమునకవి స్వయముగా కల్పించినగాలవ కుశలవుల సంభాషణ ఎంతో రసవత్తరముగా ఉన్నది. కుశలవులువటువులతో కలిసి రాముని గూర్చి గానమొనరించుచు ప్రవేశించుటతో విష్కంభము ప్రారంభమగును. యుద్ధకాండమునందలి శ్లోకములు జ్ఞాపకమున్నవాయని లవుడు ప్రశ్నింపగా గాలవుడొసగిన సమాధానము హాస్యరస భరితము. కుశలవులు గాలవునివలెపిఱికి వారు కారని, యుద్ధ విద్యా నిపుణులైమహోత్సాహముతో ముందుముందు రణకళా కౌశలమును ప్రదర్శింపనున్నారనుటకు సూచనగా ఈ సన్నివేశము కల్పింపబడినది. ఈ సందర్భమున రావణుని ఇరువది చేతులు, పది తలలను గూర్చి ప్రసక్తికి తెచ్చి బ్రహ్మ సృష్టిలో చిత్ర విచిత్రములున్నట్లే కవి బ్రహ్మ సృష్టిలో నింతకు మించిన విచిత్రములుండునని కవిసృష్టికి బ్రహ్మసృష్టికి గల భేద సాదృశ్యములను కుశలవుల సంభాషణ రూపమున బలిజేపల్లి వివరించి కథా సందర్భములో సమన్వయించిన విధము అతనిపేరులో కవి బిరుదమున సంఘటితమై సార్థక్యమును కూర్చిన సరణిని ధ్వనింపజేయుచున్నది.

ఇక ఉత్తరరాఘవమునందలి పంచమాంక ప్రారంభమున విష్కంభము పూర్తిగా ఉత్తర రామచరిత్రము ( 4 వ అంకము ) తో భేదించుచున్నది. ఇచ్చట బలిజేపల్లి స్వయముగా కల్పించిన సన్నివేశకల్పనము సమయ సముచిత ప్రతిభానైపుణ్యముతో నవనవోన్మేష ప్రజ్ఞావిలసితమై, రసమయ రచనా రామణీయకమును ప్రతిష్ఠించినవి. విష్కంభానంతరము గలయుత్తర రామచరిత్రము నందలి సన్నివేశమును బలిజేపల్లి కొంతవరకు విడిచిపెచిరి. ఇందు జనకుని సంభాషణ మధికముగా ఉన్నది. అరుంధతి, కంచుకి, కౌసల్య సంభాషించుచుండగా జనకుడు అరుంధతిని సమీపించి అభివాదనలు తెలుపును. పిమ్మట కంచుకి గృష్టితో రాజుగారి తల్లికి కుశలమా అని అడుగును. ఆ వక్రోక్తిని విని గృష్టి తనలో ఇది నిష్ఠురమైన ఎత్తిపొడుపుమాట అని తలచును. పిదప అగ్ని శుద్ధియందు విశ్వాసములేని అల్పులగు పౌరుల భీభత్స ప్రవాదమునకు రామభద్రుడు సీతను విడిచెనని తెలుపును. అందుకు జనకుడు కోపించి నా కూతురును పరిశోధించుటకు ఆ అగ్ని ఎవడు? రాముడే అవమానమును గావించెనను కొనుచుండగా పైగా జన పరివాదమెంత దుస్సహ పరాభవముగా పరిణమించెదనని అరుంధతియు సీత విషయమున అగ్ని అనుట అల్పభాషణమని సీతా సౌశీల్యమునుగ్గడించును. అపుడు కౌసల్య దుఃఖము హృదయమును సనూలముగా పెల్లగించుచున్నవదని మూర్ఛిల్లును. మూర్ఛనుండి తేఱిన కౌసల్య అమ్మా జానకీ! ఎక్కడున్నావు. బిడ్డా! నిర్భాగ్యురాలనైన నా ప్రాణములు వజ్రకఠినములేమో అని చింతించును. అరుంధతి అప్పుడామెనూఱడించుచు చివరకు శుభము కలుగునను కులగురు వాక్యమును స్మృతికి దెచ్చి ప్రత్యాశకలిగించును. ఈపై తెల్పినసన్నివేశమును బలిజేపల్లి తెనిగింపలేదు. ఇది అంత ప్రాధాన్యము కాదని వారు తలచి ఉందురు. తెరచాటున కలకలము బయలుదేరుగనే జనకాదులు ( కంచుకి, అరుంధతి, కౌసల్యలు) ఆ కలకలమునగు గల కారణము తలతురు. ఇటనుండి చతుర్థాంకమునందు ఆంధ్రీకరింపబడినది. దీనికి పూర్వమున్న సన్నివేశము అంత రసవంతము కాదనియు, అది వర్జించినంతమాత్రమున ప్రాధానకథా పరిపోషణకు ప్రతిబంధకము కలుగదని బలిజేపల్లి భావించిరి. జనకులు మొదట కౌసల్యాదుల విషయమున శత్రుభావము వహించి అంతలో త్వరపడి పొరబడి తినని పశ్చాత్తప్తుడగుట, సీత అగ్ని కంటే పవిత్రురాలని అరుందతీ జనకులు తలచుట ఇందలి ఇతివృత్తము. ఇట్లు బలిజేపల్లి ఇతివృత్తములో నచ్చటచ్చట ఎంతో ఔచిత్యవంతముగా కల్పనలనేకములు గావించిరి. ఇక ధార్మి కస్వతంత్ర గ్రంథములు అందు బుద్ధిమతీ విలాసము నాటకము గూర్చి మొదట సవిమర్శక పరిశీలన గావించుట కుపక్రమింతును.

## బుద్ధి మతి విలాసము - సవిమర్శక పరిశీలన

శైవ వాఙ్మయములో చిఱుతొండనంబికథకు ఎంతో ప్రాముఖ్యమున్నది. ఈ కథ తమిళమున పెరియ పురాణములో, పాల్కురికి సోమన బసవపురాణములో, శ్రీనాథుని హరవిలాసములో అభివర్ణింపబడినది. వివిధభాషలలోగల ఈ కథలోని ముఖ్య సన్నివేశములలో అంతగా మార్పులేకున్నను, వస్తువిస్తృతిలో ఒక్కొక్కరొక్కొక్క సన్నివేశమునకువారి వారి యభిరుచులనుబట్టి ప్రాముఖ్యమొసగిరనుట యథార్థము. బసవపురాణములో ఈకథ చతుర్థాశ్వాసమున మాచయ్య బసవన్నకు శంకరదాసి, జగదేకమల్లుడు నిమ్మవ్వ కథలు చెప్పిన యనంతరము (సిరియాలుని కథ వివరించు సందర్భములో) కావ్య మధ్యమున వచ్చును. సర్వేశ్వరుడు [1] సిరియాలు భక్తిలో తరముగ దలచి కృతక తపోధనాకృతితోనవచ్చి నరమాంస మడుగగా సర్వలక్షణగుణసంపూర్ణు డొక్కవరపుత్రుడున్నాడు గదా. ఇంక బొరుగింటికి బోవలసిన పనిలేదని చెప్పి తప్పక వ్రతమును చెల్లింతుననును. అంత సిరియాళుడు ఇంటికి వచ్చితన భార్య సంగళవ్వతో జరిగిన విషయమును తెల్పును. ఆమెయు చదివెడు పుత్త్ర మంగళంబలర [2] గ్రమ్మనతోడి తెచ్చిమన యింట నేడు పండువుదినమని తెల్పి వధ్య శృంగారము చేసి ముక్తి విలోలుడైన సిరాలుని చంపి నానా ప్రకారములగు శాకములు చేసి తాపసికి వడ్డించును. అపుడా తాపసి శిరోమాంసములేనందుకు [3] తలనూచి యైనను తనయుని మీది వలపు దక్కింపవచ్చునని తలదాచుకొంటిరా అని అడుగును. [4] కేశదుష్టపరీత శాకముప హత మనబడునో అని వెఱచి పుచ్చితిమి. అంతే ఇప్పుడే చందనంగ పాకము చేసినదని చెప్పును. అంత అతిధి పంక్తికడకూర్చొని అపుత్త్రస్యగతిర్నాస్తి అని గదా! అందురు. [5] గతిహీనులిండ్ల సంయములు కుడుతురా! వెంటనే పిలువుడు. [6] తల్లి పిల్చిన రానితనయులుందురా! ఎలుగెత్తి మేమువినగా పిలువుడనును. ఇట సంగళవ్వ కొడుకునుపిలిచిన సన్నివేశము కొంత విస్తరింపబడినది. తుదకుసిరిమాళునికి పరమేశ్వరుడు ప్రత్యక్షమై సిరియాళుని, అతని పరివారమును కైలాసమునకు గొనిపోయెను. సిరియాలుడుప్రమద గణములలో నొక్కడై అహంకరించి నా అట్టి భక్తుడు గలడా అని పలుకగా శివుడు నవ్వి చిఱుతొండా! ఇటు రమ్మని చేయిపట్టుకొని భూలోకమునకు గొనివచ్చి నిన్నుమించిన భక్తులున్నారు చూడుమని నిమ్మవ్వ గోవులగాచి అలసి వచ్చిన కుమారుడు ఆకలితో బూరె తినగా అవి పరమశివుని ఓగిరములగుటచే తినినందుకు కోపించి ఛీ! కుక్కా! శివద్రోహీ! అని వానిని చంపి ఎవరికి తెలియకుండగాది లోపలవైచి పైన కసువు కప్పిన విషయమును ప్రత్యక్షముగా చూపెను. అటుపై నరసింగ నయనారు, కొట్టరువు చోడుడు, హలాయుధుల వృత్తాంతమును ప్రత్యక్షముగా చూపి అహంకారమును తొలగించెను. జంగమరూపధారి అగు శివుడు హలాయుధునికి సిరియాలు మహిమ చెప్పుసందర్భమున ఇరువది యొక్క దినము కంచిలో వాన గుర్పించి, ఎచ్చటా తాపసులను లేకుండ జేయుటయెగాక తానే వానికి అతిథిగా పోయి కుమారుని మాంసమును వడ్డింపుమని అడుగగా అతడు సరియని సమ్మతించి అతిథి సంతర్పణముగావించిన విధమును వివరించెను. ఇట్లు సిరియాలుని (చిఱుతొండని) కథ మరికొన్ని కథలతో అనుబంధముగా బసవపురాణమున చిత్రింపబడినది.

ఈ కథనే శ్రీనాథుడు హరవిలాసారంభమున మొదటి రెండాశ్వాసములలో వివరించెను. ఇందు పూర్వ జన్మవృత్తాంతముతో కథ ప్రారంభమగును. ద్వితీయాశ్వాసమున శివుడు చిఱుతొండనంబిని పరీక్షించిన విధము చాలా విపులముగా వివిధ సన్నివేశములతో వివరింపబడినది. చెరకురసంబు నీప్సితవస్తువులును నతిలేక యందిచ్చి కఱకంటుకొలువ అని మాత్రమే బసవపురాణము. శ్రీనాథుడు దీనిని వివరించుటకై కొన్ని కథాసందర్భములను

అతిమనోహరముగా కల్పించెను. తాను హరవిలాసమును కంచిలోగల అవచిదేవయతిప్పయ శెట్టికి అంకితమొసగుటచే కథప్రారంభమున అట్టి గుణగణములు కలిగిన పాత్రనుచిత్రించి, చిఱుతొండనంబికి, అవచి దేవయ శెట్టికి అభేదమును సూచించెను. వాన పడిన వృత్తాంత మును తూమెడు చెఱకు రసమును పరమశివుడు గ్రహించిన వృత్తాంతమును తిరువెంగనాంబి పతిసేవ పరాయణతను, సిరియాలుని సుగుణసంపదను, చందనిక సేవాధర్మ పరాయతణను ఇట్లే ప్రతి పాత్రకు గల ప్రాముఖ్యమును, విభిన్న సన్నివేశములలో పరమ గంభీరముగా భక్తిభావస్ఫోరకముగా శ్రీనాథుడు అభివర్ణించెను. ప్రతి పాత్రకు ఒక ప్రత్యేకత కలదని నిరూపించునిమిత్తమై కొన్ని కొన్ని సన్నివేశములు బసవపురాణముకన్న భిన్నముగా కూర్చబడినది. సిరియాలుని పరీక్షించు నిమిత్తమై గురువు కడ అక్షరాభ్యాస మొనరించునతనికడకేగి జటాధారి జంగమ ప్రముఖుడైన శివుడు కపట మాయామహానాటక ప్రపంచ సూత్రధారుడై నీతండ్రి నిన్ను చంపుటకు నిశ్చయించినాడు. వాడు దానవుడు గాక నీకు తండ్రియగునా [9] 'జీవన్ భద్రాణి పశ్యతు' అని గదా శ్రుతి. నీ వెందైనను పోయి ఈ మృతిబారినుండి తప్పించుకొనుమని ఉపదేశమొనర్చును. అందుకా బాలుడు శిబి, దధీచి, మేఘవాహనాది ప్రసిద్ధులైన పలువురుదాతలను పేర్కొని [9] 'పరోపకారార్థమిదం శరీర'మని వినవా [10] అధ్రువంబైన మలభాండదేహమును విడచి, కల్పాంతర ధ్రువమైన కీర్తికాయమును గొనుట శ్రేయస్కరమని వచించును. ఇట్లే తిరువెంగనాంబిని కూడ కపటపు జంగమదేవిగా విచ్చేసిన పార్వతి పరీక్షించిన ఘట్టము చక్కగా వర్ణింపబడినది. అమ్మా! నీ మగడు వెఱ్ఱివాడు. అతడు మగవాడా! మ్రానా! నీకుమారుని చంపనిశ్చయించుకొన్నాడు. జోగులు కపటోపాయప్రాగల్భ్యముతో నిధన నవసిద్ధులకై ఎన్నెన్నో కోరరాని కోర్కెలు కోరెదరు. అట్లని అన్నెము పున్నెమెఱుగని చిన్ని శిశువులను చంపుకొనుటయా? అని ఎన్నెన్నో విధముల మనసు విఱుచు మాటలు పలికినది. కాని ఫలితము శూన్యమైనది. ఇట్లే సిరియాలుని చంపుటకు ముందు తల్లిదండ్రులు వానికి బ్రతుకుపైనాసగలదేమో అని పరిపరి విధముల ప్రశ్నించిన ఘట్టము అందుకాబాలుడు సమాధానమొసగిన విధము చాలమనోహరముగా సన్నివేశ బంధురముగా కూర్చబడినది. బసవపురాణమున చిఱుతొండని పేరు కైలాసమునకు చేరినఅనంతరము గాని ప్రస్తావనకురాలేదు. కథ ప్రారంభములో అతని పేరు సిరియాలుడు. అతడే తుదిలో చిఱుతొండడని స్పష్టమగును. తిరువెంగనాంగ అను పేరు కథాంతమున వచ్చును. ప్రారంభమున అమె పేరు సంగళవ్వ అని పేర్కొనబడినది. వీరి కుమారుని పేరు సిరాలుడని మాత్రమే కలదు. హరవిలాసమున సిరియాలుడు, తిరువెంగనాంబి, చిఱుతొండనంబి కుమారుడుగా పేర్కొనబడెను.

[11] ఇట్లే కథ చిత్ర విచిత్రములైన సన్నివేశములతో, పాత్రచిత్రణప్రాముఖ్యముతో శ్రీనాథుని చేతిలో అపురూపమైన కావ్యముగా మలచబడినది. ఈ కథ జానపదగేయ ములందును ప్రాముఖ్యము వహించినది. ఇట్టిపండితపామరజన రంజకమైన కథను దృశ్యముగా రచించినచో అందఱను ఆకర్షింపగలదని బుద్ధిమతీ విలాసమనుపేర కీ.శే. బలిజేపల్లి లక్ష్మీకాంతము చేపట్టిరి.

శ్రవ్యమునకు వలెగాక దృశ్యమున నాటకీయతకు, సంభాషణా చాతురికి, వివిధపాత్ర లకల్పనమునకు. అనేక సన్నివేశములకు చక్కని ప్రాముఖ్య మీయవలెను. లేనిచో ఆ ఇతివృత్తము రక్తికట్ట నేరదు. కావుననే బలిజేపల్లి గారీ నాటకమున అంతకముందు శ్రవ్య కావ్యములలో లేని నారద పాత్రమును కావ్యారంభముననే ప్రవేశపెట్టెను. బలిజేపల్లి తన నాటకములో సిరియాలుని భార్యపేరు బుద్ధిమతి అనియు, వారి కుమారుడు మతిమంతుడ

నియు మార్చెను. ప్రధాన సన్నివేశమునకు ప్రతిబంధకము కలుగకుండ అటంకముల ఈ నాటకములో సిరియాలుడు, బుద్ధిమతి, మతిమంతుడను ముఖ్య భూమికలకు గల ప్రాతినిధ్యము, ఆయాపాత్రల ధార్మికదృక్పథము, సన్నివేశబంధురముగా, క్రమ పద్ధతిలో ప్రతిపాదింపబడినది. హరవిలాసకథనే బలిజేపల్లి ప్రధానముగా గ్రహించినను చిఱుతొండ నంబి అనగా సిరియాలుని పూర్వ జన్మవృత్తాంతము, తూమెడు చెఱకురసమును శివుడు డుగగా చిఱుతొండడొసంగిన ప్రసక్తి, కంచిలో ముయ్యేడు దినముల కుండపోతవాన వంటి సన్నివేశములను పూర్తిగా వదలివేసెను. అసలు బసవపురాణమునందు కూడ అకాల వర్షాగమన ప్రసక్తి కానరాదు. చెఱకురసమును గూర్చిన ప్రసక్తి కేవలమొక వాక్యమునందు మాత్రమే సూచింపబడినది. తక్కిన కథ కూడ అతి క్లుప్తముగా తెలుపబడినది. పరమశివుడు సంగళవ్వతో పంక్తి భోజనమునకు కుమారుని పిలువవలసినదని నపుడామె కుమారుని పిలిచిన సన్నివేశమే మొత్తముకథలో అధిక భాగ మాక్రమించినది. అసలు కథ కంటె ఈ సన్నివేశమే బసవ పురాణమున ప్రముఖ స్థానము వహించినది.

బలిజేపల్లి బుద్ధిమతీవిలాసము అని పేరు మార్చి ఆ పాత్రకు అధిక ప్రాముఖ్య మీయ దలచినట్లు స్పష్టమగును. మొదటి రెండంకములలో నారద పాత్రకు ప్రాముఖ్యము కల్పింప బడినది. భూలోకములో ఎక్కడైన నిష్కల్మష వీరశైవ వ్రతాభిమాని, సత్య సంధుడగు రాజశ్రేష్ఠుడు పత్న్యను సరణవ్రత వీరపతివ్రత కలదేమో అని లోకమాత నాకాజ్ఞాపించగా వెదకి చూచుటకై చోళదేశమును ప్రవేశించునట్లు తెలిపి పిమ్మట సిరియాలుడు మంత్రి సుకలునితో మాటాడు సందర్భమున కొలువు కూటమునకేగును. అపుడు భద్రుడు రాజుతో హస్తమున వీణెబూని మహాత్ముడొకడు వచ్చుచున్నాడిదే యిటు సచ్చరిత్ర! అని తెలుపును. పిమ్మట నారదుడు సిరియాలుని కడకు వచ్చి పుత్రవంతుడవుకమ్మని ఆశీర్వదించును. సుకలుని ధీమంతుడవు కమ్మనిదీవించి, మణి పీఠమున విశ్రమించి నీకును నీ ప్రజలకునుసేమమా? అని ప్రశ్నించును. అనంతరము నీవు ధర్మ గుణాంచితుడవై దేశంబుపాలించు చుంటివని విని మేమెంతయు సంతసిల్లి నారము. కావుననే చూడ వచ్చితిమని తన రాకకు గల కారణమును తెలుపును. అంత సిరియాలుడు అంశుమంతుని చేత ఒమంబడగినట్లుతాపసోత్తమ దర్శనము చేత నాపాపచయమెల్ల అడగెనని పలికి బుద్ధిమతి బంగారపు భృంగారువుతో విమల సలిలము కొని వచ్చినమస్కరింపగా మరల నారదుడు వంశపవిత్రుని పుత్త్రునిఁగసుమని దీవించును. అంత సిరియాలుడు బుద్ధిమతి జలములు పోయుచుండగా నారదుని పాదములు కడిగి ఆజలమును శిరస్సుపై చల్లుకొనును. ఇట నారదుని గన్న సరస్వతీవాత్సల్యము బ్రామిను కుంబల్లవ పాణి తొట్లనిడి కూర్మిన్ జోలలం బాడియూచిన చిన్నారి కుమారు అను ప్రయోగ మున చక్కగా వక్కాణింపబడినది. అంతేగాక అట్టి మీ శ్రీపాదతోయంబు లేనును పంగల్గితి మాశిరంబున గృపాళూ! భాగ్యమిట్లొప్పనే అనఘా! మామక పూర్వజన్మకృత పుణ్యంబెంత వర్ధిల్లె అని ప్రశంసించును. నారదుడు నీ వీరశైవవ్రతము నిర్విఘ్నముగాకొనసాగుచున్నది గదా అని సిరియాలుని భక్తికి సంతసించి బుద్ధిమతితో నీ విల్లాంఢ్రలో కెల్ల పరమపుణ్యవని కొని యాడును. అప్పుడామె అవుగాము లెఱుగని నేను మీ మట్టిపాగడ్తలకు దగనని తనవినయ సౌశీల్యములను ప్రకటించును. వెంటనే నారదుడు నీ వినయాది గుణములు నీ సతీత్వమును వన్నెదెచ్చుచున్నవి. మీవీరశైవ వ్రతము సిద్ధించి శీఘ్రకాలములోనే మీరు పుత్రవంతు లగుదురు. ఇది పరమేశ్వరనియమమే అని తెలుపును. అటుపై శివభక్తి ప్రాధాన్యము సీస పద్యమున వివరింప బడినది. రాజనకు బుద్ధిమతికి వ్రతమును నిర్విఘ్నముగా నెరవేర్చుచుండునట్లు ప్రబోధము గావింపబడినది. బుద్ధిమతి సహాయమున నీ కీర్తి దిగంత విశ్రాంతమై వెలయుచుండుననియు,

పుత్త్రవంతుడవై సుఖముగా నుండవలయుననియు బుద్ధిమతికి గల ప్రాధాన్యమునకు తోడుగా సత్పుత్త్ర ప్రాప్తికి గల ప్రసక్తిని మాటిమాటికి నారదుడు ప్రథమాంకమున తెలిపెను. రాజ్యాంగ సంబంధనీతులను భోదించి ధన్యునిజేయు మని సిరియాలుడు ప్రార్థింపగా ధర్మప్రభుండవైన నీవెరుంగని రాజ్యాంగ నీతులేమున్నవి. అయినను అడిగినందుకుగాను కొన్ని నీతులను పదేశింతుననెను. ఇచ్చట సీస పద్యమున తెలిపిన నీతులు కవి కల్పితము కన్నబిడ్డల వలె ప్రజల గాపాడుచు మిత్రతత బాయుకుండుట. ధనకోశమును నింపదలచి ప్రజలపై లేని పన్నులను గల్పించుట, ఆదాయమునుబట్టి వ్యయము చేయుచు భోగములందు విఱ్ఱవీగ కుండుట, కన్నెలనమ్ము చెనటుల వెదకి శిక్షించుట, రాజ్య భారమెల్ల మంత్రి వర్గముపై నుంచి సోమరి తనమున నిద్రించుట, మొగమిచ్చకపు మోసగాండ్ర తెలిసికొని వర్తిల్లుట మొదలగు ముఖ్యములైన నీతులు భోదించెను. ప్రథమాంకాంతమున మరల బుద్ధిమతి నుద్దేశించి నీవు కొలది కాలముసే పుత్త్రవతి వగుదువు. సుపుత్త్ర ప్రాప్తిరస్తు అని దీవించును. ఇంతేకాక మాటిమాటికి సిరియాలుని ధర్మదృష్టి కూడ ప్రశంసింపబడినది. ధరణీ పాలక నీ తనూజుడు మహాధర్మాత్ముడై, వేదశాస్త్ర రహస్యార్థ సుధారసార్ద్ర హృదయాంచ క్షీరకుపారుడై చిరతరాయుష్మంతుడై వర్తిల్లునని దీవించెను. బుద్ధి మతి నారదుని మాటలు విని త్రికాల వేదియైన అతని మాటలకు అన్యథాత్వము జరుగదని తన పతి దేవుని మాటకు ప్రమాణికరించుటతో ప్రథమాంకము ముగియును.

## ద్వితీయాంకము :

ద్వితీయాంకారంభములో సిరియాలునికి పుత్త్రుడు కలిగెనన్న విషయము పాపంభొట్లు,నీలకంఠసోమయాజులు, వెంకావధనుల సంభాషణ మూలమున విష్కంభ మునందు సూచింపబడినది. పిమ్మట నారదుడు కైలాసమునకు పోయి పార్వతితో సంభాషించుచు మాటల సందర్భమున బుద్ధిమతీ పాతివ్రత్యమును ప్రస్తావనకు దెచ్చును. మొదట సిరియాలుని ధర్మగుణమును ప్రశంసించుచు నతడు శైశవమున తన పాఠశాలలో లదల వర్ణ క్రమమును చదువుచు అందు లేదు అనెడు మాటను పలుకలేదని ఎంతో చమత్కారముగా బలిజేపల్లి పేర్కొనిరి. సర్వసద్గుణ వ్రత సమేత భర్తృపదభక్తి నిరూఢ మనోంబు జాతయైన బుద్ధిమతీ రూపగుణ సౌందర్యములను కొంత విస్తరించి వర్ణించెను. నాటకము పేరు బుద్ధిమతీవిలాస మగుటచే ఆపాత్రకు ప్రాముఖ్యము కల్పింపబడినది. లక్ష్మీ సరస్వతీ గంగా పార్వతీ సతులకన్న బుద్ధిమతీ మిన్నయను విషయమును కూడ బలిజేపల్లి చక్కనిసీసములో వ్యంగ్య విలసితమైన అధిక్షేపణ పద్ధతిలో వర్ణించిన తీరు ప్రశంసార్హము. ఒకరు పొరుగిండ్ల పెత్తనాల్జరుపుచు ధవుని వక్షము నెక్కగా, నింకొకరు గయ్యాళియై నాధుకంఠము నొత్తుచు వదరు చున్నదనియు, మరియొకరు మగడుండగా మారుమగని చేపట్టి బిడ్డలగన్నపతివ్రతా శిరోమణి యనియు నిక పార్వతి మగని దేహములోన సగముగై కొనినదనియు నాక్షేపించెను. అపుడు పార్వతి ఇతడెప్పుడును గలహప్రియుడు గదా మమ్ము బాగుగా అధిక్షేపించు చున్నాడని తనలో తలచినది. ఇంతలో పరమేశ్వరుడు జోక్యము కలిగించుకొని నేడు కలహాపేక్ష చేతనే నారదుడిటకు వచ్చిఉండునని తెలుపును. అంత నారదుడు సజ్జన కీర్తన లెప్పటికిని ఋణ్యాదములే. కాబట్టి బుద్ధిమతీ సతీ విషయమై ప్రసంగించు చుంటిమని పలుకును. నిష్క్రమించు సందర్భమునగూడ నారదుడు ఈ పార్వతికి బాగుగా కోపమెక్కించితినని, ఈ వినోదము కన్నార గాంతునని తెలిపెను. అతడు నిష్క్రమింపగనే పార్వతి పరమేశ్వరునితో నారదుడు మమ్ము బొత్తుగా నధిక్షేపించినాడు అని

అనును. అందుకు పరమేశ్వరుడు నారదుడాడినట్టి పలుకులకు నివాసి సుంతయైన తగ్గునా! అని సమాధాన పరచెను. అప్పుడామె ఆతని పల్కులకు నాకేమియు సలుక గలుగదుకాని ఆదంపతుల దృఢభక్తి పరీక్షింపకుతూహలము కలుగుచున్నదని విన్నవించును. అంత పరమేశ్వరుడును ఆ రాజ దంపతుల పరీక్షించెద, నా పరీక్షల కించుకైన చలింపక నిల్చిరేని వారి కీర్తి ప్రపంచమున వ్యాపించునని పలికి చెవిలో మరియేదియూ చెప్పినిష్క్రమించుటతో ద్వితీయాంక కథ ముగిసినది.

## తృతీయాంకము :

అటుపై తృతీయాంకమున అతిథులకై వెదకు సిరియాలునికి, యతివేషమున సిరియాలుని పరీక్షింపవచ్చిన పరమశివునికి జరిగిన సంభాషణ వివరింపబడినది. మొదట సిరియాలుడు తన యాకటి బాధను, తనయుడైన మతి మంతుని శివవ్రత దీక్షను తెలిపిన పిదప యతిరూపమున క్షుద్బాధనటించు అభ్యాగతుడగు పరమశివునిగాంచి ఇతడపూర్వ మహిమాతిశయుడగు దివ్యపురుషుడని ప్రథమదర్శనముననే భావించును. వ్రతరక్షణార్థమై ఏతెంచిన శివావతారముగా, తన పూర్వజన్మపరిపాకఫలముగా, వెదకబోయిన తీవియె పదముల బడుగతి కన్పించిన యతీశ్వరుని సమీపించి తన యింటికి రమ్మని ప్రార్థించు సందర్భమున సీసమును కవి ప్రయోగించెను. అనుకొనకుండ అభ్యాగతుడు కనిపించుటచే మహానంద భరితుడై అతినిని ఇంటికి రమ్మని ప్రార్థించుటకనువుగా సీసపద్యము గ్రహింపబడినది. యతిని సమీపించిన సిరియాలుడు ఆతని వృత్తాంతము అడుగుట, అతడు సమాధానమొసగుట కూడ ఈసీసమునందే నిబంధింపబడినది. ఇచ్చట యతీశ్వరుడొసగిన సమాధానము బలిచక్రవర్తికి వామనుడొసగిన సమాధానమును తలపించును. యతీశ్వరుని శివపూజ కరుగుదెండని అర్థింపగా అతడు వచ్చెదను గాని నీదునివాసమేది అని ప్రశ్నించెను. సిరియాలుడు చోళదేశము అనగా యతిక్రోధముతో కూళ, పిసాళ, పాపసిరియాళ! న్నపకుం పాంసనా! అని నిందించును. అకారణముగా తనపై ఆగ్రహమేల కలిగినదో అని సిరియాలుడు తలపగా యతీశ్వరుడు నీయూరిలో ఇంటి ముంగిట అరచినను పిడికెడు కబళము లభింపలేదే ఇంతదనుక ఎక్కడనుంటిరా మూర్ఖా! ఏమిరా నీ ధర్మ పరిపాలన మేము నీవంటి ధర్మ హీనుని ముఖమెన్నటికి చూడము. నీదారి నీవుపో అని నిందించును. అపుడు సిరియాలుడు నాలుగు దినములనుండి అభ్యాగతుల కొఱకు వెదకుచున్నను ఎవ్వరు తనకు సందర్భ పడలేదనియు, ఇన్ని దినములుగా కనువత్తులలో వెదకినను మిమ్ముగనలేని తన పూర్వభవ సంచిత పాపమెంతటి దో అనియు తనఘోరోపవాస నియతిని వివరించును. అందుకు యతి నీ వట్టివ్రతమూని యుంటివా అని ప్రశ్నించును. సిరియాలుడు అవునని తెలిపి అతులిత సత్తపోవ్రత నియతాత్ములరైన మీ ఆగమనము చే నావ్రతము ఫలించును. మీరు మాయింటి కి వచ్చి ఓగిరము గ్రహింపవలసినదని మరిమరి ప్రార్థించును. అప్పుడు కుహనాయతి ఓహో! నీ కుమారుడును వ్రతహిత వృత్తిచే నుపవసించుచున్నాడా? ఘోర తరోవాస సద్వ్రత నియతిని గ్రహించి నీకుమారునివంటి సుధర్మశీలుడైన కొడుకొకడున్న చాలును. నా యభీష్టమును నెరవేర్చుటకు పురుష సంతతిహీనులనర్హులు. కాన తప్పక భిక్ష గొందును. కాని మరియొక విషయము. నీవురాచబిడ్డవు. తల తడిపి బాసచేసినను రాజులను మేము నమ్మజాలము. అని తూలనాడగా సిరియాలుడు ఎంతమాట. ఇన్ని సంపదలున్ననేను ఒక్క బ్రాహ్మణునికి అన్న మిడలేనా? సిరి ఎంతయున్ననేమిఅది కీర్తికరమా ? సుగుణాభిరాముడైధర్మగుణ ప్రాప్తికలిగి నిరంతరము సత్యవాక్పరతతో చరించువాడే యశస్వి. సత్యమును వీడి చరించు దుష్టునికి

సంపద ఎంతయున్న అది బూడిద కన్నహీనము అని తనధార్మిక దృక్పథమును వెల్లడించెను. అపుడు యతీశ్వరుడు పరులకు బోధలొనరించువారు భువిలో ఎందరో కలరుగాని ఇతరులకు తాము చెప్పిన గతినడచుధీరుడు కోటి కొక్కరుడు కూడ లేడనును. అపుడు సిరియాలుడు ప్రమాణ పూర్వకముగా తాను ఇచ్చిన మాట తప్పననియు, తన్ను రాజ్యభ్రష్టునిగావించి కడగండ్ల ముంచినను, లేక నిశితాసిధారకు తన కంఠమిమ్మన్నను లేక ఎంతో కూర్మితో పెంచు కన్నపాపని కుత్తుకకోసి యిమ్మన్నను సంసిద్ధమే. దేవతలు, స్వారాజ్య పదవి నిచ్చినను ఒల్లను. కులాభిమానములు కూలినను, పున్నెము నశించినను లేక తనకెట్టి భాగ్యము వచ్చిపై బడినను అనృతమును పలుకనని నిష్కర్షగా తెలిపెను. నీ సత్య వ్రతమునకు మెచ్చితినిగాని నీ భార్య నాకిష్టమగు పదార్థ మాహార మిచ్చుటకు సమ్మతించునో లేదో తెలిసి కొన వలయునుగదా! లోకములో అర్థికోటిని సంతృప్తిపరచు ధర్మగుణా వలంబచిత్తులు లక్షయున్నను అందు పదిమంది కూడ నింటిలో నిదారల పోరువలన తమ కోర్కెను నెరవేర్పజాలరు. నీసతి ఉత్తమ సతి యనుచున్నావు. అట్లయిన నాఅభీష్టము తప్పక నెరవేర్పగలదు. సరే బయలుదేరుము. అని యతీశ్వరుడనగా సిరియాలుడు దారిద్ర్యాతుర ప్రయత్నముగా ద్రవ్య నిక్షేపమును దారిలో గాంచినట్లు అత్యానందముతో తన యింటికి తీసికొని పోవును. నీ భార్య సద్గుణ ధుర్య అని చెప్పగా నమ్మి బయలు దేరితిని. తుదకు నన్నక్కడ పరిభవించెదుసుమా! అని యతి తృతీయాంకమున పలుకును. అట్లెప్పుడును కాదు. మీరు జూచి నడుపుడని సిరియాలుడనుటతో తృతీయాంకము ముగియును.

## చతుర్థాంకము :

చతుర్థాంక ప్రారంభమున యతి సిరియాలునితో నాకు భోజన మిడుటకు నీ భార్య సమ్మతించినదా నీవు కేవలము ధర్మ హితుడవు కాబట్టి నామనోభీష్టము ననుసరించి భిక్షగావింపవలెనని తెలుపుచు తాను శిశువును గూర్చి ఘోర వ్రతమువలంబించి ఉపవాసములు చేయు చుంటిననియు, ఘనమైన తద్వ్రతమునకు పశూపహారము భోజ్యమనియు, ఆపశువు మానవ శ్రేష్ఠుడై ఉండవలెననియు, అట్టి నరమాంసమును పాకమొనరించి భక్తితో వడ్డించినచో పార్వతీ ధవులకొసగి, నీవు నీ పుత్రుడు నా పంక్తిలో కూర్చుండగా భోజన మొనర్తునని వివరించెను. అట్టి విపరీతపు కోర్కె సిరియాలునికి మహాశ్చర్యము కలిగించినది. ఘోరపాతక కార్యమునకు నన్నుపురికొల్పు చున్నారే అని యతిని అర్థింపగా అతడు కోపించి కడుపార అన్నము పెట్టెదనని ఇక్కడకు ఈడ్చుకొని వచ్చి పొగరుమాటలు మాటాడెదవా నా సమక్షమున చేసిన బాసలను తప్పెదవా? అని తూలనాడెను. అందుకు సిరియాలుడు సమస్త ధర్మవేత్తలగు మీరే యిట్లు కోపించుట తగునా! శాంతము వహించి నామనవిని వినుడు. ప్రాణి హింస ఘోరనరకము కాకరము. అహింసయే మేటి ధర్మమని పెద్దలందురు. ఏ కులమున పుట్టితిమో ఆకులాచారముల పాటించుట పాడి. ఇట్టి ధర్మబాహ్యమైన వ్రతము పశుపతికి హితమగునా? నా మనస్సు తెలియకోరి మీరిట్లు అడుగుచున్నారు. విధి కెయ్యది హితమో అదియే నాకును హితమనితెలిపెను. అపుడా యతీశ్వరుడు ఓరీ రాజాధమా! సూనృతవచో విశ్వాసివి. నిరంతర దాన ధర్మైకనిష్ఠాగరిష్ఠుడవని నమ్మి నీ గృహమునకు వచ్చితిని. సకలశాస్త్ర వేత్తవలె నీవా నాకు హితముపదేశించుట చాలుచాలు. ఎంత మీను వచ్చిఎంత మీనును మ్రింగినది. ఇదిగో నే నాకలి మంటతో చావనున్నాను. ఏమినీ నిశ్చయము. అని ప్రశ్నించెను. అంత బుద్ధిమతి మీ వంటి సంయమీశ్వరుల నింటికి దోడ్కొని వచ్చి ఊరక పొమ్మందుమా నోరూర జేయుమే లూరగాయలు సారము లౌదధిక్షీరము లిన్నిఉండగా నరమాంసముకోరనేల వేద వేదాంగ

పారగ విప్రులైన మీకీ నీచనరమాంస భోజన నియతి ఏమిటి ప్రాణిహింసలు ధర్మ బాహ్యములుగదా! అని నచ్చ జెప్పజూచినది కాని ఆమె మాటలకు యతీశ్వరుడు ఏమిటి నీ పెద్దరికము. సమస్త ధర్మములు తెలిసిన బ్రహ్మవేత్తవలె ఏమి ఈ నటన ధర్మసందేహము తీర్చుమని నిన్నెవ్వరు ఇట పేరంటమునకు పిలువలేదు, నీవీపాటి ధర్మాత్మురాలవని తెలిసియే ముందుగానీ అనుమతి గొని రమ్మని ఎన్నోమార్లు నీ మగనితో చెప్పితిని. నీవేమో మహాధర్మాత్మురాలవని, తానేమో మహాసత్య సంధుడని నాకు నమ్మకము గల్గించి ఇచ్చట కీడ్చి తెచ్చినాడు. ఇన్నిఏల బాసచేసిన విధముగా మీరు సిద్ధ పరచి తీరవలసినదే యని తూలనాడుచు పల్కెను. బుద్ధి మతీ సిరియాలులు మాత్రము ఇట్టి ప్రాణిహింసా పాపకార్యము నుండి తమ్ము మరలింపవలసినదని పరిపరి విధముల పరితపించి మొరపెట్టుకొనిరి. అందుకా యతీశ్వరుడు నాదువాంఛిత మసాధ్యమని తలంచినచో లేచి పొమ్మన్న పోదును. నేనింతకు మునుపు నీకు మాట ఈయలేదని చెప్పినచో వెడలి పోయెదుననెను. మునిపట్టుదలను చూచి సిరియాలుడు తన భార్యతో మనకిపుడు ముందు నుయ్యి వెనుక గొయ్యి అయినది. అడకత్తెరలోని పోకవలె చిక్కిపోతిమి. అని తెలుపగా అపుడామె ఇంకను బలువిధముల ప్రార్థించి చూతము. ఇతనికి కరుణ కలుగకుండుటకు ఈ వానీ హృదయము పాషాణము అనినది. అంత సిరియాలుడు మాపైదయదలచిన సరి. ఈ భృత్యునిపై జాలిదలపకున్నచో అటుపై విధియెట్లో అట్లేకానోపును. నేను మాత్రము నా ప్రాణములు పోయినను అనృతమును పలుకనని విన్నవించెను. పిదప బుద్ధిమతియు ఎట్టి యిక్కట్టులు కలిగినను మాసత్యవ్రతము రక్షింపవలెనని యతీశ్వరునికి నివేదించినది. మరల తుదిగా నరమాంసభోజనవ్రతము మాని వేయవలెనని మాప్రార్థనము మన్నింపుడన్నది. కాని ఆయతి మీరు లక్షచెప్పినను నేను వినను. అని పట్టుదల పట్టెను. పైగా సిరియాలునితో నేను నిన్ను పిలువలేదని చెప్పిన నీకు నావలన బాధతప్పునుగదా నీవట్లు చేయుమని పరీక్షించినాడు. అందుకు సిరియాలుడు నాకిట్టి యుపాయములు తెలియవు. సాదు వాక్యములలో మీకుదయగల్గులాగు ప్రార్థింతును. ఈ భృత్యునిపై జాలి చూపకున్నచో అటుపై విధియెట్లో అట్లే కానోపుననినాడు. బుద్ధిమతియు యతినుద్దేశించి మాకిట్టి పాపోపదేశములు చేయవచ్చునా ఎట్టి యిక్కట్టులు కలిగినను మీరు మా సత్యవ్రతంబును రక్షింపవలయును. సూర్యుడపరదిక్కున నుదయించినను, అగ్ని కుష్ణతపెడి శైత్యమువరినను, గ్రహసముదాయము జల జల రాలినను, మఱపునకునైన ఆడినమాటదాట నని నిష్కర్షగా చెప్పినది. ఆమె మాటలకు యతీశ్వరుడు నీ సత్య వ్రత దీక్ష నీవుపొగడు కొనుటయేనా నాకేమైన భిక్షగావించు ప్రయత్నమున్నదా! అని నాడు అపుడు మరల బుద్ధిమతి జోక్యముగలిగించుకొని తన భర్తమౌనమును సవిస్తరముగా వ్యాఖ్యానించినది. ఆమె ఎంత చెప్పినను తనదారి తనదిగా నానా విధముల నిరువురిని నిరసించుచు వారిని మరిమరి రెచ్చగొట్ట సాగినాడు. నరమాంసమూరక లభించునా అని ప్రశ్నించుట మోసగించుట కాదా! ఓరీ దుర్మతీ! దారినిబోవు ఈ జడదారిని ఎన్నెన్నో ఇచ్చకపు మాటలతో మనసార పిలిచినట్లు పిలిచి భార్యా భర్తలిరువురొకరి కొకరేవేవో గుస గుసలాడుకొనుచునన్ను తరిమి వేయదలచితిరా! తాటాకులమంటవలె జఠరాగ్నిలోలోపల మండిపోవుచున్నదే. నేను దిక్కు మాలిన వటువైయీ వంచకుని యింట పంచ ప్రాణములు వదలవలసినదేనా ఎంతపని జేసితివిరా దుర్మతీ! నా వ్రతమీరాజాధమని కారణమున తీరినని దుఃఖాక్రాంతుని వలె నేవేవో దూషించుచు ఇదిగో ఇచ్చట చచ్చుటకు సిద్ధముగా నున్నానని పలికెను. అప్పుడు బుద్ధిమతి మా వ్రత మెన్నటికి భంగము కాదు. అని నచ్చచెప్పి తన భర్తతో నాథా! ఇంకను విచారించుటేల ఇదిగో నా దేహము నా పుణ్యాత్మునకు భోజనార్థముగా

నొసగుమని తెలిపినది. ఆ మాటలకు యతి స్త్రీ దేహమాంసము కడునింద్యము అనగా సిరియాలుడు బుద్ధిమతితో తన శరీరమనే కోసి మౌనికి మాంసమును వండి పెట్టుమని కత్తి నొసగినాడు. ఆమె అందులకు సందేహింపగా స్వయముగా నేనే ఆ మహోత్సవ మాచరించుకొని యెదనని పూనికొను సమయమునకు కుమారుడు సముక్షమున లేకపోయెనే అని అనేక విధముల కుమారుని గూర్చి ఆలోచించినారు. ఇల్లాలితో అన్నిటికి నీకు కుమారుడొకడున్నాడు అని సీసము వంటి హృదయమైన కరిగి పోవునట్లు తెలిపినాడు. ఆ సందర్భమున సిరియాళుని నిశ్చలతకు ఆశ్చర్యచకితుడైన యతి మరియొక పన్నాగము పన్ని సిరియాళుని దూషించుచు నేనెరుగనా! నరసిన వెంట్రుకలతో జరాభారమున వడకుచు క్రొవ్వు దరిగి కాటికి కాళ్ళు చాచిన నీ మాంసము నాకెట్లు రుచించును. అది వ్రత భంగమెట్లు కాకుండును. నీవు బ్రహ్మ ఘాతుకుడవు. నీ ముఖము చెప్పుచున్నది. నిన్ను చూచిన దురితము ఘోరపాపము. నేనికవెళ్ళెదనని పోబోవును. అంత బుద్ధిమతి మీరేల మమ్ము సంకటముల ముంచెదరు మా ప్రార్థన మాలింపుడన్నది. సిరియాలుడుకోపము పసంహరించి మీకోర్కె ఏదియో సెలవిండని అర్థించెను. ఆ సిరియాలుని ప్రార్థన మన్నించినయతి అయినచో వినుము. నీవునాకు భిక్షము నీయనిచ్చగించినచో పదునారేండ్లుమించని బ్రహ్మచారుని అన్ని శాస్త్రములు తెలిసిన వాని, తల్లి దండ్రులు గలబాలుని భోజనముగా నొసంగుమనె అంత సిరియాలుడు మునీంద్రా! ఇదియ మీకోర్కె. ఏమీ అంశలు. ఎవ్వరైన తమకన్నకుమారుని మాంసముకోసి నీకన్నముగా నొసగెదరా! కోరరాని కోర్కెలకోరి ఏలమమ్ము శ్రమల ముంచెదవు. అనగా ఆయతి నా వలన మీకు శ్రమయా! అయినచో ఇదగో పోయెదనని లేచినాడు. బుద్ధిమతి ఓపిక పట్టుడని వారించినది. బతిమలాడుకొలది యతి బిఱ్ఱబిగుసుకొని నేనిక క్షణమాగను. మీరు దుర్మార్గులు. నేను కోరినట్లు చేయరనినాడు. అయినచో వ్రతమునకు తగిన బాలుడెందున్నాడో మీరానతిండని సిరియాలుడడుగగా మొదటయతి ఎన్నెనో మాటలు చెప్పుతుదకు ఇరువురిని ప్రమాణ పూర్వకముగా సమ్మతింపజేయు మాటల ప్రసంగమున వారి కుమారుని ప్రసక్తితెచ్చినాడు. ఆమాట పూర్తిగా వినక మునుపే సిరియాలుడు మూర్ఛిల్లినాడు. తెప్పరిల్లి లేచిన అనంతరము మరల మతిమంతుని చంపి నాకాహారమిండని యతి మొండిగా పలికినాడు. పుత్రుని తలచితలచి తల్లిదండ్రులిరువురెంతో ఉల్లమున తల్లడిల్లినారు. ముందు వెనుకలరయక వాగ్దాన మిచ్చిన తన్నుతానే సిరియాలుడు దూషించుకొన్నాడు. తన్నుతాను దూషించుకొను సిరియాలునిగాంచి యతి యతిథుల కాహారమును తిట్టుచు పెట్టిన నేమిప్రయోజనము! పుత్రుడైనను మరెవ్వరైనను కంట తడిపెట్టకుండ వధించి నాయభీష్టము నెరవేర్చుమని గట్టి పట్టుదలతో నొక్కి వక్కాణించుచు నేల వచ్చెను మన యింటికిట్టి మొండి అని తలచుచుంటివా అట్లు తలచుచు పెట్టిన పాయసమైన విషమే. ఇప్పటికైన చెప్పుము. నీ కిష్టము లేకున్నచో నేనింకెక్కడకైన పోయెదనని తర్జన భర్జనలతో అడిగినాడు. అన్నింటికీ సిద్ధమే అని సిరియాలుడు తెలుపుచుమీరు స్నానమాచరించి సంసిద్ధముగా ఉండుడు అని తెలిపిఅంతలో మరల బుద్ధిమతి అభిప్రాయమును అడిగినాడు. ఆమె భర్త మాటలు విని మన హృదయములేనాడైన భిన్నాభిప్రాయములు పూని ఉండెనా. మతి మంతుని శీఘ్రముగా పిలిపింపుడనినది. ఆమె సత్య సంధతకుయతి తనలో లాను ప్రశంసించుకొనుచు బుద్ధిమతిని బోలిన సాధ్వీమణు లింకెవ్వరుందురు, కాని ఈ లోపల పాఠశాలనుండి వచ్చు మతి మంతునికి దుర్బోధలొనరించుటకై భద్రుని కాదేశించును. భద్రునితో చెప్పి పంపు మాటలలో నిక నెట్టి కల్లకపటములకు వీలు లేకుండ చేతులారంగ నీ తండ్రి చెలగి నిన్ను చంపతోడ్కొనిరమ్మని

పంపెననుమి అని నాడు. భద్రుడు మహారాజు పరిస్థితిగాంచి పుత్రునివధించి ఈతడెట్లు ప్రాణములు ధరించును? ఇక మమ్ము రక్షించు వారెవరు? మా భాగ్యములీపాటివయ్యెనా అని నిశ్చయించును. అంత సిరియాలుడును నాకు సర్వాశాపరిపూర్తి యయ్యెగదా? తనయు ఋణాను బంధము నేటితో తీరినది. ఇక హృదయమున దుఃఖమున కెడమీయరాదు. పాకశాలకు యతీశుడేతెంచెనేమో పోయి చూచెదనని నిశ్చయించుటతో చతుర్థాంకము ముగియును.

## పంచమాంకము:

సిరియాలుడు పాకశాలకు తరలగనే పాఠశాలనుండి మతిమంతుడు ప్రవేశించు ఘట్టము పంచమాంకమున ప్రకటితమైనది. ముఖ్యముగా ఈ ఘట్టము మతిమంతుని పరీక్షించు నిమిత్తమై కల్పింపబడినది. శివుని పరిచారికుడగు భృంగిరిటునికి, మతిమంతునికి జరిగిన సంభాషణమే ఈ పంచమాంకము నందలి ఇతి వృత్తము. మతిమంతుడు పాఠశాల నుండి వచ్చుచు తండ్రి నన్ను భోజనార్థమై పిలిపింపలేదు. ఈదినము కూడ అతిధులెవ్వరును చిక్కరుకాబోలు. వ్రతభంగము సంభవించు దుష్కాలము ప్రాప్తించెనే. తల్లిదండ్రుల శరీరములు ఎంత కృశింప చేసినో కదా అని దైవమును భావించును. ఇంతలో భృంగిరిటుడు మతిమంతుని సమీపించి నీ వెవ్వరు నీ తండ్రి ఎవ్వరు అని అడుగును. అందుకతడు నేను మతిమంతుడు. సిరియాల నృపాలుడు నా తండ్రి అనును వెంటనే భృంగిరిటుడు అతనిని కౌగిలించుకొని దుఃఖమును అభినయించును. నీవేనా సిరియాలుని కుమారుడవు నీ కెంతటి ఘోరదుర్గతి పాలు అయితివోగదా! ఏద్రోహమెరుగని సుకుమారుడైన నిన్ను దైవమెంత కఠినముగా బాధింపనూహించెనో అని పల్కెను. అప్పుడు మతిమంతుడు నాకు కల్గిన విపత్తునకు నీవెంత తల్లడిల్లనేల పూర్వ జన్మము సారముగా ప్రాణికి సుఖదుఃఖములు కల్గును. ఎప్పుడును సుఖమే ప్రాప్తింపదు గదా! నీ దుఃఖమునకు ఏమి కారణము రాష్ట్ర ప్రజలు ఆరాటములు లేక ఉన్నారు కదా! ధర్మము విడిచి మా తండ్రి ఆశ్రితకోటికి అపకారము ఒనరించెనా మా తల్లి దండ్రులకు సుఖమే కదా! శత్రువుల చేఁట్లవైపరీత్యము సంభవింపలేదుగదా. ధర్మమార్గానుగాములకు కష్టములు కల్గునా? ధర్మమే జయించును. అని ఎంతో ధైర్యముతో సమాధానమొసగెను. కాని అంతలో అట్టి తల్లిదండ్రులు లేనట్లే అని భృంగిరిటుడు అనగనే మతిమంతుడు మూర్ఛిల్లెను. మతిమంతుడు తెప్పరిల్లిఎంతో ఆతురతతో తల్లిదండ్రులు ఏమైరి? అని అడుగును. వెంటనే భృంగిరిటుడు ఏమైరా చచ్చిరి. అని వినుగుతో సమాధానమిచ్చును. అపుడు మతిమంతుడు కైలాసమున వారిని కలియుట తనధర్మమనగా వారు కైలాసమును పొదగిన వారు కారు. నరక లోకమునకే పోవుదురు. ఇప్పుడు నీ ప్రాణములకొరకై వారు సజీవులై ఉన్నారు. అని తెలుపును. అంత మతిమంతుడు పుణ్యమూర్తులైన నా తల్లి దండ్రులు నరకమునకేల పోవుదురు అనెను. పుత్ర ఘాతకులు నరకమునకే పోవుదురు. ఇపుడు హాలాహల ప్రమత్తుడు, పాపి అయిన ఒకనికి నిన్ను జంపి మాంసభోజనమును నీ తండ్రి పెట్టనున్నాడు. వాడు నీకు తండ్రియా? నీ పాలి యముడు. జీవన్ భద్రాణి పశ్యతి అన్నట్లు ఎక్కడకైన పలాయితుడవై ప్రాణములు దక్కించుకొమ్ము అని భృంగిరిటుడు పల్కెను. ఇదియే ఘట్టము హరవిలాసమున ద్వితీయాశ్వాసమునందు శివయోగి కుమార సిరియాలుని దగ్గరకు వచ్చి జీవన్ భద్రాణి పశ్యతి అను వేదవచనము నవలంబించి ఎక్కడకే నింబోయి ఈ బారినుండి తప్పించు కొనుట నీకుంగర్తవ్యంబు (2-77) అని చెప్పినట్లున్నది. ఇట్టి మాటలకు మతిమంతుడు చలింపక ఇదియా నాకు సంభవించిన దుఃఖము. భీరులైన యోవ్యక బ్రాహ్మణుడా! మీకు ప్రాణములపై నెంతటి యాస ఇంత దనుక ధర్మాత్ముడయిన నాతండ్రి

గారిని నిందించు చున్ను జరా భారంబున మతి పోయిన నీ మాటలు నేనెంతగా బాటింపనుగాని ఏ శివ భక్తుడో నా శరీరమున పేక్షించుట, అందుకు నా తండ్రి సమ్మతించుటనా భాగ్యము. సిరిరామోకాలడ్డు మూర్ఖుఁడెవడయినఁగలడా రోపకార్థమిదం శరీరమను పెద్దల నీతి వాక్యమును వినలేదా అని సమాధానమొసగెను. ఇదే నీతి వాక్యము హరవిలాసము నందు ★2-79 కలదు. కాని ఈ సందర్భమున శ్రీనాథుడు మరికొంత విస్తరించి కపటమాయా మహానాయక ప్రపంచ సూత్రధారుండు చిఱుతొండ సుతునికి మూర్ఛరప్పించినట్లు కల్పించినాడు. మూర్ఛఎట్లువచ్చెనో నోరన్నుచ్చిలు గ్రమ్మమైనడకఁగన్నుల్తారకాబింబ పంచారవ్యాప్తి నధఃకరింప హృదయ స్థానంబు కపింప అను పద్యమున కన్నులకు కట్టినట్లు వర్ణించెను. ఇది దృశ్యకావ్య మగుటచే అట్టి సన్నివేశమును ప్రదర్శించుట సముచితము కాదని బలిజేపల్లి వదలివేసెను. ఈ అంకము చివర భృంగిరట మతిమంతుల సంభాషణము పాటరూపమున కూడ కొంత విస్తరించెను. మతి మంతుడు నిష్క్రమించిన అనంతరము ధీరోదాత్తుడైన వీని మనస్సును ఎవ్వరును చలింప చేయలేరు. క్రూరులు, అల్పవర్తనులు, అధర్ములు గుంపుగా చేరి ఎంత మోసగించినను ధీరోదాత్తుల ముందు వారి ప్రయత్నము నిష్ప్రయోజనము అని భృంగిరిటుడు భావించి ఈ వృత్తాంతమును పరమేశ్వరునకు ఎఱిగింతునని నిష్క్రమించెను. ఇట్లే పంచమాంకము కేవలము మతి మంతుని పరీక్షించునిమిత్తమై కల్పింపబడినది.

## షష్ఠాంకము:

షష్ఠాంక ప్రారంభమున సిరియాలుడు, బుద్ధిమతి, యతి ప్రవేశింతురు. యతి నీ కుమారుడు ఇంకనురాడు గదా! మేము కాలాతి క్రమణమునకు ఓర్వమని పలుకగా బుద్ధిమతి దేవ! శాంతిపుడనును. అంతలో భద్రుడు యువరాజు వచ్చుచున్నట్లు తెలుపును. ఆమాట విని సిరియాలుడు ధైర్యమునెట్లు చిక్కపట్టుట అని తెలుపును. కుమారుడు సమీపించి నంతనే తల్లిదండ్రులిరువురు అతని ని కౌగలించుకొని మూర్ఛిల్లుదురు. అల్లంత దూరమున యతి కన్పట్టును. అప్పుడు ఇరువురును సంభాషింతురు. యతి మతిమంతుని మరికొంత పరీక్షింపజూచి నీ తండ్రి ఎంత కఠిన కర్ముడోకదా! గండ్ర గొడ్డలితో చెట్లను వనాధ్యక్షుడు కూల్చునట్లు బిడ్డల ఁజంప సిద్ధపడు పాపాత్ముల ఏమనవలె. బలవంతమైన చావునకు నీవెట్లు సమ్మతింతువు అని పల్కెను. అందుకు మతిమంతుడు ఐహికమగు నీ సౌఖ్యము వదలుటకై నేనీ చావును సమ్మతింపవచ్చును. శివోపహారార్థముగా మీరు భుజింపవచ్చును. అని నిర్ణయించెను. అంతలో సిరియాలుడు, బుద్ధిమతి తెప్పరిల్లి కుమారుని గుణగణములను, స్వరూప స్వభావములను సంబోధనల రూపమున ప్రశంసించిరి. ఇచ్చట సీసము ప్రయుక్తమైనది. సిరియాలుడు నిన్నుగన్న స్వతంత్ర బుద్ధిచే యతికి మాంసాహారముగా అర్పించుటకు నీ ఒప్పికోలు లేక మాట యిచ్చితిని. అని అనును. అందుకు మతిమంతుడు సమ్మతించునో లేదో అని మీరు సంశయించుట నన్ను దూషించినట్లే. గాలిలోబెట్టిన దీపమువలె, మేఘములనుండి రాలిన వడగండ్ల వలె ఎప్పుడో ఈ దేహములురాలి పోవును అనివైరాగ్య భావమును ప్రకటించెను. అంతబుద్ధిమతి నీకు ఈవైరాగ్యము ఎప్పుడు కుదిరెనయ్యా! నిన్ను ఇంతగా పెంచినందులకు మేము ఇన్ని నీళ్ళు చుక్కలకు నోచుకొనకపోగా పైగా చేతులారుఘాతసేయ వచ్చుచున్నది. అని దుఃఖించెను. మతిమంతుడు తల్లిని ఓదార్చుచు తనువులు శాశ్వతములా సంపదలు స్థిరములా ఇవి కొఱగాని బంధములు అని చెప్పెను. అప్పుడు సిరియాలుడు దుఃఖించెను. అతని దుఃఖమును చూచి యతి అయినచో

నేను పోయెదనులే అనెను. కొంతసేపటికి మతిమంతుడే తండ్రితో మీరులిట్లు చింతిల్లుచుండిన ఈ మహాత్ముడు ఊరకుండడు. సకల ధర్మవేత్తలగు మీకుమారుడు ఐహిక సౌఖ్యమునే నిత్యమని నమ్మి ఎల్లకాలము బ్రతుకుట పేరాశ. అని నిష్కర్షగా తెలిపెను. ఈ సందర్భమున మతిమంతుడు, బుద్ధిమతి, సిరియాలుడు, యతి వారి వారి అభిప్రాయములను పాటలరూపమున తెల్పినట్లు రచింపబడినది. తుట్టతుదకు మతిమంతుడు రాగ బంధము గోసిఖరాసిని రాలుపుమా నామెదను అని తండ్రిని అడుగును. అపుడు యతి కుమారునకై మీరు ఊరక యేడ్చెదరు.నీ యింట దిక్కుమాలినపక్షినై ఉన్ననన్ను జూచి ఎవ్వరు యేడ్చెదరు నాకు ఏదియో చెప్పినన్ను పంపివేయరాదా అని నిర్బంధించును. మతిమంతుడును తండ్రితో నీకు ఇంకను ధైర్యము కల్గదే అని తొందర పెట్టును. అంతే గాక ఈ మహానుభావుడు కరుణారహితుడై నా చావు కోరుటకు ఏదియో మహాకారణ ముండును. ధర్మాచార హితులమై ప్రవర్తింపుచుంటి మోలేదో కనుగొనుటకై వచ్చిన అపర శివావతారమే కావచ్చును. ఇంకను సంశయమేల అని హెచ్చరించెను. అపుడు సిరియాలుడు, బుద్ధిమతి మాకునే సందియము లేదని తెల్పిరి. వెంటనే కుమారునికి తల యంటి, కురులు దువ్వినలుగుపెట్టి ముక్తికన్య వివాహమాడగా పెండ్లకొడుకువలె అలంకరించిరి. సిరియాలుడు యతీశ్వరునితో కుమారుని కుత్తుక కోసిన తక్షణమే మమ్ము నీవు తెగటార్చుము అని అర్థించెను. అపుడు యతివారిని దూషించి నీవెంతటి బుద్ధిహీనుడవు. కన్నకుమారుని చంపుకొందువా ఇప్పటికైన నిన్ను పిలువలేదని చెప్పుము.వెళ్ళిపోయెదను. అనిపలికెను. సిరియాలుడు కుట్టవానికి తోడ్కొని వచ్చుటకై నిష్క్రమింపగా యతీశ్వరుడు ఈతనిని బొంకించుటకు నాకు కాదు కదా! త్రిమూర్తులు, త్రిలోకములేకమై వచ్చినను సాధ్యము కాదని తలచును. అంతలో సిరియాలుడు కుమారునెత్తుకొని బుద్ధిమతితో వచ్చును. తల్లిదండ్రులిరువురు అతని పిలుపును, ముద్దుపల్కులను, రూపమును ప్రేమను మాటి మాటికి తలచుకొని విలపింతురు.వారి దుఃఖమును చూచి మతిమంతుడుమీరీ దుఃఖమును విడువుడు. నామీద ప్రేమాను బంధమును తెగకోసి కరవాలముతో కంఠమును ఛేదింపుడు అని త్వరపెట్టెను. అంతేగాక వారిని ఊరడించుచు యతీశ్వరుని అభీష్టమును ఈడేర్పుడని తెలిపెను. మరల యతి ఆ మూవురిని పరీక్షించుచు ఏదైన మీ మనస్సులలో కళంకమున్నచో ఇప్పుడే చెప్పివేయుడు. పైనొక తీరు లోనొకతీరునాకు పనికిరాదు. కుమారునికేదైన శంకలుండునేమో అడిగిచూడుడు. అని పలికెను. తుట్టతుదకు సిరియాలుడు కరవాలము ధరించి చంపబోవుచు బుద్ధిమతితోనీ కుమారుని చంపుచుంటినని నాపై కనలుకు మీ. అనగా ఆమె నేనిది కుమారుని మరణవిధి అని తలచుటలేదు. అతని వివాహమటులే సంతసిల్లుచున్నాను. అని తెలిపెను. అటుపై సిరియాలుడు ఖడ్గమును తీసికొని ఓ హృదయమా! ఈ మతిమంతుడు నా సుతుడుకాడు మోహమా! బిడ్డల కన్న పుణ్యుల కడకు పొమ్ము ఓదుఃఖమా! పొమ్ము నేను కఠినాత్ముడను. ఓ ఖడ్గమా! కొడుకు కంఠమును కోయుటకు కరకుపాలినదా? అని సంబోధించుచు కత్తి నెత్తెను. అపుడు మునీంద్రుడు అడ్డము వచ్చును. అతనిని తొలగి పొమ్మని చెప్పి పుత్రుని చంపి పాకశాలకు బుద్ధిమతితో వెడలెను. పిమ్మట రకరకముల పాకములు తయ్యారైనవి. అపుడు బుద్ధిమతి యతితో మీరు తృప్తిపడిన మాకదియే మోక్షాధారము. భోజనకాలము అతిక్రమింప జేసినందులకు క్షమింపుడని అర్థించినది. యతి తన వ్రతము సఫలమైనదని తెలుపుచు పరులు భుజింపకుండ ఒక్కడే కుడువరాదు. పంక్తికి ఎవ్వరైన లేక సాపడుటపాడిగాదు అని పంక్తికి పలిచెను. అందుకు సిరియాలుడు మీకు ఇప్పటికే చాలా ప్రొద్దుపోయినది ఆరగింపుడు అనెను. అందుకుయతి మాతో భుజింప మిష్టములేకున్నచో నేను ఏగెదను. ఏది ఎట్లైనను నా పంక్తిలో నీవు భుజించి తీరవసినదే

అని నిష్కర్షగా చెప్పెను. అపుడు సిరియాలుడు కన్న కొడుకునే చంపిన కఠినాత్మునికి క్రవ్యభోజనములు ఒకలెక్కయా ఇల్లు మ్రింగెడు వానికి ఇంటి తలుపులు అప్పడములుగదా! అని పలికెను. అపుడు యతిమాంసమును పరికించి కోపముతో నీవెంత నక్కటక్కులను అభినయించితివి. సర్వేంద్రియాణాం శిరః ప్రధానం అని కదా ఆర్యోక్తి. ఏది ఆ ఉత్తమాంగము అధమాంగము! నైవేద్యముగావింపవసినది. దుర్మార్గ! నీవాశిరమెచ్చట దాచితివి అని గద్దించెను. అపుడు బుద్ధిమతి వేరుగ పక్వము గావించితిని పోయి తీసికొని వచ్చెదను. అని విచ్చేసెను. అపుడు మరలయతి తోడుగ కుడువువాడు లేక భుజించుటఎట్లు? సుత విహీనులగుమీచేతి అన్నమును నేను భుజింపను. నాకెంత ఆశాభంగము కావించితిపిరా నన్నింతటితో వదలి వేయుము అని పలికెను. అపుడు సిరియాలుడును చచ్చిపోయిన కొడుకు మరల ఎట్లు బ్రతికి రాగలడు. అనెను. ఆ యతీశ్వరుడు మీరు ఇరువురు పిలువుడు. వచ్చునేమో చూతము అనెను. ఆతని ఆజ్ఞ చొప్పున ఇరువురు పిలిచిరి. ఇంతలో మాయా రూపమును వదలి గౌరీ సహితుడై మతిమంతుని ఎత్తుకొని జయతు జయతు సిరియాల! మహీపాల! అని పరమేశ్వరుడు ప్రశంసించెను. సిరియాలుడు, బుద్ధిమతి పార్వతీ పరమేశ్వరలను స్తుతించిరి. అంతలో నారదుడు అచ్చటకు విచ్చేసి అందరి క్షేమమును పరామర్శించుచు పరమేశ్వరుని కరుణ ఉన్నచో బలవంతముగా చంపినను మరల బ్రతుకగలరని పలికెను. సిరియాలుడు పరమేశ్వరునితో భిక్షకై యతీశ్వరుడు తీవ్రపడు చుండునేమో సెలవొసగిన పోయివత్తు ననెను. అపుడు పరమేశ్వరుడు నీకు ఇక దాచపనిలేదు. నీ ఉత్తమ శీలమునకు సత్యవ్రత నిరూఢికి మిక్కిలి మెచ్చితిని. నీవంటి ధర్మశీల క్రియాపరుడు ఈ రేడు జగములలో లేడు అని పలికెను. పిమ్మట సిరియాలుడు భరతవాక్యమును పల్కెను.

బలిజేపల్లి లక్ష్మీకాంతకవి గారి ధార్మిక గ్రంధావళిలో బుద్ధిమతీవిలాసమును గుంటూరు పుర హిందూ నాటకసంఘమునకై రచించినట్లు ప్రస్తావనలో సూత్రధారుని మూలము న తెల్పి ఉన్నాడు. వీరశైవవ్రతమునకుసంబంధించిన ఈ గాధకు మూలము సేక్కిళారునుచే రచించిన పెరియపురాణము. పాల్కురికి సోమనాధునికి కూడ ఈ పెరియ పురాణమే ఆధారము. కాని అతడు ఈ కధలను యధాతధముగా గ్రహింపక మార్చియున్నాడు. అరువది ముగ్గురు నాయనార్ల చరితములు పెరియ పురాణమును 11వ శతాబ్దినాటి ఈ ప్రబంధమునతెలుపబడినవి. వీరేగాక ఇంకెందరో మహాభక్తులు కలరు. ఈ పెరియ పురాణమే పట్టుసామి ఓదువార్ వ్రాసిన గద్య పెరియ పురాణమున కాధారము. ఇదే శివభక్తి చరితముగా తెలుగున వెలువడినది. దీనిని అబినవవాగీశ విద్వాన్ పాం.సూర్య నారాయణ శర్మగారు రచించిరి. ఇందు ముప్పది ఆరవ నాయనారుగ చిఱుతొండని కథ గలదు. చోళ దేశమున తిరుచ్చెంగాటంగుడిలో పరంజ్యోతి అను విప్రోత్తముడు రణవిద్యానిపుణుడై పల్లవరాజ నరసింహవర్మకు నెచ్చెలిగ ఎన్నో రాజ్యములు జయించి ఆతనిఆదరమును పొందెను. పరంజ్యోతి ఒక పర్యాయము వాతాపి( బాదామి)ని జయించి అందలి రత్నరాశులను పల్లవరాజునకు ఒసగెను. రాజాతనిని సత్కరించి శివసేవాదీక్షను ఎరుగక సేనాధిపత్య భాగమును మీకు అప్పగించితిని. ఇక శివసేవయే లోకోద్ధరణగా చాటుడని ఆదేశించెను. అటుపై పరంజ్యోతి రాజుఅనుమతితో తనపురమునకేగెను. అతడు తిరివేంగాట్టునంగను పరిణయమాడి నిత్యము భక్తులకు భోజనము పెట్టి అటుపైతాను భుజించువాడు. భక్తజన పాదరేణువుగా కాలము గడుపు అతనిని అందరు చిఱుతొండడని పిలువ జొచ్చిరి. అతనికి ఒకశుభ లగ్నమున పుత్రుడు కలిగెను. అతనికి శీరాలదేవుడని పేరుపెట్టెను. ఒక సందర్భమున తిరిజ్ఞాన సంబంధుడుతిరుచ్చంగాట్టం గుడికి వచ్చెను. చిఱుతొండడుఅతనిని సేవించి

సంతృప్తి పరుపగా అతడుఇతని సేవా భాగ్యమును పొగడుచు పద్య మాలికను చెప్పెను. అనంతరము చిఱుతొండడు నిత్య శివారాధనలో నిమగ్నుడయ్యెను. శివుడు ఇతనిని పరీక్షించు నిమిత్తమై జంగమ వేషమున గణపతీశ్వరాలయము వెనుక మందార వృక్షముకడ అసీనుడనగుదునని తన భార్యకు చెప్పెను. చిఱుతొండడు ఆతని కడకు విచ్చేసి తన గృహమును పావనము చేయుని ప్రార్థించెను. అప్పుడా జంగము నేను అరునెలయి గడచినను పశువును వధించునియమము గలవాడను నే కోరుపశువు నరపశువు. ఆ పశువు ఒకే గోత్రమునకు ఏకపుత్రుడై ఉండవలెను. తల్లి సంతసముతో ఆ బాలుని తట్టియుండ తండ్రి ఆ బాలును వధించి వండియుండిన నేభుజించెదను. అని తెలిపెను. ఆ విషయమును చిఱుతొండడు తన భార్యకు తెలిపెను. పాఠశాల నుండి కుమారుడు రాగ ఆ పిల్లవానికి నీరాడించి పాత్రములను శుద్ధ మొనర్చి అతనిని చంపి శిరో మాంసమురుచిగా ఉండదని దానిని తొలగించితినని నంగ తెలుపగా అదికూడనేను తినదగినదే అని భైరవుడు చెలుపెను. పంక్తిలో కూర్చొన్న భైరవుడు పంక్తికి పుత్రుని పిలువుమనెము. అపుడు మృత్యుంజయుని కరుణచే శిరాలుడు పరుగిడి వచ్చెను. చిఱుతొండడు భైరవ జంగమునికై వెదకి అతనిని గానక మూర్ఛిల్లెను. అంత పరమ శివుడు ఉమాదేవితో కుమారస్వామితో వాహనారూఢుడై ప్రత్యక్ష మయ్యెను. చిఱుతొండని, నంగను చందనికను,శిరాలుని కరుణించి శివుడు తనలోకమునకు గొనిపోయెను. [13] ప్రకృత కథ చోళదేశమునకు సంబంధించినది అగుటచే బలిజేపల్లి లక్ష్మీకాంతకవి ఇట చోళమనియే పేర్కొనెను.

[14] ఈ నాటకమున అనేక సందర్భములలో పరువురి పాత్రల మూలమున ధర్మ ప్రసక్తి చేయబడినది. నారదుడు మొదట నీవు ధర్మగుణాంచితుండవై దేశంబు పరిపాలింపుచుంటివని విని మేమెంతయు సంతసిల్లునారము. కావుననే నిన్నుచూడ వచ్చితిమని తెల్పెను. ఆ నారదుడే రాజ్యాంగవిషయిక నీతులను బోధించుటకు ముందు ధర్మ ప్రభుండవైన నీవెరిగిన రాజ్యాంగనీతులు కలవాఅనెను. పిమ్మట నీ తనూజుడు మహాధర్మాత్ముడై... వర్ధిల్లునని ఆశీర్వదించెను. ఇట్లు ప్రథమాంకమునకే తండ్రి కొడుకుల ధార్మిక దృష్టి వ్యక్తమైనది. పార్వతి కడ రాజును, తత్ సతీమణిని వర్ణించుచు ముఖ్యముగా ఆ చక్రవర్తి దివ్యతేజోమూర్తి సకల ధర్మ స్ఫూర్తియే ఆమహానుభావునకు అది ఎక్కడధర్మగుణ మోకాని లదల వర్ణక్రమంబుల చదువువేళ లేదనెడి మాట యితినికి రాదు. అని తెలిపెను. యతి రూపమున విచ్చేసిన పరమశివుడు లోలోపల సిరియాలుని సత్యసంధతకు మెచ్చి పైకి మాత్రమే నిందించెను. నిరంతర దాన ధర్మైకనిష్ఠా గరిష్ఠుండవని నీ గృహమునకు ఆహారమునకు వచ్చితిని. అనెను. బుద్ధిమతిని నుద్దేశించి నీవేమోమహాదర్మాత్మురాలని చెప్పినన్నిక్కడకు తీసికొని వచ్చెను. అని నింధించెను. ఆనిందలో ఆ యిరువురి ధర్మనిష్ఠ వెల్లడి అగుచున్నది. భృంగిరిటుని తో మతిమంతుడు ధర్మంబు విడిచి మాతండ్రి ఆశ్రితకోటికేదేని నపకారమెంచడుకదా! రావుకష్టములు ధర్మ మార్గానుగాములకును. ధర్మమే జయమనుటవ్యర్థంపుబలుకె అని తండ్రి ధర్మనిష్ఠను వెల్లడించిను. భృంగిరిటుడుతన తండ్రిని నిందింపగా ధర్మాత్ముడైన నా తండ్రిని నిందించుచున్నను జరా భారంబున మతి పోయిన నీ మాటలను నేనంతగా పాటింపను. ధర్మమార్గము దప్పి పాపపు కర్మభోధసేయ పాడియే. అని పలుకును. గర్భశోకముతో క్రుంగుతండ్రితో సకలదర్మవేత్తలగు మీకు నేనేమి విన్నవింపగలను. శిశుహత్యాపాతకము నీకేల కల్గను. అని తెలుపును. ముఖ్యముగా నాటకము యొక్క అంతమున పరమేశ్వరుడు సిరియాలుని ఉద్దేశించి త్వాదృగ్ధర్మశీలక్రియా పరుడీరేడు జగంబులన్ దొరకునే పల్మారుగాలించినన్ అని ప్రశంసించును.

ఇట్లే నాటకమున సిరియాల బుద్ధిమతి మతివంతుల ధార్మికదృక్పథము వివరింపబడినది. సిరియాలుని చరిత్రలను గూర్చి పరిశోధనలుగావించిన కొందరికి ఇది బుద్ధిమతీ విలాసమని పేరు ఉండుటచే సిరియాలుని కథగా స్ఫురించినట్లు లేదు. మూల కథను పలువురు వారివారి భాషలలో వారికి తోచునట్లుగా భిన్నభిన్న సన్నివేశములలో అచ్చటచ్చటవమార్చినను ప్రధానమైన సన్నివేశమును మార్చలేదు. ప్రస్తుతము బుద్ధిమవిలాసము నందును ప్రధాన సన్నివేశము మూల విధేయము. ఈ కథను బలిజేపల్లి ఒకరాజుకు సంబంధించినట్లు మలచి కొన్ని పాత్రలపేర్లను ఔచిత్య స్ఫూర్తితో మార్చుట గమనార్హము బుద్ధిమతి అనుపేరు ముఖ్యముగా బలిజేపల్లి లక్ష్మీకాంతకవి బుద్ధిజన్యమా అని సహృదయ పాఠకులకు అనిపించితీరును. వీరి నాటకములో ఒక చోట షష్ఠాంకము యొక్క తుదిలో యతి పాత్రమూలమున భర్తృహరి శ్లోకభావమును సందర్భానుగుణముగా అనువదించి ఉన్నారు. ఇట్లే మతివంతుని చంపుటకు కత్తినెత్తిన సన్నివేశమే సత్యహరిశ్చంద్రీయనాటకమున మరికొంత కరుణరస స్ఫూర్తితో ప్రకటితమైనది. వీరిధార్మిక గ్రంథావళిలో వీరశైవ వ్రతాచార సంపన్నతయిందు చక్కగా ప్రతి పాదితమైనది. ఇతడే నాటకమును వ్రాయుటకు హరవిలాసము కొంత ప్రోత్సాహమొసగి యుండును. రచనా విషయమున ఇతడు కడు స్వతంత్రుడగుటచే తనకు తొచిన పద్ధతిలో అచ్చటచ్చట కొన్ని సన్నివేశములను స్వయముగా కల్పించి కొందరి పేర్లు మార్చి ప్రతిభాపూర్ణమైన తన ప్రత్యేకతను ప్రదర్శించెను.

ఇక తృతీయ పరిచ్ఛేదము తుదిలో సత్యహరిశ్చంద్రీయమునకు గల ప్రాశస్త్యము - కందుకూరి, బలిజేపలి వారి సతహరిశ్చంద్ర నాటకములకు గల భేద సాదృశ్యములు. అద్వితీయ కీర్తి ప్రతిష్ఠలు గల బలిజేపల్లి వారినాటకమును గూర్చి పలువురి ప్రశంసలు కరుణరససన్నివేశములలో కవి ప్రదర్శించిన అప్రతిమాన రచనా ప్రావీణ్యము చర్చింప బడినది. ముఖ్యముగా అధ్యాయాంతమున వినూత్నాంశములలో కొంత సుదీర్ఘముగా చర్చింప బడిన శ్రీ ఏలూరి ప్రసాదరావు ( జిల్లా రిజిస్ట్రార్ ఒంగోలు) గారి సత్యహరిశ్చంద్రీయనాటక సమీక్షనిందు పొందు పరిచితిని. ఇందు రిజిస్ట్రేషనుకు సంబంధించిన విశేషములు యొకనాటి కవి వృత్త్యనుభవమునకు సంబంధించినవగుటచే, ప్రస్తుతము ఆవృత్తిలోని లోతు పాతులను పరిపూర్ణముగా జీర్ణించుకొని యెంతటి క్లిష్టవిషయమైన అలవోకగా సమగ్రముగా ప్రస్తుతేతి వృత్తములో సమన్వయించి ప్రతిపాదింపగల ప్రతి భావంతుడైన శ్రీ ఏలూరి ప్రసాదరావుగారి మాటలనీ సందర్భమున నది కొంత పరిధి నధిగమించినట్లని పించినను గ్రహింపకతప్పలేదు.

ప్రస్తుతము బలిజేపల్లి లక్ష్మీకాంతకవి సత్యాకృష్ణుల పరిణయమితి వృత్తముగ సాత్రాజితీయమున వసంతకాదలకు శతధన్వశంబరాది ప్రతి నాయక వర్గమునకు కొంత ప్రాముఖ్యమొసగి, ఇతి వృత్తమును వివిధ విధములమలచిన తీరు, విభిన్నపాత్ర చిత్రణలో కవిప్రదర్శించిన నైపుణికి సంగ్రహముగా సమీక్షించుటకు ప్రయత్నింతును.

## సాత్రాజితీయము - సవిమర్శక సమీక్ష

బలిజేపల్లి లక్ష్మీకాంతకవి గారి నాలుగు నాటకములలో సాత్రాజితీయమును ఐదు రకముల ఈ నాటకము హరివంశములోని కథను ఆధారముగా గ్రహించి ప్రదర్శనానుకూలముగా సన్నివేశములను మార్చి రచించిన స్వతంత్ర రూపకము ఇందలి కృష్ణ, శతధన్వ, సత్రాజిత్తు, వసుదేవ, బలరామ, సాత్యకి అక్రూర, జాంబవంతాది పురుషపాత్రములన్నియు మూలమున కలవియే. ఇట రేవంతుడు శతధ్వనిని సేవకుడుగా, వసంతకుడు శ్రీకృష్ణుని వేడుక చెలికాడుగా ప్రవేశ పెట్టబడిరి. ఇక స్త్రీ పాత్రములలో సాత్రజితి, రుక్మిణి, దేవకి పాత్రలు ప్రముఖమైనవి. ఈ నాటకము నాయికా ప్రాధాన్యమగుటచే సాత్రజితీయము. సాత్రజితి చెలికత్తెలుగా కళావతి, మంజువాణి పాత్రలు ప్రవేశపెటిబడినవి. రుక్మిణి చెలికత్తె మదనిక. శంబరుని సత్యావేషము మాయాసత్యగా కల్పింపబడినవి. పురుషపాత్రలకంటె స్త్రీ పాత్రుల సంఖ్యలో తక్కువ వున్నను కథ సన్నివేశములను బట్టి నాయికకే ప్రాధాన్యము బలిజేపల్లి నాయికలకే తమ నాటకములలో ప్రాముఖ్యము కల్పించుననుటకు సాత్రజితీయ, బుద్ధిమతీ విలాసమలే నిదర్శనములు. కాని ఈయన రచించిన నాలుగు నాటకములలో ఉత్తరరాఘవీయము, సత్యహరిశ్చంద్రీయము అను రెండును నాయక ప్రాధాన్యమును తెలుపుచున్నవి.

శమంతకోపాఖ్యానముగా ప్రసిద్ధికెక్కిన కథనే బలిజేపల్లి సాత్రజితీయ మనుపేర రూపొందించిరి. ఈ నాటకము 1942 నాటికే ఎన్నో చోట్ల ప్రదర్శింపబడి ప్రసిద్ధి కెక్కినది. నాటక లక్షణానుగుణముగా నాందీ ప్రస్తావనలను ప్రవేశ పెట్టబడినవి. నాందీ పద్యమునకౌస్తుభమణి హార ప్రసక్తి శ్యమంతకమణిని జ్ఞప్తికి తెచ్చును. మహా విష్ణువు వక్షస్థలమున కౌస్తుభమణియే గాక రమామణియు నెలకొన్నట్లు తెలుపబడినది. ఎక్కడిదొామణి నేరమేమియున్‌వెదుకకు అనుటచే శమంతక మణి కారణముగా శ్రీకృష్ణుడు అపవాదము పొందిన విషయము సూచితము ఒక్క రమామణియే కాదు. ఎందరో రమణీమణులు హృదయేశ్వరునిగా పొందిన శ్రీకృష్ణుని దక్షిణ నాయకత్వము సర్వలోక సంరక్షణ ప్రదమై మణివలె వెలుగొందునని నాందీపద్యములో కథ సందర్భములకు సూచనగా కవి ప్రతిపాదించెను. నాంద్యంతమునసూత్రదారుడు ప్రవేశించి మారిషునితో సంభాషించిన విషయము కొంత మహోత్సవ సందర్భమున విచ్చేసిన సభాసదులకు ఉల్లాసముగా ప్రదర్శింపనున్న నాటకమునకు పాత్రలను - సంసిద్ధముచేయవలసినదని సూత్రధారుడు మారిషునికి ఆదేశించెను. ఈ కథలో చవితినాటి చంద్రుని చూచి అపవాదముపాలైన శ్రీ కృష్ణునికథకు, శ్రీ విఘ్నేశ్వరుని ప్రసక్తి అనుబంధప్రాయము. ప్రయోగ ప్రారంభమునకు ఉత్సాహవంతులై పాత్రధారులున్నారని సూత్రదారునికి మారిషుడు విన్నవించెను. అది యేనాటకమని సూత్రధారుడు ప్రశ్నింపగా లక్ష్మీకాంతకవి సాత్రజితీయమనియు, ఆ నాటకమును వ్రాయుటకు కారణ భూతుడైనవాడు పాములపాటి సుబ్బయ్య అనియు, ఇందలి ఇతి వృత్తము సత్యపెండిలి కథ యనియు విన్నవించెను. సుబ్బయ్యగారు రస గ్రహణపారీణుడు అగుటచే ధనలబ్ధుడు కాక కవిత్వ తత్త్వమును ఆనందించి కవి కోర్కెను తీర్చగలిగె ననియు తెలుపెను. అపుడు సూత్రదారుడు కృతికర్తకు, కృతి భర్తకు గల సంబంధమును, ప్రకృత కృతికి అనుసంధించుచు యాచకుడు దాతనైచమును గుర్తించి యాచింపవలెను. పాత్రమెఱుగులుబ్ధుని వలన యాచకుడు దైన్యమును పొందవలసివచ్చునని తెలిపెను. ఇంతలో తెర నుండి అనుభవ ప్రసిద్ధిమైన ఈ వాక్యము సర్వదా అంగీకారయోగ్యమని వినవచ్చెను. అటుపై సూత్రదారుడు సత్రాజిత్తును శ్యమంతక మణికై యాచించి ఆతనిచే నిరాకరింపబడి వచ్చుచున్న శ్రీ కృష్ణుడతడే మనమికపోవుదమని నిష్క్రమించెను. వెంటనే

సూత్రదార విర్దిష్టమగు శ్రీకృష్ణ పాత్రము రంగస్థలమున ప్రవేశించను. ఇట్లే నాటకమున ప్రయోగాతి శయరూప ప్రస్తావన చక్కగా ప్రయోగింపబడినది. పిమ్మట ప్రథమాంకము కృష్ణ వసంతక సంవాదాత్మకముగా సాగినది.

## ప్రథమాంకము :

శ్రీకృష్ణుడు వయస్యుడగు వసంతకునితో యాచన వలని దైన్యహైన్య దయా శూన్యపరిస్థితిని తెలిపి అట్టి నీచమైన యాచన కంటె చావేమేలగునని ప్రకటించెను. అపుడు వసంతకుడు సత్రాజిత్తును మణి అడుగుటకు ముందు నాతో నేల పరామర్శింపకపోతివి లోభిని యాచించిన ఫలమిట్లే కదా! పాదుగు నిండ పాలుండియు ఎగజేపుచు దగ్గరకురానీక ముందుకు వచ్చిన కుమ్ముచు, వెనుకకు వచ్చిన తన్నుచు పాలుపితుకనీయని గేదెవంటి దేబి అయిన లోభినిష్ప్రయోజకుడని తెలిపి కొంత ఊరటవర్చెను. అపుడు శ్రీకృష్ణుడు శ్యమంతక ప్రభావమును వసంతకునికి తెల్పుచు సత్రాజిత్తు సూర్యునారాధించి సంపాదించిన మణి అనియు, ఆమణిని అడుగుటచే పోయి చూడవలసిన దానినే చూచితి నని అనెను అందుకు వసంతకుడు మణితో కూడ కుమారీమణి కూడ ఉన్నదా అని యుక్తి యుక్తమగు నూహతో ప్రతి వచనమొసగెను. సత్రాజిత్తు కుమారి నీకు ఎక్కడ కన్పించినది. అని వసంతకుడు అడుగగా కృష్ణుడు ఆ ఇంటిని, వాల్గంటిని కంటినను విషయము వచన సీస పద్యములలో వివరింపబడినది. వసంతకుడు ముందు నాటిసాయం సమయమున ఆమెను చూచినవాడగుటచే ఆమెను వేనితో పోల్చవచ్చుననెను. అందుకతడు సృష్టిలో ఒక్కొక్కప్పుడు ఎక్కడను పోలికలు లేని ఆశ్చర్యవస్తువులు కనబడుచుండునని సమాధానమొసగెను. పిమ్మట కృష్ణుడు కన్నులారతనివితీర చూచిన సౌందర్యమును అభివర్ణించును. కన్నులలో చాంచల్యము, నడుము నందలి కార్శ్యము, నడల యందలి మాంద్యము సుందరీమణులకు సహజాలంకారములగు ననగా వసంతకుడు తావలచినది రంభ, తామునిగినది గంగ అను సామెత నీయెడ సరిపోవుచున్నదని అనెను. చంద్రునికి, ఆమె నెమ్మోమునకు తారతమ్యము స్పష్టముగా కన్పడుచున్నదని మరికొంత విస్తరించి వర్ణించెను. అపుడు వసంతకుడు ప్రపంచము నందలి సుందర వస్తువులన్నిటిని నిరసించునీకు ఇక ఆరుక్మిణియు సరిపడదేమో! అనును. అపుడు కృష్ణుడు క్రొత్తకన్యను చూచినంతనే పట్టపుదేవి రుక్మిణిని ఎడబాయగలనా? పద్మినీ సంగమము కలిగినదని భానుడు ఛాయా సతిని విడచునా? దేవియెడ అపరాధమును చేయుట అసంభవము. కాని మదన సామ్రాజ్యలక్ష్మి అనదగిన అమె తనూవిలాసమును వర్ణింపలేకున్నాను. ఆమెను పొందగలవాడే కృతార్థుడు, జగత్పూజ్యుడు, ధన్యుడు పైగా ఆమె నన్ను చూచినట్లు భావించుచు నామనస్సు ఊరక ఆసలకు అవకాశము ఒసగుచున్నది అనెను. ఆమె చూచిన చూపులు అనేక పద్యములలో అభివర్ణితము. ఇందలి కొన్ని పద్యములు అల్లసానివాని అల్లిక జిగిబిగిని, ముక్కు తిమ్మనార్యుని ముద్దు పలుకులను, పోతనార్యుని సహజ కవితా సౌందర్యమును తలపించుచు అచ్చ తెలుగు పదములలో ఎంతో అందముగా, భావ బంధురముగా రమణీయముగా రచింపబడినది. వ్యర్థపదాడంబరము లేక అలంకారికమైన జాను తెలుగుపలుకుబడిలో శయ్యా సౌభాగ్యము ఉట్టి పడసాగిన పద్యరచన వర్ణనలో ఆరితేరిన మహాకవిగా నిరూపించుచున్నవి,. సాత్రాజితి తనను చూచు చుండగా ఆమె అభిప్రాయము పూర్తిగా గ్రహింపకమునుపే చుక్కతెగిపడినరీతి ఎక్కడ నుండియో యొకతెవచ్చి వడివడిగా ఆమెను అక్కడ నుండి తీసుకొని పోయెనని కృష్ణుడు తెలుపుచు తన ప్రాణములే గొనిపోయినట్లు భాదను వ్యక్తము చేసెను. ప్రాణములనే అని

కృష్ణుడు తెలుపుచు తన ప్రాణములే గొనిపోయి నట్లు భాధను వ్యక్తము చేసెను. ప్రాణములనే అని కృష్ణుడనగ వసంతకుడు కోపించి ఆబానిస కూతురును పట్టిబంధించి తెత్తును. అనెను. వాని తత్తరపాటును చూచి నిజముగా ప్రాణములను కాదు ప్రాణము వలె ప్రేమాస్పదమైన కన్యారత్నమునని వివరించెను. ఇట్లు సత్యభామకు సంబంధించిన వర్ణన కొంత విస్తరించి అభివర్ణింపబడెను. అటుపై సత్రాజిత్తు తమ్ముడు ప్రసేనుడు శ్యమంతక మణిని ధరించి వేటకేగి వధింపబడెనను వార్త అన్న అయిన సత్రాజిత్తుకు తెలిసినదను విషయమును వసంతకునికి కృష్ణుడు తెలిపెను. అందుకు వసంతకుడు మిగులబాధపడి మణి, కన్యామణి లేక పోగావిశేషించి ఆమణిపై నీవే ప్రసేనుని చంపితినను దుష్కీర్తి నీపై బడినది. ఇక సత్రాజిత్తు నీవు తలపట్టు పట్టుకొనుడనెను. ఇంతలో తెరలో సత్రాజిత్తు, శతధన్వ, కృతవర్మలతో కృష్ణుడు తనకింతటి ద్రోహ మొనర్చెను. వానిని మనము పోనీయరాదు. వానిపైపగ చల్లార్చకున్నచో ఈ బ్రతుకు ఎందుకని వేదనను వ్యక్తపరచెను. తెరలో తెలుపబడిన ఈ ఆవేదన స్రగ్ధరావృత్తమందున్నది అతని ఆవేదన ఎంత సుదీర్ఘమో పెక్కి పెక్కి ఏడ్చుచున్న ఆతని మనఃస్థితి ఎంత జడీ భూతమో మాటి మాటికి అలలవలె పొంగిపొరలి వచ్చుదుఃఖపు టలజడి ఎట్టిదో సూచించుటకు అనువుగా స్రగ్ధరా వృత్తము కూర్చబడినది. వసంతకుడు తెల్పిన యుద్ధప్రసక్తి యాదృచ్ఛికముగా తెలుపబడినను యధార్థముగనే పరిణమించినది.

అనంతరము రంగస్థలమున శతధన్వ, రేవంత, సత్రాజిత్తులు ప్రవేశింతురు. శతధన్వుడు మామ సత్రాజిత్తుతో అడుగో! ఇతడే కృష్ణుడు గండుపిల్లివలె బలిసి గొల్లపల్లె లోని పాలు, వెన్న దొంగిలించి తిని తెరవాటుకాడై దొంగల గురువుగా పేరుకెక్కి ఉన్నాడు. ఇక నీపగ తీర్చుకొనుమని పలికెను. అప్పుడు సత్రాజిత్తు ఇదిగో నా ఖడ్గముతో నీ తుండము ఖండింతునని భీరములు పల్కెను. వడవడ వణకుచు పెదవులు కదలగ ముఖముపై ముడతలుపడ నడుము బిగించి బోసినోటితో పెడపెడ మాటలు పలుకు ముసలి కోపముచూడగా నవ్వు వచ్చుచున్నదని వసంతకుడు సత్రాజిత్తును అధిక్షేపించెను. అపుడు సత్రాజిత్తు ముసలికోపమో మొసలి కోపమో చూచెదవని పైకి దూకెను. అపుడు కృష్ణుడు అతనితో నేమిపని ఏల మీయిరువురు తొందర పడుదురు అని ఎంతో ఓర్పుతో మామా! నీకు నే చేసిన ద్రోహము ఏమున్నదని ప్రశ్నించెను. మామా! అన్నమాట విని శతధన్వుడు ఓహోవీనికిని సత్యభామమందు అనురాగమున్నది. చెలికత్తె కళావతి మూలమున సత్య భామకు కష్ణునిపై ప్రేమయున్నట్లు తెలిసినది. వీరి ఇరువురకు తగువు పెట్టినచో సత్రాజిత్తుకు నేనే అల్లుడగుదును అని తనలో తలచి పైకి మామతో మామా! వీనికి ఎందుకు భయపడెదవు. వీని చూపులు తెచ్చికోలు ఆరాటము, మాటలలో అమాయకత్వము, ముఖములో రిచ్చపాటు గ్రహించినచో వీడే నీ మణిని దొంగిలించెనని నిక్కముగా చెప్పవచ్చును. అనెను. అపుడు వసంతకుడునీవు నామీద చెప్పుచుండలేదుగదా! అని పలికెను. ఇంతలో రేవంతుడు ముక్కజొన్నపేలగింజవలె ఊరక ప్రేలకు అని హెచ్చరించెను. అంతలో శతధన్వుడు మాటకలిగించుకొని సత్రాజిత్తునుద్దేశించి నిజముగా వీడే నీ సహోదరుని వధియించెను. ఇపుడు నీతో బాంధవ్యమునకుపూనుకొనుచున్నాడు. వీని వినయపు మాటలు నమ్మకు. వీడే ముమ్మాటికి నీ మణినిగొన్నవాడు. వీనిని చుట్టమని మన్నింపకు వీడు తమ్మునే కాదు నిన్ను కూడ మట్టుపెట్టనాలోచించుచున్నాడు. తెలిసి కొమ్ము అనెను. అపుడు సత్రా ఓరీ! ధూర్తగోపాల! ఎంత దూరాలోచనము అనిపల్కెను. అంత వసంతకునికి, సత్రాజిత్తునకు మధ్యమాటలు పెరికెను. ఆసందర్భమున వసంతకుడు వృద్ధరాజుతో నిజము కల్ల నెఱుంగక నిందమోపి వాసుదేవుని దూరుట దోషము అనెను. అటుపై సత్రాజిత్తు కృష్ణునితో జారచోర

శిఖామణివైన నిన్ను ఈ బ్రాహ్మణుడు అనుసరించినది యిట్టి పిచ్చికూతలు కూయుటకా అని పల్కెను. అప్పటికిని కృష్ణుడు మంచిగనే ఈ శతధన్వుని మాటలు పాటింపకుము అని తెలిపెను. రేవంతుడు సత్రాజిత్తునితో మీ తమ్మునితో అరణ్యమున ఈ కృష్ణుడు పరువెత్తుచుండగా చూచితిని. అప్పుడు ఇతనిచేతిలో ధనుర్బాణము లున్నవని చెప్పెను. సత్రాజిత్తు ఇప్పుడు ఈ ప్రత్యక్ష సాక్ష్యమునకు నీవు ఏమందువు అని ఎడిగెను. అపుడు కృష్ణుడు మణి నిన్నునే అడిగినంతమాత్రమున నీ తమ్ముని చంపితనుట నిజముగాదు. నేను అరణ్యమున నీ తమ్ముడు పోయిన దారిలోనే పోయిఉండవచ్చును. కాని హత్యారోపణ తగదు. నిజముగానేను ప్రమాణము చేసి చెప్పుచున్నాను. నామాట నమ్ముడనెను. పిమ్మట సత్రాజిత్తు కోపముతో కప్పకూత పామువైననీవు నాకు ఎక్కడి బంధువు. నీవు బంధు ద్రోహివి. బంధురతపోభ్యాసుడవై పద్మినీ బంధుని లోగానినేగడించిన మణిని దొంగలింతువా ఇట్టినిన్ను గౌరవించుటయా అని నిరసించెను. ఎంతచెప్పినను వినని సత్రాజిత్తు నుద్దేశించి శ్రీ కృష్ణుడు ఊరక వదరకు దురభిమానముతో ఈ శతధన్వుడు పల్కుమాటలను విని అనవసరముగా నన్ను దూరెదవు. పెద్ద వాడుగదా తిట్టనిమ్మని నేనువెనుకాడగ నీవు రెచ్చిపోయి పైకి వచ్చుచున్నావు. ఇకశమింపను సుమా! అని కటువుగామాటాడెను. అంతలో వసంతకుడు ఈనడపీనుగు ఎంతగా ఊరకున్ననుపైకి వచ్చుచున్నాడు. నీవు కొంచెము. దూరముగా ఉండుమని పలికి సత్రాజిత్తుతో ఎందుకట్లు మొనగానివలె గొంతు చించుకొందువు. హుమ్మని పైకి వచ్చెదవు. మాకంతధైర్యము లేదనియా, ఎవడే మావిరోధి మీ ప్రక్కచేరి చాడీలు చెప్పగా ఒడలు మరచి గంతులు వేసెదవెందుకు అని నిందించెను. కృష్ణుడు వసంతకునితో మాటాడవలదని తెలిపి సత్రాజిత్తునుద్దేశించి ఏలనాపైనీకింత అనుమానము. కావలెనన్నచో ఇట్టి మణులు వేనకు వేలుగడింపగలను ఇదిగో ఇప్పుడే కావలెనన్నచో ఈ విమన్మణిని డులిచి నీ సాన్నిధ్య మందుంతును అంతేకాదు, నటవీ శోత్కట కాలకంఠ నివసన్నాగేంద్ర భోగచ్ఛటా తటకూటస్ఫుట రత్న సంచయముల ద్రవ్వించి తెప్పింతును. అని దీరగంభీరముగ పలికెను. దానికి శతధన్వుడు ఈ డాంబిక వచనములకు ఏమిలే అని వెటకారముగా నిందించినాడు. ఇంతలో శ్రీకృష్ణుడు మేక వన్నెపులి అయిన ఈ శతధన్వుడే ప్రాణమిత్రుని వలె నటించుచు నీ మణిని హరించినేమోని హెచ్చరించెను. వసంతకుడును సత్రాజిత్తుతో శతధన్వుద్దేశించి పంది కొక్కువలె కన్నములు త్రవ్వు వీనిని బోనులో వేయించుమనెను. తుట్టతుదకు శతధన్వుడు రేవంతునితో నేనా మణిని తప్పక సాధించి సత్యను దక్కించు కొందును. అని నిష్కర్షగ పలికెను. ఈమాటలు విని వసంతకుడు వీడే ఆమణిన హరించినాడు. నీవు తప్పక కుమార్తెను ఇచ్చెదవని ఆశతోనిట్లు చెప్పుచున్నాడు. పిల్లనిచ్చెదనని ఆశపెట్టి నీవీ శతధన్వునొద్ద నుండి ఏమేమి గుంజితివో అని ఆక్షేపించెను. పిమ్మట కృష్ణుడును నేనును మణికే ప్రయత్నింతును. మణిని తెచ్చియిచ్చినీ మాట ప్రకారము నీ కుమారీమణిని కూడ మాట దక్కించుకొందునని తెలిపి నిష్క్రమించెను. శతధన్వుడు, రేవంతుడు ఆలోచనలు సాగించి తమ చిరమిత్రుడగు శంబరాసురుడు మణిని సాధించుటలో సహకరింపగల డేమో అని అతని కొరకై మధురాపురికి పోవదలచిరి. ఇంతలో శంబరాసురుడే అచ్చటకు విచ్చేసెను. శతధన్వుడు మిత్రునితో అందరు క్షేమమా అని పరామర్శించెను. శంబరుడు రామకృష్ణులు సజీవులై ఉండగా క్షేమమా! వారి శిలస్సులను నేలపై రాల్చికుత్తుకల నుండి వెలువడు నెత్తుటిలో స్నానమొనరించినపుడే నా హృదయసంతాపము చల్లారునని మహాతీవ్రముగా సమాధాన మొసగెను. అందుకు శదధన్వుడు ఎంతో సంతోషించి నేనువరించిన సత్రాజిత్తు కూతురును తానుకూడవరించి నా వివాహభంగమునకు కృష్ణుడు ప్రయత్నించుచున్నాడని తెలిపెను. అంత శంబరుడు పిల్లనిచ్చువాడు మీ పక్షముననే ఉండగా నీ వివాహ భంగమును కృష్ణుడు ఎట్లుగావించును అని పలికెను.

అపుడు శత ధన్వుడు ఆ సత్రాజిత్తునకు ఒకమాటయూ ఒక పలుకా ఎవడు మణిని తెచ్చునో వానికి తనకూతురునిత్తునని గదా ఇప్పుడు చెప్పుచున్నాడు . ఇంతకు మునుపు ఒప్పుకొని అంతయు సిద్ధమైన పిదప నేడు ఈ వివాహమునకు ఇన్ని అగచాట్లు కలిగినవి. అని శతధన్వుడు తెలుపగా శంబరుడు నీకై ప్రాణములనైన అర్పింతును కష్ణుడెట్లు అమణిని సాధించి సత్యను పెండ్లియాడగలడోచూతము. ఈ కృష్ణుడు నాకు ఒక లెక్కకాదు అని ధైర్యమును కలిగించెను. ఇట్లే ప్రధమాంకమున శ్యమంతకమణి ప్రసక్తి, దాని కనుగుణముగా సత్యావివాహ ప్రస్తావిన పలు పాత్రల సంభాషణలందు ప్రకటితమైనది.

**ద్వితీయాంకము :**

ద్వితీయాంక ప్రారంభమున రేవంత, వసంతక, కళావతీ, రేవంతుల సంభాషణ రూపమున ప్రవేశకము ప్రవేశ పెట్టబడినది. శతధన్వుని సేవకుడైన రేవంతుడు కళావతితో రహస్యముగా సంభాషించుటకై ద్వారకాపుర బాహ్యోద్యానమున ప్రవేశించి అచ్చట పవళించి గాఢ నిద్రకులోనై కలవరించుచు సత్యభామ చెలికత్తె కళావతితో చెప్ప వలసిన మాటలను యాదృచ్ఛికముగా ఆ ఉద్యానవనమునకు వచ్చేసిన వసంతకునికి తెలుపును. శంబరాసుర మాయా ప్రభావముచే శతధన్వుడు కృష్ణుని రూపమును ధరించి సాత్రాజితిని కలియుటకై ఉద్యానవనమునకు రాగలడన్న వార్త శ్రీకృష్ణుని వేడుక చెలికాడగు వసంతకునికి పూసగ్రుచ్చినట్లు వెల్లడి అయినది. ఇది తెలియని రేవంతుడు నిద్దుర మబ్బు నుండి మేల్కొని కళావతితో శత ధన్వునికై నీ శక్తి నంతయు ధారవోసి సత్యభామని ఈ ఉద్యానవనమునకు తీసికొనిరమ్ము. అతడు నీ కష్టమునకు తగిన ఉపాయనము ఒసగునని తెలిపెను. ఇక రుక్మిణి చెలికత్తె మదనికతో కృష్ణుడు సత్యను పెండ్లియాడుటకై ప్రయత్నించుచున్నాడని తెపిపినచో ఆ రుక్మిణి కృష్ణుని ప్రయత్నమును సాగనియ్యకుండ చూచుకొనును. అన్న ఉపాయము కూడ ఈ ప్రవేశకమున కళావతి పాత్ర మూలమున వ్యక్తమైనది. తుట్టతుదిగా కళావతి రేవంతునితో నేను సందెవేళకు ఈ ఉద్యానవనమునకు సాత్రాజితిని తీసికొని వచ్చెదను. శతధన్వుని యాదావిధిగారమ్మనుము అని తెప్పి నిష్క్రమించును. ఇట్లు ఈ ప్రవేశకమున తరువాత జరుగనున్న సత్యాకష్ణుల సమాగమునకు ఒక విచిత్రమైన సన్నివేశము కల్పింపబడినది.

కృష్ణ వసంతక సంభాషణతో ద్వితీయాంకము ప్రారంభమైనది. రేవంతుని కలవరపాటున తెలిపిన మాటల వలన సాత్రాజితిని నీపై ప్రేమఉన్నట్లు విదితమైనదిలేనిచో శతధన్వుడు నీ రూపమును ధరించి సాత్రాజితిని కలియుటకు వచ్చునా!

ఉద్యానవనమున వసంతకునితో శ్రీ కృష్ణుడు తనకు గలిగిన మన్మదావస్థను వివరించును. కదళికారామము యొక్క కదలిక ఆకన్యామణి లావణ్యమును స్మరణకు తెచ్చుచున్నదని కృష్ణుడు వర్ణించును. నీ వలపు వృక్షము ఫలోన్ముఖమైనదా అని వసంతకుడనగా సత్యాగమన వసంత సందర్భమునగాని చిగుర్పదు గదా అనికృష్ణుడు తెలిపెను. రుక్మిణీ దేవికి తాను గావించు రాయబారమెరిగినచో వెన్నుపాము విరుగగొట్టి రెండు కనులకు కావలసిన కంకణములు అనగా కన్నీళ్ళు రాబట్టును. ధోవతుల చావునకు ఇక అవకాశమెక్కడిదిఅని వసంతకుడు కృష్ణునితోతెలుపును. ఈ సందర్భమున వివిధ వృక్షములకు దోహద క్రియలు జరిగినట్లే లేదని కృష్ణుడు వనమునుద్దేశించి పలుకును. సాత్రాజితి రాకకై ఎదురు చూచు చుండగా దూరము నుండి మట్టెల చప్పుడు వినిపించును. ఇంతలో కృష్ణుడు వసంతకునితో నీ వల్లరిచేయకుము. నిన్నొక పెద్ద కొతియని భీతితో వారు బెదరి పోదురనెను. పెద్దమర్కటము నేమైన యెడలనే గొప్పవాడనే యగుదురు. ఆజాతియే గదా

సముద్రమునకు సేతువు గట్టినదని సమర్థించును. ఇంతలో సాత్రాజితి కళావతీ మంజువాణులతో ఉద్యానము ప్రవేశించును.

సాత్రాజితి ఉద్యానమును ప్రవేశింపగనే కళావతీ మంజువాణులు తల్లీ! నిన్నీ ఉద్యానము చిలుక పలుకులతో కుశల ప్రశ్నలడుగుచున్నదని అపుడు కృష్ణుడు దూరముగా సత్యా సౌందర్యమును చూచి చూచుటకు తనకు రెండు కన్నులు చాలకున్నవనెను. వసంతకుడు ఇంద్రుడెట్లో వేయికన్నులు సంపాదించినాడు నీవట్లుచేయక పోయితివని పరిహాసమాడెను. కృష్ణుడు, వసంతకుడు సత్య, కళావతీ, మంజువాణుల సంభాషణలు వినుటకై పూవుపొదలలో పొంచి ఉండిరి. కళావతి తనలో శత ధన్వుడు కృష్ణ రూపములో వచ్చిసాత్రాజితిని నేడెత్తి కొనక మానడనియు అప్పటికి కాని సాత్రాజితి పొంగు చల్లారదని భావించిరి. ఇంతలో మంజువాణి కళావతితో ఇప్పడే సందెవేళ ఏలఇచ్చుటకు తీసికొని వచ్చితివని అడిగెను. అందుకుకళావతిచెట్లకు నీరు పోయకున్నచోచక్కదనము ఎట్లు వచ్చుననెను. ఆ మాటకుసాత్రాజితి, కృష్ణుడుసంతసించిరి. ఇంతలోతేటిదంపతుకల కలము ముసురుకొన్నది. సాత్రాజితి మనస్సు ఎచ్చటనో ఉన్నదని గ్రహించి కళావతి సరస సల్లాపము లాడినది. పెండ్లి తొందరపడుచున్నట్లు కళావతి తెలిపినది. అపుడు మంజువాణి, సురపొన్నపై పూయు మాధవీలత ముత్తెపుసేసల వంటి మొగ్గలు దాల్చి ఎట్లున్నదో చూడుమన్నది. అంతలో మరల కళావతి రేపు నీవు పెండ్లి కూతురవై శతధన్వునిపై ఎగసి ఎగసి వ్రాలిన ఎట్లుందువో అట్లని తెలిపినది. అందుకు సాత్రాజితి ఇకచాలునన్నది. కళావతి మాటలు విని కృష్ణుడు ఈకళావతి శతధన్వునికే ఈ కన్నెనొసగి పంతము నెగ్గించుకొనునా యేమి అని పల్కెను. వసంతకుడు అట్లు ఎన్నటికి కాదని ఈ లోపల శతధన్వుడు నీ రూపములో వచ్చినచో ఈ పొదయందు దాగిచూచెదనని ఒక పొదయందు దాగెను. అప్పుడు కృష్ణుని రూపములో శతధన్వుడు వచ్చెనని భావించిన కళావతితో శ్రీకృష్ణుడు ఆశతధన్వుడెవ్వడే? నేను శ్రీకృష్ణుడునే మాయలమారి తనమున అందెవేసిన దానివేకాని నన్నిపుడు శతధన్వుడని గుర్తింపగలవా? ఇపుడు నన్ను ఆ వన్నెలాడి వరించునా? ఇదిఅంతయు నీవు చేసిన సహాయమే నీయుపకారము ఎట్లుతీర్చికొందుననెను. అటుపైకళావతి నిష్క్రమించును. అంతలో వసంతకుడు హఠాత్తుగా వచ్చి ఆ తోత్తుకూతురు కంట బాగుగా దుమ్ముదులిపితివి. దానికి తగిన వేటకాడను నేను ఇక్కడనే ఉన్నాను. అదిగో మంజువాణి ఇటు వచ్చుచున్నదని భావించెను. కాని కళావతి కోపము వచ్చి వెళ్ళి పోయినదని మంజువాణి భర్తృదారిక సాత్రాజితితో తెలిపినది. అటుపై మంజువాణి సాత్రాజితి వివాహవిషయము ప్రసక్తికి తెచ్చినది. సాత్రాజితి కులము, శీలము, ప్రాయము, కన్నె మనస్సు గ్రహించిన పిమ్మటనే పరిణయమొనరించుట పాడి. అట్లు కాక పైడి కాశపడి క్షుద్రునికి అంటగట్టినచో ఆస్త్రీకాపురముకూలద్రోసినట్లే అని తెలిపినది. చెనటి శతధన్వుని వరించి చెడుటకంటె త్రాచు పామును మెడలోనదాల్పవచ్చునని, కాలకూటవిషమును గ్రోలవచ్చునని యన్నది. శతధన్వుడే మణిని సంపాదించి తన్ను వివాహమాడునేమో అని శంకించుచున్నట్లు శ్రీకృష్ణుడు ఆమె మాటలను బట్టి గ్రహించెను. సాత్రాజితి క్రూరమైన మన్మథార్తికి చిక్కి తానిక బ్రతుకుట దుర్లభమే అని మంజువాణితో తెలిపినది. ఇంతటికి ఈ మనస్సును లోగొన్న అతడెవడే అనగా సాత్రాజితి యొసగు ప్రత్యుత్తరముకొరకై కృష్ణుడు మిగుల తత్తరపుటాసనల్లాడు చిత్తముతో ఎంతో ఉబలాటముగా ఎదురుచూచినాడు అపుడు సాత్రాజితి యాదవ వంశమున జన్మించి కాంతలకు మూర్ధన్య అయిన రుక్మిణిని పరిగ్రహించి, సొగసుగాడై దీనులను పోషించునతడే నామది గొన్నవాడని తెలిపినది. అందుకు కృష్ణుడు పరమానంద భరితుడై వసంతకునితో ఈ రహస్యమును బయలు పరచకనోరుమూసికొని

ఉండుమనినాడు. సాత్రాజితి కృష్ణుల కలయిక సిద్ధించినది. కృష్ణుడామె చేయి పట్టుకొనును. అపుడు సత్యభామ నిన్నాశ్రయించి ఉన్న అన్నుల మిన్నలు వేనవేలున్నారనును. కృష్ణుడు ఎందరున్నను నీవే వారిలో అగ్రగణ్యవు. మన్మథుని జయించుటకు నీకన్న అన్య కన్యలులేరు. కృష్ణుని దక్షిణ నాయక లక్షణములు గుర్తించిన సాత్రాజితి ఎవరెవరికి ఎట్టి రక్షణమొసగి తీర్పవలయునో తెలిసి కాపురమును నెగ్గించు కొనగలవాడే సర్వసమర్థుడు అనితెలిపినది.

అంత కృష్ణుడు బ్రహ్మవిష్ణుమహేశ్వరులు వారి వారి యిల్లాండ్రను ప్రేముడితో చూచునట్లు నీకు అసామాన్య ప్రతి పత్తినొసగియేలగలను. ముందుముందు లభ్యమగు నావల్లభ్యమెట్టిదో చవిచూడగలవనెను. అటుపై సాత్రాజితి కృష్ణునభ్యర్థించుచుమా పిన తండ్రి మూలమున మాతండ్రి గోల్పోయిన మణిసేలాగునైన తెచ్చియిచ్చితన్నుపరిగ్రహింపవలసినదని వేడెను. ఇంత మాత్రమున కేల వ్యథ మేరువును తెచ్చి నీ ముందిడనా అని కృష్ణుడు తెలిపెను. అతని మాటలకు ఆనందమును పొందిన సాత్రాజితి జ్ఞాపకార్థముగా హారమొసగి ఎట్లైన తన్నుత్వరలో చేపట్టితీరవలెనని కోరినది. ఆమె యొసగిన హారమును కామదేవుని ప్రసాదముగా గ్రహించి కన్నులకద్దుకొని ఆ ముక్తామణి హారమునలన తమయుభయుల మనో భీష్టము తప్పక యీడేరగలదని (కృష్ణుడు భావించెను. ఇట ముక్తామణిమాలా ప్రాశస్త్యమును బలిజేపల్లి వారు వివిధ పద్యములలో కీర్తించిరి.

ఇది ఇట్లుండగా రుక్మిణితో మదనిక ప్రవేశించి తప్పక వెన్నదొంగను రః ఉద్యానవనమున పట్టి నీకీయగలనన్నది. అచ్చట వసంతకుడు బావురు పిల్లివలె నొక పొదలో దాగియుండగా చూచి ఆతని మూలముననే శ్రీకృష్ణుని సమాచారము నంతటిని వెడల గక్కింతునని తెలిపినది. కాని ఆతడు కొంతసేపు మౌనము వహించెను. నీవు మూగవాడవ అని మదనికఅనగా నేను మూగవాడనా అని ఎదిరించిమాటాడెను. అయినచో నీ మూతిమీద ఎవరుకొట్టిరని ఇంతసేపు నోరుమూసికొని యుంటివనినది. గోపాలుని వేడుకచెలికాడ నన్నెవ్వడు మూతిపై తన్నగలడు. అతి రహస్యమైన విషయము పంజరమునుండి చిలుకవలె ఎక్కడ బయటకు వెడలి పోవునో అని యింత జాగరూకత వహించి తిననెను.

ఉద్యానవనమున కృష్ణుడు సాత్రాజితితోతిరుగుచున్నాడన్న రహస్యము వెల్లడి కాకుండనోరు మూసికొని యుంటినని తెల్పిన వసంతకుడు చివరకు అసలు రహస్యమును బట్టబయలు చేసెను. మదనిక వసంతకుని మూతిపై కొట్టిఈ నిర్భాగ్యుని చెట్టునకు వితిచి కట్టుమని రుక్మిణితో ననగా ఆమె వసంతకునితో నీనైజము మానవైతివి గదా! అని నిందించినది నేను చేసిన తప్పిదమునకు మదనిక నావీపును విఱువ గొట్టినది. నన్నిక విడుపుమని రిక్మిణిని వసంతకుడు ప్రార్థించెను. ఇక వీనితో మనకేమిపని పోవుదమని నిశ్చ మించునంతలో కృష్ణుడు కనిపించెను. అప్పుడాతనని మదనిక చూచి అదిగోఆతడే వెన్నదొంగ అనిచూపినది. అందుకు రుక్మిణిభర్తగారి దుర్ణయము చూచితివిగదా! అని ఆక్షేపించినది. ఇంతలో సాత్రాజితి అచ్చట నుండి పారిపోయినది. అపుడు కృష్ణుడు తనలో ఈరుక్మిణితో నిక నేనేమి మాటాడ గలనని తలచెను. 'రుక్మిణి తననాథుని సమీపించి నా రాకవలన నీ ప్రయత్నము భంగమైనది కదా! నన్ను క్షమింపు డన్నది. కోపకార్యమును సరసముగానుపక్రమించిన రుక్మిణి చిగురాకు మోవిబి గింపకయే, కనుబొమలను ముడివేయకయే, లేతనవ్వుల లీల చాలింపకయే అలుకనిక మానుచునే తాను పలికినదట. ఇట్టిభావములను వివరించుటలో బలిజేపల్లి కడుసమర్థుడు.

అటుపై రుక్మిణీ కృష్ణుల సంభాషణ కొంత వరకు సాగినది. నీ కంటెనునా అనురాగమునకు తావలమైన కాంతామణి ఈయుద్యానమునకనెవ్వతె అని కృష్ణుడు తన

తప్పిదమునుకప్పి పుచ్చప్రయత్నించెను. కానిదానికి రుక్మిణి వగచుచు పోపొమ్మపై ఇచ్చకపు మాటలతో నన్నేల అనునయింపజూచెదవు. అని పొలయలుక పూని ముందునకు పోబోవగా కృష్ణుడపి నిరపరాధునైన నన్ను శంకించుటయా ఇది యువతీజనసైజమే అని తెలిపినాడు. మదనికతో కృష్ణుడు నీవైనను తన్ను గూర్చి తెలుపవలసినదని అనెను. మదన సామ్రాజ్యమంత్రియగు వసంతకుడే నీ (దుర్ణయము) అవినయ వృత్తాంతము నెల్లవెల్ల డించినాడని రుక్మిణి మధ్యలో మాట కలిగించుకొని తెలిపినది. కల్లలకు పుట్టినిల్లయిన వసంతకుని మాటలా నమ్ముట అని కృష్ణుడనెను. పిమ్మట వసంతక, రుక్మిణీ, మదనికల సంభాషణ సాగినది. వసంతకుడునోరు జారవిడుచుటచే కలిగిన ముప్పును, తప్పును కృష్ణుడామెను నిలిపి అనేక విధములుగా అర్థించెను. రుక్మిణి తానింతవరకు మసలిన విధమును విన్నవించి యిక నీతని మాటలు చేతలు నమ్ముట నిరర్థకమని నిశ్చయించుకొన్నది. ఇచ్చట కృష్ణుడెంతో అనునయింపజూచుసందర్భమున పోతనార్యుని ఆదిన్ శ్రీసతి కొప్పుపై పద్యమును దలపించు ముదితా బాసయొనర్తు నను మత్తేభవృత్తమును కవి రచించెను. అమెననునయించుటకు పోబోవుచువసంతకునితో నిక్కమైన శతధన్వుని వృత్తాంతమును జాగరూకతతో పరిశీలింపుమని తెలిపినాడు.

ఇప్పుడే శంబరాసురుడు మాయాసత్య భామగా వచ్చునేమో పొదమాటున పరికింతుననగా కృష్ణుడట్లే అని నిష్క్రమించెను. అంత మాయా సత్యభామ రూపమున శంబరాసురుడు ప్రవేశించి శతధన్వుని మిత్రుడనైన నందులకు మణిని శ్రీకృష్ణుని నుండి గ్రహించి తీరవలెనని తన యెత్తుగడను వివరించెను. ఆడు రూపమును బూనుటసైచ్యమని మొదట నెంచియు నంతలో విష్ణుని మోహినీరూపమును దలచి యిది తగినదియే యని నిర్ణయించుకొనెను. మాయా సత్య తనలో ఇంతకు తాను నాటిన మాయాలతిక చక్కగా ఫలించి రుక్మిణిని మోసగించినదని తలచెను. అంతలో మంజువాణి రుక్మిణితో ఏమిటి అట్లు యోచించుచున్నావని అడిగినది. వసంతకుడు అక్కడ మాయా సత్య భామమను చూచి ఈ మంజువాణి భ్రమసినది. ఇక శతధన్వుడు కృష్ణుని రూపమున వచ్చును. మొత్తము మీద ఇది నాటకము వలె ఉన్నది. దీనికి నేనేసూత్రధారుడను అని అనుకొనుచుండగనే అడుగో! కృష్ణుడు వచ్చుచున్నాడని మంజువాణి యనగా మాయాకృష్ణుడు ప్రవేశించును. అట్లు ప్రవేశించి సత్యభామకై తానుపడినపాటు తెలుపుచు అక్షయకాయసిద్ధిపడయుటకు ముముక్షువులు అష్టాక్షరి, షడక్షరి ధ్యానము చేసి కృశింతురు. నేను అట్లు గాక సత్యాక్షర యుగ్మ మంత్రముతో ఉత్తమ కార్యసిద్ధిని పొంది కృష్ణరూపమును ధరించితిని. కృష్ణుని మహోత్తును తెలిసిన వాడయ్యు సత్యపై మోహముతో ఆ కృష్ణుని వచింపదలచితిని. కామినీ భ్రాంతి ఎంతటి అకార్యములుచేయించునో! అహల్యను గోరు ఇంద్రుని కంటె నేనే మాన్యుడను. వెంటనే సాత్రాజితి పాణి గ్రహణమహోత్సవమును అనుభవించెదనని ముందుకుపోగా ఎడమకన్ను అదిరెను. అయినను ఈ అపశకునములు ఏమి చేయునని మంజువాణితో మేలమాడుచు వసంతకుని చూచి ఇతడు నన్ను కృష్ణుడనియే తలచి ఉండునని భావించి పిమ్మట వసంతకునితో మదన తంత్రమంతయు నడుపుమనెను. మాయా సత్యభామ మంజువాణితో పూబంతి ఆట ఆడుటను మాయాకృష్ణుడు చూచి అమెరూపలీలా విలాసములకు మిగుల ఆకర్షితుడయ్యెను. అప్పుడు వసంతకుడు నీ కొరకే బ్రహ్మదీని నింత చక్కగా సృష్టించెనని తెలిపితాను బయట పడదలచెను. మాయా సత్యభామను మాయా కృష్ణుడు సమీపించు సందర్భమున పూబంతి మాయా కృష్ణుని పైబడినది. అపుడు మాయా సత్యతన్నుక్షమింపుమన్నది. కాని మాయా కష్ణుడు క్షమించుటకు నీ తప్పేమి? నేను

నీకతిధినైవచ్చితిని లావణ్య రసములు చిలికించి నీ అధరామృతముతో నమ్మోదమును కూర్పుమని తెలిపెను. వని పరిస్థితిని చూచి వసంతకుడు ఈ మంద భాగ్యుడెంత ఉవ్విళ్ళూరు చున్నాడు. వీని అవస్థను చూచినచో మాకు జాలి, నవ్వును కలుగుచున్నదేను. అటుపై వసంతకుడు కోరివచ్చిన కృష్ణుని మర్యాద చేసి పంపుట మంచిదని మాయా సత్యతో పలికెను. అప్పుడామె గోపాల! అని సంబోధించి కోర్కెల దీర్చుటకు నేనేపాటి సమర్థురాలననెను. అందుకు మాయా కృష్ణుడు ఏ మట్లుదీనముగా పలుకుచున్నావు. మా కోర్కెలనునీవు దీర్పకున్న మరెవ్వరు దిక్కు అని అనెను. అటుపై ఆబాలామణి అందము అనన్య సదృశ మనితెలుపుమ నీవు నాకు చిరపరిచితవే, పరకాంతవు ఎట్లు అగుదువు నిలిచినా, కూర్చున్నా, నిదుర పోయినా, కలువరించినా, పలికినా అంతయునీవే. కావున నీవు నాకు స్వతంత్ర రాలవనెను. అపుడు మంజువాణియు ఇతడు నీకు వరణీయుడే అని తెలిపెను. అంత మాయా సత్య నీరాయబారమేమిటి అనగా మాయా కృష్ణుడు ప్రేయసీ! మంజువాణిపై ఏల కోపింతువుఅనెను. మాయా కృష్ణుడు ఎంతగానో మాయా సత్యను బతిమాలాడెను. మంజువాణి అపుడు అంతగా బతిమలాడు గోపాలదేవుని నిరాకరించుట మిక్కిలి విలసముగా ఉన్నది. నాకెందుకు నీ గొడవని నిష్క్రమించెను. వసంతకుడును వీరిరువురి నిజరూపములు బయట పడకముందే వెడలిపోవుట మంచిదని నిష్క్రమించెను. అంత మాయాకృష్ణుడు మాయా సత్యను పట్టుకొని ఆమె కాళ్ళపై బడెను. మాయాసత్య తాను అస్వతంత్రురాలననెను. మాతండ్రి సమ్మతి నాకులేదు గదా! శ్యమంతకమిచ్చిన పిదప నా తండ్రి నీతో వివాహము జరిపించును. ఇప్పుడే గాంధర్వ వివాహముతో నిన్ను చేపట్టెదను. నీవు ఇంక ఈశతధన్వుని బారి నుండి తప్పించు కొనలేవని పలికెను. వెంటనే మాయా సత్య అతడు శతధన్వుడే! అని ఆశ్చర్యపడెను. తుదకు మాయా కృష్ణుడు నేను నిజముగా కృష్ణుడును గాను అనగా మాయా సత్యయు నేనును సత్య భామను కాను. నీ ప్రియమిత్రుడైన శంబరాసుడను అని చెప్పెను. అంత కళావతి తాను చేసిన సహాయమునకు శతధన్వుడు ఏమి బహుమతి నొసగునో అని సమీపించెను. శతధన్వుడు కళావతితో కృష్ణుడిపుడు ఎక్కడున్నాడో అని అడిగెను. దానికి కళావతి శ్యమంతకాన్వేషణమునకు ఇప్పుడే బయలు దేరు చున్నాడట అని చెప్పెను. అప్పుడు శంబరాసురుడు అట్లు అయిన మరియొక ఆలోచనము చెప్పెదను రమ్మనెను అంతటితో ద్వితీయాంకము ముగిసినది. ఇట్లే ద్వితీయాంకమున శతధన్వుని మిత్రుడు శంబరాసురుడు మాయా సత్యా వేషమున మాయా కృష్ణుని వేషమును ధరించిన శతధన్వునితో కలిసి తాము పన్నిన పన్నుగడలు విఫల మైనందుకు మరియొక ఆలోచనచేయవలెనని భావించి నిష్క్రమించిరి. వసంతకుడు, ర వంతుని కలువరింతల వలన శతధన్వుని కుట్రలను, శంబరాసురుని మాయోపాయములను ముందుగనే గ్రహించి ఎంతో అమాయకముగనే ఉండి రుక్మిణీ, మంజువాణులచే దుర్భాషలు తిని శ్రీకృష్ణునికి సత్యభామతోడి సాన్నిహిత్యమును కలిగించుటకు ఎంతో సహకరించెను. 'కథాసన్నివేశములలో చిత్రవిచిత్రములైన మలుపులు వీరాద్భుత శృంగార హాస్యరస భరిత సంఘటనలు ఈ అంకమున చక్కగా చోటుచేసికొన్నవి. మాయా సత్యా ,మాయాకృష్ణుల సమాగమము సన్నివేశమును బలిజేపల్లి వారీ యంకమున ఎంతో సముయోచితముగా సంధానించిరి. అందుకు వసంతకపాత్ర ప్రాముఖ్యము మొదటి రెండంకములలో ఎంతో అనుకూలించినది. వసంతకుడు శతధన్వ శంబరాసురుల పన్ను గడను రేవంతుని కలవరింతల మూలమున విని కృష్ణునకు తెలుపకున్నచో కథమరియొక విధముగా సాగెడిది. అపుడుసాత్రాజితీకృష్ణుల సమాగమునకు అనుకూల్యముకన్న ప్రాతికూల్యమే ప్రాతినిధ్యమువహించి ఉండెడిది. అనగా కృష్ణసత్యభామల పరిచయము పల్లవించి ప్రణయ

రూపమున ఫలించుటకు మారు ప్రళయముగా ప్రతి ఘాతముల తాకిడిచే అంతటితో సమసిపోయి ఉండెడిది. మాధవుడైన శ్రీకృష్ణునికి సత్యభామపై నేర్పడిన పరిచయ వల్లి వికసించి పుష్పించుటకు వసంతక మైత్రి నిజముగా మాధవ సార్థక్యముతో కుసుమాకరమై వసంత లీలను నెలపినది.

## తృతీయాంకము :

తృతీయాంకమున శ్యమంతక మణికై శ్రీకృష్ణుడు అరణ్యమునకు పోయి, జాంబవంతుని కలియుట, వాగ్వాదము పెరిగి యుద్ధమునకు సన్నద్ధమగుట. తుట్టతుదికు జాంబవంతుడు అవతారపురుషుడైన శ్రీకృష్ణుని నిజస్వరూపమును గ్రహించి తనజన్మ ధన్యమైనదని తలంచుట - వర్ణింపబడినవి.

శ్రీకృష్ణుడు సత్యయొసగిన ముక్తాహారమును మాటి మాటికి తలచుకొని ప్రసేనుని ఈ అరణ్యమున వెదకి పురమునకు మరలెదనని అనుకొనుచుండగనే కొంతదూరమున ఒకశవము, అచ్చట హేమకంకణములు, దానికి కొంత చేరువసింహశవము కానుపించెను. ఈసింహమును వధించిన బలశాలి ఎవ్వడో అని ముందు పైపుమాడగా సుదీర్ఘమైన కొండ చరియ ఎంతో మనోహరముగాకన్పించెను, బలిజేపల్లి ఇచ్చట ప్రవిమలకైరిక ధాతుచ్ఛవిచే, చిరత్నరత్న సానువులతో నొప్పుపర్వతమును హరి చాపయుక్తమేఘము వలె ఉన్నదని అభివర్ణించెను. కొండ నెత్తములయందునడచుచుఅందు ఒక గుబను గాంచి గాఢాంధకార బంధురమైవ ఈ కందరము దురవగాహము రాత్రించర పరివారమునకు వసతియగు లంకాపురమునకు తగినట్లున్నదే! అని కొంత ముందుకు నడచి ఆగుహలోని వెలుతురునకు, అందలి దివ్య భవనమునకు ఆశ్చర్యపడి యిందెవరో భాగ్యశాలి కాపురముండ నోపును అని నిశ్చయించుకొనెను. ఇంతలో ఒకదాసి శ్రీకృష్ణుని చూచి ఎవరో దొంగ అని పరుగెత్తుచు అయ్యో! జాంబవంతా! అని అరచును. దానిని బట్టి అది జాంబవంతుని గుహ అని శ్రీకృష్ణుడు నిశ్చయించెను. ఇంతలో జాంబవంతుడు కోపముతో నిలునిలుమా! ఓ తులువా!... పారి పోనెంచితివా ముష్టి ఘాతముతో నీప్రాణములు తీసెదని కటువుగామందలించెను. దానికి కృష్ణుడును ఎందుకు అడచిపడెదవు? పరధనము హరించిన పాపకర్ముడువైన నీ ప్రాణధనముల నేనే హరింతుననెను. అంత ఇద్దరి మధ్యవాగ్వాదము పెరిగినది. ఇట బలిజేపల్లి సంభాషణా చాతుర్యమును వివిధ పద్యములలో అర్థ గాంభీర్యముగల అలతి అలతి వచన రచనలలో రసభరితముగా పేర్కొనెను. ఇందురెండు సీసములుకూడ ప్రయుక్తములు. అవి సీసమువంటి జాంబవంతుని హృదయమును తలపించుచున్నవి. 'చివరకు నిరువురలో కోపతాపములు, ద్వేషరోషములు పెచ్చు పెరిగినవి. బెబ్బులుల వలె పెడ బొబ్బలు పెట్టిరి. అపుడు వారి సంభాషణ శర్దూల పద్యములలో అభి వర్ణితమైనది. కడకు జాంబవంతుడు ఇక యుద్ధ ప్రక్రియ చాలును. నీవు సాక్షాద్విష్ణుడవు. నేను ఓడితిని. నిన్నింకజయింపలేను. అని తన దురాత్మత్వమును సైరింపుమని వేడెను. శ్రీకృష్ణుడు మన భుజబలముల తారతమ్యము బోధపడినదా అని అనగా జాబవంతుడు బోధ పడినదని అనేక పద్యములలో స్తుతించుచు విన్నవించినట్లు అభివర్ణితము పిదప శ్రీకృష్ణుడు రామావతారమున కపులతో పాటు నాచేలికాడవై ప్రస్తుతము శ్యమంతక మణితో పాటు నీ కుమారీమణిని గ్రహించి ప్రయాణ మయ్యెదననెను. ఈ తృతీయాంకమున శ్రీకృష్ణ జాంబవంతులసంభాషణమునకే ప్రాముఖ్యము. నాటకమున నాయికమణి వంటి ఈ తృతీయాంకమున శ్యమంతక మణిని

జాంబవంతు్కమారీమణితోకూడ శ్రీకృష్ణుడు గ్రహించిన విషయము చక్కగా అభివర్ణింప బడినది. ఈ అంకము పరిమాణమున అల్పమయ్యును ప్రణయ పరిణామమున ఒక వినూత్నమైన తేజస్సును అపూర్వమైన ఓజస్సును ప్రకటించినది.

## చతుర్థాంకము :

చతుర్థాంక ప్రారంభమున భర్త్సదారిక సాత్రాజితి ఉద్యానమునుండి పూలుకొసికొని తనతో కూడ కళావతిని తీసికొని దుర్గాలయమునకు రావసినదని మంజువాణి తెలువు వృత్తాంతము ప్రవేశకమున ప్రవేశపెట్టబడినది. శతధన్వునితో రహస్యమంతనములాడు కళావతి కన్పించి ఇంతలోనే ఐశ్వర్యము వచ్చినదా అంత పని తొందరయేమి దుర్గాలయమున నేను మిమ్ము కలసి కొనియెదనని తెలిపి నిష్క్రమించెను. అటుపై సాత్రాజితి,మంజువాణి, శ్రీకృష్ణ సమాగమమునకు ఉత్కంఠతో ఎదురుచూచుచుందురు.నాకంటె ముక్తా హారమెంత సుకృతము చేసికొన్నదో? రుక్మిణీ దేవి మరెక్కడకు కదలనీయక తన అంతఃపురముననే బంధించి వేసినదేమో? ఓ మంజువాణి! నీవు పోయి మా అవస్థను కృష్ణునకు నివేదింపుము. ఎలదోటలో నాడు తిలపించినది మొదలు కన్నార ని ద్రకాంచననియు, నిన్నుదప్ప ఇతరులనెవ్వనినైన ఎవ్వరేమి చెప్పినను వరింపనని తాను తెలిపిన మాటలన్నియు తలచుకొని నీ కొరకేఎదురు చూచుచున్నదని తనపై వలపు లేకున్నకబురైన పంపుమని బ్రతికియున్నది అందుకే అని నిష్క్రర్షగా మాపరిస్థితిని తెలుపుమని పంపినది. మంజువాణి సరియే అని నిష్క్రమించినది. అంతలోనే సాత్రాజితి నిజముగా తనకు నాపై వలపున్నచో తనకు తానైరాడా? నేనై పిలువబంపినచో చులకనకాదా అని అనుకున్నది. ఇది ఇట్లుండగా దూరము నుండి కళావతి సాత్రాజితిని శతధన్వునకు చూపినది. అతడు శంబరాసురుని మాటలను పాటించి మెల్లమెల్లగాదుర్గాలయమునకేగి దేవికి వెనుక నొదిగెను. అపుడు సాత్రాజితి దుర్గతో తనఅవస్థను వెల్లడించుకొనుచు కృష్ణునికి ఇల్లాలిని కాకున్నచో ప్రాణములనే పరిత్యజింతువనని తెలిపి మూర్ఛిల్లినది. అపుడు దుర్గ నీవు దుఃఖించినను ప్రయోజనము లేదు. శతధన్వుడేనీ పెనిమిటి ఇది విధి చేత నిర్ణీతమైనది. ఊరక తెగింపకుము. కుల శీల వయో రూపములలో శతధన్వుడు నీకుదగినవాడే అని తెలిపినది. అంత సాత్రాజితి తల్లీ! నీవు కూడ ఆశతధన్వుని పక్షమే అంగీకరించితివా జన్మజన్మాలకైనను వాని చెలిమి వలదు. మరుజన్మఉన్నచో మరుని జనకుడైన ఆ మాధవుడే నాకు వరుడు కాగలడు. అతడే నాకు పతికాకున్నచో నాజన్మము నిరర్థకము. అతని సతిని కాకున్నను పిల్లనగ్రోవినై ఉన్నచో అధరామృతమును అని యుందును. లేకతులసీ మాలనైనచో అతని మెడనుకౌగిలించి ఉందును. తుదకాతని మందలో తొఱ్ఱునై పుట్టియున్నను నాజన్మ ధన్యమై ఉండెడిది. నా కోర్కెల న్నియు నేటితో కూలిపోయినవి. ఇక ఈ తనువు చాలింతునని మెడకు తీగను ఉరి వేసికొనుటకై దగిలించుకొన్నది. ఇంతలో శతధన్వుడు హఠాత్తుగ ప్రవేశించి ఆమెను, నివారింపజూచెను. అపుడామె ప్రయత్నభంగము గావింపవలదని వేడికొనెను. కాని శతధన్వుడు నీకు ఏకొరత లేకుండ చూచెదను. ఏలఉరిపోసికొందువు అనగా నామనస్సింతినీ పెరుగుదువు నీ మనో వికృతి నేనెరుగుదును. నీవు నాకు అన్నవు. నాపై అన్యభావము ఉంచకు యని తెలిపినది. పిదప శతధన్వుడు కృష్ణుని నానా విధముల నిందించుచు అతనికి కొంపా గోడియా అతనికి ఎవ్వరును లేరు. కాని నేనందరి వాడను. వాని గుణములసంగతి చెప్పమని లేదు మఱివానికి చక్కదనమందుమా ఒక్కరూపు చందమేర్పడదు. నీవెంతటి అజ్ఞానురాలవు. అతనిది అందమా! చందమా! నేను కారు మబ్బువలె నల్లగలేననియా లేక పదారు వేల స్త్రీతలతో వేగు ప్రవిత్రుడకాననియా ఎందుకు నన్ను చూచిన మూతి బిగింపు, నీ కావెన్న

దొంగయేతాతల నాటి చుట్టమా? అని పలికెను. అందుకు సాత్రాజితినీవు నవమన్మదుడవే అనుకొనుము. చక్కదనము, సరసత్వము, కులము, ధనము, చదువేమియు ముఖ్యముకాదు వారివారి పూర్వ జన్మకృతమును బట్టి పడతికి ప్రభువు ప్రాప్తించును. అని తెలిసినది. అంత శతధన్వుడు నీవ పెట్టిగొల్ల నితో నెట్లు కాపురము చేసెదవో చూచెదను. నీవు వానినే కట్టు కొమ్ము అని తెలిపి అంతటితో అగక, ఊరూరపాలు పెరుగమ్ముకొనుచు, పసవుల మేపుచు పదాఱువేలసతులతో సిగపట్ల ముచ్చటలు ప్రొద్దు పుచ్చువానితో నీ సంసారమెంత సాగసుగా సాగునో చూతును గదా అని ఎకసక్కెము లాడెను. ఇట బలిజేపల్లి సీస పద్యరచనలో వాని ఎకసక్కెపు పలుకులను ఎంతో చక్కగావక్కాణించెను.

ఇట్లు కృష్ణుని నిందించుట విన్నసాత్రాజితి శతధన్వునితో భగవంతుడగు కృష్ణుని దొంగయని యందువా ఆతని మహిమ నీకేమి యెఱుక. నిజమే భగవంతుడైన ఆ కృష్ణుడు ఘనయోగిజన మనోదనమును ముచ్చిలు గజదొంగ ముక్తి కాంతామణీ సక్తులగు విటులకు వెఱవు జూపు పెద్ద విటుడ వసుమతి అను గోవు వలన ధర్మలను పాలు పితుకు గొల్లవాడ అతడు దొంగలకు దొంగ దొరలకు దొర అని తెలిపెను. బలిజేపల్లి ఈ భావమును సీసములో ప్రకటించెను. పిమ్మట శతధన్వుడు సాత్రాజితితో ప్రేమాధిక్యము వలన నీవు భగవంతుడను చున్నావు. ప్రియమైన పదార్థములో ఎంత కొరత ఉండినను అది కనపడదు. చండ భానునిలోని వెచ్చదనము కలువకుకాక నళినికి కానపడునా అందుకు సాత్రాజితి అడియానలేల నావలన నీకు అవంతయు సౌఖ్యము లేదు. ఒకరికొకరు అన్యోన్యముగా మనస్సులుకలసి నిరక్షరన్యాయము వలె సంసారము సాగినప్పుడే రక్తి కట్టును. పెడ మొగము పెట్టు నాతో నీ కడు గైనను సాగదు, పడకయేపామై నిన్ను వేధించి తీరును. అని నొక్కి వక్కాణించినది. అంతటితో శతధన్వుడు ఊరకుండలేదు. సిరిరామోకాలడ్డెదవా! ఏల నిష్కారణముల చెడెదవు. పదివేల మంది స్త్రీలు నాకను సన్నతో నీకు దాస్యమును సల్పెదరు. నాధనము, ప్రాణము నీ ఆధీనము అని వల్కెను. అందుకు సాత్రాజితి అన్నా! ఏమిటి ఈ మాటలు నీ మూర్ఖత్వము బయట వేసికొనుచున్నావు. మనస్సును ఇంతకు ముందే ఒకనిపై హత్తించి యున్న శుద్ధాంత స్త్రీని బలవంతపెట్టి యిటు రాద్ధాంతము చేసెదవా మాటి మాటికి భోగ భాగ్యముల మాట తెలుపుచున్నావు. మాధవుని విభవము ముందు నీభాగ్యమెంత? ఇక నీ పిచ్చి పోకడలు కట్టిపెట్టుము. ధనవంతుడో నిరుపేదయో రూపసియో కురుపియో కృష్ణుని దప్పఅన్యునివరింపను. అని తన మనోనిశ్చయమును నిష్కర్షగా నిరూపించినది. అప్పటికిని శతధన్వుడు ఆమెను వదల పెట్టలేదు. ఏమీ నీ మనోనిశ్చయమును బ్రహ్మాదులను ద్రిప్పనేరరుగా. ఇక నీకు సాదువాక్యములు రుచింపవు. ఇప్పుడు నిన్ను ఎత్తుకొని పోయినచో నీకు దిక్కెవరు ఇక దండోపాయమే నీ యందు ప్రయోగింపవలెననగా సాత్రాజితి నీకు వినాశకాలమాసన్న మైనది. నీవు బలాత్కృతిగ హరించినను నేను నిన్ను వరింతునా ఇకనైన నీకు మేల్పడిన భార్యను చేకొని ముద్దుముద్దుగ బ్రతుకుమని బుద్ధిచెప్పినది. ఇంతలో శంబరాసురుడు దేవి గుడినుండి ప్రవేశించి ఇక నీ ఆటలు సాగవు. మధురాపురమున చెరసాలయే ఇక నీకు విశ్రామస్థానము అనెను. అపుడు సాత్రాజితి శతధన్వునితో ఓరీ! దుర్మతీ! పరకాంతను హరించి ఎవడు బాగుపడెను. రావణాసురుని గూర్చి వినలేదా హితవాలింపక రాక్షసమునే కితవోద్వృత్తితో ప్రయోగింపనెంచితివా అస్త్ర శస్త్రముల వైశేష్యము నాకును ఒక్కింత తెలియును. విల్లో కరవాలమో! ఒనగి నాతో పోరాడుము అని హెచ్చరించెను. అపుడు శతధన్వుడు ఇంత పాటి మగదీరములు ఎప్పుడు నేర్చితివి ? గాజులుతొడిగించుకొని ఒకమూలకూర్చొని ఉండవలసిన ఆడుపుట్టువులు ఇట్లు మగవారినే

పోరికి పిలుచుటయా! ఔరా! ఏమికాల మహాత్మ్యము! బెదిరింపులు చాలించి రథమెక్కుమని పలికెను. అపుడు సాత్రాజితి రౌద్రమూర్తియై ఓరీ! పిరికిపందా! మగవాడవైపుట్టి గడ్డలు మీసాలు పెంచిపడతి చేయుద్ధమునకు పిల్వబడి పంద వలె ఊరకుందువా? చేత కాక కాలమహిమయుని ఎకసెక్కెము లాడెదవా పూర్వ మెందరు స్త్రీలు యుద్ధరంగమున ఘోరవీర వ్రతమును ప్రకటింపలేదు. శౌర్యవిద్యాది సంపదలు స్త్రీలకు బహిష్కారమా స్త్రీ జనమంత చులకనయా చండ ముండాది రాక్షసకోటిని దుర్గదును మాడలేదా విశ్వలాదేవి కీర్తివినలేదా? పాడు మగరూపుగన్నఓ ఆడ దానా! అని నిందించెను. అపుడు శంబరాసురుడు శతధన్వుతో దీనితో ఇన్ని మాటలేల వెంటనే బలవంతముగా రథమున పెట్టెదనని సమీపింపబోయెను. సాత్రాజితి అర్తరక్షణ పరాయణుడగు భగవంతుడే తన్ను రక్షింపగలడని ప్రార్థించినది. ఇట సీసము ప్రయుక్తము. శతధన్వుడు రథమును నడుపునపుడు కూడ కృష్ణునుద్దేశించి కృష్ణా! నీవెక్కడనుంటివి నన్నొక నీచుడు పరాభవించుచున్నాడు. నిన్నే మదినమ్మి ఉన్ననన్ను నట్టేట ముంచెదవా నాకిక దిక్కెవ్వరు ఓ చిలుకలారా! సుమనోమనోహరద్రుమములారా! వనమాలి యనురామానుజునకు నాకష్ట దశ ఎరిగింపుడు అని మొరపెట్టుకొన్నది. కర్మసాక్షి అయిన లోకభాందవా నీకెన కరుణరాదా! అని వేడికొన్నది. అపుడు శంబరాసురుడు మిత్రుడు శతధన్వుతో వాయువేగమున మధురా నగరమునకు రథమును చేర్పుమని తెలిపి రహస్యముగా నేను వసుదేవునింటిని పోయి పుత్రుని రాకకు చింతిల్లు ఆవృద్ధుని మరింత యేడ్పించి వచ్చెదను. ఇక నీవు పొమ్మని అనుటతో చతుర్థాంకము ముగియును.

ఇట్లే చతుర్థాంకమున సాత్రాజితి శతధన్వుల సంభాషణము నకే బలిజేపల్లి ప్రాముఖ్యమొసగెను. ఈ అంకము యొక్క ఆరంభమున సాత్రాజితి యొక్క చెలికత్తె మంజువాణి దుర్గాలయము వరకు అను గమించి ఆమె మదనావస్థను చూచి ఓర్వలేక మదన జనకుడైన మాధవుని గొని వత్తును. నీవు మధన పడకుము అని నిష్క్రమింపగా ఈ అంకము యొక్క తుదిలో శతధన్వుని చెలికాడగు శంబరాసురుడు సాత్రిజితిని బలవంతముగా రథముపై మధురా పురమునకు తోడ్కొని పోవుటకు సహకరించును. 'శతధన్వ, శంబరాసురుల దురాగతమును నిరసించి వారిపై మిగుల కినిసి యుద్ధమునకు సన్నద్ధమైన సాత్రాజితి తన కడయుద్ధపరికరములేవి లేకుండటచే చేయునది లేక మధురా నగరికి సంసిద్ధము చేసిన రథముపై తనకు తానై ఎక్కి తన మనోరథమును చుట్టునున్న ప్రకృతికి చెప్పి, అష్టవిధ ప్రకృతికి అధీశుడైన శ్రీకృష్ణుడు ఈ కష్టదశలో దుష్టుల బారి నుండిరక్షింప గలడని మొరలిడుటతో చతుర్థాంకము ముగిసినది. ఈ అంకము యొక్క చివర శంబరా సురుడు వసుదేవుని ఇంటికి పోయి అతనిని ఏడ్పించి వచ్చెదనని శతధన్వుతో చెప్పినిష్క్రమించెను. వెంటనే పంచమాంక ప్రారంభమున వసుదేవుని మందిరము రంగస్థలముగా ప్రవేశ పెట్టబడినది. అవిచ్ఛిన్నమైన కథానుసంధానమును బలిజేపల్లి కవి చాలా చక్కగా సమకూర్చెను.

## పంచమాంకము

పంచమాంక ప్రారంభమున వసుదేవుడు అక్రూరనితో బలరాముడును వెంట లేకుండ కొండికవాడైన కృష్ణుడు శాత్రవ భూయిష్ఠప్రదేశములలో ఎందెందు తిరుగుచున్నాడో అని చింతిల్లును అపుడు అక్రూరుడు శ్యమంతకాన్వేషణమునకై ఎందెందు తిరిగి నిశ్శేషశాత్రవమొనర్చి మణిని సాందించెనో గదా! ఆ కుఱ్ఱవాని బల పరాక్రమము లెరిగియు ఏల భీతినొందుదురు, కంసకుల ధ్వంసమొనర్చిన ఆ నీకుమారుడు సామాన్యుడా! అని ధైర్యమును చెప్పెను. ఇంతలో నొకయతి వారిని కలియుటకై విచ్చేసెను. వసుదేవుడు తన

జన్మము, తన గృహము ధన్యమైనదని తలచి అతనిని సత్కరించెను. ఆయతి ఉపచారమునకు సంతసించి నీవంటి సంపన్నగృహస్థునకు నానోటి మీదుగా ఒక దుర్వార్త కృష్ణుని విషయమై చెప్పవలసి ఉన్నది. పుట్టిన ప్రాణికి స్థిరత్వమెక్కడిది ఆయువు తీరగనే ఎక్కడనో చత్తురు. మఱెక్కడనో పుట్టుదురు. మూఢులై మోహసంసార భ్రాంతి కలిగి సతీసుతాదులమదుర శలచిక్కి దుఃఖంతురని తెలిపెను. అక్రూరుడు ఆతని ఉపశమన వాక్యమును విని పుత్ర వియోగ దుఃఖము ఎవరికిని మాటల సందర్భమున అడిగెను. కపటి వేషధారియై విచ్చేసిన శంబరాసురుడు ఈ దేవకీవసుదేవులకే అనెను. అంత దేవకీ వసుదేవులు దురంత చింతతో మిగుల దురపిల్లిరి. అపుడాయతిని కృష్ణుడు ఎవ్వరిచే వదింపబడెను అని అక్రూరుడు అడుగగా మణినన్వేషింపబోయిన కృష్ణుని కంసమిత్రుడైన శంబరాసురుడు పట్టి వధించెనని తెలిపెను. ఇట్టి వైపరీత్యమునకు దేవకీ వసుదేవులేకాక అక్రూరుడును మిక్కిలివ్యధనొంది, ఈ ఘోరవార్త రుక్మిణి విని బ్రతుకగలదా అని తలచెను. అనంతరము రుక్మిణి ఆతురతతో ప్రవేశించి ఏమి అని అడుగగా వసుదేవుడు ఇంకేమున్నదని శ్రీకృష్ణుని గూర్చివివిధ విధముల కరిగి పోవునట్లు నా కుమారుడు నీ మనోనాయకుడు భూమిపై లేడు మాయమై పోయినాడు. అని వక్కాణించెను. ఆమాటవిన్న రుక్మిణి మూర్ఛిల్లినది, కోడలి అవస్థను చూచి దేవకీ వసుదేవులు వేదనచెందిరి. రుక్మిణి మూర్ఛనుండి తేరుకొని శిశుపాలాది శూరులను అణచి తన్ను పరిణయమాడిన వృత్తాంతమును జ్ఞప్తికి దెచ్చుకొన్నది. నిన్ను ఎడబాసి నేనుండగలనా నీ వెంటనే నడమనీడను నిన్నెడ బాప ఎవరికగును ఈ మనోరాజీవము నీయందే నిలచినది. నిన్నెడ బాసిన ఈ తనువేటికి ఇదిగో త్యజింతునన్నది. వసుదేవుడామెను ఊరడించుచు తనకే బాధ కఱకఱ అంపమై కడుపు కండలు కోయుచున్నది. ఇక ప్రాణ పరిత్యాగమే మేలని తెలిపెను. అపుడు యతి నిజమే గోత్ర పవిత్రుడగు అట్టి పుత్రుడు గతించినవెనుక ఇక ఈ శరీరములతో ఏమి పని అని పలికెను. అట్లు కపటయతి వేషమున వచ్చిన శంబరుడు తనలో నేటితో ఈ యాదవ వంశము అంత మొందగలదు, ఎవ్వరు నన్ను గుర్తింపకమున్నె ఇక్కడనుండి వెడలి పోవుట మంచిదని నిశ్చయించును.

పిమ్మట అక్రూరుడు రాజనుద్దేశించి రాజా! మీరీదుఃఖమును ఉపశమించు కొనుడనగా వసుదేవుడు ఇంకెక్కడి శాంతి? అట్టి కొడుకు మరపునకు వచ్చునా అని కృష్ణుని అందచందములను జ్ఞప్తికి దెచ్చుకొనెను. అక్రూరుడును ఆతేజోమూర్తి లేనిచో లోకము చీకటియేకదా అని పలికెను. అంత వసుదేవుడు బ్రతికిన నాళ్లునాళ్ళును ప్రపంచములో అతి లోకవర్తమాద్భుత మహిమము చూపిన కొడుకునుదలచి మాఅభాగ్య పరిపాకమువలన మేమింకను జీవించి ఉంటిమని విలపించెను. అపుడు రుక్మిణి పూజ్యార్హులైన అత్తగారితో కూడ నేనును చిచ్చురికి చచ్చెద ననెను. ఇట్లు దేవకీవసుదేవులు, రుక్మిణీ దేవి కృష్ణమరణ వార్తకు మిక్కిలి విలపించుచున్న సందర్భములో అచ్చటకు బలరామ, సాత్యకులు ప్రవేశించిరి. బలరాముని తమ్ముడు సాత్యకి కృష్ణుడింకను శ్యమంతకాన్వేషణమునకు పోయి మరలి వచ్చునట్లు లేదు. ఎందుకో ఈ నగరమంతయు చిన్నవోయినట్లు న్నది. వీణామృదంగ నినాదము విన్పించుటలేదు. కానుకలతో సామంత భూ కాంతులు ఇచ్చుటకు విచ్చేసినట్లులేదు. విప్రులస్వస్తి వాక్యములు విన్పుంచుటలేదు. ఏలనో మనలను చూచి పరిజనము కన్నీరు కార్చుచున్నారు. నగరమెల్లను హాహాకారము నిండి యున్నదని పల్కెను. అపుడు అక్రూరుడు వారి రాకను గాంచి ఈదు ర్వార్తను విని యుందురేమో అని తలచెను. దేవకీ వసుదేవులు బలరాముని చూడగనే నాయనా! బలరామా! నీ తమ్ముడు మాయమై పోయెనుగదా అని పలికి మూర్ఛిల్లిరి. అక్రూరుడును మిగుల వాపోయెను. బలరాముడు ఎక్కడికేగినను వానికి

భయములేదు మాయల మారి ఋషి మాటలనమ్ముటయా విన్న నాటి నుండి అతని బలపరాక్రమ క్రీడలు ఎరిగి యుండియు ఇంత అమాయకత్వమా ఒక శంబరుడు కాదు ఎవ్వరును అతనిని నిర్జింపలేదు. అని ఊరటగా పల్కెను. సాత్యకియును బలరాముని మాటలను సమర్థించెను. అటుపై బలరాముడు అక్రూరునితో ఆ దొంగముని ఎట్లు పోయెనో తెలుపమనెను. శంబరాసుడు వారిని చూచి పరుగులెత్తను. బలరాముడు అవహాస్యముగా వారు పరివ్రాజకులు. రాచదివాణమునకు అరుగుదెంచిన మహానుభావులనును ఇపుడు సాత్యకి అక్రూర వసంతకులు ప్రవేశించిరి. బలరాముడు అక్రూరునితో వీడేగదా! ఆదురాత్ముడు ఈ నీచపు పగటి వేసపుపాండిత్యము ప్రసటించి కొడుకు గతించెనని అరవకూతలు కూసిమోసము చేసెదవా రాజ భవనమునకు నడువుము. నీ మెడ కోసి వైచెదను.మారాజ కడనిజము చెప్పితివా సరే అని హెచ్చరించెను. ఇంతలో వసంతకుడు సమీపించి వానికి తగిన శాస్త్రి చేయుటకు ఈ బ్రాహ్మణ శూరుడుడున్నాడని కట్టుతట్టుకొనుచు వచ్చి బలరామునితో వీరే శంబర ఋషీశ్వరులని పరిహాసమాడెను. అపుడు బలరాముడు అహా!వీడా! కంసమిత్రుడు. శంబరాసురుడు అనెను. అంత వసంతకుడు ఓరీ! శంబరా! కన్నములో చిక్కిన పగటి దొంగ వైతివి గదరా! బానిస కొడకా! పాడు శతధన్వునికై ప్రాకులాడి రోతపడితివి.నీ కొంప నేటితో ముగిసినది. అని దుర్భాషలాడి, బలరామ వసుదేవులతో వీడే కంసుని పరివారములోని శంబరుడని చెప్పెను. వీరిట్లు మాటాడుకొను సందర్భమున కంచుకి వచ్చి కృష్ణుడు వచ్చుచున్నాడనితెలిపెను. కృష్ణుడు సాత్రాజితి పెడరెక్కలు విరచికట్టిన శత ధన్వునితో ప్రవేశించి తల్లి దండ్రులకు అభివందనములు తెలిపెను. అపుడు రుక్మిణి తన భర్తకు అభివందనములు తెలిపినది. కృష్ణుడు తండ్రితో సత్రాజిత్తును పిలిపింపుడనెను. అంతలోనే సత్రాజిత్తు ప్రవేశించి కృష్ణా! నా కుమార్తెను మాయావి అయిన శతధన్వుడు ఎత్తుకొని పోయెనట. వాడు నీకంట బడెనా అని అడెగెను. అపుడు కృష్ణుడు వాడే వీడు అని పట్టి తెచ్చిన శతధన్వుని చూపి అదిగో నీ కుమార్తె. ఇదిగో నీ శ్యమంతకమణి. నిర్హేతుకముగా నన్ను నిందించితివి. అడవికి పోయిన నీ తమ్ముడు ప్రసేనుని చంపి సింహము మణిని గొన్నది. అసింహమును చంపి జాంబవంతుడు మణిని గ్రహించెను. నీకై నేనతనిని జయించి ఈ మణిని పొంది తినని జరిగిన వృత్తాంతమును చెప్పెను. అప్పుడు సత్రాజిత్తు తన అపరాధమును క్షమింపుమని అనేక విధముల ప్రాధేయపడెను. తెలియక దుష్ట బోధనలు విని మహాపరాధములు గావించిన నా అవజ్ఞ తను సహించి దయామతివై బంధు భావమును వహించి నీ గడించిన ఈ మణిని, నాకుమారీ మణిని గ్రహించి నాకులము ధన్యత నొందునట్లు నన్ను అనుగ్రహించి తృప్తి పెట్టుమని వేడికొనెను. వసుదేవుడును సత్రాజిత్తు ప్రార్థనను అంగీకరించి ఆతని కన్యను సమ్మతించెను. అంత రుక్మిణి,సాత్రాజితి చేయి పట్టుకొని చెల్లెలా! నా వలెనే నీవును ఈ రసాలవృక్షమును అల్లుకొనుమని కృష్ణుని చేతితో కలిపెను. అంత వసంతకుడు ఈ మావి మోకకు ఈ జాతి లతకు ఇక నీవే చక్కని దోహదమిచ్చి కాపాడవలెనని పల్కెను. ఆమాట విని రుక్మిణి తోటమాలివి నీవున్నావు గదా! అని సమర్థించెను. పిమ్మట శంబర. శత ధన్వులు తమ అపరాధములు క్షమింపుడని వేడికొనిరి. అపుడు కృష్ణుడు వారి ఇరువురతో ఇకనైన మంచి మార్గమున వర్తింపుడని సదుపదేశము నొసగెను. వారట్లే అని నమస్కరించి నిష్క్రమించిరి. నాటకాంతమున భరతవాక్యము శ్రీకృష్ణుని మూలమున ప్రకటితమైనది. తండ్రి వసుదేవుడు మనము కృతార్థుల మైతిమి. శుభములన్నియు సమకూరెను. ఇంకేమి కొరత అనగా కృష్ణుడు మీ ఆశీర్వాదముతో అన్నియు సమకూరినవి. ఇక సస్యాఢ్యమై వసుంధర తనరాచుచు ప్రభువులు ప్రజానురక్తి కలిగి ఉండగా ఆర్య ధర్మములు ఎల్లచోట్ల

అలరుగాక! అని తెలిపెను. ఈ సందర్భమున బలిజేపల్లి లక్ష్మీకాంతకవి ఒక ముఖ్యమగు శుభాశంసమును జయమగునుగాక! సత్కవీశ్వరుల కతుల అని ఉత్తమ కావ్య ప్రయోజనమగు విశ్వ శ్రేయోధర్మమును పరోక్షముగా భరతవాక్యము నందను సంధించెను. కృష్ణుని ఆకాంక్ష తప్పక తీరు నని వసుదేవ బలరాములు ఒకటికి రెండు మారులు తథాస్తు అని పలుకుటతో నాటకము ముగిసినది.

**సాత్రాజితీయము** అను ఈ నాటకమున పంచమాంకమునందు సాత్రాజితి, శ్రీకృష్ణులు నాటకాంతమున కాని కన్పట్టరు. కాని శ్యమంతకాన్వేషణమునకై పోయిన శ్రీ కృష్ణుని ఆగమమునకై ప్రతీక్షించు చున్నదేవకీ వసుదేవులు, రుక్మిణి, అక్రూరుడు, కపట యతి వేషముతో వసుదేవుమందిరమునకు విచ్చేసిన కంసమిత్రుడైన శంబరాసురునిచే శ్రీకృష్ణుడు హతుడయ్యెనన్ని దుర్వార్తను విందురు. ఆ వార్తనువిని కృష్ణుని తల్లిదండ్రులు, అతని సతీమణి రుక్మిణి, అక్రూరుడునుమిగుల దుఃఖించిరి. ఇంతలో బలరామసాత్యకులు విచ్చేసిరి. వారీవార్తవిని ఇది నమ్మదగని వార్త అని తల్లిదండ్రుల నూరడించిరి. అటుపై ఆదొంగమునిని వెదకుటకై పోయి శంబరుని చూచి అతడే అయి ఉండునో కాదో అని అక్రూరుని పిలిపించుటకై తలచుసందర్భమున ఆక్రూరుడే వసంతకునితో విచ్చేసెను. వసంతకుడు శంభరుని గుట్టురట్టు చేసెను. తుట్టతుదిగా శ్రీకృష్ణుడు శతధన్వుని పట్టి బంధించి సాత్రాజితితో కూడ తల్లిదండ్రుల కడకు విచ్చేసెను. అట్లు విజయంచేసిన కుమారునిగాంచి తల్లిదండ్రులు, ఎల్లరు మహానంద భరితులైరి. శ్యమంతకమణిని ఇచ్చుటకై సత్రాజిత్తును పిలిపింపవలసిన దని శ్రీ కృష్ణుడుతండ్రితో తెలుపు సందర్భమున ఆ మాటతోకూడ సత్రాజిత్తే స్వయముగా విచ్చేసి తన కుమార్తెను శతధన్వుని బారి నుండి రక్షింపవలసినదిగా వేడు కొనెను. కృష్ణుడు మణిని ఒసగి, సాత్రాజితిని కూడ తన తండ్రి సమ్మతితో రుక్మిణి అను సంధాన కర్త్రిగా గ్రహించెను.

ఇట్లు ఎల్లరు కలియుగా నాటకము సుఖాంతమయ్యెను. ఈ అంకమున తుట్టతుదివరకు నాయికానాయిక సమాగమము జరుగునో జరగదో అన్న ఉత్కంఠ రేకెత్తించు సన్నివేశములలో కృష్ణుని మరణవార్త కపటయతిమూలమున వినిదుఃఖించిన పలువుర పాత్రల సంభాషణలతో కరుణరసము అభివర్ణితమైనది. బలిజేపల్లి కి కరుణ రసముపై ప్రీతి మెండు కావుననే ఆయన తనరచనలలో తనకులానై ఔచిత్యము చెడకుండ కరుణసభరిత సంఘటనలను కల్పించుచుండును. సాత్రాజితీయమను నామధేయమును బట్టి స్త్రీ పాత్ర ప్రాముఖ్యము వెల్లడి అగుచున్నది. ఈ నాటకమున పురుషపాత్ర సంఖ్య అధిక మైనను సాత్రాజితి వృత్తాంతమునకు ప్రాముఖ్యము ఇయ్యబడినది.

భాగవతము దశమ స్కంధముత్తర భాగము 56 వ అధ్యాయమున శ్రీకృష్ణుడు లోకాపవాద నివృత్తికొరకై శ్యమంతకమణిని తెచ్చి యిచ్చిన కథ కలదు. సత్రాజిత్తు సూర్యునారాధించి శ్యమంతక మణిని సంపాదించి దానిన కంఠమున ధరించి ద్వారకా నగరమునకు వచ్చుచుండగా యాదవులు దూరమున చూచి సూర్యుడే దిగివచ్చుచున్నాడని అంజలి ఘటించి శ్రీకృష్ణునికి దెలిపిరి. అప్పుడు గోవిందుడు నవ్వి మణి సమేతుడైన సత్రాజితుడు కాని సూర్యుడు కాడు. అతడు సూర్యుని వలన పొందిన మణి ప్రతి దినము ఎనిమిది బారువులనువర్ణమును కల్గించుచుండును. ఆ మణి గల ప్రదేశము రోగారిష్ట సర్వ మాయిక మారీ దుర్భిక్ష భయము మాన్పును. యాదవవిభునకు మణినీయవలసినదిని అడుగగా అతడీయక ధనేచ్ఛతో పొమ్మని పలికెను. అని మణి వృత్తాంతమును శ్రీకృష్ణుడు యాదవులకు తెపిపెను. అట్టి శమంతకమణిని సత్రాజిత్తు తమ్ముడు ప్రసేనుడు ధరించి

అడవిలో తిరుగుతూ మరణింపగా మర్యాదను వీడి, హరి,మణికై అతని బట్టి వధించినాడని నిందమోపెను. ఆనిందను తప్పించుకొనుటకై ప్రసేనుడు పోయిన జాడతెలిసికొని, అడవిలో తిరిగి తిరిగి తుదకొకచోట అతడు అతని అశ్వమునేల కూలగా చూచి, మఱికొంత దూరమున ఆతనిని హింసించిన సింహమును, మృగపతిని నొప్పించి ఖండించి యేగిన భల్లూకము ప్రవేశించిన గుహనుచూచెను. ఆ గుహలో ఒక బాలిక దర్శనీయకేళి కందుకముగా ప్రేలాడగట్టిన మణి శ్రేష్ఠమునుగని, దానిని హరింపనిశ్చయించుకొనెను. అట్లునిశ్చయించిన హరి మెల్లమెల్లగా ఆశిశువు కడకు రాగా అచ్చట జాంబవంతుని దాదిమొరపెట్టెను. అమెధ్వని విని జాంవంతుడు వచ్చికృష్ణుని ప్రాకృతపురుషునిగా భావించి ఎనిమిది దినములు యుద్ధముచేసెను. ఇట్లు ఒకరికొకరు ముష్టాముష్టి పోరాడిన తుట్టతుదకు జాంబవంతుడు ముకుందుని ముష్టి ఘాతములతో శక్తిని కోల్పోయిమిగుల భ్రాంతినొందు ఆతనిని పురాణ పురుషుడని ఎట్టకేలకు గ్రహించి వివిధ విధముల కీర్తించెను. అపుడు భక్తవత్సలుడైనహరిఆతనిని వాత్సల్యముతో నిమిరి ఈ మణి వలన నాకు కలిగిన నిందను నివారించుకొనుటకై ఈ మంది రమగు కందరమునకు మేము అరుదెంచితిమి అనితెలిపెను. శ్రీకృష్ణుమి వెంటవచ్చిన వారిరువరి యొక్క దినములవరకు బిలద్వారమున ఎదురుచూచి వేసారి ఎంతోవగచి పురమునకు పోయిరి. దేవకీ వసుదేవుల, రుక్మిణి, మిత్ర బంధుజ్ఞాతి జనులు గుహచొచ్చి అందే చిక్కెనని మిగుల శోకించి అతడా దుర్గము బిలమునుండి వెలువడుటకై దుర్గను సేవించిరి. శ్రీకృష్ణుడు తన యత్నము సఫలము కాగారత్నముతో కన్యా జల రత్నముతో పురమునకు వచ్చెను. మృతుడైనవాడు పునరాగతుడైనట్లు భావించి పౌరులెల్లరు మిక్కిలి సంతోషించిరి జాంబవంతుని పరిగ్రహించి పురమునకు విచ్చేసిన శ్రీ కృష్ణుడు రాజసభకు సత్రాజిత్తుసిగ్గుతో మణిని గ్రహించి, పశ్చాత్తప్తుడై బలవద్విరోధమునకు మిగుల వెఱచుచు నింటికిపోయి నేనుమితబాషిత్వముమాని హరిపై మిథ్యాభియోగమును చేసితిని, పాపాత్ము డను, అర్థలోభుడనుదుశ్చిత్తుడను మత్తుడను ఈ నా దేహమును కాల్పనా ఈనా దురితము ఏ మార్గమున పోవును. శ్రీకృష్ణుని కరుణ నాపై ప్రసరించుటయు, ఈ శ్యమంతకమణిని, కుమారీ మణిని ఇచ్చి అయనేకాంతముగా తలచి తలచితుదకు శ్రీకృష్ణునికి రత్నమును, తన కాంతా రత్నమును ఒసగెను. అపుడు శ్రీకృష్ణుడు మాకు మణులున్నవి. కుమారీమణి చాలునని అందొసగిన శమంతకమణిని మరల తిరిగి ఇచ్చివేసెను. ఇట్లుసూత్రప్రాయముగా భాగవతము నందున్న కథను బలిజేపల్లిగారు సాత్రాజితీయమను పేర ఐదు అంకముల నాటకముగా భిన్నభిన్న సన్నివేశములను, పాత్రలను కల్పించి చక్కగా రూపొందించిరి. శ్రీకృష్ణుడు గుహచొచ్చి ఇరువది ఎనిమిది దినములవరకు లోపల పోరాడుచు వెలికి రాకుండు టచే అతడు మరణించి ఉండునేమో అని శంకించి మిగులశోకించిన విషయమును బలిజేపల్లి నాటకీయముగా కపట యతివేషమును ధరించిన శంబరుడను కంస, శతధన్వుల మిత్రుని మూలమున ప్రకటించెను. పంచమాంకము నందలి కథ అంతయు శ్రీకృష్ణ మరణ దుర్వార్తను కపట యతి దేవకీ వసుదేవులకు తెలిపి వారిని యేడ్పించుటకై కవిచే కల్పింపబడెను. ఈఅంకమునందలి ఇతి వృత్తము అంతయుఆదుర్వార్తను కేంద్రీకరించుకొనియే మలచెను. కంసమిత్రుడు శంబరుడు శ్యమంతకాన్వేషణమునకు పోయిన శ్రీకృష్ణుని సంహరించెనను దుర్వార్త నాటకాంతమువరకు సాగినది. పౌరులందరు దుర్గను సేవించినట్లు భాగవతమున ఉండగాసాత్రాజితి శ్రీకృష్ణుని కలసి కొను సంకేతస్థలముగా నాటకమున కల్పింపబడినది. కాని దుర్గాలయమున కృష్ణునకు బదులు శతధన్వుడువచ్చికలిసికొనును. శంబరుడను దుర్గగుడివెనుక దాగి శతధన్వుని సాత్రాజితితో చేర్చుట సహకరించినట్లు కల్పింపబడినది. భాగవతమున ఈ శతధన్వుని వృత్తాంతము సాత్రాజితసతడు ప్రేమించినట్లులేదు. 57వ

అధ్యాయమున దశమస్కంధమున శమంతక మణి వృత్తాంతమును వివరించుచు ప్రకృతకథకు అనుబంధము గా కూర్పబడి ఉన్నది. కాని శతధన్వనకు సాత్రాజితిని సత్రాజిత్తు ముందుగా ఇచ్చెదనని మాట చెప్పి అనంతరము మాడి దప్పి పద్మాక్షునకు ఇచ్చెను. కావున ఆసత్రాజితు నుండి మణిని పుచ్చుకొనవలెనని నిశ్చయించుకొనెను. ఈ విషయమున పలువురు శతధన్వని ప్రేరేపించిరి. అంతనతడు పశువును కటికవాడు పట్టి చంపునట్లుగా సత్రాజిత్తును పట్టి చంపి ఆతని కాంతలందరువాపోవగా మణినిగొని ఎచ్చటకో వెడలి పోయెను. సత్రాజిత్తు మరణమునకు శ్రీకృష్ణ బల రామాదులు విలపించిరి. శ్రీకృష్ణుడు తన్నెక్కడ చంపునో అని ప్రాణభయముతో శతధన్వుడు కృతవర్మను శరణు జొచ్చెను. అపుడు కృతవర్మ, కంసమాగధులు బలరామకృష్ణులతో విరోధించిపడినపాట్లనుతెలిపెను. వెంటనే శతధన్వుడు అక్రూరుని ఇంటికి పోయి హరితోడివిరోధమునకు సహకరింపవలసినదని ప్రార్థించెను. అంత అక్రూరుడు శ్రీకృష్ణుని గుణగణములను ప్రశంసించి నీ మైత్రికి పదివేలు చాలు పొమ్మనెను. శతధన్వుడు అచ్చటనుండిఎచ్చట కో వెడలి పోవుచు మణిని అక్రూరునొద్దనుంచెను. మిధిలానగరసమీపవనమున అశ్వము నుండి డిగ్గి పాదచారి యై పోవుచున్న శతధన్వని చూచి శ్రీకృష్ణుడాతనిని పట్టిఖండించెను. కాని ఆతని కడ మణిలభింపలేదు. మణి కొరకై ఊరక శతధన్వని ప్రాణములను తీసితినే అని శ్రీకృష్ణుడు చింతించెను.

'సాత్రాజితీయమునగల ఈ శతధన్వ వృత్తాంతము మణి కొరకు కాక సాత్రాజిత్తి యందు మనస్సును లగ్నము చేసి ఏ ఉపాయముననైన ఆమెను చేపట్టుటకు సంసిద్ధుడైన విధముగా ప్రతి నాయక లక్షణములతో చిత్రింపబడినడ. శ్యమంతక మణికి, సాత్రాజితికి గల పరస్పర సంబంధమును మాత్రమే బలిజేపల్లి యితివృత్తముగా స్వీకరించెను. నాటకము సుఖాంతముగా వలెనన్న ధ్యేయముతో శ్యమంతకమణికి శతధన్వనికి సంభంధించిన అపర వృత్తాంతమును స్వీకరింపలేదు. నాటకమున అద్భుతరసమునకు కొంత అవకాశమును కల్గించు తలపుతో శంబరు పాత్రను ప్రవేశపెట్టెను. నాయకుడైన శ్రీకృష్ణునకు వసంతకుడెట్లో ప్రతి నాయకుడైన శతధన్వనకు మాయావి శంబరుడట్లు సహకరించునట్లు ఇతి వృత్తము కల్పింపబడినది. అక్రూరపాత్రము భాగవతమున ప్రసిద్ధమైనను ప్రస్తుత కథలో దాని ప్రమేయము లేదు. దేవకీవసుదేవులకు పుత్ర వియోగజనిత శోకవైకల్యమును ఉపశమింపచేయుటకు మాత్రమే ఈ పాత్ర ప్రవేశపెట్టబడినది. రుక్మిణి సత్యభామల చెలికత్తెల పాత్రలు పూర్తిగా కవికల్పితమే వసంతక పాత్రమూలమున కేవల హాస్యమే కాక కావ్య ప్రయోజనమైన కృష్ణుని ఆశయము సఫలీ కృతమగుటకు వీలుగా కల్పింపబడినది. వేడుక చెలికాడైన వసంతకుని ప్రమేయము కేవలము తృతీయాంకముతో ముగియుక పంచమాంకాంతమున కూడ ప్రయుక్తమైనది. చివరలో ఆ పాత్ర కన్పట్టునది స్వల్ప కాలమైనను అనల్ప ప్రయోజన సాఫల్యమునకై ఉద్దేశింపబడినట్లు రుక్మిణి పల్కిన వాక్యమే ప్రబలసాక్ష్యము ఇట్లు ప్రతి పాత్రప్రతిసన్నివేశమును రసోద్దీపకముగా స్వకపోలకల్పనాప్రౌఢిమకు నిదర్శనముగా కూర్పబడినది. వచనరచనలోనేమి. హృద్యమగు పద్యముయొక్క కూర్పులోనేమి పదపదమున అక్షరాక్షరమున రసము చిప్పిలునట్లు ఔచిత్య భంగము ఇసుమంతయు లేని పద్ధతిలో బలిజేపల్లి [10] సాత్రాజితీయమును రసవద్దృశ్య ప్రబంధముగా వెలయించెను. ఒక అంకము యొక్క అంతమున తరువాతి అంకము యొక్క కథను, అట్లే రంగస్థలమున వెంటనే ప్రవేశింపనున్నపాత్రమును భావ్యర్థసూచనగా ప్రకటించుట, ఇతని ఈరచనలో నివిశిష్టత ఇట్లు భావ్యర్థము ఎంతోసహజముగా తెచ్చిపెట్టుకొన్నట్లు కాక రామణీయకముతో నొప్పారుట సహృదయ హృదయవేద్యము. రస హృదయులైన సహృదయులు కవి హృదయమును గ్రహించినచో ఇట్టి విశేషములెన్నెన్నో దృగ్గోచరములు కాకపోవు.

## సత్యహరిశ్చంద్రీయము-సవిమర్శక సమీక్ష

సత్యంవదధర్మంచర అను సూత్రములకు భారతీయులొసగిన ప్రాముఖ్యము మరువరానిది. ఆడిన మాటను నిలబెట్టుకొని ధర్మబద్ధమైన జీవితమును నడపుటలో భారతజాతికి ఒక ప్రత్యేక స్థానమున్నది. సత్య వాక్య పరిపాలనకై సతిసుతులను, సమస్త సామ్రాజ్యమును కోల్పోయి తుదకు తన్నుతాను అమ్ముకొని దుర్భర దురహంకార దుర్నీతి చండాలదాస్యమునకొడిగట్టిన సత్య హరిశ్చంద్రుని కీర్తి హైందవ జాతి ఉన్నంతవరకు నిత్య స్మరణీయమగుట నిస్సంశయము.

ఈ సత్య హరిశ్చంద్ర కథను ఎన్నో పురాణములు ప్రకటించినవి. ప్రధానమైన ఇతి వృత్తములో అంతగా మార్పులు లేకున్నను పాత్రలనామధేయముల విషయమున అందందు కొన్ని మార్పులు కన్పట్టుచున్నవి. మార్కండేయ పురాణ కథకు, అందలి పాత్రలకు, భారత, రామాయణములలోని కథలకు, అందలి పాత్రలకు కొంత వ్యత్యాసము కన్పట్టుచున్నది. తెలుగు కావ్యములలో గౌరన హరిశ్చంద్రోపాఖ్యానమునకు ఎంతో పేరు లభించినది. ఈతని ఈద్విపద గ్రంథముననుసరించి శంకరకవిరచించిన హరిశ్చంద్రోపాఖ్యానమును మిగుల ప్రసిద్ధి కెక్కినది. షట్చక్రవర్తులకథలలో కూడ హరిశ్చంద్రుని విశిష్టత కొనియాడ బడినది. హరిశ్చంద్రనలోపాఖ్యానమను ద్వ్యర్థికావ్యము నందును భట్టుమూర్తి హరిశ్చంద్రుని ఘనతను ప్రశంసించెను. ఇట్లెన్నో శ్రవ్యకావ్యములందే కాక, కొన్ని దృశ్యకావ్యము యందును హరిశ్చంద్రుని సత్య శీలతను కన్నులకు కట్టినట్లు చిత్రింపబడినది. కందుకూరి వీరేశలింగం పంతులు గారి సత్యహరిశ్చంద్ర నాటకమున కొంత వర్ణనకు ప్రాధాన్యము ఇవ్వబడినది. దృశ్యకావ్యములలో విస్తృత వర్ణనమునకు అంతగా తావులేదు. వర్ణనాధిక్యము ఒక విధముగా దృశ్యకావ్య ప్రయోజనమునకు ప్రతి బంధకము. పాత్ర పోషణ, సన్నివేశకల్పన, రసపరి పోషణ మొదలగునవి హృదయావర్జక సంవాదములతో సమకూర్చినపుడే ఆనాటకము రక్తి కట్టును. ఈ రహస్యమును గుర్తించిన బలిజేపల్లి లక్ష్మీకాంతకవి సత్య హరిశ్చంద్రీయ నాటకమును అన్ని విధములైన హంగులతో పండిత పామర విభేదములేకుండ అందరిని మెప్పించి మిగుల అలరింప గల పద్ధతిలో రచించిరి. వీరి నాటకము తరువాత మరి కొన్ని హరిశ్చంద్రనాటకములు వెలువడినవి. కవి సమ్రాట్ విశ్వనాథ సత్య నారాయణ కావ్య హరిశ్చంద్ర, వేద హరిశ్చంద్ర అను భేదము లతో రెండు నాటకములను రచించిరి. ఎవరెన్ని నాటకములు వ్రాసినను బలిజేపల్లి నాటకమునకు అవి సాటి రాలేకపోయినవి. కరుణ రస భరిత సన్ని వేశకల్పనలో సన్నివేశ సముచిత పద్య రచనా సౌందర్యములో పాత్రల మనస్తత్వమును పాఠకుల (లేక ప్రేక్షకుల) హృదయ ఫలకమున ప్రతి బింబింప జేయుటలో సంభాషణా చాతుర్యములో, పదపదమున రసమును చిప్పిల చేయు ప్రతిభాపూర్ణ ప్రయోగవైచిత్రిలో వీరికి వేరే సాటి, వీరి సత్య హరిశ్చంద్రీయమునకు దీటు రాగల నాటకము మరియొకటి లెదు. ఇది ఆబాలగోపాలమునాకట్టుకున్నకృతి. ఇట్టి కృతి **నభూతో నభవిష్యతి** అని అందరును ఈ పుస్తక ప్రాశస్త్యమును వేనోళ్ళ కొనియాడిరి. ఎట్టి పారపొచ్చెములు లేని ఈ గ్రంథమును మెఱ మెచ్చులకై కొనియాడక నిజముగా అందున్న యాథార్థ్యమును గ్రహించిరసహృదయులైన సహృదయులు అనుభవపూర్వకముగా తమ సమ్మతిని చాటిరి. ఇట్టి ఈ సత్య హరిశ్చంద్రీయ నాటకమున కవి ఆఱంకములలో ఇతి వృత్తమును పొందుపరచెను.

ప్రథమాంకము: దేవేంద్ర సభలో వసిష్ఠ విశ్వామిత్ర నారదాది మహర్షుల సన్నిధానములో సకలార్థ సాధక సత్య ప్రసక్తి ముచ్చటింపబడినది. అందు సత్యాలాపి ఒక్కడే నిత్యుడని, తన సర్వస్వము నశించినను ల సత్యస్థైర్యమును బాయని పుణ్యుడే త్రిలోక గణ్యుడని, హరిశ్చంద్రుడు అట్టి సత్య సంధులలో ముఖ్యుడని వసిష్ఠుడు తెలుపగా విశ్వామిత్రుడు ఒకరాజాధముని సత్యసంధునిగా ఈసుర సభలో ప్రశంసింతువా? అని అధిక్షేపించెను. ఇరువురి మధ్య వాదములు చెలరేగినవి. తీవ్రముగా ఒకరికొక్కరు ప్రతిజ్ఞలు గావించుకొనిరి. హరిశ్చంద్రుని సత్య సంధతను నిరూపింతునని బృహస్పతి, అగస్త్య, నారదఋ గౌతముల సమక్షమున వసిష్ఠుడు తెలిపెను. విశ్వామిత్రుడు అదెట్లో చూతునని హుంకరించి సభనుండి నిష్క్రమించుటతో ప్రథమాంకము ముగియును.

అనంతరము ద్వితీయాంక ప్రారంభ విష్కంభమున విశ్వామిత్రుడు హరిశ్చంద్రుని ఆస్థానమున ప్రవేశించును. ఇందు వందిమాగధులు హరిశ్చంద్రుని కీర్తించు సందర్భమున భద్రుడు విశ్వామిత్రుని రాకను తెలుపును. అనంతరము హరిశ్చంద్ర విశ్వామిత్రుల సత్య కీర్తుల అన్యోన్య సంభాషణలో విశ్వామిత్రుడు తాను తల పెట్టిన యజ్ఞమునకు వలసిన ధనమును అర్థించి అవసరమైనపుడు మీకడనుండి గొని పోవుదునని తెలియజేసెను. ఇంతలో కంచుకి దేశమున కేదియో ప్రళయము సంభవించినదని విశ్వామిత్రుని విచిత్ర ధోరణిని వ్యాఖ్యానించెను. సత్య కీర్తితో హరిశ్చంద్రుడును ఇదియేమివైపరీత్యమని పౌరుల కష్టనష్టముల గూర్చి పరామర్శించెను. ప్రజారక్షణోద్యోగమే ప్రభుత్వ కర్తవ్యమని సత్యకీర్తి తెలుపును. అనంతరము హరిశ్చంద్రుడు వేటకు వెడలుటతో ద్వితీయాంకము ముగియును.

తృతీయాంక ప్రారంభమున విశ్వామిత్ర నక్షత్ర సంవాదము విష్కంభకమున ప్రవేశ పెట్టబడినది. నక్షత్రకుడు తన చదువు దినదినమును అడుగంటుచున్నదనగా వసిష్ఠుని గురుత్వము నాఎదుట ఏల వర్ణింతువు? పట్టు పట్టినచో గడియలో అన్ని విద్యలు నీ అధీనము చేయనా? అని తెలిపి, హరిశ్చంద్రుడు వేటకు వచ్చుచుండుటచే ఇక నిష్క్రమింతమని వెడలుదురు.

అటుపై సూతునితో హరిశ్చంద్రుడు భార్యాపుత్ర సహితముగా వనమునకు విచ్చేయును. సత్యకీర్తియు మరియొక రథమున హరిశ్చంద్రుని అనుసరించును. అరణ్యమున మాతంగకన్యలు ప్రవేశించి తమ ఆటపాటలతో రాజును మెప్పింపగా రాజు వారికి ముక్తాహారము ఒసగబోవును. వారు దానిని కాదని రసికుడవు కాన నీ ప్రాపు కావలెనని తెలుపుదురు. సత్య కీర్తి ఆదుశ్చరితలను ఆవలకు పొండని అధిశంసించును. హరిశ్చంద్రునకు నిది అంతయు ఇంద్రజాలమువలె అన్పించినది. చంద్రమతియు హరిశ్చంద్రుని అప్పటి పరిస్థితికి భయచకితయైనది. ఇంతలో దండధారివలె కౌశికుని గాంచినది. కోపముతో విశ్వామిత్రుడు విచ్చేసి హరిశ్చంద్రుని నానావిధముల దూషించెను. తనతప్పిదము ఏమిటో అని హరిశ్చంద్రుడు అర్థించెను. అపుడు విశ్వామిత్రుడు మాతంగ కన్యలను వివాహమాడవలసినదని ఆదేశించెను. చంద్రమతి, సత్యకీర్తులు విశ్వామిత్రుని అధర్మ సరణిని అధిక్షేపించిరి. లోహితాస్యుడును ఏల? మమ్మునిట్లు అదలించుచున్నావని పలికెను. హరిశ్చంద్రుడు తన ధర్మపత్ని యందు సత్పుత్రుడొకడుకలుగగా మరల వర్ణసంకరపు పెళ్ళి నామెడ నేల చుట్టపెట్టెదరని బతిమలాడెను. సిగ్గులేక మాతంగకన్యలను వివాహమాడినచో ఆబాల గోపాలము ఛీకొట్టరా? అని ఎంతెంతో అర్థించెను. విశ్వామిత్రుడు నీచమత్కారమును కట్టిపెట్టుము. నీపేరునేటికి నేతిబీరకాయ అయినదని నిందించెను. అపుడు చంద్రమతితో కలిసి హరిశ్చంద్రుడు విశ్వామిత్రుని అభ్యర్థనను పురస్కరించుకొని సమస్తరాజ్యమును ధారాదత్తమొనర్చెను. పింగళక, రౌభ్య, రోహణకాది పౌరులెల్లరు హరిశ్చంద్రుని కడకు విచ్చేసి మమ్మువదలి పోవుచుంటిరా అని వాపోయిరి. ఎంతకును లోబడని హరిశ్చంద్రుని సత్య సంధతకు లోలోపల మెచ్చుకొని పైకి కోపముతో నాడు యజ్ఞార్థము దనమిత్తునన్న రొక్కమెక్కడ దాచితివి? క్రక్కినకూటికి ఆశపడుదుర్బుద్ధులను ఎవ్వరు కొని యాడుదురు. అని విశ్వామిత్రుడు నిందించెను. ఈరాజ్యదనము నాకానాడు ఇత్తునన్న యజ్ఞదనములో చేరినదా చెప్పుము అని గద్దించెను. అటుపై నక్షత్రకుడు ప్రవేశించును. తుట్టతుదిగ విశ్వామిత్రుడు ఇప్పటికైన మించిపోయినది లేదు. చక్కదనాల చుక్కలు నాపెంపుడు కూతుల పెండ్లియాడుము. అట్లుకానిచో నీవుపడుపాట్లు కుక్కలుకూడ పడవని బెదరించెను. అటుపై చంద్రమతిని చూపుచు ఈనిర్భాగ్యురాలు అగచాట్లు పడలేక ఇట్టిమగని నాకేల కట్టితివి? దైవమా! అని తిట్టుచు తన అవిధికి నెత్తినోరు కొట్టుకొనుచు నిట్టూర్పులతో ఏడ్చియేడ్చికుమిలి కృశించినప్పుడుకాని నామాటలు నీకురుచింపవు. ఇకపొమ్ము అని నిష్క్రమించుటతో తృతీయాంకము ముగియును.

చతుర్థాంకమున హరిశ్చంద్ర, చంద్రమతి, లోహితాస్యులు ఒకరికొకరు తమకు కల్గిన కష్టదశలను తెలుపుకొందురు. లోహితాస్యుడు మన వెంట వచ్చిన బ్రాహ్మణుడు ఏడీ!

అనుచున్నంతలో నక్షత్రకుడు కపటశ్రమను అభినయించుచు ప్రవేశించును. నక్షత్రకుడు మాటిమాటికి తానిక నడవలేనని, ఆకలిదప్పికలు మెండైనవని, ఏపెద్దపులినోటిలోపడి చచ్చినచో నిన్ను అప్పుఅడుగబోవువాడు ఉండబోడని వివిధ విధముల నిష్ఠురోక్తులతో, కపట చర్యలతో వారిని బాధపెట్టెను. తుదకు గ్రుక్కెడు నీరుకూడ దొరకని దుస్థితికి నక్షత్రకుడెంతో నొచ్చుకొని నాకు నీరెక్కడ అని వెక్కసముగా మాటాడెను. నడుమ నడుమ తన యిడుముల మాట అటుంచి **ఇల్లిపతినేల గట్టుకొంటివ**ని చంద్రమతి మనస్సును పరీక్షించుటకై కొన్ని కల్లబొల్లి మాటలు పలికెను. మధ్యలో విశ్వామిత్రుడు ఎవ్వరికికనబడకుండ నక్షత్రకునితో తాను కొన్ని మాయలు ప్రదర్శింపబోవుచుంటినననెను. వారందఱు ఒక వటవృక్షముకడ నిద్రించు సమయములో భేతాళుడు ప్రవేశించెను. హరిశ్చంద్రుడు వానిని ఎదిరించి గెలిచెను. అంతలో నక్షత్రకుడు నన్నేదో దయ్యము నోటవేసుకొనకమానదని లేని భయమును నటించెను. అపుడు దావాగ్ని ఆ అడవిని చుట్టుముట్టెను. చంద్రమతి అగ్నికి ఎదురుగా పోగా లోహితాస్యుడు వలదు వలదని వారించెను. అంతనామె అగ్నిదేవుని స్తుతించినది. మెల్లగా వారు కాశీ పట్టణము చేరిరి. అచ్చట గంగానదీ ఘోషమును విని హరిశ్చంద్రుడు గంగను మిగుల కొనియాడెను. అటుపై విశ్వేశ్వర దేవాలయగోపురమును దర్శించిరి. అట్లు కాశీనగరమును చేరుటతో చతుర్థాంకము ముగిసినది.

పంచమాంకమున హరిశ్చంద్రుడు విశ్వేశ్వరుని స్తుతించి మాటిమాటికి సొమ్ము అడుగుచున్న నక్షత్రకునితో ఏల నిష్ఠురములాడెదవన అందుకాతడు ఎందుకు మమ్ము నీతో త్రిప్పుకొని చంపెదవు. ఏదో నోటిమాట జారవిడిచితివి. దీనికి పత్రములు మరివి సాక్ష్యములులేవు. నీకాతడు అప్పుపెట్టినది కాదేకాదు. అదియజ్ఞార్థము అడిగిన సొమ్ముపైగా ఆగాధేయుడు నీకంటిలో దుమ్ముచల్లి రాజ్య సర్వస్వమును అపహరించెను. ఇంతచెడిన నీవు ఇప్పుడును సత్యము సత్యము అనిఏలఊగులాడుచుంటివి. బానిసవృత్తికి పాల్పడినను నిన్నెవరును కొనువారులేరు. కూడుగూడులేని దురవస్థలతో కుములునీవు నా ఉపదేశమాలకించి బాగుపడుమని పలికెను. చంద్రమతి ఆసందర్భమున తన ధైర్యస్థైర్యములను ప్రదర్శించినది. కాశీనాథుని ప్రార్థించుచు నన్నుకొనువారీ పురములోలేరా? అని అర్థించినది. పిదప హరిశ్చంద్రుడు పౌరులను పిలుచుచు తన యిల్లాలిగుణగణములను అభివర్ణించి ఈమెను దాసిగ కొనుడని ఎలుగెత్తిచాటెను. అపుడు కాలకౌశికుడు కేశవునితో ప్రవేశించి హరిశ్చంద్ర, నక్షత్రకులతో సంభాషించెను. నక్షత్రకుడు తనకు రావలసిన పైకమును తెలుపుచు బలవంతుడొక ఏనుగుపైనిలిచి పైకి ఎంత దూరముగ రత్నమును విసరివేయునో అంత ధనము నొసగి ఈకాంతను కొనుడనెను. అనంతరము కాలకౌశికుడు ఆమెనుకొని లోహితాస్యునితో కూడ తన ఇంటికికొనిపోయెను. అపుడు హరిశ్చంద్రుడు లోహితాస్యుడు నీబిడ్డలలో నొక్క బిడ్డ. వీనిని కాపాడుమని అప్పగించెను. కాలకౌశికుని భార్యకాల కంటకి మహాపరుషముగా తన భర్తనుద్దేశించి మాటాడగా చంద్రమతి విని ఆమె గయ్యాళితనమునకు లోలోపలనే నొచ్చుకొన్నది. అటుపై నక్షత్రకుడు తనకు రావలసిన తక్కిన పైకము ఎప్పుడిత్తువు? ఇప్పటిదాక నీతో తిరిగినందుకు నీ భార్యనమ్మి ఒసగిన ధనము సరిపోయినది. అనెను. చివరకు తానే అమ్ముడుపోవుటకు సంసిద్ధపడగా నక్షత్రకుడు పౌరులనుద్దేశించి వీనిని కొనుడనెను. అప్పుడు ఒక కడజాతివాడు వీరబాహువు ప్రవేశించి తాను కొనెదననెను. ఎంతమొత్తము. తెలుపుమన నక్షత్రకుడు చంద్రమతిని అమ్మ సందర్భమున తెలిపిన విషయమునే మరల వివరించెను. తుట్టతుదకు నక్షత్రకుడు తనకు వందనము సమర్పించు హరిశ్చంద్రుని లేవనెత్తి కలకాలము కష్టములుండబోవు, నేచేసిన తప్పులున్నచో క్షమింపుము. నిత్య సత్య సంధుడవైన నీకు ఎప్పటికి కష్టములుండబోవు. వృథా క్రౌర్యముతో వ్యథలు కల్గించిన నేను లోలోపల ఎంత క్రుంగితినో దానికి నామనస్సే సాక్షి అని తెలుపుచు ఇక పోయివత్తునని సెలవు వేడెను. ఇచ్చట నక్షత్రకుడు స్వగతమున మాటాడు విషయమును కవి ఎంతో విస్తరించెను. తుట్టతుదకు వీరబాహువు అయ్యో! రండి అని నిష్క్రమించుటతో పంచమాంకము ముగియును.

షష్ఠాంక ప్రారంభమున కాశీపుర శ్మశాన పరిసరారణ్యములో కాల కౌశిక శిష్యులగు కేశవ, జనార్దనులతో లోహితాస్యుడు ఆడుకొను సన్నివేశము కల్పింపబడినది. కాలసర్పదష్టుడైన లోహితాస్యుడు ప్రాణములుపోవు సమయమున తనతల్లి చెంతలేక పోయెనే అని వాపోయెను. జనార్దనుడు చంద్రమతికి జరిగిన దుస్సంఘటన వినిపింపగా తల్లి చంద్రమతి మిక్కిలి తల్లడిల్లి తెలివిని కోల్పోవుము ఎంతెంతో దురపిల్లినది. మొట్టమొదటగ సాయం సమయమైనను కుమారుడు ఇంకను ఇంటికి రాకపోయెనే అని తల్లడిల్లిన తల్లిహృదయము జనార్దనుని వలన పాముకాటునకు లోహితాస్యుడు అసువులు కోల్పోయెనన్న వార్తవిని పరిపరివిధముల పరితపించిన విధమును కవి ఎంతో విస్తరించి అభివర్ణించెను. ఇట హరిశ్చంద్రుడు శ్మశాన వాటికలో అలముకొన్నకటిక చీకటిని, మాయామేయ జగత్పరిస్థితిని, ఒకనాటి తనరాజఠీవి ఈనాటికి కాటికాపరిగ శ్మశాన సామ్రాజ్యమున బంటువలె అటునిటు తిరుగు దురవస్థకు కాపురమయ్యెగదా అని దురపిల్లిన సన్నివేశమును బలిజేపల్లి కరుణ రసమునకు పరాకాష్ఠగా చిత్రించెను. మండెడి కాష్ఠమును గొని శ్మశానమెల్ల పరిభ్రమించుచు కాటిసుంకమును చెల్లింపక తన బిడ్డను దహించుటకై విచ్చేసియున్న ఒక పడతినిగాంచి, ఆమె తనఇల్లాలని తెలియక తరువాత ఆమెతన కాంతయని గుర్తించియు పైకి తానెవరో తెలియనీక కాటి సుంకమును చెల్లించినగాని మరణించిన పిల్లవానిని దహించుటకు వీలులేదని నిష్కర్షగనివేదించెను. చంద్రమతి నిష్క్రమించిన అనంతరము చతురంభోధిపరీత భూవలయమేలగల లోహితాస్యుడు తుదకట్లు కాలసర్పదష్టుడై మరణించినందులకు దుర్భర దుఃఖమును అనుభవించెను. ఇల్లాలికి సంభవించిన ఇక్కట్లను తలచి తలచి తుదకామెను సమీపించి కుమారుని మరణమునకు ఎంతో దుఃఖము వెలిబుచ్చెను. ఆమె జన్మ జన్మలకు అతడే తనకు పతి కావలెనని కాశీ విశ్వేశ్వరుని ప్రార్థించెను. తుది సన్నివేశములో హరిశ్చంద్రుడు ఖడ్గముతో చంద్రమతిని సంహరింపనుంకింపగా నీసాహసము నుపసంహరింపుమని గాధేయుడు విచ్చేసి ప్రాధేయపడెను. అచంచలమైన హరిశ్చంద్రుని సత్యసంధతకు కరుణార్ద్రగంచలుడైన పరమేశ్వరుడు పార్వతీ సమేతముగా రాగా వసిష్ఠుడును ఆసందర్భమున విచ్చేసెను. పరమేశ్వరుని ప్రసన్నత్వము వలన నీకష్టములన్నియు తొలగినవని వసిష్ఠుడు తెలిపెను. లోహితాస్యుడు పునరుజ్జీవితుడయ్యెను. నాటకాంతమున విశ్వామిత్రుడు తానే సత్యవ్రతమును పరీక్షించుటకై ఇన్నికష్టములు తెచ్చిపెట్టితినని, నా తపశ్శక్తినంతటిని యిదిగో ధారబోయుచుంటిని. పరిగ్రహింపుమని పలికెను. అంత దేవేంద్రుడు విచ్చేసి హరిశ్చంద్రుని నీకు ఇంకేమి వలయునోకోరుకొమ్మని అడిగెను. హరిశ్చంద్రుడు **సర్వేజనాః సుఖినోభవన్తు** అను ధృకృథముతో అడిగిన కోర్కెలు భరత వాక్యరూపమున ప్రకటింపబడెను. మంగళ మహా శ్రీవృత్తముతో నాటకము ముగిసినది.

బలిజేపల్లి వారిధార్మిక గ్రంథావళిలో సత్య హరిశ్చంద్రీయము తురీయము. ఆంధ్ర నాటకములలో దీనివలె కీర్తిప్రతిష్ఠలు చూరగొన్న గ్రంథము మఱియొకటిలేదు. కరుణరస భరితమై మనస్సులను కుదిపిమథించి వేయు ఈ నాటకముపై ప్రజలకింత ప్రగాఢానురక్తి కలుగుటకు బలిజేపల్లి వారి కవితా సౌందర్యమే ముఖ్యకారణము. ఇట్టి రచనా రమణీయకము, హృదయావర్జక గుణము అంతకుముందు వెలువడిన హరిశ్చంద్ర నాటకములలో మృగ్యము. కందుకూరివారి హరిశ్చంద్ర నాటకములో వర్ణనకు ప్రాముఖ్యమీయబడినది. బలిజేపల్లి లక్ష్మీకాంతముగారు పాత్రలు సంఘటనలు - రసపరిపోషణ అనుమూడింటికి సమప్రాధాన్యమొసగిరి. ఇది పాఠకులు ప్రేక్షకులు ఆయా పాత్రలలో అప్పటి ఆసన్నివేశములలో పూర్తిగా తమ్ముతాము మరచి విలీనమై పోవునంతటి స్ఫూర్తితో రచింపబడినది. ఆధునికాంధ్ర నాటక సాహిత్య చరిత్రలోనిది ఒక అపూర్వవినూత్నాధ్యాయమును సృష్టించిరసవుయరచనా రావుణీయకవుుచే, సర్వవిధప్రదర్శనానుకూలప్రయోగ దక్షతచే, అసంఖ్యాకప్రదర్శనలతో బహుళప్రచారమును గాంచి యావదాంధ్ర ప్రజానీకమును అలరించి తరింపజేసినది.

పురాణ ప్రసిద్ధమైన హరిశ్చంద్ర కథ వివిధ శ్రవ్యదృశ్య కావ్యముల రూపమున ప్రభవించినది. సంస్కృతమున క్షేమేంద్రుడు చండ కౌశిక మనుపేర ఈ కథనే ధర్మవీర ప్రధానముగా

రచించెను. అందు విద్యా విషయకముగా హరిశ్చంద్ర విశ్వామిత్రుల మధ్య సంఘర్షణ చెలరేగినట్లున్నది. ఇక గౌరననుసరించి శంకరకవి కృత హరిశ్చంద్ర కథలో వసిష్ఠ విశ్వామిత్రులకు వైమనస్యమేర్పడి అది వీరితో సంబంధమేలేని సత్యహరిశ్చంద్రుని అగచాట్లపాలు చేసినట్లు అభివర్ణింపబడినది. హరిశ్చంద్రుని సత్యసంధత వివిధ విధముల పరీక్షింపబడుటయే యిందలి యితివృత్తము.

ఈ హరిశ్చంద్ర కథనే పలువురు ఆధునికులు దృశ్యములుగా రూపొందించి వారి సర్వస్వతంత్రరచనా సామర్థ్యమును ప్రకటించిరి. అందు కొండుభట్ల సుబ్రహ్మణ్యశాస్త్రి (వచనము-నష్టము) కం. వీరేశలింగం(1886)వడ్డాది సుబ్బారాయుడు. ధర్మవరము రామకృష్ణమాచార్యులు, కోలాచలం శ్రీనివాసరావు, నాదెళ్ళ పురుషోత్తము (1890) బలిజేపల్లి లక్ష్మీకాంతం (1911) మంత్రిప్రెగడ భుజంగరావు, మల్లాది విశ్వనాథశర్మ, సెట్టిలక్ష్మీనరసింహము మొదలగు వారు ముఖ్యులు. వీరియనంతరము కూడ కవి సమ్రాట్ విశ్వనాథ మొదలగు వారెందరో ఈ కథనే గ్రహించియున్నారు. మొదట కందుకూరి వారి హరిశ్చంద్ర అవిరళముగా ప్రదర్శింపబడిబహుళ ప్రచారమును గాంచినది. కాని బలిజేపల్లివారి సత్య హరిశ్చంద్రీయము వచ్చిన యనంతరము ఇది మరుగునబడి పోయినది. అందుకు హరిశ్చంద్రుడు గా హరిప్రసాదరావుగారి అద్వితీయనటన, పద్యమును వినినంతనే ఎవరికైన ఆకట్టుకొని ద్రవీభూతులను జేయురసోజ్జ్వల రచనా సౌందర్యము, ముఖ్యముగా వలవలమని విలపింపజేయు కరుణ రసభరితమగు వల్లకాటి దృశ్యము - ఇట్లే ప్రతి సన్నివేశము, ప్రతి పాత్రచిత్రణ, ప్రజలను మిక్కిలి ఆకర్షించుటయే ముఖ్య కారణములు.

ఈ సంధర్భమున కందుకూరి వారి (హరిశ్చంద్ర) నాటకమునకు, బలిజేపల్లి వారి సత్యహరిశ్చంద్రీయమునకు గల భేదసాదృశ్యములను కొంత పరిశీలించుట సముచితమని నాయభిమతము. 1886 వ సంవత్సరమున హరిశ్చంద్ర నాటకమును రెండు మూడు వారములలోనే నాలుగంకములను వీరేశలింగముగారు రచించిరి. తరువాత కొంత కాలమునకే పంచమాంకమును గూడ ముగించిరి. కాని పుస్తక రూపమున 1889 వరకు ప్రకటితముకాలేదు. ఇరువురి సత్యహరిశ్చంద్రనాటకములోకే మారు ప్రమరింపబడినవి. ప్రథమాంకమున కథరెండింటి యందు సమానము. **పైనే మున్నది చెప్పుమోటుకుడ** అను బలిజేపల్లి వారి పద్యములోని భావమును వీరేశలింగముగారు వచన రూపమున మఱికొంత విస్తరించిరి. అట్లే రాజుల మదప్రవృత్తిని విశ్వామిత్ర వసిష్ఠుల ప్రతిజ్ఞలను గూడ విస్తరించి వివరించిరి.

ద్వితీయాంకమున మార్కండేయ మహర్షిశిష్యుడైన జాబాలి, హరిశ్చంద్రుని వేడుక చెలికాడైన గాలవుని సంభాషణము విష్కంభముగా కూర్చబడినది. విశ్వామిత్రుడు హరిశ్చంద్రుని రాజసూయాధ్వరమునకు వచ్చి ధనము గ్రహించి రాజు నొద్దనేదాచిపోవుట మృగయావినోదమునకు వచ్చినహరిశ్చంద్రుడు వారిని దండింపజేయుట విశ్వామిత్రుడు కోపించి వారిని దండించినందుకు పరిహారార్థముగా హరిశ్చంద్రుని సామ్రాజ్యమునుదక పూర్వకముగా తాను గైకొనుట మొదలగు కథాంశములు వర్ణింపబడినవి. ఈ ద్వితీయాంక కథను బలిజేపల్లి తృతీయాంకమునందు చేర్చిరి. బలిజేపల్లివారి నాటకద్వితీయాంకమున విశ్వామిత్రుడు హరిశ్చంద్రుని కడకు తన కెంత ధనము కావలెనో అది అవసరమైన పుడు వచ్చి తీసికొందునని తెలిపివెడలును. అటుపై రాజు వేటకు బయలు వెడలు విషయమున్నది.

వీరేశలింగము గారు తృతీయాంకారంభమున హరిశ్చంద్రుడు చంద్రమతీ లోహితాస్యులతో జన మిత్ర కామపాలాది పౌరులతో అరణ్యమున ప్రవేశించినట్లు వర్ణించిరి. ఇట జనమిత్రుడు విశ్వామిత్రుని నిందించును. అపుడు హరిశ్చంద్రుడు విశ్వామిత్రుడటకు రాకమునుపే దాటిపొండని పౌరులతో పలుకును, వారు నిష్క్రమింతురు. అటుపై విశ్వామిత్రుడు యజ్ఞనిమిత్తమడిగిన సొమ్ము నప్పగింపుమనెను. నెలదినములు గడువుపెట్టి హరిశ్చంద్రునితో నక్షత్రకుని పంపును. అతడు వారినెన్నో బాధలు పెట్టును. దంత ఘాతుకుడను రాక్షసుని విశ్వామిత్రుడు అరణ్యమునకు పంపి ఇబ్బందులు కలిగించును. అంతలో ఒకభూతము కపాలకుండలుడను భేతాళుని హరిశ్చంద్రునిపైకి

పంపగా అతడు దానిని గ్రుద్దును. అటుపై కార్చిచ్చు అలము కొనును చంద్రమతి పాతివ్రత్య ప్రభావముచే వర్షము కురియును. చతుర్థాంకమున హరిశ్చంద్రుడు కాశీపురముచేరి నక్షత్రకుని పోరుపడలేకతన భార్యను బిడ్డను కాలకౌశికునికి విక్రయించును. అటుపై తనకు తానై వీరబాహువునకు కాటికాపరిగా అమ్ముడు పోయి ఋణ విముక్తడగును.

పంచమాంకమున లోహితాస్యుని మరణము, చంద్రమతి శ్మశానమునకు వచ్చికాటి సుంకము చెల్లింపలేక పోవుట, తన భర్తనే గుర్తింపలేక పోవుట ఆమెపై శిశుహత్యా నేరము మోపబడి. ఆమెకు కాశీ పురాధీశ్వరుడు ప్రతాపదేవచంద్ర మహారాణి శిరశ్ఛేదనము విధించుట. విశ్వామిత్రుడు పంతమును విడువుమని హరిశ్చంద్రునితో పలుకుట అతడు సమ్మతింపక పోవుట - పార్వతీ పరమేశ్వరులు ప్రత్యక్ష మగుట - వర్ణింపబడినది.

ఈ నాటకకర్త లిరువురును శంకరకవి హరిశ్చంద్ర కథనే అనుసరించుటచే కథా విషయము నందంతగా మార్పులు లేవు. కాని పంతులుగా రటనట కొన్నిచిన్న మార్పులు గావించిరి. అందు లోహితాస్యుడు నిజముగా మరణింప లేదనియు చిలువకాటునకు మూర్చితుడయ్యెననుట చంద్రమతిపై హత్యానేరముమోపబడినట్లున్నకథను నక్షత్రకుడే ఆ బాలుని రహస్యముగా దాచియుంచి చివరకు బయల్పరచుట. ఈ కల్పనములందు దివ్య సామగ్రిని ప్రవేశపెట్టుట పంతులుగారి కిష్టములేదు. కాని నాటి ప్రదర్శకుల తృప్తికొఱకు తరువాత వ్రాసిన పంచమాంకము తుదిలో పార్వతీ పరమేశ్వరులను ప్రవేశపెట్టిరి.

బలిజేపల్లివారి షష్ఠాంకయుతమైన సత్యహరిశ్చంద్రీయములో లోహితాస్యునిమరణము, చంద్రమతిపై శిశు హత్యా నేరము - తనపుత్రుని దహించుటకై కాటి సుంకము చెల్లింపలేని నిస్సహాయదైన్యస్థితి - తుట్టతుదకు రాజాజ్ఞను పాటించి తన యిల్లాలిని తానే నరకుటకు పూనుకొనుట మొదలగుసన్నివేశములు కరుణ రసస్ఫూర్తికి ఆలంబనములుగా కూర్పబడినవి. కడకీ నాటికి కాల సర్పమునకున్ అని హరిశ్చంద్రుడు లోహితాస్యుని కాలకౌశికునికప్పగించునపుడు పలికిన అపశబ్దము నిజముగనే భవిష్యత్తులో అతని అపమృత్యువునకు దారితీసినది. ఒక్కొక్కపుడు మనకు తెలియకయే భావి జీవితమునకు సంబంధించిన విషయములు అప్రయత్నముగా బహిర్గతములగు చుండును. సర్వసామాన్యులలో నేయిట్టి యేపెక్కులు. ఇక సత్య సంధుడైన హరిశ్చంద్రుని నుండి హఠాత్తుగా ఇట్టి కఠోరదుష్టపరిణామ సూచకమగు అమంగళ వాక్యము వెలువడుటలో ఆశ్చర్య పడవసినదేమియులేదు. వీరేశలింగము గారు మృత్యువును నిరసించునిమిత్తమే అట్టి మార్పులు కావించి యుందురు. కాని బలిజేపల్లి వారిట్టి విపత్కర సంఘటనలను రసపరిపుష్టికి దోహదముగా గ్రహించి, ముఖ్యముగా శ్మశాన వాటికాఘట్టమును అనన్యసాధ్యముగా నిర్వహించిరి. వీరు తమ హరిశ్చంద్ర నాటకాన్ని వీరరస ప్రధానంగా రచించాలని ఎంత ప్రయత్నించినా కరుణరసానిదేపై చేయి అయింది. హరిశ్చంద్రనాటకమే ఏడుపు నాటకమని ప్రసిద్ధివచ్చింది. ఇట్టి యేడుపును పదపదమున అక్షరాక్షరమున ఎంతో సహజముగా నిక్షిప్తమొనర్చి, ప్రతి పాఠకుని ప్రేక్షకుని హృదయమును ప్రతి స్పందింపజేసిన బలిజేపల్లి వారి ప్రతిభ అప్రతిమానము. ప్రకృతిమానము. ప్రకృతి సిద్ధముగా వీరిది రసపరిపక్వహృదయము. బాల్యమునుండి యేదైవ వరముగా ప్రాప్తించినది. అది కవితారూపమున ప్రసరించి, రసమయకృతులను వెలువరించినది. భావావేశమునకు తగిన భాష. సందర్భసముచిత పద్యరచనా రామణీయక ఛంద శ్శిల్పమర్మజ్ఞత, వీరెరిగినంతగా ఆధునికసంప్రదాయ బద్ధసాహిత్యనిర్మాతలలో మరెవ్వరును గ్రహించి యుండరనుట అత్యుక్తికానేరదు. సామాన్య భావములకు వచనము చాలినను భావతీవ్రతకదిచాలదు. ఛందోరచన వలననే భావా వేశము సిద్ధింపగలదు. భావావేశము హృదయావేదనకు సంబంధించినది. హృదయావేదనమును సహృదయులలో గల్గించవలెనన్న ఛందోరచన తేలికగా సమకూర్చగలదు. ప్రస్తుతము సత్యహరిశ్చంద్రీయమున కాటికాపరి హరిశ్చంద్రుని పరిస్థితిని దృష్టాంతముగా గ్రహించి పరిశీలింతము. హరిశ్చంద్రుడు తన పూర్వపరిస్థితిని యిప్పటి స్థితినిపోల్చుకొని మూపుపైనున్న

సురాభాండము నుద్దేశించి ఆహా! సురాభాండమా! నీవు పూజ్యురాలవు. కావుననే విశామిత్రుని సహాయ సంపత్తిచే విశ్వవిశ్వంభరాదేవికి నావాసంబగు నీ భుజపీఠిపై నిట్ల దిష్ఠించి యున్నావు అని పలుకును అప్పటికే భాషా శైలులుదాత్తములైనవి. తరువాత చీకటిలో దరిచూపుటకై చితిలోని కొఱవిని గ్రహించి, తన పూర్వస్థితిని తలచుకొనినప్పటి భావావేశము బహు తీవ్రమై ఛందోరూపముదాల్చి శ్రోతలకు ప్రేక్షకులకు హృదయ సంచలనము గల్గించినది. ఆహా చక్రవర్తులకు సేవకాజనము పట్టు బంగారపు కరదీపికలకంటె నాయిప్పటి నీచస్థితికి నీ కొఱవియే మిక్కిలియుచితమైనదగును. అట్టుపై కాలంపుంగతి నెప్పుడేదియో యభోగంబప్పుడపాటనై చతురంభోధి పరీత భావలయ రక్షాదక్ష చామీకరాయతదండంబు ధరించు నీకరమె యాహాయిప్పుడీ కాటిలో జితిలో గాలుచునున్న ఈ కొఱవిదాల్చెన్...... శోచనీయమముగన్ అను పద్యములోల వెనుకటివచన రచన కంటె నెక్కువ భావావేశము విస్పష్టీకరింపబడినది. భావావేశము తీవ్ర రూపము దాల్చినపుడు వ్యక్తీకరణమొక విశిష్ట రూపమును వహించుట సహజ సిద్ధము భావావేశమును ఛంధోరూపములో నందరు వ్యక్తీకరింపలేరు. అది కవికి మాత్రమే సుసాధ్యము.

ఒక్కొక్కప్పుడు ప్రదర్శనకు వీలుగాని ప్రత్యేక సన్నివేశముల పరమ నిగూఢతత్త్వమును ప్రకటించుటకు భావనా శక్తి గల కవిత్వమే ప్రధన సాధనమగుచుండును. సత్యహరిశ్చంద్రీయమునట్టి ఘట్ట మొకటియున్నది. కాటికాపరి రంగములో చీకటిని ప్రతిపాదింపవలసిన సందర్భమున దీపముల నార్పివేసినచో నికనంతటితో ప్రదర్శనము పూర్తియైనట్లే. కావున బలిజేపల్లి వారిచ్చట తన భావనాశక్తి నుపయోగించి కవిత్వకళసాధనముగా ఆసన్నివేశముయొక్క ప్రాశస్త్యమునుష్టాంకమున -

కలవారి యిండ్లలోపలి నిధనముసెత్తునరుగ దొంగలకు సిద్ధాంజనంబు
మగల గూరుకనిచ్చి తెగియంటుగాంఢ్రకై తారాడు కులటల తార్పుగత్తె
అలవోకనట్టిట్టు వేఁటాడు పాడు ఘూకములకు బాడి పంట మనతనంబులోననింపెసలాగు
శాకినీఢాకినీ తతుల చుట్టాల సురభి
రేలతాంగికి నల్లని మేలిముసుగు
కమల బాండంబునకునెల్లగన్నుమూత
సత్యవిద్రోహిదుర్యశస్ఛవికి దోడు

కటిక చీకటి యలమెదిక్తటములందు - అను సీస పద్యమునచక్కగా ప్రకటించిరి. ఇట్లు ప్రతి సన్నివేశము ఔచిత్య స్ఫూర్తితో రసభావ మహోజ్జ్వలముగా రచింపబడినది. దీనిని ప్రదర్శించిన నటులును కవి భావమును గ్రహించి చక్కగా నటించిరి. హరిశ్చంద్రుని పాత్రలో జీవించిన మహానటులలో హరిప్రసాదరావు, అద్దంకి శ్రీరామమూర్తి, డి.వి. సుబ్బారావు, బ్రహ్మజోస్యుల సుబ్బారావు, మాగంటి సుబ్బారావు, అంబడిపూడి కోటయ్య, అంకరాజు రామారావు, కందాడై శ్రీనివాసన్, రామాయణం సర్వేశ్వర శాస్త్రి యెన్న దగినవారు. ఇందు డి.వి.సుబ్బారావు గారి యస్సివేషములలో హరిశ్చంద్ర పాత్రధారణము మిన్నగానుండును. వీరు నాటక పాత్ర పాఠ్యమును రసవంతముగ నర్థవంతముగ చక్కని వాచకములో నభినయింపగలరు. కొందరు మహానటులు పాఠ్యమునకు విశేషవ్యాఖ్యానములు చేయుచు విశిష్టార్థములు స్ఫురించునట్లభినయించి తమ ప్రత్యేకతను ప్రతిష్ఠించుచుందురు. మఱికొందఱు బహురసవంతముగా పాడి అభినయింతురు. ఈసందర్భమున రాజమండ్రి జట్కావాడు లక్ష్మీకాంతంగారు మధురవాణి పాత్ర ఎంపికకై అబ్బూరి వరదరాజేశ్వర రావుగారితో జట్కాలో పోవుచున్నప్పుడు ఆజట్కావాడు

తిరమై సంపదలెల్ల వెంట నొకరీతిసాగి రావేరికే
సరికేపాటు విధించునో విధి యవశ్య ప్రాప్యమద్దానినె
వ్వారు తప్పించెదరున్నవాడనని గర్వంబేరికిన్ గాదు, కిం

కరుడే రాజగు రాజెకింకరుడగున్ గాలాను కూలంబుగన్ - అను పద్యమును రాగాలాపన చేసి వింటిరా నిన్నరాత్రి వాడి తస్సాదియ్యా యేంచదివాడండి సుబ్బారావ్. హాలంతా కళ్ళనీళ్ళేనండీ. వాడి దుంపతెగా అని అన్నాడు. లక్ష్మీకాంతమ్మగారి కళ్ళు ఆనందాశ్రువులతో చెమ్మగిల్లినవి. అప్పుడు

లక్ష్మీకాంతం వరదరాజేశ్వరరావుతో నవ్వుతూ పద్యంలో రహస్యం అదే హరిప్రసాదరావు చదువు తుంటే ప్రేక్షకుల్లో కొందరు ఏడుపు ఆపుకోలేక హాల్లోనుంచి వెళ్ళిమళ్ళీ వస్తుండేవారు. వీలయినంత వరకు అందరికీ అర్థంఅయేలా రాశాను. మారోజుల్లో ఉండే మర్యాదను పాటించి వీడుకూడాపద్యం చదివి అర్థం చేసుకున్నాడంటే మనం ధన్యులమయినట్లే. ప్రజల కవిత్వమంటారు. అదేం కవిత్వ మోయి అన్నాడు. ఈ హరిశ్చంద్ర నాటకములో నక్షత్రకుడుగా లక్ష్మీకాంతంగారు నటించేవారు. హరి ప్రసాదరావుతో పోటీ పడటానికి తన పాత్రకీ చాలా పద్యాలు రాసి పెట్టుకున్నారట.

పద్య భూయిష్ఠమైన హరిశ్చంద్ర నాటకములోని పద్యములు రసవంతములయి రచనమున కుత్తమ కావ్యత్వసిద్ధి నపాదించు చున్నవి. ఆ నక్షత్రకుని పరమానందయ్య శిష్యుల్యాలూ ఆ హరిశ్చంద్రుని కుడుపుకోతదుఃఖాలు ఎన్ని అని చెప్పమంటారు. నాతరమామాటి వాన్నిటిని వివరించ టానికి. ఈ హరిశ్చంద్రీయం ఇతరహరిశ్చంద్ర నాటకాల్ని అన్నిటిని చూచే అవసరాన్ని తొలగిస్తుంది. పాటగలవారికి ఎన్ని పద్యాలయినా అందిస్తుంది ఈ హరిశ్చంద్రీయం అభినయించే వార్ని అట్టే ఆయాసపెట్టకుండా అనుసరిస్తూ ఉంటుంది. ఆహరిశ్చంద్రీయం. ఈ హరిశ్చంద్ర నాటకముయొక్క ప్రాశస్త్యమును, దీని కింతఖ్యాతి గలుగుటకు మూడు కారణములను డా.. పోణంగి అప్పారావు గారు తెలుగు నాటక వికాసములో సూచించిరి. అవి గుంటూరు ఫస్టు కంపెనీ వారి ప్రదర్శనల విశిష్టత. ఈ మూడింటనుచివరి హేతువే ప్రధానమైనదనిరి. తెలుగులో అనేక హరిశ్చంద్ర నాటకములు బయలు దేరినవి కాని అన్నింటను నాటికి నేటికి బహుళ వ్యాప్తి గాంచి సుప్రసిద్ధమైనదిబలిజేపల్లి వారి సత్య హరిశ్చంద్రీయము (1912) మాత్రమే రంగరాజ్యాన్ని ఏలడానికి వలసిన అన్ని ఆనుకూల్యములు వీరిరచనలో ఉన్నవి. లక్ష్మీకాంత కవిగారి హరిశ్చంద్రీయంతల మెత్తిన తర్వాత కడమ హరిశ్చంద్రులు కనిపించకుండా పోయాయి. దీనికికారణం ఉంది లెండి. వీరి పద్య కవిత్వం వినీ వినడంలో పిన్నలకు పెద్దల కూకుండా చెవులకు మిక్కిలి తీపిని కలిగిస్తుంది. మాటు మూలపదాలు ఉండవు. వక్ర గమనాలు ఉండవు. గంభీర భావాలు ఉండవు. అనుకున్న అర్థం అంది పుచ్చుకొన్నట్లు ఉంటుంది. ఏది ఎట్లా ఉన్నాను విశేషంగా అందరికి అర్థం అవుతుంది ఆ కవిత్వం వల్లించ దలచుకున్న వార్ని అట్టే ఆయాసపెట్టవు ఆగద్య లైనను. అని వసుమర్తి యజ్ఞనారాయణశాస్త్రి గారు హరిశ్చంద్రీయములోని రచనా విశిష్టతను చక్కగా వివరించిరి.

ఇట్లే పలువురు సాహితీవేత్తలు, విమర్శకులు వీరి యితర కృతుల ప్రసక్తి గావింపక కేవలము సత్యహరిశ్చంద్రీయమునే మిగుల ప్రశంసించియున్నారు. డా..ఎస్. గంగప్పగారు ఇక్కడ పేర్కొన దగ్గ మరోనాటక కర్త బలిజేపల్లిలక్ష్మీకాంతం గారు. తెలుగులో ఎన్నో హరిశ్చంద్రనాటకాలున్నప్పటికీ బలిజేపల్లి వారి సత్య హరిశ్చంద్రకు వచ్చినంత ప్రఖ్యాతి మరి ఏ ఇతరుల నాటకాల కురాలేదంటే అత్యుక్తికాదు. అని రేడియో ప్రసంగము గావించిరి.

తెలుగుసాహిత్యచరిత్రలో శ్రీవైద్యులక్ష్మణరావు శ్రీవాడపల్లి చక్రపాణిరావుగారు బలిజేపల్లి లక్ష్మీకాంత కవి గారి హరిశ్చంద్ర నాటకమునకు వచ్చినకీర్తి ప్రతిష్ఠలు అంతింతని చెప్పుటకు వీలుకాని వనిరి. పద్యములు రస నిర్భరములనిరి. హరిశ్చంద్ర నాటకమున రచన అటు ప్రేక్షకులకు ఇటు నటకులకు ఏదో ఊహింపరాని రసౌజ్జ్వల్యమును ఆవహింప జేసెడిది. పూర్తి గా అందులోనిమ గ్నమై తక్కిన ప్రపంచమునుగూర్చియే పట్టించు కొనెడి వారుకాదు. దీనికొక దృష్టాంతము పరిశీలింతము.

ఒకనాడు గుంటూర్లోతాటి యాకుల నాటక శాకలో హరిశ్చంద్ర నాటకం ప్రదర్శిస్తూ ఉన్నారట. ఒక ఒకవమూల ఎక్కడోనిప్పంటుకొని తగల బడుతూన్నదట. చివర రంగములోతెలుగులో నటిస్తున్నచంద్ర మతి పాత్రధారి కొండా వెంకటప్పయ్యపంతులుగారు. Oh that hall if now on fire what can I do అని అరచారట. ఈ విధంగా ఇంగ్లీషులో అన్నమాటలకు ఆప్రేక్షకులు. ఏమాత్రమూ ఔచిత్య భంగాన్ని పొందక అమంటలార్పించి నాటకాన్నిపూర్తిగావిని వెళ్లిపోయారట. అది శ్మశాన వాటికకు సంబంధించిన సన్నివేశముగుటచే ఆవైపు నిప్పురగిలిదగులబడుటలో అనౌచిత్యముదని ప్రేక్షకులు భావించియుందురు.

ఈ సందర్భమున స్థానం నరసింహారావు గారిని హరిశ్చంద్ర నాటక ప్రదర్శన మెట్లలరించి వరించి తరింపజేసినో వారి మాటలలలోనే కొంత పరిశీలింతము. బాపట్లకు గుంటూరు ఫస్టు కంపెనీ వారు వచ్చి హరిశ్చంద్ర నాటకం ప్రదర్శించారు. అప్పటికి నా వయస్సు 17 సంవత్సరములుంటాయి. ఈ నాటకాన్ని కీ.శే. బలిజేపల్లిలక్ష్మీకాంతంగారు రచించారు. ఇది ఈ నాటికే బహుళ ప్రచారం లోవుంది తాటి యాకుల దళ్ళు కట్టిన ఒక పాకలో ప్రదర్శనం. దడికి సందు చూచి ఆరంధ్రన్నే పెద్దది చేసి చూడాలను కొని ఇంటికి పోయి అమ్మతో హరికథకు పోయివస్తానని చెప్పాను, ఎట్లో నాటక ప్రదర్శన చూచి నటించిన విధానం తలుచుకొంటూ ఉండి పోయాను. ఆనాటకంలో హరిప్రసాదరావు హరిశ్చంద్రుడుగా, కొంపెల్ల హనుమంతరావు చంద్రమతిగా, వరిమి రామచంద్రరావు విశ్వామిత్రుడుగా, పత్రి శీనిప్పగారు నక్షత్రకుడు గాను నేను చూచిన ఘట్టాల్లో అద్భుతంగా నటించారు. బాపట్లలో ప్లీడరు గుమాస్తాల నాటక కంపెనీ చిలకమర్తి వారి గయోపాఖ్యానం, ప్రసన్న యాదవం, బలిజేపల్లిలక్ష్మీకాంతంగారి సత్యహరిశ్చంద్రీయంనాటకాలను ప్రదర్శిస్తూ వుండేవారు.

నాటకం రేపనంగా చంద్రమతి వేషపాత్ర ధారికి జ్వరం వచ్చింది. అది 1921, ఫిబ్రవరి. అప్పటికి నావయస్సు 19 దాటి ఇరవైలో ప్రవేశించింది. మహాకవులు తిరుపతి వెంకటేశ్వర శతావధానులు పది నిమిషాలు ముందు గానే వచ్చి ప్రేక్షకులముందు సీట్లలో ఆసీనులైనారు. తరుణీస్ నేనొక పాటినే తమకు కర్తవ్యం బు బోధింపగన్ - అనే పద్యంలో నాల్గవపాదం ప్రాంప్టర్ అందిస్తున్నా చెవుల కెక్కడంవేదు. దాన్నంతటితోనే వదిలేశాను. దానివెంటనే రెండవ పద్యం **మేనం బ్రాణములున్న యంత వఱకున్** అనే పద్యాన్ని ప్రాంప్టార్ అందిచ్చాడు. దాన్ని మాత్రంపూర్తి గా చదివేసి చివర కొద్దిగా రాగమన్నాను. ఇక పతి వియోగమయ్యే ఘట్టం పద్యాలతో పెద్ద పోర్ష నుండి ప్రాంప్టరందిస్తున్నాముక్కుకుముక్కయినా అనలేక పొయ్యాను. అన్నీ వదిలేసిముఖావమే శరణ్యంగా మధనపడుతూ నిలిచుండిపొయ్యాను. కాలకౌశికుడు కదలవే అని గర్జిస్తూ ఆదరించాడు. ఉలిక్కిపడ్డాను. ప్రేక్షకులు కూడా ఉలిక్కిపడ్డట్టయినారు.

శ్మశాన ఘట్టంలో **జలదమాసుంత మార్పలికినదోసమా** అని చదువు తూపద్యాన్ని ప్రాంప్టర్ సహాయంతో పూర్తిగా చదివేశాను. దాని ముగింపులో అక్కడే పడి వున్న లోహితాస్యుని శరీరం కాలికితగిలినట్లుగా ఉలిక్కి పడ్డాను. వానిమీద పడిరోదించాను. హరిశ్చంద్రుడు వడతీ! ఏకాకివై ని చదివి, ఆమండుతున్న చితుకలను కాలదన్నేశాడు. వెంటనే అవమానాన్ని పొందిన ఒక మాతృహృదయావేదన నాలో పొంగింది. దెబ్బతిన్న ఆడుపులిలాగా నాలో రోషం రెండు కండ్లల్లో మెఱిసింది. తరువాత సంభాషణలో నీకెవ్వరూదిక్కులేరా అంటాడు హరిశ్చంద్రుడు. అపుడు నేనుకొడుకా యటంచు నాపడునవస్థకు జాలిగొని యేడ్చు నలదిశాంగనలెతోడు అని ప్రారంభించాను. మిగతా మూడు పాదాలు జ్ఞాపకం రాలేదు. దిక్కులేనట్టినావంటి.... ఓ కాటి రేడ అని ఆపుకొంటూన్న దుఃఖంతో హరిశ్చంద్రునకు నమస్కారంచేశాను. నాకు తెలియకుండానే అణచి పెట్టుతూన్న దుఃఖం ప్రకటితమైంది. ప్రదర్శనంపూర్తి అయింది. కంపెనీ వారు తిరుపతి వేంకటేశ్వరులకు సన్మానం చేశారు. వారునన్ను గురించి ప్రత్యేకంగా ప్రశంశిస్తూ ఆశువులో ఆశీర్వదించారు.

తెనాలి శ్రీకృష్ణా హిందూ థియేటర్‌వారు ధర్మవరం వారి ప్రహ్లాద, శ్రీ రాములసచ్చిదానంద శాస్త్రి గారి సావిత్రి, బలిజేపల్లి గారి సత్యహరిశ్చంద్రీయం నాటకాలను ప్రదర్శించుచుండిరి. ఒక్క హరిశ్చంద్రకు తప్ప తక్కినవానిలో హెచ్చుగా పాపట్లకాంతయ్యగారి పాటలనే పాడి జనరంజకముగా ప్రదిర్శంచుచుండెడివారట. ఇట్లెన్నోనాటకసంస్థలు బలిజేపల్లి వారి సత్యహరిశ్చంద్రీయమును రసవత్తరముగా ప్రదర్శించి ప్రజలను రంజింపజేయుచుండిరని తెలియుచున్నది. సత్య హరిశ్చంద్రీయము యొక్క గొప్పతనము ముఖ్యముగా వారి రచనలోనున్నదనుట యథార్థము. అయినచో ఈ కావ్యము యొక్క ధ్యేయము నటులను ప్రేక్షకులను, పాఠకులను ఏడ్పించుటయేనా అను సంప్రశ్నముదయింపవచ్చును. ఈ నాటకమందించిన సందేశము కవి మనస్సునుపూర్తిగా ఆకళించుకొన్నగాని అవగతము కాదు. కవి తన జీవితములో పొందిన జాతికి విముక్తి కల్గుగవలెనన్న లక్ష్యము నకిది ప్రత్యక్ష సాక్ష్యము.

ఇకరిజిస్ట్రేషన్ శాఖలో తాను ప్రతినిత్యము చూచుచున్న సంఘటనలు అందలి ధర్మ మర్మములు - క్రయవిక్రయ పత్రములలోని పరిభాష మొదలగు నంశములన్నింటిని బలిజేపల్లి వారు ఎంతో సూక్ష్మముగా వ్యంగ్య ప్రాయముగా అధిక్షేపణ పూర్వకముగా సూచించిరి. అసలుకావ్యము యొక్క పరమార్థ మిట్టి సూక్ష్మాంశములను పరిశీలించి ఆకళింపుకొన్నగాని అవగతము కానేరదు.

హరిశ్చంద్రుని కాటికాపరితనము నీచాతి నీచమైన దాస్యవృత్తికి నిదర్శనముకాని వీరదాసుడుగా అతడు నిర్వహించిన బాధ్యత, స్వామిభక్తి పరాయణత్వము అతని మహోదాత్త చరిత్రమును నిరూపించుచున్నవి. 24 కాలము పోను మాటనిలుచును త్యాగమయ విరాజమాన సూక్తికి హరిశ్చంద్రుని వ్యక్తిత్వము ఆదర్శప్రాయము.

ప్రస్తుతము శ్రీ ఏలూరి ప్రసాదరావు గారి సత్యహరిశ్చంద్రీయ. కావ్య సమీక్షలోని కొన్నివిన్నూత్నాం శములని టనుట్టంకించి ఈ అధ్యాయము నింతటి తో విరమింతును. ఇందు రిజిస్ట్రేషన్ శాఖకు సంబంధించిన విషయములు కూడ సూచన మాత్రముగా వివరింపబడినవి.

ధర్మమును కాని కాలము సంభవించినదని వాపోవుచు అన్నియు వదలుకొన్న హరిశ్చంద్రుడు ఒకనాటి అర్ధరాత్రమున శ్మశాన భూమియందు కాలుచున్న ప్రేతముల మధ్య తనకు సంఘటిల్లిన దురవస్థలకు తను విచారింపనని నిల్రదొక్కు కొనుచునే మంచి కాలము రాగలదన్న ఆశసైతము అంతరించిపోయినదని బాహాటముగా ప్రకటించినాడు! నిస్పృహ తన్నావరించి యుండ కులధర్మము నేనాడో విడిచిపుచ్చిన హరిశ్చంద్రుడు స్వామిధర్మమును మాత్రము విడువ జాలనని అందుకై చితిలో కాలుచున్న ఒకకట్టెను చేత బట్టుకొనికాటిసుంకము చెల్లింపకుండ ఎవరైన శవదహనము చేయుచున్నారేమో అని ఎంతో జాగరూకుడై వల్లకాడెల్ల పరిభ్రమించి కొఱవి ఆరిన వెంటనే పలికిన మాట అయ్యో! ఈ కొఱవి అప్పుడే ఆరినది దారి బొత్తుగా కానరాకున్నది. అను మాటలు భరత భూమినావరించిన బానిసత్వమును, దారిగానక కొట్టుమిట్టాడు భారతీయుల దీనస్థితిని తెలుపునవి. నల్లిశల సూర్య ప్రభల వెదజల్లి నిన్న మొన్నే ఆరిపోయిన భారతీయుల మహావైభవమును దన్నికై వగచెడు మహనీయులగుండె కోతను తెలుపుచున్నది. బానిస వృత్తి యందు సైతము బ్రతికి చెడినవానివలె హీనస్వరము నవలంబింపక సగర్వముగా తనస్వామి వీర బాహువు ఆదేశించిన మేరకు అక్షరము తప్పక స్వధర్మమును, స్వామికార్యమును నిర్వర్తింప కఠినమగు శపదము చేయును. అతిదీనమై పరపురుషుని, మోదుమిక్కిలి కాళకౌశికుని వంటి నీచుని దాసిగా బ్రతుకవలసివచ్చిన తన భార్య చంద్రమతి దుస్థితికి, కాలవశమున అఖిల సామ్రాజ్య భోగములు కోల్పోయిన తన భార్య హైన్య పరిస్థితికి తానే కారకుడనని సత్య ప్రతిష్ఠకై యొనర్చెడు నీచ కృత్యములు సైతము సగౌరవములేఅని, తనను బజారున పెట్టిఅమ్ముచున్నాడు తన భార్య తనకిచ్చిన మాటను గుర్తుకు తెచ్చుకొని గద్గదస్వరమున పెల్లుబికి వచ్చు దుఃఖము నాపుకొనుచు అర్ధరాత్రమున ఏదో దీనాలాపము వినబడగా నిర్భయముగా శ్మశానము దాచి అటుపోయిపరిశీలించినాడు. సాక్షాత్తు తన భార్యయే గుర్తుకు వచ్చినది. కానవచ్చిన దీనమైన ఆ మానవతి సుశీల వతెనే కన్పట్టినది. అతడామెను రక్షించి తీరవలెను. కష్టము కడ తేర్చవలెను. కాని తన సేవకావృత్తికి భంగము వాటిల్లరాదు. కాటికి వచ్చువారికెన్ని కష్టములుండవచ్చును. కాని సుంకము చెల్లించకుండ శవదహనము చేయ బూనిన ఆ నిర్భాగ్యురాలు తన భార్యయని సందేహించును. ఆమెకే సహాయమును చేయలేక తన ఆజ్ఞలేక శవదహనము చేయుచున్న ఆదీనురాలిపై సైతము వీర బాహువుతనకిచ్చిన ఆ అదికారమును కాటిచట్టముగా ధీరగంభీర స్వరముతో వీరదాసుడు వివరించెను. ఇది ఈ నాటకమున రహస్యముగా దాగియున్న అద్భుతమగు ఎలిగరి. దీనిలో వ్యంగ్య పూర్వకమైన అధిక్షేపణమున్నది. ఈ నిరసనము నాటి తెల్లదొరల కృత్రిమశాసనముల పట్లవారి పటాటోపము పట్ల నని మనము గ్రహింపవలెను. మరణ పత్రమునకు కూడ కోర్టు ఫీజు కట్ట వలెననుహీన సంస్కృతిపై ఇది ఒక నిందారోపణము. ఈ ఎలిగరీ శ్మశాన వాటికయందే కాదు. నాటక ప్రారంభమున ఇంద్రసభయందును కలదు. నీతిమంతులగు భారతీయులు కష్టకాలమునందును అసత్యమును చెప్పరు. కాని బ్రిటిష్

పరతంత్రమందు మనకు సంక్రమించిన బానిస సంస్కృతి దీనిని తారుమారొనర్చినది. కోర్టులో సత్యవ్రతుడైన వనిని సైతము కావలసిన బొంకించినగాని (కేసు గెలవదని) వ్యాజ్యమునెగ్గదని నిలదీసి అబద్ధము చెప్పించు న్యాయవాదులను మనమెఱుగుదుము. దీనిపై తీవ్రమగు (Satire) అధిక్షేపణగా ఇంద్రసభలో విశ్వామిత్రుడు నిత్య సత్యకీర్తియగు హరిశ్చంద్రుని బొంకించెదనని పట్టు పట్టుటలోను ప్రతిజ్ఞ చేయుటలోను ప్రతి అక్షరమున కవిధ్వనింపజేసెను. బలిజేపల్లి ప్రభుత్వోద్యోగి. మీదు మిక్కిలి అష్టబంధనము (రిజిస్ట్రేషన్) శాఖలో ముఖ్య గుమాస్తాగా కర్నూలు నందుద్యోగము నెరపినాడు. ముప్పది దినముల సేవావృత్తికి ఏడెనిమిది రూకలు తన జీతము. అప్పుడప్పుడు లభించు దారి బత్తెములు (T.A & D.A.) దాత లిచ్చు పిండ ప్రదానము (మామూళ్ళు) ఎన్నియున్నను కుటుంబ భారము మెండై అప్పులలో తలమున్కలై శవాకృతిని తేలు చుండిన రోజులివి. నిరుపేదలు అన్నిటికి పెద్దవారు తాతలార్జింపగా తనయులు క్షీణింపజేసి, మడి మాన్యములను, పశువుల్తో సహా తెగనమ్ముకొని వచ్చిన వారు, శవదహనమునకై వచ్చువారితో సమానము. ఇట్టి వారిచెంత సైతము నిర్దాక్షిణ్యముగా పేద, ధనిక భేదములేకుండ సుంకములువసూలు చేయు చట్టములను తనవృత్తి యందు ప్రతి నిత్యము అమలు చేయు వారిపట్ల పెరిగిన ఈ సడింపును ఈ విధమున బహిర్గతమొనర్చినాడు. చట్టమెంత నీచమైనదైనను సగర్వముగా నాటి ప్రభుత్వము అమలుచేయుట ఒక వి[illegible]ముగా బలిజేపల్లి కి కానవచ్చినది. ఇందు పాలకుల స్వార్థమ[illegible]ంటె ఒక చట్టముండి తీరవలెనను బెట్టిదము కొంచెమెచ్చెట్టుగా కనిపించును. దీనిని వ్యంగ్యోక్తిలో పలుచోట్ల బలిజేపల్లి ప్రకటించినాడు. ఆడిన మాట తప్పక చేసిన అప్పు తీర్చువాడు. పత్రములు సాక్ష్యములు లేకున్నను అవసానదశయందు సైతము భార్యా పుత్రులను పెట్టి చాకిరికై అమ్మి అప్పుతీర్చి, వారిపట్ల కనికరముదయయెన్ని ఉన్నను స్వామి ధర్మము పట్ల తానొక విధముగా ప్రవర్తింపరాదు గదా అను దయమాలిన కాఠిన్యమును వహించును. ఇట్టి చట్ట ధిక్కారమేకాని భార్యాపుత్రులను అమ్ముకొను వారిపట్ల యిట్టి కాఠిన్యమా అను ప్రశ్న తన్ను పీడించినది. అమ్మగా వచ్చిన కొద్ది రూకలు తన దారి బత్తెమునకు (T.A & D.A.) ఖర్చుకొందునను నక్షత్రకుని స్వార్థ పరత్వము నాటి ప్రభుత్వోద్యోగుల నీచస్థితికి ఒకబలమైన అధిక్షేపణ. (Satire) గా మనము గమనింపవలెను. తన ప్రభువు నీమదని తెలిసియు, నక్షత్రకుడు తన ప్రభువు న్నాజ్ఞప్రకారము ఇంత నిర్దాక్షిణ్యముగా ఋణము వసూలు చేయుచున్నందుకు తప్పు పట్ట వలదని హెచ్చరించు చుండును. ధర్మమేవజయతే - అను శ్రుతి వాక్యముక్కటియే బలిజేపల్లి కి కొండంతబలమునిచ్చినది. అయినను ఆధర్మము వేయి ముఖములుగా జాతిని పీడించుచున్న కాలమును చిత్రించుటకై కేంద్ర రంగము (Central Scene) గా స్వీకరించెను. దీనికి అటు పురాణము నుండియు, ఇటు తన జీవితమునుండియు. తన కాలపు దేశచరిత్ర నుండియు ముఖ్యమైన కొన్ని సన్నివేశములను నాటకమున చొప్పించెను. లేని అప్పులను తలకుమట్టుటలోను, పత్రములు సాక్ష్యములున్న అప్పులను ఎగవేయించుటలోను చెడిపోయినవారి ఇల్లు బళ్ళు అమ్మించుటలోను సిద్ధహస్తులగు తనకాలపు తన కార్యాలయపు సద్బ్రాహ్మణులు చేపట్టిన నీచ వృత్తులు అనగా కౌశికులుగా, భాగ్యవంతులుగా, నీచ బ్రాహ్మణులుగా చిత్రించి చంద్రమతి నమ్మించిన సందర్భమునందు అతి కఠినముగా విమర్శించెను.

భారతీయులెంత సత్యవంతులో అంత పొట్టకూటికి చెడినవారుగా ఆకాలమున సిగ్గుమాలిన బ్రతుకు సాగించుచుండిరి. విత్తమున్నచాలు వానికి ఊడిగము చేయుటకుసిద్ధపడెడివారు. ధర్మమును, సత్యమును రక్షించుకొను బాధ్యతమరచి పోయిరి. వచ్చిన కష్టమునకై ప్రాణ త్యాగము చేసి వారసుల రక్షించు ధర్మమును మఱచి భార్యా బిడ్డల నమ్ముకొను నీచస్థితికి దిగజారిరి. పరదేశ ప్రభుత్వము సైతము దీనిని ఈ సడించినది, నిరసించినది. పైగా ఒకనాడు నిషేధించినది. ఈ నిషేధము నొక చట్టరూపమున బ్రిటిష ప్రభుత్వము ప్రవేశపెట్టినది. స్త్రీలను పిల్లలను అమ్ముట నిషేదింపబడినది. క్రయవిక్రయములు చేయువారు శిక్షింపబడుదురని అట్టి క్రయపత్రములు రిజిష్టరు చేయరాదను చట్టము ప్రవేశపెట్టబడినది. ఈ సందర్భమే బలిజేపల్లిని కలచి వేసినది. తనజాతికి పట్టిన హీనస్థితి

వల్ల కాటియందుసైతము అబద్ధమాడి చేరెడు స్థలము కాధింపవలసిన హీనస్థితి గుర్తుకు వచ్చినది. **అకటా చేరెడు నేల కుంద గడె** అని శంకరకవి. బహిర్భూములకు, శ్మశానములకు కూడ కంచెల వేసి స్వార్థపరులు అవి తమవే అని అమ్ముకొనుచుండిరి. దేవ మాన్యములు మందబయళ్ళు అన్నియు దురాక్రమణ చేసి పరులకు విక్రయించి క్రయధనము నారగించు దుర్నీతిపరులను అట్టిచ వారలసేవలు చేయు దౌర్భాగ్యులను చీల్చి చెండాడు స్వభావము బలిజేపల్లిది. కాని దాన విక్రయ కనకాది యావత్పత్రములను రిజిష్టరు చేసి బ్రతుక వలసిన స్వధర్మము తనది. ఇట్టి సంకటములనుండి తప్పుకొనుటకై తన మనోధర్మమును సమర్థించుటకై పురాణ గ్రంథములందు లభించిన అమూల్య రత్నము వంటి చంద్రమతీ ఇప్పుడు నేనేమి. ఘోషింపవలెను. అని అడుగుట లో అతనికి విజ్ఞత పూజ్యమని కాదు. నోటమాటరాకయే. అందు కామెయిచ్చిన సమాధానము ప్రతినిత్యము క్రయ పత్రములందు వ్రాయు ఒక ముఖ్య పదబంధము నాథ! క్రయధనమున కమ్ముకొను వారెట్లో అట్లే వచింపుడని చంద్రమతి నమాధానము. ఈ పదములు ప్రతి నిత్యము ఉద్యోగములో చేతులరుగునట్లు రికార్డులలో వ్రాసినవే. వీనిని పాల్లవోకుండ నాటకమునందు చొప్పించినాడు.

Settlement of Debts నుగుఱించి ప్రతి తనఖా పత్రమునందును విశేషముగా కొనుచుండుట నాటి లేఖక ధర్మము. అప్పుతీర్చుటకు ఆధార భూతములగు ఆస్తులను అమ్ముపద్ధతులు కూడ అందు వివరించుచుందురు. ఈ వివరణలు దస్తావేజుల భాషలోనే నక్షత్రకునిచేత, కాలకౌశికునిచేత అనేక పర్యాయములు పలికించినాడు **ఎలీలన్ సవరింతు నా ఋణము** అని నిలదీసి అడుగుటలో మూడు సీస పద్యములు కేవలము ఋణ పత్రముల భాషలోరచింపబడినవి. జాతికి చీడపురుగులవలె ఆవరించిన దొంగసాక్షులనుగురించి సక్రమముగా వ్రాసిన పత్రములను సైతము తిరుగగొట్టగల దుష్టసమర్థులైన గ్రామ కరణములను గూర్చి కాశికాపురమున నిర్దాక్షిణ్యముగా స్త్రీలను, బిడ్డలను అమ్మిడబ్బు చేసికొనగల దురాత్ములను గుఱించి నక్షత్రక, కౌశిక, కేశవాది పాత్రలను సమర్థనీయముగా చిత్రించిరి. వ్యంగ్యము, కఠిన విమర్శను నవ్వులాట పంచాంగము వలె కాలకౌశికుడు కేశవుల పాటలలో మాటలలో చిత్రించెను. అప్పుబట్టి ధనము బరువు తూగెడు మాంసమును కోసియిమ్మని కోర్టు కెక్కిన (Shylock) షైలాక్ వంటి వడ్డీ వ్యాపారుని తన నాటకమున (**వెనీస్**వర్తకుడు) చిత్రించిన షేక్స్పియరును మరిపింపజేయుచు కఠినాత్ముడగు నక్షత్రకుని వంటి విశ్వామిత్ర శిష్యుని సృష్టించినాడు. ఈ పాత్ర అపూర్వ చిత్రణము. ఇదే పేరుగల తన నాటకమున వీరేశలింగము గారింత చక్కగా కూర్పలేకపోయిరి. ఇట్టెన్నో అనుభవ రహస్యములుదాగియున్న సత్య హరిశ్చంద్రీయనాటచకమునీ కవిదిద్ది తీర్చిన పద్ధతి **సభూతో నభవిష్యతి** ఈ కవి తన భావనాగ్ని చేత కరిగించి పరిశుద్ధము చేసి కల్పనా శక్తియను అచ్చులో అసామాన్యమూర్తి యగు హరిశ్చంద్ర చక్రవర్తిని మనకందించెను. **సత్య మేవజయతే** అని ధర్మవాక్యమునకు హరిశ్చంద్రుని ప్రత్యక్ష సాక్ష్యముగా, లక్ష్యముగా మన యెదుటనిలిపి అతనిపై భక్తి గౌరవములు పెంపొందింపజేసి మనము కూడ అట్లే ప్రవర్తింపవలెనన్న కోరికను సహజముగా మనలో పుట్టునట్లు చేయగలాడే నిజమైన కవి. సత్కావ్యములందు ఇట్టి యున్నతాశయములను ఆసలను ప్రేరేపించు శక్తి గలదు. ఇట్టి మహోన్నత ధర్మమును బలిజేపల్లి లక్ష్మీకాంతకవి సత్యహరిశ్చంద్రీయమున నిరూపించిరి. సత్య హరిశ్చంద్రీయ సృష్టిలో వారి ధార్మిక దృష్టి అక్షరాక్షరమున అభివ్యక్తమైనదనుట యదార్థము. ఇక వీరి దేశ భక్తి రచనలు వివిధ కావ్య పీఠికలు లఘుకృతులు మొదలగు వానిన గూర్చి తర్వాతి పరిచ్ఛేదములోపరిశీలింతము.

# చతుర్థపరిచ్ఛేదము

## (అ) లక్ష్మీకాంత కవి దేశభక్తి రచనలు

## (ఆ) బలిజేపల్లి వారి పీఠికలు - పరిశీలన

### బలిజేపల్లి దేశభక్తి రచనలు - ఒక పరిచయము

బలిజేపల్లి లక్ష్మీకాంతకవి జాతిపిత గాంధీ మహాత్ముని సారధ్యములో నిర్వహింపబడు స్వరాజ్యోద్యమముచే ప్రభావితులై స్వరాజ్య సమస్య అను ఖండకావ్యమును రచించిరి. [1] దేశభక్తి కవితాశక్తి రెండును ప్రోది చేసి కొన్న లక్ష్మీకాంతముగారి కావ్యములలో స్వరాజ్యోద్యమము, దాని తత్వము, ప్రచారము లోకమాన్య బాల గంగాధర్ తిలక్ గారు గావించిన సేవ, గాంధీగారి నాయకత్వము మహత్తరముగ చిత్రింపబడినవి. మరణశయ్యనున్న తిలక్‌గారి ఆశీర్వాదమును గ్రహించివారి ఆశయములను ఆదర్శ ప్రాయముగ ఆచరించుటకై మహాత్మ గాంధీ 1920,సెప్టెంబరు నుండి స్వరాజ్య మహోద్యమమునకు నాయకత్వము వహించిరి. నాటి నుండియే గాంధీయుగ మవతరించినదని అట్టి స్వరాజ్య రథము నకు సర్వసమర్థుడైన సారధి మహాత్ముడేయని బలిజేపల్లివారు [2] **తరిగాంధీ యుగమేగుదెంచె నికనేతత్భారతీయ స్వరాజ్యా రథంబీతని సారథిత్వమునసే సాగింపుడంచున్ జగద్గురుడేగెన్ దివిలోకమాన్యుడు** అను పద్యమున లోకమాన్యుని అభిప్రాయమును తెల్పిరి. ఈసందర్భమున కవి భారతీయ ప్రజలను తద్దివ్యరథమును లాగుటకు రండు అనిఆహ్వానించుట లక్ష్మీకాంత కవి దేశభక్తిని, వారికి గాంధీమహాత్మునిపైగల ప్రగాఢాభిమానమును ధ్రువీకరించుచున్నది. [3] సాక్షాన్నారాయణమూర్తియే మరల గాంధీ స్వరూపమ్ముగైకొన్న వాడని, ఆ జగదేక నాయకునివాక్కుల్ వేదములు కావున గాంధీజీ మాటలను పాటించి స్వాతంత్ర్యసమరమునకు సన్నద్ధులు కండని విద్యార్థులకు ఉద్బోధించిన విధానము గాంధీమహాత్ముని నేతృత్వముపై కవికిగల ప్రగాఢ ప్రత్యయముప్రస్ఫుటీకరించుచున్నది. గాంధీజీ స్వాతంత్ర్యోద్యమము కేవలము రాజకీయ సమరము కాదని అది వారి సత్యాన్వేషణలో ఒక భాగమై చిరంతనమైన ఒకపరా విద్యకై సాగించు నిరంతర సాధనమైనదని మనము గ్రహింపవలసి ఉన్నది.

గాంధీజీగారి సత్యసంధతకు, స్వరాజ్య సాధనకు బాల్యమున అతడు పలుమారులు చూచిన హరిశ్చంద్ర నాటకమే కారణము. [4] **మాటకోసం రాజ్యాన్నీ, భార్యనూ, బిడ్డనూ కోల్పోయి కాటి కాపరిగా పనిచేసిన సత్యహరిశ్చంద్రుడి పాత్ర గాంధీజీ మనోఫలకం మీద చెరగని ముద్రవేసింది. ఆ తరువాత భవిష్యత్తులో స్వాతంత్ర్య సమరపోరాటంలో గాంధీజీమీద సత్య హరిశ్చంద్ర పాత్ర ప్రభావం పడడమొక చిత్రంగా చెప్పుకోవచ్చు. మనకు స్వాతంత్ర్యం యిప్పించడానికి బ్రిటీష్ దాస్య శృంఖలాల నుంచి విముక్తుల్ని చేయడానికి ఆయన తన ఆస్తిపాస్తుల్ని కుటుంబాన్ని వదలిపెట్టాడు.**

పరదాస్య శృంఖలాబద్ధులై పరమ దారిద్ర్యముతో పరితపించు భారతీయుల దౌర్భాగ్యమునకు ప్రచలితుడై గాంధీ స్వరాజ్యోద్యమమునకు పూనుకొని సత్యాహింసలే సమరాయుధములుగ సాధించిన స్వాతంత్ర్య లక్ష్మిని బలిజేపల్లివారు ఆత్మబలి అను ఖండికలో - **పాడవోయి కుమార! విశ్వప్రపంచ తారకజ్యోతి శాంతి స్వతంత్రగీతి** అని మహోన్నతముగ ప్రబోధమొనర్చిరి. మహాత్ముని స్వరాజ్య సాధనలో సత్యహరిశ్చంద్ర నాటక ప్రభావమెంత మహితమో, తన సత్య హరిశ్చంద్రీయ నాటక రచనకును మహాత్ముని ప్రభావమంతగ బలిజేపల్లివారిపై అంతరాంతరములలో ముద్రవేసి యుండునని మనమూహింపవచ్చును. పరదాస్యమున పరమనికృష్టముగ క్రుగ్గుచున్న సత్యసంధులు, సర్వస్వతంత్రులై శాంతి, సౌఖ్యములను చూరగొనవలెనని సత్యహరిశ్చంద్రీయ కథలోని అంతరార్థము. అనగా ఇదిపైకి పౌరాణిక గ్రంథమైనను ప్రస్తుతము జాతీయోద్యమ ప్రభావము పుణికి

పుచ్చుకొన్న గాంధీమహాత్ముని జీవిత లక్ష్యమును పరోక్షముగ ప్రకటించుచున్నది.

గాంధీ మహాత్ముని స్వాతంత్ర్యోద్యమ రంగములో ఎందరెందరో ఆంధ్ర దేశనాయకులేగాక మహాకవులు కూడ ముందుకురికిరి. సహాయ నిరాకరణోద్యమము, విదేశీవస్తు బహిష్కారము, పన్నుల నిరాకరణ మొదలగునవి ముమ్మరముగా ఆంధ్రదేశములో సాగినవి. గరిమెళ్ళ సత్యనారాయణగారి **మాకొద్దీ తెల్లదొరతనమన్న** గేయము, ప్రజలలో జాతీయ భావచైతన్యమును కల్గించినది. శకునాడు జాతీయ మహాకవియైన దామరాజు పుండరీకాక్షయ్య గారి **పాంచాల పరాభవం, స్వారాజ్య సోపానము, గాంధీవిజయము**వంటి నాటకములను ప్రదర్శింపనీయకుండ ప్రభుత్వమెన్నో కట్టుదిట్టములను గావించినది. జాతీయతయే తనయూపిరి అయిన పుండరీకాక్షయ్యగారు ఒక నాటకమును నిషేధింపగనే వెంటనే మరియొక నాటకమును రచించి ఆంధ్ర ప్రజలలో అద్వితీయ జాతీయచైతన్యమును కలిగించిరి. పుండరీకాక్షయ్యను చెఱసాలలో ఉంచిరి. కానివారి నాటకప్రదర్శనలు రహస్యముగా జరిగెడివట. ఈ సందర్భముననే శ్రీ బలిజేపల్లి లక్ష్మీకాంతం స్వరాజ్యరథం వంటి ఖండ కావ్యాలు వ్రాసిరి. నాటి స్వాతంత్ర్యోద్యమములో కొండా, ఉన్నమొదలయిన దేశభక్తులు, బలిజేపల్లిగరిమెళ్ళవంటి మహాకవులు పాల్గొని కారాగార బద్ధులైన సందర్భమును జాషువా కవి **నాకథ** ద్వితీయ భాగములో కరుణరసాత్మకముగా **కొండాయున్నవ దేశభక్తులగు త్యాగుల్ వీర సత్యాగ్రహోద్దండుండైన తెలుంగుకేసరియు, సీతారామ శాస్త్రాది పేదండంబుల్ చెరసాల బద్ధులయి స్వాతంత్ర్యార్థమై పోవుచో గుండెల్ నీరయి దుఃఖపడ్డయవి దిక్కుల్ గ్రుక్కిళుల్ మ్రింగుచున్** అని తెలిపిరి. **బలిజేపల్లి కవీంద్రుని బలిమింబంధించిరతడు వ్రాసిన కృతికిన్ వలవల యేడ్చెనతండిక విలిఖింప నటంచు, కవులు భీరువులు గదా! అదిగనిసేవ్రాసిన కృతి పదిలంబుగ జేబులోన భద్రపరచితిన్ పదుగురిలో జదివిన నాపద వచ్చునటంచు హితులు భయముం గొలుపన్** అను మూడు పద్యములలో నాటి సన్నివేశము నేటికి మన కన్నులముందు మెదలునట్లు చిత్రించిరి. గాంధీమహాత్ముడు ఆంధ్రదేశమును పర్యటించి గుంటూరులో సభ జరిపినపుడు బలిజేపల్లివారు గాంధీ మహాత్ముని గూర్చి వ్రాసిన పద్యములు ప్రస్తుతము లభ్యము కాకపోవుట శోచనీయము. పోలీసు లప్పటికప్పుడే ఆ పద్యములను కవి నుండే లాగుకొని పారవేసియుందురేమో! పై సంఘటనమునే హేమలతా లవణము **మానాన్నగారు** అను పుస్తకములో ఈక్రింది విధముగ తెలిపిరి.

**స్వాతంత్ర్యోద్యమ సమయంలో గాంధీజీ ఆంధ్రదేశం పర్యటించారు. అప్పుడు గుంటూరులో గాంధీజీ సభ జరిగినప్పుడు బలిజేపల్లి లక్ష్మీకాంతం గారు తాము గాంధీజీ మీద వ్రాసిన పద్యాలు చదివారు. ఆయనను పోలీసులు అరెస్ట్ చేశారు. నాన్నగారు కూడా తాను వ్రాసిన పద్యాలు చదవాలనే ఉత్సుకత, ఉద్రేకంతో వచ్చి బలిజేపల్లి అరెస్ట్ అయిన విషయం విని స్నేహితుల సలహాపై పద్యాలు చదవకయే తప్పుకున్నారట. కవులు భీరువులు గదా అంటారు నాన్నగారు.**

గాంధీ మహాత్ముని గూర్చి బలిజేపల్లివారు వ్రాసిన పద్యములు ప్రస్తుతము లభింపనట్లే వీరి స్వరాజ్యరథమను పద్య ఖండికయు ఇప్పటి వరకు లభింపకున్నది. స్వరాజ్య రథోత్సవమను పేరనేది అభినవ సరస్వతి పత్రికలో 1921 సం॥లో ముద్రితమైనట్లు వ్యాసరచనల సూచి వలన తెలియుచున్నది. ఆంధ్రప్రదేశ్ దర్శిని తెలుగు వెలుగులు 1175 పుటలో, మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి గారి నటరత్నాలు 356 పుటలో, విజ్ఞాన సర్వస్వము 4వ సంపుటము 1047 పుటలో స్వరాజ్య సమస్య గ్రంథ ప్రసక్తి కలదు. స్వరాజ్య రథమను గూర్చి ప్రస్తావన కానరాదు. కానీ డా॥ సి.నా.రె గారి ఆధునిక కవిత్వము- ప్రయోగములు- సంప్రదాయములు అను సిద్ధాంత వ్యాస గ్రంథములో బలిజేపల్లి లక్ష్మీకాంతంగారి స్వరాజ్య రథము, స్వరాజ్య సమస్య అను ఖండ కావ్యములు బాలగంగాధర్ తిలక్, గాంధీ మున్నగు దేశ నాయకులు నడచిన స్వరాజ్యోద్యమము ప్రభావముతో వచ్చినవే అని స్వరాజ్యము, జాతీయోద్యమమును గూర్చి ప్రచారస్థాయిలో వ్రాసిన కవులు- వారి కృతులు తలమ

సందర్భమున ఉట్టంకించిరి.

ఆంధ్ర కవులు-దేశ స్వాతంత్ర్యము అను వ్యాసమున డా॥ దివాకర్ల వేంకటావధానిగారు గరిమెళ్ళ, బలిజేపల్లివారి ప్రసక్తిని తెలుపుచు ఆంధ్ర జనులందరిలో జాతీయ భావమును రగుల్కొల్పిన ఇంత శక్తిమంతమైన రచన మరియొకటిలేదు. తరువాత వెలువడిన జాతీయ రచనలలో శ్రీ బలిజేపల్లి లక్ష్మీకాంతంగారి స్వరాజ్య రథము మొదలగునవి పేర్కొనదగినవి అని వివరించిరి. ఇట స్వరాజ్య రథము ప్రసక్తియే కలదుకాని స్వరాజ్య సమస్య ప్రస్తావన లేదు. తెలుగు సాహిత్యము తీరు తెన్నులు అను గ్రంథములో శ్రీ గొట్టిపాటి వెంకటసుబ్బయ్య గారు పై చెప్పిన దివాకర్లగారి అభిప్రాయమునే మా కొద్దీ తెల్లదొరతనమన్న పాట దేశములో ఎంతో ఉద్బోధ, ఉద్రేకము కల్గించినది. అది కేవలము జానపద సాహిత్యము లోకి పోయినది. స్వరాజ్య రథము, స్వరాజ్య సమస్య అనే బలిజేపల్లి వారిఖండ కావ్యాలు దేశభక్తిని పురికొల్పినవి అని వివరించిరి. కేవలము దివాకర్లవారు స్వరాజ్యరథమును మాత్రమే పేర్కొనగా వీరు ఆ గ్రంథముతోపాటు స్వరాజ్య సమస్యను కూడ నిట నుట్టంకించిరి. ఆచార్య కాకర్ల వెంకటరామ నరసింహ (కె.వి. ఆర్. నరసింహం) గారు ఆధునికాంధ్ర కవితా సమీక్ష అను గ్రంథములో బలిజేపల్లివారి జాతీయోద్యమ కవిత్వమును గూర్చి ఈవిధముగ సమీక్షించిరి.

శ్రీ బలిజేపల్లి లక్ష్మీకాంతముగారు స్వరాజ్య రథము, స్వరాజ్య సమస్య అను రెండు ఖండ కావ్యములను రచించిరి. వీనిలో స్వరాజ్యోద్యమము సవిస్తరముగా వర్ణింపబడియున్నది. మరియు తిలక్ మహాశయుని దేశభక్తి యుగ్గడింపబడియున్నది. మహాత్ముని సహాయ నిరాకరణోద్యమము వినుతింపబడినది. కానీ ఈ ఖండకావ్యములు కాల్పనిక మార్గమున రచింపబడినవి కావు. అంత మాత్రమున వాని ప్రశస్తి కెట్టి లోపము లేదు. కాని ప్రస్తుతమవి మనకుపయుక్తములు కావు.
డా॥ కె.వి. ఆర్. నరసింహంగారు బలిజేపల్లివారి స్వరాజ్య సమస్య అను ఖండ కావ్యమునగల ముఖ్యాంశములు తెలుపుచు అవి కాల్పనిక మార్గమున రచింపబడినవి కావని ప్రస్తుతమవి మనకుపయుక్తములు కావని సమీక్షించిరి.

బలిజేపల్లి వారు గతవైభవ స్మృతియందు ప్రస్తుత స్థితిగతులను కూడ అనుసంధించి నాటికి, నేటికిగల వ్యత్యాసమును పాఠకులు అంతర్ముఖముగ ఊహించునట్లు భూత వర్తమానముల సామ్య వైషమ్యములను సమరస భరితముగా రసస్ఫురితముగా ప్రకటించిరి. జరిగిపోయిన విషయములను వర్తమాన యుగమున తలచిన ఫలమేమి అను దృక్పథముతో కె.వి. ఆర్. నరసింహంగారు భూతమును నిరసించి వర్తమానమును మాత్రమే గ్రహింపవలెనని ఆశించిరి. గత కాలము మేలు వచ్చుకాలము కంటెన్ అను నన్నయ్య గారి సూక్తిని పురస్కరించుకొని అపూర్వమైన పూర్వ వైభవమును తప్పక భావి పురోభివృద్ధిగోరువారు భావించి తరింపవలసియున్నది. కేవలము వర్తమానమునే నమ్మి ప్రాకులాడుట భావి పురోగతి సూచకము కాదు. పురోభివృద్ధిని కోరువారు పూర్వ వృత్తాంతమును మరువరాదు. అను మలయాళ స్వామివారి సూక్తి సర్వదా ప్రత్యక్షర ప్రత్యక్ష సత్యము. గతవైభవ స్మృతిని ఆధునికులు పరిహసింతురు. కాని అది సరియైన ధోరణి కాదని నా యభిప్రాయము. అట్లే కాల్పనిక మార్గమున కవిత లేనంత మాత్రమున అది వర్జింపదగినదియు కాదు. జాతీయోద్యమ ప్రభావము నాటి దేశ నాయకులు - ప్రజలు పడిన పాట్లు కన్నులకు కట్టినట్లు దయనీయముగ చిత్రింపంబడిన కృతి ప్రశస్తిని వారి మాటలలోనే ఎట్టిలోపము లేదనవలసియున్నది. ప్రాత రోతయేకాదుస నిజము హిరణ్యసమము. ప్రాతను నిరసించు పక్షమున పూర్వ ప్రబంధములు అట్లే సమస్త ప్రాచీన వాఙ్మయము వ్యర్థమే అగును. కాలానుగుణముగ కవితా స్వరూపముమారి తీరవలసినదే. దానినెవ్వరును కాదన లేరు. అది సహజము. కాని మంచి గతమున కొంచమే అని తలచి గతమునందలి మంచిపెద్దల పరామర్శించి ముందుకుసాగుట మన యందఱ కర్తవ్యము.

గాంధీగారి ప్రభావము ఆంధ్రకవులపై ప్రగాఢముగ ప్రసరించినది. గాంధీ తత్త్వము ఆంధ్ర

కవిత్వములో విభిన్న కోణములలో విస్తరించి జాతీయోద్యమ వికాసమునెత్తిపినది. దాస్య శృంఖల విచ్ఛేదముచే కలుగు శాంతి సౌఖ్యముల యధార్థ తత్త్వము ధర్మ నిష్ఠలో గలిపినది. ఎందరో మహాకవులకు స్వరాజ్య సమస్య మహోజ్జ్వల కవితా నిర్మాణ సాధనమైనది. జాతీయ భావముతో నిండి పొంగారు గుండెల నుండి దేశభక్తి ప్రపూర్ణములగు కవితల జల్లులు రసనిర్ఝరములై ప్రవహించినవి. స్వరాజ్యమే నా జన్మహక్కని ప్రకటించిన లోకమాన్య బాల గంగాధర తిలక్ మహాశయుని నినాదమును గాంధీ మహాత్ముడు ఎంతో సామరస్యముతో సత్యాహింసలనే సాధనములుగా స్వాతంత్ర్యమున అనుసంధించిన పైనము పలువుర కవుల కావ్యములలో రసోజ్జ్వలముగా ప్రకటితమైనది. గాంధీ మహాత్ముని నొకవ్యక్తిగా కాక మహోద్యమ స్ఫూర్తిగల శక్తిగ పలువురు కవులు అభివర్ణించిరి. ఆయన చేపట్టినరాటము పోరాటమునకు సంకేతమైనది. పలువురు కవులు రాటమునే కవితా వస్తువుగ స్వీకరించి ఎన్నోపాటలు, పద్యములల్లి గానమొనరించిరి. నవ్య సాహిత్యముపై స్వాతంత్ర్యోద్యమ ప్రభావము మిక్కుటముగా నున్నది. **గాంధీని, రాట్నాన్ని, స్వరాజ్యాన్ని వస్తువులుగా స్వీకరించి జాతీయ భావాలు పెల్లుబికినట్లు రచించిన కవులున్నారు. బలిజేపల్లి, మాధవపెద్ది సుందర రామశాస్త్రి, దుగ్గిరాల బలరామకృష్ణయ్య, మందిపూడి పురుషోత్తమ శర్మ పేర్కొన దగ్గవారిలో కొందరు.** అని డా॥ఎన్. గంగప్ప తమ రేడియో ప్రసంగములలో తెల్పిరి.

జాతీయోద్యమమునకు మూలస్తంభమయి జాతిపితగా కీర్తి గడించిన గాంధీతత్త్వము ఆంధ్రకవిత్వములో ప్రతిఫలించిన విధమును డా॥వి. అంకయ్య తమ సిద్ధాంత వ్యాసమున తెలిపిరి. ప్రత్యేకించి బలిజేపల్లివారి స్వరాజ్య సమస్య అను కావ్యములో దేశరాజకీయ పరిస్థితులను ప్రజలకు, విద్యార్థులకు వివరించి కార్యోన్ముఖులను గావించిన సరణిని చక్కగా సమీక్షించిరి. ప్రప్రథమముగ ప్రాచీన భారతీయ మహోత్కృష్ట దశను తెలిపి, పిదప గాంధీ మహాత్ముని సిద్ధాంతములను

**శమము దమము నహింసయు సత్య దీక్ష**
**నరయ నాజన్మ సంప్రదాయంబు లెచట**
**నెచటి నృపులేల ప్రజయపమ్మతి యెఱుంగ**
**దట్టి భారత ధాత్రి పుణ్యప్రదాత్రి-** అను పద్య భావమును భారతజాతి విశిష్టతతో సమన్వయించి బలిజేపల్లివారు అభివర్ణించినట్లు వివరించిరి. బ్రిటీష్‌వారు రాజకీయ దుస్తంత్రములతో భారతదేశమును చేజిక్కించుకొని చేతివృత్తుల మాపి ప్రజల నిరుద్యోగులుగా, కడు పేదలుగా మార్చి నారని ప్రజలను హెచ్చరించినట్లు తెలిపిరి. **చేతి పనులెల్ల మిల్లుల చేతసాగు..... కఱవు మనకి య్యొబరులకు కాలమయ్యె** అనునదిపై సందర్భమున నుదాహరించిన పద్యము. సంపూర్ణ నిర్నిరోధ స్వరాజ్య, పీఠికా సుప్రతిష్ఠలభించువరకు, తగునె నిద్రింప భరత పుత్రకున కిపుడు అని అందరను మేల్కొల్పిన వైతాళికుడుగా బలిజేపల్లివారు ప్రబోధగీతిక నాలాపించిరి. ముఖ్యముగా ఆంధ్ర విద్యార్థులలో పౌరుషాగ్నిరగుల్కొల్పి సమరసన్నద్ధులు కండని భుజము తట్టి ధైర్యము చెప్పి పంపించిన విధము ప్రశంసార్హము. **యతో ధర్మస్తతో** జయః అను పరమార్థమునకు ప్రతీకగా అహింసా ధర్మ సంబద్ధమౌ మన ఆధ్యాత్మిక శక్తియే భువిన ధర్మంబెల్లమాయించెడి నని గాంధీదేవుని శాంతి సమర విశిష్టతను కవి కొనియాడిరి. భారతీయ స్వరాజ్యోద్యమ చరిత్రను సంగ్రహముగా, సవిమర్శకముగా సందర్భ శుద్ధితో తెలిపి భారతీయ ప్రజలనెల్ల స్వరాజ్యరథమును లాగుటకు సంసిద్ధుల గావించిన బలిజేపల్లి కవిశేఖరుని దేశభక్తిని డా॥ వి. అంకయ్యగారు తమ సిద్ధాంత వ్యాసములో సందర్భాను సారముగా నుట్టంకించిరి.

బలిజేపల్లి లక్ష్మీకాంతంగారు కేవలము కవిత్వమున దేశభక్తిని ప్రకటించుటయేకాక ఉప్పు సత్యాగ్రహమువంటి ఉద్యమములలో పాల్గొని కారాగారవాసమనుభవించిరి. వీరి దేశభక్తి రచనలలో భావావేశము పెల్లుబికి పరువళ్ళు త్రొక్కినది. గాంధీ గారిపై వీరికి గల ఎనలేని గౌరవాభిమానములు స్వరాజ్యోద్యమముతో పెనవేసికొని కమనీయ కవితారూపమున భావ వాహినులు రసనిర్ఝరములై

జాలువారినవి. రససిద్ధి నందుకొన్న వీరి కవితా హృదయము జాతీయ భావ ప్రపూర్ణమై జాతిజాగృతినుద్దేశించి ప్రబోధామృతమును వర్షించినది. బలిజేపల్లివారు సత్యజగత్తును స్థాపించు గాంధీమహాత్ముడు ధర్మ సంస్థాపనార్థమై యవతరించెనని అతని అడుగుజాడలలో పయనించు సర్వమానవాళికి శాంతి, సౌఖ్యములు సమకూరునని భావించిరి. గాంధీ మహాత్ముని లక్ష్యముధర్మ ప్రతిష్ఠాకరమని ధర్మబుద్ధిగల (ధార్మిక దృక్పథము) బలిజేపల్లివారు పరిపూర్ణముగా విశ్వసించిరి. జాతిపిత మహాత్మగాంధీగారి అకుంఠిత దీక్ష బలిజేపల్లివారిని ఎంతో ఆకట్టుకున్నది. కావుననే వీరు స్వరాజ్యసమస్య, ఆత్మబలి, పాంచాల పరాభవమువంటి ఖండ కావ్యములను వెలయించిరి. స్వరాజ్యోద్యమమునకు గాంధీమహాత్ముని ధ్యేయమునకు గల అనుబంధమును ఎంతో సామరస్యముతో స్వారస్యము, సౌమనస్యము వెల్లి విరియునట్లు స్వరాజ్య సమస్య అను ఖండకావ్యము నందావిష్కరించిరి. ప్రస్తుతము స్వరాజ్య సమస్యయందుగల విషయము అందలి విశేషములెట్టివో పరిశీలింతము.

## దేశభక్తి రచనలు - బలిజేపల్లి దేశభక్తి - స్వరాజ్య సమస్య

బలిజేపల్లి లక్ష్మీకాంతముగారు గాంధీ గారిచే ప్రభావితులై దేశ స్వాతంత్ర్యము కొరకు పాటుపడిరి. ఉప్పుసత్యాగ్రహము వంటి ఉద్యమములలో పాల్గొని కారాగారవాస శిక్షను కూడ అనుభవించిరి. స్వరాజ్యమును సాధించుటయే నాటి దేశభక్తులలో ప్రధాన సమస్య అయినది. అట్టిసమస్యా పరిష్కారమునకు ప్రతి పౌరుడును ముందంజవేసి స్వాతంత్ర్యమును సముపార్జింప వలసియున్నదని నాయకులు ప్రబోధించిరి. అట్టి ప్రబోధమును విని ప్రభావితులైన వారిలో కవులు కూడ కొందరు లేకపోలేదు. నాటి కవులలో బలిజేపల్లి లక్ష్మీకాంతముగారు ప్రశంసార్హులు. వారు స్వరాజ్య సమస్య, స్వరాజ్యరథము, ఆత్మబలి (స్వాతంత్ర్య సమరము) రక్తాభిషేకము వంటిపేర్లతో అనేక దేశభక్తి ప్రపూరిత రచనలు గావించిరి. మహాత్మగాంధీ గుంటూరునకు విచ్చేసినపుడు వారికిస్వాగత పద్యములను రచించి పఠింపబోగా నాటి ప్రభుత్వ రక్షక భటులు వారిని పట్టి కొట్టిరని ప్రత్యక్షముగాచూచిన జాషువా కవిగారు నాకథ అను స్వీయ చరిత్రలో నొక కంద పద్యమున నుట్టంకించిరి. ముగ్గురు మరాఠీలు వంటి చలన చిత్రములలోను వీరు సమయ సముచితముగ, సందర్భ శుద్ధితో రాట్నప్రసక్తిని కల్పించి రాటమును పోరాటమునకు సంకేతముగా తెల్పిరి. స్వాతంత్ర్యసము పార్జనకై సాగించెడి పోరాటములో రాట(ట్న)ము ప్రముఖపాత్ర వహించిగాంధీగారి స్వదేశీ ఉద్యమ మునకు ప్రసిద్ధి కెక్కినది. జాతీయ భావము, గాంధీగారి ప్రభావము రెండును తన భావములో ప్రగాఢముగాముద్రవేసి నందువలననే బలిజేపల్లి లక్ష్మీకాంతంకవిగారు స్వరాజ్యసమస్య వంటి ఖండ కావ్యమును రచించిరి.

**భరతమాత స్వరూపాభివర్ణన:-** స్వరాజ్య సమస్యలో 29 సీసములు, 25 మత్తేభములు, 12 శార్దూలములు, 12 చంపకములు, 7 గీత పద్యములు, కంద పద్యములు రెండు కలవు. మొట్టమొదటి సీసమున భరతమాత స్వరూపము అభివర్ణింపబడినది. సకల రత్న ప్రభలతో ప్రకాశించు హిమవత్పర్వతము ఆమెకు ఆతపత్రముగా సింధూ, బాగీరథీ నదీమ తల్లులు వీచీ చామరములు వీచువారుగా తూర్పు పడమరల నొప్పు గంభీర సముద్రములు కైవారములను కావించువారుగా, ఉదాత్తానుదాత్త స్వరములతో స్వస్తి వాచకములు పలుకు వార్ణ సంతతిగా, ముప్పదిమూడు కోట్ల ప్రజలు సమతమమత కలిగి ఆమె ఆజ్ఞలను శిరసావహించు ముద్దుకుమారులుగా సింహళ ద్వీప పీఠికాసనాసీనయైన భరతమాత కరుణలో జగమేలుగాకయని భారతదేశము యొక్కఎల్లలను కొల్లలుగా ఆమె కురిపించు రత్నరాసులను, ముప్పది మూడు కోట్లపిల్లలను ఆమె పాలించు విధమును సర్వేజనాస్సుఖినో భవంతు అను ధ్యేయములో నిరంతరము మంత్రద్రష్టలైవైదికమత ప్రాముఖ్యమును ప్రకటించు మహర్షుల దివ్యాశీస్సులను బలిజేపల్లి వారు ఎంతో చక్కగా వక్కాణించిరి.

**ఆంధ్రమాతృస్తవము:-** వెంటనే రెండవ సీసమున ఆంధ్రమాతృస్వతవము గావించిరి. గౌతమీ, కృష్ణవేణీ, తుంగభద్రాదినదీ జీవనమును ఉగ్గుపాలుగా త్రాగి నన్నపార్యాది కవిత్రయముచే మెల్లమెల్లగా

మాటలునేర్చి, ఆంధ్రరాష్ట్ర స్థాపనాచార్యుడైన విష్ణువర్ధనుని భుజాపీఠమెక్కి ఆంధ్రసేవా పరాయణులగు కృష్ణరాయాది భూపతులచే సకల సంపదలు పొంది, పెక్కుమంది సుతులను కడుపు చల్లగాగని, ఇట్టి పరాక్రమ తేజఃప్రభావధనుల అసమాన మహోన్నతితో నెగడు ఆంధ్రమాతకు బలిజేపల్లి గారు నమస్కారము ఘటించిన తీరు ప్రశంసార్హము. ఆంధ్రదేశమునందలి ప్రసిద్ధ జీవనదులు, నన్నపార్యాది మహాకవులు, ఆంధ్ర సామ్రాజ్య స్థాపకుడగు విష్ణువర్ధనుడు, ఆంధ్రభోజుని వంటి ప్రసిద్ధ ప్రభువులు ప్రస్తుత పద్యమున ప్రశంసింపబడిన పద్ధతి శైశవము నుండి ప్రౌఢ, నిర్భర వయః పరిపాకముతో ప్రవర్ధమానమగు మానవ జీవన వికాసమును స్ఫురణకు తెచ్చుచున్నది. ప్రకృతి సహజముగా ప్రవహించు నదుల జలమును ఉగ్గుపాలతో నుపమింపజేయుట అట్లే ఆంధ్ర సారస్వత నిర్మాణమునకు ఆద్యులైన కవిత్రయము వారి పలుకులు అప్పుడప్పుడే మాటలు నేర్చుకొను బాలుని ముందు ఆలాపింపజేసిన విధము ఆ బాలుడే క్రమముగా తన తండ్రి భుజాపీఠమునెక్కు విధమును విష్ణువర్ధనుని యందు ధ్వనింపజేసిన తీరు ఆంధ్రదేశమునకు స్వర్ణయుగమను ఖ్యాతిని కలిగించిన సాహితీ సమరాంగణ సార్వభౌముడగు శ్రీకృష్ణదేవరాయలవంటి ప్రభువుల లాలనలో పాలనలో ఆంధ్ర ప్రజలు క్రమ పరిణామ వికాసమును సాధించిన సరణిని బలిజేపల్లివారు ఎంతో అర్థవంతముగా, ఔచిత్య స్ఫూర్తితో, రస భరితముగా ప్రకటించిరి. మొదట భరతఖండమును పిమ్మట ఆంధ్రదేశమును అభివర్ణించి అటుపై ప్రాచీన భరత వర్ష ప్రశంసను వివిధ పద్యములలో వివరించిరి.

**ప్రాచీన భరత వర్ష ప్రశంస**: - ఈ భరతవర్షము విశ్వప్రపంచ విజ్ఞాన ఫలము నొసగు వేద కల్పమునకు ఆలవాలము. సంకల్ప మాత్రముచే సమస్త జగత్తును నిర్మింప సమర్థులైన తపోధనులకు ఆశ్రమస్థలము. సత్య రక్షా దిద్రృక్షా దీక్షితులగు హరిశ్చంద్రాది ప్రభువులేలిన యజ్ఞభూమి. పరశురామ, ద్రోణ, పాండవేయాది వీరులనుగన్న వీరభూమి. గంగా తరంగములచే సమస్తమానవకోటి పాపపంకమును ప్రక్షాళన మొనర్చిన పవిత్ర స్థలము. శంకరుల వంటి మతాచార్యులను కన్న జన్మభూమి. పుణ్యప్రదాత్రి అయిన భరతధాత్రిని మించినది మరియొకటి లేదు. మన మహర్షులు చిలుకల చేతకూడా సామగానమును పలికించిరి. సృష్టికి ప్రతిసృష్టియొనర్చిరి. సకల లౌకికమును విజ్ఞానదృష్టితో యోగి జనులు పరికించిరి. జరామృతి వ్యాధి రహిత తేజస్సుతో సిద్ధులు కాగలగిరి. శమ, దమములు, సత్యా హింసలు, తమ సంప్రదాయములుగా చేపట్టిరి. ఇక నిందలి రాజుల పరిపాలనలో అప మృత్యువు లుండెడివి కావు. ఈ భరతవర్షము వియన్నదీ తీర్థములచే, సాధ్వీచరిత్రములచే ప్రపూతమైనది. మణులచే, మహనీయ రాడ్గుణమణులచే ప్రఖ్యాతమైనది. మహోన్నత హిమగిరీంద్రములచే పండిత కవీంద్ర భావములచే ప్రభూతమైనది. సరసీతతులచే జాతి కవిత్వ వాఙ్మయముచే సరసోదరమైనది. మృతి చెందిన పతిని బ్రతికించుకున్న సావిత్రినీతి, బాలికలకు ఉగ్గుపాలతో రంగరింపబడినది. ఈ భరతదేశమున సముచిత్తులు, శమదమ స్వాంతులు, యజ్ఞకల్పనిరతులు, పరాక్రమ కళాగంభీరులు, ఆత్మ రక్షణ పరాయణులు, వర్ణాశ్రమ ధర్మసంరక్షకులునగు మాంధాత్రాది మహీశ్వరులు పరిపాలించిరి. శిబి ప్రభృతి ప్రభువులు, రామాది రాజవరేణ్యులు ప్రజాహిత క్రమగతితో శాసించి సంఘ వ్యవస్థాచారముల నుద్ధరించి పాల్యపాలకులలో అన్యోన్యమైత్రి వర్ధిల్లునట్లు వర్తించిరి. నెలకు మూడు వానలు కురియగ దేశము సస్యశ్యామలమై కరువులు కాటకములు లేకుండ ప్రవర్తించినది. ఈతి బాధలు లేకుండ ఎంతో నీతిమంతముగా నిత్యము శాంత స్వాంత ధర్మ తత్పర చింతనతో ప్రజలు సుఖించిరి. ఆదర్శప్రాయమైన ప్రాజ్య సామ్రాజ్యవైభవముతో నానాకళావిజ్ఞాన వేత్తలైన ఆచార్యులతో అన్యదేశ ప్రజా యత్నసాధ్యము కాని కార్మిక పరిశ్రమలతో క్రీస్తుకు పూర్వము ఆఱువేల యేండ్లకు మునుపే నాగరికతా గ్రగణ్యమైనదిగా ప్రశస్తికెక్కినది. నాటి భారతభాగ్యము ఈనాడు కలగా అనిపించు నేమో అని కవి పూర్వవైభవమును తలచి నేటి పరిస్థితికి వగచినాడు. నేటికిని జీవనదులకు కొదువలేదు. నానారత్న నిలయ ఖనులకు కొరతలేదు. వివిధ వృక్షవిలసిత వితానములకు ముక్కారు పండు పంటలకు లోటులేదు. శమదమములు దయాస్పద హృదయములుగల ముని వాటికలకు భాగ్యైక భోగ్యములు

గల నగరములకు కరువులేదు. పావన స్వేచ్ఛగల కృషీవలుల నానా పరిశ్రములగు జనులుగల యీ భరత భూమియందు అన్నింటిని మించి భౌతికాధ్యాత్మిక ప్రభా భాగ్యము పుష్కలముగా ఒనగూడియుండుట నిజముగా భరతజాతి అదృష్టమనిరి. చంద్రగుప్తాదిమౌర్యులు చాణుక్యనీతితో దేశమును పాలించునపుడు, అహింసాసిద్ధాంతమును పాటించి అశోకుడు ప్రజలను రక్షించునపుడు జాతి కవిత్వ విద్యాతత్త్వవర్ధనుడైన హర్షవర్ధనుడు పరిపాలించునపుడు, కాకతీయాది సత్‌క్షత్రియులు నీతితో దేశమునేలునపుడు, కృషిపరిశ్రమలు, నావికా వర్తకములు ఎంతో అభివృద్ధిచెంది నాగరకతతో మన దేశము ఎంతోముందంజవేసినదని ప్రాగ్వైభవమును వివరించిరి. పదునైదు వందల సంవత్సరములకు పూర్వము నిర్మితమై అమెరికా ఆంగ్లేయ కర్మాగారములకైన చేతకాదను కీర్తిని పొంది ప్రాచీన భరత శిల్పాచార్యుల సత్కార్యుల సత్కృా విజయ ధ్వజమువలె విలసిల్లుచు తన కెందును సాటిలేదనురీతిలో ఈనాడు నిర్మించినట్లుగా ఆకసమును తాకుచు ఢిల్లీ నగరములో నున్న అయ స్స్తంభముగాంచి ఆనాటి భారత కార్మికులచాకచక్యమును తలచి పేడికన్నీరు నింపని వాడు న్నాడా? అని యినుప స్తంభము యొక్కపటుత్వమునకు అనుగుణముగా ఈ సందర్భమున బలిజేపల్లి నీస పద్యమును రచించుట వారి ఛందశ్శిల్పజ్ఞతకు చక్కని తార్కాణము. మన దేశము పాడి పంటలకు మొదటి నుండి కొదువలేక భోగ భాగ్యములతో సర్వసౌఖ్యములతో తులతూగుచు ప్రతి గ్రామము ఎంతోవికాసమును పొందియుండినదని బలిజేపల్లివారు పొదుగుల నిండ నేపునజేపి అను సీసపద్య మున వివరించిరి. ఆవులు పాదుగుల నిండ పాలను నింపి కురియుచుండినవనియు మూడుకారులు పైరు పంటలు పండుచుండినవనియు పరదాస్యమునకు పాలుపడక స్వచ్ఛందముగా సౌఖ్యమును పొందుచుండిరనియు, పూరిపుల్లకైన నితరులపై ఆధారపడక దేశము భాగ్యవంతమై యుండినదనియు ప్రతిగ్రామమున కొన్ని సంఘములేర్పడి కట్టుబాట్లతో నితరులు వేలుపెట్టిచూపవలసిన పనిలేక జీవించుచుండిరనియు పూర్వులవైభవమును బలిజేపల్లిఎంతో చక్కగా వివరించిరి.

## మహమ్మదీయుల పరిపాలన - భారతీయ విభవము

ఏడువందల సంవత్సరములు మహమ్మదీయ పరిపాలన సాగినప్పటికి భరతఖండము పూర్వవైభవము నశింపలేదు. ఆ ప్రభువులు తరతరములుగా నిదియే తమ జన్మభూమిగా భావించి నివసించినందువలన భేదభావము ఏర్పడలేదు. మత విషయమునేయొక్కరిద్దరో వనికి మాలినపట్టు దలవహించినను ధర్మపరులైన పలువురు సమత్వ పద్ధతితో రాజ్యమేలి తమకు భారతీయ సంతతికి స్థిర తరమైత్రి గూర్చిరి. అట్టి ప్రభువులలో అక్బరు దగినవారు. షర్షా తమ రాజ్యమును రామ రాజ్యముగా శాసించెను. అక్బర్‌షా తన రాజ్యమును దేవరాజ్యమని పిలిచెను. ఎందరో కవులువాక్సుధా వర్షములు కురిపించి కావ్యములు రచించిరి. అనేక కళలు, పరిశ్రమలు అలరారినవి. అక్బరు సార్వ భౌముడు తమ వారితో సమానముగా హైందవులకు రాజకీయోద్యోగములొసగెను. హైందవ కవీంద్రు లను ఆస్థానమున నిలిపెను. తమ మతమునకు, హైందవమతమునకు ఒకే విధమైన గౌరవము కల్పించెను. తమకు, హైందవులకు నెయ్యము, వియ్యము నిలుపుటకై ఎంతో ప్రయత్నించి సమత, మమత కలిగిన రాజ్యమే ఒక కుటుంబముగా ప్రజలే తన బిడ్డలుగా తాను తండ్రిగా ఎంతో ప్రీతిని ప్రకటించిరి. ఆ సార్వభౌముని తలచుకొన్నచో నేటి మన పాపములు తొలగునని అక్బరు పాదుషా యెడఎంతోగౌరవ ప్రతిపత్తులు ప్రదర్శించిరి. షాజహాన్ కాలమునాటి బంగారు నెమలి సింహాసనము యొక్క సొబగును, తాజ్‌మహల్ యొక్కసోయగమును బలిజేపల్లి వారు ఒక సీసమున అభివర్ణించిరి. ఆ నెమలి సింహాసనము నవ రత్న ఖచితమై ఇంద్రుని ధనుస్సును తిరస్కరించునట నెమలి పురి ఆకారముతోచునట్లు, అపరంజి కూర్చి నిర్మించిన దాని అందము అద్వితీయ చిత్రమని నేటికిని కీర్తింపబడుచున్నది. దాని విలువ ఇంతని చెప్పుటకు వీలుగాదు. అంతగా ధనమును వెచ్చించి షాజహాన్ ఆ సింహాసనమును నిర్మించి రనిరి. ఆ కాలమున నేటి ఋణపాతకము లేదని కవి పద్యాంతమున పేర్కొనిన వాక్యము నేటి దేశ

దుస్థితికి సూచన. ఇందు కవి స్వీయానుభవమును కొంత స్ఫురించుచున్నది. ఋణపాతకమన్న యీ ప్రయోగము సర్వసామాన్య ప్రజల యందును ఎంతో వాడుకలో నున్నది. పూర్వవైభవమును ప్రస్తుత పరిస్థితిని తలచి అంతటి వ్యత్యాసమునకు కవి పొందిన ఆవేదనము నీ ప్రయోగము స్పష్టీకరించుచున్నది. తురుష్కుల పరిపాలన దోషభూయిష్ఠమని తెల్లవారు కొందరు నిరసించి తాము వ్రాసిన దేశచరిత్రలో ప్రకటింపగా ఆ విషయములే నేడు పాఠశాలలో బాలురు పఠించుచున్నారు. కాని నిజము గ్రహించినచో నేటి ఆర్థిక మహోదురవస్థ నాడు లేదనుట యథార్థము. ఈ ఆర్థిక మహోదురవస్థ అను ప్రయోగమునందును కవి తాను పొందిన దురవస్థలు సూచితము. ప్రతి పద్యము యొక్క తుట్టతుది పాదములో కవి ప్రస్తుత పరిస్థితిని పూర్వవైభవముతో పోల్చి ప్రకటించుట ఎంతో సమంజసముగా, రసౌచిత్య స్ఫోరకముగా నున్నది.

**తూర్పిండియా వర్తక సంఘము వారి రాక - భారతీయ విభవ విచ్ఛిన్నత:-**

చేనేత వస్త్రములు, పరిశ్రమలు, ఓడలు మొదలగునవి మొగలాయి సామ్రాజ్యములో ఎంతో విస్తరిల్లి దేశభాగ్యోదయమును చాటగా ఈస్టిండియా వారి రాకతో సర్వము సమసిపోయెనని బలిజేపల్లి వారు వారి వ్యాపారబుద్ధిని నిరసించిరి. అన్యమత సహిష్ణుత సమత్వములేని ఔరంగజేబు స్వమత ప్రచారమునకు పాల్పడి దౌష్ట్యముతో ప్రవర్తించుటవలననే ప్రజాభిమానమును కోల్పోయెనని శివాజీవంటి ప్రముఖులు విజృంభించి ప్రతిఘటించిరని వివరించిరి. షాజహాను దయచే మెల్లమెల్లగా మనదేశము నందడుగుపెట్టిన ఈస్టిండియా వర్తకులు సమయానుకూలముగా తమ తెలివిని ప్రదర్శించి, తుదకు రాజ్య స్థాపనమొనర్చుటయెంత కుతంత్రమోగదాయని బలిజేపల్లివారు నిందాస్ఫోరకముగా విశదీకరించిరి. క్రమక్రమముగా ఈస్టిండియా వర్తకులు ఎన్నెన్నో ఉపాయములతో సామ్రాజ్యస్థాపన గావించిన తీరును చక్కగా సీసమునందు వక్కాణించిరి. వారు వాణిజ్యము కొఱకు కట్టిన సరకుల కొటార్లు దుర్గములుగా మాఱినవి. గిడ్డంగులలో వాణిజ్య (వర్తక) వస్తువులు మందు సామాగ్రిగా మాఱినవి. కర్మాగారరక్షకులు వీరసైన్యముగా మాఱిరి. దుబాసులు గూఢచారులుగా మాఱిరి. వర్తక ప్రతినిధులే రాష్ట్రపతులైరి. ప్రాచ్య భారతీయ సంఘకర్తలే సామ్రాజ్యాధిపతులైరని తెలుపుచు దేశచరిత్రలో తూర్పిండియా వారి రాక దేశమునకు ఎంత వినాశమును కలిగించినదో, వ్యాపార వ్యాజమున సామ్రాజ్యస్థాపన గావించు వారి కుటిల కుతంత్రరాజకీయ నైపుణ్యమెట్టిదో విడమరచి వారి బహువిధోపాయములను కన్నులకు గట్టినట్లు ప్రకటించిరి. భరతఖండంబు చక్కని పాడియావు పిదుకుచున్నారు మూతులు బిగియగట్టి అని చిలకమర్తివారు పేర్కొనగా బలిజేపల్లివారు భరతదేశమును పాలవెల్లిలో వర్తకమే చుక్కానిగా రాజ్యతంత్రపుటోడలో పయనించి ఈస్టిండియా వర్తకులు మన సర్వస్వము నూడ్చికొనిపోయిరని రూపకాలంకార మనోజ్ఞముగా భరతఖండ ప్రాశస్త్యమును రూపించిరి. ఒకడు చెడిపోవకున్న నింకొకడు బాగుపడడని వీరు చదివిన పాఠమును వర్తకాభివృద్ధి యందన్వయించి భారతీయ వృత్తులనే అణచుటకు పూనుకొనుట ఎంతవైపరీత్యమోయని బలిజేపల్లి పేర్కొనిరి.

వర్తకము నెపముతో కపట ప్రవర్తకులై మన దేశపు నేత వస్త్రములసీమకు పోకుండ జేసి అచ్చట కర్మాగారములలో యంత్రముల వలన నెలువడిన వలువల నెంతో విలువకు నిచ్చుట అమ్మి లాభములు పొందుటకు వారవలంబించిన విధానములెన్నోయని కవి వ్యథనొందిరి. ముడి సరకు నిచ్చటనుండి ఎగుమతి చేసికొని, దానినుండి వస్తువుల నుత్పత్తి చేసి మనకు అమ్ముటయే గాక, ఇచ్చట పరిశ్రమలు పూర్తిగా పడిపోగా, పైగా సుంకపు పన్నులెన్నో అంకురించినందుకు లక్ష్మీకాంతకవి ఆశ్చర్యసంభ్రమములు ప్రకటించిరి. ప్రత్తిని గొనిపోవగా పన్నులేకుండజేసి, అదియే వస్త్రముగా నైకొన్నప్పుడు నూటికెను బదిపన్నులు వేసి అట్టిపన్నులతో నేత పని వాండ్రను విపన్నుల గావించి వారి భాగ్యపు గీతను తొలగ ద్రోసిన తులువల నేమి చేసినను పాతకము లేదని కవి అభిప్రాయపడిరి. రాటములు వడకుపని లేక వణకుచున్న ముసలమ్మలు మూలుగుచు మూలకూర్చొనిరని, నేత

మగ్గములతో పనిలేక సాలెవాండ్రు పొట్టకూటికై విలవిలలాడిరని, కొలిమి తిత్తులు కూలబడగా కమ్మరపని ఆగిపోయినదని, నానా పరిశ్రమలు నాశనమైపోగా కూలినాలి చేసికొను ప్రజలు కూలిపోయిరని, చేతి పనులకు అవకాశము లేకుండ మిల్లులు కొల్లలై పాపపు నాగరకత దాపురించి మనకు కష్టమై పరులకు కొల్లలై మంచికాలము ప్రాప్తించినదని ప్రకటించిరి. ఎప్పుడు వృత్తులన్ని అడుగంటినవో అప్పుడే కార్మిక జాతి సౌభాగ్యమంతరించి పరులకు చాకిరిచేసి బ్రతుకవలసిన దుర్గతి పట్టినది. దేశములో స్వతంత్ర జీవనము జాతివికాసము నశించి పరదేశీయుల పరిహారమునకు పాత్రమై దీనత్వముతో కృశింపవలసిన దుస్స్థితి ఘటిల్లినదని లక్ష్మీకాంత కవి చక్కగా వక్కాణించిరి.

ఈస్టిండియా వర్తక సంఘము తమ లాభమును చూచుకొని ఇచ్చట పరిశ్రమలన్నియు పూర్తిగా సమసిపోవుటకు ఎన్నెన్ని ప్రయత్నములు చేయవలెనో అన్నింటిని చేసి మనదేశ భాగ్యమును కొనిపోయిరి. వారి కర్మాగారములలో కూలికి తప్ప స్వేచ్ఛగా జీవించుటకు తగదని, తమకు తామై పట్టుదారము తీయుటయేగాని అది వస్త్రముగా చేసి అమ్మరాదని, తమ ఓడలే వస్తువులను ఎగుమతి చేయుటకు తగునుగాని ఇచ్చటివి ఆసీమకు పోరాదని, తమకు తామై ఇచ్చు ధరకు గాక యింకొకరికి స్వేచ్ఛగా అమ్ముకొనరాదని, ఎన్నో కపట వ్యూహములు పన్నిరి. భారతీయ శరీరమునకు ప్రాణము వంటిదైన ఢక్కానగరపు మిల్లులు ఈజిప్టు, బాబిలోన్, ఇటలీ జనులను ఎంతో మోహింపజేసినవి. ఆనాటి లండన్ నగరము కూడ ఢక్కాకు సాటిగాదు. స్వచ్ఛంద జీవనము సాగించు ఇచ్చటి రెండు లక్షలకు మించిన జనము అమెరికా ఆంగ్లేయ దేశ శ్రీమంతుల కంటె అతిశయించియుండిరి. అట్టి ఢక్కానగరము యొక్క భాగ్యము అస్తమించి కుడువ కూడు, కట్టగుడ్డలేక దైన్యముతో అడవిపాలై నశించు పరిస్థితిని ఈస్టిండియా వర్తక సంఘము కలిగించినదని కవి తన ఆవేదనను వెల్లడించిరి. కేవలము వ్యవసాయ జీవనమే కాక అనేక పరిశ్రమలచే బ్రతుకు సాగించు భారతీయ ప్రజలు తమ వైభవమును కోల్పోయి పారతంత్ర్యముచే జీవింపవలసిన దుర్గతి పట్టినది. పాపము పండుటయేగాని పొలము పండుట అరిది అయినది కదా అని కవి వాపోయెను. ఇతర దేశములకు ధన ధాన్యములు సాగిపోవుటచే క్షామ దేవత ప్రళయ తాండవము సాగించినది. కోటానుకోట్ల భారతీయులు మారి మసిగినట్లు మరణించిరి. ఇట్టి విషమపరిస్థితులను పరిష్కరించుటకు కేంద్ర రాజ్యము ఏదియు లేకపోయినది అని స్వరాజ్య సమస్యను చక్కగా ప్రకటించిరి. అప్పటికే మొగలాయి సామ్రాజ్యము పాకము తప్పినది. తక్కన రాజులలో నైకమత్యము సన్నగిల్లి వారిలోవారు కలహించుకొనిరి. అశాంతి నానాటికి పెరిగిపోయినది. మహాభీకరముగా రోష ద్వేష భీషణముగా సైనిక స్థలములందు విప్లవము విజృంభించినదని అప్పటి ఆప్రజా ఘోషణమును సుదీర్ఘ సంస్కృత సమాస భూయిష్ఠమగు మత్తేభ విక్రీడిత వృత్తమున ప్రజల భీషణ, ఘోషణ ప్రళయకాల మేఘ గంభీర ధ్వనిని తలపించునట్లు వర్ణించిరి. ఇరువైపుల ఎంతో జన నష్టము ఈస్టిండియా వర్తకుల కారణమున ఏర్పడినది. వారు (ఈస్టిండియా) మెల్లగా సీమకు చేరిరి. అటుపై సమర్థులు తమకు తామే ఈ దేశమును పరిపాలింప తలచిరి. వర్తక విభుత్వమును తొలగించుటకై నిశ్చయించిరి. ఇచ్చట తూర్పు ఇండియా వర్తక సంఘమువారు కూర్చిన దుర్గ వస్తుసంభారమును భారతీయ ఋణభారముతో గ్రహించి విక్టోరియా మహారాణి ప్రజలకెంతో ప్రియముకలుగునట్లు అమృతము వంటి మాటలను వరములుగా నిచ్చి రాజ్య భారమును తన మూపున దాల్చినది. ఏది ఎటుపోయినను అప్పటికి ఏదో కొంత శాంతి ఏర్పడినది. ప్రజ నాటి రాజ్య విధానమునకు తగు సాయమును చేయుచుండినది. రాణి తాను చెప్పిన మాటల వరములు ఆచరణలో పరిపూర్ణముగా నెరవేర్చుటకు రాజపురుషులు కొన్ని నెపములు పెట్టుచువచ్చిరి. ఆంగ్లవర్తక ప్రభుత్వము మారినది. కాని సమసిపోయిన భారతీయ పరిశ్రమలకు ఇచ్చట జీవనమునకు వలయు వస్తువులులేవు విదేశములనుండి వర్తక సంఘము పంపుకోలుగాని వానిని స్వీకరించుటయేగాని మఱి ఏమియు మార్పులేదు. కరవులు అంతకుముందు కంటె అధికమై కోట్లకొలది ప్రజలు మరణించిరి. ఎందఱో నిరుపేదలై బ్రతుకు తెరువులేక కూలికై సిద్ధపడిరి.

కాని పొట్టగడవని స్థితి ఏర్పడినది. దీనికి నిజమైన కారణమేదియో ఎవ్వరికిని అర్థము కాలేదు. ౘచ్చినవారు చావగా బ్రతికినవారికి పూటకొక మెతుకును సరిగా దొరకక గతిలేక కూలిచేసికొని గతుకవలసిన కష్టపరిస్థితి కలిగినది. కూలినాలి చేసికొన్నను కడుపార తినుటకు నోచుకొనక చిక్కిన వారికి కూడైనవి. పంజరములోని చిలుకకు స్వేచ్ఛ లభింపకున్నను దానిని యజమాని ఎంతో ప్రీతితో ఫలములొసగి కాపాడును కాని చావని ఈకూలి జనమునకు నరకమే గతియైనది. దుష్టబుద్ధిగల జనులు ధనము కొరకు కుత్తుకలో విషమును నాల్కపైన బెల్లమునున్నట్లు మాటలాడి అమాయకులైన ప్రజలను తమ మాటలవలలో పడద్రోసి వారిని సెటాలు మొదలగు దేశములకు తరలించిరి. అట్లు తెల్లవారు వ్యవసాయ కూలికై పంపును అంగీకార పత్రములలో వారి సమ్మతిని తీసికొని బలిపశువులుగా అమ్మిన ఉదంతములు కోకొల్లలు. ఇట నుండి తెల్లవారి కూలిపనికేగిన మన జాతివారు చేరెడు పాలమును కూడ సంపాదింపరాదు. వారెన్నో బేరసారములు చేయవచ్చును కాని మనవారికట్టి వసతులే పనికిరావు. కూలి ఒక్కటే గిట్టును గాని మన జాతి ఇంటి పొరుగు వారికి గిట్టదు. వారి వివాహ పద్ధతులే తగును గాని మన వివాహ ధర్మములు పనికిరావు. కూటికొరకు కూలిచేసి బ్రతుక పోయిన మన హైందవులను ఆ తెల్లవారు బ్రతికియుండగనే యమ బాధలు పెట్టిరి. ఇది తలచినచో మనస్సు యథాయథలగును. అచ్చట మనవారికి హక్కులు కలిగించుటకు ధనాధికులు గొల్లుమని ఏడ్చిరి. దేశములో ఎక్కడ లేని ఉప్పుపన్నును కూడ వారు మనవారిపై వేసిరి. ఎన్నో రకముల ప్రజల నుండి ప్రతి సంవత్సరము తీసికొను ధనమును శాంతి సమయములందు కూడ సైన్యమునకు ౘచ్చించిరి. పరిపాలించుటకై యిచ్చటికి వచ్చువారికి అధికముగా వేతనములిచ్చి కరువుచే అన్నమో రామచంద్రాయని అటమటించు మన భారతీయ ప్రజల దేశ వృత్తులను పూర్తిగా అణచివేసిరి. ఇట్లు ఆర్థికమైన విపత్తిని కల్గించిరి. రకరకముల పంటలు పండుచున్నను దేశమున క్షామదేవత విలయ తాండవమాడినది. కాంచన రత్నములకు నివాసమయ్యు గర్భదారిద్ర్యమే చోటుచేసికొన్నది. మూడు వైపుల సముద్రములతో ఒప్పుచున్నను ఉప్పునకు నోచుకొనని ముప్పుప్పతిల్లినది. పట్టు వస్త్రములకు ఆటపట్టయ్యును విదేశీయ వస్త్రములే ధరింప వలసివచ్చినది. భరతవర్షము కల్పవృక్షము వంటి దయ్యును దాని ననుభవించుట అన్యుల పాలైనది. అంగడిలో అన్ని యున్నను అల్లుని నోట గడ్డ అన్న సామెత భారతీయులకుదక్కినది. పలువిధములైన పన్నులు ప్రబలమైనవి. త్రాచుపాము విషమువలె ధరలు హెచ్చినవి. నానాటికి పాడిపంటలు బీడుపోయినవి. పండువంటి కాపురములు పాడు పడినవి. ఇట్లు దినములు గడచుకొలది మనవారు ఆ ప్రభుత్వనీతిని గ్రహించి ఎంత ధర్మపరులమై చరించినను ఇక ఆర్థిక స్థితిగతులు పూర్వమువలె మెఱుగు పొందు దారులులేవని చర్చించుకొనిరి. ముందు చెడిన పదార్థమును మరల దాని పూర్వస్థితికి తెచ్చుట మహాకష్టతరము. ఆ పవిత్ర ప్రయత్నము నందు అదను తొలగనీయక నియంతృ జనములు సహాయపడకున్నచో కుదురు పాటు కలుగునా? రాజ్య తత్వమునకు తగు సమత్వధర్మములను నిరూపించుటయే తమ కర్తవ్యమని తలంచిరి.

తూర్పు ఇండియా వర్తక సంఘము వారి ఆధిపత్యము తొలగింపబడినను భారతీయుల పరిస్థితులెంత మాత్రమును మారలేదు. ఎన్నెన్నో శాసనము లేర్పడినవి. నాగరికతకు ప్రతిబంధకము కల్గించు పత్రికాశాసనము, అచ్చు కూటముల శాసనములే కాక లోక విశ్వాస వినాశకరములైన శాసనములు కోకొల్లలుగా ఏర్పడినవి. లోకాదర్శకమైన ఆంగ్లమహాసామ్రాజ్యములో ఇట్టి అగచాట్లు ఇకనైన అణగి ప్రజలు, సామ్రాజ్యము సుఖతరముగా సాగవలెనని ప్రజానాయకులైన గోఖలే మొదలగు వారు వినయముతో శాసన సభలలో కాకుండ ఏకాంతముగ విన్నవించుకొనిరి. ప్రజా సదస్సులలో ప్రజలు నిశ్చయించిన కోర్కెలు ఫలింపకపోవుటచే ఆ ప్రజలెంతో ఆతురత ప్రకటించిరి. కాని అంతలో ఉచిత నిర్బంధ విద్యకావలెనని కోరిన గోఖలే అస్తమించెను. ఆర్థిక స్వాతంత్ర్య కాంక్ష వెల్లడించిన మెహతాదివికేగెను. ప్రాజ్య స్వరాజ్య తారక మంత్రజపముతో పితామహుడు తనువువీడెను. స్వాతంత్ర్యము నా జన్మహక్కని చాటిన బాల గంగాధరుడు కైలాసమేగెను. పితృ దేవతలు బంధుజ

మొసగు తర్పణములను గ్రహింపరైరి. వారి కొసగు పిండములను కాకులు కూడ ముట్టలేదు. స్వరాజ్యమే తమ ధ్యేయముగా సాధింపవలసిన ప్రధాన జీవిత సమస్యగా భావించిన నాయకు లోక్ర్యోకరు తనువులు వీడినట్లు బలిజేపల్లి వారు వెల్లడించిరి. స్వరాజ్యము నిజముగా ఒక ముఖ్యసమస్యగనే పరిణమించినదని లక్ష్మీకాంత కవి ఎంతో చక్కగా వక్కాణించిరి.

స్వపరిపాలనకు వలసిన కూప్రౌఢిమము ప్రజలకిప్పటి వరకు కలుగలేదని కొన్ని దినములు, విద్యావంతులైన కొందర గోలయేగాని అందరు కోరలేదని, మరికొన్ని దినములు, సంఘ సంస్కారములు సాగించిన పిదప యోగ్యత కుదురునని, యిక కొన్ని దినములు, యిదిగో విచారణ సంఘము ఏర్పాటు చేయుచుంటిమని కొన్నాళ్ళు నిట్లే ఏదో ఒక నెపముతో కాలయాపన మొనరించి కొన్ని సంవత్సరములు గడిపిరి. ఇంతలో ప్రళయ ప్రచండముగా ప్రపంచమున సంగ్రామ ఛ్ఛాయలు అలముకొన్నవి. అపుడు లాయడ్ జార్జ్ భారతీయుల నుద్దేశించి ప్రస్తుతము బ్రతుకు చావగు భయంకర సంగ్రామము ప్రాప్తించినది. దుర్మార్గుల శిక్షించుటకై మనము కత్తి పట్టితిమి. సామ్రాజ్య ప్రతిష్ఠను నిలుపు పరిస్థితి మీచేతులలో ఉన్నది. గృహచ్ఛిద్రములను మాని వెంటనే మీరు ముందుకురికినచో మనము ఎన్నిలోకములైన గెలువగలము. మీరు తోడుగ నుండి సహకరింతురని నమ్మి ఈ యుద్ధ భూమిలో దూకితిమి ధర్మ ప్రతిష్ఠా సిద్ధాంతము చేయబూనిన మాకు మీరీ సందర్భమున సర్వవిధముల సహకరింపవలసినది. రాజ్యక్షేమమునుకోరి సాగించు ఈ సంగ్రామములో ధర్మసేవా ఫలము సాధిం చుట మీ మతమని జార్జి సందేశమొసగెను. దానికి దేశబంధు, గాంధీమహాత్ముడు అభయ మొసగిరి. వెంటనే ఛేమ్స్‌ఫర్డ్ (క్షేంపఫుర్డ్) కొన్ని లక్షల, కోట్ల ధనమును వ్యయించి యుద్ధసన్నద్ధులైన సైనికులను ప్రభుత్వ ఖ్యాతి రక్షార్థమై నియమించెను. ఈ సందర్భమున నేటిమేలు రేపే మరచు దొరలకు సాయము చేసి ప్రయోజనము ఏమి అని యుద్ధ విముఖులైన వారిని కూడ గాంధీ మహాత్ముడు ఎంతో ఓపికతో ఒప్పించి తగిన సహాయ సంపత్తిని సమకూర్చెను. శత్రుసైన్యముమోసము గావించినది. ముందే అపకార మొనరించుటకు మాకు గిట్టనిపని. రేపు యుద్ధభూమిలో మీ ప్రయత్నములను చూచెదము. ఉపేక్షఏల? పరా క్రాంతికి మీరు రండు, రండనగ ఇస్లామ్ సేనలు బయలుదేరినవి. అపుడు భారతీయ వీరయోధులును శత్రుసంహారమునకు తరలిరి. భారతీయ యోధులు తమ రాజభక్తిని నిరూపించుటకై బంధు మిత్రాదులును మాతృభూమిని వదలి రణరంగమునకు దుమికిన సన్నివేశములను బలిజేపల్లి నాలుగు సీసపద్యముల వివరించిరి. ఈ సందర్భమున కవి ఎవ్వరెవ్వరేయే పరిస్థితులలో యుద్ధసన్నద్ధులైరో కన్నులకు గట్టినట్లు ఎంతో ఆర్ద్రముగా విన్నవించిరి. మరలఎపుడు తిరిగి వత్తురని తల్లులచేత పలికించు పెళ్ళికుమార్తెలను వదలి పెట్టువారు కొందరు, మీతో మేమువెను వెంట వత్తుమని పలుకు తొలి కాపురపు పడతులను వీడిన వారు కొందరు, నీరాడు తరువాతనైన (ప్రసవించిన పిదప) పయనింపరాదా! అని బతిమాలు నిండుచూలాండ్రను విడచిన వారు కొందరు, బయలుదేరనీక కాళ్ళుపట్టుకొని పెనగులాడు చిన్నారి బిడ్డలకు నింత మిఠాయి బెట్టి వెడలు వారు కొందరు, ఇట్లు పలువురు సైనికులు రణభూమికి దుమికిన సన్నివేశములను దాంపత్య సంబంధ సందర్భములను ప్రవేశపెట్టిరి. అప్పుడే పెండ్లి అయిన నవ వధువులు, క్రొత్తకాపురములు పెట్టిన పడతులు, నిండు చూలాండ్రు, బిడ్డలనుకని వారితో విడదీయరాని బంధమేర్పరచుకొన్న భార్యభర్తలు ఈ నాలుగు సీస పాదములలో అభివర్ణింపబడిరి. యుద్ధ మర్మములనుఎరిగిన యోధులు తమ సామ్రాజ్య కీర్తి పతాకలు ఎగురుచుండగా నేను నేనని మహోత్సాహముతో ముందుకురికి యశస్సును పొందిరి. రణవ్యాపార పారీణులైన భారతీయ సైనికులు శతఘ్నుల నుండి జ్వాలలు విజృంభింపగా శాత్రవులను చీల్చి చెండాడిరి. ప్రతి రాష్ట్రమును తమ ప్రజాప్రతినిధిత్వ ప్రాజ్య రాజ్యాంగ పద్ధతికై పోరాడుచుండగా, స్వార్థత్యాగులై ప్రాణ ధనములను తృణప్రాయముగనెంచిన ప్రతి భారతీయుడు కృతార్థీభూత వీరవ్రతుడై సామ్రాజ్య సంస్థితిని కాపాడి తమ ప్రాభవమును నిరూపించిరి.

భారతీయుల ధాటికి ఓర్వలేని గర్వాంధీభూతుడైన శత్రువు అతని బంధువులు, మిత్రులు

నిరసించుచున్నను ఆశాలతలు తెగిపోగా సంధి, సంధి అని పాదాక్రాంతుడయ్యెను. అపుడు ఆంగ్లతేజః ప్రభాబంధూ కచ్ఛవి భూనభోంతరాళములు వ్యాపించినది. ఆ రణ యజ్ఞములో అసువులను అర్పించిన వీరసైనికుల మరణమునకు వారి బంధువులు, భార్యలు పరితపించుచుండగా అంతలో అకారణముగా సంశయింపవలసిన రౌలతు చట్టము పుట్టినది. భారతీయులు నిస్స్వార్థముతో పోరాడి విజయలక్ష్మిని వరించిన తీరును బలిజేపల్లివారు ప్రతిభావంతముగా ప్రతిపాదించిరి. మంచికి పోగా కీడుపైకొన్న దని పాశ్చాత్యుల కుటిల బుద్ధిని కవి ఎంతో సహజ ధోరణిలో ప్రకటించిరి. ఉన్నట్టుండి పుట్టిన అట్టి ఆరౌలతు చట్టమునకు మహాత్మగాంధీజీ నివ్వెరపడి ఓపికతో దానిని పరిష్కరింపదలచిరి. మనమెంత అనుగ్రహబుద్ధితో వర్తించినను ఈ గ్రహచారము తప్పలేదు. దీనిని ఎట్లైనను మాన్పవలసి ఉన్నది. ఇంతవరకు సదుపాయము దొరకలేదు. ఇక సత్యాగ్రహమే శరణ్యము అని మహాత్ముడు ఆజ్ఞాపించెను. దివ్యర్షి అయిన గాంధీ మాలిన్యమెల్ల పోనాడగా తీర్థమాడి, మడుగులలంకరించి, దేశీయులెల్లరు అసహాయోద్యమములో పాల్గొని ఆంగ్లేయుల చట్టములను ఎదుర్కొన వలసినదిగా హెచ్చరించిరి. లక్ష్మీకాంతకవి ఈ సందర్భములో గాంధీ మహాత్ముని అవతార ఘట్టమను శీర్షికపేర కొన్ని పద్యములు రచించి మహాత్మునిపై తనకు గల ప్రత్యేక భక్తి శ్రద్ధలను స్వరాజ్య సమస్యనెపమున ప్రకటించిరి.

**గాంధీమహాత్ముని అవతరణ:-** భారతీయ జనయిత్రీ నేత్ర పర్వముగా గాంధీ మార్తాండుడుదయించెనని గాంధీ మహాత్ముని భువన బంధుత్వమును లక్ష్మీకాంతకవి ఈపద్యమున వ్యంజింపచేసిరి. ఆతని జన్మసందర్భమున షడ్జమ స్వరమును ఆలాపించుచు మయూరి ఒయారముగ గానము సేయు విద్యుల్లతా శ్యామయై (పదునారేండ్లకన్యకయై) లాస్యమొనరించినది. దివియందు గర్జాదుందుభులు మ్రోగినవి. మేఘేందిర ఆనంద బాష్ప జలముల వర్షించినది. నవ్యయుగా రంభ కుడై పారతంత్ర్యమను అంధకారమును పారద్రోలు గాంధీమహాత్ముని మార్తాండునిగ కవి భావించుట ఎంతో సముచితముగ ఉన్నది. ఇట కవి సర్వజన హర్ష సూచకముగ వర్షమును వర్ణించి ప్రేమ పూర్తి తత్త్వమును షడ్జమ స్వరమయూరి గీతము నందు, మెరపుతీగల కాంతిని శ్యామా లాస్యమునందు, మేఘ గర్జలను దుందుభి స్వనములందు రూపించి మేఘమొక ఇందిరయై సమ్మదాశ్రు జలములు వర్షించునట్లు రూపకాలంకార మనోజ్ఞముగ వర్ణించెను. జాతి పితయగు గాంధీమహాత్మునిలో భువన బాంధవత్త్వము పరిపూర్ణముగా ప్రతిఫలించి ఉండుటచే అతనిని మార్తాండునిగా భావించి అతడు చేపట్టిన మహోద్యమము ప్రజలకు చల్లని వార్తగా వ్యాపించినదను భావమును వర్షవరముగా కవి ప్రకటించుట రస స్ఫూర్తిగల ఔచిత్యమునకు చక్కని నిదర్శనము. దేశీయ ప్రజలందరు ఒక్కమారుగ వేడుకొనుచు పంపిన సందేశమునకు సమాధానముగ నీతిని, సత్యమును నమ్మిన గాంధీమహాత్ముడు అసహాయోద్యమముచే ఆశాభంగము కలుగకుండ స్వేచ్ఛాసక్తిని ప్రకటించి దౌర్జన్య క్రియా శూన్యముగా ఆశయమును నెరవేర్తునని హామి యిచ్చినాడు. సత్యము, నీతి అను రెండింటిని ఆయుధములుగా గ్రహించి దౌర్జన్యక్రియకు దిగక అసహాయోద్యమమును పూనిన గాంధీమహాత్ముడు తన్ను నమ్మిన దేశీయులకు ఆశాభంగము కలుగకుండ అనుసరించిన సువ్రతమును, ఆవ్రతమునందు గల గట్టి పట్టుదలను లక్ష్మీకాంతకవి శార్దూల వృత్తమున చక్కగా స్పష్టీకరించిరి. గాంధీయుగము ప్రారంభము కాగా భారతీయ స్వరాజ్య రథమునకు అతడిక సారధియై సాగింపగలడని జగద్గురుడైన లోకమాన్యుడు తలచి దివికేగెను. కాన ఇక ఆదివ్యరథమును లాగుటకు భారతీయ ప్రజలెల్లరు ముందునకు రావలసినదని కవి సర్వప్రజలను సంబోధించుచు చేసిన హెచ్చరిక గమనార్హము. ప్రతి భారతీయునకు ఈ భారతీయ స్వరాజ్యరథమును సాగించుట కంటె మరియొక కర్తవ్యము లేదని, ఇదియే తరణో పాయమని, ఈకార్య భారము నా బాలగోపాలము వహించి తీరవలెనని, ఈస్వరాజ్య రథఘటనత్వరకు చచ్చినను, జీవించినను భక్తాళికి జీవన్ముక్తి లభించి తీరునని, లక్ష్మీకాంతకవి విజయమో వీరస్వర్గమో అన్న అభిప్రాయమును చక్ర సంఘట్టన త్వరకు అన్వయించుచు అందదగినను, నిల్చినను జీవ

న్ముక్తియే అగునని సంభావించిరి. ఆబాల గోపాలము నీస్వరాజ్య సమస్య ఆకర్షించి గాంధీమహాత్ముని పిలుపుచే ఉరకలు వేసి పరుగులు త్రొక్కినదని కవి తన దేశభక్తిని గూడ నిందు సూచించెను.

పరదాస్యమును సహింపక స్వపర భేదమును వీడి దేశసేవయే పరమోత్కృష్టముగా హైందవ, తురుష్కసోదరులందరు కలిసి మెలిసి వర్తించునపుడు బ్రాహ్మణ, బ్రాహ్మణేతర వైషమ్యములుండుట పాడియా? ఇట్టి గృహచ్ఛిద్రములు అనర్థకములు కావా? ఒక్కజాతిలోనే యున్ని భేద భావములేల? ఏకైక ధ్యేయమును ఏకాగ్రతతో జాతిమత భేదములు వీడి సాధించుటయే కర్తవ్యమని కవి ఈసందర్భమున పరమార్థప్రదమగు వింతబోధను గావించిరి. ఎట్టి అపేక్షలేక గట్టి పట్టుదలతో భారతీయులు తమ ప్రాణ ధనములర్పింపగా తమ్ము యుద్ధ మృత్యుముఖము నుండి తప్పించిరియైన కృతజ్ఞతలేక పయోముఖ విషకుంభ ప్రాయ సంస్కారములను ప్రకటించిన నీచులను ఏమి అనవచ్చునని కవి తన ఆవేదనను మత్తేభ విక్రీడితమున వెల్లడించిరి. యుద్ధములో సహకరించినచో హైందవుల కోర్కెలెల్ల తీర్తుమన్న ఆంగ్లేయుల ధర్మ పన్నములు ఆచరణ శూన్యములై నీట వ్రాసిన వ్రాలు అయినవని తెలుపుచు వారొసగిన ఒక్కొక్క అభయ దానమును ఒక్కొక్క సీసపాదమున కవి అభివర్ణించెను. లోకము నందలి కల్లోలముల నెల్ల అణచి శాంతి, ధర్మములు ప్రతిష్ఠించుట, బలవంతులైన ప్రభువుల బారినుండి అల్ప రాష్ట్రీయులనుద్ధరించుట, అసురధర్మమైన ఆయుధ బలమును పెరచి మానవతను కాపాడుట, తాము నిర్ణయించిన సూత్రములు అఖిల జాతుల వారికి వర్తించు మార్గమును ప్రసాదించుట అను ఈనాలుగ ముఖ్యములైన అభయవర ప్రదానములు ఆంగ్లేయులు ప్రకటించుటయే కాని ఆచరణలో ప్రవేశపెట్టలేదని అది హైందవుల దురదృష్టమని బలిజేపల్లి వారి ఆవేదన.

**రౌలట్ చట్టము** - గర్హ్యము, దూష్యము, ప్రజా హృద్దాహకము, ఆంగ్లేయాభ్యుదయాటంకమునగు దానిని భారతీయులందరు ఇదికాదు, కూడదని నిర్ధరింపగా దానిని పెడచెవిని పెట్టి రౌలటీయమను క్రొత్త చట్టమును శాసించుట భారతీయ హృదయ క్షోభను కావలెనని హెచ్చరిల్ల జేయుటయే అని బలిజేపల్లి వారు విమర్శించిరి.

విశుద్ధాచారులైన స్వీయనాయకులను నిర్బంధించిరని పట్టరాని బాధతో హూణులను నలుగురిని వధగావించినది వాస్తవమే కావచ్చును. నిరాయుధులైన పాంచాల కోటిని చంపినంతనేమైనది. బాధకర శాసనముల వలన వజ్ర హృదయమును విచ్ఛేదము గావించుటయేమి న్యాయము! ప్రస్తుతము ప్రారంభించిన ఈ మహాయజ్ఞమునకు ప్రతివ్యక్తి ఒక సమిధయై సమిద్ధ తేజస్సుతో ప్రజ్వలింపవలసినదని కవి గావించిన ప్రబోధము నిజముగా స్వరాజ్య సమస్యకు సరియైన పరిష్కార మార్గము. ఈ మహాయజ్ఞమునకు కవి భావించిన విధము ప్రశంసార్హము. ఇందు అధర్మము బలి పశువుగా, కాలపురుషుడు యాజిగా అలో సహోదరులు లాలపటేలాది దేశబాంధవులు ఋత్విజులుగ ఆసేతు శీత పర్వంతముగల భారత జాతి హోతలుగా, ధర్మ సంస్థాపనార్థము ఉద్భవించిన గాంధీమహర్షి ఉపద్రష్టగా, పాంచాలికా పరాభవ సంభవమైన ఆగ్రహమే అగ్నిదేవుడుగా నిరూపింపబడినవి. ఈ మహా యజ్ఞమున ఆత్మార్పణమే యాగ సామగ్రిగా ప్రతి పౌరుడు పూనుకొనవలెనని, ఆర్యావర్తము నందలి ఆర్యులనెల్ల ఈ కవి ఎలుగెత్తి సంబోధించెను. ఈ క్రతువున ప్రాజ్యమైన స్వరాజ్యము ప్రాప్తించి అది సర్వ ప్రజాభోజ్యమై కులమత భేదములు, పేరాసలు లేని త్యాగబుద్ధి నెలకొనును కావున కర్మ శ్రేష్ఠులైన మీరందరు పెఱవు వీడి నిశ్చయమతితో ఆత్మలర్పింపగా రండని ఆహ్వానించుట లక్ష్మీకాంతకవి దేశభక్తిని, స్వరాజ్య సమస్యా పరిష్కారమున కతడొసగిన సందేశమును స్పష్టీకరించుచున్నది. ప్రతి భారతీయుడు తాను పట్టిన వ్రతిన ఫలవంతమగు పర్యంతము నిద్రించుట తగదని, లక్ష్మీకాంతకవి హెచ్చరిక. ఎప్పటి వరకు నిద్రింపరాదో కవి కొన్ని సందర్భములను కూడ నాలుగు సీస పాదములలో చక్కగా వక్కాణించెను. పాంచాల దేశీయ భక్త హంతకులైన చెడుగు ధూర్తులు శిక్షింపబడవలెను. ఇస్లామ్ సహోదరుల అభీష్టాను గుణముగ ఖిలాఫతు నిర్ణయింపబడవలెను. దేశీయ గౌరవాదేశ నాశకమైన రౌలటు చట్టము అంతరింపవలెను. జాతీయతా బహిష్కార

సూత్రితములగు చిలిపి చట్టములు నిర్మూలము కావలెను. ఇన్ని ఏల? సంపూర్ణ నిర్నిరోధ స్వరాజ్య పీఠిక లభించు వరకు భరత పుత్రకుడు నిద్రించుట పాడికాదని లక్ష్మీకాంతకవి ఉద్బోధించెను. అనేక సందర్భములలో పాంచాల దేశీయ ప్రసక్తి ప్రకటితము. ఇస్లామ్ సహోదరులను గూర్చి తెలుపునపుడు వారి భాషకు సంబంధించిన పదమునే ఖిలాఫత్ అని పేర్కొనుట ఎంతో సముచితముగ ఉన్నది. స్వరాజ్య సాధనలో ఆయుధములతో నిమిత్తము లేదని రణ, మారణ కారణములగు శతఘ్నులు మొదలగునవి రాక్షస బుద్ధికి సంకేతములని, పాశవిక ప్రవృత్తికల పాశ్చాత్యుల దుష్టచేష్టలను అహింసా పద్ధతిలో అరికట్టవలసిఉన్నదని, మన ఆధ్యాత్మిక శక్తి తప్పక లోకము నందలి అధర్మము నంతటిని అంతరింపచేసితీరునని, నిశ్చయముగా స్వరాజ్యము సిద్ధింపగలదని కవి ఎంతో ఆత్మ విశ్వాసమును ఈ పద్యమున ప్రతిష్ఠించిరి. దిగంతములెల్ల విస్తరించిన భారతీయ ప్రజల పరమోత్సాహ మరుత్తరంగ వలయములు నభోంతరమున మారుమ్రోగుచు సప్త సాగరములను దాటి ఖండాంతరములందున్న వారి కర్ణములలో జ్వరమును కల్గించుచున్నవని గాంధి విజయోద్యద్భేరి భాంకారముల పాటవమును లక్ష్మీకాంతకవి మత్తేభ విక్రీడిత వృత్తమున గజ బృంహితములో ధ్వనింపజేసెను. ఉత్సాహము ఉరకలు వేసి, పరుగులు తీసి భోరునమ్రోగి జోరున సాగి విజయభేరీ నినాదములతో విదేశీయుల కర్ణభేరులను పగులకొట్టి, సద్దుచప్పుడు వినబడకుండ చల్లగామెల్లగా స్వరాజ్యమును సాధించు తీరును ఛందశ్శిల్పజ్ఞుడైన లక్ష్మీకాంతకవి ఎంతో చక్కగా ధ్వని గర్భితముగా వివరించెను. లక్ష్మీకాంతకవి గాంధీ మహాత్ముని అవతరణ కారణమును, ఆతని జీవిత ధ్యేయమును, స్వరాజ్యవిషయమున సత్యాహింస పూరిత సర్వ స్వతంత్ర భావధౌరేయమును నిరంతర భావిత భావి భారత శ్రేయమును వివరించిన అనంతరము ఆంధ్ర విద్యార్థులనుద్దేశించి ప్రసంగించిన ప్రబోధముతో స్వరాజ్య సమస్య శీర్షిక ముగియును.

**ఆంధ్రవిద్యార్థులు-కర్తవ్య ప్రబోధము:** - ప్రప్రథమముగ వంగదేశమున మాతృదేశభక్తి పొంగి పొరలినది. ఆ భారతమాత దాస్య శృంఖలములను త్రెంచి వేయు ప్రయత్నము మహోద్ధృతముగ సాగినది. ఆంధ్రులకు అతి సన్నిహితులై ఉన్న ఆ సహోదరుల ఆశయమును గుర్తించియు ఆంధ్రయువకులింత నిర్జీవులై ఉండుట సిగ్గుచేటుగదాయని లక్ష్మీకాంతకవి ఆంధ్ర విద్యార్థులను వెన్నుదట్టి రెచ్చగొట్టినట్లు ప్రబోధించిన పద్ధతి ఒకశార్దూలముచేజిక్కిన మ్రుక్కిడి మృగమును ముక్కలు ముక్కలుగా చీల్చి చెండాడినట్లున్నది. పౌరుష జ్వాలలను ప్రకోపింప జేయుటకై కవి ఈ విధముగా నిందా గర్భితముగా ఆంధ్రయువకులను హెచ్చరించెను. కవి అంతటితో నిందాపూర్వక పద్ధతిని విరమింపలేదు. అతి దీనముగా నీచ దాస్యమను సంకెళ్ళచే చుట్టబడి ఎంతో దుర్భర స్థితిలో క్రుంగి కృశించు దేశమాత దుఃఖమును చూచి ఆమె ఆక్రందన విని ఊరక ఉపేక్షా భావము వహించుట తగునా? తల్లడిల్లుతల్లికి గంపెడంత సంతానముండి దాస్య సంబంధమైన ఆపె సంతాపమును తీర్పలేని జన్మలెందుకని ఆంధ్రయువకులను కవి మరిమరి హెచ్చరించెను. గుణాఢ్యుడైన కుమారుడొక్కడు చాలును. గర్భశోకము కల్గించు కొరగాని కొమరులు పదికోటులున్నను నిష్ప్రయోజనము. వినతాపుత్రుడైన వైనతేయుడు తానొక్కడయ్యు రాక్షసులను, యక్షులను పెక్కుర చక్కాడి అన్యులకు సాధ్యముకాని అమృత కలశమును సాధించి తల్లి దాస్యమును తీర్చెనుగదా! వైనతేయుని వలె ప్రతి పౌరుడును శౌర్య, ధైర్య సాహసములను, బలపరాక్రమాదులను ప్రకటించి దురపిల్లు తల్లి దురవస్థను తొలగింపవలసి ఉన్నదని లక్ష్మీకాంతకవి చక్కని దృష్టాంతమును ఈ సందర్భమున పురాణేతిహాస ప్రసిద్ధ వృత్తాంతమూలమున నిరూపించిరి. ఆంధ్రదేశమున ఎందరో విద్యాభోజులు, రాజరాజులు, కవులు, వీరవ్రతులు, కృష్ణరాయాది సాహితీ సమరాంగణ సార్వభౌములు జన్మించిరి. అట్టి ఈపవిత్రాంధ్ర ప్రదేశము మోహాంధ నివేశమై ప్రస్తుతము ప్రారంభింపబడిన మహోద్యమము నందు పాల్గొనక నిస్తేజమై, నిర్వీర్యమై, నిశ్చేష్టత వహించుట పాడిగాదు. ఆంధ్ర విద్యార్థుల అప్రతిమాన ప్రభాకాంతులు అస్తమింపలేదని ఋజువు చేయవలసిన తరుణమిది. ఇట్టి విపత్కర సన్నివేశములో దేశమాతను కాపాడుకొనక ఊరక ఉపేక్షవహించుటకు మించిన నింద మరియొకటిలేదని ఆంధ్ర

విద్యార్థి యువకులనుద్దేశించి కవి గావించిన హితబోధ వారి చదువుల కంటె ఆదర్శ నాయకుల అడుగుజాడలలో పయనించి స్వదేశసేవ కంకిత మగుటయే శ్రేష్ఠమన్న పరమార్థమును ప్రకటించుచున్నది. అన్ని ప్రయత్నములు విరమించుకొని స్వదేశసేవకై ప్రాణములైనను అర్పించుటకై నడుములు కట్టిముందుకు వచ్చిన నాయకోత్తముల అడుగు జాడలలో మీరును నిలువగలిగినపుడే మీజీవితమునకు సార్ధకత, మీలో జీవమే ఉన్నచో ఈనాడే ఈదాస్యపు బడులను పాడొనరించి దేశహిత సేవాదీక్షకై నిలువుడని, మహోద్యమ ప్రాముఖ్యమును కవి నిర్ధారించినాడు. కడుపుకూటికై కాకులవలె ఈ లోకులు నీచుల కాళ్ళొత్తి జీవించుటకంటె మించిన అపఖ్యాతి మరొక్కటి కలదా? లోకఖ్యాతి కన్న ఈజాతి నీతిని, బడుగు జీవనమునకై ఆసచేసి నశింపజూతురా? లోకములో కూడులేక ఎవ్వరును ప్రాణముల కోల్పోవలేదే? ఇట్టిపనికిమాలిన నడమంత్రపు పరీక్షల నుద్దేశించి చదువవలసిన పనిలేదు. మన పూర్వులెవ్వరు ఇట్టి చదువులకై తమ జీవితమును వ్యయింపలేదు అని కవి భారతజాతి ఔన్నత్యమును ప్రశంసించుచు కడుపుకూటికై నీచులను సేవించి జీవించు విధానము హేయమని దుయ్యబట్టిరి. కూడులేక చచ్చిన వారులేరు అన్న సామాన్యలోకోక్తిని కవి ఎంతో చక్కగా అన్వయించిరి. పూర్వీకుల చదువులకు, ఆధునికుల చదువులకుగల అంతర్యమును కూడా కవి విడమరచి వివరించెను. ఈనాటి నడమంత్రపు పరీక్షలను నిరసించుచు పూర్వీకుల అపూర్వౌన్నత్యమెట్టిదో పరిశీలించి యిక్కైన మెలకువతో మెలగుడని ధ్వని గర్భితముగ చక్కని సందేశమొసగెను. పూర్వపు చదువులకు, ఇప్పటి చదువులకుగల వ్యత్యాసమును, నేటి చదువుల వలన కలిగెడి అనర్థములను కవి ఎంతో తర్కబద్ధముగా, లోకజ్ఞతతో ప్రకటించెను. ఏనాడు ఈమిడిమేళపు చదువులకై ఈజాతి ఆశించినదో ఆనాడే మన వృత్తులు, ఆచారములు, సర్వధర్మములు నశించినవని, ఇప్పటికైన తెలివి తెచ్చుకొని వెంటనే శుచి స్నానమొనరించి దీక్షా బద్ధులై కంకణములు ధరింపుడని ప్రబోధించెను. తప్పక ఒక్క సంవత్సరములో స్వరాజ్యము సాధించి తీరును. అది యెట్లని మీరనుమానింపవలదు. మీరు నా దారిననుసరించి వచ్చిన చాలును. ఢంకా భజాయించి నిజము చెప్పుచున్నాను అని పల్కిన గాంధీమహాత్ముని వాక్యములు సూటిగానమ్మి దీక్షా బుద్ధితో ముందుకురండు. ఏల ఈ పరీక్షా భ్రాంతులు! ఆ పరీక్షల వలన లేవు సుఖ శాంతులని బలిజేపల్లి లక్ష్మీకాంతకవి గాంధీ మహాత్ముని విశ్వాసపూర్వక వాక్యములపై విద్యార్థులందరు నమ్మకముంచి కార్యాచరణలో పాల్గొనవలసినదిగా హెచ్చరించిరి.

ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి యుగేయుగే అను గీతా సందేశము లక్ష్మీకాంతకవి గాంధీ పరముగా సమన్వయించి సాక్షాన్నారాయణమూర్తియే ధర్మ సంస్థాపనార్థముగా గాంధీ స్వరూపమును గైకొనెనని, ఆ జగదేకనాయకుని వాక్కులే వేదములని, భక్తితో ఆతని నామము నొకమారు స్మరించినచో మీకు అమితోత్సాహము కలిగితీరునని, ఆంధ్రవిద్యార్థి లోకమునకు గాంధీమహాత్ముని అవతార తత్త్వ విశేషమును విశదీకరించెను. లక్ష్మీకాంతకవి తుట్టతుదిగా స్వరాజ్యము లభించి తీరునను ఆశా భావమును స్పష్టీకరించెను. దేవప్రేరితమై, ధర్మ బద్ధమై ఉజ్జీవముతో ప్రకాశించు ఉద్దీపనము దుర్భావములన్నింటిని నాశీభూత మొనరించునని దివ్యమైన ఈదీక్షస్వేచ్ఛా విశ్రాంతిదాయకమై లభించినదని ప్రాజ్యమైన స్వరాజ్యము కలిగి తీరుననిరి. చిట్టచివరి సీసపద్యములో లక్ష్మీకాంతకవి జాతీయ విద్య భారతీదేవిని కదలిరావమ్మ అని స్వాగతము పలికెను. ఉపేక్షించిన నీచులుగా భావించి ఈసడింపక అనుగ్రహింపవలసినదిగా తల్లిని అర్థించెను. ఆ తల్లి సేవను విడనాడి జాతి నిర్జీవమైనది కావున జీవమొసగి పోషింపు అని తల్లిని ప్రార్థించెను. పరభాషా వేషములతో పరవశమైన ఈదేశమును మరల సక్రమ మార్గమున సత్వరము సాధింపుమనియు భారతీదేవిని కవి ప్రార్థించెను. గాంధీ మహాత్ముని దివ్యవాక్య సురగంగా తీర్థములో స్నానమాడి మాలిన్యమును పోగొట్టుకొన్న పుత్ర వర్గమునకు జాతీయ విద్యా సుధారసమును అందించి ఆదుకొమ్మని కవి ప్రాధేయపడెను. దేశ

శోభగతీ! భారతీ సవిత్రీ! అన్న సంబోధనలతో స్వరాజ్య సమస్య అను శీర్షిక ముగిసినది. ఈ శీర్షిక అంతమున కవి ఓం శాంతిః శాంతిః అని ముమ్మారు శాంతిత్రయమును కూడ పొందు పరిచెను. ఈ గ్రంథము చంద్రికా ముద్రాక్షరశాల, గుంటూరులో ప్రచురింపబడినది.

గాంధీ తత్త్వమును పూర్తిగా ఆకళింపుకొన్న బలిజేపల్లి గాంధీమహాత్ముని మనస్సును పిన్న తనమునందే ఆకట్టుకొని ఆతని జీవితమునే మలుపు త్రిప్పిన సత్య హరిశ్చంద్రీయ నాటకమును రచించుట అనుకొనకుండ కాకతాళీయముగా జరిగిన ఒక యాదృచ్ఛిక విచిత్ర విశిష్ట మనోజ్ఞ సంఘటన. కడ జాతివానికడ కడునీచ దాస్యమునకు పాల్పడి, వల్లకాటి కాపరిగా జీవించు సత్యహరిశ్చంద్రుని దైన్యహైన్య శూన్య జీవనము పరదాస్యమున మ్రగ్గు ప్రతి భారతీయునకు ఒక మరక హెచ్చరికపొరాణికమైన సత్యహరిశ్చంద్రీయము నేటి స్వరాజ్య సమస్యకు ఒక చక్కని వ్యాఖ్యానము. బలిజేపల్లి వారి సత్య హరిశ్చంద్రీయములోని పెక్కుపద్యములు పలువురి దేశభక్తులను స్వరాజ్యోద్య మమునకు పురికొల్పినవి. ఒకపర్యాయము గాంధీజీ కాకినాడకు విచ్చేసినపుడు స్త్రీలు తమ యాభరణ ములను మహాత్మునికి సమర్పించిరి. సాంబమూర్తి గారి సతీమణికి రెండు చేతులకు రెండు బంగారు గాజులు తప్ప మరేమియు లేనందున ఆమె సిగ్గుపడి అట్లే నిలబడి ఉండినది. అపుడు సాంబమూర్తి రెండు గాజులిచ్చివేయక ఎందుకట్లు నిలబడి ఉంటివనిరి. కొడుకు శవదహనమునకు కాటిసుంకము చెల్లించుటకు కాసుచేత లేని చంద్రమతితో దళమౌపయ్యెదలోనడంగియు సముద్యత్కాంతు లీ రెండలిన్......వెచ్చించినన్ చాలదే అన్న హరిశ్చంద్రుని మాటలు స్ఫురణకు వచ్చినవట. (నవ్యాంధ్ర నిర్మాతలు-నవోదయ పబ్లికేషన్స్ పుటలు 144-145 ఆధారముగా)

## దేశభక్తి రచనలు - అభ్యుక్తులు

గురజాడ రాఘవ శర్మ గారు జాతీయ గీతాలు అను పేర గావించిన సంకలన గ్రంథములో బలిజేపల్లివారి పద్యములను గూడ కొన్ని ఉట్టంకించిరి. వారు భారతమాత, రక్తాభిషేకము, స్వరాజ్య సమస్య, ఆంధ్ర ఉద్బోధ, ఆత్మబలి అను శీర్షికలతో అచ్చుటచ్చుట కొన్ని పుటలలో పేర్కొనిన పద్యములు చాల వరకు స్వరాజ్య సమస్య లోని పద్యములే. రెండు మూడు శీర్షికలలో అనగా భారతమాత, రక్తాభిషేకము, ఆత్మబలి అనువానిలో గల పద్యములకు స్వరాజ్య సమస్య అను గ్రంథమున గల పద్యములకు సంబంధము కానరాదు. తక్కిన శీర్షికలలో గల పద్యములన్నియు స్వరాజ్య సమస్య లోనివే. అక్కడక్కడ కొన్ని ప్రసిద్ధములైన పద్యములను సంపాదకుడు గ్రహించి 60,113,114,253,254,295,296,319,320,321,411,412పుటలలో ముఖ్యములైన శీర్షికలకు కొన్నింటికి అనుబంధముగా ఉపశీర్షికలను గూడ పేర్కొనిరి.

**భారతజనని** : వానిలో మొదటిది భారతజనని అను ఉపశీర్షిక గల సీస పద్యము. ఇందు భరతమాత స్వరూపమును కవి ఎంతో చక్కగా నిరూపించిరి. మేఘ మండలమంటు మంచుకొండ జడముడిగా ముఖ సౌందర్యము దీపించుచు పర్వత శిఖరముల నుండి యిరువైపుల పర్వులెత్తు గంగా సింధువులు బాహువులై ముందుకు సాగగా, సౌరాష్ట్ర వంగ దేశములు కటిసీమ యందలి చేలాంచలములు కాగా, చోళకుంతల మళయాళ తీరములు పాద ద్వయములై పరిఢవిల్లగా, హిందూమహాసముద్రమే క్షీర సాగరమై, సింహళా ద్వీపమొక పద్మమువలె భాసిల్లగా నందలి మహాలక్ష్మివలె భారతమాత శోభించు చున్నదని ఆమెకు నిత్యాభివందనములు ఘటించి తరింపుడని లక్ష్మీకాంత కవిగారి సంప్రార్థనము. స్వరాజ్య సమస్యలోని ప్రథమ సీస పద్యము నందు కూడ నీరీతిలోనే భరతమాత స్వరూపాభివర్ణన గావింపబడినది. హిమవన్నగమాత పత్రముగా, సింధూ భాగీరథీనదులు వింజామరలు వీచు చెలికత్తె లుగా, తూర్పుపడమరలందున్న సముద్రములు నిరంతర ఘోషతో కైవారములు సలుపునట్లు ఆర్ష సంతీతి స్వస్తి వాచకములు పలుకగా, మాతృవైభవము స్వరాజ్య సమస్య యందు వర్ణింపబడగానిచట ఆమె శారీరక దీప్తి వివరింపబడినది.

**రక్తాభిషేకము**(పాంచాల పరాభవము): రక్తాభిషేకమను శీర్షికకు పాంచాల పరాభవమను నామాంతరమును సంపాదకుడు పేర్కొని ఉన్నాడు. భరత పుత్రులను సంబోధించుచు మూడు సీస పద్యములలో పాంచాల పరాభవము అభివర్ణితమైనది. మలమల మండు కరకు ఎండలో పసికూనలను నిలబెట్టుట, గుళ్ళాలను తోలు కొరడాలతో ముద్దు కుఱ్ఱలను చావమోదుట, పసికందు లెక్కడకు పోయినను వారిని పట్టి బంధించుట, మేము ఓర్వలేము ఈ బాధ మొఱ్ఱో అని మొరబెట్టు కొన్నను రక్తాభిషేకము గావించి సంతోషించుట, మొదలగు ఎన్నో కష్టములు పెట్టి తమ శక్తినంతయు ఆంగ్ల ప్రభుత్వమువారు ముఖ్యముగా పాంచాల దేశీయులపై ప్రదర్శించిరి. కావున మీరు గొడ్డు వారి వలెకాక అనుగు బిడ్డలున్న వారే అనుచు ఈ అవమాన భారము నుండి సోదరులను కాపాడుటకై ముందుకు రండని కవి భరత పుత్రులను సంబోధించెను. పంజాబులోని ఆడువారికి పెట్టిన బాధలను బలిజేపల్లి సీసపద్యమున వివరించిరి. ప్రక్కనొదిగి నిద్రించు మగలను మీరేల ఆవలకు పోనిచ్చితిరి. రైకలను చించి పారవైచి పోలీసులు వక్షములను పరీక్షించుట, ముసుగులు బలవంతముగ తీసి పారవైచి మాతో రండని పిలుచుట, కేలుదోయిని కాళ్ళక్రిందగ జొప్పించి చెవులు పట్టుకొనునట్లు చేయుట ఇట్లెన్నో పాశవిక పైశాచిక కృత్యములతో దొరలు పంజాబ్ సతులను అవమాన పరచినారు. మీకు నిజముగా మానమున్నచో, అక్కసెల్లెండ్ర బాధలను మాన్పుటకై ముందుకురండని లక్ష్మీకాంతకవి ప్రబోధించెను. తుట్టతుదిగా ఈ శీర్షికలో శూరవరులైన భారత కుమారులను వెన్నుదట్టి ముందుకురుకుడని పూర్వ చరిత్ర సంఘటనలను జ్ఞప్తికి తెచ్చెను. స్వరాజ్యమును ప్రతిష్ఠించిన శివాజీనాటి కార్యదీక్ష అడుగింటినదా? కంపెనీవారి మదమడచిన హైదరాలీ సాహెబ్ మహానంద దీప్తి మ్రుగ్గిపోయినదా? శత్రువుల నడచిన టిప్పుసుల్తాను నాటి అఖండధైర్యపటిమ చెదరిపోయినదా? ఝాన్సీలక్ష్మీ శీలమహిమ చెడినదా? మీలో లేశమైన పౌరుషము లేదా అని ఈ అభాగ్య కుమారులను బలిజేపల్లి హెచ్చరించెను.

**ఆత్మబలి:** కృష్ణాపత్రికలో 25-4-1936లో ప్రచురింపబడిన ఆత్మబలి అను శీర్షికకు ఈ జాతీయగీతాలలో స్వాతంత్ర్య సమరమను పేర సంపాదకుడు ఉపశీర్షికగా నామదేయమొసగెను. ఇందు రెండు సీసపద్యములు, మూడు శార్దూలములు, రెండు మత్తేభములు గలవు. భారతదేశము అన్ని దిక్కులలో దారిద్ర్యము ఆవరించినట్లు స్వాతంత్ర్య జ్యోతిని విధి నివారించెను. సత్యము, దయ అను రెండింటిని సాయకములుగ నాయకులు మంత్రద్రష్టలై గ్రహించిరి. మొట్టమొదట బొంబాయి నగరములో జాతి అభ్యుదయమునకై హేమంత ఋతువేళ అధ్వర్యము సాగినది. ఇట్లు కవి అదిహేమంతము అను ఎత్తుగడలో ప్రారంభించిరి. ఇందు హేమంతము, నిఖిలాశాంతము, స్థితిరీతి, స్వతంత్ర జ్యోతి, సాయక, నాయకోత్తములు, అధ్వర వరంబున్, ముంబాపురిన్ అను శబ్దాలంకారములు ప్రతిపాదమున కూర్చబడి ఎంతో గాంభీర్యమును కలిగించినవి.

తరువాత మూడు పద్యములు శార్దూలములు సామవేదము నెరిగిన పురోధసులు రాష్ట్రపతయే తుభ్యంనమోస్తు అని స్వాహా మంత్రములను అరువదేండ్లు ప్రేల్చినను వారి యాచ్నాదైన్యరేఖ నశింపలేదు. స్వాహా భర్త మందమందముగ వైముఖ్యముతో వర్తిల్లినాడు. జాతీయకాంతి వీర్య మంత్రములచే విప్పారి ప్రాచీ ముఖమున స్వాతంత్ర్యాగ్ని తప్పక జ్వలించునని కవి ప్రతిజ్ఞ గావింపబడినది. యాజియగు నౌరోజీ ఒక వినూత్నమైన పద్ధతిలో ఆహుతిని స్వరాజ్య మంత్రముతో ప్రేల్చెను. జాతీయకాంతి పెల్లివిరియు తిలక్‌మహాశయుడు స్వాహా నినాదములు పలికెను. అప్పుడు ఒక విద్యుత్ కాంతి యావద్భారత దేశమున సహస్ర ముఖములతో నాలుకలు సాచి ఆవిర్భవించినది. అంత తూర్పు, పడమరలలో మారుమ్రోగునట్లు త్యాగవీరులు వెనుదీయక నాకు ఆత్మబలి ఇండను ధ్వని పరమ గంభీరముగా వినవచ్చినది. ఇట్లమూడు పద్యములలో కవి స్వరాజ్య మంత్రమును పఠించుచు జాతీయ ప్రభను మహోజ్వలముగా ప్రకాశింపజేయు దాదాబాయి నౌరోజి, లోకమాన్య బాల గంగాధర తిలక్‌మొదలగు మహామహుల పిలుపునందుకొని ఎందరో త్యాగధనులు వెనుదీయక, ఆత్మబలి దానమునకు ముందుకురికిన సందర్భమును స్పష్టీకరించిరి.

తరువాత పద్యములందును ఆత్మబలి గావింపుడను ధ్వని విని సమస్తలోకము ఉఱ్ఱూతలూగినది. ఋత్విక్కులు చీకాకుతో గాంధీని చేరిరి. ఏమి పలుకవలెనో తెలియక పౌరాణికులు పరుగెత్తిరి. రాష్ట్రాధికారుల రాతి గుండెలు తడబాటుతో తప్పు దారిబడినవి. బలి, బలి అను కోలాహలము హాలాహలము వలె విజృంభింపగా ఆ పరాశక్తి ధాటికి ఆగలేక మితవాది హోతలు ముచ్చు మణిగి దొరలు మూల దివాణాలలో దూరుకొనిరి. అట్టి సందర్భములో ఆయజ్ఞ వేదికపై ఒకేఒక మహనీయవ్యక్తి దివ్యశక్తితో జనయిత్రీ, భూతధాత్రీ ఏమి అపచారము అని తనఆత్మను చీల్చి బలిగా అర్పించెను. అంత జైగాంధీ అన్న ప్రశంసా నినాదములు బ్రహ్మాండమెల్ల నిండినవని బలిజేపల్లి పేర్కొనిరి. తుట్టతుదిగా ఆత్మబలి శీర్షికలోని సీసపద్యములో త్యాగవీరకుమారుని సంబోధించుచు గాంధీగారి బాటలో అహింసాయుతముగా ప్రేమ రాజ్యమును ఆర్జించి విదేశీయ నాగరికతా విషావేశ మూర్ఛితులైన ప్రియ సోదరుల నుద్దేశించి ఆడంబరమును, ప్రశాంతతను కోల్పోయి, గ్రామ జీవన స్థితిని పునః ప్రతిష్ఠించి ఆధ్యాత్మిక క్రియాశక్తి మూల కీలకమైన రాట్నమును శ్రుతుల మేళవించి విశ్వ ప్రపంచ తారక జ్యోతి వెలుగొందగా శాంతి స్వతంత్రగీతిని పాడవలసినదని ప్రబోధించిరి.

బలిజేపల్లి లక్ష్మీకాంతముగారి దేశభక్తిని జాతిపిత గాంధీ మహాత్మునిపై వారికిగల ప్రగాఢాభిమానమును తెలియుటకు స్వరాజ్య సమస్య, ఆత్మబలి వంటి ఖండ కృతులు ప్రబల సాక్ష్యములు. ముఖ్యముగా స్వరాజ్య సమస్యయందు వీరు ప్రాచీన భారతదేశ ప్రాభవమును నాటి ప్రభువుల మహోజ్జ్వలౌదార్యము, ఒక్కొక్కయుగములో భారతదేశ ఖ్యాతిని ఇనుమడింపజేసిన చక్రవర్తుల శక్తి సామర్థ్యములను వారి పరిపాలనలో వికసించిన సకల కళాదిక విభవమును, ముస్లీం ప్రభువుల పరమత సహనము వివరించెను. అందు ప్రధానముగా ఈస్టిండియా కంపెనీ వారి దురాగతమే వివరింపబడినది.. ఈస్టిండియా కంపెనీ వారి ప్రవేశము, ఇచ్చట వారి నివేశము, వారు భారతీయులకు కల్గించిన ఆగ్రహావేశములు, వారి తరువాత విక్టోరియా రాణిపరిపాలనలో పైపై ఊరడింపుల మాటలతో స్వేచ్ఛా ప్రతిబంధకముగా ఎన్నో శాసనములు కల్పించి యమయాతనలు పెట్టిన వివిధ సందర్భములు వివరింపబడినవి. గాంధీ మహాత్ముని అవతరణము, పాంచాల పరాభవము, ఆంధ్రోద్బోధ (ఆంధ్రవిద్యార్థులకు ఉద్బోధ) మొదలగు ఎన్నో విషయములను బలిజేపల్లి ఒక క్రమ పద్ధతిలో ప్రకటించిరి. ఆధునిక విమర్శకులు జరిగిపోయిన సంఘటనలు త్రవ్వి తలకెత్తు కొన్న ఫలితమేమున్నదనవచ్చును. చరిత్రలో గత వైభవమును స్మరించి ఆధునిక దుస్థితులతో సమన్వయించుట భావిపురోభివృద్ధికి బాట వేయుటయే ఈస్టిండియా కంపెనీవారి ఉద్దేశ్యములను, నాడు భారతీయులు పడిన పడరాని పాట్లను ఇంత విపులముగా చర్చించిన కృతులు లేవు. ఈ విషయమున బలిజేపల్లివారి కృతి ప్రశంసింపదగినది.

## బలిజేపల్లివారి పీఠికలు-పరిశీలన

బలిజేపల్లి స్వీయ కావ్యములకు ఇతరుల కృతులకు వ్రాసిన పీఠికలు కొన్ని లభ్యములు. పీఠికలలో కావ్య విషయ ప్రశస్తిని, కవి ప్రతిభా ప్రసక్తిని ఓతప్రోత మొనర్చి సంగ్రహముగా చక్కని చిక్కని వచన రచనలో రస హృదయుడైన సహృదయుడుగా వీరు తమ అభిప్రాయమును వెల్లడించుచుందురు. పద్య రూపమున కూడ వీరు అభిప్రాయముల వెల్లడించిన సందర్భములున్నవి.

**శివానందలహరి పీఠిక:-** వీరు తమ కృతులకన్నిటికి పీఠికలు రచింపలేదు. విశేషవిషయములు వివరింపవలసిన అవసరముగల కొన్నిటికే సంగ్రహముగా ఉపోద్ఘాతములను వ్రాసిరి. ముముక్షువులెందరో గ్రంథములకై జాబులు వ్రాసి విసివిన తరుణములో ఆస్తికవరేణ్యుడు, కవి బాంధవుడునైన శ్రీయుత పర్వత రామచంద్రారెడ్డి గారు సర్వజన సుపర్వముగా పర్వతమంత మహోన్నత భావముతో శంకర శ్లోకములు అను వాద పద్యములు విని ఉత్సాహభరితులై ముద్రణ మూల్యము నొసగి ముద్రింపించిరని రెండవ కూర్పు పీఠికలో ప్రకటించిరి. ఇందు మొదటి కూర్పు

ఎప్పుడు అచ్చైనదో ఆకూర్పునకు ఏమి పీఠిక వ్రాయబడినదో తెలియదు. 5-7-1930 గుంటూరులోనున్నప్పుడు ఈగ్రంథము ప్రచురింపబడినది. శ్రీమంతులైన శ్రీయుత పర్వత రామచంద్రారెడ్డి గారు అల్లూరు వాస్తవ్యులు. వీరు **ఆస్తిక శిఖామణులు.** నాట్య గాన కళా కోవిదులు. **రత్నం రత్నేన సంగచ్ఛతే** అనునట్లు నాట్యగానాది లలిత కళాకోవిదులైన పర్వతరెడ్డి రామచంద్రారెడ్డి గారికి లలితకవితా కళానిధియైన బలిజేపల్లి వారికి కళాభిమాన పురస్సరము గానే ప్రగాఢ పరిచయమేర్పడియుండునని మనము గ్రహింపవచ్చును. కృతి శివానందలహరియగుటచే ముద్రణ మూల్యమొసగిన రామచంద్రారెడ్డికి దీర్ఘాయురారోగ్యములనను గ్రహించుటకైపరమేశ్వరుని నిరంతరము భజింతుము గాక **అని** సామూహిక సంప్రార్థనతో ఆశీర్వాద పూర్వకముగా లక్ష్మీకాంత కవి పీఠికను ముగించిరి. ఆస్తిక వరేణ్యునకు, కవి బాంధవునకు లక్ష్మి సరస్వతీ కటాక్షములచే కూర్చి పరమేశ్వరుడనుగ్రహించునని కవి ఆకాంక్షించిన విధానము ఎంతో అర్థవంతముగా, ఔచిత్యస్ఫోరకముగానున్నది. వీరి పీఠికలు సూక్ష్మములో మోక్షమన్న పద్ధతిలో ఎంతో సంగ్రహముగా సర్వవిషయమును సూచించుచుండును. వీరి అనూదిత రచనలలో శివానందలహరి రెండవ కూర్పునకు మాత్రమే పీఠిక లభ్యము. ఇక ఉత్తర రాఘవమునకు వీరే సుదీర్ఘమైన ఉపోద్ఘాతమును విభిన్న విషయ పరామర్శతో ప్రకటించిరి. రచనలు రసనిర్భరములుగా సహృదయ హృదయైకవేద్యములు కావలెనే కాని పీఠికలతో పనియేమి? అను తత్త్వము వీరిది. కావుననే వీరు తమ గ్రంథములకు ఇతరులచేత పీఠికలు వ్రాయించుట గాని లేక స్వయముగా పీఠికలు వ్రాయుటగాని చేయలేదు.

**ఉత్తర రాఘవము-పీఠిక:** ఉత్తర రాఘవమున తానను సరించిన అనువాదవిధానము, కథావస్తువునకు సంబంధించి వివిధ రసవాదముల పరామర్శగావించు నిమిత్తమై కొంత సుదీర్ఘమగు ఉపోద్ఘాతమును వ్రాసిరి. బలిజేపల్లి లక్ష్మీకాంతంగారు గుంటూరులో చంద్రికాముద్రణాలయాధినేతలై గుంటూరు షష్టు కంపెనీవారు కోరిన మేరకు నాటకములు రచించి కొన్ని నాటకములలో తాను నటించి మిగులపేరు గడించిరి. బుద్ధిమతీవిలాసము, సత్యహరిశ్చంద్రీయము, సాత్రాజితీయము మొ॥ అనేక నాటకములు రచించిన పిదప ఉత్తర రామచరిత్ర నాటకమును కొలది మార్పులతో ఉత్తర రాఘవమను పేర ఆంధ్రమున అనువదించిరి. ఈ కావ్య పీఠిక ప్రారంభమున భవభూతి ఉత్తర రామ చరితనాటకము ఒకదివ్యామృతస్రవంతి కాగా, ఆ స్రవంతిలోని పిల్లకాలువయే తన ఉత్తర రాఘవమని పేర్కొనిరి. ఇది మూలమునకు మక్కీకిమక్కికాక, స్వేచ్ఛానువాదమగుటచే ఉత్తరరాఘవమని పేరు మార్చినట్లు ప్రకటించిరి.

భవభూతి వృత్తాంతమును, అతని పాండిత్య విశేషము, ఇతర గ్రంథములు వీరిని వామన క్షేమేంద్రాదులు అనుకరించిరన్న విషయమును **ఉత్తరే రామచరితే భవభూతిర్విశిష్యతే** అను ఆభాణకము సిద్ధించుటకుగల కారణములను రామాయణము, జైమిని భారతమునుండి గ్రహించిన కథాంశములతో ఉత్తర రామ చరితమునకు ప్రసిద్ధిని కూర్చిన విధమును, కాళిదాసు, భవభూతుల కవితాతారతమ్యమును బలిజేపల్లి సంగ్రహముగా వివరించిరి. సీతా పరిత్యాగము న్యాయ్యమా? అను విషయమును మొదట కాదను వారి ఆక్షేపణలను ప్రతిపాదించి పరిత్యాగము ధర్మ్యమే అని నిరూపించుటకు కాలే పండితుని అభిప్రాయమును కూడ ఆంగ్లమున ప్రకటించిరి. ఇక రసవిచారమును గూర్చి అది కరుణమా, విప్రలంభమా, వీర రసమా అను భిన్న వాదములను పరిశీలించి చిరకాల ప్రవాసము విప్రలంభమే అగును కాని కరుణము కాదనిరి. **సీతా జీవితాశ ఉన్నదా లేదా తేల్చుకున్నచో** అది ఏ రసమో సిద్ధాంతమును భవభూతి ఒకపాత్ర మూలమున ప్రతిపాదించుటచే వీర శృంగారములేకాక కరుణరసమును ప్రధానముగా ఉండవచ్చునన్న అభిప్రాయమును సమీక్షించుచు **సీతా జీవితాశ** ఉండుటచే కరుణవిప్రలంభమే యిందు ప్రధానమని, దానికి అయిదు హేతువులను చూపిరి. ఉత్తర రాఘవమున విప్రలంభమే అంగి, కరుణ అంగమని నిర్ధారించిరి. ఈ కనుంగవ తనువుపైరోసి కన్నీరు మున్నీరు అను పద్యము మొదలు కమనీయంబులు అను పద్యము వరకు గల సీతా వాక్యములన్నియు ప్రత్యాశను పోషించునవియే కాన కరుణ విప్రలంభమే అంగి అగుననరి.

ఇది వీర రసము ఏలకారాదు? రాముని ధర్మ వీరత్వము అడుగడుగున అభివ్యక్తమగుచున్నది కదా అని కొందరు తలపోయవచ్చునని తెలుపుచు సిద్ధాంత భారము రసజ్ఞుల లోకమునకే వదలి ఈ చర్చ నుంచి యిక విరమించెదను అనిరి. పీఠిక తుదిలో ఆంధ్రీకరణము అను శీర్షిక క్రింద తన అనువాదమున ఎచ్చటెచ్చట ఎందువలన మార్పులు చేయబడినవో సంగ్రహముగ స్పష్టీకరించిరి. ఉన్నతోద్రేక భావములు లేక కేవల కథా సరణిని అనుసరించు శ్లోకములకు గద్యమే వ్రాసితినని తెలిపిరి. వర్ణన ప్రధానములైన కొన్ని శ్లోకములను మానివేయుటకు హేతువు అవి నాట్యానుకూలములుకావనిరి. కొన్నిచోట్ల స్వతంత్ర రచనలు చేసితినని తెలుపుచు ఏయే అంకములలో ఎక్కడెక్కడ మూలమునకు భిన్నముగా స్వతంత్రతను పాటించెనో సంగ్రహముగా తెలిపిరి. ప్రథమాంకమున 1.కలిసినివ్వారి 2.దొరకునా 3.ఎలమికన్నీటి 4.పనికత్తెలెందఱు 5.సేవానంతయు 6.పరమసాధ్వీత్వ అను పద్యములు పూర్తిగా ద్వితీయాంకము, తృతీయాంకమున శంబూకవధ ఘట్టములో మను మార్గమ్మిది అను పద్యము వరకుగల భాగము, పంచమాంక ప్రారంభమునగల విష్కంభకము స్వయముగా కల్పించి వ్రాసినవే అని నాల్గవ అంకమునగల విష్కంభకము మూలమునకు సంగ్రహానువాదమని తమసా పాత్రమును ప్రదర్శనా సౌలభ్యమునకై మానివేసితినని కవి విన్నవించెను. వదలివేసిన విషయములను వీలుచూచుకొని ఆంధ్రలోకమునకు అందింతునని చివర సవినయముగా విన్నవించుకొనిరి. ఆంధ్ర విశ్వ విద్యాలయము వారు ఇంటర్మీడియేట్ తరగతికి పఠనీయ గ్రంథముగా నిర్ణయించుటచే మూడవతూరి ముద్రణకు అవకాశము కలిగినదని తెలుపుచు ఈ కూర్పులో ఉచితములని తోచిన కొన్ని మార్పులను కూడ చేసినట్లు ప్రకటించిరి. ముద్రణకు అవకాశము కల్గించిన వారికి కృతజ్ఞతలు కూడ వెల్లడించిరి.

కృతజ్ఞతలకు ముందుకవి ఉపోద్ఘాతము తుదిలో కలుషంబుల్ తొలగించి ఈకథ జగత్కల్యాణమై మేలు వర్ధిల్లజేకూర్చునుగాక అను పద్యమున ఈ రూపకములోక జనయిత్రి జాహ్నవిని బోలి నిరంతరము వాక్బ్రహ్మకవి ప్రరూఢమగుగాక అనియు రంగస్థలములలో విద్వన్మణులింపార దీనిని సేవింతురుగాక అనియు ప్రస్తుత నాటక ప్రయోజనమును తెలిపి అది భవిష్యత్తులో అందరకు ఆనందమునందించు సాధనమై రాణింపవలెనని ఆశించిరి. బలిజేపల్లి లక్ష్మీకాంతకవిగారు గుంటూరులో ఉన్నప్పుడు 10-7-1930నాడు ఈ పీఠికను రచించిరి. శివానందలహరి రెండవ కూర్పు ఉత్తర రాఘవము మూడవ కూర్పు ఐదు దినములు ముందు వెనుకలుగా రచింపబడినట్లు వీరి కావ్య పీఠికలను బట్టి తెలియుచున్నది. ముఖ్యముగా ఈరెండు గ్రంథములకు తప్ప తక్కిన గ్రంథములకు ఉపోద్ఘాతములు లభించుటలేదు. ఇక వీరితరుల కృతులకు అభిప్రాయములు వ్రాయునపుడు కూడ ఎంతో సంక్షిప్తతను- ఔచిత్యమును పాటించిరి. మచ్చునకు మనకు లభ్యములైన ఒకటి రెండు కావ్యముల పీఠికలను పరామర్శింతము.

**శ్రీకృష్ణలీలాస్తవము-పీఠిక:**

1951వ సంవత్సరమున ముద్రితమైన బూరగపల్లి వేంకట కృష్ణాచార్యులగారి శ్రీ కృష్ణలీలాస్తవమునకు కవితాకళానిధి బలిజేపల్లి లక్ష్మీకాంతకవి తమ అభిప్రాయమును పొందుపరచిరి. నెల్లూరు వాస్తవ్యులైన బూరగపల్లి వేంకటకృష్ణాచార్యులు 1938లో వ్యాధిగ్రస్తులైయున్న సందర్భమున దీనిని రచించిరి. మద్రాసు ప్రభుత్వ ఆస్థాన విద్వాంసులు బ్రహ్మశ్రీ శ్రీపాదకృష్ణమూర్తి శాస్త్రులు గారు ఇందలి లోపములను సవరించి 20-10-1941వ తేది రాజమండ్రి నుండి తమ అభిప్రాయమును కూడ అందజేసిరి. ఇందలి పద్యములు కీ.శే.దాసు శ్రీధరరావుగారు తమ ఆంధ్రవాణి పత్రికలో ప్రచురించిరి. అనంతరము పశ్చిమాంతర్గత పాలమూరు గ్రామ వాస్తవ్యులు క్రొత్తపల్లి సోమసుందరరావుగారు దీనిని రాయల ముద్రణాలయము తణుకులో జూలై 1951లో ముద్రించిరి. ఈ గ్రంథమునకు రాజమండ్రి వాస్తవ్యులు సుసర్ల రామమూర్తి గారు 25-10-1951 మదరాసు త్యాగరాయ నగరులోనున్న చతుర్విధ కవితా విశారద పురాణం పిచ్చయ్య శాస్త్రిగారు

కూడ తమ అభిప్రాయమును వ్రాసిరి. వారు ఈతడు కవిత్వమందేకాక దృశ్య నాటకములయందు శబ్ద చలనచిత్రముల యందు నటించెడి ధీశాలి. సాధు స్వభావము కలవాడు. కావుననే యీకవి రసపోషణమునందు కొంతవరకు అనుభవము గలవాడని చెప్పకతప్పదనిరి. శ్రీరామ ప్రభూశతకమును వ్రాసి ప్రచురించిన విషయమును కూడ తమ పీఠికలో నుట్టంకించిరి.

బలిజేపల్లి లక్ష్మీకాంతం కవిగారు మద్రాసులోనున్నప్పుడు 5-5-1951లో ఈ గ్రంథమునకు తమ అభిప్రాయమును పంపిరి. కవిగారివలన కొన్ని పద్యములను వింటిననియు, తానీ శతక రాజమును స్థాలీపులాక న్యాయముగా చదివితిననియు తెలుపుచు శ్రీరామప్రభూశతకము, శ్రీకృష్ణలీలాస్తవమునకు ముందే ముద్రితమై ఆస్తికుల హస్తమలంకరించి ద్రాక్షారూపమున అందింపబడినదను విషయమును వివరించిరి. వీరి రెండు శతకములును భక్తులకు ప్రత్యహము పఠనీయమైయున్నవనియు పద్యములు నాతి కఠినముగ్సు శైలితో ద్రాక్షాపాకమునకుదుర్కొని చదువరులకు ఆస్వాదనీయముగా నున్నవని ఒకే సందర్భమున రెండు పుస్తకముల ప్రసక్తిని సందర్భ సముచితముగా వివరించిరి. తుట్టతుదిగా లక్ష్మీకాంతకవి మధ్వశ్రీ బూరగపల్లి వెంకటకృష్ణాచార్యులను ఆశీర్వదించుచు ఇంకను మరికొన్ని కావ్యముల రచించుటకు శ్రీరామ కృష్ణులీకవిగారికి దీర్ఘాయురారోగ్యములిచ్చి వీరి కవితకు పరిణత స్థితి కలిగింతురుగాక అని కోరుచున్నట్లు పీఠికను ముగించిరి. రచనలో కృష్ణలీలాస్తవము మొట్టమొదటిదైనను రామప్రభుశతకము ముందుగా ప్రజలకు ద్రాక్షారూపమున అందింపబడినదను వాక్యము ప్రాతిపదికగా గ్రహించి, అటుపై ఆరెండు పుస్తకములను గూర్చి ప్రతి వాక్యమున చర్చించుట ఏకక్రియాద్వ్యర్థికరీ అను ఆభాణకమును తలపించుచున్నది. రామ కృష్ణ ప్రభు శతకమును శ్రీకృష్ణ లీలాసప్తవమును రచించుటచే ఆ యిరువురు దేవతలు వేంకటకృష్ణాచార్యులకు దీర్ఘాయురారోగ్యములిత్తురని శుభాశంసలు పేర్కొనుట లక్ష్మీకాంత కవి సమయ సముచిత రసమయవాక్సిద్ధిని నిరూపించుచున్నది. కేవలము దీర్ఘాయురారోగ్యము లిచ్చుటయేగాక వీరికవితకు పరిణతస్థితి కలిగింతురని పేర్కొనుట గమనార్హము. భవిష్యత్తులో ఇంకను పరిపక్వతను సంతరించుకొన్న గ్రంథములను శ్రీ బూరగపల్లి వేంకటాచార్యులు గారు వెలువరింపగలరని వారి ఆశాభావము.

**సరస్వతీ రామాయణము- పీఠిక:-**

బలిజేపల్లివారు ఒండురెండు గ్రంథములకు పద్యరూపముననే కావ్య ప్రశంస గావించి ఉన్నారు. అట్టి వానిలో సరస్వతీ రామాయణము ఒకటి. సరస్వతీ రామాయణము కవయిత్రి పతివ్రతాశతకము, సరస్వతీశతకము, ఆత్మోపదేశము రచించి మీర్జాపురసంస్థానమున విద్యాధికారిణిగా ప్రసిద్ధినొందిన విదుషీమణి. స్నేహలత కవితాసంఘము, కొల్లాపురము కర్నూలు జిల్లావారు 1933లో ప్రచురించిన సరస్వతీ రామాయణము పుటలో ఉయ్యూరు సంస్థాన పండితులు కవితా కళానిధి బలిజేపల్లిగారి అభిప్రాయము ఒకేఒక పద్యమున కలదు. భవాంభో రాశి సంతారకంబగు రామా యను నక్షరద్వయ మెందాక వినబడునో అందాక సారవచోవీధి సరస్వతీ కధితమీ రామాయణము ముముక్షులింటింట పఠింపగా ఎంతో ఔన్నత్యమును ఈ ఆంధ్రలోకమునకు సెనగజేయునని తమ శుభాశంసలు తెల్పిరి.

తారకమంత్రమైన రామనామము సంసార సాగరమున తరింపజేసి నిత్యమును కర్ణామృత ప్రాయమై సర్వలోక సుపర్వమై సేవ్యమగుచున్నదను సర్వ సామాన్యమైన అభిప్రాయమునకు సరస్వతీ రామాయణము యొక్క విశేషత్వమును కవి ఎంతో ఔచిత్యముగా సమన్వయించిరి. సరస్వతి వ్రాసిన రామాయణము ప్రతి ముముక్షువు నింట ఉండి తీరుటయేకాక దానిని పఠించుటవలన ఎంతో ఔన్నత్యము తప్పక కలిగి తీరునని బలిజేపల్లి వారు భావించిరి. వ్రాసిన వ్యక్తి సారతర వాక్పటుత్వము కలిగిన వ్యక్తి అని వీరు తెల్పిరి. సారవచోవీధి అను వీరి ప్రయోగము రామ నామ వైశిష్ట్యమును, సరస్వతీ సారవాక్ విభవత్వమును చాటుచున్నది. వీధి అన్న ప్రయోగము అది

ఎంతో విస్తరించి అందరికి అందుబాటులోనుండి ఆనందమును కల్గించుననన్న భావమును స్పష్టీకరించుచున్నది. ఉయ్యూరు సంస్థానపండితులుగ ఎంతో పేరు కెక్కిన లక్ష్మీకాంతకవి నుండి మీర్జాపుర సంస్థాన విద్యాధికారిణియైన సరస్వతి అభిప్రాయమును కోరుటకు ముఖ్యహేతువు వారానాడాంధ్రదేశములో లబ్ధప్రతిష్ఠులైన కవి పుంగవులలో ఒకరైయుండుటయే. కర్నూలు రిజిస్ట్రార్ కార్యాలయములో నుండి, తమ కవితా రచనచే చుట్టు ప్రక్కల మంచి పేరు ప్రతిష్ఠలు గడించి, అటుపై వీరుయ్యూరు సంస్థాన పండితులుగా నియమితులై యుండవచ్చునని ఊహింపవలసియున్నది.

**కురంగీ కిరాతము-పీఠిక:**-వేపకొమ్మ ఆదిశేషయ్య రచించిన కురంగీకిరాతము నెల్లూరు ప్రభాత ముద్రణాలయమున ప్రచురింపబడినది. కావ్యాంతమున అభిప్రాయములు ముద్రింపబడినవి. కవితా కళానిధి బలిజేపల్లి లక్ష్మీకాంతకవిగారు ఈ కావ్యమునకు వాత్సల్యపూర్వకముగా మిగుల సంగ్రహమైన అభిప్రాయమును నాలుగు వాక్యములలో రచించిరి. లక్ష్మీకాంతకవిగారు ఆదిశేషయ్యను వత్సా అని సంబోధించి ప్రోత్సాహకరముగా ఈనాలుగు వాక్యములు వ్రాసిరి. నీ కురంగీ కిరాతమును చాలా వరకు చదివితిని. కవిత్వము సలక్షణమై పూర్వకవి మార్గమున నడచుచున్నది. భావము నందుకాని, పలుకుబడియందు గాని తెలుగు బోలికలు చెడలేదు. చదివినంతవరకు ప్రతి పద్యము ధారాళమగు శైలితో బునఃపునః పఠనమునకు నోరూరించునదిగానున్నది.

సమగ్రముగా చదువకున్నను స్థాలీపులాకముగా కొంత చదివి అందలి రచనా పద్ధతిని లక్ష్మీకాంతకవి సలక్షణముగా పూర్వకవి మార్గానుసారిగా భావములో, పలుకుబడిలో తెలుగుదనము చెడక ప్రతి పద్యము ధారాళమగు శైలితో మరల మరల చదువుటకు పురికొల్పునట్లున్నదని తెలిపిరి. నోరూరించినదిగనున్నది అను ప్రయోగము రసవంతముగానున్నదనుటకు సూచన. లక్ష్మీకాంత కవి పూర్వకవి మార్గానుయాయి. భావములో, పలుకుబడిలో తెలుగుదనమునకు ప్రాధాన్యమునిచ్చు కవి వతంసుడు. కురంగీకిరాతము కరుణరస భరిత కావ్యము. లక్ష్మీకాంత కవికిని, కరుణ రసభరిత చరితము మిగుల ఆసక్తికరము. ఈ పీఠికలో కవి పేర్కొన్న నాలుగు వాక్యములలో స్వీయ కవితా లక్షణములును ద్యోతకములగుచున్నవి.

తరువాతి పంచమ పరిచ్ఛేదమున బలిజేపల్లి లక్ష్మీకాంత కవిగారి ఇతర లఘుకృతులు-అందువారి వ్యక్తిత్వ విశేషములు వివరింపబడనున్నవి. కొన్ని కొన్ని లఘుకృతులు ఒక్కొక్కపద్యము నందే అత్యద్భుత కవితాసౌందర్యమును పుణికి పుచ్చుకొని వీరి కవితా కళానిధిత్వమును జాలువార్చినవి. ఇకవీరి లఘుకృతులలో గల కవితా ప్రతిభా వైదగ్ధ్యములను గూర్చి సంగ్రహముగా సమీక్షింతును.

## పంచమపరిచ్ఛేదము (ఇతరలఘుకృతులు-సవిమర్శక పరిశీలన)

బలిజేపల్లివారు దేశసంబంధమగు లఘుకృతులనేగాక వివిధ సందర్భములలో ఎన్నో విషయములను గూర్చి ప్రతిభామనోజ్ఞముగా చిన్నచిన్న ఖండికలను రచించిరి. ఇందు ఎన్నదగినవి సన్మాన పద్యములు, కావ్యగుణప్రశంసలు, పీఠికలు, స్మృతి పద్యములు. ఒక్కొక్కప్పుడు ఒకేపద్యములో తమ అభిప్రాయమును వివరించిన వివిధ సందర్భములును కలవు. ప్రశంసాపద్యములలో వేలూరి శివరామ శాస్త్రిగారి శతావధాన నిర్వహణ నైపుణ్యమును అవధాన సారములో తిరుపతి వేంకటేశ్వర కవుల ప్రశంస రెండు పద్యములలో కలదు. దేశభక్తి కొండా వెంకటప్పయ్యగారి సన్మాన సందర్భమున సమర్పించిన సన్మానపత్రము ప్రస్తుత లఘుకృతులలోనొకటి.

**అవధానభారతి:-** బలిజేపల్లి రచించిన ఖండికలలో కొన్ని స్వాగత పద్యములు, కొన్ని ప్రశంసాపద్యములు. మరికొన్ని స్మృతి పద్యములు, ఇకకొన్ని పీఠికలు. ఇట్లే వివిధ సందర్భములకు సంబంధించిన పద్యములు ఎన్నోకలవు. అట్టివానిలో వేలూరి శివరామ శాస్త్రిగారి అవధానమును అభినందించుచువ్రాసిన 4 9 పాదముల అభినందన కుసుమములు అను చంపకమాలిక ఎన్నదగినది. బలిజేపల్లి లక్ష్మీకాంత కవి ఈచంపక మాలికలో మొట్టమొదటగ వేలూరి శివరామ శాస్త్రిగారిని

రసకళాధురంధర, లసవ(ద్రస కవితాభిరామ వేలూరి శివరామనామ అని సంబోధించిరి.

అనంతరము ఆతని శేముషీ విభవమును, కవిలోకముదావహ శాస్త్ర సాహితీ పరిచయము, సుబంధుర బంధ నిబంధన విలసిత చమత్కార రచనా వైశిష్ట్యమును ప్రశంసించిరి. అవధాన విధాన నిధానుడైన శివరామ శాస్త్రిగారి యశస్సుదిగంతములు వ్యాపించినదని వెల్లడించుచు ఆయన ప్రతిభను అనేక సంబోధనలలో అభినందించిరి. పిమ్మట తాను వారి కవన వైఖరి వింటినని తెల్పుచు అది సురసరిత్ప్రసార సరణిని అధిగమించిన వైఖరిని ఒకటికి నాలుగుపాదములుకల సుదీర్ఘ సమాసమున నురువులతో పరువులెత్తు గంగానదీ సముత్తుంగ భంగ భంగిమల భంగిననుకరించు ధోరణిగల కవితా విధానములో బలిజేపల్లిగారు ఎంతో చక్కగా అభివర్ణించిరి. శివరామశాస్త్రిగారి సువచః పరిపాకమును వినుటయేకాక ప్రత్యక్షముగా గాంచగలిగితినని తెల్పిరి. అట్లులై గోపికా వల్లభుడైన మురళీ కృష్ణుని వేణు నాదముల పోలిన మాధురీ ధురంధర వరగాన రాగ శ్రవణానందము చెవులకింపుగ చవుల నింపగలిగినదని అభినందించిరి. అంతేకాక రసికుడైన బలిజేపల్లి తాననుభవించిన అవధాన కవితారసానుభవములను ఒక ఒయ్యారి తన తళుకు బెళుకుల కమ్మందనపు సొంపులతో మునివంట నొక్కసోలజేసి రసములు కురియించినట్లు శివరామశాస్త్రిగారి అవధాన కవితా కన్యక రసికులనెల్ల నలరించినదని వివరించిరి. భావ విస్ఫురణ, అర్థముల సొంపు, అలంకారవైఖరి, పాకము, ప్రసాద స్ఫూర్తి మొదలగు గుణములన్నియు శివరామశాస్త్రిగారికి వారి గురువులైన తిరుపతి వేంకట కవుల నుండి వరములుగ సంక్రమించినవని తెలిపిరి. అట్టిశయ్య, నుడికారము, రససిద్ధి, అర్థగౌరవము, పదప్రయోగము వారి గురువులకు కాక తక్కిన వారికి లేవని నిర్ధారించుటకు కవులు కొందరు నుడికారములేని వికారపాకముగల రసహీనములు కొరగాని పదములు చెత్తను చేర్చి తలబ్రద్దలు కొట్టుకున్నను అర్థముకాని పద్ధతిని పాటించివట్టి ప్రాసలు, యతులు కూర్చి చినిగిపోయిన గుడ్డకు మాసికలు తగిలించినట్లు ఎకసెక్కపుకైతలనల్లుట ఎంత తెలివి తక్కువ తనమో సూచించిరి. కవితకు, కవితాంగనకు రసమే ప్రాణము. అట్టి రసము లేని పీదరకవిత శవతుల్యము. అట్టి రసహీన కవిత్వమును విను శ్రోతల వేదననికచెప్పవలెనా? దట్టపు చీకటిలో అమావాస్య రాత్రి ముండ్ల డొంకలో ఒంటరిగా పయనించెడి బాటసారి ఎంతగా కడగండ్ల పాలగునో అట్టిది నీరస కవిత్వపు అనుభూతి అని సత్కవిత్వమునకు, అసత్కవిత్వమునకుగల వ్యత్యాసమును బలిజేపల్లివారు చక్కని దృష్టాంతములతో కన్నులకు కట్టినట్లు నిరూపించిరి. ఇట్లు మంచి చెడ్డల కైతలను పరామర్శించి సరస కవిత్వలాభము, మూడు జన్మల పుణ్య ఫలమని అట్టి పుణ్యప్రద కవిత్వము ఏ తపః ఫలము వలన పొందితివో సరస స్ఫుటవాక్కవితాలతాంగి నీ చరణముల నాశ్రయించినది. సాహిత్యము నీకు జతకూడినది. ధారణా తరుణియు తనంతతా వలచి వచ్చినది. ఎంతో ఓర్పుతో గురుసేవ చేసి పొందిన ఈకళకు నీ వలన సాఫల్యము ఒనగూడినది. ఈ శతావధాన సందర్భమున నీ ధారణా పటిమ తప్పకుండ ఇచ్చుట నూర్గురికి ఒసగిన సమాధానము నీ గురువుల పేరు నిల్పి ఇంతమంది కోవిదులను సంతృప్తి పెట్టినది. నిన్ను కన్న తల్లితండ్రుల భాగ్యమే భాగ్యము. ఇట్టి ఘన పాండిత్యమును నేర్పిన గురువర్యులు తిరుపతి వేంకటకవులు ధన్యతను గాంచిరి. ఆధునిక యుగములో గురువులకు పంగనామమిడు శిష్యులే అధికులు. కాని నీవట్లు కాక సుస్థిర వినయాభిరాముడవై, గుణసింధుడవై గురువులు గర్వించు నట్లు మెలగితివి. నీ పరువు ప్రతిష్ఠ చిరకాలము వన్నెకెక్కగా భగవంతుడు నీకు చిరాయువు ఒసగునని ఆశీర్వాదపూర్వకముగా అభినందన కుసుమాంజలిని బలిజేపల్లివారు ఘటించిరి. ఇట్లే చంపక మాలికలో కవి ప్రదర్శించిన కవితావైభవము ప్రశంసార్హము. శతావధాన సందర్భమున వేలూరిశివరామ శాస్త్రిగారి కవితా విలాసమునకు మూలకారకులైన తిరుపతి వేంకటకవుల వైదుష్య, వైదగ్ధ్యములను ఈ సందర్భమున స్మరణకు తెచ్చి ఆశీస్సులొసగిన విధానము నిజముగా అభినందనీయము.

**2. తిరుపతి వేంకటేశ్వర కవిత్వ ప్రశంస:** - 1 9 3 4 బందరు మినర్వా ప్రెస్‌లో ముద్రితమైన తిరుపతి వేంకటేశ్వరుల శతావధానసారము అనుబంధము 1 4 6 వ పుటలో బ్ర. శ్రీ బలిజేపల్లి లక్ష్మీకాంతం గారు జంటకవుల కవిత్వమును ప్రశంసించిన రెండు పద్యములు గలవు. అందొకటి మత్తేభము మరియొకటి శార్దూలము. ఎందరెందరో కవిత్వమల్లు బుధలోక శ్రేణి వేనోళ్ళ రుచిరాలంకారయుత భాషతో తనివితీర జంటకవుల లలిత కవితను నుతింపగా ఇకనే వర్ణింపవలసిన దేమున్నది. ఏది పలికినను పునరుక్తియే అగునని మత్తేభవృత్తమున బలిజేపల్లివారు ప్రశంసించిరి. పలువురు కొనియాడిన కవితను మరల నేను ప్రశంసించుటకు పూనుట పునరుక్తియేయని ప్రస్తుత పద్య సారాంశము. కాని ఈ భావమునే బలిజేపల్లి ఎంతో లలిత లలితముగా మేల్పలుకుల పలుకుబడితో సుందర సురుచిర రసవత్ పద బంధములతో అలతి అలతి పదముల కూర్పు నేర్పుతో మత్తేభగతిని స్ఫురింపజేయుచు ప్రసన్న గంభీరముగా ప్రకటించిరి. ఆ ప్రశంసా పద్యమిది.

**కలముంబట్టి కవిత్వమల్లు బుధలోకంబెల్లవేనోళ్ళమీ**
**లలితంపుం గవి తన్నుతించి రుచిరాలంకారముల్ భాషలో**
**పలిమేల్పల్కు లగొల్లలాడెనిక నేవర్ణింతు నేనిందదు**
**క్తుల నేయేకరు పెట్టుగా వలయుబంక్తుల్ పౌనరుక్త్యంబుగన్**

**కవిరేవ విజానాతి కవేః కావ్య పరిశ్రమమ్** అను ఆభాణకము నందలి పరమ సత్యమును ప్రస్తుత పద్యమున బలిజేపల్లివారు పరోక్షముగ ప్రకటించిరి. కలమును బట్టి కవిత్వమల్లునట్టి పండితవరేణ్యులు వేనోళ్ళ కీర్తించు లలిత కవిత్వమును తాను వర్ణింపబూనుట వారి మాటలనే మరల ఏకరువు పెట్టునట్లగునని బలిజేపల్లి లక్ష్మీకాంతం గారు పేర్కొనిరి. పండితుల చేత వేనోళ్ళ కీర్తింపబడిన కవిత్వమును ఏమని విస్తరించి కొనియాడుటకు వీలగునని కవి ఉద్దేశ్యము. నుతించుటకు సర్వసామాన్యమైన భాష చాలదని అలంకారయుతమైన భాషయే అందుకు సర్వ సమర్థమని అట్టి ఆభాషయందును మేల్పలుకులతో ప్రశంసలు కావింపగలుగుట ప్రజ్ఞాధురీణులైన పండిత వరేణ్యుల వలననే వీలగునని బలిజేపల్లివారు ఎంతో మనోహరముగ ప్రతిపాదించిరి. ఈ పద్యమున కవి మొదటి పాదమున కకారమును, రెండవ పాదమున లకారమును ఎంతో లయ బద్ధముగా సంగీతకళారహస్యనిధియై ప్రయోగించెను. మూడవ పాదములో పలిమేల్పల్కుల గొల్లలాడె అను ప్రయోగము నందలి లకార పౌనఃపున్యము తానేమి పలుకజాలనని నత్తివానివలె లకారమును వల్లించినట్లు ప్రయుక్తమైనది. లకార ప్రాసగల ఈ పద్యములో ఎంతో లాలిత్యము చోటు చేసికొన్నది. మొదటి పద్యమున తానేమి పల్కినను పునరుక్తి అగునని తెలిపి నిర్ధారించి అనంతరము రెండవ పద్యమున వర్ణించుటకంటె మౌనమూని సుధారసము జాలువారు కైతలను వీనుల విందుగవిని తనివితీర బ్రహ్మానంద సుధా సాగరములో తేలియాడుటయే మేలని వివరించిరి. పౌనః పున్యముగా బురాకృతములన్ వల్లించు కంటెన్ సదా మౌనంబూని సుధా రసంపుజవులన్ చాటించు మీకైతలన్ అను ఈ పద్యమున ప్రాస స్థానమున నకారమును ప్రయోగించి అటుపై పద్యమందంతట పునఃపునః నకారపు పొల్లులు జల్లులు జల్లులుగా వెన్నెల సోనలవలె కురిసి మహానందమును కలిగించునని బలిజేపల్లివారు రసవంతము అగు కవితాస్వారస్యము ఎంత మధురతరముగా వీనుల విందుగా ఉండునో ప్రశంసాపూర్వకముగా నిరూపించిరి. పద్యాంతమునందును మేలంచున్‌దలంతున్‌మదిన్ అని ఒకటికి ముమ్మారు నకారపు పొల్లులు ప్రయుక్తమైనవి. తాను వీనుల విందుగవిని ఎంతో సంతృప్తిని పొందిన విధమును నిక్కచ్చిగనొక్కివక్కాణించుటకో అనునట్లు యతి స్థానమున తృప్తిన్ అని ప్రయోగించిరి. తృప్తింజెంది అద్దాన బ్రహ్మానందామృతవార్ధిదేలుటయే మేలుగ కవి తలంచెను. యతి స్థానము నుండి కూర్పబడిన రెండు తగణములలోని రెండు పూర్ణానుస్వారములలో అటుపై అద్దాన అన్న ప్రయోగము నందలి ద్విరుక్త దకారమున తాను పొందిన రసాస్వాదనమందలి పరిపూర్ణత్వమును సూచించిరి.

వర్ణింపక మౌనమూని విని తరింతునని తెలుపు భావమును కవి ఈ శార్దూల వృత్తమున ఎంతో చక్కగా, రసభరితముగా ఒక సన్నివేశము కన్నుల ఎదుట తారాడునట్లుగ ప్రసన్నతా స్ఫూర్తితో విన్నవించిరి.

**3. పంచరత్నములు** ( దేశభక్త కొండా వెంకటప్పయ్య గారికి సమర్పించిన) సన్మాన పత్రము మాదాల వీరభద్రరావు రచించిన దేశభక్త చరిత్రలో కొండా వేంకటప్పయ్యగారి పౌరసభా సన్మానసందర్భమున ప్రశంసాపూర్వకముగా బలిజేపల్లి సమర్పించిన సన్మాన పత్రము నందలి పద్యములలో మచ్చునకు అందులోని పంచరత్నములు తిలకించుడని యైదు పద్యములను మాత్రమే అట నుట్టంకించిరి.

చెన్నరాష్ట్ర శాసనసభాసభ్యత్వ పదవినధిష్ఠించి నందులకు గుంటూరులో కొండా వారికి గొప్ప పౌర సభ జరిపి సన్మానించిరి. న్యాయవాదులు, వర్తకులు, ప్రజలు, నర్సులు అభినందించిరి. పౌరసభా ముఖమున శ్రీ బలిజేపల్లి లక్ష్మీకాంతకవి శ్రీ వెంకటప్పయ్య పంతులుగారి గుణగుణములను ప్రశంసించుచు భావయుక్తములు రసవత్తరములైన పద్యములు చదివి విన్పించిరి.

పంచరత్నములలో వెంకటప్పయ్య పంతులుగారి గుణగణములేకాక శాసనసభా సభ్యుడుగ భవిష్యత్తులో వారు నిర్వహింపవలసిన కార్యకలాపములను గూర్చియు సూచించిరి. గుంటూరు, కృష్ణ, గౌతమి ముఖ్యమండలవాసులు వెంకటప్పయ్యగారి నిర్మల హృదయ విజ్ఞానమును భావించియే ఆంధ్రవాంఛా సమస్యల పాలించుటకై ఎంతో కూర్మితో ఎన్నుకొని ఉన్నారని ఇందలి మొదటపద్యమున విన్నవించిరి. వెంకటప్పయ్యగారు కలుషంబేమియులేని పరిపూర్ణహృదయుడుకాగా ఆతనిని ఎన్నుకొన్న దేశీయులు నిశ్చల దేశ ప్రియులైన వారని కవి పేర్కొనెను. యధారాజాతధాప్రజా అను భావమిందు నిరూపితము. వెంకటప్పయ్యగారిని సుధీంద్రా భారతీయాగ్రణీ అని కవి పద్యాంత మున సంబోధించిరి. నిర్మల హృదయుడైన వెంకటప్పయ్యగారు తన కర్తవ్యమును నిష్కర్షగ బుద్ధి ప్రాభవముతో నిర్వహింవగలరన్న ప్రత్యయము సుధీంద్రా! అన్న సంబోధనలో రూపింపబడినది. వసుధైక కుటుంబ దృక్పధముగల వెంకటప్పయ్యగారు జాతిపిత గాంధీ అడుగుజాడలలో నడిచి భారతీయులలో అగ్రగణ్యుడై దేశభక్త బిరుద సార్థక్యమును విశాల దృక్పధముతో చాటగలడన్న లక్ష్యమునకుభారతీయాగ్రణీ అన్న సంబోధనము ప్రబల సాక్ష్యము. శ్రమపడి వారు వీరివలె సర్వ విధముల భగీరధ ప్రయత్నములొనరింపకున్నను గుణమొక్కటే గణనీయమని లక్ష్మీకాంతకవి ఒక చక్కని దృష్టాంతమును పేర్కొనిరి. యోగ్యములగు కుసుమముల సౌరభమును వాయుదేవుడు సర్వ దిక్కుల ప్రసరింపజేయగా రస చిత్తములైన తుమ్మెదలు గుంపులుగుంపులై తాము మూగుచున్నవి కదాయని వర్ణించిరి.

మూడవ పద్యమున నెలనెల వేలకువేలు న్యాయవాద వృత్తిలో గడించు విత్తము మొత్తము దేశసేవకై వ్యయించు చిత్తము మహోదాత్తపవిత్ర చరిత్రులకు మాత్రమే ఉండునని అట్టి జీవయాత్ర సాగించు మహనీయుడు దేశభక్తుడైన దేశభక్త కొండా వెంకటప్పయ్యగారని వివరింపబడినది. ఎన్నో వేలు ప్రతి మాసము గడించు స్వతంత్ర న్యాయవాదిత్వమును మహోన్నత భావముతో దేశసేవకై సన్యసించి దేశావన వ్రత నిష్ఠానుభవ ప్రశాంతమగు దివ్య జీవయాత్రను పవిత్రతతో సాగించు కొండావారి చరిత్ర కొండంత మహోన్నతమై కొండాడబడునని అది నిజముగ అతి మాత్ర స్తోత్రపాత్రమగునని బలిజేపల్లివారు శబ్దాలంకార మనోజ్ఞముగవెంకటప్పయ్య పంతులుగారి పవిత్ర చరిత్రను ప్రశంసించిరి. దేశ క్షేమమునకు మించిన విధ్యుక్త ధర్మము తప్ప మరి యొకటిలేదని అదియే తన జీవిత ధ్యేయమని భావించిన వెంకటప్పయ్యగారి వలన ఆంధ్రజనయిత్రి రత్న గర్భమున ధీశాలీనత పండి నిండినదని బలిజేపల్లి వారు దేశభక్తి పరాయణత్వమును కీర్తించిరి. ధీశాలినతపండె అను ప్రయోగము అటు వెంకటప్పయ్యగారి బుద్ధి విభవమునేకాక సమయ సముచిత పద ప్రయోగ దక్షతగల కవి ప్రతిభా ప్రాభవమును గూడ ప్రస్ఫుటీకరించుచున్నది.

ఈ పంచరత్నములలో తుది పద్యమున శాసన సభా సభ్యత్వము అధిష్ఠించినందులకు సర్వ సభ్యులనేకమొనరించి, వ్యత్యాసములనెల్ల ఉపసంహరించి, దేశహితైక కార్యవిన్యాసములందు తరించి గంభీర మాధురీ వ్యాసవచ స్సుధారసవశాత్మముగ యశస్సును విస్తరింపజేసి చరింపుడని

లక్ష్మీకాంతకవి ఆర్థించెను. కవి సమర్పించిన సన్మాన పత్రమునందు కేవల గుణగణ ప్రశంసయేకాక దేశకాలానుగుణముగా దేశభక్త బిరుద సామంజస్యమును ప్రతిఫలింపజేయు ప్రతిభామూర్తిగా శ్రీకొండా వెంకటప్పయ్యపంతులు గారు కొని యాడబడిరి. మొత్తము సన్మాన పత్రము లభించియున్నచో ఇంకెన్ని విశేషములందు ప్రకటితములైయున్నవో గ్రహించి, పరామర్శించుటకు వీలైయుండెడిది. ప్రస్తుతము స్థాలీ పులాకముగా వెంకటప్పయ్యగారి దేశభక్తి-ఈవంచరత్నములలో ప్రస్తుతింపబడినది.

**4. దుగ్గిరాల గోపాలకృష్ణయ్య-స్మృతి పద్యము:-**

శ్రీకర్యంపూడి నాగేంద్రుడు ఆంధ్రరత్న శ్రీ దుగ్గిరాల గోపాల కృష్ణయ్య జీవిత చరిత్రను బహూత్తమ పబ్లికేషన్స్ పేరాల చీరాల వారిపేర 1976లో ప్రచురించిరి. 10-6-1928వ తేది ఆంధ్రరత్న పరమపదించిన అనంతరము స్మృత్యర్థముగా పెక్కుమంది కవులు అనేక పద్యములు రచించిరి. ఆ సందర్భమున బలిజేపల్లి లక్ష్మీకాంతకవి గారు ఒక శార్దూల విక్రీడిత వృత్తమును స్మృత్యర్థముగవి రచించిరి.

*చాలుంజాలు సదావృధాభ్యసనకష్టంబేటికో సాగరా!
గోలం బెట్టుకు నీతరంబగునె మాగోపాలు సంగీత లీ
లా లోల స్వర సుప్రసాద మధుర వ్యాహార గంభీరధా
రా లావణ్యగతుల్, జడాశయుల కర్థంబౌనె యే నాటికిన్

స్మృత్యంజలి పూర్వకమైన యీ పద్యము ఒకటియే కావచ్చునుకాని ఇది సాగరమంత గంభీరమైనది. ఇందలి నిరంతరఘోషకు నిలుపు లేదు. ఇందలి అలలకు అలుపు లేదు. ఎడదలో ప్రేగు ఈ సాదకు కడలిలో సాగు ఆరాదకు అదుపులేదు. ఆకలేదు.

బలిజేపల్లి లక్ష్మీకాంతముగారు ఎంత లలిత లలితముగ ప్రసన్న మధురముగా కవిత్వము వ్రాయగలరో అంత ప్రౌఢముగా, పరమ నిగూఢముగా, నిర్భరభావ పూర్ణ ప్రగాఢముగా అర్థగాంభీర్యముతో రచింపగల మహాకవి శేఖరుడు. గోపాల కృష్ణయ్యగారి మృతికి ఎంతో లోలోన తపించుచు అంతర్గతమైన తన ఆవేదన సముద్రమంత గాంభీర్యమై, బహిర్గతముగు రోదన నిత్యనిరంతర నిర్విరామ నీరధి నిర్ఘోషవలె తన్ను విడువకున్న దన్న అభిప్రాయమును వ్యాజ నిందాపూర్వకముగ సముద్ర ఘోషను నిందించుచు దాని సవ్వడి గోపాలుని సంగీత స్వర మధుర గంభీర ధారా లావణ్య గతికి సాటిరాదని స్పష్టీకరించిరి. చీరాల-పేరాలకు దగ్గరగానున్న సాగర సంగీతము దూర తీరాలకేగిన దుగ్గిరాల గోపాలుని సంగీతములతో పోటీపడి గెలువజాలదని గోపాలుడు సాక్షాత్ యాదవకుల తిలకుడు మురళీగానలోలుడైన గోపాలుడేయని కవి భావించెను. కవి సాగరుని సంబోధించుచు ఏల ఈ గోల వ్యర్థముగా, నిరంతరము నీవు గావించు ఈ అభ్యాసనము నింతటితో విరమింపుము. మా గోపాలుని సంగీత మాధుర్య ధుర్య సంగతులు నీవెన్నిరీతుల ప్రయత్నించినను నీ తరముకాదు. జడాశయుడవైన నీకు ఏనాటికిని గోపాలుని సంగీత స్వర ప్రసాద మధుర వ్యాహార గంభీర లావణ్యగతులు అర్థముకావు. వ్యర్థముగా ఏల స్పర్థతో నిముసమైన నిలుపకుండ అభ్యాసమువలన ఆయాసమును కొని తెచ్చుకొందువని సాగరుని తెగడుచు గోపాలుని మిగుల కొనియాడెను.

**లావణ్యగతులు, జడాశయములు వంటి ప్రయోగములలో లక్ష్మీకాంతకవి ఎంతో అర్థగాంభీర్యమును పాదిగించిరి. లావణ్య శబ్దము నందు సముద్రమునకుగల లవణ భావమును డలయోరభేదః అను భావమును పురస్కరించుకొని జలాశయమును జడాశయముగా ప్రయోగించి ఒకరి నిందలో మరియొకరి పొగడ్తను అన్వయించిన పద్ధతి ఎంతో రమణీయముగా రసోజ్జ్వలముగా ఔచిత్యస్ఫూర్తితో ప్రకటిత మైనది. లఘుకృతులలో అలఘుతరమైన అర్థగాంభీర్యమును, పాండిత్య ప్రకర్షను ప్రకటించి రమణీయార్థప్రతిపాదకశబ్దః కావ్యమ్ అను పండిత రాయల నిర్వచనమును ఔచిత్య స్ఫూర్తిగల ప్రతిపాదమున పదపదమున ప్రతిపాదించి, మహాకావ్య లక్షణమును ఏక పద్యమునందే ప్రతిష్ఠింపవచ్చునని ప్రతిభా ధౌరంధర్యముగల బలిజేపల్లి కవి ప్రస్తుత పద్యమున అక్షరాక్షర సార్థక్యముతో నిరూపించిరి.

**పాలయులుక**:- రసికుడు, శృంగార రసప్రియుడు, ఇంగితజ్ఞుడు, లోకజ్ఞుడు నగు బలిజేపల్లి లక్ష్మీకాంతకవి అనేక సందర్భములలో ఎన్నెన్నో చిన్న చిన్న ఖండికలను కూడ రచించిరి. అట్టివానిలో పాలయులుక ఒకటి. ఒకేఒక సీస పద్యములో ప్రణయకలహము, దాని తీరు తెన్నులు అందలి ఆనందము, నిజమైన ప్రేమలో పాలయులుక అనంతరము తొణికిసలాడు జీవకళ ఎంతో చక్కగ వివరింప బడినవి. పనిపాటలు పూర్తికానట్లు నటించి క్రీగంటితో చూచి తాను చూడగా చూపును వేరొకవైపు సారించి, ఏదో ఒక సాకుతో పిలిచి ముద్దుముచ్చటలాడుటకై పెలువలకు పరుగెత్తి చిరునగవుల తెరలతో పెదవి బిగించి చెక్కిళ్ళపై చక్కిలిగింతలిడగ ఒట్టుసుమీ అని ఓసరిల్లి అడుగులపైబడి ఎన్నెన్నో బాసలు సేయగా నీవెంతకైనను తగుదువు అని సిగ్గువీడి అటు నిటుచని కౌగిటిలో బంధింపగా కన్నులలోనీరు నింపితన ప్రియులను, అలరించు చెలుల పాలయులుకలు నిజముగా ప్రేమ జీవకళలు. అవి పానకము నకు మిరియపు వసలవంటివి. అని బలిజేపల్లి పాలయులుక అను ఖండికలో తుట్టతుదిగా ఆయుర్వేద వైద్యముతో తనకుగల పరిచయమును కూడ సూచించిరి. పానకము వంటి వీరి కవితాపరి పాకము లోగల మర్మములు పసలు జీవితానుభవములు మరి మరి తరచి చూచిన కాని పాఠకులకు అంతుపట్టవు.

**౬. సత్యనారయణ స్వామి**:- బలిజేపల్లి లక్ష్మీకాంతకవి గారిలో దేశభక్తివలె దైవభక్తి పుష్కలముగ కలదు. శివానందలహరి అనువాదము, బుద్ధిమతీ విలాసము అను నాటకము మొదలగు కావ్యములలో వీరి దైవభక్తివెల్లడి అగుచున్నది. వీరు విడిగా తమ అభిమాన దైవములను గూర్చియు కొన్నిపద్యములు రచించిరి. 1925, ఆగస్టు, భారతిలో వీరు శ్రీ సత్యనారాయణస్వామి అను మకుట ముగలఏడు పద్యములను రచించిరి. సత్యనారాయణస్వామిపై వీరికిగల మిక్కుటమగు మక్కువ వలననే వీరు తమ కుమారునికి కూడ సత్యనారాయణ నామధేయమును పెట్టిరి. ప్రస్తుత సత్యనారా యణస్వామి శీర్షికలో మొదటి శార్దూలమున అన్నియు దైవ సంబోధనములే. అందు సత్యనారాయణ స్వామి సర్వేశ్వరుడుగ, కృపాజలనిధిగ, భక్తమందారుడుగ, సత్యాశ్రయుడుగ, విపన్న జన బంధుడుగ, త్రిలోకైక సాక్షిగ, సర్వజ్ఞ శ్రేష్ఠుడుగ, చరాచర జగత్ క్షేమంకర శ్రీకటాక్షుడుగ, భువ్యైక ధర్మపరిరక్షకు డుగసంబోధింపబడినాడు. సత్యము, దయ, సర్వజ్ఞుడైన సర్వేశ్వరుని లక్షణముగ పద్యాంతమునకవి ప్రకటించెను. కవి ధార్మిక దృక్పథమును ఈ తుది సంబోధనము స్పష్టీకరించుచున్నది. రెండవ పద్యమున సత్యనారాయణస్వామి మాహాత్మ్యమును బ్రహ్మసహితము ఎరుగజాలడని ఆదేవుని యిచ్ఛా మాత్రమున సృష్టి, వీక్షా మాత్రమున రక్ష జరుగుచున్నవని, ఈ లోకములో ఎప్పుడు ఏమి జరుగునో తెలియకున్నదని ఎక్కడ చీమ చిటుకన్నను అది యెల్లను కృపాబ్ధియైన సత్యనారాయణ మాహాత్మ్యమే అని బలిజేపల్లి వారు వివరించిరి. మూడవ పద్యమున రెండవ పాద మధ్యము వరకుగల సంబోధనలలో అతడు మురదానవాంతకుడుగ, కృపాపారీణుడుగ, దీనావన త్వరితాంతః కరణుడుగ, వరదుడుగ పేర్కొనబడెను. అనంతరము పరార్థహరణ వ్యాపార మాయా ధురంధరుని బారిపడి లేనిపోని అపరాధమును పొంది ఆపత్పరంపరలలో చిక్కికొంటిని నన్నెట్లు తేల్చెదవో అని అర్థించినాడు. ఇందు కవి స్వానుభవము సత్యనారాయణునికి విన్నవించుకొన్నట్లున్నది. కవితానే పాపమెరుగనని అన్నింటిని చూచుచున్న ఆ సత్య నారాయణుడు అమాయకుడైన తనకు కల్గిన అపాయమునుతొల గింప కపోవునా? లేనిచో ఆతని దీనత్రాణపరాయణత్వమును బిరుదువ్యర్థము కాదా! అని వివరించెను.

ఇందఖిల సాక్షి అను సంబోధమునకు తగినట్లు నీమూడనిలోక సంగ్రహణ లీలా లేశ మెందుండునయ్యా అని వాపోయిరి. అమాయకులు అను పదమునకు మారు నిరామయికులని ప్రయోగించిరి. సత్యనారాయణుని పరిపూర్ణత్వమును చూపవలసినదిగా కవి ఐదవ పద్యమున అర్థించెను. ఈ పద్యమున మొదటి రెండు పాదములలో దేవుడెందెందు నిండి యున్నాడో వివరించెను. పరమాణువు మొదలు చరాచర బ్రహ్మాండము నందంతట విచిత్రలీలలతో వ్యాపించి, సమస్త ప్రాణికోటిచేష్టలను పరికించు సాక్షీ భూతుడు తనకేల ప్రత్యక్షమై పరిపూర్ణత్వమును చూపలేదో అని కవి అభ్యర్థన. ఇందు భువన దీప! అన్న తుది సంబోధనము ఎంతో అర్థవంతముగా

జ్యోతిర్మయుడైన పరమాత్మ స్వరూపమును తెలుపుచున్నది. ఏ వస్తువైనను దీపమున్నపుడే లేక వెలుగున్నపుడే కన్పించును. అది లేక వస్తు స్వరూపము అభివ్యక్తము కాదు. ఈ పద్యమున కవి కేవల బాహ్య స్వరూపమునే కాక అంతర్గతముగా దాగిన తత్త్వమును గూడ వెల్లడించినాడు.

ఆరవపద్యమునందును అన్నింటికి సాక్షీభూతుడైన సత్యనారాయణస్వామి స్వరూపమును పేర్కొనెను. భూన భోంతరాళములలో భాసించుచు నిర్మలమైన ఆకాశవీధిలో పరంజ్యోతి స్వరూపుడై ప్రకాశించి కర్మకలాప సాక్షి ధర్మ నిర్ణేతయై లోకములు కాపాడు సత్యనారాయణుడు తనకీ సందర్భమున సాక్షిగా నుండి తీరునని కవి భావించెను. నభోవీధి యందు కర్మసాక్షిగా వెలుగొందు భువన బాంధవుడిందు సూచింపబడినాడు. ధర్మ నిర్ణేతవై ఈ విప్పట్టున నాకు సాక్ష్యమిడవేమి అని కవి తానేదో ఇక్కట్లులలో చిక్కుకొని ఆకష్ట పరంపరల నుండి సాక్షీభూతుడుగా సత్యనారాయణస్వామి రక్షింపవలసి ఉన్నదని అర్థించెను.

తుట్టతుది పద్యమునందును కవి ఎవ్వడపరాధియో నిరపరాధియో మీకు తెలియును గదా! ధర్మ చక్షువులకు తెలియని సత్యము నీవెరుగుదువు కదా! జగదంతర్యామివైన నీ కన్నులు మూయ సాధ్యమా! ఏది బానో! ఏది కాదో! అది నీకే తెలియును. నిరపరాధిని అపరాధిగా చేయు ఈ అల్పబుద్ధులు తమ ధర్మ చక్షువులతో ఏది మిథ్యయో ఏది తథ్యమో నిరూపించుటకు తగుదురు కాని అట్టి అధీరులకు అసలు పరమార్థము తెలియునా? అని కవి తన్ను దుర్భరమైన అపరాధము నుండి రక్షింపవలసినదిగా పదేపదే అర్థించుచున్నాడు. 1920 ప్రాంతమున ఈకవి ఏదో ఒక దుర్భరసమస్యకు గురియై తనదుస్స్థితిని తొలగింపవలసినదిగా అన్నింటికి సాక్షీభూతుడైన శ్రీ సత్యనారాయణ స్వామిని ఏడు పద్యములలో ప్రార్థించెను. ఈ పద్యముల సంఖ్య సప్త పదీనమైత్రికి సూచనగా గ్రహింపవచ్చును. ఈ అన్ని పద్యములలోను సమస్తకర్మలకు సాక్షీభూతుడైన ఆపరమేశ్వరుడు అన్నియు చూచుచున్నాడు కదా! నిరపరాధులను దుఃఖపు చీకటి నుండి మరలించి శాంతి సుఖములనెడు వెలుగును ప్రసాదించి భువన బాంధవుడై, మిత్రుడై, కర్మసాక్షియై, భువన దీపకుడై సత్యమును నిరూపించితీరునని బలిజేపల్లి భావించిరి.

**6. గద్వాల రాణి- పద్యహార సమర్పణ -**

లక్ష్మీకాంతముగారి ఇతర కృతులలో సంస్థానాధీశ్వరుల నుద్దేశించిన ప్రశంసా పద్యములు అప్పుడప్పుడు అక్కడక్కడ నెఱపిన అవధాన పద్యములు మొదలగునవి కలవు. కాని వీరి అవధాన పద్యములు ప్రస్తుతము దొరకుట లేదు. ఆ పద్యములను సంపాదించుట ప్రత్యేక శ్రమతో కూడినపని. అవి ఎందు లభ్యమగునో కూడ తెలియకున్నది. వీరు గద్వాల సంస్థానమున చదివిన పద్యములు కొన్ని నానాదేశ కవీశ్వర పద్యరత్నావళి అను పేర కొన్ని భాగములుగా ముద్రింపబడనవి. రాణిశ్రీ ఆదిలక్ష్మమ్మ గారి ఔదార్యమును విని కవి పండితులెందరో శ్రీ రాణి గారిని దర్శించి పద్యములతో ఆమెను ఆశీర్వదించి ఆమెచే సన్మానములంది యున్నారు. వీరిలో బలిజేపల్లి లక్ష్మీకాంతం గారొకరు. ** వీరు వ్రాసిన గ్రంథము లేమియు గద్వాలలో లభింపలేదు. కాని కొన్ని పద్యములు నానాదేశ పద్య రత్నావళిలో కలవు. **పాలిత కవీంద్రవాణీ గద్వాల రాణీ** అను మకుటముతో వీరు వ్రాసిన పద్యములు కొన్ని గద్వాలలో నేటికిని నిలుపుచేయబడియున్నవి. ఈ పద్యములు చిట్టచివర రాణిగారికి సమర్పించిన పద్యహారము మనోహరమైనది. ఆ పద్యమిది

అరవిందానన సుందరీకర సరోజాంచద్విపంచీవిక
స్వర పైక స్వర భాస్వర స్వరలయ ప్రస్తార ధారావిరా
జీరసోద్వీజీ కవిత్వ తత్త్వయుత లక్ష్మీకాంత విద్వత్కవీ
ట్కరుణాశీర్మణి పద్యహారమిదిగో గద్వాల రాజ్ఞీమణీ!

ప్రస్తుత పద్యమున ఇదిగో గద్వాల రాజ్ఞీమణీ! అను అవ్యయ పూర్వకమగు తుది సంబోధనము తప్ప తక్కిన పాదమంతయు ఏకైక సుదీర్ఘ సమాసము. ఇది శబ్దాలంకారమున

మనోజ్ఞముగ కూర్పబడినది. కవికిగల సంగీత సారస్వత కళా ప్రౌఢిమ మహా గంభీరముగా ఈ మత్తేభ విక్రీడితమున తెలుపబడినది. ఇందుకవి తాను విద్వత్కవీశ్వరుడనని ఎంతో ఆత్మ విశ్వాసమును ప్రకటించెను. పద్యమంతయు రకారావృత్తితో లయబద్ధముగా సాగి, వారి సంగీత కళానిధిత్వమును అభివ్యక్తమొనర్చినది. వికస్వర పైక స్వర భాస్వర స్వర అను ప్రయోగములో ప్రకటితమైన లయ ప్రస్తారము కేవల శబ్దాడంబరమే కాదని అది ధారా విరాజిరసోద్వేజియగు కవితా సారమునకు ఆధారభూతమని అట్టి సంగీత సాహిత్యముల తత్త్వమును జీర్ణించుకొన్న లక్ష్మీకాంత విద్వత్కవీశ్వరుని పద్యహారము పరమ మనోహరమై స్వారస్యసామనస్యములతో రసానంద సుధా సారమును సదా ప్రసార మొనర్చి గద్వాల రాణికి నిత్యామోదము కలిగించునని ప్రస్తుత పద్యమున ఓటో గుణభూయిష్ఠముగా రాణిగారి రాజసిక తీవికిదగు పద్ధతిలో వివరింపబడినది.

కవితా కళానిధి శ్రీ బలిజేపల్లి లక్ష్మీకాంతకవిగారు తన నామధేయము తుదిలో చేర్చుకొన్న కవి బిరుదమునకు దగినట్లు కేవల కవి మాత్రుడగాదని విద్వాత్కవయః కవయః కేవలం కవయః కపయః అను ప్రమాణమును బట్టి తనకు గల కవి బిరుదు విద్వత్కవి పరమని నిరూపించు ప్రౌఢ సమాస గుంఫిత పద్యరచన మీ సందర్భమున గావించిరి. అరవిందానందవన సుందరీకర సరోజము నందొప్పు వీణయందు పంచమ స్వరమును ఆలాపంచు పికగేయ సముదాయము నిత్యవసంత గానమువలె పరమాహ్లాదకరమై రసోజ్జ్వలమగు కవితకు పట్టుగొమ్మగా తనరారునని ఎంతో అర్థవంతము, ఔచిత్య స్ఫోరకమునగు సమాసఘటిత ప్రయోగము గావించిరి. పద్య ప్రారంభమున గల అరవిందానన సుందరీ ప్రసక్తి సౌందర్య దీప్తితో నుద్దీపించు వీరి కవితా శోభను తెలుపుచున్నది. మగవారికన్న వీణా వాదన నైపుణి నెఱపుటలో వాణిని తలపించుపూబోణుల గాన విద్యయే సుందరతరమై రాణించునని రసికుడైన బలిజేపల్లి సంగీత కళాధర్మమునగల మర్మమును ధ్వని గర్భితముగా ప్రస్తుత పద్యారంభమున అక్షరాక్షరమున శబ్దసౌందర్యముతో ప్రకటించిరి. అంతేకాక పదపదమున నెంతో అర్థ గాంభీర్యము రసోదంచితముగా, ధ్వని గర్భితముగా సూచింపబడినది. ఇట్లు బలిజేపల్లిగారి లఘుకృతులలో వారి కవిత్వ పటుత్వ సంపద సహజ పాండిత్య స్ఫూర్తితో రసభరితమై ఉజ్జ్వలతా గంభీరతలను సంతరించుకొన్నది.

ఇక షష్ఠమ పరిచ్ఛేదమున బలిజేపల్లి లక్ష్మీకాంతకవి గారి కరుణరసభరితరచనా పరిపక్వత యెట్టిదో అది వీరి వివిధ కృతులలో ఎట్లు ప్రతి ఫలించినదో అందు ముఖ్యముగా సత్యహరిశ్చంద్రీయ నాటక శ్మశాన వాటికా ఘట్టమున ఎట్లు పరాకాష్ఠనందుకొన్నదో పరిశీలింతము.

**1. కరుణరసభరిత రచనాపరిపక్వత:-**

ఆధునికాంధ్రసాహిత్యములో ఒకవైపు అనేక ప్రక్రియలు అభ్యుదయ పథమువైపు అనుగమించి సర్వ సామాన్య ప్రజకు సన్నిహితముగా తమ ప్రభావమును నెఱపుచున్నను మఱియొకవైపు సనాతన సంప్రదాయ బద్ధ సారస్వతము సర్వాంగసుందరమై సందర్భ శుద్ధి చెడకుండ సమరసభరితముగా సాగుచు నేటికిని తన ప్రాభవమును ప్రతిష్ఠింపగలుగుచున్నది. ఇది నిజముగా ఆంధ్రవాఙ్మయ జగత్తులో ఎన్నదగిన ఒక మహనీయ గుణవిశేషము. తక్కిన బాసలకంటె ముఖ్యముగా తెలుగుబాసలో నిట్టి విశిష్టత, ప్రత్యేకత చోటు చేసికొన్నందువలననే ఆ భాషకెంతో ప్రాముఖ్యము ప్రాశస్త్యము సంఘటిల్లినవి. ప్రాతయొకరోత క్రొత్తయొక వింత అను విధానమునగాక ఈనాటికిని ప్రాచీన కావ్యరచనా విధానము ప్రస్తుత లోకపరిస్థితులకు అనుసంధాన ప్రాయమగు దృక్పథముతో ఆధునికాంధ్ర కవులచే అనుసరింపబడుచునే యుండుట ప్రశంసార్హము. నేటికిని సంప్రదాయ బద్ధ ఆధునికాంధ్రకవులలో పలువురు ప్రాచీన కవితా విధానము నవలంబించి సాహిత్య సాహిత్యమునందించుచునే ఉన్నారు. అట్టివారిలో బలిజేపల్లి లక్ష్మీకాంత కవిగారు ప్రథమ గణ్యులు. వీరిలో చిన్ననాటి నుండి పాదుకొన్న నాటక కళాభిరుచి వారినొక మహానటునిగా తీర్చిదిద్దుటయేగాక

ప్రసిద్ధనాటక రచయితను గావించినది. పైగా రసభరితములైన పూర్వుల అపూర్వ కవితామృతమునాస్వాదించి పారవశ్య ప్రమోదమును పొంది, అట్టి కవిత్వమును వ్రాయుటలో వీరును దిట్టకాగలిగిరి. సంగీతముపై వీరికి వల్లమాలిన అభిమానమున్నది. అది ఎంతో ఆర్ద్రత గల వీరి హృదయమును ఆపాత మధురముగావించి ఆకట్టుకొన్నది. ఆసంగీత కళాభిజ్ఞతయే ఆలోచనామృతమగు సారస్వత నిర్మాణమునకును సర్వవిధముల దోహదకారియై సహకరించినది. కావుననే రసనిర్భరమైన వీరి భావనాస్రవంతి కరుణ ప్రపూర్ణ కవితాలహరియై ప్రవహించినది.

ఆర్ద్రతగల యెద కరుణరసమునకు నిధనము. శ్లోకమునుండి శ్లోకమావిర్భవించి వాల్మీకిని ఆదికవిని గావించినట్లే ఎంతటి కఠిన పాషాణ చిత్తునైన కరిగించి, కరుడుగట్టిన కర్కశత్వమును బోఁద్రోలఁగల కరుణరస భరిత కవిత్వము బలిజేపల్లి లక్ష్మీకాంతకవికి సహజ సిద్ధముగనే సంక్రమించినది. * వీరి దృశ్య శ్రవ్య కావ్యములన్నిటి యందు నిట్టి కరుణరస నిర్భరకవితా పరిపాకము స్వతస్సిద్ధముగా అప్రయత్న లబ్ధముగా సౌందర్యసారమును వర్షించి రస హృదయులైన సహృదయులను ఆనంద జలధిలో ముంచెత్తినది. భావమహోత్కృష్టమైన వీరి విశిష్ట రచనలో అర్థగాంభీర్యమునకు తోడు స్పష్టత, నిర్దుష్టత రసౌచితీ స్ఫోరక రమణీయత, సత్య శివ సుందరత, ప్రసన్న గంభీరత, నుడికారపు సొంపుగల పదబంధ బంధురత మొదలగు ఉత్తమ కవితా లక్షణములన్నియు ప్రోదిచేయఁబడినవి. ఆర్తితో భగవంతుని వేడికొను భక్తిరస భరిత కవిత్వ రచనములందు వీరు సద్యః పరనిర్వృతి సమర్థమగు తన్మయీభావమును సహృదయులగు పాఠకులలో కలిగించిన సరసహృదయులు. బలిజేపల్లివారు భక్తిరస భరితమైన కరుణరసప్లావితమైన కవితకు పెట్టినది పేరు. దళతి వజ్రస్యహృదయమ్- అన్న భవభూతి వాక్యమును ప్రత్యక్షర ప్రత్యక్ష సత్యముగా ప్రమాణీకరించిన ప్రతిభామూర్తి. అంతర్గూఢరసోదయము పుటపాక ప్రతీకాశమునైన రాముని కరుణరసమును ఉత్తర రాఘవమునందును, కాటికాపరిగా హరిశ్చంద్రుని దైన్య హైన్య శూన్యస్థితిని సత్యహరిశ్చంద్రీయమునందును బుద్ధిమతీ సిరియాళుల మనస్తత్వమును పరీక్షించుటలో పరమదారుణముగా క్రూరముగా కఠిన కర్కశముగా జంగమరూపధారి శివుడు ప్రవర్తించి ఆదంపతులకు తీరని ఆరని పుత్రశోకమును కల్గించు సందర్భములను చిత్రించిన బుద్ధిమతీ విలాసమునందును వీరి రచన పరాకాష్ఠనందుకొన్నది. ఎన్నో నాటక ప్రదర్శనలిచ్చి వీరాబాలగోపాలము నాకర్షించిరి. ముఖ్యముగా సత్య హరిశ్చంద్రీయమునందలి పద్యముల నెఱుగని వారుండరు. ఇది యేడుపు నాటకముగా గూడ ప్రసిద్ధికెక్కినది. వీరి కరుణరస భరితరచనలను చదివి ప్రదర్శనలను చూచి కన్నీరు మున్నీరుగా వెక్కివెక్కియేడ్వని పాఠకులు ప్రేక్షకులు లేరనుట యథార్థము.

కరుణరసపోట్లూ కరడుగట్టిన పాషాణ హృదయులనైన కదలించి వేయగలదో సత్యహరిశ్చంద్రీయమునందలి ప్రత్యక్షరమున ప్రత్యక్షము. కరుణ రస భరిత రచనా పరిపక్వతకీ కావ్యమును మించిన గ్రంథమును మఱియొకటి లేదు. ఈ సందర్భమున ఒంగోలు జిల్లా రిజిష్ట్రారు శ్రీ ఏలూరి ప్రసాదరావుగారి అభిప్రాయములనిట నుట్టంకించుచున్నాను.

* లోకము కనివిని యెఱుగని దారుణంబగు దుఃఖము పద్మమునందు విడిరేకులవలె పలు తెఱంగులుగా ఆమూలాగ్రము ఈ నాటకమునందు నిబంధించుటకై కవి యొనర్చిన అపూర్వ కల్పనలు ప్రక్కకుపెట్టి, సర్వలోకములను మానవజీవితమును సర్వే సర్వత్ర శాసించెడి మరణమును, మరణదేవతకు రంగస్థలమైన శ్మశానమును ఈ భూమియెల్లను కంకాళమయమగు గొప్ప శ్మశాన వాటికగా చిత్రించువిద్వాని కథానాథుండగు తాను నీచస్థితియందును సగర్వముగా సత్యవాక్పరిపాలకుండవగు సర్వేశుడనను గర్వమును ఒక భూత మాంత్రికుని వలెగాక మూర్తీభవించిన సత్యమువలె వీర దాసుడగు హరిశ్చంద్రుడు సురాభాండము భుజమున ధరించి కాటిలో కాలిన కట్టెను కరదీపికగా చేతిలో గ్రహించి అవని పాలించు భస్మసింహాసనమునకు అధినాథుడగు కాటికాపరిని ఈ కవి మనముందు నిలుపుచున్నాడు.

పేరునకు ఋషియేకాని పరమకిరాతకుడగు విశ్వామిత్రుడు ఒకనాడు హరిశ్చంద్రుని తండ్రి (సత్యవ్రతుని) ని ధర్మ భ్రష్టుని చేయుటకై పలువిధముల వంచించి నిశ్చలముగా సర్వము త్యజించి ధర్మస్థాపన యందు స్థిరమై నిలచిన తన తండ్రిని త్రిశంకువుగా శపించెను. ఇది యెల్లయు తెలిసినను హరిశ్చంద్రుడు తన తండ్రికి ప్రాప్తించిన దుర్గతిని సైతము లెక్కసేయక కసాయి వానికి గొఱ్ఱెవలెను మఱల విశ్వామిత్రుని క్రూర దారుణ ప్రతిజ్ఞకు తలయొగ్గెను. ఇట్టి ప్రతిజ్ఞనుండి ధర్మస్వరూపమయుడగు హరిశ్చంద్రుని రక్షించుటకు అసాధ్యమని తెలిసియు ఈకవి (శోక) కరుణ రసమును అపూర్వముగా ఇందు ప్రతిష్ఠించుటకై హరిశ్చంద్రుని పలుకష్టముల పాలుచేసెను. **చతురంభోధిపరీత భూవలయమేలిన** మహారాజును, కాటికాపరిగా చండాల దాస్యమునకు భార్యా పుత్ర విక్రయమునకు పాల్పడఁజేసెను. కరుణరస కావ్యములనేకములున్నవి కాని కడుపు ఆంపవుకోత కోయు ఇంతటి తీవ్రమగు దుఃఖమును భరింపరాని నిరాశయొక్క భారమును ఒక మహనీయుని నెత్తికెక్కించుట శ్రీ బలిజేపల్లికే చెల్లినది. ఇందు దుఃఖాతిరేకమున హరిశ్చంద్రుడు చంద్రమతి చేయు ప్రసంగములు దావానలమువలె ఎంతటి స్థితప్రజ్ఞులనైనను దహించివేయును. శ్మశానవాటికయందు బలిజేపల్లి నిర్మించిన కార్చిచ్చువంటి దుఃఖమునకు సరియైన కావ్యరసముగా దుఃఖమును (కరుణము) ప్రతిష్ఠించిన మహనీయులలో మొదటివారు వాల్మీకి లోకసామాన్యమగు ఇతివృత్తములో చరిత్రగాథలను ఉన్నవి యున్నట్లు చిత్రించుటయేగాక సన్నివేశముల క్షరములగు దుఃఖ మాధుర్యమును అపూర్వమగు సందేశరూపమున వినిపించిన కవి పుంగవుడు షేక్స్పియర్. కరుణ రసమే తప్ప దుఃఖమును రూపకమున నిషేధించిన సంస్కృత లాక్షణికులను త్రోసిపుచ్చి ధైర్యముచేసి అపూర్వమగు ఈ దుఃఖరసమును హరిశ్చంద్ర రూపమునందెల్లెడను ఆరని తీరని మంటగా ఆవేదనతో ప్రత్యక్షరమునందును ప్రతిపాదించిన కవిపుంగవుడు బలిజేపల్లి. జీవితముదుర్భరమై ఎంత శ్రమించినను కడుంగడు ఇడుములకు ఆలవాలమైన కాలమున బలిజేపల్లి ఇప్పటి నానీచస్థితి అను ఒక్కమాటలో తన కాలపు హీన సంస్కృతిని బానిసపు బ్రతుకున తల మున్కలై సిగ్గువిడిచి దాసీవృత్తులనవలంబించిన భారతీయుల మఱియు ముఖ్యముగా తెలుగువారి దుస్స్థితిని తలంపునకు తెచ్చుకొని స్వరాజ్యమునకు చెడి భార్యాబిడ్డలను అమ్ముకొన్న సత్యహరిశ్చంద్రుని కథను ఆధారముగా చేసికొని గుండెలను పిండివేయు కరుణరసమును, రక్తమును స్వేదముగా మార్చుచున్నను లెక్కగొనక మరిమరి ఊటకలమున జాలువారు రక్తాక్షరములు దేహమంతయు స్పందించి వేడి కన్నీరు ప్రవాహమై పారుచుండ అనేక పర్యాయములు శ్వేత పత్రములపై మార్చి మార్చి వ్రాయుచు, బీటవారిన గుండెలను బండగా భావించి ఈ దుఃఖాతి రేకము కరుణరస మహాకావ్యముగా నిర్మించు యత్నమందు రేయింబవలేడ్చి యేడ్చి యీ కావ్యమునిట్లు తీర్చగలిగినట్లు ఆ మహనీయుడే ఒక సందర్భమున ఒక మిత్రునికి తెలియ బఱచెను. మన అదృష్టము వలన ఇట్టి గొప్ప నాటకము తెనుగు జాతికినేడు గర్వకారణమై నిలచినది. దేశదేశములందు తెలుగువారి గొప్పతనమును చాటి చెప్పినది. ఇందుండియే దుఃఖమొక రసముగా ఒక అపూర్వ కావ్య వస్తువుగా సమకూడినదని ఒక్కమాటలో కరుణశ్రీ తన జన్మభూమియే శ్మశాన వాటికయని తేల్చివేసెను. తెలుగువారి కింతటి అదృష్టమును తెచ్చిపెట్టిన ఈ మహనీయులఋణము మనమెట్లు తీర్చుకొనగలము.

బలిజేపల్లి లక్ష్మీకాంతకవి ధర్మ స్వరూపము యొక్కలోతుపాతులను కూలంకషముగా నెరిగి తాను గ్రహించిన ధర్మ తత్త్వమును ఉత్తమ కవిత్వమునందు అన్వయించి తరించిన కళావేత్త, ధర్మ తత్త్వజ్ఞుడు. సత్యధర్మ దయాదిక గుణవిశేషములతో లోకతారకమై హరిశ్చంద్రాది చక్రవర్తులలో నెలకొన్న ధార్మికనిష్ఠను తత్పరిణామ స్వరూపమును రవిగానకున్న కవిగాంచునే గదా! అను ఆభాణకమునను సరించి ఆకళించుకొన్న రససిద్ధుడే బలిజేపల్లి లక్ష్మీకాంతకవి శేఖరుడు. అనేక రూపములలో బహుముఖముగా ప్రసరించి సమస్త విశ్వమును సంరక్షించు ధర్మతత్త్వము యొక్క మూల కీలకమును గుర్తు ఎఱిగినవాడు బలిజేపల్లి. ప్రస్తుతము షష్ఠ పరిచ్ఛేదమున బలిజేపల్లి ధార్మిక

దృక్పథము, వారి అశేష శేముషీ విభవమును, వీరి రచనలపై ప్రాచీన కవుల ప్రభావమును తదనంతరాంధ్రకవులపై సరసజ్ఞులపై వీరి రచనల ప్రభావమును సూత్రప్రాయముగా సమీక్షింతము.

**2. బలిజేపల్లి-ధార్మిక దృక్పథము:-**

బలిజేపల్లి లక్ష్మీకాంతముగారి ప్రతి రచనమందును వారి ధార్మిక దృక్పథము ప్రజ్ఞాధురీణముగా ప్రసరించినది. ధర్మము ఏక దేశికము కాదు. అది బహుముఖ విస్తృతము. సమస్త జగత్తునకు ధర్మమే ఆధారము. మానవ మానసిక జీవితమును చైతన్యవంతమొనర్చి సాంస్కృతిక స్వేచ్ఛను, ఆత్మ స్వాతంత్ర్యమును దర్శించుటకు సర్వ విధ సమర్థమైన సాధనమే ధర్మము. శాశ్వత సత్య సాక్షాత్కారమునకు ధర్మమే మూలము. సత్యము నిమిత్తమై హరిశ్చంద్రుడు సమస్తమును త్యజించెను. సత్యమునకు మించిన సద్గుణము లేదు. సర్వ ప్రపంచము సత్యము నందు పాదుకొని యున్నది. అట్లే ధర్మము సత్యము నందు, సమస్త మతములు సత్యము నందు పాదుకొని యున్నవి. విశ్వాసము, న్యాయము, ఋజుత్వము ధర్మవర్తనము మొదలగునవి యన్నియు సత్యము యొక్క పరిణామరూపములు (హిందూ ధర్మ సర్వస్వము-శివానంద సరస్వతి పుట 84) నిజమైన నీతిమంతుడు సత్య ధర్మములనుండి ఒక్క అంగుళము కూడ వెనుకకు తొలగడు. అతి క్లిష్ట పరిస్థితులందును నీతిచ్యుతుడు కాడు. (పుట 112) భారతీయుడు తాను అన్నము తినుటకు ముందు పక్షులకు, కుక్కలకు, ఆవులకు, చేపలకు ఆహారముపెట్టి తర్వాత తాను భుజించును. విశ్వప్రాణి కోటితో సైక్యమగుటకు ప్రయత్నించును. ఇతరులను ప్రేమించుట అనగా తన్నుతాను ప్రేమించుటయే. విశ్వప్రేమను హృదయములోనికి ఆహ్వానించి ఆస్వాదించుటవలననే అందరిలో తానున్నట్లు అనుభూతిని పొందును (పుట 117)

పెక్కుమందికి అశాంతిని కలిగించునది సత్యమైనను అసత్యమే. ధర్మమైనను అధర్మమే. ఉన్నత శిఖరములకు చేర్చి భగవంతుని కలుపునదియే నిర్దుష్టమైన ధర్మము. ఇతర ప్రాణులకు సంతోషముఁ గలిగించుటయే ధర్మమునకు ఉనికి, ఆధ్యాత్మికౌన్నత్యమునకుపకరించునదియే ధర్మము. విశ్వ శ్రేయస్సును కాంక్షించుటయే ధర్మ పరమావధి. అది విశ్వ శ్రేయః కావ్యమన్న పరమార్థములో అంతర్వ్యాతము. జగద్ధిత బుద్ధియే కావ్య నిర్మాణ ధ్యేయము. కావ్య తత్త్వ మర్మజ్ఞుడైన ప్రతి కవియు ధార్మిక దృక్పథముతోనే రచనలు కావించును. సద్యఃపర నిర్వృతి కల్గించు రచనలు స్వాంతస్సుఖాయ అను ధ్యేయమునకు లక్ష్యములు సాక్ష్యములు.

బలిజేపల్లివారి ప్రతి కృతియు నేదొయొక ధార్మికనిష్ఠకు ప్రతీకగా నిలిచి, సర్వలోక శ్రేయస్సును చాటినవి. వారెన్నుకొని అనువదించిన కావ్యములు మూడును సుప్రసిద్ధములు. శివానందలహరిలోని ప్రతి పద్యమున అద్వితీయ భక్తిభావము నిత్యనిరంతర స్రవంతిగా జాలువారినది. ఆది శంకరుల కమనీయ ప్రౌఢ కవిత్వమును అనువాదకుడైన బలిజేపల్లి పదపదమున తేనెలు జాలువారునట్లు తెలుగువారికి అందించి, శివునిపై తనకుగల అచంచల భక్తి భావమును ఎంతో ధార్మిక దృష్టితో వెల్లడించినాడు. తానుపొందిన అనుభూతిని పాఠకులకు కూడ అందఁజేయుటకై అమృత ప్రాయమైన లలిత మృదుమధుర కవితను అనువాదరూపమున సర్వస్వతంత్ర సరణిలో ప్రకటించినాడు. ఇక నిత్యపారాయణ గ్రంథమైన రామాయణమునందలి సుందరకాండమును యథామూలముగా అనువదించి తెనుగువారికందించి ముముక్షువులను తరింపఁజేసిన బలిజేపల్లి వారి ధార్మిక దృక్పథము నిత్య ప్రశంసాపాత్రము. ఆదర్శప్రాయుడైన శ్రీరాముని ధర్మ పరిపాలనలోని పరమార్థమును సీతా పరిత్యాగమునందుదాగియున్న పరమరహస్యమును విప్పి చెప్పుటకై భవభూతి రచించిన ఉత్తర రామచరిత్రమును ఉత్తర రాఘవమను పేర సర్వ స్వతంత్రముగా అనుసరించి **సీతాయాః చరితః మహత్** అన్న సత్యమును చాటెను. ధర్మమేమూర్తీభవించిన రాఘవుని యొక్క అంతర్గూఢ రసోదయమైన ఆంతర్యమును ఆంధ్రులకు అందించెను.

**అతిథిదేవోభవ అభ్యాగత స్స్వయం విష్ణుః** అను వాక్యములలోని ధార్మికమార్మిక

స్వరూప స్వభావములను కన్నులకు కట్టినట్లు రసభరితముగా బుద్ధిమతీవిలాసమను దృశ్యమునందు బలిజేపల్లివారు ఆవిష్కరించిరి. జంగము వేషధారియైన శివుడు సిరియాలుని అతిథిసేవాధర్మమును, అతని సహధర్మ చారిణియైన బుద్ధిమతియొక్క అచంచల బుద్ధి విభవమును వారి కుమారుడైన మతిమంతుని ధార్మిక నిష్ఠను పరీక్షించిన విధమును బలిజేపల్లి వివిధ సన్నివేశములలో వివరించిరి. ఇందు కవిధార్మికదృష్టి విస్పష్టము.

సాత్రాజితీయమున ప్రణయధర్మము ఫలసిద్ధినందుటకు ఎదుర్కొనవలసిన వివిధ సందర్భములను పరమరమణీయముగా బలిజేపల్లి ప్రతిపాదించిరి. అన్నింటికి మించి సత్యవ్రత దీక్షకై తమ సర్వస్వమును త్యజించిన హరిశ్చంద్రుని ధర్మనిష్ఠకు సర్వవిధముల సహకరించిన చంద్రమతి త్యాగశీలము కావలెనని ఒకదాని తర్వాత ఒకటిగా కష్టపరంపరలు కలిగించి, నిలువనీడలేకుండజేసిన విశ్వామిత్రుని ఔద్ధత్యము, తుదకు తన యాలిని తన్ను అమ్ముకొని కడజాతి వాని బానిసీడుగా కాటి కాపరియై దుర్భర దురంత విషాదవేదనయే దుర్విధి వినోద క్రీడగా భావించి, నిరపరాధినియైన ఇల్లాలిని కఱకు గుండె కసాయి వానివలె కత్తినెత్తి సంహరించుటకుపక్రమించిన దుస్స్థితి- ఱాతి గుండె వానికైన కన్నీరు తెప్పించునట్లు బలిజేపల్లి రచించిరి. ధార్మిక గ్రంథావళిలో తురీయమైన ఈ సత్యహరిశ్చంద్రీయము బలిజేపల్లివారి కెనలేని కీర్తి ప్రతిష్ఠలను కలిగించినది.

ఇట్లేవీరి దేశభక్తి రచనలలో, లఘుకృతులలో, పీఠికలలో, చలన చిత్ర రచనలలో, ఆయా సందర్భములకు దగినట్లు మహోజ్జ్వలముగా ధార్మిక దృక్పథము వెల్లడియైనది. అనంతవైవిధ్యముగల వీరిధార్మికదృష్టిసాహితీ సంస్కృతి సమారాధనలో సంగమించి, శాశ్వత శాంతి సుఖ పర్యవసాయిగా ఫలసిద్ధినందినది.

**3. బలిజేపల్లి- శేముషీ విభవము:-** ఆధునికాంధ్ర వాఙ్మయ నిర్మాతలలో బలిజేపల్లి లక్ష్మీకాంతకవి సుప్రసిద్ధులు. వీరిని లోకము కేవలము సత్యహరిశ్చంద్రీయ నాటక కర్తగనే గుర్తించి కీర్తించినది. కాని దాని ముందు వెనుకలు పూర్వాపరములెవ్వరును పరిగణింపలేదు. నవ నవోన్మేషమైన బలిజేపల్లి వారి అశేషశేముషి వారి ప్రతి కావ్యములో, ప్రతి కార్యములో అద్వితీయముగా ప్రతిఫలించినది. పద్య విద్యలో వారు ప్రదర్శించిన ప్రతిభ అప్రతిమానము. నటనలో వారు చూపిన నేర్పు అపూర్వము. పద్య శిల్ప రామణీయకములో వారికి వారే సాటి. అది వారికి వెన్నతో పెట్టిన విద్య. నటన విషయములో సహజత్వముండి తీరవలెనన్నది వీరి దృక్పథము. ఊరక అటు త్రిప్పిన ఇటు త్రిప్పిన నటన నటన అను పద్ధతి వీరికి సమ్మతికాదు. పూర్తిగా పాత్రలో లీనమై యథార్థ జీవితమునందువలె సహజముగా సజీవముగా రసపారవశ్యమును పొందునట్లు వర్తించుటయే నిజమైన నటనయని వీరి అభిమతము. ఇట్టి ధ్యేయమునే వారు పాటించి నటించిరి. వీరికి చాల ఇష్టమైన పాత్రలలో ప్రముఖమైనది నక్షత్రకపాత్ర. ప్రత్యేకించి ఈపాత్రను నాటకమున తనకై దిద్ది తీర్చెనని ప్రతీతి. బలిజేపల్లి లక్ష్మీకాంతం గారు తన హరిశ్చంద్ర నాటకములో నక్షత్రక పాత్రను ధరించి బాగుగనొప్పించెడివారట. (పుట 194 ఆంధ్రనాటక కళ- శిష్ట్లా రామకృష్ణశాస్త్రి) అని శిష్ట్లా రామకృష్ణశాస్త్రిగారు పేర్కొనిరి. ఇట్లే పలువురు విమర్శకులు నక్షత్రకపాత్ర విషయమున వారు ప్రదర్శించిన ప్రాగల్భ్యమును కొనియాడియున్నారు. హరిశ్చంద్రుని మాటిమాటికి వేధించు దృశ్యమును గాంచి సహింపలేక ఒక మార్వాడీ ప్రేక్షకుడు నీకెంత ఈయవలెనో చెప్పు అని చెప్పును పైకి విసిరివేసెనట. నాటి నుండి పాదరక్ష బిరుదాంచితుడుగా లక్ష్మీకాంతకవికి పేరుగలిగెనందురు. ఇదే సంఘటన నిజముగనే రెండు మూడు సందర్భములలో జరిగెనని, అటుపై తాను నక్షత్రక పాత్రనిక ధరింపనని తన మిత్రులతో తెల్పినట్లు తెలియుచున్నది. పూర్తిగా పాత్రలో విలీనమై సహజము యాథార్థ్యమునైన సరణిలో తన్నుతాను మరచి నటించుట వలననే యిట్టి పరిస్థితి నెలకొని యుండునని మనము గ్రహింపవలసియున్నది. బాగుగనొప్పించెడివారట అను వాక్యములో వీరి సహజమైన నిజమైన నటనను పురస్కరించుకొని నొప్పించెడు వారట. అను నర్థమునుగూడ స్వీకరింపవలసియున్నది.

ఇక వీరుయ్యూరు సంస్థాన కవీశ్వరులుగా నియమితులగుటకు వీరి శేముషీ విభవమే కారణము. వీరప్పుడప్పుడు గద్వాలసంస్థానములోని కావ్యగోష్ఠి కార్యక్రమములలో పాల్గొని అచ్చట రాణిచేత సత్కరింపబడిరి. వీరి అప్రతిమాన ప్రజ్ఞాపాటవములను గ్రహించియే శ్రీకాళహస్తి పానగల్లు రాజా వీరికి మడులు మాన్యములిచ్చి సత్కరించిరి. సంగీత కళారహస్యముల నెఱిగి ఏ సందర్భమున కేరాగముకూలమో పాటించుట వీరిలోని మఱియొక విశేషము. ప్రతిభావారి సంస్థలో చలనచిత్ర రచయితగా, నటుడుగా ప్రవేశించుటకు వీరి నిత్యనవ్యోజ్జ్వల ప్రతిభయే ప్రధాన కారణము. అదియే వారికి కొండంత బలమై ఆర్థికమైన అలజడి నుండి కొంత విరామమొసగినది.

వీరు చంద్రికా ముద్రణాలయాధినేతగా, గుంటూరు ఫస్టు కంపెనీ పునఃప్రతిష్ఠా ప్రదాతగా, నిత్య నాటక ప్రదర్శన నిర్ణేతగా, నాటక దర్శకుడుగా, నిర్మాతగా నిర్వహించిన బాధ్యతలన్నియు వీరి శేముషీ విభవమునకు నిదర్శనములు. కేవలము ప్రదర్శనలిచ్చుట తప్ప రాబడిని గూర్చి ఆలోచింపక నాటక కళాపోషణయే ధ్యేయముగా భావించి, లావులో వంపు తెలియదన్నట్లు కొన్ని లక్షలప్పులొనర్చి, తానార్జించిన ఆస్తిని కూడ నిలుపుకొనలేక నమ్మక ద్రోహులచే యావదాస్తిని గోల్పోయిన సంఘటన లౌక్యమెఱుగని వీరి అమాయకత్వమును తెలుపును. గుంటూరునుండి కాళహస్తిలో నివాసమేర్పరచుకొని అచ్చటచ్చట కొన్ని యూళ్ళలో మకాము వేసి నాటక ప్రదర్శనలిచ్చి వీరు గావించిన నాటకకళారాధన ప్రశంసార్హము. ముఖ్యముగా కవితా విషయమున వీరికెన్నోచోట్ల సన్మాన సత్కార్యములు జరిగినవి. అవి యన్నియు వీరి శేముషీ విభవమును లోకము గుర్తించినట్లే అని భావింపవలసియున్నది.

**4. బలిజేపల్లి రచనలపై- ప్రాచీన కవుల ప్రభావము**

సర్వ సాధారణముగా కవులు పూర్వ కవుల రచనలలోఁగల అపూర్వ సరణిని గాంచి, వారికి అంజలి ఘటించి, అవసరమైనచో వారి దారిలో పయనించుటకు ప్రయత్నింతురు. * అను కరుణామాత్మహత్యయే యనెడుమాట, రమ్య కమనీయ కావ్య సత్కవీశ్వరులైన పూర్వుల ననుసరించుట ప్రతిష్ఠా హేతువేకాని దోష భూయిష్ఠము కాదు. హృదయ స్పర్శియైన రసవత్కవిత్వమును వ్రాయునాధునికసత్కవీశ్వరులలో వ్రేళ్ళకొలది లెక్కింపదగినవారిలో బలిజేపల్లివారు అగ్రగణ్యులు. తమ పేరు చివర కవి పదమును బిరుదముగా గ్రహించి, దాని సార్థక్యమును నిరూపించిన కవివరేణ్యులందును వీరగ్రగణ్యులనుట యథార్థము.

సహజముగా రసవత్కవిత్వమును వ్రాయగల వీరు తమ కభిమాన పాత్రుడైన సహజ పాండిత్య బిరుదాంచితుడైన పోతన మహాకవిని అనేక సందర్భములలో అనుసరించియున్నారు. సత్యహరిశ్చంద్రీయమున ప్రథమాంక ప్రారంభమున వారిజాతులందు వైవాహికములందు- అను పద్యమును యథాతథముగా స్వీకరించుటను బట్టి వీరికి పోతనపైగల ఆదరాభిమానములెట్టివో వెల్లడియగుచున్నవి. అంత్యానుప్రాస మనోజ్ఞమగు రచనగావించిన వివిధ సందర్భములలో శివానందలహరి- సాత్రాజితీయము వంటి గ్రంథములలో పోతననమకరించివ్రాసిన పద్యములున్నవి. వానినన్నింటిని ప్రస్తుతముదాహరింపఁబూనుట సిద్ధాంత వ్యాస పరిధినధిగమించినట్లగును. సీస పద్యరచనలో శ్రీనాథునేనేక సందర్భములలో అనుసరించిరి. బుద్ధిమతీ విలాసము, ఉత్తర రాఘవము, సాత్రాజితీయములలో నిదికన్పట్టును. ఇక అనువాదవిషయమున శ్రీనాథుడవలంబించిన పద్ధతినే ముఖ్యముగా వీరు సుందరకాండమున పాటించిరి. కొన్ని కొన్ని వృత్తములలో కూడ శ్రీనాథునిపోకడలున్నవి. సత్యహరిశ్చంద్రీయమును బలిజేపల్లి చాలావరకు శంకరకవిననుసరించి రచించుటచే అందందు ఆకవి పద్యపు పోకడలను గూడ గ్రహించెను. అకటా! చేరెడు నేలకుందగడె వంటి పద్యముల సరణిని చతురంభోధి పరీత భూతధరణీ-మొదలగు పద్యములలో అనుసరించెను. ఇట్లే ఇందనేక సందర్భములున్నవి. ఇక ఉత్తరరామవమువంటి నాటకములలో వీరు కంకంటి పాపరాజు కవితా ధోరణిని గూడ అనుసరించియున్నారు. అచ్చ తెలుగుపలుకుబడిగల

రచనలో అచ్చుటచ్చుట తిక్కనగారి సరణిని పాటించియున్నారు. అల్లసాని పెద్దన, ముక్కుతిమ్మన వంటి ప్రబంధ కవులపద్ధతిని కూడ సావిత్రీ జతీయము వంటి దృశ్యములలో అనుసరించి యున్నారు. ఎక్కువగా పోతనను కంకంటి పాపరాజును, శంకరకవిని అనుసరించిరి. అందందు అల్లసానివాని జిగిబిగిని ముక్కుతిమ్మన ముద్దుపలుకులను సందర్భానుసారముగా తన పద్యరచనలో బలిజేపల్లివారు ప్రదర్శించిరి.

రసస్ఫూర్తిగల పద్య శిల్పము నెఱిగిన మహాకవులనే బలిజేపల్లివారు అనుసరించి, తన కవిత్వమున కొక వినూత్నదీప్తిని, నిత్యానంద రస ప్రాప్తిని సంఘటింపఁజేసిరి. పూర్వకవులననుసరించుచు తనది యనదగు ఒక ప్రత్యేకశైలిని పాటించి ఎంతో నవ్యతను భవ్యతను శ్రావ్యతను కావ్యములందు ప్రతిష్ఠించిరి. కవితాకళానిధి అను బిరుదమునకుఁదగినట్లు మృదుమధురము, లలిత ప్రసన్నము అమృతమయము, నిత్య సుందరము రసానందతుందిలమునగు కవిత్వమును వెన్నెల జల్లువలె జాలువార్చి, ఆహ్లాదమును ఘటించిన బలిజేపల్లివారు సదాస్మరణీయులు. వారి కవితావల్లి నిత్య సుమనస్సౌరభ్య సంస్కృతివిలసిత పరమామోదమల్లి.

**౬. తదనంతరాంధ్రకవులపై బలిజేపల్లి వారి ప్రభావము:-**

సంప్రదాయ సిద్ధమైన రసమయ సాహిత్యము సాహిత్యమును నెఱపి, సద్యః పరనిర్వృతిని సంఘటించును. సత్కవిత్వ ప్రభావము తనయనంతరము తరతరముల వారిని చైతన్యవంతులగావించి లోక కల్యాణము కలిగించును. రససిద్ధులైన కవీశ్వరుల కవిత్వము ఆకల్పాంతస్థాయి. ఆనందప్రదాయి. పూర్వకవుల ప్రభావము ఒక మహాకవిపై బుద్ధిపూర్వకముగనో అప్రయత్నముగనో ప్రసరించినపుడు- ఆ మహాకవి కవిత్వము తరువాతి వారిపై తప్పక తన ప్రభావమును నెఱపితీరుననుట యథార్థము. బలిజేపల్లి లక్ష్మీకాంతముగారు రససిద్ధులైన మహాకవీశ్వరులు. ముఖ్యముగా వీరి సత్య హరిశ్చంద్రీయములోని శ్మశాన వాటికాఘట్టము సమకాలీన చక్రవర్తియైన జాషువాగారిలో కొంత ప్రభావమును నెఱపినది. కావుననే జాషువ ఖండకృతులలో భస్మసింహాసనమైన శ్మశాన వాటికను గూర్చి ఎంతో రసవత్తరముగా రచించిరి. మనస్సును మథించి గుండెలను పిండివేయగల ఆర్ద్రీభూత రసమయ కవిత్వము ఒకరిని అనుకరించిన వచ్చునది కాదు. అదివారి పూర్వ జన్మ సుకృత విశేషమును బట్టి పుట్టుకతో ప్రాప్తించును. ఇక సరసహృదయులైన సహృదయులుత్తమ కవిత్వ పఠనముచే విశిష్ట సంస్కృతి వికాసమును పొందుదురు. బలిజేపల్లివారు స్వయముగా ఉత్తర రాఘవమునందలి పద్యములను మూలశ్లోక సహితముగా సికిందరాబాదులో ఒకసందర్భమున వినిపించినందువలననే ఉత్తరామచరిత్రపై తనకంతటి ప్రీతియేర్పడినదని దేవులపల్లి రామానుజరావు తన యాభై ఏళ్ళ జ్ఞాపకాలలో వివరించిరి. ఒక కవి యొక్కకవిత్వ ప్రభావముచే తర్వాతి వారందరు కవులే కావలసిన అవసరములేదు. ఆ కవిత్వమునందలి రామణీయకమునకు ముగ్ధులై రససిగ్ధులై నిరంతరము మననము చేసి తమ్ముతాము మఱచి తాదాత్మ్యముతో తరించితిమని తలంచిన రసజ్ఞులెల్లరును కవిత్వ ప్రభావమునకు ప్రత్యక్ష సాక్ష్యములు. ప్రత్యేకించి తదనంతర కవులెవ్వరెవ్వరెట్లు ప్రభావితులైరో యిదమిత్థమని నిర్ణయించుటకు వీలుకాదు. కవియే స్వయముగా సుందరకాండము యొక్క అనువాదమును పూర్తి చేయవలసినదని కోరుచు నారచన నీరచనతో సంపదించుచున్నదని శ్రీ మేడవరము రామబ్రహ్మశాస్త్రిగారితో పేర్కొనిరట. ఇట్లే బలిజేపల్లి వారి కవిత్వమునుదలపించుచు వ్రాసిన కవులెందరో యుండవచ్చును. అక్షరాక్షరము అట్టివారి రచనలను ప్రస్తుతము తులనాత్మకముగా పరిశీలింపంబూనుట వీలుకానిపని. అది ప్రత్యేకించి సావకాశముగా ఎందరెందరో ఆధునిక కవుల కవితలను సావధానముగా పరిశీలలించినగాని నిర్ణయింపఁజాలము. బలిజేపల్లి అనంతరము వారి రచనా ప్రభావముచే నాకృష్టులైన కవులు వారికివారై స్వయముగా ప్రకటించిన ఆధారములున్నచో నిది కొంత సులువగును.

ఇక ఈ సిద్ధాంత వ్యాసమున తుట్టతుదిగా సప్తమ పరిచ్ఛేదమున చలనచిత్ర రచయితగా,

నటుడుగా బలిజేపల్లి లక్ష్మీకాంతకవి ప్రదర్శించిన అప్రతిమాన ప్రతిభాపాటవములను దిఙ్మాత్రముగా పరిశీలింతము.

**1. చలనచిత్ర రచయితగా బలిజేపల్లి లక్ష్మీకాంతకవి**

సుప్రసిద్ధకవిగ, నటుడుగ, కళాకారుడుగ, నాటక రచనలో నటవర్గములో కీర్తి ప్రతిష్ఠలనార్జించిన బలిజేపల్లి లక్ష్మీకాంతకవి నాటకరంగ స్థలము నుండి చలనచిత్ర రంగమునకు ప్రవేశించిరి. రక్షరేఖ, వరకట్నము, తాసిల్దారు, బాలనాగమ్మ, నాచెల్లెలు, మళ్ళీపెళ్ళి, మంజరి, విశ్వమోహిని వంటి ఎన్నో చలన చిత్రములలో నటించుటయేకాక కొన్ని చిత్రములకు మాటలు, పాటలు రచించిరి. గుంటూరు ఫస్టు కంపెనీ నుండి వదలి వచ్చిన తరువాత వీరు ఆంధ్రదేశములో అక్కడక్కడ సత్య హరిశ్చంద్రీయాది నాటకములను ప్రదర్శించి వై.వి.రావు ఘంటసాల బలరామయ్యమొదలయిన వారి ప్రోత్సాహము వలన చలన చిత్ర రచయితగా, నటుడుగా తమ ప్రతిభను ప్రకటించిరి. ఇక వీరెన్నో చలన చిత్రములకు మాటలు పాటలు రచించిరి. అందు జెమినీ వారి బాలానాగమ్మ, అపూర్వ సహోదరులు, ప్రతిభావారి ముగ్గురు మరాఠీలు, ఈస్టిండియావారి : రవిక్రయము, మంజరి, మనోహర ( అత్రేయతో కలసిమాటలు) మొదలైనవి ఎన్నదగినవి.

గోపాలరాయశర్మతో కలిసి వీరు శ్రీలక్ష్మమ్మకథకు మాటలు పాటలు వ్రాసిరి. ఈ చలనచిత్రమున 15 పాటలున్నవి. ఇందులో మొట్టమొదటి గుమ్మడి పూలకమ్మని గాలివూపేవుయ్యాలోయ్ అనెడి ఉయ్యాలపాట శ్రీలక్ష్మమ్మ కోరస్‌లో ప్రవేశపెట్టబడినది. అటుపై లక్ష్మమ్మ జయమంగళగౌరి గీతమునాలాపించును. మూడవ పాటలో వెంకయ్యనాయుడు పువ్వుల వానలే నవ్వులసోనా **ఆ చాన సరీ సమానమే లేదు జగానా మోమున లక్ష్మీ కళ మురిసి యాడ నను వలచినది నిలచినది నామదిలోన ఆ చాన కోడెలి బేరంబోతే చక్కని చుక్క చేతికే చిక్కింది.** అని శ్రీలక్ష్మమ్మను గూర్చి పాడుచు ఆమెను మించిన చాన ఈలోకములోనే లేదని తలచును. అతని కప్పుడు నిజముగా అంబరవీధిలో తెక్కలుగట్టుకొని రివ్వున ఎగిరిపోవునంత మహానందము కలిగినది. చిరు నగవు చెక్కిలిపై చిందులు వేయగా ఆమె పలుకులలో ముత్యాలు జాలువారినవట. వెంకయ్యనాయుడు శ్రీ లక్ష్మమ్మను చూడగానే కలిగిన గిలిగింతలు భావపరంపరలు ఆమెలో అగుపించి అలరించిన అందచందములు ఊహల ఊయలలో ఊగిసలాడు కోర్కెల పరవళ్ళు ఎంతో చక్కగా సన్నివేశానుగుణముగా ఈపాటలో తెలుపబడినవి.

మొదట చూపులు కలిసినవి. పిదప మెల్లమెల్లగా మాటలు సాగినవి అటుపై పదములు లయ విన్యాసములతో యుగళగీతములు మ్రోగినవి. ఈ సందర్భమున **హాయిగా వీనులవిందుగా అనురాగము రాణింప పాడుదమా** అని వెంకయ్యగానమొనరింపగా మనసే మృదు వీణగా **సారించినచో ప్రేమలీల** పలికెదనని శ్రీలక్ష్మమ్మ తన హృదయ విపంచిని గాన సమాయత్తమొనర్చినది. **తనువైనా మనసైనా తానే** అని ధన్యుడనైన తనకు శ్రీలక్ష్మమ్మ నిజముగా సిరియే అనివెంకయ్యనాయుడు తెలుపగా శ్రీ లక్ష్మమ్మ ఇహమున నీ రాణిగా మెలగెదనోయీ అని విన్నవించుటయేగాక పరమందున దరినుండెద కరుణింపురాజా- అని అర్థించినది. ఇది భావ్యర్థ సూచన. పిమ్మట వెంకయ్యనాయుడు ఇహమో పరమో సర్వము నీవే. దరి జేరితి వలపింపుము వెన్నెలనీవై అని తెలుపును. అపుడామె అతని అడుగు జాడలలో నీడగా జోడుగా స్నేహశీలిగా నడిచెదనన్నది. వెంకయ్య వరమై లభియించితివే అని అనగా శ్రీ లక్ష్మమ్మ సరిసై మురిపించెదనని సాధ్వియైన సతీ ధర్మమును చాటినది. తుదకిరువురు సంసారమె పూలపాన్పు తేలుదమా ప్రేమలీల అని నవజీవనసారమైన సంసారమును పుష్పశయనాగారముగా భావించి అందు తేలియాడు సన్నివేశమును యుగళగీతమునందెంతో మనోహరముగా సన్నివేశసుందరముగా జంటకవులు శ్రీ గోపాలరాయశర్మ లక్ష్మీకాంతకవులు కూర్చిరి.

శ్రీ లక్ష్మమ్మ కథలోని ఐదవ పాట శ్రీ లక్ష్మమ్మ కోరస్‌లో పాడిన లాలి పాట. చిన్నారి

పొన్నారి చిట్టితల్లి శ్రీదేవి వరమంది తననీమముల పంటగా వెలసినదట. పసిడి ఉయ్యాలయే ఫణిరాజు విరిపాన్పు కాగా, చిలుకపందిరి చూచి చిన్నారికిలకిల నవ్వినంతనే ముత్యాలురాలునని చెలువారు కళలూరు చిన్ని జాబిలిరేఖ వలె తమ పాప చల్లగా పెరుగవలెనని శ్రీ లక్ష్మమ్మ బిడ్డకు లాలి పాడినది. ఈ పాటలో ఈ జంటకవులు ప్రయోగించిన ఉపమానములన్నియు మెల్లని చల్లని కమ్మదనమునకు శైత్యలాలిత్య సాహిత్యమునకు నిదర్శనములు. చిగురుమావులలోని కోయిల నవవసంతోదయగాన మాధుర్యమునకు నిదర్శనము.

ఇందలి పదునైదు పాటలలో 6, 8 పాటలు రంగసాని పాత్రకుద్దేశింపబడినవి. నరసుడ ఇంతటి జాలము తగునా, మరచితివానను పరకాంతలమాయలలోఁబడి అని ఆమె మొదట పరామర్శించి నానేరము లేమి, నీ కయిలేచి తలపులతో తెల్లవారినది. నవరసరసికాపరాకిలమరు బారికి సైతాళ జాలనని తన బాళిని ప్రకటించినది. ఈ ఎడబాటును సహింపలేను. వెల యాలినని తలచకు. నిన్నే మదిగోరితిని చేరితిని. నెనరుంచితనియింపుము. చిగురుల చిరుమోవితేనియలిమ్ము మునిపంటి కపురంపులిడెమిమ్ము మోహన చందనమలది. అనురాగ సమడోలికలలో ఊచనా! మృదుమధుర సరళభావరాగ తాళ వినోదముల నటింతునా మనోరమణా! ఏలపలుకవు ఆనందరస కళాలాలసా నన్నేలుకో అని ప్రాధేయ పడినది. రంగసాని హొయలకు తగినట్లు మతందమధురములగు పదములు లయాన్వితము గాసాగినవి. ఆమె మనస్సులోని లాలిత్యమునకు దగినట్లు రచన లలిత లలితముగా కూర్చబడినది.

ఇందు హాస్యరసపోషణకుద్దేశింపబడిన పాత్రలు చిట్టి- రంగడు. వీరువురికి సంబంధించి 7, 11 సంఖ్యగల పాటలు ఎంతో సహజముగా సరళ మృదుమధుర హాస్యభరితముగా, సంభాషణా చాతుర్యముతో కూర్చబడినవి. ఇట జానపదగేయ సరణిలో చిట్టి రంగనితో చీటికి మాటికి చిట్టమ్మంటావ్. పెదనాయుడుంటడు, చిననాయుడుంటడు, కరణాలుంటరు, కాపులుంటరు, చిట్టమ్మా అనిపిలువకరో అని రంగనితో అన్నది. తుదిగా మా అయ్యొస్తే తంటారో అని హెచ్చరించినది. అందుకు రంగడు నేనుకంతకుదగిన బొంతను మీ అయ్యకుదయ్యం వదిలిస్తా భరతం పడతాను అని గొప్పలు చెప్పుకొనగా మాటలు చూస్తే కోటలుదాటేన్. యిక నీ సరసాలు కట్టిపెట్టు అని చిట్టి అన్నది. మరల రంగడు రంగడి సంగతి నీకెరిక వీడు మురిపాల ముద్దుల రంగడు రతనాల రంగేలిరంగడు నిన్నిడిసిపోతానా? మీ అయ్యకు భరతంపడతానే అని చిట్టిని వదలిపెట్టలేనని తెలుపును.

11వ పాటలో రాకరాక నీవొచ్చావోయ్ నాకేటి సరుకులు తెచ్చావోయ్ వీరెడతా సారెడతా సెవులోకి పొగెడతాకాసుల పేరెడతా బేసరికొని పెడతానన్నావే ఏమి తెచ్చావని అడుగగా పిల్కారి గాజులు బల్ పూలగాజులివిగో ఇవి నీయబ్బసూడనివి అని చిట్టి అబ్బసంగతి మరల ప్రసక్తికి తెచ్చును. అత్తిరి బిత్తిరి ఇత్తడి పుత్తడి బంగారు బొమ్మ రంగడి సామ్మా లింగాలపురికి పోదామె అని పిలుచును. ఇక్కడలయకై లబలుకుజిబా జిబుకులబా అని కవి ప్రయోగము. చిట్టి అప్పుడు రాజ నారాజ నిమ్మలపండ, నా ఒప్పురాలకుప్ప అప్పుడుకాచిన్నెయ్యి నా అప్పడాల కట్ట అంటు మామిడుగున్నా ఈ జంటు ఊడకుంటావా అని అడుగును. ఈపై తెల్పిన పదాలు జానపద గేయాలలో చాలా ప్రసిద్ధముగా వ్యవహారములోనున్నవి. రంగడును ఆ చిట్టిపాటకు అనుగుణముగా నాగజనిమ్మపండు నా ఆవకాయ బద్దనా అప్పడాల పేట నీ అబ్బమీద ఆన అని తెలుపును. ఇక్కడ మరల తుట్టతుదిగా చిట్టి అబ్బ సంగతిని రంగడు ప్రసక్తికి తెచ్చుట ఈ పాటలోని విశేషము.

శ్రీలక్ష్మమ్మ కథలో తొమ్మిదవపాట శ్రీలక్ష్మమ్మ పాడినది. జీవితమే వ్యధాయానో అని చింతించుచు పూర్వ జన్మములో సుఖజీవుల ఎడబాపితినేమో ఆ పాపమె నన్నిగతి బాధించి పరీక్షించెనేమో పతిననుపీడి పరాధీనుడై పలుకేవినడాయె అని విలపించును. ఇట కంకంటి పాపరాజు ఉత్తర రామాయణమున సీత నోటపలికించిన మాటలే పాటరూపమున చాట బడినవి. అట్టిపై

10వపాట తుదిలో లక్ష్మమ్మ లక్ష్మమ్మ-నాతల్లీ నాతల్లీ అని వచ్చునట్లు పాట కూర్చబడినది. క్లౌదుటవుంటావు కన్నెక్కబిడ్డవని ఇల్లరికముంచామె లక్ష్మమ్మా వల్లకిన్నాళ్ళుండి ఎల్లిపోతాడని కల్లోన అనుకోయె లక్ష్మమ్మా. అత్తింటి కాపురము కత్తిమీదే సాము అణగి మణగి యుండు నాతల్లి అని తల్లిదండ్రులు, ముత్తైదువలు ఉపదేశ వాక్యాలు తెలుపుట ఈ పాటలోని విశేషము.

లక్ష్మమ్మ అత్తవారింట అడుగుపెట్టగనే అన్ని సంపదలు వారికి అనుకొనకుండ అబ్బినవి. అప్పుడు వారు కోడలొచ్చిన వేళ కోడలొచ్చినవేళ కూడి రావాలన్నవాడుకే నిజమాయె బంగారు బిందెలపైడి గజ్జెలతల్లి చిన్నమ్మ మాయింటచిందేసి ఆడింది అని తమ యింట కొల్లలుగా సంపదల రూపములో లక్ష్మి వచ్చి చేరినదని తెలుపుదురు. ఇట చిన్నమ్మ పదము లక్ష్మికి మారుపేరు. పెద్దమ్మ దరిద్రదేవతకాగా చిన్నమ్మ లక్ష్మి అట.

సాకీలో లక్ష్మమ్మ పొందిన ఇక్కట్లు వివరింపబడినవి. తుట్టతుదికోరస్‌లో లక్ష్మమ్మ ఇలవేల్పుగా, పరాశక్తిగా, నాగకన్నియగా ప్రస్తుతింపబడినది. నీపుణ్య చరితము విన్నంతనే నిన్ను కన్నంతనే మాకు తొలగు దోషములెల్ల లక్ష్మమ్మా! జన్మధన్యమయ్యెనమ్మా లక్ష్మమ్మా అని ఆమె మహాత్మ్యము ఫల శ్రుతి రూపమున ప్రకటితమైనది. జెమినీవారి అపూర్వ సహోదరులకు, బాలనాగమ్మకు కవితాకళానిధి లక్ష్మికాంతకవియే మాటలు పాటలు రచించిరి.

కోరస్‌లో మొదట అపూర్వ సహోదరులు జన్మించినపుడు జోలపాట కలదు. ఇందు శ్రీరామ లక్ష్మణులె మీరనగా ధరచిరాయువులగని మనుడీ మా బంగారు పాపలు జోజో మా చిన్నారి నాన్నలు జోజో మా కన్నుల వెన్నెలలారా చిరువన్నెలచిలకల్లారా! అని కావ్య భాషకు చేరువగా రచన సాగినది. అటుపై నాటకశాలపాట కొంత విస్తరించి వ్రాయబడినది. సుధలచిలికే వలపులొలికే వసంతమిదే నవయౌవనమే. రతీశుని సూనలతా శితిబాణవితాన వినోదము యౌవనమే ఆశాదళములురాలెనే వసంత శోభలూలెనే నడుము సడలెన్ నడత తడబడె ప్రశాంతము మతిగలిగెన్ అని బాల్య యౌవన వార్థక్యముల సరణిని ఆయా అవస్థలకు అనుగుణమగు పదముల పొందికతో బలిజేపల్లి రచించిరి.

కాంచన వేషముధరించిన భానుమతి మొదట సియానో పాట, వంట యింటి పాటను పాడి పిదప మలయాళం, అరవం, కన్నడం, హింధూస్థానీ భాషలతో మిళితమైన పాటలు పాడును. సియానో పాటలో నిజమోమాయో ఏమోకాని అతడొకానొక రాజేయౌనట నను ప్రేమించెనట అని పాట ఎత్తుగడ. ఇక వంట యింటి పాటలో లడ్డు లడ్డు మిఠాయి కావాలా రవా లడ్డు బాదుషా కావాలా అని గేయారంభము. ఇక వివిధ భాషల పాటలలో ఆయాభాషల పదములే అధికముగా ప్రయోగింపబడినవి. అడవిలో కాంచన నవజీవనమే సుఖజీవనం కమనీయ జవనానందము నవపరిమళముల సమధూళిపెద జల్లెడు కమ్మనిగాలి తరుల తావళుల సయ్యాటమోదమై సువినోదమై హాయిగా సుఖదాయిగా అని పాడినట్లు కావ్యములందువలె అంత్యానుప్రాసమనోజ్ఞముగా పాట కూర్చబడినది. పిమ్మట ప్రేమికుల జంట పాడిన పాటలో మొదటగా కాంచన అహా సుఖదాయీ వెన్నెల రేయి మనమూరించె ఆసలతో మైమరపించె వలపించె కలకలలాడే కాననమేదో కమ్మని తలపులనించె కలువల తేని కరముల నాని కలువల చెలివికసించె అని పాడును. ఇందు కవి సమయము తుదిపాదమునందున్నది. కమ్మని ఊహలతో విరిసిన వెన్నెలలో విహరించు పారవశ్యము చక్కగా వివరింపబడినది. అడవిని గాచిన వెన్నెల ప్రియాప్రియుల జంటకెంత ఆహ్లాదదాయకమో తెలుపబడినది. కాంచన విజయులు ఓడవాని సాయముతో అవతలి తీరము చేరిన వెనుక మొదట స్త్రీ పురుషులు తుట్టతుది అందరు పాడిన డ్యూయేట్ ఒకటున్నది. ఒక స్త్రీ పరదేశమదేలా నన్నొంటిగ విడిచిపోవుట న్యాయమా ఇదియే నీ సాయమా అనును. అందుకు పురుషుడు ఇటు బెదరెదవేలా? మనసంతా నీపైనుంచి పోయెద నగలెన్నో పంపెద అని ఆస చూపును. అంత ఆమె పరదేశము పోనేలా? శ్రావణ పున్నమి పండుగ దీపావళి సంక్రాంతి ఉన్నది కదా. మెడతాళి

గట్టి మూన్నాళ్ళ ముచ్చటైన తీరిక యిది యేమిటి! నీవొక చోట నేనొక చోట వేదన పడదగునా అని ఆర్థించినది. రంగంపోయినా ఢిల్లీ పోయినా నీ మీదనే నా ధ్యాస అంతా అని అతడు తెలుపును. అప్పుడందరు కమ్మని పిల్లని కాదని వదలి కాసే మేలనిపోయె తానడి యాసల బడిపోయె తీయని వెన్నెలపున్నమి రేయి అడవుల పాలైపోయె జాలైన లేదే సన్నాసికి ఈ సంసారం ఏలనె సింగారము లేలనే అని అందురు. అంతకుమునుపు కాంచన విజయములు కలసినపుడు అడవిలోని వెన్నెల ఆహ్లాదకారికాగా నిటవేదన కలిగించినట్లు తెలుపబడినది.

రక్షరేఖ చలన చిత్రములో మొత్తము పదునాలు పాటలున్నవి. ఇందు బలిజేపల్లి చలనచిత్ర కథానాయకుడైన సుధాకరుని తండ్రి ప్రతాప మహారాజుగా నటించిరి. సంక్రాంతి వినోదాల పాటతో చలన చిత్రమారంభమగును. ఈ పాటలో భారతమాతా గోమాతా పంచఖండాలా బ్రతుకు రాటమెవాడికి ఏటికి యేడు జోడు పంచెలుయిస్తారా అని దేశ భక్తిని మహాత్మునిపై భక్తి ప్రపత్తులు గల రాట్న ప్రసక్తిని కవి కల్పించెను. అటు పిమ్మట సుధాకరుడు రామనామ సంకీర్తనమే రక్తి భుక్తి జీవన్ముక్తి అని పాడును. పిమ్మట చిత్రపాడిన రాగమాలికలో కృష్ణావతారము వరకుగల అవతారముల వర్ణనమున్నది. కమలదళలోచనా భవతరణా కామితఫలదాతవే శ్రీ రమణా అని ఈ పాట మొదలు. పాటలోని ప్రతి పాదము చివర ఒక్కొక్క అవతారము తెలుపబడినది. చిన్నారి మోవిని పిల్లన గ్రోవి సిగపై పింఛము చెలువలర గజ్జెలు అందెలు ఘల్లని ప్రియ ముజ్జగములు మురియ ఆడితివి గద పాడితివి గద గోకుల బాలుడవై కృష్ణా! అని కృష్ణావతార వర్ణనతో గేయమంతమగును.

ఇందులో దూరదర్శి 4,9 పాటలను పాడును. 11వ పాట దూరదర్శి కోయపిల్ల పాడుదురు. 4వపాట బలేపిల్ల చూశానమ్మా పిల్లంటే పిల్ల కాదు లోకంలో పిల్లలంతా బలా దూరుదా నిముందు అని శివరావు పాడినపాట చాలా ప్రసిద్ధికెక్కినది. ఇట్లే ఛలో రేతంగణా ఘోడా ఆకాశంలో ఎగిరేఘోడా మూడడుగులు ముందుకు వేస్తే ఆరడుగులు వెనక్కువేస్తావ్ ధణ్యాకైతే ధవుడాతీస్తావ్ ఏంచేసేదేనీతో అను హాస్యరసభరితమైన ఈ పాటకూడ ప్రజలలో బాగుగా వ్యాప్తి గాంచినది. ఇక 11వ పాట ఓలమ్మి ఎవరనుకున్నావోలె అమ్మి పులిననుకో మగపులిననుకో అని దూరదర్శి పాడును. ఇందులో కుప్పించి దూకుటకు టకటకటకటక బాగా కళ్ళు తిప్పుటకు భర్‌భర్‌భర్ చేడీ పట్టుటకు ఛర్‌ఛర్‌ఛర్ పట్టాకత్తిపట్టుటకు బార్‌బార్‌బార్ అను ధ్వన్యనుకరణ శబ్దములు ప్రయోగింపబడినవి. 15వ పాట దూరదర్శి పాడునదియే. సన్యాసి సుఖీ సంసారిదుఃఖీ సన్యాసికి బెత్తెడు గోచీ, సంసారికి చీరెల పేచీ పిల్లా జెల్లా కలిగారంటే మళ్ళీమళ్ళీ పేచీ - అప్పుల వాళ్ళ పేచీ పీపంతా తెగవాచీ- ఈ పేచీ పూచీ జంటలెందుకు తారల కోసం తారాడకురా అని స్త్రీలకోసంతారాడవలదని హెచ్చరించు ఈపాట కూడ బహుళ ప్రచారముగాంచినది. హాస్యమునకు తోడు రచనలో చూపిన చమత్కారము పేచీ- పూచీ- గోచీ- వాచీ మొదలైన అంత్య ప్రాసలలో కవి ప్రదర్శించిన నేర్పుపైగా శివరావు పాడిన తీరుపై పాటల ప్రాముర్యమునకు ప్రబల కారణములు.

నాయిక కళావతి ( భానుమతి) పాడిన పాటలు మూడున్నవి. ఇందు మొదటి పాటలో నీవు లేని నాజీవితమే వృథా వృథా సుధా - నను బాసిపోవగానే కనుపాపవెగుమాసె వగతో కృశింపనాయె జగమే శూన్యమాయె అని విరహబాధ అభివర్ణితము. పతి బాసిన చాన శ్రుతి విహీనమైన వీణ అని సంగీత మర్మజ్ఞుడైన బలిజేపల్లి నాయికా నాయిక పరమగునట్లు పతిని శ్రుతిగా చానను వీణగా ఉపమించిరి. ఈ చిత్రములోని పదవ పాటను, పద్యమును కళ్యాణి పాడినది. మాణిక్యామల వీణా పాణీ- మధురమధుర దివ్యామృతవాణీ- మధుకరమంజుల వేణీ- మహేశ్వరీ భవానీ- అను అంత్య ప్రాసమనోజ్ఞములైన సంబోధనలు మహేశ్వరి నుద్దేశించి పలికిన యనంతర మీక్రింది శార్దూల విక్రీడిత పద్యమున్నది.

కాతర్యం బొదవెన్ మనంబు బహుధా కల్లోల వారాన్నిధి
స్రోతంబై సుడివారె, అంధతమ సమ్ముల్ గ్రమ్మె చుక్కానియున్
చేతన్ గోల్పడె, యీ వియోగ జలధిన్ చేయూతవై ఓ జగ
న్మాతా! నన్దరి జేర్పవా విభుని గ్రన్నన్ నాకు చేకూర్పవా - ఇందు కళావతియనుభవించు వియోగవ్యధ చక్కగా అభివర్ణితము. కల్లోలము చెందిన తన మనస్సు సుడులు వారగా, చుక్కాని లేక గాఢాంధకారములో పయనము సాగించుచున్నానని అట్టి వియోగ జలధి నుండి గట్టు చేర్చిపతిని పొందుటకు గౌరియే సర్వ సమర్థురాలని పార్వతిని ప్రార్థించినది. తుట్టతుదిపాట సుధాకర- కళావతీ సమాగమ సందర్భమున కూర్చబడినది. జీవన డోలీ జీవన డోలీ- మధుర జీవన కేళీ యిదే ప్రేమ సుధావాహినీ తేలుదమే హాయిగా- అని సుధాకరుడనగా కళావతి నీవే సరంగువి ప్రేమకేళి డోలికి ఆనందవాహినిలో హాయిసాగిపోవగా అని ఆనందమును వెలిబుచ్చును. అపుడు సుధాకరుడు నీవే చుక్కానిగ నడుపు. అదే ప్రేమ నగిరి ఓ చెలీ! చేరుదమే హాయిగా అని కష్ట సముద్రమునుండి గట్టెక్కిన విధమును సూచించును. పున్నమరేయి పాలవెన్నెలలో హాయిగా పోనిమ్మా సరాసరిడోలికా అని కళావతి తెలుపును. తుట్టతుదిగా ఇంతకాలము వియోగ సాగర నిమగ్నమైన కళావతి సమడోలీ ఊయాలూగె చెలీ చంద్రికా అదే ప్రేమనగరీ ప్రేమ సఖా! అని తీరమును చేరి ప్రేమ నగరిలో ప్రవేశించుచున్న తీరును ప్రకటించును.

ఇక ఇందలి 13వ పాట కళావతి చెలి చంద్రిక పాడునది. ఈ పాటలో పాలువూరికోవా జావాలాడూగులాబిజాం జిలేబీ- చవులూరు నోరూరు జహంగీరు కిచిడీ పకోడీ మిఠాయి ఆరగింపవోయి బిడియమెందుకు ఈ బిగువులు చాలు కోరిక తీరవినోదింపరాదా అని మనోహరుని వేడికొనును. ఇక పాటతుదిలో ఆకు మడిచి యిమ్మనరాదా? వాదా! అడుగొత్తిరమ్మన రాదా వీవెన వీచెదనా నీ సేవనకే తగనా! బిడియమా అను వాక్యములు కళాపూర్ణోదయమునందలి సుగాత్రీశాలీనుల కథను తలపించుచున్నవి. పొందికగా పాదములొత్తిరమ్మనుట గానీమొదలగు వాక్యములతో పాటలోని విషయమే ఉన్నవి. బిడియమా అను పదము శాలీనుని స్పష్టపరచుచున్నది.

ఇందలి 12వ పాట కళావతి పాడిన రాగమాలిక ఈ పాటయందును పార్వతీ ప్రార్థనమే ముఖ్యము. అభయము నీవేగా శర్వాణీ త్రిభువన కల్యాణీ నాకిక అని పాట ఎత్తుగడ. పేదకు పెన్నిధివలె నీ సన్నిధి కొదవె దీపికవైచీకటిలో ఆపద బాపగా అరుదెంచినావ. కామేశ్వరీ నీ చెంత జేర కామితార్థములు చేకూరవే- తిరిపెము బ్రతుకా త్రిపురారి సదా- నీకరమంది పరమేశుడేలానాయె కరుణించవే- నిరాధారనే నాపై పరాకేలనే అని పరిపరి విధముల ప్రార్థన చేసినది. చీకటి నుండి వెలుతురులోనికి తన్ను చేర్చి తన బ్రతుకునకు దీపికగా పరిణమింపుమని కామేశ్వరిని ప్రార్థించిన భావమే అంతకు మునుపు పద్యమున కవి మాటిమాటికి చుక్కానిలేని చీకటిలోని పయనముతో పోల్చెను. మంత్రవాది, చిత్ర, సుధాకరుడు చిత్ర పాడిన పాటలును కలవు.

జెమినీవారి 1942 నాటి బాలనాగమ్మ చలనచిత్రమునకును బలిజేపల్లివారు మాటలు, పాటలు వ్రాయుటయేగాక అందు బాలనాగమ్మ తండ్రిగా నటించిరి. కాంచనమాల, పుష్పవల్లి, గోవింద సుబ్బారావు నటించిన ఈ చిత్రము ఆ సంవత్సరమే తీసిన శాంతబాలనాగమ్మ చిత్రమునకు పోటీగా నిలిచి, పలువురి ప్రశంసలనందుకొన్నది. దీనికి దర్శకుడు సి. పుల్లయ్య, నిర్మాత ఎస్. ఎస్. వాసన్. ఇందు బందా కనక లింగేశ్వరరావు గోవిందరాజుల సుబ్బారావుతో పాటు కమలా కోట్నీస్ బలిజేపల్లి బళ్ళారి లలిత మొదలైన వాళ్ళున్నారు. సంగీతం. రాజేశ్వరరావు. ఈ చిత్రంతోనే జెమినీవాళ్ళు తమ భారీ సెట్టింగులకు నాందీవాచకం పలికారు. 1942 నాటి బాలనాగమ్మ ప్రేక్షకులను ముగ్ధుల్ని చేసినంతగా మరే చిత్రమూ ఆకట్టుకోలేదని చెప్పవచ్చు. ఆరోజుల్లో ఈ చిత్రంలోని పాటలు కూడా మంచి

పేరొందాయి. (కె. యస్. టి. శాస్త్రి. ఆంధ్రజ్యోతి ఆదివారం అనుబంధం 23-10-88) జెమినీవారు నిర్మించిన ఈ బాలనాగమ్మ చిత్రానికి రచయిత బలిజేపల్లి లక్ష్మీకాంతం ఇటు కవిత్వపు విలువలు పడిపోకుండా చూసుకుంటూ అటు సర్వ జనామోదం ఉండాలని గ్రహించిన ఆనాటి సినీ తెలుగు రచయితల్లో చెప్పుకోదగ్గకవి. (ఆంధ్రజ్యోతి 17-3-1989 భ.రా.గో. ఏమిని పాడుదునో శీర్షిక)

శ్రీ జయజయగౌరీరమణా శివశంకర ప్రాచనాచరణా సోలము చేయలే సంతతి నీవేనత జనపరిపాలా అని భూలక్ష్మి పాడును. పిమ్మట కార్యవర్ధిరాజు

ఇది రక్షా విధి నీకు సేయవసరంబేకాని ఈగీటుదా
టెదు సుమ్మి! మనపానుగంటి పురకంఠేకాలుపైనాన చం
ద్రదినేంద్రాదుల ఆన- దిక్పతి వితానంబాన, నాప్రాణమా

**సదివారాత్రములాన ఈ నియమమున్ పాటించు చంద్రావవా!** అని తన సతీమణితో తెల్పిన ఆన మత్తేభవిక్రీడితమున ప్రస్ఫుటముగా ప్రకటితమైనది. ఇదిగో ఇదియని విడమరచి, నిష్కర్షగా నీవీ నియమమును పాటించి తీరుమని ఎంతో ప్రేమ పురస్సరముగా నివేదించిన సరణి యీపద్యమున గంభీరముగా మృదుమధురముగా ప్రతిపాదింపబడినది.

పిమ్మట ఏడుగురు పిల్లలు నాన్నా మేము ఢిల్లీ పోతాం- నగిషీ బొమ్మలు కొనుక్కువస్తాం- పిన్నికి మంచి చీరలు తెస్తాం. పంచరంగుల చిలుకలు తెస్తాం అని పాడుదురు. వారు కీలు గుర్రపు బండీ, గుర్రపు రౌతు పవుజులు తెచ్చుటయేకాక ఆటాడిస్తాం పేటాడిస్తాం కోట బురుజుపై దుమికిస్తాం- జమాను బండికి కమానుపోయి తమాషాలన్ని చూసే వస్తాం అని తమ ఆనందమును ప్రకటింతురు. ఈ జానపద చిత్రములో పిల్లలకు ఢిల్లీ యిష్టమైనట్లు పేర్కొనుటలో కవికి స్వరాజ్య సంప్రాప్తికి ముందే (1942) హస్తినాపురమైన ఢిల్లీపై అభిమానమున్నట్లు స్పష్టమగును. వసంత ఋతువును ఈకవి 5,6,7,8 పాటలలో వివరించెను. 7వ పాటలో చందమామరావె జాబిల్లిరావె వెన్నెల పాయసమీవే అని పేర్కొనెను. 8వ పాటలో పూలగాలి తేరు తేరుపైన మాధవుడూరేగగా ఎదురై స్వాగతమీయ వలెనన్న భావమువివరింపబడినది. 9వ పాటలో బాలవర్ధిరాజు మాతా నాతోడ పలుకవేమి నాయెడ నీ దయరాదు గదే- నాతల్లిని గనలేనా అని పార్వతిని ప్రాధేయపడెను.

అంబుధి నిషంగ దీనదయాంతరంగ- నీకు నర్ధాంగియౌ భవానీ సవిత్రి
దారి చూపించె చంద్రాయుధంబొసంగి- కడమపనియెల్లనీవంతు కష్టవార్ధి

**వేగదాటింపలేసనన్ను వృషతురంగ-** అను తేటగీతిలో బాల వర్ధిరాజు పరమశివుని ప్రార్థించును. 13వ పాటలో బాలనాగమ్మ తనయునిగతియేమో! అమ్మా అనిననినుపిలిచే ఆనందముగన్నానా- ఆటపాటలరసితినా ఎందున్నావో సుకుమారా! నినుగని ఎన్నో ఏళ్ళాయెనని కుమారునికై దినమొక యుగముగా ప్రతీక్షించు దైన్యస్థితి తెలుపబడినది.

ఈ చిత్రములో చాకలితిప్పడు పాత్రకు కవి ఒక చక్కని పాటను కూడ సమకూర్చినాడు. ఆడిలాంటోణ్ణి ఈడిలాంటోణ్ణనుకున్నావా ఈ తిప్పడంటే ఏమైనా తెలుసుకున్నావ అని తన బీరమును ప్రకటించును. అందుకతని భార్య పొయ్యిలోకి పుల్లలు లేవు. ఇంట్లోకి బత్తెంలేదు. మునిసేవు గుడ్డలన్ని మురిగిపోతున్నాయి. కరుణమయ్య గుడ్డలన్ని కాగిపోతున్నాయి పదపదరావేవుకి- అని పిలుచును. అప్పుడు తిప్పడు ఛీపో రాను తిప్పడంటే తిప్పడా కొండమీది అప్పడా...... ధీరుడు అల్లవీరుడు శూరుడు తిప్పడు- అని తన గొప్పలు చెప్పుకొనును.

ఇందలి 14వ పాట రాణి సంగుపాడినది. ఈపాట కామెడీపాటలా కనిపించినా చాలామంచిపాట. నా సాగసేకనని మరుడే దాసుడుగాడా- వాసవుడే మరుడే బానిసగాడా అన్నది తొలి చరణము. ఈ చరణములోని ఆత్మవిశ్వాసమునకు రెండవ చరణము వివరణ అదియిది.

పొందామరలీకనులే ఏలు జగాలు- అందాలొలికించు బలేమరుని శరాలు- బంగారపు తామరలవంటి చూపులు సింగారము తొలికించు మన్మధ బాణములతో రూపింపబడినవి. ఇక నడలనుగూర్చి ఒయ్యారములీనడలే ఆహా! వెయ్యి వరాలు రాయంచల చాలు అని తర్వాతి చరణము. పై తెలిపిన భావములన్నియు ప్రతి కావ్యములో స్త్రీ వర్ణన సందర్భమున ప్రకటితములగునవియే. కాని బలిజేపల్లి వారీ సందర్భమున అంత్యానుప్రాస మనోజ్ఞముగా కూర్చిన పదముల పొందిక వారి అద్వితీయ ప్రతిభను వెల్లడించుచున్నది. తుది రెండుపాదములలో అందాల గోరి వెతుకుషికారి- ఇందే నాదరికి జేరు ప్రేమ విహారి- ఇందే ఆనందసుధా- అని మాయల మరాఠికి తన అంద చందముల తీరు తెలిపినది. అందాల భామల పొందు గోరుటయే వాని లక్ష్యము. కావున వానిని షికారి ప్రేమవిహారి అని సంబోధించినది. గాండ్లసంగు తన ఒయ్యారము లొలికించి ఆటపాటలతో మైమరపింపఁజేసిన సరణికి అనువుగా రచన ఎంతో లలిత మధుర మృదుపదబంధములతో సాగినది. బలిజేపల్లివారి కవితా కళానిధిత్వమున కిదియొక మచ్చుతునక. మొట్టమొదట (శ్రీశ్రీ అనంతం. శ్రీశ్రీ సాహిత్య సర్వస్వం-2 పుట136 విరసంప్రచురణ ఆగష్టు-1986) సంస్కృత భూయిష్ఠమైన పాటలురాసే బలిజేపల్లి సముద్రాల (సీ) లాంటివారు విధిగా తమ బాణీ మార్చు కొనుటకు నల్లవాడే గొల్లపిల్లవాడే అన్న బసవరాజుగారి పాట చలన చిత్రములో బాగుగా ప్రసిద్ధిని పొందుటయే కారణమనుట యథార్థము.

ఇక 1939 లో వెలువడిన వరవిక్రయమును గూర్చి కొంత పరామర్శింతము. ఈస్టిండియా వారి నిర్మాణ సారధ్యములో సి. పుల్లయ్య దర్శకత్వము క్రింద వర విక్రయము విడుదలయైనది. కాళ్ళకూరి నారాయణరావిగారి ప్రసిద్ధ సాంఘికమైన వరవిక్రయ కథనే గ్రహించి (విజయచిత్ర డిశెంబరు-1988. శ్రీ సి.ఎస్ రావు విన్నవి కన్నవి సుకుమార్‌తో వివరించిన విషయం నుండి) కొన్ని చోట్ల సౌలభ్యం కోసం కొంత మార్చవలసి కొంత కూర్చవలసి వచ్చినది. అది బలిజేపల్లి లక్ష్మీకాంతంగారు చేశారు. పాటలూ రాశారు.. పద్యాలు నాటకంలోనే వాడారు. కాని బలిజేపల్లి వారు మాటలలో పాటలలో చూపిన ప్రతిభ అసామాన్యము. ఇక అందులో వారి నటన అంతర్భూతము. బలిజేపల్లి లక్ష్మీకాంతం గారు వరవిక్రయంలో (సినిమాలు-సాహిత్య విలువలు- జ్యోతిచిత్ర ఉగాది ప్రత్యేక సంచిక 1986 మోదుకూరి జాన్సన్ పుట 154) సామాజిక దౌష్ట్యాన్ని ఎదుర్కొన్నాడు. అప్పట్లో రచయిత కర్త కర్మ క్రియ ఆరో జుల్లో రచనచేయడం సాహసమే సంస్కరణే. ఆవిధంగా ఆచిత్రం కావ్యరూపమే.

వరవిక్రయంలో కాళింది (భానుమతి) (వనిత- అక్టోబరు 1988 భానుమతి చిత్రజీవిత స్వర్ణోత్సవ సంవత్సరం) పాడిన ఎంతో హాయిని కలిగించాయి. వరవిక్రయం పాటలు కట్నమిచ్చి కొంటేగానీ కన్నియలకు వరుడేరాడు కన్న వారికా కోతాకన్నె జన్మమేరోతా-స్వాతంత్ర్యమేలేదా అనునది. విశ్వనాథవారు చెలియలికట్ట ఇస్తూ మధుర విషాద కాళింది భానుమతికి ఆశీర్వచనాలతో అని ఇచ్చారు. వర విక్రయంలో కాళింది పాత్రకు ప్రసిద్ధి కలుగుటకు భానుమతిగారి నటన దానికి దోహదము కలిగించిన లక్ష్మీకాంతకవిగారి రచన కారణమని నా అభిప్రాయము. చలనచిత్ర రచయితగా లక్ష్మీకాంతకవిగారి ప్రతిభా వైభవములను గూర్చి మాత్రమే ఉట్టంకించుట జరిగినది. చలన చిత్రరంగ స్థలమునకు సంబంధించివారి అనుభవపరంపరలను మాటలు పాటలు కూర్చుటలో వారికిగల నే ర్పును ఒక ప్రత్యేక సిద్ధాంత వ్యాసముగా సమర్పింపవచ్చును. ఇక సూత్రప్రాయముగా వారి నటనా చాతుర్యమును పరిశీలింతము.

**2. నటుడుగా లక్ష్మీకాంతకవి:-**

బలిజేపల్లి లక్ష్మీకాంతకవి నటనకే తన జీవితమును అంకితముగావించెను. రసమయమైన వారి హృదయము నాటకరచనలో రచించిన దృశ్యముల నవశ్యము ప్రదర్శించి ప్రజా బాహుళ్యము నలరించుటలో నిమగ్నమైనది. విరామ మెఱుగక నిత్యము నాటక ప్రదర్శనలొనగి ఆర్థికముగా

వారెన్నో కష్టనష్టములకు గురియైన సందర్భములెన్నోయున్నవి. ఊరూర నాటక సమాజములేర్పడి ఎన్నో ప్రదర్శనలిచ్చుచుండినవి. తెలుగుసీమలో సాంస్కృతిక పునరుజ్జీవము దేవులపల్లి రామానుజరావు- శ్రీదేవి పబ్లికేషన్స్. బలిజేపల్లి లక్ష్మీకాంతము గొప్ప కవి సినిమా రచయితయేగాక ఉత్తమ నటుడు కూడా. వరవిక్రయం తాసీల్దారు వగైరా కొద్ది చిత్రాలలోనే యీయన నటించిన ఆరకంగా ఆ పాత్రలను మరొకరు నిర్వహించలేరు అని పేరు మోసినవాడు. (నేను నా సమకాలిన చలనచిత్రకళ పుట 210)

చిన్నప్పటి నుంచి కూడా నాటకాలలో అభినయించిన వ్యక్తి. ఇతను హరిశ్చంద్రలో నక్షత్రక పాత్రవేస్తే హరిప్రసాదరావుతో పాటు అభినయములోనీవా నేనా అన్నట్టు ఉండేది. ఇతను బహు నాటకాలను రచించినాడు. ఇప్పుడు సినిమారంగాల కెక్కిసినిమా నాటకాలు వ్రాసినాడు. వానిలో అభినయించినాడ అని సవ్యాంధ్రసాహిత్య వీధులలో పుట 100 బలిజేపల్లివారి నటన ప్రశంసింపబడినది.

నటనకు తోడు పద్యము పాడుటలో వీరు తనదైన ఒక ప్రత్యేక బాణీని ప్రదర్శించెడివాడు. శ్రీనివాస శిరోమణి మాటలలో చెప్పవలెనన్న ఆంధ్ర నాటక కళాపరిషత్తు రజతోత్సవ సంచిక 1960 పుట 90) తెలుగు పద్యం పాడడంలో నలుగురు మార్గదర్శకులు. ఒకరు కందాడై శ్రీనివాసన్ గారు ఆయన్ను దొరస్వామి అంటారు. రెండవవాడు హరిప్రసాదరావు. సంగీతనైపుణ్యం అంతా పద్యంలోనే యిమిడేది. పద్యం అయిందంటే పాట అయిపోయేది. మూడవవాడు బలిజేపల్లి లక్ష్మీకాంతం. పద్యంలోనే ఎక్కడ ఏమాటను ఎట్లా అనాలో అట్లా అనడం వారి విశేషం. నాలగవవాడు బందరు డి.వి.సుబ్బారావు. పద్యం పాడుతుంటే పదబంధం ఎక్కడికక్కడికి వినపడేది. అర్థ స్ఫూర్తి అందరికీ కలిగేది. గంభీరంగా ఉండేది. శ్రావ్యంగా ఉండేది.

గుంటూరు ఫస్టు కంపెనీకి పాతూరు శ్రీనివాసులు సెక్రటరీగా ఉండినరోజులలో లష్టర్లు అను కిరసనాయిలు దీపాలుండెడివి. బొంబాయి నుండి ఇంటికని తెచ్చిన వీనిని వారు నాటకాలకు వాడుచుండిరట. హరిప్రసాదరావు బలిజేపల్లి లక్ష్మీకాంతం పత్రి శ్రీనివాసరావు మొదలైన మహానటులకు తర్ఫీదు ఇచ్చి నాటకాలు వేయించేవారట అని ఆనాటి నాటకాలు వాటి ప్రభావం అను గ్రంథములలో (పుట 177) పోతూరి శ్రీరామ శాస్త్రి ఉట్టంకించిరి. ఇందు వీరు బలిజేపల్లివారిని మహానటులుగా పేర్కొనుట గమనార్హము.

బాల్యము నుండియునట నాభిలాషగల బలిజేపల్లి వారెన్నో నాటకములలో విభిన్న భూమికలను దాల్చుచుండిరి. అట్టివానిలో బాహుకుడు, హరిశ్చంద్రుడు, రాజనరేంద్రుడు, కృష్ణుడు, నక్షత్రకుడు మొదలగునవి ప్రసిద్ధములు. సంగీత నిధియైన వీరిని గాంధర్వ వేత్తగా కొందరు పరిగణించిరి. వీరు (తెలుగునాటక వికాసము డా॥పోణంగి శ్రీరామ అప్పారావు పుట 310) ఒకే రాగమును రాత్రి తెల్లవారు వరకును అలపులేకుండ ఆలాపింపగల సమర్థులు. రంగస్థలముమీద కన్నడ శహనబేగడ ఆనందభైరవి మొదలగు రాగములను వ్యాప్తికి తెచ్చిన వారు వీరే. వీరు ప్రముఖ పాత్ర లెన్నియో ధరించి ప్రజలను రంజింపజేసిరి. కాని అన్నింటికంటెవీరికి నక్షత్రక పాత్రపై మక్కువ యెక్కువ. ఈ సందర్భమున వీరి నక్షత్రక పాత్ర నటనా చాతుర్యమును గూర్చి మిక్కిలినేని రాధాకృష్ణమూర్తిగారు నటరత్నాలు లో నేమిపేర్కొనిరో వారి మాటలలోనే పరిశీలింతము. నక్షత్రక పాత్రలో హరిశ్చంద్రుని కష్టాలపాలు చేసి ఏవిధంగానైనా ఆయనచేత అబద్ధమాడించాలని ఆకలి ఆకలి అని ఆక్రందన చేసేవాడు. నడవలేక చస్తున్నానని కూలబడేవాడు అడవిలో నడుస్తు నడుస్తు అదిగో పులి ఇదిగో పులి అని గగ్గోలు పెట్టేవాడు. అర్థరాత్రి నిద్రలో కల్లింతగాలేచి అమ్మో నన్ను దయ్యాలు భూతాలుల పీడిస్తున్నాయని పిచ్చి కేకలు వేసేవాడు. హరిశ్చంద్రా! ఎందుకు నన్నిలా ఏడిపించడం. ఆ అప్పుతీర్చలేనని చెప్పు నేను వెళ్ళిపోతాను అంటూ చీటికిమాటికి చిరబురలాడుతూ హరిశ్చంద్రుణ్ణీ చంద్రమతినీ అడుగడుగునా హింసిస్తూ వాళ్ళను ఇక్కట్ల పాలు చేస్తూ గురువుగారి

పంతం నెగ్గించాలని నక్షత్రకుడు పడే పాట్లను బలిజేపల్లి కళ్ళకు కట్టినట్టునటించేవారు. ఆయన నక్షత్రక పాత్రముందు నాటి నక్షత్రక పాత్రధారులందరూ తలవంచేవారు. అంతటి నటుడు బలిజేపల్లి. ఈ విధంగా నాటి నాటకాల్లో ప్రతి పాత్రనూ పాత్రోచిత నటనతో హృద్యంగా అభినయించేవారు.

బలిజేపల్లివారినటన సహజముగా, యథార్థముగా నుండవలెనన్న దృక్పథము గలవారు. చలన చిత్ర రంగములో కూడ వీరీ నాటికి నటనా పద్ధతినే పాటించెడివారని ప్రసిద్ధి. వరవిక్రయము 1939 చలన చిత్రమునకు ముఖ్యపాత్రలలో కొన్నింటికి నటులు నిర్ణయమైనారు. బలిజేపల్లి లక్ష్మీకాంతంగారు రచయిత అయినా రంగస్థలం మీద నటులు. ఆ కథలోని ముఖ్య పాత్ర సింగరాజు లింగరాజు అనేలుబ్ధుని పాత్ర ధరించుటకు సమ్మతించిరి. వర విక్రయం నిర్మాణం కలకత్తాకి తరలించబడింది. పుల్లయ్యగారు దర్శకులు. శ్రీ సి. యస్. రావు షూటింగు చూచుటకు పోయి బలిజేపల్లిగారి సహజ నటన నచ్చుట సందర్శించిరట. లింగరాజు గారింట్లో దొంగపడగా ఆయన ఇనుప్పెట్టెను కావలించుకొని కూచుంటాడు. దొంగ దగ్గరకు రాగానే ఒక తన్ను తన్నాడు. షాట్‌లో తన్నాడు చూడండి ఆదెబ్బకు ఆ దొంగ ప్లాట్ గుడ్డని చింపుకుంటూ బయటపడ్డాడు. నటన అంటే అంత సహజంగా వుండకూడదని వుంటే అంత ప్రమాదం అనీ తెలీదు పాపం. అప్పుడు పుల్లయ్యగారు సముదాయించి పాత్రలో పూర్తిగా లీనం కాకూడదని పాఠం చెప్పారు. ఈ సన్నివేశమును తన చిన్న తనములో స్వయముగా చూచిన శ్రీ సి. యస్. రావు సుకుమార్ ఇంటర్వ్యూ జరిపినపుడు వివరించిరి. నటుడుగా బలిజేపల్లివారు నెఱపు సహజ ధోరణికిదియొక నిదర్శనము.

వీరు వివిధ నాటక సమాజముల వారాహ్వానించి వారొసగిన పాత్రలను నటించుచుండిరి. అబ్బూరి వారు నటాలి సంస్థను ప్రారంభించి మదరాసులోనున్నప్పుడు బలిజేపల్లి లక్ష్మీకాంతము గారుకూడ సినిమాలలో నటించుటకు అచ్చ ఎకు విచ్చేసిరి. (కవన కుతూహలమ్ అబ్బూరి వదరరాజేశ్వరరావు ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక 11-3-1987) ఆయనకి సినిమాల్లో కన్నా నాటకాల్లో వెయ్యాలలని కుతూహలంగా ఉండేది. మా నాన్నగారు నాటక సంస్థను నెలకొల్పారని తెలియగానే మా యింటికొచ్చారు. తీరిక చిక్కినప్పుడల్లా మా నాటకాల్లో వేషం వేస్తానన్నాడు. అప్పుడు మా నాన్న గారు కన్యాశుల్కం మదరాసులో ప్రదర్శించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అందులో అగ్నిహోత్రావధాన్లు పాత్రను లక్ష్మీకాంతంగారికిచ్చారు. ఆసందర్భంగా రోజూ సాయంకాలం పూట పితాపుర నగరంలో మా యింట్లో కలుసుకునేవాళ్ళం. రిహార్సల్సుకాగానే ఆయన్ని బస్సుదాకా దించివచ్చే వాళ్ళము. అని అబ్బూరి వరద రాజేశ్వరరావుగారు కవన కుతూహలంలో బలిజేపల్లి వారి నటనాభిలాషను గూర్చి ముచ్చటించిరి.

మధురవాణి పాత్ర ఎన్నికకై రాజమండ్రికి బయలుదేరి అందొక సబ్ ఇన్స్పెక్టరు పోషణలో ఉన్న అమ్మాయిని చూచుటకు బలిజేపల్లి వారితో వరదరాజేశ్వరరావుగారు ఒక జట్కాలో పయనించిరి. జట్కావాడు తిరమైసంపదలెల్ల అన్న పద్యమును ఆ సుబ్బారావు ఏమి పాడాడండీ హాలంతా కళ్ళనీళ్ళే అని తన రాగసరణిలో పాడిన సంఘటన తుదకు ఇన్స్పెక్టరు గారి యింటికిపోయి బ్రహ్మచెముడున్న ఆమెను చూచిస్టేషనులో అశువుగా (కవన కుతూహలమ్ అబ్బూరి వదరరాజేశ్వరరావు ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక 11-3-1987)

**మధురవాణి కాదిది మరి బధిరవాణి కాదు కృతికి దగ్గకాంత యిద్ధి**
**రంగతలమనంగ రంగస్థలముకాదు మరితిరోగమనమె మనకు దిక్కు**

అని మందహాసములో తెలిపిరట. హాస్యకుశలత, నటనావైదగ్ధ్యముగల బలిజేపల్లివారు వివిధ భూమికలనెంత సహజముగా ప్రదర్శించిరో ఒక్కొక్క ఘట్టమును వివరింపబూనుటకిది యదనుకాదు. నటుడుగా బలిజేపల్లి వారు చూపిన ప్రతిభ అప్రతిమానము.

## ఉపసంహారము

కవితా కళానిధియైన బలిజేపల్లి లక్ష్మీకాంతముగారు సత్యహరిశ్చంద్రీయ నాటకకర్తగా చిరస్థిరలబ్ధ కీర్తి ప్రతిష్ఠులు. వీరు సంగీత సాహిత్య మర్మముల నెఱిగి గాంధర్వ వేత్తయై ఊరూరనాటక ప్రదర్శనలొసగి కవితాగానముగావించిరి. నాటక కళకే తన జీవితసర్వస్వము వినియోగించిరి. ప్రతిభా సంస్థలో ప్రవేశించి చలనచిత్రములకు మాటలు-పాటలు వ్రాసి ప్రతిభా పాటవమును ప్రదర్శించిరి. గుంటూరు వస్తు కంపెనీలో మొదట ముఖ్య సభ్యులుగా ఉండి వారి అభ్యర్థన మేరకు బుద్ధిమతీ విలాసము, ఉత్తరరాఘవము, సాత్రాజితీయము, సత్యహరిశ్చంద్రీయము రచించి, వానిని స్వయముగా ప్రదర్శించిరి. వస్తు కంపెనీ తుట్టతుదిలో పతనావస్థకు దిగజారునపుడు తానే సర్వవిధములదానికిఅండ దండగా నిలచి పునరుద్ధరించిరి. చంద్రికాముద్రణాలయమును నెలకొల్పి అందు అనేక గ్రంధములను ముద్రించిరి. నిరంతరము నాటక ప్రదర్శనలలో నిమగ్నులై కొన్ని లక్షలు ఋణము చేసి తనకున్న ఆస్తిని ఏదో ఒకవిధముగ నిలుపుకొనుటకై ప్రయత్నించి అప్పుడనుకొన్న ఒక న్యాయవాదికి తన ఆస్తి సమస్తము వ్రాసి యిచ్చి తుట్టతుదకు మోసముచేయగా వట్టిచేతులతో బికారియై, మనోవికారియై, దారితెన్ను తెలియక కాళహస్తి చేరి అచ్చట పానగల్లు రాజవారి ఆశ్రయముతో కొంత కుదురుకొనగలిగిరి.

నాటక ప్రదర్శనలే మన జీవితధ్యేయముగా భావించి వీరూరూర తిరిగిరి. వీరి కవితా విశిష్టతను గుర్తించి అందందు వీరికి సన్మానములును జరిగినవి. 1942 ప్రాంతములో వీరు మదనపల్లెలో కొంత కాలముండిరి. అప్పుడచ్చట తెలుగు పండితులు శ్రీ దర్భా వెంకటకృష్ణమూర్తిగారు దివ్యజ్ఞానకళాశాలకు వీరిని పిలిపించి పద్య రత్నములతో పుంభావ సరస్వతి బిరుదపాత్రుడవో కవితా కళానిధి! అనిసన్మా నించిరి. ఆ సందర్భముననే తాను అనువదించిన సుందరకాండ శేషమును పూరించుటకు మేడవరము రామబ్రహ్మశాస్త్రిగారి పరిచయమును కూడ పొందిరి. వీరనేక సందర్భములలో కేవల నాటక ప్రదర్శ నలనేగాక ఎంతో మనోహరముగా సాహిత్యోపన్యాసములిచ్చి పండితపామరులనాకర్షించిరి. మదన పల్లెలో సన్మానము జరిగినప్పుడు వీ(తెలుగుభాషమాధుర్యమునుగూర్చి చాలా మధురముగా మాటాడిరి. నాయాభై సంవత్సరముల జ్ఞాపకాలు (1929-1979) లో దేవులపల్లి రామానుజరావుగారు కూడ (వారు సికిందరాబాదులో చదువుచున్నప్పుడు) తాను బలిజేపల్లివారి సత్యహరిశ్చంద్రీయ నాటకమును స్వయముగా (1935-36) చూచితినని, వారి పద్య పఠనము మనోరంజకముగా ఉండేది అని ఆయన ఒకటి రెండు సాహిత్యసభలలో ప్రసంగించినట్లు నాకు జ్ఞాపకం అని తెలిపిరి.

వీరు ఉయ్యూరు సంస్థాన కవీశ్వరులుగా కొంతకాలం పనిచేసిరి. అప్పుడప్పుడు వీరు కాళహస్తి నివాసిగా ఉన్నప్పుడు గద్వాల సంస్థానములో జరుగుకాల్యకలాగోష్ఠి కార్యక్రమములో పాల్గొనుచుండిరి. గద్వాలసంస్థానములో ప్రప్రథమముగా వీరిని విద్వాన్‌విశ్వంగారు దర్శించినట్లు వారినాకథలోపేర్కొనిరి. సాహిత్యవేత్తలు, ప్రముఖనటులునైన పలువురితో బలిజేపల్లివారికి సన్నిహిత సంబంధముండెడిది.

కేవలము నాటకరచయితగనేగాక బలిజేపల్లివారు దేశభక్తి రచనలు అనేక ఖండకృతులు ( చించిరి. మహాత్మునివంటి మహనీయులపై స్వాగత పద్యములు రచించిరి. దేశభక్తకొండా వెంకట ప్పయ్య. ఆంధ్రరత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్య మొదలగువారిని గూర్చి వీరు రచించినపద్యములుమహా ప్రౌఢములు రసనిర్భరములు. ఇకవీరి అనువాదములలో శివానందలహరి, సుందరకాండ, ఉత్తర రాఘవము ఎన్నదగినవి. సాహిత్యవేత్త, గాంధర్వవేత్త, నటుడునైన బలిజేపల్లివారి వ్యక్తిత్వమునుగూర్చి చర్చించుటకు ఇంకను తెలుసుకొనదగిన అంశములెన్నో ఉన్నవి. కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ, కవిచక్రవర్తి జాషువా అబ్బూరి, పద్మశ్రీ భానుమతి మొదలగువారితో వీరికిగలపరిచయము వీరు తమ కవితా సౌరభముతో ఆకర్షించిన రసికజన బంభరముల ప్రసక్తివీరి ప్రశస్తిని చాటుచున్నవి.

ఆధునికాంధ్ర వాఙ్మయ జగత్తులో చిరస్మరణీయుడైన బలిజేపల్లివారిని కేవలము సత్యహరిశ్చంద్రీయనాటక కర్తగా మాత్రమే గౌరవించి, వీరి యితర కృతులలోగల విశేషములను, వీరి వ్యక్తిత్వసాహిత్యములలోగల విశిష్టతను మరచి నిద్రావస్థలో కూరుకొనిపోయిన ఆంధ్రులకు నాపరిశోధనాంశము ఒకవిధమగుమేలుకొలుపుగా పరిణమింపగలదని నాఅభిమతము. బలిజేపల్లి వంటి మహాకవిని విస్మరించిన ఆంధ్రులుక్షంతవ్యులుకారని, యికనైన ముందు తరములవారు తమ ఉత్తరోత్తరాభివృద్ధికి పూర్వాపూర్వసంస్మరణము ఆలంబనముగా బావించి అంతర్ముఖ దృష్టితో సింహావలోకనము సాగించి తరింతురుగాక! బలిజేపల్లివారిరచనలలో గల ఆత్మ సౌందర్యమునవలోకించి, సర్వసమగ్రపరిశీలనకు ప్రతిరసహృదయుడైన సహృదయుడు పూనుకొనుగాక అను ఆశంసతో ప్రస్తుతమునకు నాపరిశోధనాంశమును విరమించుచున్నాను.

## అనుబంధము - ఉపయుక్త గ్రంథసూచి

1. అంకయ్య డా..వి. - ఆంధ్ర కవిత్వము - గాంధీతత్త్వము - ప్రథమ ముద్రణ 1980.
2. అప్పల స్వామి పురిపండా - విశాఖ పట్నంలో నాటకరంగం.
3. అప్పారావు ఎం. ఆర్ - ఆంధ్ర నాటక పరిణామం
4. ఆచార్య డా..డి.వి.వి.- ఆంధ్రలో నాటక రంగం- ప్రథమ ముద్రణ డిసెంబరు 1965- ఆదర్శ గ్రంథమండలి, విజయవాడ - 2.
5. ఆంజనేయశాస్త్రి.శిష్ట్లా -నేనూనా సమకాలీన భారతీయచిత్రకళ - ప్రథమ ముద్రణమే 1975.
6. ఆదిశేషయ్య - వేపకొమ్మ - కురంగీకిరాతము - ప్రభాత ముద్రణాలయము - నెల్లూరు.
7. గంగప్ప. డా..ఎస్. - ప్రసంగసాహితి ( రేడియో ప్రసంగాలు) తెలుగు నాడు ప్రచురణలు, జాంబాగ్ హైదరాబాదు.
8. గురవయ్య . డా..మల్లేల. - బలిజేపల్లి అనూదిత రచనలు - తులనాత్మక సౌందర్యము. అముద్రితము.
9. గురవయ్య . డా..మల్లేల. - బలిజేపల్లి లక్ష్మీకాంతం కవి - రూపక వాఙ్మయ పరామర్శ - అముద్రితము.
10. గురవయ్య . డా..మల్లేల. - బలిజేపల్లి ధార్మిక దృష్టి - సత్యహరిశ్చంద్రీయ సృష్టి అముద్రితము
11. గురవయ్య . డా..మల్లేల. - కవితా కళానిధి - బలిజేపల్లి - బలిజేపల్లి కావ్యరసానందవల్లి అముద్రితము
12. గురవయ్య . డా..మల్లేల. - అవతారికావలోకనము ( అముద్రితము)
13. గురవయ్య . డా..మల్లేల.- రామాయణ విశిష్టత ( అముద్రితము)
14. గోపాల కృష్ణ శర్మ డా.. మల్లాది - శ్రీమద్రామాయణవైభవము.
15. గోపాల కృష్ణారావు డా..కె. - ఆంధ్రశతక సాహిత్య వికాసము. అనువాదశతకములు 776-777
16. జాషువా. గుర్రం - నాకథ ( ద్వితీయ భాగము)
17. జాషువా. గుర్రం. - ముంతాజ్ మహలు.
18. తిరుపతి వేంకటేశ్వరులు. - శతావధానసారము - అనుబంధము
19. నరసింహారావు స్థానం. - ఆంధ్ర నాటక రంగము.
20. నాగేంద్రుడు-కారెంపూడి-ఆంధ్రరత్న శ్రీదుగ్గిరాల గోపాల కృష్ణయ్య-జీవిత చరిత్ర ముద్రణ-1976, బహూత్తమపబ్లికేషన్స్-చీరాల పేరాల.
21. నారాయణ రెడ్డి. డా..సి. - ఆధునిక కవిత్వము - సంప్రదాయములు - ప్రయోగములు.
22. నార్ల - నరకంలో హరిశ్చంద్రుడు - పీఠిక.
23. ప్రసాదరావు. ఏలూరి - సత్యహరిశ్చంద్రీయ నాటకము - ఒక సమీక్ష ( అముద్రితము)
24. ప్రసాద్.చలసాని-శ్రీశ్రీఅనంతంశ్రీశ్రీసాహిత్యసర్వస్వం-వి.ర.సం. ప్రచురణ ఆగష్టు-1986.
25. పాపరాజ కంకంటి - ఉత్తరరామాయణము - వావిళ్ళ రామశాస్త్రి అండ్ సన్స్. మద్రాసు.
26. పోతన - శ్రీమదాంధ్ర మహా భాగవతము - దశమస్కంధము - వావిళ్ల ప్రచురణ
27. భవభూతి - ఉత్తర రామచరిత్ర - వావిళ్ళ రామశాస్త్రి అండ్ సన్స్ - మద్రాసు.
28. మహతీ శంకర్. డా.. జంధ్యాల - వేలూరు శివరామశాస్త్రి - అవధాన భారతి - ప్రథమ ముద్రణ - 1981.
29. యజ్ఞనారాయణ. పసుపర్తి - ఆంధ్రనట ప్రకాశిక ( సచిత్రము) బందరు రామా ఆర్ట్సు ప్రెస్ వి,కె. మూర్తి గారిచే ముద్రింపబడినది. మొదటి కూర్పు - 1930.
30. రమాపతి రావు డా.. అక్కిరాజు - వీరేశలింగం పంతులు - సమగ్ర పరిశీలన - ప్రథమ ముద్రణ - 1972 జూన్, శివాజీ ప్రెస్, గంజ్‌బజారు, సికింద్రాబాద్.
31. రామకృష్ణ శాస్త్రి. శిష్ట్లా - ఆంధ్ర నాటక కళ - మద్రాసు - విశ్వకళా పరిషత్తు.
32. రామిరెడ్డి - దువ్వూరి - కవి కోకిల గ్రంథావళి సారస్వత వ్యాసములు - 4. ప్రభాత ముద్రణాలయం - నెల్లూరు.

33. రామానుజరావు. దేవులపల్లి - యాభైసంవత్సరాల జ్ఞాపకాలు (1929 నుండి 1979 వరకు)
34. రాధాకృష్ణమూర్తి- మిక్కిలినేని- ఆంధ్ర నాటక రంగచరిత్ర - తెలుగు నాటక సాహిత్య సమీక్ష.
36. రాఘవశర్మ, గురజాడ - జాతీయ గీతాలు - ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమి - కళాభవన్, సైఫాబాదు హైద్రాబాదు - 4.
37. లక్ష్మీకాంతకవి. బలిజేపల్లి - బుద్ధిమతీ విలాసము. ప్ర.ముద్రణ- 1905 సరస్వతి బుక్ డిపో, రాజమండ్రి.
38. లక్ష్మీకాంతకవి బలిజేపల్లి - సత్యహరిశ్చంద్రీయము - ముద్రణ - 1912 కొండపల్లి వీరవెంకయ్య అండ్‌సన్స్.
39. లక్ష్మీకాంతకవి బలిజేపల్లి - సాత్రాజితీయము - ముద్రణ 1912 కొండపల్లి వీరవెంకయ్య అండ్‌సన్స్.
40. లక్ష్మీకాంతకవి బలిజేపల్లి - ఉత్తరరాఘవము - ముద్రణ1923 సరస్వతి బుక్ డిపో - రాజమండ్రి.
41. లక్ష్మీకాంతకవి. బలిజేపల్లిస్వరాజ్య సమస్య - చంద్రికాముద్రణశాల - గుంటూరు.
42. లక్ష్మీకాంతకవి. బలిజేపల్లి - శివానందలహరి - గుంటూరు.
43. లక్ష్మీకాంతకవి. బలిజేపల్లి - పాలయులుక - భారతి 1931, ఆగష్టు.
44. లక్ష్మీకాంతకవి. బలిజేపల్లి - ఆత్మబలి - కృష్ణాపత్రిక - 1936 ఏప్రిల్ పుట 25.
45. లక్ష్మీకాంతకవి. బలిజేపల్లి - సత్యనారాయణ స్వామి - భారతి ఆగష్టు ౧౯౨౫ సం..౨.
46. వరదరాజేశ్వరరావు. అబ్బూరి కవనకుతూహలం - ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక - 11-3-1987.
47. వాల్మీకి - వాల్మీకి రామాయణము (సుందరకాండ)వావిళ్ళరామస్వామిశాస్త్రి అండ్‌సన్స్. మద్రాసు.
48. విశ్వం విద్వాన్ - నాకథ ఆదివారం అనుబంధం ఆంధ్రజ్యోతి నవంబరు 1987.
49. వీరయ్య. దరువూరి గుంటూరు మండల సర్వస్వము (రివైజ్‌డ్ ఎడిషన్) యువకర్షక ప్రచురణలు - 1964.
50. వీరభద్రరావు. మాదల. దేశభక్త జీవిత చరిత్ర - ప్రథమముద్రణ అక్టోబరు 1966.
51. వెంకటసుబ్బయ్య గొర్రెపాటి - తెలుగు సాహిత్యంతీరు తెన్నులు ప్రసాద్ పబ్లికేషన్స్ ఏలూరు.
52. వెంకట రమనరసింహం కాకర్ల - ఆధునికాంధ్ర కవితా సమీక్ష - గంగాధర పబ్లికేషన్స్ - విజయవాడ - 2.
53. వేంకటకృష్ణమూర్తి దర్భా - సన్మాన పద్యములు, బిసెంటు దివ్యజ్ఞాన కళాశాల. మదనపల్లె.
54. వెంకట్రావు కురుమెళ్ళ - మా పిఠాపురం. ప్రథమముద్రణ 1978.
55. వెంకటావధాని డా.. దివాకర్ల - ఆంధ్రకవులు - దేశ స్వాతంత్ర్యము.
56. వెంకట రమణ ముళ్ళపూడి - కథానాయకుడు.
57. శంకరాచార్యులు - శివానందలహరి వావిళ్ళ రామస్వామి శాస్త్రి అండ్ సన్స్. మద్రాసు.
58. శంకరాచార్యులు - సౌంధర్యలహరి - వావిళ్ళ రామస్వామి శాస్త్రి అండ్ సన్స్ - మద్రాసు.
59. శివప్రసాద్. ముదిగొండ - తెలుగులో దేశభక్తి కవిత్వం - సాందీపని, నవంబరు -1971.
60. శ్రీరామ అప్పారావు డా..పోణంగి - తెలుగు నాటక వికాసము - నాట్య మాలా ప్రచురణలు. ప్రథమముద్రణ డిసెంబర్ 23, 1967.
61. శ్రీరామ శాస్త్రి పోతూరి - ఆనాటి నాటకాలు - వాటి ప్రభావం పుట 177.
62. శ్రీనాథుడు - హరవిలాసము - వావిళ్ళ రామస్వామి శాస్త్రి అండ్‌సన్స్ - మద్రాసు.
63. శ్రీనివాస చక్రవర్తి - తెలుగు నాటక సమీక్ష - జయంతి పబ్లికేషన్స్.
64. శ్రీనివాస చక్రవర్తి - ఆంధ్ర నాటక దర్శిని (1860 - 1962) జయంతి పబ్లికేషన్స్.
65. శ్రీనివాస శిరోమణి - ఆంధ్రనాటక కళా పరిషత్తు రజతోత్సవ సంచిక - 1960.
66. సత్యనారాయణ శాస్త్రి మధునాపంతుల - ఆంధ్ర రచయితలు - ప్రథమ భాగము ప్రథమముద్రణ -1950.

67. సరస్వతి. చేబ్రోలు - సరస్వతీ రామాయణము - స్నేహలతా కవితా సంఘము. కొల్లాపురం. - మురవకొండ (పో) కర్నూలు.

68. సాయికుమార్. ఎ. ఎడిటర్ - పబ్లిషర్ - సరదా బడి సచిత్రవిజ్ఞాన మాసపత్రిక - ప్రారంభసంచిక అక్టోబరు - 1988.

69. సీతారామయ్య కురుగంటి- నవ్యాంధ్రసాహిత్యవీధులు కొన్ని నాటకములు- శీర్షిక పుట 100

70. సుబ్బారెడ్డి డా.. మద్దూరి - తెలుగులో జాతీయోద్యమప్రభావం.

71. సుబ్రహ్మణ్యం డా. జి.వి. తెలుగునాటక రంగం - కళావని హైద్రాబాదు - ప్రచురణ.

72. సోమనాథుడు - పాల్కురికి - బసవపురాణము వావిళ్ళ రామస్వామి శాస్త్రి అండ్ సన్స్ మద్రాసు.

73. హరిశివకుమార్ డా.- గద్వాల సంస్థానము- సాహిత్యసేవ- కాకతీయ ప్రచురణలు - ఓరుగల్లు.

74. హేమలతాలవణం మా నాన్నగారు. పుట 62.

75. లక్ష్మీకాంతకవి - బలిజేపల్లి రామబ్రహ్మశాస్త్రి మేడవరము- సుందరకాండము - ప్రథమముద్రణ డిసెంబరు 1981. శ్రీ మాధవి ఆర్ట్స్ప్రింటర్స్ - కుత్బిగుడ- హైద్రాబాదు - 27.

76. శివానంద సరస్వతీ మహరాజ్- హిందూ ధర్మ సర్వస్వము - అనువాదం- పి. నాగభూషణం, పరిష్కర్త డా॥ మల్లెలగురవయ్య.

77. ఆంధ్ర నాటక సంస్కరణలు - పావనీ ముద్రాక్షరశాల - కోట్లిపేట, బందరు - 1925.

78. గుంటూరు సీమ పూర్వరంగము పుటలు 37,38,46 .

79. విజ్ఞాన సర్వస్వము 4. తెలుగుసంస్కృతి తెలుగు భాషాసమితి - మద్రాసు.

80. కళాపూర్ణోదయము పింగళి సూరన వావిళ్ల రామస్వామి శాస్త్రి అండ్ సన్స్. మద్రాసు.

**పత్రికలు**

81. ఆంధ్రపత్రిక - బుధవారం - జూలై 8.1953.

82. ఆంధ్ర పత్రిక - జూలై 11.1953.

83. ఆంధ్రజ్యోతి ఏమని పాడుదునో శీర్షిక భ. రా. గో. బాలనాగమ్మ చిత్రంలో సంగుపాట.

84. విజయచిత్ర డిసెంబరు 1988. శ్రీ పి.ఎస్. రావు విన్నవి కన్నవి. ఇంటర్వ్యూ.

85. జ్యోతి చిత్ర ప్రత్యేక ఉగాది సంచిక - 1986 సినిమాలు, సాహిత్యపు విలువలు మోదుకూరి జాన్సన్ పుట 154.

86. వనిత అక్టోబరు 1988. భానుమతి చిత్ర జీవిత స్వర్ణోత్సవ సంవత్సరం.

87. భారతి నవంబరు ౧౯౨౮ ఆంధ్రనాటక రంగం.

88. భారతి ఆగష్టు ౧౯౨ [illegible] సత్యనారాయణస్వామి.

89. భారతి ఆగష్టు 1931. పాలయులుక.

90. కృష్ణాపత్రిక. 1936 ఏప్రిల్ ఆత్మబలి.

91. భారతి 1972. ఆంధ్ర కేసరి ప్రకాశం. శతజయంతి సంచిక.

**సినిమా పాటలు – పద్యములు.**

1. శ్రీలక్ష్మమ్మ కథ 2. అపూర్వసహోదరులు 3. రక్షరేఖ 4. బాలనాగమ్మ.

**పీఠికలు**

1. శివానందలహరి - పీఠిక (5-7-1930) 2. ఉత్తరరాఘవము పీఠిక (10-7-1930)

3. శ్రీకృష్ణలీలాస్తవము - పీఠిక (5-5-1951)

4. సరస్వతీ రామాయణము - పీఠిక (1923) 5. కురంగీకిరాతము పీఠిక.

**జీవిత చరిత్రలు**

1. నటస్థానం 2. కథానాయకుడు కథ 3. నాకథ (జాషువ) 4. నా కథ (విద్వాన్ విశ్వం) 5. మా నాన్నగారు. (హేమలతాలవణం)

## ఉపయుక్త గ్రంథ సూచిక - వ్యాస రచన

### ద్వితీయ పరిచ్ఛేదము

1.2. కవి కోకిల గ్రంథావళి దువ్వూరి రామిరెడ్డి, ప్రభాత ముద్రణాలయము-నెల్లూరు

3.4. కవి కోకిల గ్రంథావళి దువ్వూరి రామిరెడ్డి, ప్రభాత ముద్రణాలయము-నెల్లూరు

5.6. డా.. కె. గోపాలకృష్ణ రావు. ఆంధ్ర శతక సాహిత్య వికాసము. పుట 776,777

### తృతీయ పరిచ్ఛేదము

1.2. శివానందలహరి - రెండవకూర్పుశీర్షిక - బలిజేపల్లి లక్ష్మీకాంతకవి

3. బలిజేపల్లి లక్ష్మీకాంతకవి - అనూదిత రచనలు - తులనాత్మక సౌందర్యము - డా..మల్లెల గురవయ్య.

4.5. బలిజేపల్లి లక్ష్మీకాంతకవి - అనూదిత రచనలు - తులనాత్మక సౌందర్యము - డా..మల్లెల గురవయ్య.

6. శబ్దార్థ చంద్రిక - పుట 86, వావిళ్ళ ప్రచురణ - 1969.

7.8.9.10.11.12.13. బలిజేపల్లి లక్ష్మీకాంతకవి - అనూదిత రచనలు - తులనాత్మక సౌందర్యము - డా..మల్లెల గురవయ్య.

### సుందరకాండము

1. శ్రీమత్ రామాయణ వైభవము- డా.. మల్లాది గోపాలకృష్ణ శర్మ

2. రామాయణ విశిష్టత - డా.. మల్లెల గురవయ్య.

3. బలిజేపల్లి అనూదితరచనలు-తులనాత్మక సౌందర్యము- డా..మల్లెల గురవయ్య.

4. రామాయణ విశిష్టత - డా.. మల్లెల గురవయ్య.

5.6.7.8.9.10.11.12.13.14.15.16.17.18.19. బలిజేపల్లి- అనూదిత రచనలు- తులనాత్మక సౌందర్యము- డా..మల్లెల గురవయ్య.

• శ్రీమదాంధ్ర రామాయణము వచన కావ్యము శ్రీ పరవస్తుల సుబ్బరామశాస్త్రి గారు. వావిళ్ళ రామశాస్త్రులు అండ్ సన్స్. సుందరకాండము పేజి 81.

20. బలిజేపల్లి అనూదితరచనలు- తులనాత్మక సౌందర్యము- డా..మల్లేల గురవయ్య.

* శ్రీ మదాంధ్ర వచన రామాయణము - సుందరకాండము శ్రీ సరస్వతుల సుబ్బరామశాస్త్రి గారు పుటలు 85,86.

21.22.23.24. బలిజేపల్లి అనూదితరచనలు- తులనాత్మక సౌందర్యము- డా..మల్లేల గురవయ్య.

**ఉత్తరరాఘవము - తులనాత్మక సమీక్ష**

**1.2.3.4.** ప్రథమాంకము పుట 8.

1.2.3.4.5.6.7.8.9.10.11.12.13.14.15.16.17.18.19.20.21.22.23.24. బలిజేపల్లి - అనూదితరచనలు- తులనాత్మక సౌందర్యము- డా..మల్లేల గురవయ్య.

25.26. బలిజేపల్లి - అనూదితరచనలు- తులనాత్మక సౌందర్యము- డా..మల్లేల గురవయ్య.

**బుద్ధిమతీ విలాసము**

1.2.3.4.5.6.7. బసవపురాణము - పాల్కురికి సోమన.

8.9.10. హరవిలాసము - శ్రీనాథ మహాకవి.

11.12. బలిజేపల్లి లక్ష్మీకాంతకవి - రూపకవాఙ్మయ పరామర్శ. డా..మల్లేల గురవయ్య.

* శివ భక్త చరితము అను గ్రంథమున చిఱుతొండనయనారు కథపేజి 449 నుండి 462 వరకు గలదు.

13.14.15. బలిజేపల్లి లక్ష్మీకాంతకవి - రూపకవాఙ్మయ పరామర్శ. డా..మల్లేల గురవయ్య.

16.17.18.19.20.21.22.23.24.25.26.27. బలిజేపల్లి లక్ష్మీకాంతకవి - రూపకవాఙ్మయ పరామర్శ. డా..మల్లేల గురవయ్య.

1.2.3.4.5.6. వీరేశలింగంపంతులు - సమగ్ర పరిశీలన. పుటలు 116,117, 118,119.

7. ఆంధ్ర నాటక సమీక్ష - శ్రీనివాస చక్రవర్తి - పుట 42.

8.9.10. ఆంధ్ర నాటక కళ - శిష్టా రామకృష్ణశాస్త్రి. పుట 394,395

11.12.13.14. కవనకుతూహలమ్. అబ్బూరివరదరాజేశ్వరరావు- ఆంధ్రప్రభ సచిత్ర వార పత్రిక. 11-3-87.

15. భారతి ౧౯౨౪ నవంబరు. సంపుటము ౫ పుట ౪83-౪88.

16. ఆంధ్రనాటకప్రకాశిక. పసుమర్తి యజ్ఞనారాయణశాస్త్రి. పుట410.

17.18. తెలుగు నాటక వికాసము. డా.. పోణంగి అప్పారావు. పుట311.

19. ఆంధ్ర నాటక ప్రకాశిక. పసుపర్తి యజ్ఞనారాయణశాస్త్రి పుట 409.

20. ప్రసంగ సాహితి - ఆంధ్ర నాటక రచనా పరిణామం. పుట 21.

21. తెలుగుఅకాడమీ ప్రచురణలు- 1986. తెలుగు సాహిత్యచరిత్ర. పుట284.

22. ఆంధ్రనాటక రంగం. శ్రీస్థానం నరసింహారావు- పుట 457.

23. నటస్థానం.( జీవిత చరిత్ర) తృతీయాధ్యాయం. పుటలు 41,83.90.98.

24. నటస్థానం. రెండవ భాగం. పుట 125.24.(అ). త్యాగరాజ కీర్తన.

25. సత్యహరిశ్చంద్రీయ కావ్యసమీక్ష. శ్రీఏలూరి ప్రసాదరావు. జిల్లారిజిస్ట్రార్. ఒంగోలు.

26.27. కవికోకిల గ్రంథావళి - దువ్వూరి రామిరెడ్డి. పుటలు 177,179

## చతుర్థ పరిచ్ఛేదము

1. తెలుగులో జాతీయోద్యమ కవిత్వం డా..మద్దూరి సుబ్బారెడ్డి పుట 196.

2.* స్వరాజ్య సమస్య. ఇది జాతీయ కవిచక్రవర్తి బిరుదాంకితులైన శ్రీదమరాజు పుండరీకాక్షుడుగారి పద్యము. మల్లాది వీరయ్య, పుట 339.

3. స్వరాజ్య సమస్య * బలిజేపల్లి ధార్మిక దృష్టి - డా.. మల్లెల గురవయ్య.

4. ఓ మహాత్మ మళ్లీ పుట్టావా ? సరదాపడి, ప్రారంభ సంచిక ఎడిటర్ పబ్లిషర్ ఎ. సాయికుమార్. అక్టోబరు- 1988.

5. బలిజేపలి ధార్మికదృష్టి- సత్యహరిశ్చంద్రీయ సృష్టి. డా.. మల్లెల గురవయ్య

6. గరిమెళ్ల సత్యనారాయణ గారి మాకొద్దీ తెల్లదొరమనునది ఆంధ్రకేసరి ప్రకాశం. శతజయంతి సంచిక. పుట 273

గమనిక - ఈ వ్యాసము మే, 1972 భారతిలో ప్రచురింపబడినది.

7. ప్రసంగ సాహితి ( రేడియో ప్రసంగాలు) డా.. ఎస్. గంగప్ప. పుట 81.

8.9. ఆంధ్ర కవిత్వము - గాంధీ తత్త్వము. డా.. వి. అంకయ్య.

ఉపోద్ఘాతము - ఉత్తరరాఘవము.

## పంచమ పరిచ్ఛేదము

* బలిజేపల్లి - కావ్యరసానందవల్లి. డా.. మల్లెల గురవయ్య.

1. ఆంధ్ర కవుల ప్రశంసలు- మొదటి ప్రకరణము. స్తుతి పద్యములు- ఆంధ్రరత్న

దుగ్గిరాల గోపాలకృష్ణయ్యను గూర్చి.

* బలిజేపల్లి - కావ్యరసానందపల్లి. డా.. మల్లెల గురవయ్య.

1.2. గద్వాల సంస్థానము - సాహిత్య సేవ. డా..హరిశివకుమార్. వరంగల్.పుట161

## షష్ఠ పరిచ్ఛేదము

* బలిజేపల్లి - కావ్యరసానందవల్లి. డా.. మల్లెల గురవయ్య.

1. సత్యహరిశ్చంద్రీయ కావ్య సమీక్ష. శ్రీ ఏలూరిప్రసాదరావు. జిల్లారిజిష్ట్రార్. ఓంగోలు.

* బలిజేపల్లి ధార్మిక దృష్టి - డా.. మల్లెల గురవయ్య.

1. అవతారికావలోకనము - డా.. మల్లెల గురవయ్య.

* కవితా కళానిధి - బలిజేపల్లి - డా.. మల్లెల గురవయ్య.

## సప్తమ పరిచ్ఛేదము

1. శ్రీశ్రీ అనంతం. శ్రీశ్రీసాహిత్య సర్వస్వం-2 విరసం ప్రచురణ ఆగష్టు 1986
2. విజయచిత్ర. డిశంబరు. 1988. శ్రీసి.ఎస్.రావు విన్నవి కన్నవి సుకుమార్ తో వివరించిన విషయం నుండి.
3. సినిమాలు - సాహిత్య విలువలు. జ్యోతిచిత్ర ఉగాది ప్రత్యేక సంచిక-1986. మోదుకూరి జాన్సన్.
4. వనిత-అక్టోబరు-1988. భానుమతి చిత్ర జీవిత స్వర్ణోత్సవ సంవత్సరం.
5. తెలుగు సీమలో సాంస్కృతిక పునరుజ్జీవనము. దేవులపల్లి రామానుజరావు. శ్రీదేవి పబ్లికేషన్స్.
6. నేను నా సమకాలీన భారతీయ చలనచిత్రకళ- శ్రీశిష్టా ఆంజనేయశాస్త్రి. ప్రథమ ముద్రణ-1975.పుట 210
7. నవ్యాంధ్ర సాహిత్య వీధులు- కొన్ని నాటకములు.పుట 100
8. ఆంధ్ర నాటక పరిషత్తు-రజతోత్సవ సంచిక 1960.పుట90
9. తెలుగునాటక వికాసం. డా.. పోణంగి శ్రీరామఅప్పారావు.పుట 310

10.11. కవన కుతూహలమ్. అబ్బూరి వరద రాజేశ్వరరావు. ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక. 11-3 1987.

| పుటసంఖ్య | పాదసంఖ్య | తప్పు | ఒప్పు |
|---|---|---|---|
| 21 | 33 | హృద్ధన | హృద్ధ్యన |
| 23 | 2,14 | కమగుణ, ఘూమోర్ని | కమగుణ- ధూమోగ్ని |
| 25 | 20,25 | మాత్రంవర్ణ-కపర్ధి | మాత్రంబువర్ణ-కపర్ది |
| 26 | 38 | సంభ్రమజజషానిలింప | సంభ్రమఝషానిలింప |
| 28 | 4,12 | కృకృతార్థ,మేహదయ | కృతార్థ, మేహృదయ |
| 29 | 8,17 | బహుధ, హరింమ్మకై | బహుధా, హరింమటకై |
| 31 | 31 | అనురభిచితా | అమరనురభిచింతా |
| 34 | 33 | ఈదృశ్యం ఈఅత్మ | ఈదృశ్యం అత్మ |
| 35 | 25 | ప్రత్యే | ప్రత్యే |
| 36 | 22 | నూచి | సూచ |
| 37 | 11,16 | ధ్రర్మ్యే,మోషిధీ | ధర్మ్యే, హోషధీ |
| 39 | 36 | మృగఃరీంద్ర | మృగంకరీంద్ర |
| 40 | 4,8,33 | పంచ,త్రైరిద్యజ, లానసలన | పంచ, త్రైర్ద్యజ, లాసకలన |
| 42 | 10,38 | ఈచ్చుట, తక్తే | ఇచ్చుట, తక్కు |
| 44 | 21 | 2 మూలమున | Delete |
| | 22,36 | గామలవచేయదగిన | |
| | | అవి అర్థలనరగా | Delete |
| 49 | 22 | భానకు | భావమునకు |
| 50 | 13 | అవగగా భూమధ్య, | అవగా భ్రూమధ్య, |
| | 19 | అరువదు | అరువది |
| 58 | 5 | గాదెన్ | గాదేన్ |
| 65 | 19 | ంృదయ | హృదయ |
| 67 | 32 | ప్రవచ్చి | ప్రవచ్మి |
| 68 | 28 | వాద్యపద్య | హృద్యపద్య |
| 77 | 4 | వవరణ | వివరణ |
| 78 | 38 | మయ్యోగ | మయ్యేగా |
| 79 | 29 | పేరొడ,నహోణ | పేరోడ, నహజ |
| 84 | 4,12 | కల్పుంచి, పద్మయపు | కల్పించి, పద్యపు |
| | 29 | కేవలమ్మునా | కేవలమువానా |
| 85 | 3 | మోదటి | మొదటి |
| 91 | 10 | సీతము | సీతమ |
| 92 | 24 | గృభో | గృహో |
| 93 | 25,26,27 | తంటిల్లు, ప్రలోభు,నిడ | తల్లడిల్లు, ప్రలోభ, నిజ |
| 94 | 8,19,21 | వభిచ, పృధిమీం పాథోది | వ్యభిచ, పృథివీం,పాథోది |
| 95 | 34 | శార్దూలమో | శార్దూలయో |
| 96 | 12,33 | అశేషః, అమరమ్మ, | అశేషః, జరమ్మ, |
| | | తరములకు | తరములగు |
| 97 | 21,33 | భూజంగలుచ,ధ్యాన | భుజంగమిచ, ధాన్య |
| 99 | 23,29 | రాక్షల,దృమే | రాక్షస, ద్రుమే |
| 101 | 1,24 | ఉత్తరామ, దొరలబండి | ఉత్తరరామ, దొరంబండి |
| 102 | 25 | ఉతస్థితిః | ఉపస్థితిః |
| 103 | 12 | గూఢాచారి | గూఢచారి |
| 104 | 10,30 | అనౌనౌచి,ముక్కాణించె | అనౌచిత్య, వక్కాణించె |
| 105 | 12,28 | శితిఃబింబ,కతేరాణి | ప్రతిబింబ,కరోరాణి |
| | | కసుకోదపి,ముసుమ | కుసుమాదపి, కుసుమ |
| 106 | 3,12 | నాకారవాల,పైరాడాశణబుకు | నాకరములపైరాజాశంబుకు |
| | 20,26 | దివతీయ, ప్రబవ్రూం | ద్వితీయ, ప్రబవ్రూం |
| | 34,40 | పంత, నారమోః | పంచ, నారయోః |

| | | | |
|---|---|---|---|
| 107 | 6,15 | వ్జ్గించి, మనగా, | వర్జించి, ంనగా |
| | 23,35 | ప్రసకి, గాథోద్వే | ప్రసక్తి, గాథోద్వే |
| 108 | 27,29 | కరుణవి, చతుర్థాంత | కరుణవివ, పతుర్థాంక |
| 109 | 36 | కలి, బేధ, సాధ్వ | కవి, భేద, సాధ్వ |
| 110 | 15,16 | మితని, అరంధ, | యితని, అరుంధ |
| | 19,25 | ఇదంనాదు, కువలమదల | ఇదంనామ, కువలయదళ |
| | 27 | శిఖడ, ఇనంతర వర్ణణ | అనంతర, వర్ణన |
| 111 | 21,28 | ద్విజడబాలవర్థ, పైరో | ద్విజబాలవృద్ధ |
| | | సమయవలన తెలిటునట్లు | తెలియునట్లు |
| 112 | 2,19, | ముఖాంబుడ, | ముఖాంబుజ, |
| | | పురుణోపరిచమః | పరిచయః |
| | 23 | గుణాతిశమ | గుణాతిశయ |
| 113 | 1,2, | మునుయే, క్రోత్త | మునుక్రొత్త |
| | 3,4 | రథభీజ దర్విధి, స్పర్శ | రథబీజ, దుర్విది, స్పర్శి |
| | 7,11 | భాదించు దర్మా, | బాధించం ధర్మా |
| | 15,19 | క్రమమును, ప్రసిద్ధ | క్రమము, ప్రసిద్ధి |
| | 29,33 | జామదగ్న్య, చతరితము | జామదగ్న్య, చరితము |
| 114 | 10,22 | ప్రత్యాం, గ్రంబుడీలీ | ప్రత్యం, త్యుగ్రంబులీ |
| | 36,37 | ఈతడొక్కగాలించు | ఈతడొక్కగావించు |
| 116 | 2,5 | అక్షో, సక్ష్మ | అక్ష్ణోః, సూక్ష్మ |
| | 8,12 | అంద, సామావా | అందలి, సామాన్యా |
| 118 | 9 | ప్రరి | ప్రతి |
| 119 | 1,13, | శంభో, యాంకమునందలి | శంబూ, యాంక, |
| | 22,24 | భావించు, రాఘవమున | భావించి, రాఘవము |
| 125 | 32 | నాయభూష్ట | నాయభీష్ట |
| 129 | 18 | జన్మాము | జన్మాను |
| 130 | 7 | మూర్ఖు | మూర్ఖ |
| 135 | 5,9 | శతధ్వనిని, పాతుల | శతధన్వని, పాత్రుల |
| 136 | 1,11 | ప్రవేశించను, అడుగుటచే | ప్రవేశించును, అడుగుటకే |
| 138 | 5,19,37 | ఎడిగె, నిమన్మ, శద | అడిగె, వియన్మ, శత |
| 139 | 19,22 | తెపిపి, యదావిధి | తెలిపి, యధావిధి |
| | 33,37 | ఆఇవ, కొతి | ఆఅవ, కోతి |
| 140 | 12 | దంపతుకలకల | దంపతులకలకలము |
| 141 | 2,7 | కృష్ణుడు, యాల్లాంద్ర | కృష్ణుడు, యిల్లాంద్ర |
| | 29,40 | రిక్మిణి కష్ణుడు | రుక్మిణి, కృష్ణుడు |
| 142 | 29,39 | మహోత్తు, వచింప కృష్ణుడు | మహాత్తు, వంచింప కృష్ణుడు |
| 143 | 12,13 | బతిమా, విలనము | బతిమ, విలననము |
| | 21 | శంబరాసుర | శంబరాసురుడ |
| 143 | 32,34,39 | విచిత్రము, నమాగము | విచిత్రము, సమాగమ, |
| | | కృష్ణత్య | కృష్ణసత్య |
| 144 | 22,24 | తేసదని, ఇవువు | తేసదనని, ఇరువు |
| | 29,31 | శర్ణుల, భజ | శార్దూల, భుజ |
| 145 | 1,12,21 | నంత్యు తిలసించి, మూర్తిల్లి | వత్యు తిలకించి, మూర్ఛిల్లి |
| | 33,38 | యని, ప్రవి | మని, పవి |
| 146 | 38 | మగదీరము | మగబీరము |
| 147 | 14,25 | నీకెన, సాందించె | నీకైన, సాధించె |
| 149 | 11 | శూరుడును | శూరుడు |
| 202 | 6 | కోడ | కోడె |
| 205 | 3,8 | గ్రహించిని, సేయువగు, | గ్రహించిన, నేయనస, |